

తిరుమల
తిరుపతి
దేవస్థానములు

సప్తగిరి మాసపత్రిక
ప్రత్యేక సంచిక

# మాతల్లి గోదావరి

# తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీ వేంకటేశ్వర ప్రాణ దాన ట్రస్టు, తిరుపతి

(రిజిష్టరు నెంబరు · 75 /2001)

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారు దయాసముద్రుడు ఆర్తులపై ఆపదలోవున్నవారిపై ఆయన చూపించే కరుణ అపారం అనన్య సామాన్యం అనారోగ్యంతో అల్లాడుతున్న వారికి ఆయనే ఒక దివ్య ఔషదం

దయా స్వరూపుడైన శ్రీ శ్రీనివాసుని దయతో తిరుమల తిరుపతి దేవస్థానం పేదలకై ఎన్నో ఆసుపత్రులను ధార్మిక సంస్థలను నెలకొల్పింది మానవసేవయే మాదవసేవ అన్న పరమార్థంతో కుల మత వర్ణాతీతంగా ప్రాణాంతక వ్యాదులతో బాదపడుతున్న పేదలైన రోగులకు సహాయం అందించేందుకు ఈ పదకంతో దేవస్థానం ముందుకు వచ్చింది

## ఆశయాలు

శ్రీ వేంకటేశ్వర ప్రాణదానట్రస్టు రోగగ్రస్తులైన పేదలకు సహాయం అందిస్తుంది ఇది లాబాపేక్షలేని దార్మికసంస్థ దీని రిజిష్టరు కార్యాలయం ఆంధ్రరాష్ట్రంలోని **తిరుపతిలో** వుంది

గుండె మెదడు **మూత్రపిండాల** వ్యాధులు క్యాన్సర్లతో బాదపడే పేదవారికి ఉచితంగా వైద్య సహాయం అందించడం ఈ పదకం ప్రదాన ఉద్దేశ్యం అత్యధికంగా వ్యయం అయ్యే **ఈ వ్యాధుల చికిత్స ఖరీదును** పేదవారు భరించలేరు అందుకే కుల మతాతీతంగా వారి ప్రాణాన్ని నిలబెట్టేందుకు **వారి చికిత్సకు అయ్యే** వ్యయాన్ని ఈ పదకం ద్వారా **అందిస్తారు** వారికి **దేవస్థానం** నిర్వహిస్తున్న స్విమ్స్ బర్డ్ రుయా ప్రసూతి **ఆసుపత్రులలో చికిత్స చేస్తారు**

క్యాన్సరు మొదలైన ప్రాణాంతక వ్యాదుల నివారణకు జరిపే పరిశోదనలకు కూడా ఈ పదకం సహాయం చేస్తుంది రక్తనిది కృత్రిమ అవయవాలు పిజియోధెరపి పరికరాలు తదితరాలు పేదలకు ఉచితంగా అందేలా ఈ పదకం సహాయ పడుతుంది

## దేవస్థానం విరాళం

ఈ ట్రస్టు స్వయంప్రతిపత్తి సంపాదించేందుకు గాను ట్రస్టుకు విరాళంగా లబించిన మొత్తానికి సమానమైన మొత్తం దేవస్థానం ఇస్తుంది సేవాబావంతో ప్రజలు విరివిగా ఈ పదకానికి విరాళాలు అందించాలి విరాళం మొత్తం ఎంత అనికాక పేదల ప్రాణం నిలబెట్టా లనే **దృక్పధంతో** అందరూ **ముందుకు** రావాలి

## దాతలకు సౌకర్యాలు

ఈ ట్రస్టుకు 5 లక్షలు లేదా **అంతకన్న** ఎక్కువ విరాళంగా ఇచ్చిన దాతలకు ఈ క్రింది **సౌకర్యాలు** లబిస్తాయి

★ సం॥లో 3 రోజులు దాత అతని **కుటుంబ** సభ్యులకు (5 గురికి మించకుండ) వైకుంఠం సెల్లారు ద్వారా వి ఐ పి దర్శనం

★ మొదటిసారి దర్శనానికి వచ్చినపుడు శ్రీవారి శ్రీపద్మావతి అమ్మవారి బంగారు పూత పూసిన వెండి డాలరు బహూకరణ

★ **సంవత్సరానికి ఒకసారి దాతకు ఉత్తరీయం బహూకరణ**

★ 3 రోజులపాటు **తిరుమలలో** ఉచిత వసతి లేదా వి ఐ పి అతిది గృహాల్లో **చెల్లింపుతో వసతి**

★ ఈ సౌకర్యాలు **దాతకు** జీవిత పర్యంతము - పర్మలు కంపెనీలు ఇద్దరు దాతలు **అయితే** 20 సంవత్సరాలు వుంటాయి

## ఆదాయపు పన్ను రాయితీ

[illegible] విరాళాలకు సెక్షన్ [illegible] 00 [illegible]

## విన్నపం

వదాన్యులు మానవతావాదులు శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు విరివిగా విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం మీరు **చేసే సహాయం ప్రాణాంతక వ్యాదులతో బాధపడే పేదవారికి ప్రాణదానం చేస్తుంది** మీ దానంవల్ల వైద్య సహాయం అంది పేదవారి **జీవితంలోను కుటుంబంలోను** చిరునవ్వుల పూలు పూస్తాయి

మీ విరాళాలను ఎ జాతీయ బ్యాంకు నుంచైనా కార్యనిర్వహణాదికారి తి తి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర ప్రాణ దాన ట్రస్టు తిరుపతి ' పేర తీసుకుని కార్యనిర్వహణాదికారి తి తి దేవస్థానం తి తి దే పరిపాలనా భవనం కె టి రోడ్డు తిరుపతి వారికి ఎంపాలి **ఇతర** వివరాలకు పౌరసంబంధాదికారి ఫోన్‌నెం 0877 – 2232813 లేదా చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ – ఫోన్‌నెం 0877 – 2231549 తి తి దేవస్థానములు తిరుపతి వారిని సంప్రదించండి e mail webmaster @ tirumala org

**విరివిగా విరాళాలు ఇవ్వండి! పేదలకు ప్రాణదానం చేయండి!!**

# మాతల్లి గోదావరి

## శ్రీ సుభాను సంవత్సర పుష్కర ప్రత్యేక సంచిక



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2003

Pushkara Pratyeka Sanchika -2003

Edited by

Price: Rs.50/-

Published by

Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati


D.T..P. & Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati

# ముందుమాట


ప్రతి జీవనదికి 12 ఏండ్లకు ఒక మాటు పుష్కరాలు వస్తాయి. జీవన ప్రదాతలయిన నదులకు కృతజ్ఞతలు చెప్పడం ప్రధానోద్దేశం. స్నానం చేయడం, ఉన్నవారు లేని వారికి దానం చేయటం, అందరూ కలసి మహాత్ముల, స్వాముల ఉపదేశామృతాన్ని వినడం, పరస్పర సహకార గౌరవంతో సామాజిక ఏకతాభావాన్ని పెంచుకోవడం, జ్ఞానసత్రాలకు విద్యావినోద వికాసానికి వచ్చిన జనసాంద్రతావేదికను వాడుకోవడం పుష్కరాల భౌతిక, బౌద్ధిక లాభం అయితే, పెద్దలకు పిండప్రదానం చేసి పితృఋణం తీర్చుకోవడం ఒక ధార్మిక సాంస్కృతిక ప్రయోజనం.


ఈ పైన చెప్పినదాన్ని సాధించుటకు అనేక మార్గాలు. తిరుమల తిరుపతి దేవస్థానం లాంటి ధార్మిక సంస్థ సనాతన ధర్మ సందేశాన్ని ప్రసారం చేయడానికి పుష్కర యాత్రికుల ఆధ్యాత్మిక దాహాన్ని తీర్చడంకోసం పలుకార్యక్రమాలను చేపట్టింది. దాంట్లో భాగంగా వేంకటేశ్వరస్వామివారి గుడి తాత్కాలికంగా గోదావరి గట్టున వెలయడం ఒకటైతే, ధర్మప్రచార పరిషత్తు కార్యక్రమాలు మహాత్ముల సందేశానికై వేదికలు ఏర్పరచడం ఇంకొకవైపు జరిగే కార్యక్రమాలు. అక్షరాన్ని పంచిపెట్టే ధార్మిక సాహిత్య వితరణ యజ్ఞం దేవస్థానంవారి ప్రముఖ కైంకర్యం. ఇదంతా ఒక ఎత్తైతే ఇంకొక వైపున గోదావరి పుష్కరాలకి సంబంధించిన చరిత్ర, ఆలయాల వివరాలు, గోదావరి తీరాన వెలసిన విద్యా వినయ విజ్ఞానతను తెలిపే ప్రయత్నంలో భాగంగా పలు పుస్తకాలను ప్రచురిస్తోంది. అందులో ఒకటి 'మా తల్లి గోదావరి' సప్తగిరి తరపున పుష్కర ప్రత్యేక సంచికగా వెలువడుతోంది.

అల్పకాలంలో విడుదల అయిన ఈ ప్రత్యేక సంచిక గోదావరి నదీమ తల్లిని గురించి సంపూర్ణ చిత్రాన్ని ఇస్తుంది అని అపోహ కాదు. ఆ మార్గంలో అడుగుపెడుతోందని ఉత్సాహం. ఇక్కడ ఉన్నవాటిని ఈ విధంగా రంగరించినవారు తిరుమల తిరుపతి దేవస్థానం సప్తగిరి సంపాదకులు మరియు వారి సహచరులు. పుష్కర యాత్రికులకు తిరుమల స్వామిని గురించి వివరాలను తెలిపే తి.తి.దేవస్థాన ఆలయాల చరిత్ర కూడా సంగ్రహంగా చేర్చడం జరిగింది. మొత్తం సంగ్రహయోగ్యంగా సమకూర్చినందులకు సంపాదకులవారికి నా అభినందనలు. ఈ పుస్తకాన్ని పాఠకులు సమాదరిస్తారని ఆశిస్తున్నాను.



కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.







राष्ट्रपति
भारत गणतंत्र
PRESIDENT
REPUBLIC OF INDIA

MESSAGE

I am happy to learn that the T.T. Devasthanams is organising the Pushkarams Festival on the banks of Godavari.

The river Godavari which is called the cradle of Andhra culture has been one of the factors that has contributed to the social, cultural and economic progress of the state. The delta formed by this river is also known for its literary and artistic contribution.

I extend my warm greetings and felicitations to all those associated with the festival and send my best wishes for the success of the event.



(A.P.J. Abdul Kalam)

New Delhi
May 17, 2003.

Surjit Singh Barnala

RAJ BHAVAN
HYDERABAD-500 041

May 20, 2003



# MESSAGE

Godavari Pushkaram is a very ancient festival conducted to invoke the blessings of the River Godavari on the humanity for their prosperity.

Pushkaram is not a mere astronomical occurrence. It sentimentalizes hopes and aspirations for the best in human life.

Millions of piligrims make a beeline to the River Godavari for the holy dip from all corners of India and abroad cementing further the bonds of unity and emotional integration.

I am glad that **TIRUMALA TIRUPATI DEVASTHANAMS** a TORCH BEARER of SANATANA DHARMA decided rightly to participate in a big way in this MEGA GEO-CELESTIAL EVENT.

It is commendable that a souvenir is being brought out to commemorate this occasion which I hope will be of high reference value.

I wish the endeavours all success.


Surjit Singh Barnala

**( Surjit Singh Barnala )**



NARA CHANDRA BABU NAIDU

HYDERABAD



CHIEF MINISTER
ANDHRA PRADESH

## సందేశం

మన విశిష్ట సంస్కృతిలో ఒక పవిత్ర ఘట్టమైన గోదావరీ పుష్కరాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ''మాతల్లి గోదావరి'' పేరుతో ఒక ప్రత్యేక సంచికను వెలువరించడం హర్షణీయం.

నదీ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు తరతరాల సంస్కృతిని, అక్కడి చారిత్రిక వైభవాన్ని, జనజీవనంలో విలీనమైన తెలుగుదనపు సాంప్రదాయాన్ని పుష్కరాలు స్మరణకు తెస్తాయి.

పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పరమ పవిత్రమైన గోదావరీ పుష్కరాలకు దేశం నలుమూలల నుండి భారీ సంఖ్యలో వస్తున్న జనసందోహానికి కనుల విందుగా గౌతమి తీరంలో శ్రీ వేంకటేశ్వరుని దర్శన భాగ్యం లభింపచేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సంకల్పించడం ముదావహం.

ఈ సందర్భంగా దేవస్థానంవారు నిర్వహించే ధార్మిక కార్యక్రమాలతోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించే గ్రంథావళి అందరి మెప్పు పొందాలని, **''మాతల్లి గోదావరి''** ప్రత్యేక సంచిక పాఠకులను అలరించగలదని ఆశిస్తున్నాను.



నారా చంద్రబాబు నాయుడు

**DANDU SIVARAMA RAJU**

Phones: 3452498 (O)
3452679
3319637 (R)
3372173

Hyderabad.

Date:..........................

MINISTER FOR ENDOWMENTS
ANDHRA PRADESH



# MESSAGE

I am indeed very happy to know that River Godavari Pushkarams will be held from 30th July to 10th August,2003. The Pushkaram is very glorious festival,which is celebrated once in 12 years to invoke the blessing of the river Godavari on the people.

I take this opportunity to congratulate the T.T. Devasthanams for making elaborate arrangements, of organising exhibitions, arranging various religious, cultural programmes to make the Pushkarams on a grand scale.

I wish this occasion to be utilised for highlighting the holistic angles of our State, its social philosophy, rich religious, cultural traditions and spiritual values.

Iam very glad to learn that the Tirumala Tirupati Devasthanams is bringing out a commemorative Souvenir to mark this auspicious event. I hope the Souvenir will focus the importance of Pushkarams. I wish the festival of P ushkarams all success.

**Dandu Sivarama Raju**


*P. Chalapathi Rao,* M.L.A.

CHAIRMAN
T.T.D. BOARD OF TRUSTEES

DIMILLI VILLAGE
RAMBILLI MANDAL
VISAKHAPATNAM DIST.

MS - BLOCK -II
202, OLD M.L.A. QUARTERS
HYDERABAD

☎ 08931 - 31975, 31315 ( YALAMANCHIU)
040 - 6621114



## శుభాభిలాష


ఈ స్వభాను నామ సంవత్సరం జూలై 30వ తేది నుండి ఆగస్టు 10వ తేది వరకు రాజమండ్రి వద్ద గోదావరి పుష్కరోత్సవం జరుగబోతున్నదని తెలిసి చాల సంతోషిస్తున్నాను. పన్నెండు సంవత్సరాలకొకసారి పునరావృతమయ్యే ఈ పుష్కర మహోత్సవాలు, మన దేశంలోని పవిత్రనదుల ప్రాముఖ్యతను, ఆ నదుల జలభిక్షతో సుభిక్షంగా జీవిస్తున్న ప్రజల కృతజ్ఞతను ప్రకటించుకోవడానికి మహదవకాశాన్ని కల్గిస్తున్నాయి.

మన సౌరకుటుంబంలోని, గ్రహకూటమికి చెందిన శుభకిరణాలు ఏకాలంలో ఏనది మీద ప్రసరిస్తాయో గుర్తించిన మన జ్యోతిష్కులు ఆయా నదుల పుష్కరోత్సవాల్ని నిర్దేశించారు.

ఈ పుష్కరోత్సవాలను పురస్కరించుకుని మన రాష్ట్రప్రజలకు ఆరాధనీయులైన దేవతలను, మన ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను, వివిధ కళాత్మక కార్యక్రమాల ద్వారా స్మరించుకోవడం ఆనవాయితీ! ఇలాంటి మహోత్సవాలు ప్రజల సాంఘిక జీవన తత్త్వాన్ని, దేశ సమైక్యతను పరిరక్షించుకోవడానికే కాకుండా ''భిన్నత్వంలోని ఏకత్వాన్ని'' చాటి చెప్పి, దేశ సమగ్రతను పదికాలాలు పదిలంగా ఉంచుకోవడానికి ఎంతో దోహదపడుతాయి. సర్వప్రాణులకు జీవనాధారమైన జలాల కాలుష్యాన్ని నివారించుకోవడానికి, జల సమృద్ధిని సాధించుకోవడానికి ఇలాంటి పుష్కరాలు మార్గదర్శకాలవుతాయి.

ఈ శుభ తరుణాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానముల వారు పుస్తక ప్రదర్శనతోపాటు వివిధ మత, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూండడం ప్రశంసనీయం. అంతేకాకుండా గోదావరీ నదీమతల్లితో పాటూ పెనవేసుకుపోయిన మన చరిత్ర, సంస్కృతిని, పుష్కరాల ప్రాధాన్యతను ప్రతిబింబించేటటువంటి ఒక ప్రత్యేక సంచికను ప్రచురిస్తూండడం అభినందనీయం!

ఈ గోదావరి పుష్కర మహోత్సవాలు విజయవంతంగా నిర్వహింపబడాలని మనసారా కోరుతున్నాను.



పప్పల చలపతిరావు M.L.A.

**పప్పల చలపతిరావు**

# తిరుమల తిరుపతి దేవస్థానములు


తి.తి.దేవస్థానముల

## ధర్మకర్తల మండలి

అధ్యక్షులు

శ్రీ పప్పుల చలపతిరావు, ఎం.ఎల్.ఎ.,

సభ్యులు

డా॥ శ్రీమతి గోగినేని ఉమ, ఎం.ఎల్.ఎ.,

శ్రీ కె. జయరాం, ఎం.ఎల్.ఎ.,

శ్రీ జి. గంగారెడ్డి, ఎం.పి.,

శ్రీమతి గుండు సుధారాణి

శ్రీ గౌనివారి శ్రీనివాసులు

శ్రీ డి.కె. ఆదికేశవులు

శ్రీ వి.ఆర్. పంచముఖి

శ్రీ డి. రామానాయుడు, ఎం.పి.,

శ్రీ మనోజ్‌కుమార్ సంతాలియా

శ్రీ డి.ఎస్. మూర్తి, ఐ.ఎ.ఎస్.,
దేవాదాయశాఖ కమీషనర్,(ఆం.ప్ర.)

శ్రీ అజేయ కల్లం, ఐ.ఎ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి


## మాతల్లి గోదావరి
## శ్రీ సుభాను సంవత్సర పుష్కర ప్రత్యేక సంచిక


సంపాదకీయ సలహామండలి

**అధ్యక్షులు** : అజేయ కల్లం, ఐ.ఎ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి. దేవస్థానములు

**ఉపాధ్యక్షులు** : ఆర్. అప్పారావు, ఐ.ఎ.ఎస్.,
సంయుక్త కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

**సభ్యులు** : డా॥ పి. రంగారావు
పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానములు

: ఐ. సార్వతీశ్వరరావు
ప్రెస్ మేనేజర్, తి.తి.దేవస్థానములు

**సంచాలక, సంపాదకులు** : డా॥ ఎన్.ఎస్. రామమూర్తి

**సహాయ సంపాదకులు** : డా॥ కోరాడ రామకృష్ణ
ఐ.ఎస్. శ్రీనివాసన్

**సహాయకులు** : డా॥ కోటపాటి రాధారమణ
డా॥ అల్లాడి సంధ్య

**సంచిక డిజైన్** : పి. శివప్రసాద్
పి. శివశంకర్

**ఫోటోలు** : డి. మార్కండయ్య

**డి.టి.పి.** : డి.టి.పి. సెక్షన్, టి.టి.డి. ప్రెస్, తిరుపతి.


**ముద్రణ** : తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్,
తిరుపతి - 517 507.

# కృతజ్ఞతాభివందన

పుష్కర పవిత్రతను పదిమందికి అందజేయాలనీ, గోదావరీమాతకు కృతజ్ఞతలు తెలపాలనీ తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధంచేసిన పుస్తకం 'మాతల్లి గోదావరి'. గౌతముడు క్షామాన్ని వారించినట్లు ఈ ప్రత్యేక సంపుటికూడా ధార్మికదాహాన్ని తీర్చేందుకు దిద్దబడింది. దీన్నుంచి కొంతైనా తృప్తి పాఠకుడు పొందినాడంటే మా ప్రయత్నంలో సార్థక్యభావన కలుగుతుంది.

ఈ మహత్ప్రయత్నంలో తోడ్పడ్డవారు పలువురు. ఆంధ్రప్రదేశ్‌లోని గొప్ప విద్వాంసులు కోరినవెంటనే బదులు చెప్పకుండా పలురీతుల గోదావరిని వర్ణిస్తు వ్యాసాలను సమయానికి తగ్గట్టు అందించారు. ఈ సంచికలోని వివిధ ఆలయాల ధర్మకర్తలు, పలు కార్యనిర్వహణాధికారులు, పలు అర్చకులు తమతమ ఆలయాల గురించి అతిశయ ఆసక్తితో వివరాలను అందిస్తూ ఆలయాల ఫోటోలను తీసుకోవడానికి అనుమతించారు. వీళ్ళందరికి ప్రప్రథమంగా కైమోడ్పులు. విషయ సంగ్రహణాయత్నంలో గోదావరి చుట్టూ తిరిగిన మా బృందానికి అనుక్షణం ఆదర్శవంతంగా మార్గదర్శనం చేసినవారు రాజమండ్రి 'సమాచారం' పత్రిక సంపాదకులు శ్రీయుత నాగసుబ్రహ్మణ్యం గారు, వారి సహచరులు. పుష్కరాల జ్ఞాపకాలను నెమరువేసుకుంటు పుస్తకానికి శోభ తెచ్చేందుకు పుష్కరాల ప్రేమతో పైబడిన వయస్సును కూడా లెక్కచేయకుండా శ్రమించిన రాజమండ్రి పెద్దలకు కృతజ్ఞతలు చెప్పటం మా కర్తవ్యం.

'మాతల్లి గోదావరి' ప్రత్యేక సంపుటంగా రావాలని కాంక్షిస్తూ దానిలో ఇమడవలసిన విషయాన్ని గురించి మార్గదర్శనం చేస్తూ వీపుతట్టి ప్రోత్సహించిన తి.తి.దే. కార్యనిర్వహణాధికారి గారికి నమస్సుమాంజలులు. సర్వదా నేను ఉన్నానని మాకు చేయూతనిచ్చిన దేవస్థానం తరపున పుష్కర కార్యక్రమాల ప్రత్యేకాధికారి తి.తి.దే. తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి మరియు ఈ సంపుటానికి వచ్చిన విశేష వ్యాసాలను చూసి సంతోషించిన పౌరసంబంధాధికారి గారికి కృతజ్ఞతాంజలి. మీ చేతిలో ఉండే ఈ సంపుటిని ఇలా తీర్చిదిద్ది, ముద్రించినవారు తిరుమల తిరుపతి దేవస్థాన ముద్రణాధికారి ఐ. పార్వతీశ్వరరావు గారు మరియు వారి సిబ్బంది. వారికి శుభాభినందనలు.



ప్రత్యేక సంచికలోని ఫోటోలను తీసినవారు దేవస్థాన ఫోటోగ్రాఫర్ మార్కండయ్య, కొన్ని ఫోటోలను రాజమండ్రి బాబు ఫోటోస్టూడియో వారు సమకూర్చినారు. వారికి కృతజ్ఞతలు. ఈ ప్రత్యేక సంపుటాన్ని తీర్చిదిద్దడంలో సంపూర్ణంగా సహకరించిన నా సహోద్యోగులు బి.ఎన్. శ్రీనివాసన్, కోరాడ రామకృష్ణ, ప్రూఫ్ రీడింగులో సహకరించిన డా॥ రాధారమణ డా॥ అల్లాడి సంధ్య గార్లు అభినందనీయులు.

సంపాదకుడు

# విషయసూచిక


| | | | | |
|---|---|---|---|---|
| 1 | పుష్కర కర్తవ్యం | - | ఝంకు అప్పారావు | 1 |
| 2 | మాతల్లి గోదావరి | - | డా॥ ఎన్.ఎస్. రామమూర్తి | 2 |
| 3 | నా పేరు గోదావరి | - | కరుణశ్రీ | 3 |
| 4. | పుష్కర గోదావరి | - | వక్కంతం సూర్యనారాయణరావు | 6 |
| 5 | గోదావరి పుష్కర ప్రాశస్త్యము | - | టి. రవి | 8 |
| 6. | అదిగో భద్రాద్రి ఇదిగో గౌతమి | - | కామిశెట్టి శ్రీనివాసులు | 10 |
| 7. | ఇంటింటా సందడే | - | గంధం నాగసుబ్రహ్మణ్యం | 12 |
| 8. | ఋగ్వేదంలో నదులు | - | కె వి.ఎస్.ఎస్ శాస్త్రి | 14 |
| 9. | సంస్కృత కావ్యాలలో గోదావరి | - | డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు | 18 |
| 10. | జలప్రశస్తి | - | బి.ఎన్. శ్రీనివాసన్ | 19 |
| 11. | రామాయణము - గోదావరి | - | డా॥ కోలవెన్ను మలయవాసిని | 20 |
| 12. | వ్యాసభారతం - గోదావరి | - | డా॥ శలాక రఘునాథశర్మ | 27 |
| 13. | ఆంధ్రమహాభారతంలో గోదావరి | - | ముదివర్తి కొండమాచార్యులు | 29 |
| 14. | ప్రాచీన ఆంధ్ర సాహిత్యంలో గోదావరి | - | డా॥ కె సర్వోత్తమరావు | 31 |
| 15. | శ్రీ భీమేశ్వర పురాణము - గోదావరీ మాహాత్మ్యం | - | డా॥ పర్వతనేని సుబ్బారావు | 33 |
| 16. | తెలుగు జానపద సాహిత్యంలో గోదావరి | - | డా॥ జి.ఎస్ మోహన్ | 38 |
| 17. | శాసనాలలో గోదావరి | - | డా॥ ఎస్ ఎస్ రామచంద్రమూర్తి | 40 |
| 18. | కంబరామాయణంలో గోదావరి | - | డా॥ ఎస్ జయప్రకాష్ | 42 |
| 19. | వెండితెర వెలుగుల్లో గోదావరి మిలమిలలు | - | పైడిపాల | 43 |
| 20. | రామదాసు - అన్నమయ్య | - | డా॥ జె. మునిరత్నం | 47 |
| 21. | గోదావరి ప్రాంతపు కవులు | - | డా॥ గల్లా చలపతి | 52 |
| 22. | పుష్కర పుష్పము | - | ముదివర్తి కొండమాచార్యులు | 59 |
| 23. | ఉభయ గోదావరి జిల్లాల్లో పరిమళించిన కర్ణాటక సంగీతం | - | కె. శేషులత | 60 |
| 24. | సర్వస్వం | - | సన్నిధానం నరసింహశర్మ | 65 |
| 25. | రాజమహేంద్రవరం - రాజవంశాలు | - | డా॥ తేళ్ల సత్యవతి | 66 |
| 26. | ఉభయగోదావరి జిల్లాలలోని వన్య సంపద | - | పమ్మి సత్యనారాయణశాస్త్రి, డా॥ నైనాల వేణుగోపాల్ | 68 |
| 27. | చైతన్యగోదావరి - కందుకూరి | - | డా॥ మన్నవ భాస్కర నాయుడు | 71 |
| 28. | కాటన్ మ్యూజియం | - | దినవహిబాపిరాజు | 75 |
| 29. | గౌతమీ గ్రంథాలయం | - | సన్నిధానం నరసింహశర్మ | 77 |
| 30. | పుష్కర జ్ఞాపకాలు | - | డా॥ కోరాడ రామకృష్ణ | 80 |
| 31. | గత పుష్కరాలలో తి.తి.దే. ధార్మిక సేవ | - | డా॥ రావుల సూర్యనారాయణ మూర్తి | 84 |
| 32. | పరమార్థవాణి | - | పురాణపండ రాధాకృష్ణమూర్తి | 86 |
| 33 | శ్రీరామ గౌతమి | - | డా॥ బేతవోలు రామబ్రహ్మం | 87 |
| 34. | గోదావరి మాత | - | ఆచార్య ఎం. కులశేఖరరావు | 88 |
| 35. | జీవనసిరి - గోదావరి | - | డా॥ కలువగుంట రామమూర్తి | 89 |
| 36. | ధార్మిక కేంద్రాలుగా ఆలయాలు | - | డా॥ హెచ్.ఎస్ బ్రహ్మానంద | 90 |
| 37. | నాసిక్ - త్ర్యంబకం | - | బి ఎన్. శ్రీనివాసన్ | 92 |
| 38. | గోదావరి తీరపు పుణ్యక్షేత్రాలు - ఉత్తర తెలంగాణ | - | శలపాక సత్యనారాయణమూర్తి | 93 |
| 39. | భద్రాచలం | - | డా॥ జి.ఎస్ మోహన్ | 98 |
| 40. | రాజమండ్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం | - | యాతగిరి శ్రీరామ నరసింహరావు | 100 |
| 41. | రాజమహేంద్రవరం పరిసర ఆలయాలు | - | డా॥ అల్లాడి సంధ్య | 102 |
| 42. | పలివెల - కొప్పులింగస్వామి | - | డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు | 107 |
| 43. | పంచ కేశవాలయాలు | - | భమిడి కమలాదేవి | 109 |
| 44. | పంచారామములు | - | డా॥ కోటపాటి రాధారమణ | 114 |
| 45. | తిరుమల తిరుపతి దేవస్థాన ఆలయాలు | - | డా॥ కోరాడ రామకృష్ణ | 122 |

# పుష్కర కర్తవ్యం

రుంకు అప్పారావు, ఐ.పి.ఎస్.,
జె.ఇ.ఓ., టి.టి.డి.

పుష్కరాలు పన్నెండేండ్లకు ఒక్కసారి వస్తాయి. ఆంధ్ర దేశంలో పుష్కరాలకు పురాణ ప్రసిద్ధి మాత్రమేకాక ఇతిహాస కాలంలో కూడ పెద్ద జనసందోహం ఒకచోటచేరి అంటే సామూహిక స్నానదానాలకు ప్రకృతి పిలిచే ఒక సందర్భం. భారతదేశపు విభిన్నత్వంలో ఐక్యతను స్పష్టంగా చూడవచ్చు నన్నదే కాకుండా వికాసమార్గానికి దోహదం చేసే ఒకపర్వకాలం. మన సంస్కృతిలోని మాతా పితృ ఋషిఋణములను తీర్చుటకు, మనము నదీ స్నానంతో చేతనంగా శుద్ధమైనట్టే, శ్రాద్ధ కర్మక్రియలను శ్రద్ధతో చేసి మానసిక పరిశుద్ధిని, తృప్తిని సాధించుటకు పుష్కరాలు పుష్కలమైన అవకాశాన్ని ఇస్తాయి. స్త్రీ, పురుష, బాల వృద్ధ కుల మత భేదాలు లేకుండా అందరూ స్నానమాచరించి తరించే ఒక గొప్ప అవకాశం. ఆంధ్రదేశంలో సర్వతోముఖాభివృద్ధికి మూల కారణములైన ఇద్దరు అమృతోపమ నదీమతల్లులు మనకు ఉన్నారు. పుష్కరాల సందర్భంలో వివిధ ప్రాంతాలనుంచి నదీ ప్రాంతాలకు పొంగి పొరలి వచ్చే జనం తమ తమ యాత్రకు కారణమైన స్నానదాన పిండ ప్రదాన క్రియలలో ఆసక్తులు అవడమనేది సర్వసాధారణ మైతేను వారు అప్రయత్నంగానే చేసేటటువంటి కొన్ని కర్తవ్యాలు కూడా ఉన్నాయి. వాటిని చిత్తశుద్ధితో అనుసరించినపుడే ఆసక్తితో చేసిన అన్నిటికీ విలువలు వచ్చి యాత్ర సఫలమౌతుంది. ఫలితం రమణీయంగా ఉంటుంది.

గోదావరినది నాసిక్ నుంచి అంతర్వేది వరకు సాగితే ఆంధ్రదేశంలో బాసర నుంచి ఆరంభమని చెప్పాలి. ఈ ఆరువందల మైళ్లు నదీతీరంలో పుష్కరాల స్నానం ఎక్కడ చేసినా ఒకటే అనేమాట ఉన్నా పుష్కరం జనసాంద్రత రాజమండ్రి ఇత్యాది ప్రాథమిక సౌలభ్యాలు మొదలే ఎక్కువగా ఉన్న ఒకటి రెండు చోట్లలో అధికముగా ఉంటుంది. వారు శాంతియుతంగా సంయమనంతో వచ్చినపని త్వరగా ముగించుకొని పోవటంలోనే పరమార్థ ముంది. ప్రత్యేకించి ప్రతి ఒక్కరూ తమ తమ పని మాత్రమే కాకుండా ఇతరులకు అవకాశం ఇవ్వడంతోనే సులభం అవుతుంది.

ఇక్కడ గమనించ తగ్గది ఏమిటంటే శాంతితోబాటు శుభ్రత అతిమూల్యమైనది. టీకాలు వేయించుకొని నది ఒడ్డుకు రావడం అనేది ఒక సామూహిక సామాజిక కర్తవ్యం కావాలి. దానికి తోడు వచ్చినవాడు అత్యంత తక్కువ పారవేయడం అనునది ఆచరించాలి; పాటించాలి.


పుష్కరాల ఉద్దేశ్యమే నదీమతల్లులను శుభ్రంచేసే పరమ మూల కర్తవ్యానికి చెందింది. ఒడ్డులో శ్రాద్ధానికై భూశుద్ధి చేసినట్టే, నీళ్లలో తాంబూలాది హరిద్రా గంధాదులతో కలిపి కాలుష్యాన్ని తొలగించడం. దానికి ప్రతిఫలంగా చివర్లో స్నానం చేసి నమస్కారం చేసి, గోదావరి తల్లికి శుభ్రతావస్తువులు వాయనం ఇచ్చి మన భక్తి శ్రద్ధలను తెలపడమే కాకుండా అనాలోచితంగా పరిసర నైర్మల్యాన్ని సమతుల్యంగా కాపాడుకుంటున్నాం అన్నమాట.

గోదావరి ఒడ్డున జనం అత్యధికంగా చేరే పుష్కరకాలంలో వీరందరికి తగు ప్రాథమిక సౌలభ్యములను కల్పించుటకై రాష్ట్ర ప్రభుత్వం, ఎన్.జి.ఓ. లు స్వయం సేవకులు రాత్రింబగళ్లు కష్టపడుతున్నారు.

**మొత్తంమీద పుష్కరాల కర్తవ్యం అంటే మానవతను గౌరవించి, ఐక్యతను వర్ధింపజేసి, పరిసరాలను సమతూల్యంగా రక్షించడం.**

ఇక్కడ ఇంకొక ముఖ్యమైన అంశం-పుష్కరాలు పెద్దలను దేవతలనే ఆకర్షిస్తాయి. పెద్దలు, మహాత్ములు, ఋషి, ముని సంతులు పుష్కరాలకు భౌతికంగా వచ్చి మనలను అను గ్రహించడం, ఆశీర్వదించడం పరిపాటి. అయితే పుష్కరాలకు వచ్చి స్నానమాడి వెనక్కు వెళుతూ పుష్కర జీవాన్ని అంటే నీళ్లను ఇక్కడే వదిలివెళితేను, మహాత్ముల ఉపదేశ తీర్థాన్ని మాటల నీళ్లను మూటకట్టుకొని గంగలా ఇంటికి తెచ్చినట్లు ఉపదేశా మృతాన్ని, జీవన ఉద్ధారక మంత్రాన్ని తమతో తెచ్చుకోవడం అన్నమాట. ఇది కాలానికి పనికి వస్తుంది. జీవనమార్గంలో మంచిని పెంచుతుంది. అందువలన మహాత్ముల పట్ల, సందేశాల పట్ల, సందేశాన్ని ఇచ్చు గ్రంథాల పట్ల అభిమానం, ఆసక్తిని పెంచుకొని ప్రీతితో, గౌరవంతో, ఇవన్నీ పొంది ఇంటికి సురక్షితంగా వెళ్ళాలి. అది మన కర్తవ్యం. భక్తులందరూ శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహపాత్రులు కావాలని కాంక్షిద్దాం.

* * *



# మాతల్లి గోదావరి

డా॥ ఎన్.ఎస్. రామమూర్తి
సంపాదకుడు

సనాతన హిందూ సంస్కృతిలో ప్రాతః స్మరణీయుల పట్టిక కొంచెం నిడుపైనదే. ఆ జాబితాలో ఏ మాత్రం విస్మరించడానికి వీలుగాని పేరొకటుంది. ఆ పేరే గోదావరి; మాతల్లి గోదావరి. యుగయుగాలుగా సకల జగాలలో ఈనదీమతల్లి కీర్తించబడింది.

ఉత్తరాన హిమాలయ పర్వత శ్రేణుల్లో ఉద్భవించి నిరంతర గమనంతో సువిశాల భూతలాన్ని సస్యశ్యామలం చేస్తున్న గంగా యమునలకు వలె సహ్యాగిరిలో పుట్టిన గోదావరికి తుహిన పుష్టిలేదు. లేకున్నా దక్షిణాది నదులలో ఇది గణనీయమైంది. తాను పయనించే తొమ్మిది వందల మైళ్ల భూప్రదేశాన్ని మరకతమయం గావిస్తున్న ఈ మహానది మూలంగా ఆంధ్రదేశానికి భారతదేశ ధాన్యాగారమనే ప్రఖ్యాతి లభించింది.

నిజంగా గోదావరిని కొనియాడటానికి వేయి నోళ్లు చాలవు. ఈ గోదావరీ నదీతీరంలోనే ప్రథమాంధ్ర కవితావిర్భూతి జరిగింది. ఇక్కడే ఇక్కడే ఎందరో ఎందరో సంఘ సంస్కర్తలు, దేశసేవా పరాయణులు, స్వాతంత్ర్య సమరయోధులు జన్మించారు. దిగ్దేశాలలో కీర్తి ఢక్క బజాయించారు.

తేట తేట తియ్య తియ్యని నీరు వ్యర్థంగా లవణసముద్రం పాలుగాకుండా అడ్డుకట్టవేసి ఆంధ్రప్రజానీకానికి అన్నపానాలు పుష్కలంగా సమకూర్చిన సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని గరీయః ప్రతిభకూ, పరోపకార పారీణతకూ పవిత్ర గోదావరి దర్పణం పడుతుంది.

ఇట్టి పావన గౌతమికి పన్నెండేళ్ల కొకసారి పుష్కరం వస్తుంది. తెలుగు తల్లికి కంఠహారంగా విలసిల్లే గోదావరికి ఈ స్వభాను సంవత్సరంలో పుష్కర ప్రవేశం కల్గింది. ఆ యా పుణ్యకాలంలో ఇందులో స్నానమాడి దానతర్పణాదులతో ఋషిఋణం, పితృఋణం తీర్చుకోవడానికి దేశం నాల్గు చెరగులనుంచి తండోపతండాలుగా తరలి వచ్చే ప్రజానీకాన్ని అలరించడానికి ఎన్నో ధార్మిక కార్యక్రమాలు తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టింది. వాటిలో గోదావరీ ప్రశస్తిని చాటే ఈ సంచికా ప్రచురణ ఒకటి. ఈ పుస్తకం పాఠకుల ఆదరణకు పాత్రం కాగలదని మా ఆశ.

# నా పేరు గోదావరి

కరుణశ్రీ

నా పేరు 'గోదావరి'. మా ఊరు 'సహ్యగిరి'.


నా జన్మస్థానం సహ్య పర్వతపంక్తులలో త్ర్యంబకేశ్వరం. నేను అడి పాడి గంతులు వేసిన ప్రాంతం నాసిక్ నగరం. దీనినే పూర్వం ''పంచవటి'' అనేవారు. నేను నాతోడి చెలిమి కత్తెలతో కలసి పెరిగి పెద్దదానినై క్రమక్రమంగా మిట్టపల్లాలు దాటి, గుట్టలూ మెట్టలూ గడచి, అడవులు అతిక్రమించి, కొండలగుండా లోయలలో పడి, సుడులు తిరిగి, అవరోధాలన్నీ అధిగమించి పుట్టిన చోటునుంచి దాదాపు తొమ్మిదివందల మైళ్లు సుదీర్ఘ ప్రయాణం సాగించి పురోగమించి కడలిరాయని గడపలో అడుగుపెట్టాను. ఆయన నన్ను ఆప్యాయంగా ఆహ్వానించి ఆలింగనం చేసుకున్నారు.

నా పేరు 'గోదావరి'. మా ఊరు 'సహ్యగిరి'.

నేను పుట్టినిల్లు మహారాష్ట్రమైనా మెట్టినిల్లు ఆంధ్రరాష్ట్రం.

పూర్వం ఒకానొక సమయంలో పెద్ద కరువు వచ్చింది. తింటానికి తిండి దొరకక ప్రజలంతా బాధపడుతున్నారు. నేలంతా బీటలు వారి పోయింది. ఆ ప్రాంతంలో ఉన్న గౌతమి మహర్షి ఆశ్రమం మాత్రం పచ్చని పంటపైరులతో కంటికింపుగా కళకళలాడుతూ ఉంది. చుట్టుపక్కలఉన్న మునులంతా గౌతములవారి ఆశ్రమానికి వచ్చారు. మహర్షి, తపోవనంలో పండిన పంటతో వచ్చిన వారందరికీ ఆతిథ్యమిచ్చి అన్నం పెట్టి ఆదరించాడు.

గౌతమమహర్షి మహాతపస్సంపన్నుడు. ఉదార హృదయుడు. పరోపకార పరాయణుడు. జాలిగుండెల వాడు. ఆయన చేతితో గింజలు చల్లిన వెంటనే పంటలు పండే వరం ఆయనకు బ్రహ్మదేవుడి అనుగ్రహం వల్ల ప్రాప్తించింది. కరవు కాటకాల కాలంలో అందరికీ ఆహారం అందిస్తున్న ఆయన కీర్తి నలుమూలలా వ్యాపించింది. ప్రజలంతా ఆ మునీశ్వరుని



నాకొక గారాబు చెల్లెలు ఉంది. దాని పేరు కృష్ణవేణి. చిన్నప్పుడు అంతా 'కృష్ణ' అనీ 'వేణ్ణా' అనీ ముద్దుముద్దుగా పిలిచేవారు. పెరిగి పెద్దదై ఇప్పుడు 'కృష్ణవేణి' అయింది. మా కృష్ణ కథ చాలా ఉంది. అది మరెప్పుడైనా చెప్పుకుందాము. ఇప్పుడు నాకథ చెబుతాను వినండి. నా పుట్టు పూర్వోత్తరాలు పురాణాలలో చెప్పబడి ఉన్నాయి. అవే చెబుతున్నాను.

ఔదార్యాన్ని వేనోళ్ల కీర్తింపసాగారు. అది అక్కడి మునులకు అసూయ కలిగించింది.

గౌతమమహర్షి పేరు ప్రతిష్ఠలను తోడిమునులు సహించలేక పోయారు. ''అన్నం పెట్టిన ఇంటికి కన్నంవేసే దుర్బుద్ధి'' వాళ్లకు పుట్టింది.

మునులంతా కుట్రపన్నారు. గౌతముడికి అప్రతిష్ఠ తెచ్చి పెట్టాలని నిశ్చయించుకున్నారు. వాళ్ళంతా ఒక మాయగోవును,

సృష్టించి గౌతమముని పంటపొలాల పైకి తోలారు. ఆ దొంగ ఆవు పొలంమీద పడి మేస్తూ పంటంతా తొక్కి పాడు చేయసాగింది. మునులంతా ఆవు పొలం మేస్తున్నదని గౌతముడికి చాడీలు చెప్పారు. దయార్ద్ర హృదయుడైన గౌతమమహర్షి ఆవును కొట్టటం ఇష్టంలేక ఒక దర్భపోచతో ''పో'' అని మెల్లగా అదలించాడు. ఆ గడ్డిపోచ తగిలీ తగలక ముందే ఆ మాయగోవు నోరు తెరచి అరచి చచ్చిపడింది. ధూర్తులైన మునులు తమప్రయత్నం ఫలించినందుకు లోలోపల సంతోషిస్తూ గౌతముణ్ణి దూషించ సాగారు.

నీవు పాపం చేశావన్నారు. నీ ముఖం చూడగూడదన్నారు. గోహత్యామహాపాతకం నీకు చుట్టుకుంటుందన్నారు. నీచేతి అన్నం తినం పొమ్మన్నారు. అనరాని మాటలన్నీ అని తమ కడుపుమంట తీర్చుకున్నారు.

అమాయకుడైన గౌతమమహర్షి జరిగిన దానికి చాలా విచారించాడు. తన పాపానికి ప్రాయశ్చిత్తం చెప్పమని చేతులు మోడ్చి మునులను ప్రార్థించాడు. అప్పుడు మునులంతా కూడ బలుక్కుని ''శివుని జటాజూటంలోని గంగాజలాన్ని తెచ్చి ఈ ఆవు మృతకళేబరం మీద పారిస్తేగాని నీ పాపం పరిహారం కా'' దన్నారు. పాపం గౌతమమహర్షి ఆశ్రమంలోని పంటంతా మునులకు అప్పగించి తాను పరమేశ్వరుణ్ణి గూర్చి ఘోరతపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షమై వరం కోరుకో మన్నాడు.

గౌతముడు జరిగిన సంగతంతా పరమేశ్వరునకు విన్నవించి గంగాజలం అనుగ్రహించమని అర్థించాడు. అప్పుడు మహేశ్వరుడు సహ్యాద్రి పంక్తులలోని బ్రహ్మగిరి శిఖరం మీద తన జటాజూటంలోని గంగాజలాన్ని కొంచెం ప్రసరింప జేశాడు. గౌతమమహర్షి ఆ జలధారను కొనివచ్చి చచ్చినగోవును బ్రతికించాడు. మహర్షి తపోమహిమకు మునులంతా సిగ్గుపడ్డారు. క్షమించమని కాళ్లమీద పడ్డారు. ఉదారమూర్తి అయిన గౌతముడు వాళ్లను దయతో మన్నించాడు. ఈ విధంగా మహర్షి గంగాజలాన్ని కొనివచ్చి గోహత్యాపాపంనుంచి విముక్తుడైనాడు. ఇది బ్రహ్మాండ పురాణగాథ.

విన్నారుగా! గౌతమమహర్షి తీసుకొని వచ్చిన ఆ పావన గంగాజలమే సన్నని జాలుగా -- చిన్న వాగుగా సాగి, పవిత్రమైన పంచవటి మీదుగా ప్రవహించి, ఆంధ్రశాతవాహనుల రాజధాని అయిన ప్రతిష్ఠాన నగరం ప్రక్కగా పురోగమించి, భద్రాచల రామచంద్రుణ్ణి సందర్శించి, పట్టిసం వీరభద్రేశ్వరుణ్ణి సేవించి, మహానదిగా -- అఖండ గౌతమిగా -- ఉరుకులు పరుగులు పెడుతూ ప్రవహించింది. ఆ మహానదిని నేనే.

నా పేరు 'గోదావరి'. మా ఊరు 'సహ్యగిరి'.

చచ్చిన గోవుకు ప్రాణదానం చేసినందున 'గోదావరి' అన్నారు నన్ను. గౌతముడు తన తపశ్శక్తితో కొని తెచ్చాడు గనుక 'గౌతమి' అన్నారు. శివదేవుని శిరస్సు నుంచి దిగి వచ్చాను గనుక 'గంగ' అన్నారు.

నేను అడుగు పెడితే చాలు; చేలు బంగారు పంటలు పండుతాయి. నా స్పర్శ తగిలితే చాలు; పుడమి తల్లి పులకించి పోతుంది. నా అంతరంగ తరంగాలు పొంగి పొరలితే చాలు; దేశం 'అన్న పూర్ణ' అవుతుంది. నా గాలి తగిలితే చాలు; కరువు కాటకాలు దూర దూరాలకు పరుగులు తీస్తాయి.

నన్ను కష్టజీవులు 'చల్లని తల్లి' అంటారు. పల్లె ప్రజలు 'బంగారు తల్లి' అంటారు. రైతుబిడ్డలు 'వరాలతల్లి' అంటారు. గంగపుత్రులు 'గోదారి తల్లి' అంటారు. కవులు 'నదీమతల్లి' అంటారు. కవులంటే జ్ఞాపకమొచ్చింది. వాల్మీకి, భవభూతులు నన్ను గూర్చి చేసిన ప్రశంసలు లోకవిదితాలే గదా!

క్రీ.శ. తొమ్మిదో శతాబ్దంవాడైన అలంకారిక శిరోమణి రాజశేఖరుడు తన 'కావ్యమీమాంస'లో నన్ను విశేషంగా పేర్కొన్నాడు. మహాపండితుడైన వేంకటాధ్వరి తన 'విశ్వగుణాదర్శం'లో నన్ను బహుధా అభివర్ణించాడు. కాశ్మీర కవిచంద్రుడైన కల్హణుడు తన 'రాజతరంగిణి' సప్తతరంగాలకూ, నా సప్తగోదావరి పాయలకూ, రమ్యమైన ఔపమ్యం కూర్చాడు. మురారి మహాకవి తన 'అనర్ఘ రాఘవం'లో 'సప్తగోదావరీ హార నాయకమణి'గా భీమేశ్వరస్వామిని అభివర్ణించి నన్ను 'ఆంధ్రదేశలక్ష్మీ కంఠ హారంగా' సంభావించాడు.

ఇక ఆంధ్రకవులలో నన్నయభట్టు గారికి నామీద ఎంతో అభిమానం. అరణ్యపర్వంలో నా ప్రశంస తెచ్చి నాలో స్నానం చేస్తే దశాశ్వమేధాలు చేసినంత పుణ్యం వస్తుందన్నాడు. తీర్థయాత్రలు చేస్తున్న అర్జునుణ్ణి 'వేంగీదేశా'నికి తీసుకొని వచ్చి 'గోదావరి స్నానం' చేయించాడు. అసలు ఆ వాగను శాసనులు రాజమహేంద్రవరంలో నా ఇసుకతిన్నెల మీద కూర్చుండేగా ఆంధ్రమహా భారతానికి 'శ్రీవాణీ గిరిజాశ్చిరాయ' అంటూ శ్రీకారం చుట్టారు. సహజపాండిత్యుడైన పోతన్న నన్ను 'అభ్రంకష శుభ్ర సముత్తుంగ తరంగ' అయిన 'గంగ'గా పేర్కొన్నారు. అయన చంద్రగ్రహణంనాడు నాలో స్నానంచేసి నా 'మహనీయ మంజుల పులిన తల మంటప మధ్యం'లో మహేశ్వరధ్యానం చేస్తూ కూర్చుండటం శ్రీరామభద్రుడు ప్రత్యక్షమై మహాభాగవతం తెలుగుచేయమనటం అందరికీ తెలిసిందే! అంటే తెలుగులో భారతం, భాగవతం నా తీరంలోనే ఆరంభమైనా యన్నమాట!

కవిసార్వభౌముడు తన 'భీమఖండం'లో నన్ను 'గౌతమీగంగ' గా పేర్కొన్నాడు. 'మహత్వంలో గంగ కన్న గోదావరే మిన్న' అని కూడా అన్నాడు. 'మంగళోత్తుంగ అయిన గౌతమీగంగకు మరే యితరనదులూ సాటిరా' వన్నాడు.

**ఆంధ్ర భూమండలీమధ్యం సంపుల్ల సరసీరుహం**
**సప్త గోదావరం తీర్థం మకరందో మనోరమః**

అన్న స్కాందపురాణ భీమఖండంలోని శ్లోకాన్ని 'ఆంధ్ర భూభువన మధ్యము పుండరీకంబు; సప్త గోదావరజలము తేనె' అని శ్రీనాథుడు తెలిగించాడు. 'పృథివి యెల్లను రక్షించు

పేరటాలు మమ్ము రక్షించు గోదావరమ్మ యెపుడు' అనీ, 'గౌతమీగంగ యాలోలఘనతరంగ' అనీ, 'గోదావరి గోదావరి గోదావరి యంచు బల్కు గుణవంతులకున్ గోదావరి తల్లీ! సంపాదింతుగదమ్మ నీవు భవ్య శుభంబుల్' అనీ అనేక విధాలుగా శ్రీనాథుడు నన్ను తనకృతులలో కీర్తించాడు. తమిళ కవీంద్రుడు కంబన్ తన 'కంబరామాయణం'లో భూదేవికి అలంకారమైనదాని ననీ, 'చల్లని నదీమతల్లి' ననీ నన్ను పెక్కు విధాల వర్ణించాడు.

కవిసామ్రాట్ విశ్వనాథ 'గోదావరీ పావనో దారవాఃపూర మఖిలభారతము మాదన్ననాడు' అని నా వైభవాన్ని వెల్లడిచేశాడు. అంతేకాకుండా నా చిన్నారిపాప కిన్నెరసాని చలాకీతనానికి ముచ్చట పడి ఆ పిల్లమీద చక్కని పాటలు వ్రాశాడు కూడా.

చిత్రకారుడు అడవి బాపిరాజు 'ఉప్పొంగి పోయింది గోదావరీ! తాను తెప్పున్న ఎగిసింది గోదావరీ!' అంటూ నా ఔన్నత్యానికి ఉప్పొంగి పోయాడు. జాషువా కవిచంద్రుడు 'గౌతమీగంగరమ్ము! స్వాగతము గొమ్ము!' అంటూ నా 'అఖండ గౌతమీ' రూపానికి నీరాజన మెత్తాడు. శాసనకర్తలు నన్ను 'తెలుగు తల్లి మెడలోని ముత్యాలహారంగా' సంభావించారు.

ఈ విధంగా పురాణాలలో, రామాయణ భారతాలలో సంస్కృత నాటకాలలో, ప్రబంధాలలో, గేయకృతులలో, శాసనాలలో నా ప్రశస్తి ఎలా ఉన్నదీ విన్నవించాను. గంగపుత్రులు నా మీద పడవలు నడుపుతూ -- గొంతెత్తి ఇలాపాడతారు.

గోదావరి తల్లికీ కోటిదండాలు  
బంగారు తల్లికీ సెంగల్వపూలు  
పిల్లలూ జెల్లలూ గల్లంతుగాకుండ  
సల్లంగ రచ్చించి యిల్లు జేర్చేతల్లి ॥గోదారి॥

సంక్షిప్తంగా నా చరిత్ర ఇది. చెప్పానుగదా త్ర్యంబకంలో పుట్టి 'నాసిక్' అని పిలువబడే 'పంచవటి' దాటి శాతవాహనుల రాజధాని 'ప్రతిష్ఠానం' మీదుగా తెలుగుదేశంలో ప్రవేశించి అదిలాబాదు నిజామాబాద్ కరీమ్‌నగర్ జిల్లాలను అతిక్రమించి భద్రాద్రి రాముణ్ణి దర్శించి ఆకాశాన్నంటుతున్న పాపికొండలలో పరుగులు పెట్టి, మలుపులు తిరిగి తూర్పు చాళుక్యుల రాజధాని రాజమహేంద్రవరంలో 'మార్కండేయేశ్వరుణ్ణీ' 'కోటిలింగాలక్షేత్రాన్నీ' సేవించి ధవళేశ్వరం దగ్గర సప్తగోదావరిగా మారాను. అంటే ఏడుపాయలయ్యాను. అయితే తుల్య, ఆత్రేయ, భరద్వాజ, గౌతమి, వృద్ధగౌతమి, కౌశికి, వసిష్ఠ అనే సప్త గోదావరి పాయలలో ఇప్పుడు మీకు 'గౌతమీ' 'వసిష్ఠ' అనే రెండు పాయలు మాత్రమే కన్పిస్తాయి. తక్కిన పాయలు అంతర్వాహినులైనాయి. గౌతమి తూర్పుగా 45 మైళ్ళు ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. వసిష్ఠ దక్షిణదిశగా 50 మైళ్ళు ప్రవహించి నరసాపురం దగ్గర సముద్రంలో చేరుతుంది. 'అంతర్వేది' అనే లక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రం ఇక్కడే ఉన్నది. నా తీరంలో ఉన్న పుణ్యక్షేత్రాలలో పంచవటి, రామగిరి, భద్రాచలం, కోటి లింగాలగుడి, మార్కండేయేశ్వరం, దక్షారామం, కోటిపల్లి, ముక్తేశ్వరం, ర్యాలి, వాడపల్లి, అంతర్వేది ముఖ్యమైనవి. ఇంకా ఎన్నో ఉన్నవి.

భద్రాచలంలో ప్రతియేటా చైత్రశుద్ధనవమి నాడు సీతారాముల కల్యాణం మహావైభవంగా జరుగుతుంది. ఆ ఉత్సవాలలో లక్షలాది ప్రజలు పాల్గొంటారు.

మంజీర, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, పూర్ణ, ప్రవర, మొదలైన ఉపనదులు నా నేస్తాలు; నాలో కలిసి నాకు తుష్టినీ పుష్టినీ కల్గిస్తాయి.


మీ ఇళ్లలో జరిగే ప్రతి శుభకార్యంలోనూ 'గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్ సన్నిధిం కురు' అని నన్ను ఆహ్వానిస్తారు.

సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం దగ్గర 1852లో ఆనకట్ట కట్టి ఆంధ్రదేశాన్ని అన్నపూర్ణగా దిద్ది తీర్చాడు. ఇప్పటికి ఇంకా ఎన్నో ప్రాజెక్టులు, బారేజీలు, ఆనకట్టలూ కట్టారు. కడుతున్నారు. కట్టబోతున్నారు. నాకెంతో సంతోషంగా ఉంది. నా జీవనమంతా లోకం కోసమే ఉపయోగపడాలని నా ఆశయం నా ఆకాంక్ష. నాకొక చిన్న కోరిక ఉంది; త్వరలో నా ముద్దుల చెల్లెలు కృష్ణవేణితో కలుసుకోవాలని. అదే సిద్ధిస్తే తెలంగాణం 'దేదీప్యమాన' మవుతుంది. రాయలసీమ 'రత్నాలసీమ'గా మారుతుంది. ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నాను.

ఈ పుష్కరాల పుణ్యకాలంలో మీరు రావటం నాకెంతో ఆనందంగా ఉంది. నాలో పుష్కర జ్యోతులు ప్రకాశించు తున్నాయి. నా గుండెలు పులకించి పొంగి పోతున్నాయి. రండి! రండి! నా పుణ్యజలాలలో స్నానం చెయ్యండి.

మేషం మొదలైన పన్నెండు రాసులలో బృహస్పతి ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క సంవత్సరం ఉంటాడు. అప్పుడు గంగ యమున మొదలైన నదులకు క్రమంగా పుష్కరాలు వస్తాయి. బృహస్పతి సింహరాశిలో ప్రవేశించినప్పుడు గోదావరినైన నా పుష్కరాలు వస్తాయి. అలాగే కన్యారాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు నా చెల్లి కృష్ణకు పుష్కరాలు వస్తాయి. ఇప్పుడు బృహస్పతి సింహంలో ప్రవేశించాడు. లోక బాంధువుడైన సూర్యుడుకూడా సింహరాశిలోకి అడుగుపెట్టాడు.

రండి! రండి! ఈ శుభ సమయంలో నాలో స్నానం చెయ్యండి. మీ తాపాలూ పాపాలూ అన్నీ పోతాయి. మీకు సమస్త శుభాలూ ప్రాప్తిస్తాయి. వెయ్యి గోదానాలు చేసిన పుణ్యం లభిస్తుంది.



సర్వేజనా స్సుఖినో భవంతు

* * *

# పుష్కర గోదావరి

పక్కంతం సూర్యనారాయణరావ్

గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్ సన్నిధిం కురు.

ఇది మనం అనునిత్యం స్నానం చేసేటప్పుడు ఉపయోగించే జలాన్ని పవిత్రీకరించడానికి పఠించే మంత్రం; దైవార్చన సమయంలో కలశంలోని జలాన్ని పవిత్రీకరించడానికి పఠించే మంత్రం. గంగ, యమున మొదలైన పుణ్య నదుల జలాలతో పాటు గోదావరీ జలాన్ని కూడా అనుసంధాన పూర్వకంగా ఆహ్వానించడం ఇందులోని పరమార్థం. ఇక్కడ-పరమశివుని శిరస్సు మీద తరంగనర్తనం చేసే పావనగంగానదితో సరిసమానమైన స్థానం గోదావరికీ ఇవ్వబడుతోంది.

అందుకు కారణం వుంది. భారతదేశాన్ని పునీతం చేస్తున్న సప్త పుణ్యతీర్థాలలో గోదావరి ఒకటి. దక్షిణ భారతంలో ప్రవహించే శ్రేష్ఠ నదులు మూడైతే, అందులో ప్రథమస్థానం గోదావరిది.

గోదావరీ కృష్ణవేణీ కావేరీ చ సరిద్వరా.
-మహాభారతం - సభాపర్వం : 9-20

పురాణాలలో గోదావరీనదికి గంగానదితో సమానమైన స్థానం కల్పించబడింది. మహావిష్ణువు పాదనఖ స్పర్శతో చీలిన బ్రహ్మాండ ఖర్పరం నుండీ ఉద్భవించి, మహేశ్వరుని మహా శీర్షంమీద విడిదిచేసి, ప్రవహించే దివ్యగంగతో గోదావరికి సాపత్యం ఎందుకు? గంగానది పరమశివుని శిరస్సు మీద కొలువు తీరింది. గోదావరి శంకరుని జటాజూటం నుండీ జాలువారింది!

అందుకే గోదావరికి 'వృద్ధగంగ' అనే మరొక పేరు ఏర్పడింది. మరొక రహస్యం కూడా వుంది. ఉత్తర భారతంలో ప్రవహించే గంగ, దక్షిణ భారతంలో గోదావరి అయింది. ఈ విషయం పురాణాల్లో స్పష్టంగా పేర్కొనబడింది:

వింధ్యస్య దక్షిణే గంగా గౌతమీ సా నిగద్యతే
ఉత్తరే సాపి వింధ్యస్య భాగీరథ్యభిధీయతే.

వింధ్య పర్వతాలకు దక్షిణంలో ప్రవహించే గంగ గౌతమి (గోదావరి) అని వ్యవహరించబడుతుంది. వింధ్య పర్వతాలకు ఉత్తరంలో భాగీరథి (గంగ) అనబడుతుంది.

గంగ ఆవిర్భావానికి కారకుడు భగీరథుడు.
గోదావరి ఆవిర్భావానికి కారకుడు గౌతముడు.

గౌతమ మహర్షిని తరింపజేయడానికి తరలివచ్చినందువల్ల గోదావరి 'గౌతమి'గా ప్రఖ్యాతి చెందింది. మౌలికంగా ఆ నదీమాత గోదావరి. ఆ నామధేయంలోని అర్థమేమిటి? పరమార్థమేమిటి?

తన ఆశ్రమానికి చెందిన పొలంలో మేస్తున్న గోవును గౌతమ మహర్షి దర్భతో వేశాడు. మహాత్ముల శక్తి అపారం. వారి చేతిలోని దర్భ పోచ కూడా వజ్రాయుధమే! దర్భ దెబ్బకు గోవు మరణించింది. ఫలితంగా గౌతముడికి గోహత్యా పాపం సంక్రమించింది. ఆ పాప పరిహారార్థం గౌతముడు బ్రహ్మగిరి శిఖరం మీద పరమశివుణ్ని గురించి తపస్సుచేశాడు. త్ర్యంబకుడు (త్రినేత్రుడు) ప్రత్యక్షమైనాడు. పంకిలాన్నీ (బురదను), పాప పంకిలాన్నీ ప్రక్షాళనం చేసేది జలమే అని ఆయనకు తెలుసు. తన జడలలో సుడులు తిరుగుతున్న గంగాజలాన్ని ఒక జడ పాయ గుండా వదిలాడు. ఆ విధంగా నాసికాత్ర్యంబక క్షేత్రంలో ప్రభవించిన దివ్య నది, గౌతముని ఆశ్రమం వైపు ప్రవహించింది. మరణించిన గోమాతకు ప్రాణం పోసి, దానిని గౌతమునికి ప్రసాదించింది. ఆ విధంగా గౌతమ మహర్షికి గోద - 'గోవును ఇచ్చిన', వారి - 'నీరు' అయ్యింది. గోద - వారి అయ్యింది. 'గోదవారి' కాలక్రమ వ్యవహారంలో గోదావరి అయ్యింది. ఇది అర్థం. పైకి కనిపించే స్థూలమైన అర్థం.

అంతరంగంలో ఆవిష్కరించబడే అంతరార్థం మరొకటి వుంది. 'గో' శబ్దానికి 'గోవు' అనే అర్థంతో బాటు 'జ్ఞానం' అనే అర్థమూ వుంది. తన ఆవిర్భావానికి కారకుడైన గౌతమమహర్షికి ఆ తల్లి, గోవునేకాదు, జ్ఞానాన్నీ ఇచ్చింది. గోదావరి 'గోదా'యినే కాదు; జ్ఞానదాయిని కూడా.

గోదావరికి మరో పేరైన 'గౌతమి' కి కూడా ఇలాంటి అంతరార్థమే వుంది. 'గౌ' అంటే కిరణ ప్రకాశం. 'తమస్సు' అంటే చీకటి. అజ్ఞానం అనబడే చీకటి. అజ్ఞాన తిమిరాన్ని అంతంచేసే కాంతి అని 'గౌతమి' కి అర్థం. అదే ఆ అర్థంలోని పరమార్థం.

అందుకే గోదావరి ప్రవహించే దక్షిణ భారతాన్ని మహాభారతం 'పుణ్యభూమి' అంటూ అభివర్ణించింది.

యస్యా మాఖ్యాయతే పుణ్యా దిశి గోదావరీ నదీ!
బహ్వారామా బహుజలా తాపసాచరితా శివా.
-మహాభారతం - అరణ్యపర్వం 68-2

గోదావరీ పావన జలం ప్రవహించే ప్రదేశం అనబడటం దక్షిణాది గొప్పతనం. ఎన్నో వనాలూ, జలసమృద్ధి, శుభంకరి అయిన గోదావరిని తాపసులు సేవిస్తారు. నదిని సేవించడం అంటే ఏమిటి? షోడశ ఉపచారాలతో అర్చించడమా!

నదిని సేవించడం అంటే నదిలో స్నానం చేయడం. విధి విధానాన్ని అనుసరించి పవిత్ర స్నానం చేయడం. సర్వదా సిద్ధ పురుషులు సేవించే గోదావరిలో స్నానం చేస్తే

'గవామయనం' అనబడే యజ్ఞం చేసినంత ఫలం లభిస్తుంది – అని మహాభారతం చెప్తోంది. స్నానం దశవిధాలు అని శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి.

> అతో మలాపకర్షంతు సంకల్పంతు ద్వితీయకం.
> తృతీయంతు మృదాస్నానం మంత్రస్నానం చతుర్థకం.
> పంచమం పిత్రుభిః స్నానం షష్ఠించైవ గురోస్మరేత్
> సప్తమం మూలమంత్రేణ అష్టమంచాఘమర్షణీమ్
> నవమం పురుషసూక్తేన దశమం తీర్థవారిణామ్.

మలాపకర్షణ స్నానం, సంకల్ప స్నానం, మృత్తికా స్నానం, మంత్రస్నానం, పితృ సంబంధ స్నానం, గురు సంబంధ స్నానం, మూల మంత్ర స్నానం, అఘమర్షణ స్నానం, పురుషసూక్త స్నానం, తీర్థస్నానం.

పది విధాల స్నానాలలో తీర్థ స్నానం ఒకటి. దశవిధ స్నానాలలో అతి శ్రేష్ఠమైనది కూడా అదే. తీర్థ స్నానాచరణకు విధి విధానం వుంది. ప్రవాహానికి అభిముఖంగా నడుము లోతు నీటిలో నిలబడి, నది ప్రాముఖ్యతనూ, మహిమనూ స్మరించి, నదికి అధిదేవతనూ, అభిమాన దేవత అయిన భగవంతుడి రూపాన్నీ, నామాన్నీ ధ్యానించి మునకలు వేయాలి. నదీ స్నానం కేవలం తన శరీరానికే కాదనీ, అంతరంగానికి కూడా అనీ, తనలో సూక్ష్మ రూపంలో నెల కొన్న దైవస్వరూపానికి కూడా అనీ భావించాలి.

దశవిధ స్నానాలలో తీర్థస్నానం ఉత్తమమైనదైతే – పుష్కర పుణ్య సమయంలో ఆచరించే పుష్కర స్నానం విశేష ఫలదాయకం అని పెద్దలు చెప్తారు. గౌతమ మహర్షికి గోహత్యాపాపంనుండీ విమోచనం అనుగ్రహించిన గోదావరీ పుష్కరస్నానం అంతరంగ ప్రక్షాళనకు అద్వితీయమైన సాధనం.

గోదావరీ స్నానానికి ఒక అనుష్ఠాన ప్రక్రియ నిర్దేశించబడింది. ఒక భావనా పద్ధతి చెప్పబడింది. ప్రతీ క్రియకూ ప్రతిక్రియా, ప్రతి ప్రక్రియకూ ఒక పరమార్థం, ప్రతీ పరమార్థానికీ ఒక ఫలితం వుంటాయి.

స్థూలంగా కనిపించే ప్రతిదానికీ ఒక సూక్ష్మ రూపం వుంటుంది. సూక్ష్మంలో మోక్షం అని అందుకే అంటారు. సూక్ష్మాతి సూక్ష్మమైన అణువు ఏ పదార్థాల సమ్మేళనంతో ఏర్పడిందో, స్థూలాతి స్థూలమైన విశ్వమూ ఆ పదార్థాల సమ్మేళనంతోనే రూపొందింది. అండంలో, పిండంలో, బ్రహ్మాండంలో అన్నింటిలో అన్నీ వున్నాయి. మనిషిలోనూ వున్నాయి. ఈ విశాల విశ్వంలోని ప్రకృతి విన్యాసం మనిషిలోనూ వుంది.

అందుకే ప్రపంచంలో ప్రవహించే నదులు కూడా మానవ శరీరంలో వున్నాయని తత్త్వవేత్తలు సెలవిచ్చారు. మానవ శరీరంలోని డెబ్భైరెండు వేల నాడులలో, అంతే సంఖ్యలో తీర్థాలూ, తీర్థాల అభిమాని దేవతలూ, అధిష్ఠాన దేవతలూ వున్నారు. డెబ్భై రెండు వేల నాడులలో ముఖ్యమైన నాడుల సంఖ్య నూట ఒక్కటి. అందులో ప్రముఖ నాడులు పన్నెండు.

ఈ ద్వాదశ నాడులు ద్వాదశ నదులకు ప్రతీకలుగా పేర్కొనబడ్డాయి. ఈ పన్నెండు నాడులలో 'వారుణీ నాడి' ఒకటి. ఈ వారుణీ నాడి 'గోదావరి నది' కి ప్రతిరూపంగా యోగులు గుర్తించారు. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అనబడే పంచప్రాణాలు ఈ వారుణీ నాడికి స్థానం. వారుణీ నాడికి అధిష్ఠాన దేవత శంఖ చక్ర గదా పద్మ ధరుడైన నారాయణుడు. గోదావరీ నదికి అధిష్ఠాన దేవత కూడా నారాయణుడే.

గోదావరీ స్నానం ఆచరించేటప్పుడు – ఆ నదీమ తల్లిని ఆవిర్భవింపజేసిన పరమ శివుణ్ని, ఆవిర్భావానికి కారకుడైన గౌతమమహర్షినీ, సంభవ స్థానమైన నాసికాత్ర్యంబకం నుండి, సంగమస్థానం వరకు తీర ప్రాంతాలలో కొలువుతీరిన వివిధ దేవతామూర్తులనూ, అధిష్ఠాన దేవత అయిన నారాయణునీ స్మరించాలి.


అచరిస్తున్న పావన గోదావరీ స్నానం దేహంతో పాటు అంతరంగానికీ అనీ, వారుణీనాడిలో సూక్ష్మ రూపంలో దేహంలో సంచరిస్తున్న సూక్ష్మ గోదావరికి అధిష్ఠాన దేవతా స్వరూపుడైన నారాయణునికీ అని భావించాలి. భావన అనుభావానికీ, అనుష్ఠానం అనుభవానికీ, అనుభవం ఆనందానికి ఆధారాలు. స్నాన సంకల్పంలోని అంతరార్థం. ఆచరణలోని పరమార్థం ఇదే! 'యద్భావం తద్భవతి' కదా!

ఫలశ్రుతి : జలం – కలుషాన్ని, మురికిని కడిగివేసే ఒక అద్భుత పదార్థం. పావన జలంతో పంకిలాన్నీ, పాప పంకిలాన్నీ ప్రక్షాళన చేసుకోవడం పుణ్యం. కల్మషాన్ని కడిగివేసే జలాన్ని కలుషితం చేయడం పాపం. పాప పూరితమైన నేరం. మనిషి అంగమాలిన్యాన్నీ, అంతరంగ మాలిన్యాన్నీ ప్రక్షాళించి, శుభ్రం చేసే జలామృతాన్ని చేతులారా మలినం చేసే పాపిష్టి కర్మకు మనిషి స్వస్తి చెప్పాలి.

> పవిత్ర పుష్కర సందర్భంలో గోదావరిలో పుణ్య స్నానం ఆచరించే ప్రతీ ఒక్కరూ 'ఆహారాన్ని, ఆరోగ్యాన్ని, ఆత్మానందాన్ని అందించే జలాన్ని కలుషితం చేయను' అని ప్రతిజ్ఞ చేయాలి.

ఈ ప్రతిజ్ఞనే మహా సంకల్పంగా, స్నాన సంకల్పంతో జత చేసి పుణ్య గోదావరీ పుష్కర స్నానం ఆచరించాలి.

* * *



# గోదావరి పుష్కర ప్రాశస్త్యము

—టి. రవి

మానవ జీవనానికి నదులకు విడదీయలేని సంబంధం ఉన్నదన్నది సుస్పష్టం. భారతదేశంలో నదులు చాలా వున్నాయి. వీటిలో గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ మొదలగు నదులు సుప్రసిద్ధమైనవి.

నదులు మనకందిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక సందేశం అద్వితీయమైంది. సాధారణ కృత్యాలైన స్నానం, పానం దగ్గర నుంచి పర్వదినాల్లో ఆచరించే అనేక వైదిక కర్మల వరకు మన జీవితంలో నదులు ఒక ధార్మిక చైతన్యాన్ని కలిగిస్తున్నాయి.

నన్నయ గోదావరిని దక్షిణ గంగ అన్నాడు. సీతారామ లక్ష్మణులు ఈ నదీతీరంలోని పంచవటిలో నివసించడం, లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులను ఇక్కడనే కోయడం, దశరథుని మరణవార్త విన్న రాముడు ఈ గోదావరి నదిలోనే స్నానం చేయడం మొదలైన సంఘటనల వల్ల రామాయణ కథాంశంలో భాగమయింది గోదావరి. ఈ నదికి ఇరువైపుల మూడున్నర కోట్ల తీర్థాలున్నాయని ప్రతీతి.



తీర్థమంటే పుణ్యస్థలం. పూజ్యజలం ఎక్కడైతే పుణ్యపురుషులకి ఆశ్రయం కల్పిస్తుందో ఆ ప్రదేశాన్ని తీర్థమంటారని ప్రసిద్ధమైన, ప్రాచీనమైన దేవాలయాలు నదీ తీరంలోనూ, కొండలపైననో, కోనల్లోనో, సముద్రతీరంలోనో, అరణ్యాల్లోనో ఉండడం కనిపిస్తుంది. ప్రసన్నమైన, శాంత సుందరమైన బాహ్య ప్రకృతిలో ఉన్న తీర్థక్షేత్రాలు అన్ని విధాలా పవిత్రమైనవి. ముఖ్యంగా 'పవిత్రత' ఉన్న ప్రదేశాన్ని క్షేత్రమనీ నదులను, సముద్ర ప్రాంతాలను తీర్థములని వ్యవహరిస్తాము

తీర్థయాత్రలు మన సంప్రదాయంలో అనాదిగా వస్తున్న విషయాలు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేసినపుడు అనేక తీర్థాలు, క్షేత్రాలు దర్శించినట్లుగా రామాయణం వక్కాణిస్తుంది. నన్నయ రచించిన శ్రీ మహాభారతంలో ధర్మరాజ ద్రౌపదిల ఏకాంత వాసాన్ని అనివార్య పరిస్థితులలో భంగం కలిగించినపుడు అర్జునుడు నియమానుసారంగా తీర్థయాత్రను నిర్వహిస్తాడు. ఇటువంటి ఉదాహరణలు మనకు మనపురాణ ఇతిహాసాల్లో కొల్లలు. పవిత్రత పరమాత్మ లక్షణమని మనమంతా అంగీకరించే విషయమే కదా! పవిత్రతనూ, ఆనందాన్నీ కోరటం మానవనైజం. ఆ దృష్టితో తీర్థ స్థలాలు భగవన్నివాసాలనీ, తత్సేవ భగవత్సేవ అనీ, దాని వలన అలౌకిక ఆనందం కలుగుతుందనీ భావించడం సముచితం.

జలానికి పుష్కరమని పేరున్నది. 'పోషయతేతి పుష్కరం' - పోషించేది అని అర్థం. తీర్థాలన్నింటికి నాయకుడు పుష్కరుడు. అతన్ని పుష్కరుడని, 'తీర్థరాజు' అని అంటారు. ఈయన్ని బ్రహ్మ సృష్టించాడని పురాణాలు చెప్తున్నాయి. బుద్ధిలోను, గుణాల్లోను మంచితనాన్ని కొన్నిరెట్లుగా ఇనుమడింపచేసేది పుష్కరం. నదులలో పుష్కరుడు నివసించే పవిత్రమైన కాలం నదీపుష్కరం అవుతుంది. మేషము మొదలైన

పంద్రెండు రాసులలో సురగురువు బృహస్పతి సంచరించువేళ పుష్కరుడు ఆయా నదుల యందు నివసిస్తూ వుంటాడు.

బృహస్పతి పుష్కరునితో కలిసి మేషరాశిలో ప్రవేశించినపుడు గంగకు పుష్కరం. వృషభరాశిలో నర్మదకు, మిథునంలో సరస్వతికి, కర్కాటకంలో యమునకు, సింహంలో గోదావరికి, కన్యలో కృష్ణకు, తులలో కావేరికి, వృశ్చికంలో భీమరథికి, మీనంలో ప్రణితానదికి పుష్కరాలు వస్తాయి. కాబట్టి బృహస్పతి ఏరాశిలో ప్రవేశిస్తాడో దానికి సంబంధించి నదీ పుష్కరము వస్తూవుంటుంది. అంటే పన్నెండు సంవత్సరాల కొకసారి క్రమంగా పై నదులకు పుష్కరోత్సవాలు వస్తూ వుంటాయి. పుష్కర పర్వము ప్రతినదికిని సంవత్సర కాలము ఉంటుంది. మొదటి 12 రోజులు ప్రధాన పుష్కర పర్వదినాలుగా పరిగణింపబడుతాయి. ఈ సమయంలో యాత్రికులు స్నాన, దాన, హిరణ్య శ్రాద్ధ, తీర్థశ్రాద్ధ పితృతర్పణ విధులతోను, గంగా పూజలతోను భక్తి సల్పుట భారతీయ సత్సంప్రదాయము.

గోదావరి నది పుష్కర దినాలలో ఈ నదిలో ఎక్కడ స్నానం చేసినా ఫలితం దక్కుతుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. పూర్వజన్మల్లో మనస్సు, వాక్కు, శరీరమనే త్రికరణాలతో చేసిన అన్ని పాపాలు నశించి మోక్షప్రాప్తి కలుగుతుందని బ్రహ్మాండ పురాణం చెప్తున్నది. ఎన్నో పుణ్యకార్యాలు ఈ సమయంలో చేయాలని శాస్త్రాలు చెపుతున్నాయి. మానవులు స్నాన, దాన, జప, అర్చన, ధ్యాన, హోమ, తర్పణాది అనుష్ఠాలను పితృ పిండ ప్రదానాలకు చేయాలని మహర్షులు ప్రబోధించారు. ఈ కర్మల వలన శారీరక, మానసిక, కల్మషాలు తొలగి మానవులు పవిత్రులు, తేజోవంతులై ఉత్తేజితులవుతారు. ఈ ఆధ్యాత్మిక చింతన మనజాతి ఏకత్వానికి పునాది వంటిది.

పుణ్య కార్యాలన్నింటిలోకి ముఖ్యమైనది, ఎంతో ఫలితాన్ని ఇవ్వగలిగింది పుష్కరస్నానం. తర్వాతది దానం. నదులు దైవ, అర్ష, మానవ, అసుర భేదంతో నాలుగు రకాలు అని బ్రహ్మపురాణం చెబుతుంది. త్రిమూర్తుల చేత ప్రవర్తింప చేయబడేవి మొదటి తరగతికి చెందుతాయి. అలా మొదటి తరగతికి చెందిన గోదావరి నదిలో స్నానం చేయడం మహాపుణ్యం.

జన్మ ప్రభృతి యత్పాపం స్త్రియా వా పురుషేణవా
పుష్కరే స్నాత మాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి.

పుట్టినప్పటి నుండి స్త్రీచేగాని, పురుషునిచే గాని చేయబడిన పాపమంతా పుష్కర సమయంలో స్నానంచేస్తే తొలగిపోతుందని పై శ్లోకార్థం.

పుష్కర సమయంలో ప్రాతఃకాల స్నానం ఉత్తమమైంది. అవకాశమున్నవారు పుష్కర విధిని ఆచరించడానికి ముందురోజే రెండు పూటల్లో, ఒకపూటో ఉపవాసం చేసి మరుసటి రోజు ఉదయం ముండనం చేయించుకొని స్నానం చేయాలి.

స్నానము తర్వాత ముఖ్యమైన కర్మ యథాశక్తిగ దానం చేయడం. దశదానములు, షోడశ మహాదానములు చేసి తీర్థ శ్రాద్ధములు చేసి పితురులను సంతృప్తి పరచవలయును.

పుష్కర దినములందు మొదటిరోజు బంగారు, వెండి, ధాన్యము, భూదానాలు చేయాలి. రెండవరోజు వస్త్రము, లవణము, గోవు రత్నదానాలు చేయాలి. మూడవరోజు బెల్లము, గుర్రము, కూరలు, పండ్లను దానం చేయాలి. నాల్గవరోజు పాలు, పెరుగు, తేనె, నేతిని దానం చేయాలి. ఐదవరోజు ధాన్యము, బండి, గేదె, వృషభము, నాగలియును, ఆరవరోజు ఔషధము, కర్పూరము, చందనము, కస్తూరియును, ఏడవరోజు గృహము, పీఠము, శయ్య, పల్లకియును, ఎనిమిదవ రోజున గంధపు చెక్క, పుష్పములు, దుంపలు, అల్లమును, తొమ్మిదవ రోజున పిండప్రదానము, శయ్యమును, పదవరోజున శాక, సాలగ్రామ, పుస్తక దానాలు, పదకొండవ రోజున ఏనుగు మున్నగునవి పన్నెండవ రోజున విధ్యుక్త స్నానమును దానాదులకు మిక్కిలి ప్రశస్తమైనవి.

ఈ దానాలు చేసినవానికి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని చెబుతారు. ఈ పన్నెండు రోజులలో ప్రతిదినము చేసే ఒక్కొక్కదానానికి ఒక్కొక్క ఫలితం ఉంటుందని బ్రహ్మాండ పురాణం చెబుతుంది.

పుష్కర సమయాల్లో దేవతలు, ఋషులు, వారితో పాటు పితురులు కూడా వస్తారన్న ప్రమాణ వాక్యమున్నది. కనుక స్నాన, దానాదులతో పాటు పైతృక కర్మలు కూడా చేయడం మంచిది. వీటిని శ్రద్ధతో ఆచరిస్తారు కనుక శ్రాద్ధ కర్మలు అని కూడా అంటారు. పుష్కరాల్లో పుణ్యనదీతీరాన ఆచరించే పితృకర్మను పుష్కర శ్రాద్ధం అంటారు. కొన్నివేల సంవత్సరాల నుండి మహాపురుషులు పుష్కర శ్రాద్ధం పేర పితృకర్మలు ఆచరించినట్లు పురాణాల్లో వర్ణింపబడి వుంది.

ఈ గోదావరి పుష్కర సమయంలో వారివారి శక్తికి, అర్హతకు తగినట్లు స్నాన, దాన, శ్రాద్ధాది కర్మలను అనుష్ఠించి మంచి పుణ్య విశేషాన్ని సంపాదించుకోగలరు.

* * *




# అదిగో భద్రాద్రి ఇదిగో గౌతమి

-కామిశెట్టి శ్రీనివాసులు

అన్నమయ్య వేంకటాద్రి దర్శకుడైతే గోపన్న భద్రాద్రి దర్శకుడు. ఆ తీర్థాలు, క్షేత్రాలు, దైవతాలు - వాని బహిరంగాలతో పాటు అంతరంగాలను కూడ చిత్రించి ప్రదర్శించిన భక్తగాయకులు వారు. గిరిపై నెలకొన్న ఆ పరంధాములతో తమ జీవితాలను పంచుకొని, పెంచుకొని కృతార్థులైన ఆ భక్తకవులు తమ వచోక్రియలతో ఆంధ్రవాఙ్మయాన్ని పావనము చేసినారు.

'అదివో అల్లదివో' అంటూ చిందులేస్తూ పదివేల శేషుల పడగల మయమైన హరివాసాన్ని చూపిస్తూ 'బంగారు శిఖరాల బహుబ్రహ్మమయాన్ని' గానం చేసిన పదకవితా పితామహుడు అన్నమయ్య. ఆ శ్రీనివాసదాసుని తలపిస్తూ ఈ శ్రీరామదాసుడు 'చారుస్వర్ణ ప్రాకార గోపుర ద్వారాలతో' విరాజిల్లే 'ఇలవైకుంఠాన్ని' ప్రదర్శిస్తూ 'ముదముతో సీతాముదిత లక్ష్మణుల కొలువై ఉన్న కోదండపాణిని' సేవింపరమ్మని గౌతమి సాక్షిగా పిలుస్తున్నాడు. ఆ వేంకటాచలం మేరు సమానము. ఈ భద్రాచలము మేరు పుత్రుడే. శేషాద్రి ఆకాశ గంగా పరిష్కృతం. భద్రాద్రి వృద్ధగంగా పరివృతం. గౌతమిని, భద్రాద్రిని దర్శించమని రామదాసు గానం చేసినాడు. శ్రీరామచంద్రుడు తన వనవాస ఆయాసాన్ని ఈ గోదావరి తీరంలోనే తీర్చుకొన్నాడు. పర్ణశాలను నిర్మించుకొని ఈ గోదావరి ఒడ్డున సీతాలక్ష్మణులతో గడపినాడు. రావణుడు సీతమ్మను ఎత్తుకొనిపోవడం గోదావరి చూసినది. సీతమ్మ జాడ తెలుపుమని చెట్టును, పుట్టను అడుగుతూ శ్రీరాముడు ఈ గోదావరిని కూడా ప్రార్థించినాడు. రావణునికి భయపడి "పిరికి గోదావరి" ఊరకున్నది. ఆ పాపాన్ని కడుగుకొనడం కోసమే కాబోలు సీతారామ లక్ష్మణులు వెలసిన భద్రాద్రిని పరివేష్టించి ప్రవహిస్తున్నది గోదావరి. తన పావనోదకాలతో తనివితీర హరివెలసిన గిరిని అభిషేకిస్తున్నది.



మేరు పర్వతము సంతానం కోసం బ్రహ్మదేవుని ఉద్దేశించి తపస్సు చేసినది. చతుర్ముఖుడు భద్రుడనే కుమారుని ప్రసాదించినాడు. కాగల పుణ్యశాలి భద్రుడు పర్వతాకృతిని పొంది దండకారణ్యాన గోదావరీ తటంలో తపస్సమాధిని పొందినాడు. శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై వనవాస సమయాన ఈ భద్రగిరిలో విశ్రమించినాడు. ఆ భద్రుని కోరిక మన్నించి రామభద్రుడు ఆ కొండపైన శాశ్వతముగ సీతాలక్ష్మణ సమేతుడై వెలసినాడు. స్వయంవ్యక్త శిలామూర్తులు భద్రుని అంకసీమ నిలిచినవి. శంకర భగవత్పాదులు ఈ దివ్యమూర్తులను దర్శించి పులకించి తన రామకర్ణామృతంలో గానం చేసినాడు.

> వామాంకస్థిత జానకీ పరిలసత్కోదండదండం కరే
> చక్రం చోర్ధ్వకరేణ బాహుయుగళే శంఖంశరం దక్షిణే
> బిభ్రాణం జలజాత పత్రనయనం భద్రాద్రి మూర్ధ్నిస్థితం
> కేయూరాది విభూషితం రఘుపతిం సౌమిత్రియుక్తం భజే.

భద్రాద్రిలో వెలసిన సీతారామలక్ష్మణులు తమ్ముతాము ప్రకటించుకొన్నారు. గిరికి సమీపంలో భద్రిరెడ్డిపాలెమనే గ్రామం ఉన్నది. అక్కడ శబరకులానికి చెందిన పోకల దమ్మక్క అనే భక్తురాలుండేది. ఆమెకు స్వప్నాదేశం కలిగింది. ఊరివాళ్లతో కలసి ఆమె స్వామి చెప్పిన తాటిచెట్టు సంకేతంగ ముద్దులు గొలిపే ముమ్మూర్తులను దర్శించుకొన్నది. శంఖచక్రాలతో పద్మాసనాసీనుడై సీతాసమేతంగ విలసిల్లే శ్రీరామచంద్రుడు, చెంత ధనుర్ధారియై నిల్చున్న సౌమిత్రి. ఆ దివ్యమూర్తులకు ఒక పందిలివేసి చిన్న కుటీరాన్ని నిర్మించినారు. తాటిచెట్టున రాలిన పండ్లను స్వామికి నైవేద్యం పెట్టి తమ్మక్క ప్రతినిత్యం పూజలు సాగించేది. ఆ పర్ణశాల గుడియై గోపురప్రాకారాదులతో విలసిల్లినది. రామాయణ భక్తశబరిని తలపించే తమ్మక్క నిర్మల పూజలతో ప్రకాశమానుడైన భద్రాద్రి రాముడు ఆంధ్రుల హృదయాభిరాముడైనాడు. ఆ తొలి పూజాఫలము తమ్మక్కదే.

భద్రాద్రి రాముని స్మరిస్తే భక్తరామదాసు ప్రత్యక్షమౌతాడు. అతడు రామదాసు భజించిన వేలుపుగా ప్రసిద్ధిని పొందినాడు. ఈ రామదాసుని పూర్వనామం కంచర్ల గోపన్న. గోల్కొండ నవాబు తానీషా కొలువులో ఉన్న అక్కన్న మాదన్నల మేనల్లుడు గోపన్న. మంత్రులుగ దండనాధులుగ తానీషా



మెప్పును పొందినవారు అక్కన్న మాదన్నలు. వీరి ప్రాపకంతో గోపన్న పరగణాధికారిగ నియమింపబడెను. పాల్వంచ, బూర్గుంపాడు, భద్రాచలము తాలుకాలు వీరి ఏలుబడిలో ఉన్నది. సంస్కృతాంధ్ర భాషలలో పాండిత్యముతో బాటు కవితా ప్రావీణ్యము కలిగిన గోపన్న అటు నవాబును ఇటు ప్రజలను మెప్పించెను. శిస్తుల బకాయిలను వసూలు చేసెను. పరగణాల తహశీల్దారు శ్రీరామభక్తి సామ్రాజ్యంలో ప్రవేశించెను. 'రాముని సేవకు రమ్మని పిలిచిన రాలేననకే ఓమనసా'- అది గోపన్న మానస బోధ. తమ్మక్క పూజలను తెలుసుకొన్నాడు. సీతారామలక్ష్మణులను సేవించుకొన్నాడు. కరుణా పయోనిధియైన దాశరథి ప్రసన్నుడైనాడు. గోపన్న మనసు గోదావరిలా పొంగినది.

**కంటి నదీతటంబు, పొడగంటిని భద్రనగాధివాసమున్**
**కంటి నిలాతనూజ, నురుకార్ముక మార్గణ శంఖచక్రముల్**
**గంటిని, మిమ్ము లక్ష్మణుని గంటి, కృతార్థుడనైతి**
**ఓ జగత్కంటక దైత్యనిర్దళన! దాశరథీ! కరుణాపయోనిధీ!**

గోపన్న రామదాసుడైనాడు. కబీరు వీరికి శ్రీరామతారక మంత్రం ఉపదేశించినాడట. తమ్మక్క పూజలకు శాశ్వతత్వం కల్పించినాడు. కాంచీపురం నుండి పంచగోత్రాలకు చెందిన వైష్ణవులను రప్పించినాడు. పాంచరాత్ర ఆగమవిధానం ప్రవేశించినది. శాశ్వత ప్రాతిపదిక మీద ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించినాడు.

గోపురాలు, మండపాలు, బంగారు ఆభరణాలు, వాహనాలు ఒక్కటేమిటి, అన్నీ అంగరంగ వైభవంగ సమకూరినవి. పాలకుడు భక్తుడైనాడు. భక్తుని పాలన కర్తవ్యాన్ని విస్మరింపచేసినది. నిధికాదు రాముని సన్నిధి సుఖమని తెలుసుకొన్నాడు. సర్కారు బొక్కసం ఖాళీ అయినది. దేవాలయ నిర్మాణానికి ఆరులక్షల ప్రభుత్వ ధనమును వెచ్చించినాడు. నవాబు అనుమతి రాకముందే అంతా ఖర్చు చేసినాడు. అంతా రామునికే వెచ్చించినా అది నియమోల్లంఘనమే. అక్కన్న మాదన్నల ప్రాభవం తగ్గినది. గోల్కొండ రాజకీయ ఆర్థిక స్థితులు ఇరకటాన పడినవి. నవాబు దృష్టిలో నేరస్థుడైన రామదాసు కారాగృహశిక్ష ననుభవించెను (క్రీ.శ. 1674 నుండి 1686 వరకు). శ్రీరామ వనవాసానికి శ్రీరామదాసు కారాగృహవాసానికి సరి.

రామదాసు బందిఖానాలో పొందిన అనుభవాలు అక్షరాలుగ అతని కీర్తనలలో నిలిచినవి. వానిలో నింద – స్తుతి రెండూ చోటు చేసుకొన్నవి.

''నీ మరుగు జొచ్చితిని. నన్ను కావుము'' అన్న రామదాసు మనసు దీర్ఘశరణాగతిని పొందినది. శ్రీరామచంద్రునకది జటాయువు పిలుపు, శబరి పిలుపు, సుగ్రీవుని పిలుపు, విభీషణుని పిలుపు. రామలక్ష్మణులు కదలినారు. భద్రాద్రి కంపించినది. గోదావరి ఉప్పొంగినది. తానీషా పడకగది ప్రవేశించినారు. ఆరులక్షల ధనము రాశిపోసినారు. రామదాసు బంధిఖాన ప్రవేశించినారు. రశీదు రామదాసు తలక్రింద పెట్టినారు. అది భక్తుని శరణాగతి. అది భగవంతుని శరణాగతి రక్షణ. భక్తి సత్యము. భగవంతుడు సత్యము. గౌతమి సాక్షిగ, భద్రాచలం సాక్షిగ జరిగిన కథ యిది.

పవిత్ర గౌతమీ జలాలలో స్నానం చేసి పావన భద్రాచల సీతాసౌమిత్రీ సమేత శ్రీరామచంద్రుని దర్శనం చేసుకొంటూ రామదాసులమై పాడుకొందాం.



* * *

# ఇంటింటా సందడే

-గంధం నాగసుబ్రహ్మణ్యం

'నదీ పూజకు వేళాయె' అంటూ పుష్కరాలకు సమయం దగ్గరపడుతోంది. తీర్థరాజైన పుష్కరుడీ సింహరాశిలో గోదావరిని ప్రవేశిస్తున్నాడు. ముక్కోటి దేవతల సమేతంగా వేంచేసే పుష్కరుని కోసం కోటి కన్నులతో ఎదురుచూస్తోంది గోదావరి తీర ప్రజ. అందునా 'వేదంలా ఘోషించే అమరధామమైన రాజమహేంద్రి' వాసులు అటు దేవతలను స్వాగతించడానికి, ఇటు పుష్కర యాత్రీకులకు ఆతిథ్యమివ్వడానికి సంసిద్ధులై వున్నారు. ఇలా సన్నద్ధులవడం ఈనాటిదా? యుగ యుగాలుగా... తరతరాలుగా... సాగుతున్న పారంపర్య సంస్కారమిది.

పుష్కరాలొస్తున్నాయంటే గోదావరి తీరమంతా కళకళలాడుతుంది. రాజమహేంద్రి మరీనూ. ఊరువూరంతా పెళ్ళి పెద్దలా మారిపోతుంది. అందునా ఇల్లిల్లూ కన్యాదాత గృహంలా బాధ్యతతో, కర్తవ్యోన్ముఖవౌతుంది. ఎక్కడిదీ ఆచారం... అనూచానంగా వస్తున్న ఈ అతిథేయ ఆనవాయితీ వెనక అధ్యాత్మికతత్వం ఏదైనా వుందా? గోదావరినది ప్రాదుర్భావ చరిత్రను గమనించినట్లయితే, గోహత్యా పాతకాన్ని పోగొట్టుకొనడం ద్వారా తిరిగి ఈ గోదావరి సీమను సుభిక్షం చేయాలన్న సామాజిక ప్రయోజనం గౌతమ ఋషిలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. ఇదిగో ఆ గౌతముని సంకల్పమే ఈనాటికీ ఈ తీరాన్ని ఉన్ముఖుల్ని చేస్తుంటుంది. ఈ తీరంలో నివశించే వాళ్ళంతా వేల్పులతో స్నేహం చేస్తుండే పుణ్యాజీవులన్నది మరో విశ్వాసం. అందుకే పుష్కర దినాల్లో రాజమండ్రి తీరమంతా ఒక దైవీయశక్తి ఆవరించి వుంటుంది. ఆరుద్ర ఈ తీరం నాడిని ఒడుపుగా పట్టుకొన్నాడు. చారిత్రక నేపథ్యం కన్నా బలీయమైన విశ్వాసాన్ని తట్టి లేపారు. ఈ తీరం 'అమరధామం' అన్నాడు. నిజం, పుష్కర సమయంలో రాజమహేంద్రి ఒక అమరపురి. ఇక్కడ యాచకులన్న వారుండరు. అందరూ ఆతిథ్యమిచ్చేవారే. అందరి గుండెలనిండా 'ఈ నది నాది... ఈ ఉత్సవం మాది' అన్న భావమే నిండి వుంటుంది. ఇంతటి భావైక్యాన్ని సాధించి పెట్టిన తల్లి గోదావరమ్మకు శతకోటి నమస్కారాలు.

పుష్కరాల్లో రాజమండ్రి నగరం ఒక అమ్మలా మారిపోతుంది. ఒక తండ్రిలా బాధ్యత తీసుకొంటుంది. ఒక రాజులా శాసిస్తుంది. ఒక భృత్యుడిలా సేవిస్తుంది. ఒక సైనికుడిలా పారా కాస్తుంది. ఎన్నెన్నో కార్యాలను ఒక్కసారి నిర్వర్తిస్తుంది. పైపెచ్చు, తన ఇంటికి వచ్చే బంధువర్గాన్ని ఆదరిస్తూ, స్వాగతిస్తూ, వారితో తమ అనుబంధాన్నీ, ఆప్యాయతనూ కలబోసుకుంటూ మరికొంత సమయంలో నగరానికి వచ్చే యాత్రీకుల్ని సేవించడం ఇక్కడి వారికి గొప్ప అనుభూతి. పన్నెండేళ్ళ కొకసారి నగరవాసులకు గోదావరి కల్పించే ఒక అద్భుత అవకాశం. గోదావరమ్మ ఇక్కడి వాళ్ళకు ధర్మాచరణను, కర్తవ్యనిష్ఠను నేర్పుతుంది. ఉన్నదాంట్లో కొంత ఎదుటివారికి ఇవ్వడాన్ని తెలియజేస్తుంది. త్యాగం అంటే ఏమిటో చవి చూపిస్తుంది. మనిషిగా పుట్టినందుకు సార్థకత ఏమిటో స్పష్టం చేస్తుంది.

కేవలం తన ఇల్లూ, తన సంసారం, తన వాళ్ళూ అని గిర గీసుకొని కూర్చోకుండా, 'మన' అనే వసుధైక భావనను చిగురింపజేస్తుంది. పల్లవింపజేసి, ఈ మహాసంరంభం ముగిసాక ప్రతీవారి గుండెల్లో తియ్యని అనుభూతిని పండిస్తుంది. మనసు పుటల్లో భద్రపరుస్తుంది. చిన్నప్పటి పుస్తకంలో దాచుకొన్న నెమలి కన్నులా - మృదువుగా, మధురోహలా, పుష్కరంనాటి స్మృతులంటూ ప్రతివారికీ, ప్రతీ సమూహానికి వయక్తికంగా, సామాజికంగా మిగులుస్తుంది. భావితరాలకు స్ఫూర్తినిస్తుంది. అందుకే పుష్కరం అన్నది ఒక సామాజిక చైతన్యానికీ, ఒక సమూహశక్తికి ప్రతీకగా నిలుస్తోంది.

పుష్కరం వస్తోందనే సరికే నగరంలోని అన్నివర్గాల ప్రజలూ ఒక విధమైన వత్తిడికి లోనవుతారు. ఇది స్వచ్ఛందంగా హృదయాంతరాళాల్లోంచి దూసుకొచ్చే ప్రణాళిక. వర్తకులు నగరానికి అవసరమైన నిత్యావసరాలు పుష్కలంగా సమకూర్చుకుంటారు. ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకొంటూ కొంత సేవాభావాన్ని ప్రదర్శించి - లాభాపేక్ష లేని విధంగా విక్రయాలు సాగిస్తారు. నిజానికి సంబరాలు, జాతర్లూ వస్తే జనాల్ని దోచుకోవడం జబర్దస్తీగా సాగుతుందంటారు. కానీ, రాజమండ్రి వర్తకలోకం అలాంటి అపప్రథలకు ఆమడదూరంలో వుండి ఇటు ప్రజల చేత, అటు యాత్రీకుల చేత శభాషనిపించుకొంటానికే తాపత్రయపడుతుంది. హోటళ్ళు, వసతిగృహాలూ అంతే. అన్నిటికన్నా ఆశ్చర్యం, నదీతీరాన్ని ఆశ్రయించి వుండే పురోహిత మండలి - స్వచ్ఛందంగా ముందుకొచ్చి - ఎంతో త్యాగబుద్ధిని ప్రదర్శించి - తీర్థవిధులకు, అపరకర్మలకు, ఇతరత్రా జరిపే దానధర్మాలకు రాబట్టే రుసుముల విషయంలో 'సరసం'గా వ్యవహరిస్తుంది.

పుష్కరమంటే ముందు ఈ రెండు వర్గాలనీ ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందో - లోతుగా ఆలోచిస్తే - పదిరాళ్ళు సంపాదించుకొనే అవకాశాల్ని సైతం రాజమండ్రి ప్రజలు ఎలా స్వచ్ఛందంగా వదులుకొంటారో తెలియజెప్పడానికే. ఇంతకన్నా- పౌరులంతా నగరపాలకులు ఏం అడిగితే, దానికి ఒప్పుకొంటూ - నగరాన్ని అందంగా తీర్చిదిద్దే కృషికి చేయూతనందిస్తారు. ఇక్కడ అధికారదర్పం కన్నా - జనం స్పందించే తీరు గొప్పది.

ఇక పుష్కరాలకు నగర ప్రజ వివిధ స్వచ్ఛంద సంస్థల రూపంలో అందించే తోడ్పాటు - వెయ్యి ప్రభుత్వాలు కల్పినా సాధించలేని, విలువకట్టలేని విధంగా వుంటుంది. కొందరు సత్యసాయి సేవా సంస్థ, కల్కిభగవాన్ ఆధ్యాత్మిక సంస్థ, సుందరసత్సంగ్, రెడ్‌క్రాస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ రూపంలో స్నానఘట్టాలలో రేయింబవళ్ళు బృందాలవారీగా బహుముఖాలుగా సేవలందిస్తారు. స్నానాలకోసంవచ్చే వృద్ధులను చేయిపట్టుకొని - జాగ్రత్తగా స్నానాలు చేయిస్తారు. వాళ్ళ పిల్లల్ని భద్రంగా చూస్తారు. వాళ్ళ సామాన్లు భద్రపరుస్తారు. రేవులలో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుంటారు. సమాజంలో వాళ్ళెంతటి గొప్ప హోదాల్లో వున్నా - చీపురు పట్టుకొని - రేవుల్లో మెట్లు తుడిచేటప్పుడు వాళ్ళు కేవలం 'సేవకు' నియోగించబడ్డ వాళ్ళే. రేవుల్లో ఇందరు కళ్ళింతలుగా చేసికొని కంటికి రెప్పలా కాపాడుకొస్తుంటే... ప్రభుత్వం వారి కెమెరా కన్ను ఏపాటిది?

ప్రతీసారీ, గజ ఈతగాళ్ళను ప్రభుత్వం నియోగించేది. ఈసారి మత్స్యకార కుటుంబాలకు చెందిన యువకులు స్వచ్ఛందంగా ఆ సేవకు ముందుకొచ్చారంటే... పుష్కరం వాళ్ళచేత చేయించేది 'ఉడుతసాయం'గానే భావించగలమా?

లయన్స్, రోటరీ, జేసీస్ లాంటి అంతర్జాతీయ సేవా సంస్థలూ, భారత్ వికాస్ పరిషత్, జెట్ వికాస తరంగిణి లాంటి జాతీయ సంస్థలు స్నానఘట్టాల వద్ద క్లోక్‌రూమ్స్ నిర్వహిస్తాయి. పిల్లలకు పాలు అందిస్తాయి. క్యూలో బారికేడ్లు అతిక్రమించ కుండా యాత్రీకులకు వేళకు ఆహారపొట్లాలు అందిస్తాయి. ఏంజేసినా - అమ్మ మనసుతోనే అంకితభావంతోనే. యాత్రీకులు తినిపారేసే ఆకులు, ప్లాస్టిక్ గ్లాసుల్ని సైతం సేకరించి, నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగంవారు సమకూర్చే సంచార శకటాలకు అందించడంలో ఈ సంస్థల ప్రతినిధులు సైతం వెనుకాడరు.

చాలామంది వ్యక్తిగతంగా సమకూర్చిన విరాళాలతో అనేక ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలు సామూహిక అన్నదాన శిబిరాలు నిర్వహిస్తాయి. 'ఇంటింటికో పూవు ఈశ్వరునికో మాల'గా పదిమంది కలిస్తేనే - ఒక మహోద్యమమవుతుందన్నట్లు, అందరూ కల్సి రోజూ వేలల్లో, లక్షల్లో పిండివంటలతో భోజన సదుపాయం కల్గజేస్తుంది. పుష్కర రోజుల్లో అన్నదానం చేస్తే, తమ పెద్దలకు ఊర్ధ్వలోకాల సంప్రాప్తిస్తాయన్న 'నమ్మికే' ఈ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేస్తుంది.

ఇక, ధార్మిక సంస్థలు ఆధ్యాత్మికోపన్యాసాల ఏర్పాటులో భాగస్వామ్యం వహిస్తాయి. సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందిస్తాయి. కళాకారులు పుష్కరుని పేరుతో ప్రత్యేక రూపకాలు రూపొందిస్తారు. పుష్కర సాంస్కృతిక వేదికపై ప్రదర్శించడం ద్వారా తమ ఆధ్యాత్మిక, ధార్మిక జీవనాభిలాషను వ్యక్తీకరిస్తుంది ఈ వూరి ప్రజ.



ఇవన్నీ ఒక ఎత్తైతే, పుష్కరాలకు ఆధ్యాత్మికతత్వాన్ని ఆపాదించి, మతపరమైన విశ్వాసాల్ని ఉద్దీప్తం చేసే కార్యకలాపాలు విశేషంగా రూపుదిద్దుకొంటాయి. మతాధిపతులు, పీఠాధిపతులు, జగద్గురువులు ఈ తీరానికి తరలివచ్చి, చతుర్మాస్య దీక్షలకు సంకల్పిస్తారు. ఈ నేలను, ఈ గాలిని పునీతం చేసే ఇలాంటి క్రతువులకు ఆలంబన ఈ 'నీరే' కదా! కంచి కామకోటి పీఠ జగద్గురువులు శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామి, బాలస్వామి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వాములవారలు, శ్రీ రామానుజ మతాధీశులు శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్‌స్వామివారు, ఏర్పేడు స్వామి శ్రీ విమలానంద భారతీస్వామి ఈ పుష్కరాల్లో ఇక్కడ చాతుర్మాస్య వ్రతం చేయాలని సంకల్పించారు. ఈ విధంగా ఈ తీరవాసులే కాకుండా, పుష్కరాలకు వచ్చే భక్తకోటికి సైతం ధార్మిక చింతనను ప్రసాదిస్తున్నారు. ఇంతటి మహనీయులకు అవసరమైన సమస్త సదుపాయాలు కల్పించడానికి పూనుకోవడం - సామాన్య విషయం కాదు. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో స్థానిక ప్రజలు నిర్వాహకులకు అందించే తోడ్పాటు వాళ్ళల్లో యుగయుగాలుగా గోదావరి పాదుకొల్పిన సంస్కారం ప్రతిబింబిస్తుంది. పుణ్యకార్యాల్లో పాలుపంచుకోవాలన్న తపన ప్రతిఫలిస్తుంది.

ఆఖరిగా ప్రకృతి రాశులు అందించే ఇంతటి మహత్తర అవకాశాల్ని పుణికి పుచ్చుకొని హిందూమత ప్రచారం పెద్ద ఎత్తున ఈ తీరం వెంబడి సాగుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం, రామకృష్ణ మిషన్, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ, సత్యసాయిసేవా సమితి, దాసాశ్రమ సేవాకేంద్రం, కల్కిభగవాన్ సంస్థ, బ్రహ్మకుమారీస్ సంస్థలు పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచురణను చేపట్టి చౌకలో గ్రంథ విక్రయం గావిస్తున్నాయి. పుష్కరాలలో ధార్మిక ప్రచారానికి ఇచ్చే ప్రాధాన్యత ప్రత్యేకంగా పేర్కొనదగినది. అందుకే, గోదావరిని చూస్తుంటే....

భుక్తమిది నాకు, నాలోని రక్తమిదియె
పానమిది నాకు, మాటాడప్రాణమిదియె
ఊరి సిరి నాకు నాలోని ఊపిరిదియె
నాకు సర్వస్వప్రదానమీ నదియె జేయు

అంటూ సన్నిధానం వారు 'ప్రాణహిత'గా గోదావరిని సంభావించారు. ఇది అక్షరసత్యం.

* * *

# ఋగ్వేదంలో నదులు

కె.వి.ఎస్.ఎస్. శాస్త్రి

జన్మను ప్రసాదించిన తల్లి, జన్మభూమి స్వర్గము కంటె గొప్పవి. వేదభూమి, కర్మభూమి, యజ్ఞభూమి అయిన భారతదేశం మనకు మాతృభూమి. పూర్వ జన్మలలో చేసిన పుణ్యఫలములవల్లనే భారతదేశంలో జన్మించుట జరుగుతుంది. దేవతలు కూడ భారతదేశములో జన్మించి, జన్మలను చరితార్థము చేసుకోవాలని భావిస్తారు. అందుచేతనే మన దేశంలో దైవాంశలతో పుట్టిన ఋషులు, మహామహిమాత్ములైన పాలకులు ప్రాచీనకాలమునుండి కనిపిస్తున్నారు. వారి వల్లనే భారతదేశంలో భక్తి - జ్ఞాన - వైరాగ్యములతో కూడిన ఆధ్యాత్మిక జ్ఞానసంపద బహుముఖ ప్రజ్ఞతో వృద్ధి పొందుతూ, ఖండ ఖండాంతరాళములలో, అందరికి ప్రాప్య వస్తువుగా కనిపిస్తోంది.

దీనికంతటికి మూలకారణము - భారతదేశము యొక్క నగ-వన-నదీ-తీర్థ కలితమైన ప్రకృతి. ఈ ప్రకృతి రామణీయకతను ఋష్యంశములలో జన్మించిన బంకించంద్ర చటర్జీ (వందేమాతరం), మహ్మద్ ఇక్బాల్ (సారే జహాఁసె అచ్ఛా), రవీంద్రనాథ్ టాగూరు (జన గణ మన) మొదలగు కవిపుంగవులెందరో లోకోత్తరాహ్లాద జనక భావనతో భావించి, గీతాలను రచించి, జరామరణ భయములు లేకుండా, యశఃకాయములలో నేటికినీ జీవిస్తున్నారు.

రససిద్ధుడైన రవీంద్రనాథ్ టాగూరు భారతదేశ ప్రశస్తిని ''జనులందరి మనస్సులకు అధినేతవు. భారత భాగ్య విధాతవు అయిన నీకు జయమగుగాక. పంజాబు, సింధు, గుజరాత్, మహారాష్ట్ర, ద్రావిడం, ఉత్కళ, వంగ దేశాలతోను, వింధ్య హిమాలయ పర్వతాలతోను, యమునా, గంగా ప్రవాహాలతోను ఉవ్వెత్తుగా లేచే సముద్ర తరంగాలతోను శోభించే ఓ భారతభాగ్య విధాతా! వాటికి నీ శుభనామం ఉద్బోధ కలిగిస్తుంది. అవి నీ ఆశీస్సులు అర్థిస్తాయి. నీ జయ గాథల్ని గానం చేస్తాయి. సమస్త జనులకు మంగళ ప్రదాతవు. భారత భాగ్య విధాతవు. అయిన నీకు జయమగుగాక! జయమగు గాక! జయమగు గాక!'' అని తెలియజేసినాడు. ఇతనికి వైదిక సాహిత్యంలో అపారమైన పాండిత్యముంది. అందువల్లనే పైన పేర్కొన బడిన భావాలను రస-రమ్య-గీతంగా మలచాడు రవీంద్రనాథ్ టాగూరు.

ఈ గీతములో యమున, గంగ అను నదుల స్తుతి కనబడుతోంది. ఈ నదుల ప్రశస్తి వైదిక సాహిత్యంలో బాగుగా కనబడుతోంది. అందున ఋగ్వేదంలో నదుల సంప్రత్యయము (స్థిర విశ్వాసము) పుణ్యతీర్థములు శైత్య పావనత్వాది విషయములతో కన్పట్టు చున్నది.

ఋగ్వేదంలో పదవ మండలంలోని 75 వ సూక్తములో మొదటి ఋక్కులో నదీస్తుతి కనబడుతోంది. అందు--

[illegible]

ప్రియమేధ పుత్రుడైన సింధు క్షితుడు నదులు ఏడు ఏడు నదులుగా ఏర్పడి భూమి యందు, ఆకాశమునందు, స్వర్గమునందు ప్రవహించాయని, వాటిలో ''సింధువు'' అనునది అన్ని నదులను దాటి ప్రవహిస్తోందని చెప్పినాడు. ఈ సింధునదీ యొక్క ప్రాశస్త్యము--

[illegible]

అను ఋక్కులలో చెప్పబడింది. ఈ ఋక్కులకు కావ్య తీర్థ శ్రీ నేమాని వేంకట నరసింహశాస్త్రిగారి ఆంధ్రానువాదం ఈ విధంగా కనబడుతోంది.

గీ. [illegible]
మును నొసంగఁ బ్రతి నరుగుచుండు
వరదువలన వరుసఁ దమమాఁడు నీవార్థ
మును విస్తృతముగ నొసఁగ జేసెఁ

గీ. సింధువా! నీవు పుడమిపై శ్రీలొసంగు
మార్గమునఁ బోవుచుండు వనర్గళముగ
నతి సముచ్ఛ్రిత పథమున నరుగుచుంట
సర్వ జగముల రక్షింపఁ జాలుచుందు! 10-75-2

గీ. భూమిపై నిస్వనముఁ బుట్టుచు దివమందు
వ్యాప్తిఁ జెందుచుండె వలసినట్లు
సింధు వూర్మివలన బంధుర వేగంబుఁ
బొందఁ జేయుచుండుఁ బూర్ణ మహిమ.

గీ. విపుల శబ్దంబుఁ జేసెడు వృషభమట్లు
అరుగుచుండునో! యట్టులే యంతరిక్ష
భాగముననుండి వృష్టులు స్వనమొనర్చు
భంగి సింధువు శబ్దముల్ పరిఢవిల్లు. 10-75-3

గీ. పుత్రకుని మాతలట్టులు పూర్ణశబ్ద
మును నొనర్చెడు నదులెల్ల ఘనపయః ప్ర
పూర్ణ ధేనువులంబోలి పూత సింధు
వా! నినుంజేరి యున్న వత్యంత ప్రీతి.



ఈ సింధునది, ప్రధాన భూతములైన గంగ - యమున - సరస్వతి - శుతుద్రి - పరుష్ణి - అసిక్ని, ఆర్జికేయ అను నదులతోను, అసిక్ని నది యొక్క ఉప నదులు (అవయవ భూతములు) అయిన మరుద్వృధ, వితస్త, సుషోమ అను నదులతోను ప్రవహిస్తోంది.

ఈ బుక్కునకు సాయణాచార్యులు ఈ రీతిగ భాష్యమును వ్రాసినారు:

''అత్ర ప్రధానభూతాః సప్త నద్యస్తదవయవభూతా నద్యస్తిస్రః స్తూయంతే। హే గంగే హే యమునే। హే సరస్వతి హే శుతుద్రి హే పరుష్ణి। హే అసిక్న్యా అవయవ భూతయా సహితే మరుద్వృధే హేవితస్తయా సుషోమయా చ సహితే ఆర్జీకీయే త్వం చ ఏవం సప్త నద్యో యూయం మే స్తోమం స్తోత్రమస్మదీయమ్ ఆసచత ఆసే వధ్వమ్।శృణుహిశ్శృణుత చ।''

ఓ గంగ! యమున! సరస్వతి! శుతుద్రి! పరుష్ణి! అసిక్నితో కూడుకొనిన మరుద్వృత! ''వితస్తాసోమ'' లతో కలసిన ఆర్జీకయ! సప్త నదులగు మీరు మా స్తోత్రమును వినండి అనిపై బుక్కునకు వివరణ. పై బుక్కునకు భాష్యము వ్రాయుచు సాయణాచార్యులు ఆర్జీ కీయాది నదుల వివరణ గ్రంథాన్ని సూచించినారు.

''ఆర్జీ కీయాయా వితస్తయా సుషోమయా చ సాహిత్యం నిరుక్తే ఉక్తం - 'వితస్తయా చార్జీకీయ ఆ శృణుహిసుషోమయా చ' ఇతి। అత్ర 'గంగా గమనాత్' (నిరు. 9-26) ఇత్యాది నిరుక్తం ద్రష్టవ్యమ్.

ఆర్జీక - వితస్త - సుషోమనదుల సాహిత్యమును యాస్కుడు నిరుక్తంలో బాగుగా వ్రాశాడు.

సింధునది క్రమణ శీల అయిన గోమతి నదిని పొంద గోరి, మొదట తృష్టామ నదితోను తరువాత సుసత్వ-రస-శ్వేతి-త్య- కుభ - మేహత్న్వి నదులతో కలిసి ప్రవహించింది.

ఈ సింధునది యొక్క గోమతీనది లబ్ధిని సాయణాచార్యులు--

-అని తెలియజేసినారు।



ఓ సింధువా! నీవు క్రమణీయ యగు గోమతికి ప్రతి స్పర్థినిగా పోవుటకు పర్వతమునుండి అవరోహించి మొదట తృష్టామనదిని కలిసికొంటివి. పిదప సమాన రథమును అధిరోహించి సుసర్తితోను, రసతోను, శ్వేతీతోను, కుభతోను,

మోహంతితోను కలిసికొనుచున్నావు అని పై ఋక్కు తెలియ జేయుచున్నది.

ఊర్ణవతి, సీలమ అను రెండు శబ్దములు సింధువు నకు విశేషణములని సాయణార్యులు, రెండు నదులని గ్రిఫిత్‌గారు, ''సీలమ'' అను లతలతో సింధునది కూడి యున్నదని సూచించిరి. ఊర్ణవతి, సీలమ అను పదములను ఈ క్రింది ఋక్కులో దర్శింపవచ్చును:

స్వశ్వా సింధుః సురథా సువాసా హిరణ్య
యీ సుకృతా వాజినీ వతీ
ఊర్ణావతీ యువతిః సీలమావత్యు
తాధి వస్తే సుభగా మధువృధమ్
ఋగ్వేదం 10 మం 75 సూ 9ఋ

దీనికి శ్రీ నేమాని వారి ఆంధ్రానువాదం ఈ విధంగా వుంది:

సీ. శోభనాశ్వములతో సాగినాలకు సింధువు
కమనీయ వస్త్రముల్ గాంచియుండు
ఉత్కృష్ట రథముతో నొందియుండు సింధువు
కమనీయ వస్త్రముల్ గాంచియుండు
ఉన్న యౌవనము పొందిన సింధువు
కమనీయ వస్త్రముల్ గాంచియుండు
స్వర్ణ భూషల చక్కని సింధువు
కమనీయ వస్త్రముల్ గాంచియుండు

గీ. సుస్థిరమౌ సూర్ణములతోడ నమరియుండు
మాధుర్యతయుఁగు నట్టి సింధువునకు
పుష్పసుభగ వృక్షఁ బొందు మంచి వృక్ష
లసుగొప్ప దానికి వెలుఁగుచుండు

భావనా విశేష మహిమతో ఈ నదీస్తుతి (10-75)రసరమ్య గీతంగా బాగుగా కనిపిస్తోంది. ఆలోచనామృతాన్ని పంచి పెట్టుతోంది.

## గంగానదీ స్తుతి

అధి బృబుః పణీనాం వర్షిష్ఠే మూర్ధన్న స్థాత్।
ఉరుః కక్షోన గాంగ్యః॥
ఋగ్వేదం 6 మం 45 సూ 31 ఋ

ఈ ఋక్కులలో గంగ యొక్క ఉన్న తకూటము వలె పణుల మధ్య మందు ఉచ్చ స్థానమున ''వృవు'' అనువాడు నివసించెనని చెప్పబడెను.

ఋగ్వేదమునందలి మూడవ మండలమున 33వ సూక్తము నదీ సూక్తము. ఈ సూక్తములో 13 ఋక్కులు ఉన్నాయి. ఈ సూక్తమునకు ఋషి:-విశ్వామిత్రుడు, 4,6,8,10 -నదులు (ఋషికలు), దేవత నదులు 4,8,10- విశ్వామిత్రుడు, 6,7 ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్; 13 - అనుష్టుప్.

ఈ సూక్తములోని--

ప్రపర్వతానాముశతీ ఉపస్థాదశ్వే
ఇవ విషితే హాసమానే
గావేవ శుభ్రే మాతరా రిహాణే
విపాట్ ఛుతుద్రీ పయసా జవేతే॥

ఇన్ద్రేషిత ప్రసవం భిక్షమాణే
అచ్ఛా సముద్రం రథ్యేవ యాథః।
సమారాణే ఊర్మిభిః పిన్వమానే
అన్యా వామన్యామ ప్యేతి శుభ్రే॥

అచ్ఛా సింధుం మాతృ తమా మయాసం
విపాశముర్వీం సుభగా మగన్మ।
వత్స మివ మాతరా సంరిహాణే
సమానం యోని మను సంచరన్తీ।

ఏనా వయం పయసా పిన్వమానా
అను యోనిం దేవకృతం చరన్తీః
నవర్తవే ప్రసవః సర్గ తక్తః
కిం యు ర్విప్రో నద్యో జోహవీతి॥
ఋగ్వేదం 3 మం 33 సూ 1-4 ఋ

ఈ ఋక్కులకు కావ్య తీర్థ శ్రీ నేమాని వేంకట నరసింహ శాస్త్రి గారి ఆంధ్రానువాదము.

సీ. మంచి రాభివియుక్త మాస్వ హయములఁ
బోలి సర్వతః ప్రవహించు సరస నదులు
గోద్వయంబో యను గూర్చుచు శుభములఁ
వెలుఁగుచు సంతస మెలఁగు నదులు
వత్స లేహనమును వాంఛించి పరుగిడు
ధేను ద్వయము మాట్కిఁ దిరుగు నదులు
తటినులవలె సముద్రాభిముఖంబుగా
గమనంబు సేయంగఁ గలుఁగు నదులు.

గీ. ఘన శతుద్రు విపాశాఖ్య లనెడు నదులు
పర్వతమునందు జనియించు పరమ సింధు
సంగమంబును గాంక్షించి చనెడు నదులు
శక్రుని ప్రేరణంబున సాగు చుండు.

క. మీలో నొక్కరితో నొక
రాలోల జలంబు లొప్ప నైక్యమును మహో
స్థూల నదులారా! భ్రములన్
గూలంకషగ మనులగుచుఁ గూర్తురు శోభన్

క. మాతృ సమాన శతద్రువు
పూత విపాశాఖ్య నదిని బొందెదము నదీ
స్రోతస్సులు వత్సమునకుఁ
బ్రీతములగు గోద్వయంబు విధమునఁ జనెడున్.

క. వీరా! స్నాతులమగు చుం
జేరు చునున్నాము దివ్య సిద్ధపదము నీ
వారాసి మమ్ము వారింపకు
మోరీ! మమ్మేలఁ బిలుచుచుంటివో! చెపుమా!

గంగానదీ తీరమున దానము చేయుటవలన మానవుడు పరిపూతాత్ముడగును.

[illegible]

ఋగ్వేదం 6 మం. 45 సూ. 31 ఋ.

సరస్వతి మొదలగు ప్రఖ్యాతములైన పుణ్య నదీ తీరములందు యజ్ఞాది వైదిక కర్మలను ఆచరించుట చాలా మంచిది.

ఋగ్వేదం 8 మం. 72 సూ. 6 ఋ.

సరస్వతీ నది శ్రేష్ఠమైన తల్లిగా సంబోధింపబడినది. ''అంబితమే దేవతగా కూడ (ఋ.వే. 2-41-16) సంబోధింపబడినది.

కొన్ని ప్రదేశములలో పావన శక్తి కలదను భావము వేదములలో కన్పట్టు చున్నది. నదిలో కొన్ని పవిత్ర స్థలము లుండును. అవి మిగిలిన నదీ ప్రదేశముల కంటె ఎట్లు పవిత్రములో అక్కడ స్నానము చేయువారు సాటివారిలో గొప్పవాడగుచున్నాడు.

తైత్తిరీయ సంహిత

అనేక విధములైన నదులు ఋగ్వేదమున చేతన ధర్మారోపణముచేత దేవతలుగా ప్రస్తావింపబడినవి. ఒక సూక్తమున (10-75) సింధునది, మరియొక చోట (3-33) స్వస్వరూపములగు విపాట్ శుతుద్రులును వర్ణింపబడినవి. అందు సరస్వతి సర్వోత్తమయగునదీ దేవత. దీనియందు ఇతర నదులందులకంటె చేతన ధర్మారోపణము హెచ్చు. నదీ దేవతగా వర్ణింపబడిన సరస్వతి, బ్రాహ్మణములలో వాగ్దేవతా పదమును పొంది, పురాణాదులలో వాగ్బుద్ధులకు అధిదేవత యని భావింపబడి, చివరికి బ్రహ్మగారికి పట్టమహిషి అయినది.

సామాన్యముగ ఋగ్వేదంలో ఇరువదియైదు నదులు నిర్దేశింపబడుచున్నవి. అందు రెండు మూడు తప్ప మిగిలిన వన్నియు శాఖోపయుక్తమగు సింధునది యొక్క సంస్థాపన విశేషమును అనుసరించియున్నవి. వానియందే ఐదు నదులు పంచాపదేశమున ఐదు పాయలుగా ప్రవహించుచు చివరికి ఒక్కటియై సింధునదిలో కలియును. వితస్త, అసిక్ని, పరుష్ణి, విపాట్, శుతుద్రి అనునవియే ఆ ఐదు నదులు. ఇందు అసిక్ని తరువాత 'చంద్రభాగ' అని వ్యవహరింపబడినది. 'పరుష్ణికి' తరువాత 'ఇరావతి' అని ఇప్పుడు 'రవి' అనియు వ్యవహారము. సింధు శబ్దము ప్రప్రథమంగా సంస్కృత భాషలో ఆర్యుల నివాస భూమికి పశ్చిమమున ఎల్లగా నున్న నదీ మాత్రమునకు వాడబడుచుండెను. తరువాత ఆ శబ్దమునే ప్రాచీనార్యులు భారత వర్షమునకంతకును పేరుగా ఉపలక్షణ విధిని వ్యవహరింపసాగిరి. గ్రీకు లిద్దానినే 'ఇండోస్' అను పదమునకు బదులుగా స్వీకరించిరి. సింధునదీ లక్షితమగు 'ఇండోస్' అను శబ్దమే 'ఇండియా' అను పేరొందుటకు హేతువైంది. అర్వాచీనులగు పారసీకులు మాత్రము సింధునదీ పరసరాత్మకమగు వింధ్య హిమాచల మధ్య భాగమును 'హిందూస్థాన' మని వ్యవహరించిరి. మనం దైనందిక శ్రౌత-స్మార్తాది నిత్య కర్మలలోని కలశారాధనంలో నదులపేర్లను స్మరిస్తాం--

గంగే చ యమునే చైవ గోదావరి [illegible]
నర్మదే సింధు కావేరి [illegible]



# సంస్కృత కావ్యాలలో గోదావరి

-డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయ రావు

మహాకావ్యమైన వాల్మీకి రామాయణంలో ప్రస్తావన అరణ్యకాండలో వస్తుంది. రాముడు అగస్త్యుణ్ణి ''మేము ఆశ్రమం నిర్మించుకొని సుఖంగా నివసించడానికి అనువైన సౌదకమైన ప్రదేశాన్ని చెప్పండి'' అని అడగ్గా, ఆయన రాముడితో ''గోదావరీ తీరంలో పంచవటిలో నివసించండి'' అని చెపుతాడు, గోదావరీ తీరంలో సీత క్రీడించగలదనీ, అక్కడ మూలములూ, ఫలాలూ సమృద్ధిగా లభిస్తాయనీ, అనేక విధాలయిన పక్షులు గుంపులు గుంపులుగా తిరుగుతుంటాయనీ, జనసంచారం లేక పుణ్యమై, రమ్యమై ఉంటుందనీ అంటాడు అగస్త్యుడు. రాముడు సీతాలక్ష్మణులతో పంచవటికి వెళ్ళి, అక్కడ లక్ష్మణ నిర్మితమైన ఒక పర్ణశాలలో నివసిస్తాడు.

ఒకనాడు తెల్లవారుజామున రాముడు రమ్యమైన గోదావరీ నదికి సీతాలక్ష్మణులతో స్నానార్థం వెడతాడు. సీతారామలక్ష్మణులు గోదావరిలో సుస్నాతులై తజ్జలాలతో పితృతర్పణం, దేవతాతర్పణం చేసి, ఉదయించిన సూర్యుణ్ణీ, ఇతర దేవతలనూ ఏకాగ్ర చిత్తంతో స్తుతిస్తారు. (కృతాభిషేకః స రరాజరామః సీతాద్వితీయః సహలక్ష్మణేన, కృతాభిషేకో గిరిరాచ పుత్ర్యా రుద్రః సనన్దీ భగవానివేశః) సీతాలక్ష్మణ సమేతుడై స్నానంచేసిన రాముడు పార్వతీ దేవితో స్నానంచేసి నందికేశ్వర సహితుడైన భగవంతుడు రుద్రుడిలా ప్రకాశించాడు. స్నానానంతరం వారు గోదావరీ తీరం నుంచి తమ ఆశ్రమానికి వెళ్ళారు.

రావణ వధానంతరం రాముడు సపరివారుడై పుష్పక విమానంలో అయోధ్యకు తిరిగివస్తూ తాము అరణ్యవాస సమయంలో తిరిగిన ప్రదేశాల నన్నింటినీ గురుతిస్తూ సీతకు చూపిస్తాడు. ఆ విధంగా గోదావరిని కూడా సీతకు చూపుతూ - ఇదే శుభయూ, రమ్యయూ ప్రసన్న సలిలయూ అయిన గోదావరి చూడు'' అంటాడు. (ఏషా గోదావరీ రమ్యా ప్రసన్న సలిలా శుభా). ఇదీ వాల్మీకి రామాయణంలో గోదావరీ ప్రస్తావం.

శ్రీకంఠ పదలాంఛన మహాకవి భవభూతి విరచితమైన ఉత్తర రామచరిత నాటకంలో గోదావరి ప్రస్తావన విశేషంగా ఉంది. అందులో గోదావరి కేవల జడస్వరూపిణి అయిన నదిగా గాక స్త్రీ రూప ధారిణిగా చిత్రించబడింది.

మురళానది తమసానదితో -- సీతకు సంభవించిన కష్ట వినిపాతం వల్ల ఏర్పడిన కరుణరసం రాముడి గంభీరమైన హృదయంలో నిండి కాగి పుటపాక ప్రతీకాశంగా తయారయిందనీ, అంచేత రాముడు చిక్కి శల్యమైనాడనీ, అతడు సేవా పాతివ్రత్య పరీక్షకైన అగ్ని పరీక్షానంతరం లంక నుండి అయోధ్యకు తిరుగు ప్రయాణంలో తాము అరణ్యవాసకాలంలో పంచవటీ వనంలో సీతా సహవాస సాక్షిభూతాలైన ఆయా ప్రదేశాలను తప్పక చూస్తాడనీ, ఎంతటి గంభీరుడైనా అనర్థ పరంపరలు అడుగడుగునా అతడికి కలుగు తాయనీ, అందుచే అతడిని కనిపెట్టుకొని యుండవలసినదిగా గోదావరితో చెప్పటానికి తాను అరుంధతి చేత నియుక్తురాలయినట్లు చెపుతుంది.

అది కారణంగా మురళానది గోదావరితో ''ఓ తల్లీ! నీవు అప్రమత్తురాలివై ఉండి రాముణ్ణి నీ అలల గాలులచేత ఎగయు వలితుంపురులతోనూ, తమ్మిపూల కమ్మతావులతోనూ, చల్లని గాలులతోనూ సేద దీర్చు'' అని కోరుతుంది.

వీచీవాతై శ్శీకరక్షోద శీతై
రాకర్షద్భిః పద్మకింజల్కగంధాన్,
మోహేమోహే రామభద్రస్య జవం
స్వైరం స్వైరం ప్రేషితై స్తర్పయంతి

సీతారాములు ఒకరికొకరు తెలియకయే గోదావరీ తీరంలో విహరిస్తూ తాము ఇదివరలో చూచిన బహు గిరిగుహా నిర్ఝరములు గల ప్రదేశాలను మళ్ళీ చూస్తూ ఆ అనుభూతుల్ని నెమరు వేసుకుంటారు.

మురారి కృతమైన అనర్ఘ రాఘవ నాటకంలో గోదావరీ ప్రస్తావం ఉంది. శ్రీరాముడు సీతా పాతివ్రత్య నిరూపకమైన అగ్ని పరీక్ష అయిన పిమ్మట సీతతోను, లక్ష్మణుడితోను, తక్కిన సుగ్రీవాంజనేయాదులైన వానరులతోను, విభీషణుడితోను అయోధ్యకు పుష్పకవిమానంలో తిరిగివస్తూ మార్గమధ్యంలో తామిదివరకు నివసించిన గోదావరీ పరిసర ప్రదేశాలను చూస్తాడు. గోదావరిని చూడగానే రాముడు సీతతో గోదావరికి నమస్కరించు అంటాడు.

అప్పుడు జరిగిన ఒక శృంగార సంఘటను రాముడు సీతకు గుర్తుచేస్తూ ఆమెతో ఇలా అంటాడు.

''సీతా! ఈ గోదావరి తిన్నెలపై నున్న ప్రియంగులతా కుంజాలలో నేను మోదుగు మొగ్గలు దండగా గ్రుచ్చి నఖక్షతముల నోర్వలేని స్తనాలు గల నీ వక్షస్థలాన్ని అలంకరించి పకపకా నవ్వాను. ఇది నేను నీయెడ చేసిన పెద్ద అపరాధం. ఎంచేతంటె అరణ్యవాస కాలంలో కన్యావ్రతాన్ని నియతంగా పాటిస్తూన్న నీకు వ్రతభంగం చేశాను'' మోదుగు మొగ్గలు అచ్చంగా నఖక్షతాల వలనే ఉంటాయి. ''అలా అపరాధంచేసిన నాపై నీకు కోపం వచ్చింది. అయినా నిజంగా వ్రతభంగం కాలేదు కనుక నీ ముఖం సస్మితం అయింది''.

విమానం ముందుకు పరిక్రమించింది. విభీషణుడు రాముడితో (**దేవ, ప్రణమ్యతా మయ మాంధ్ర విషయ లక్ష్మ్యాః సప్తగోదావరీ హార కలా పైకనాయకో భగవాన్ భీమేశ్వరః**) ''ప్రభూ! ఇతడే భగవంతుడైన భీమేశ్వరుడు. ఆంధ్రదేశ లక్ష్మికి సప్త గోదావరి హారభూషణానికి ఏకనాయకుడైన ఈ భగవంతుడికి నమస్కరించు'' అంటాడు.

ఈ భీమేశ్వరుడు నృత్యారంభ సమయంలో ఆరభటీ వృత్తి నాశ్రయించాడు. ఆ వేగోద్ధతికి భయపడిందా అన్నట్లు పార్వతీదేవి శరీరార్ధ భాగంలోంచి జారుకుంది. ఏకపాదశేషంతో భయంకరమైన శరీరపు సగ భాగంతో శివుడట్లే తాండవం చేస్తుంటాడు. వాసుకి కంకాళాలతో పాటు మరికొన్ని ఎముకల్నీ పాముల్నీ అలంకరించుకున్న యీశ్వరుడు యుగాంత కర్మ కారకుడై విరాజిల్లుతున్నాడు.

విభీషణుడి మాటలు విని రాముడు కృతాంజలియై ఇలా అంటాడు.

''నాట్యాంగంగా శివుడు గిరగిరా తిరగనారంభించాడు. పార్వతి భయపడి జారిపోయింది. ఆ లోటును పూరించుకోవడానికి శివుడు తన తాండవాన్ని ఆపాడు, కానీ అప్పటిదాకా గిరగిరా తిరుగుతున్న కళ్ళతో గిరిగిరా తిరుగుతున్న దిక్కుల్ని చూస్తూన్న వాసుకి ప్రభృతులకు మాత్రం శివుడు నాట్యాన్ని ఆపినట్లు నమ్మకం కలగలేదు. వాటికి ఇంకా కళ్ళు దిక్కులూ తిరుగుతున్నట్లే అనిపిస్తుంది. అట్టి ఆ పరమేశ్వరుడు భీమేశ్వరుడికి నమస్కారం''. ఈ విధంగా మురారి తన అనర్ఘ రాఘవ నాటకంలో గోదావరీ తీరంలో సీతా రాముల ప్రణయాన్నీ, సప్తగోదావర భీమేశ్వరుణ్ణీ వర్ణిస్తాడు.

ఇక శ్లేష యమక చక్రవర్తి వేంకటాధ్వరి మహాకవి విరచితమైన విశ్వగుణా దర్శ చంపువులో గంగా యమునాదులైన నదుల నెన్నిటినో వర్ణించినాడు. కాని గోదావరిని వర్ణింపలేదు. అయితే గోదావరీ తీరవాసులైన బ్రాహ్మణుల అతి శివపూజా లోలుపతను ఇలా వర్ణించాడు.

'గోదావరీ తీర బ్రాహ్మణులు తన్నదీ విమల జలాలలో అవగాహనం చేసి సైకతే శివలింగాలను నిర్మించి మిశ్రివాక్షతలతోనూ, పుష్పాలతోనూ, బిల్వపత్రాలతోనూ భక్తితో అర్పిస్తారు'.

**గోదావరీ విమలతీర్థ కృతావగాహాః**
**విశ్లేషు సైకతమయేషు శివం విభావ్య,**
**భక్త్యా తిలాక్షత సుమై రపి బిల్వపత్రై**
**రర్చా మిహావనిసురాః పరికుర్వతే ఉమీ.**

# ప్రశస్తి

**క్రీ.శ. 1369 - భాస్కర భవదూర మహీపతి (బుక్కరాయని కుమారుడు) పోరుమామిళ్ళ చెఱువు నిర్మాణం చేయించినప్పుడు వేయించిన శాసనములోని శ్లోకాలు. కవి లింగయమాచనార్య.**

**అపోవా ఇదగ్ం సర్వమిత్యామ్నాయః ప్రమాణతః**
**జలాదేవాన్న సంభూతః అన్నం బ్రహ్మేతి చ శ్రుతిః**

అంతా నీరే అనడానికి వేదాలే సాక్ష్యం. నీటినుంచి అన్నం సృష్టింపబడుతుంది. అన్నం పరబ్రహ్మము అని వేదాలు చెబుతున్నాయి.

**చరాచర జగద్బీజం జలమేవ న సంశయః**
**కింపునర్బహునోక్తేన జలాధిక్యం వదామ్యహమ్**

చరాచర జగత్తునకు హేతువు నీరే అనడంలో సందేహం లేదు. పలు మాటలు ఎందుకు? నేను నీటి గొప్పతనాన్ని చెబుతాను.

**గంగాధరో హరస్సోపి విష్ణురంభోధి మందిరః**
**బ్రహ్మాజలజ సంభూతః తస్మాత్ సర్వాధికం జలం**

ఈశ్వరుడు గంగను స్వతః ధర్శించాడు. విష్ణువు సాగరంలోనే ఇంటిని చేసుకున్నాడు. నీటిలో పుట్టిన కమలంలో బ్రహ్మదేవుడు జన్మించాడు. అందువలన నీరు అన్నిటికంటే గొప్పది.

**ప్రపా కూపశ్చ వాపీ చ కుల్యా పద్మాకరస్తథా**
**ఉత్తరోత్తరతః తేషాం కోటి కోట్యధికం ఫలం.**

చలివేంద్రం, చేదే బావి, దిగుడు బావి, కాలువ, చెరువు - వీటిలో క్రమంగా ఒకదాని నిర్మాణం కంటే మరొకదాని నిర్మాణం కోటిరెట్లు అధిక ఫలాన్నిస్తుంది.

**చరాచర జగద్రాక్షా యత్తటాకాంబునా భువి**
**తస్య పుణ్యఫలం వక్తుమశక్తః కమలాసనః.**

చరాచర లోకాన్ని రక్షించేది చెరువు నీరే కాబట్టి అటువంటి తటాక నిర్మాణం వల్ల లభించే పుణ్యఫలాన్ని కమలాసనుడు కూడ వర్ణించలేదు.



# రామాయణము - గోదావరి

డా॥ కోలవెన్ను మలయవాసిని

వాల్మీకి గిరి సంభూతా రామసాగర గామినీ,
పునాతి భువనంపుణ్యాం రామాయణ మహానదీ!

అని రామాయణాన్ని నదీవిశేషంతో పోల్చే 'చాటు శ్లోకం' ఇది. మహానదీ! అని కాక ప్రత్యేకించి గంగతో పోలుస్తూ మరొక శ్లోకం కూడా వ్యాప్తిలో ఉంది.

వాల్మీకి గిరి సంభూతా రామాంభోనిధి సంగతా,
శ్రీమద్రామాయణీ గంగా పునాతు భువనత్రయమ్.

పుణ్యనదులతో పురిడించునట్లుగా కవులచే కొనియాడబడే ఈ రామాయణ కావ్యంలో నదుల ప్రస్తావన పలుతావుల్లో కనిపిస్తుంది.

రామాయణ కావ్యగాథకు కార్యక్షేత్రమైన అయోధ్యా నగరం సరయూనదీ తీరంలో ఉంది. ఈ నదీ తీరంలో సీత దశ రథేశ్వరుని కోడలిగా అత్తింట కాపురం నెఱపింది.

గుహుని నావమీద శ్రీరాముడు సీతాలక్ష్మణ సహితుడై గంగానదిని దాటాడు. గర్భవతి, పుత్రవతి అయిన సీత గంగా తీరంలో తన వనవాసాన్ని గడుపుతుంది. ఈ సందర్భంలో సీత గంగాతీరంలో ఒంటరిగా, భర్తతోడు లేక గడిపింది.

ఇక గోదావరీ తీరంలో అలాకాదు. ఒక పుష్కర కాలంపైగా సీతారాములు అన్యోన్యంగా కలిసిమెలసి గోదావరీ నదీ తీరంలో ఉన్నారు. గోదావరిలో స్నానపానాదులు భర్తతో కలిసి సీత ఆనందంగా చేసింది. గోదావరి నుండి సీతాదేవి స్వయం పర్ణశాలకు నీరు తెచ్చినట్లు వాల్మీకి వర్ణన. నాటి జన పదాల్లోని, నేటి తెలుగు దేశభాగంలోని పెద్దనదుల్లో గోదావరి గొప్పది. బమ్మెర పోతన భాగవతంలో దండకారణ్యాన్ని వర్ణిస్తూ ''గౌతమీ వాఃకణ పర్యటన ప్రభూతసాద్గుణ్యము'' అంటాడు. పద్మ పురాణంలో శ్రీ రామాష్టోత్తర శతనామాల్లో శ్రీరాముడు - 'దండకారణ్య పుణ్యకృత్' అని పేర్కొనబడింది.

సీతారాములు ఆదిలో సరయూ నదీ తీర వాసులు. ఆమీద గుహుని నావమీద గంగానదిని దాటి వచ్చారు. ఆ తరువాత యమునానదిని తరించారు. ఆ పిమ్మట చిత్రకూట పర్వత సమీపంలో ఉన్న మాల్యవతీ నది, మందాకినీ నదీ తీరాల్లో బహువారాలు గడపి ఆయా నదీ జలాలను - స్నానపానాదులకు, విహారాది వినోదాలకు వినియోగించుకున్నారు. ఆ మందాకినీ నదినే సరయూనదిగా సంభావించుకోమని రాముడు సీతను సమాశ్వసిస్తాడు. ఆమీద గోదావరి నదిని చేరేలోపల మరికొన్ని నదుల పావన సలిల ప్రయోజనాన్ని పూర్తిగా అనుభవించి గోదావరీ తీరానికి చేరుకుంటారు.

గోదావరీ నదీతీరాన ఆ పుణ్యదంపతుల జీవనం ఎంత మనోహరంగా సాగిందో వాల్మీకి పదే పదే వర్ణిస్తాడు. సీతాదేవికి గోదావరి అంటే ఎంతో ప్రియమైనదని నొక్కి నొక్కి చెప్పాడు. సీత తన కష్టాలు తల్లీ గోదావరీ! అని ఆమెకు విన్నవించుకున్న ఘట్టాలున్నాయి. సీతాదేవికి గోదావరికి గల అన్యోన్యతను అటు వాల్మీకి, ఇటు ఆంధ్ర రామాయణకర్తలూ కూడా ఉదాత్త రసాన్వితంగా వర్ణించారు. గోదావరీ నదికి సీతారామలక్ష్మణులతోగల సంబంధ బాంధవ్యాలను వ్యక్తీకరించడానికి చేసిన చిన్న ప్రయత్నమే ఈ వ్యాసం.

రామాయణంలో మొదటిసారిగా అరణ్యకాండలో గోదావరి ప్రస్తావన వస్తుంది. గోదావరి దర్శనం ఇస్తుంది. సీతారామలక్ష్మణులు చిత్రకూటంనుండి బయలుదేరి అగస్త్యాశ్రమానికి వస్తారు. తమకు నివాసానికి ఏదయినా ఉత్తమమైన ప్రదేశాన్ని సూచించమని అభ్యర్థిస్తారు.అప్పుడు అగస్త్యుడు, ''రామా! ఇక్కడకు సమీపంలో పంచవటి అనే రమ్యమైన ప్రదేశం ఉంది. సీత ఆ ప్రదేశాన్ని చూసి చాలా ఆనందిస్తుంది. చాలా ప్రశంసింపదగిన దేశమది. ఆ పంచవటీ ప్రాంతం ప్రక్కనే గోదావరి ప్రవహిస్తూ ఉంటుంది. కందమూల ఫలాలు సమృద్ధిగా లభిస్తాయి. నానా జాతి పక్షులతో ఆ ప్రదేశం కోలాహలంగా ఉంటుంది'' అని చెప్తాడు. ఆ విధంగా అగస్త్యుని సూచనమేరకు శ్రీరాముడు వనవాస కాలంలో గోదావరీ తీర వాసుడు కావడానికి ఉద్యుక్తుడయ్యాడు.

గోదావర్యా సమీపే చ మైథిలీతత్రరంస్యతే
ప్రాజ్యమూల ఫలశ్చైవ నానా ద్విజగణాయుతః 13-20

అగస్త్యుని దగ్గర వీడ్కోలు తీసుకుని ప్రయాణం సాగించిన సీతారామలక్ష్మణులు పంచవటిని చేరుకున్నారు. మంచి ప్రదేశాన్ని ఎంపిక చేసుకుంటున్నారు ఆశ్రమం నిర్మించుకోవడానికి. ఒక ప్రదేశం చూసి రాముడు ఆశ్రమనిర్మాణానికి ఇది తగిన ప్రదేశమని నిర్ణయించాడు. ఆ సందర్భంలో రాముడు-

ఇయం గోదావరీ రమ్యా పుష్పితై స్తరుభిర్వృతా
హంస కారండ వాకీర్ణా చక్రవాకోప శోభితా
నాఽతి దూరే న చాసన్నే మృగ యూథనిపీడితాః

15-12-13

అంటాడు. ఆ నదిని చూడగానే రాముని అనుభూతి ఇది. ఇదే రమ్యమైన గోదావరీనది. ఒడ్డునే విరగపూచిన చెట్లతో నిండి ఉంది. హంసలు, కారండవాలు చక్రవాకాలు వంటి జల పక్షులతో శోభిస్తోంది. ఆ నది మనకు మరీ దూరంగానూ లేదు. మరీ దగ్గరగానూ లేదు. ఈ ప్రదేశంలో లేళ్ళు మందలు మందలుగా నిర్భయంగా తిరుగుతున్నాయి - అంటూ వివరిస్తాడు. గోదా

వరీ నది నాతిదూరము నాతి సమీపము లేక పోవడం పర్ణశాల నిర్మించుకోవడానికి ఒక కారణంగా రాముడు తన అభిప్రాయాన్ని వివరిస్తాడు ఈ సందర్భంలో. అన్నగారి అనుజ్ఞమేరకు పర్ణశాల నిర్మాణం శీఘ్రంగా పూర్తి చేసాడు లక్ష్మణుడు. ఆ పని పూర్తి కాగానే లక్ష్మణుడు చేసిన మొదటి కార్యక్రమం - గోదావరి నదికి వెళ్ళి స్నానం ఆచరించడం.

స గత్వా లక్ష్మణ శ్శ్రీమాన్నదీం గోదావరీం తదా
స్నాత్వా పద్మాని చాదాయ సఫలః పునరాగతః 15-24

అప్పుడు అంటే, ఆశ్రమ నిర్మాణం పూర్తి కాగానే లక్ష్మణుడు గోదావరి నదికి వెళ్ళి స్నానము చేసి తామరపూలను, కొన్ని ఫలములను తెచ్చెను.

శ్రీరామునకు సీతాలక్ష్మణులతో కలిసి ఉన్నా భరతశత్రుఘ్నులు దగ్గరలేరే అనే దుఃఖం మనస్సులో ఇబ్బందిగానే ఉంది. అందుకే భరత శత్రుఘ్నులతో కలిసి పూర్ణమైన సుఖాన్ని ఎప్పుడు అనుభవిస్తానో కదా అని బాధపడుతూ గోదావరీ నదిని సమీపిస్తాడు.

ఇత్యేవం విలపంస్తత్ర ప్రాప్య గోదావరీం నదీం
చక్రే౽భిషేకం కాకుత్స్థస్సానుజస్సహసీతయా

తర్పయిత్వా౽థ సలిలై స్తేపితౄన్ దైవతాని చ
స్తువంతి స్మోదితం సూర్యం దేవతాశ్చ సమాహితః

కృతాభిషేకస్సరరాజరామస్సీతాద్వితీయస్సహలక్ష్మణేన
కృతాభిషేకో గిరిరాజపుత్ర్యారుద్రస్సనందీ భగవానివేశః
16-41,42,43

సహసీత సహానుజంగా రాముడు గోదావరిలో స్నానంచేసాడు. భక్తితో దేవతలకు, పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. ఉదయిస్తున్న సూర్యభగవానునికి నమస్కరించారు. సర్వదేవతలను స్తోత్రం చేసారు. ఆ సమయంలో గోదావరిలో స్నానం చేసి సీతతో, లక్ష్మణునితో కూడి ఉన్న శ్రీరాముడు - గంగానదిలో స్నానం చేసి పార్వతితో నందితో ప్రకాశిస్తున్న శివునిలా ఉన్నాడంటాడు వాల్మీకి. ఈ శ్లోకం హరి హరాద్వైతాన్నే కాదు గోదావరి గంగవంటి పవిత్రమైన నది అనే విషయాన్ని కూడా ధ్వనింప చేస్తోంది.

మాయలేడిగా ప్రవేశించిన మారీచుణ్ణి తరిమి కొట్టాడు బహుదూరంగా రాముడు. ఆ దెబ్బకి ప్రాణాలు కడగట్టగా 'హా సీతా, హా లక్ష్మణా!' అని రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ కేకలు పెట్టాడు మారీచుడు. ఆ కేకలకు భయపడిన సీత లక్ష్మణుణ్ణి అన్నకు ఏమీ ఆపద వచ్చిందో? త్వరగా వెళ్ళమని తొందర చేస్తుంది. లక్ష్మణుడు అది రాక్షసమాయేననీ, రామునికి ఏ ఆపదా రాలేదనీ, తాను సీతను ఒంటరిగా వదలి వెళ్లలేననీ సమాధానం ఇస్తాడు. సీత మళ్ళీ కంగారుగా లక్ష్మణుణ్ణి త్వరగా వెళ్ళమనీ, వెళ్ళకపోవడానికి లక్ష్మణుని దుర్బుద్ధి కారణమనీ నిందిస్తుంది. చివరిగా 'నేను నీకు దక్కుతాననుకుంటున్నావేమో! -రాముడు లేకపోతే గోదావరిలో దూకేస్తాను' అంటుంది సీతాసాధ్వి.

'గోదావరీం ప్రవేక్ష్యామి వినా రామేణ లక్ష్మణ' [illegible]

ఈ విధంగా మానరక్షణకు గోదావరిని సమాశ్రయిస్తానంటుంది సీత. అంతేకాదు-

రావణాసురుడు తనను అపహరించుకు పోతూ ఉంటే సీత గోదావరికి వందనాలర్పిస్తూ తన విషయం, రావణుని సంగతీ రామునికి చెప్పమని అర్థిస్తుంది.

హంసకారండవాకీర్ణాం వందే గోదావరీం నదీం
క్షిప్రం రామాయ శంస త్వం సీతాం హరతి రావణః 50-32

సీతాన్వేషణ సందర్భంలో రాముడు-సీతకు గోదావరి చాలా ప్రియమైనది. ఆ నదికి గాని వెళ్లిందా. అయినా నేను లేకుండా ఒంటరిగా వెళ్ళదే అనుకుంటాడు. అంటే సీతకు గోదావరీ తీరాన రామునితో కలిసి విహరించడమే ఇష్టమన్న మాట.

గోదావరీయం సరితాం వరిష్ఠా ప్రియా ప్రియాయా మమ నిత్యకాలం
అప్యత్రగచ్ఛేదితి చింతయామి నైకాకినీ యాతిహి సాకదాచితం
63-13

గోదావరీ నది నదులలో శ్రేష్ఠమైనదని శ్రీరాముడే స్వయంగా చెప్పిన సందర్భమిది.

సీత గోదావరికి నీటికోసం వెళ్ళిందేమో? తామరపూలకోసం వెళ్ళిందేమో అని ముందు లక్ష్మణుడు ఆమీద స్వయంగా రాముడు వెళ్ళి గోదావరి నదీ సమీపంలో వెదుకుతారు. సీత కనిపించకపోగా సీత ఏది? అని రాముడు గోదావరిని ప్రశ్నిస్తాడు. గోదావరి బదులు చెప్పలేదు. బదులు చెప్పమని వనదేవతలు కూడా గోదావరిని ప్రోత్సహిస్తాయి. అయినా దురాత్ముడు క్రూరకర్ముడు అయిన రావణునికి భయపడి గోదావరి - 'కించిన్న ప్రతిభాషతే' అంటాడు వాల్మీకి. 'ఏషా గోదావరీ సౌమ్య' -సౌమ్యురాలయిన గోదావరి ఏమీ పలకలేకపోయిందట. రావణుని దౌష్ట్యానికి చరాచర జగత్తు గజగజ లాడిపోయేదన్న మాట. మారు మాట పలకక, మాట సాయం చేయక సాగిపోతున్న గోదావరీ నదీ జలాల్లోనే జటాయువుకు తర్పణాలు వదిలి ముందుకు సాగిపోతారు రామలక్ష్మణులు సీతాన్వేషణతత్పరులై.

మళ్ళీ గోదావరి ప్రసక్తి వాల్మీకి రామాయణంలో రావణ వధానంతరం శ్రీరాముడు విజయలక్ష్మీయుతుడై సీతాలక్ష్మణ సహితుడై పుష్పక విమానంలో అయోధ్యానగరికి వెళ్ళే సందర్భంలో వస్తుంది. సీతాన్వేషణ సమయంలో తాను చూసిన ప్రదేశాల నన్నిటినీ సీతకు చూపిస్తూ దండకారణ్య సమీపంలో గోదావరిని కూడా చూపిస్తూ ఆ నదీ రమ్యతను ప్రస్తావిస్తాడు.

ఏషా గోదావరీ రమ్యా ప్రసన్న సలిలా శివా
అగస్త్యస్యా శ్రమే హ్యేష దృశ్యతే పశ్య మైథిలి.



గోదావరి రమ్యమై ప్రసన్న సలిలయై ఉంది చూడు మైథిలీ అంటాడు. వాల్మీకి రామాయణాన్ని బట్టి చూస్తే రాముడు గోదావరిని చూడడం ఇది కడసారి.

పంచవటిలో గోదావరిని మొట్టమొదటగా చూసినప్పుడు రాముడు - ఇయం గోదావరీ రమ్యా! అంటాడు. చివరిసారి కూడా ఏషా గోదావరీ రమ్యా! అంటాడు. ఎన్నో నదులను చూచిన నదీ తీరాలలో వసించిన శ్రీరాముడు గోదావరీ నదిని మనసారా 'గోదావరీ రమ్యా!' అని సంభావించడం గోదావరి వరిష్ఠతకు నిదర్శనం. రాముడు మెచ్చిన నది గోదావరి. అది ఆంధ్రదేశంలో అధిక భాగం ఉండడం ఆంధ్రుల పుణ్యం.

ఇక భవభూతి తన 'ఉత్తరరామ చరిత్ర' నాటకంలో ఉత్తర రామకథా ఘట్టాన్ని కూడా గోదావరీ తీరంలో నడిపించాడు. ఇది భవభూతి ఆంధ్రుడు కావడంవల్ల ఆంధ్రాభిమానంతో చేసిన పని అనుకునే అవకాశం లేక పోలేదు.

రామాయణాన్ని వాడుక భాషలోకి వచన కావ్యంగా తెనిగించిన శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అరణ్యకాండ పీఠికలో వ్రాసిన వాక్యాలు ఈ సందర్భంలో స్మరింపతగినవి.

''మన గోదావరీ మధురజలాలు సీతారామలక్ష్మణ స్నాన పుణ్యాలు. రాముడనేక నదులు చూసాడు. స్వయంగా ఒక నది వొడ్డునే పుట్టి పెరిగి వ్యవహరించాడు కూడా! కానీ మన గోదావరి వంటిది మాత్రం మరొకటి కనబడ లేదతనికి.''

ఈ సూక్ష్మాన్ని గమనించిన భవభూతి అవాల్మీక కల్పనకు వెనుకాడక తన నాటక కథకు గోదావరీ తీరప్రదేశం రంగస్థలం చేసాడు. గోదావరీ నదిని భగవతీ! అని సంబోధిస్తాడు రాముడు. తాను సీతాసతితో కలిసి మెలిసి జీవించిన సంగతుల్ని గోదావరి కానన ప్రదేశాల్ని తలపోసుకుంటాడు పదే పదే.

ఎచటి మృగములు, చెట్లు నా కిష్టబంధు
లెందుఁ దడ వుపసించితి నింతిగూడి
యివ్వియే యవి. పలు సెలయేళ్ళ గుహల
బరుగు గోదావరీ ప్రాంత గిరితటములు.

అనుకొంటాడు.

అంతేకాదు - 'తలతె? గోదావరీ తీరములను నీవు నేను నడపిన చర్యల నీరజాక్షి!' అని సీతను ప్రశ్నిస్తాడు భావనలో. 'దండకారణ్యావాస ప్రియసఖి'యైన సీత పేరిట గోదావరిలో ఒకరేవుకు రాముడు సీతాతీర్థమని పేరు పెట్టినట్లు అతని మాటల్లోనే స్పష్టం చేస్తాడు.

భవభూతి నదుల్ని తన నాటకంలో పాత్రల్ని చేసాడు. ఆ వరవడిలో మరికొన్ని సంస్కృత నాటకాలు పుట్టాయి. ఈ సందర్భంలో శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి మాటలు విన దగ్గవి.

''ఉత్తర రామచరిత్రలో సీత గోదావరి నుండి లేచి వచ్చిన తీరు అపూర్వ కల్పన. వాల్మీకి తిప్పని దక్షిణారణ్య మార్గముల నిందలి రాముడు తిరుగుట. ....అతడు చూపని గోదావరీ తీరగిరి కాననాది విశేషములెన్నో చూచుట.... ప్రస్రవణాద్రి మీద తమయునికి జ్ఞాపక చేయుచు రాముడు సీతతో నన్న మాటలు..'' అని వ్రాసారు. ఆంధ్రదేశము - ఆంధ్రదేశంలో ప్రవహించే నదులమీద ఆనాటి కవుల మమకార మట్టిది.

రామాయణానువాదకులైన పెక్కురు ఆంధ్ర కవులు కూడా ఇట్టి ఆంధ్రాభిమానంతోనే వ్యవహరించారని చెప్పాలి. నన్నయ్యభట్టు భారతంలో మూలంలో లేకపోయినా అర్జునుని తీర్థయాత్రా సందర్భంలో - ''దక్షిణ గంగ నా తద్దయు నొప్పు' - గోదావరిని ప్రవేశపెట్టాడు. ఆదికవి వరవడిని అందుకుని చేమకూర వేంకట కవి తన 'విజయవిలాసం'లో విజయుని - 'గౌతమీ తటినీ తోయస్నాతుణ్ణి' చేసాడు.

భారతాంతర్గత రామాయణ రచన నన్నయ చేతిమీదుగా సాగిఉంటే గోదావరి ప్రస్తావన ఎంత మహనీయంగా ప్రదర్శింపబడేదో. ఎఱ్ఱన 'రాముడు దండకారణ్యంబు సొచ్చి యందు గోదావరీ తీరంబున నమజి వధు సహితంబుగా గృత నివాసుండై యున్నంత' అని మాత్రము పేర్కొన్నాడు.

రామాయణాన్ని ఆంధ్రీకరించిన బుద్ధారెడ్డి, భాస్కరుడు, పింగళి సూరన, గోపీనాథము వెంకటకవి, జనమంచి శేషాద్రిశర్మ, ఆత్మకూరి గోవిందాచార్యులు, వావికొలను సుబ్బారావు, విద్వాన్ కట్టి వేంకట సుబ్బారావు, కవిసామ్రాట్ విశ్వనాథసత్యనారాయణ గార్ల రచనలో గోదావరి ప్రస్తావనను పరామర్శించు కొందాం.

బుద్ధారెడ్డి రామాయణంలో గోదావరి ప్రస్తావన వలసినంత వరకు చేసాడు. వాల్మీకికి అందని విషయాన్ని ఒకదానిని ఇక్కడ ప్రత్యేకంగా వివరించాడు. అయితే అది జంబుకుమార వృత్తాంతం పూర్తిగా అమూలకం. జంబు కుమారుడు శూర్పణఖ తనయుడు. తన తండ్రిని చంపిన రావణుని జయించాలనే కోరికతో ఒక పాదలో కూర్చుని తపస్సు చేస్తున్నాడు ఇంద్రుణ్ణి గూర్చి. ఆ కొడుకు కోసం శూర్పణఖ రోజూ భోజనం తెచ్చేది. ఒకనాడు ఆమె భోజనం తెచ్చే సమయానికి లక్ష్మణుడు జంబుకుమారుని ఖండించాడు. ఆ సందర్భంలో ఆమె-

గోదావరీ మహా హ్రోదినీ మీనంబు
లను వండి తెచ్చితి దనయువర్య!             అని విలపిస్తుంది.

గోదావరినదిలోని చేపలు రుచివంతాలని శూర్పణఖ ముఖాన బుద్ధారెడ్డి తీర్పు.

భాస్కర రామాయణంలో యథా వాల్మీకంగానే

'పావనకార గోదావరీదేవి నీ
వెటి గింప వమ్మ రాజేంద్రుతోడ'             116 ప-2 ఆ

అని సీత గోదావరిని ప్రార్థిస్తుంది.

గోపీనాథ రామాయణంలో వెంకటకవి ఈ గోదావరిని ప్రత్యేకించి వర్ణించి పులకిస్తాడు.

అగస్త్యుడు - 'గోదావరీ తీరంబున ఫలమూల ఫలోదకం బైన పంచవటి ప్రాజ్యమూలఫలంబై'న దని పరిచయం చేస్తాడు. ఆ పరిచయంతో పంచవటీ ప్రాంతానికి వచ్చిన రాముడు ఆముని మాటలు తలచుకుంటూ గోదావరిని మహానదిగా సంభావించి సమ్మానిస్తాడు చంపకమాలలో.

చ. [illegible] పుష్పిత భూమిరుహ ప్రకాండయై
[illegible] హంస మరాళ విరాజమానయై
[illegible] తరంగ కణప్రవ గంధవాహయై
[illegible] గౌతమి కంటివె [illegible]

అరణ్య - 2౨౬

పంచవటిలో పర్ణశాల నిర్మించుకొని జీవిస్తూ గోదావరిలో నిత్య స్నానం చేసి పునీతులయ్యేవారు. వాల్మీకి హృదయాన్ని వెంకటకవి తు.చ. తప్పకుండా ఆవిష్కరించాడు తన రచనలో.

ఉ. [illegible] నాటి ప్రభాతవేళ [illegible]
[illegible] యభిషేక నిమిత్త మర్థియై
[illegible] గౌతమీ నది కవార్య గతిం జనుచుండ వెంట [illegible]
[illegible] లక్ష్మణుడన్న కీర్తనన్.

సహానుజ, సహసీతాయుక్తుడై శ్రీరాముడు గోదావరికి స్నానార్థానికి వెళ్లడం కళ్ళకు కట్టించారు వాల్మీకి, వెంకటకవి కూడా.

తనను రావణుడు హరించుకు పోతూ వుంటే ఆర్త స్వరంతో సీత - గోదావరిని సంబోధిస్తూ--

[illegible] తరంగమాలా!
[illegible] మరాళ చక్రబకసాదన వి
[illegible] ఘనగౌతమీనది
[illegible] తోడ చెప్పు నా తెరగెల్లన్.

అరణ్య - [illegible]

సీతాన్వేషణ సందర్భంలో రాముడు-

ఇది బహుకందరోపల మహీరుహమైన వనంబు
నదికి జలార్థ మేగెనో వనంబు నకుం గుసుమార్థ మేగెనో!

అంటూ డోలాందోళిత మనస్కుడవుతాడు. వెంటనే తమ్మునితో--

మ. సుదతీ రత్నము పద్మముల్ గొనుటకై సొం పొందగా గౌతమీ
నదికిం బోయెనో తత్సరః పులిన సంతానంబులం జూచి ప
చ్చేదవా యున్న నతండు పోయి మదిరాక్షింగాన కేతెంచి గ
ద్గద కంఠుండయి యున్న కీర్తనియె సంతాపంబు వాటిల్లగన్.

దేవా! తీర్థవతియైన గోదావరి కింబోయి తత్తీర్థంబుల యందు వెదకి యెందును గాననైతి'' అంటాడు.

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు - ''శ్రీ గోవింద రామాయణం'' అనే రామాయణాన్ని రచించారు. పంచవటి అనే శీర్షికలో గోదావరీ సౌందర్యాన్ని కమనీయంగా కవి సమయ రమ్యంగా వర్ణించారు.

[illegible]

పద్మాలు - ముఖము, హంసలు - నడకలు, చక్ర వాకాలు - స్తనాలు, గైరిక విలాసాలు - పసుపు కుంకమలుగా గోదావరీ నది పెద్ద ముత్తైదువుగా సాక్షాత్కరించింది రాముని కన్నులకు, మనసుకు కూడా. వెంటనే--

ఇదె [illegible] చెప్పిన ప్రథిత [illegible]
[illegible] నాకు సీతకు నీకు నిష్టమైన
[illegible] పర్ణశాల అంటాడు ప్రేమతో.

[illegible]

గోదావరిలో స్నానం ఎంత పవిత్ర పుణ్యకార్యమో రాముని చర్యలో బహిర్గతమైంది.

గోదావరిలో సీతకు గల సాన్నిత్యమే-- ఆమే

హంస కారండవంబుల [illegible]
ప్రథిత గోదావరీ నది [illegible]
[illegible] సీత [illegible]
చెప్పవే [illegible]

అని కోరుకునేలా చేసింది.

విద్వాన్ కట్టి వేంకట సుబ్బారావుగారు నరసన్న పేట వాస్తవ్యులు. వారి రచన 'శ్రీరఘురామ చరిత్రము' లో సీతారాముల జలకేళిని ప్రత్యేకించి వర్ణిస్తారు.

జలకేళి సవరించు చెలువు కాంతురు కొంత
గోదావరీ సరిత్కూలములను.



వావికొలను సుబ్బారావుగారు - ఆంధ్ర వాల్మీకి రామాయణ రచయిత. ఆయన అగస్త్యుని మాటగా గోదావరి రమ్యతను చెప్పిస్తారు రమణీయంగా.

[illegible]

-322

పర్ణశాలలో సీత కానరానపుడు రాముడు ఊహించిన భావనలలో సీత పద్మాల కోసం గోదావరికి వచ్చి వుంటుందేమో అనేది ప్రధాన మైనదే కాదు, ప్రథమమైనది కూడా.

క. [illegible]
[illegible]
[illegible]
[illegible] -1173

గోదావరిని రాముడు స్వయంగా ప్రశ్నించిన సందర్భంలో--

క తల్లీ! గోదావరి! నా
పల్లవ పద సీత యిందు వచ్చెనె చెప్పుమా
పాల్లిక పాడి యెటగె నా
యెల్లాటి హరించె నొక్కొ యెవ్వండైనన్. -1162

సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్న 'గణపతి రామాయణ సుధ' - చర్ల గణపతి శాస్త్రి గారి రచన. అగస్త్యుని మాటలను వీరు కవిత్వీకరించిన విధానం.

ఆవన ప్రదేశము చాల యందమైన
దచట జానకి యానంద మంది యుండు
ఆ ప్రదేశము శ్లాఘ్యము మాయంటు నెచరిగ
కలదు గోదావరి నది, యుండలరు సీత. అర-220

ఆ ప్రదేశం శ్లాఘ్యము కావడానికి గోదావరీ కారణమని నొక్కి వక్కాణిస్తారు. గోదావరీ తీరవాసులైన చర్లవారు గోదావరీ దర్శనం కాగానే పులకించిన రాముని హృదయాన్ని వర్ణించిన తీరు--

రవిబింబంబునుబోలు తామర పువుల్ బాగైసుగంధంబులన్
కలియం జిమ్మగ శ్రీల నొప్పి తట వృక్షశ్రేణి బుష్పించుక్రొం
బువులందా లాలికంచు చుండగ మనో మోదంబు గల్గించెనీ
భువి గోదావరి, యా యగస్త్యుడు మహాత్ముండన్న యట్టుల్ కడున్.
అ -236

గోదావరిలో స్నానమాచరించిన సీతారామ లక్ష్మణులు -అభిషేకానంతర పార్వతీ పరమేశ్వర నందీశ్వరులలా ప్రకాశిస్తున్నారన్న వాల్మీకీ వచనాన్ని - చర్లవారు - కందంలో అందంగా అందించారు.

క. జలముల నభిషేకంబును
సలిపియు రాముండనుజుడు జనకాత్మజయున్
వెలిగిరి. యంబిషేకంబున
సలిపిన శంకరుడు నంది శాంకరి పోలెన్.

శ్రీమచ్ఛ్రీరంగం నల్లాన్ చక్రవర్తి రామానుజాచార్యుల అయ్యవార్లగారి - శ్రీరామానుజ రామాయణములో - ఈ సన్నివేశాన్ని

[illegible]
సీతతో [illegible]
[illegible]
[illegible]

అని వర్ణించారు. గోదావరీ నదీ జలాలలో స్నానం పరమేశ్వరునితో సాటిగా గోచరింపచేసింది రాముణ్ణి. గోదావరిలో స్నానమాహాత్మ్యాన్నికి ఇంతకుమించిన ఫలం ఏం కావాలి.

శ్రీ నాదెళ్ళ మేధా దక్షిణామూర్తిగారి 'శ్రీహనుమద్రామాయణంలో - తాము నిర్మించుకునే పంచవటీ ప్రాంతము.

[illegible]
[illegible]

అని రామాదులు మురిసిపోతారు.

'రఘురామ రామాయణం'లో శ్రీ వావుడూరు రఘురామయ్య గారు గోదావరితో సీతకు గల పరిచయాన్ని ప్రణయభావాన్ని ప్రపంచీకరిస్తారు రమ్యంగా.

శ్రీకరమైన [illegible]
పరిసరమ్ము [illegible]
వన్యజలమ్ము [illegible]
హృదయ [illegible]

ప్రతిదినమ్ము [illegible]
దివ్య గోదావరీ నదీ తీరమున [illegible]
హార మొనరించుచుండు [illegible]
ప్రకృతి సౌందర్యము [illegible] అ 72,73

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తమ రామాయణ కల్పవృక్షంలో గోదావరీనది హృదయావేదనను ఆవిష్కరించిన విధానం అనన్యసామాన్యం. విశ్వనాథవారి కవితలో గోదావరి బహుముఖాలుగా ప్రవహించి తనకు రామకథతోగల అవినాభావ సంబంధాన్ని అలలు అలలుగా పాఠకులకు అందిస్తుంది. వాల్మీకి భావాలకు భాష్య ప్రాయాలయిన భావతరంగాలు విశ్వనాథవి.

అగస్త్యుడు గోదావరీ తీరంలో పంచవటీ ప్రాంతంలో పర్ణశాల నిర్మించుకోమని చెప్పిన విషయం వాల్మీకిదే. అయితే ఆ గోదావరీ నదీ సౌందర్యాన్ని, స్వచ్ఛతని దాని ప్రవాహరీతుల్ని వర్ణించి రామునికి గోదావరిని పరిచయం చేసింది శ్రీ విశ్వనాథవారు మాత్రమే. ఆంధ్రకవులకు గోదావరీ ప్రవాహపు రామణీయకత ప్రత్యక్షదృశ్యం కదా!

ఉదుగున గులక రాళ్లైన వారి సీలవుండలోతుగా జల జల స్రవించు
నొకచోట నొకచోట [illegible] భయంకరమున ప్రవహించు

వైడూర్యకాంతి ప్రవాహశోభాయమ్ము సికతా[illegible] తెల్ల [illegible]
నొకచోట నొకచోట [illegible] తెల్ల పువ్వులా[illegible]

గీ. [illegible]
[illegible]
లక్ష గోదావరీ [illegible]
[illegible] [illegible]

ఒకచోట ఆ నది సీలవుండలు తడిసే లోతులో గులకరాళ్లు స్పష్టంగా కనబడేటట్లు జల జలా స్రవిస్తుందట, ఒక్కొక్కచోట లోతుగా ఉండి భయంకరంగా ప్రవహిస్తుందట, ఆ ప్రవాహం ఒకచోట వైడూర్యకాంతితో మెరిసి పోతుందట, అక్కడక్కడ ఇసక దిబ్బలతో శోభాయ మానంగా ఉంటుందట. తెల్ల చమరీమృగాల తోకలలా ఉండే తెల్లుపువ్వులతో ఒప్పి ఉంటుందట. చుట్టూ చిన్న చిన్న కొండలతో నిరంతరం శోభారమ్యంగా ఉంటుంది గోదావరి, దాని తీరప్రదేశమూ అని గోదావరీ సౌందర్య దర్శనం కవి తాను చేసి పాఠకులకు కూడా చేయించారు.

ఇట్టి గోదావరిలో స్నానం చేసే భాగ్యం కల్గించినది పినతల్లి వరమే కదా అని ఆనందపడతాడు రాముడు. అమూలక మయిన అపురూప భావనమిది.

'మహాసాగర ధర్మపత్ని గోదావరి యంభస్త తరంగ మజ్జనము పిన తల్లివరంబౌ' – గోదావరి మహాసాగర ధర్మపత్ని. నదులన్నీ సాగరుని పత్నులే అయినా కవిదృష్టిలో గోదావరి ధర్మపత్ని స్థానాన్ని సంపాదించుకున్న సరిత. అందుకే వాల్మీకి 'గోదావరీయం సరితాంవరిష్ఠా' అన్నది – విశ్వనాథ కవితా విలాసం అంతతో ఆగలేదు – గోదావరి 'సాగరస్వామి గౌరవ ప్రణయ సామ్రాజ్య పట్టమహిషి' అని కూడా ప్రత్యేకంగా వివరించడంలో ఒక చిన్న చమత్కారం ఉంది. లోకంలో ధర్మపత్నులు సాధారణంగా ప్రణయాధి సామ్రాజ్య పట్ట మహిషులు కాలేరు. గోదావరి ధర్మపత్ని, ప్రణయసామ్రాజ్య పట్టభద్రురాలు కూడా కావడం విశేషం.

సీతారామలక్ష్మణులు ఉభయసంధ్యలలో ఆ గోదావరీ నదికి స్నానానికి వెళుతూ ఉంటే దండకారణ్యం వైకుంఠ నగరీహ్లాదైక సంపూర్ణతను కూర్చిందంటారు విశ్వనాథ.

శా. సాయంప్రాతక రామచంద్ర విలసత్సంస్తుత్య గోదావరీ
ప్రేయః పూర్ణనిషేవణార్థగమన శ్రీమంజులాకాశ వీ
థీయుక్తాంశు విచిత్ర చంక్రమణ సాధిష్ఠంబుగా దండకం
బాయెన్ సాధు వికుంఠ పుణ్యనగరీ హ్లాదైక సంపూర్ణతన్
పంచవటి–45

పంచవటిలో జీవనం సాగిస్తున్నప్పుడు హేమంత ఋతువులో సీతారామలక్ష్మణుల జీవనవైభవాన్ని, ప్రకృతి శోభనీ వాల్మీకి కూడా ప్రత్యేకంగా వర్ణించాడు. అయితే గోదావరీ నదిమీద మంచు తెరకప్పిన మనోహరదృశ్యాన్ని – ఒక కౌటుంబిక మర్యాదాలంకృత చేష్టారమ్యంగా భావించారు విశ్వనాథ. హేమంత ఋతుధర్మంగా మంచు ప్రకృతి నిండా ఆవరించింది. అయితే గోదావరి అట్లా మంచుతెర మేలిముసుగుగా ధరించ డానికి ఒక హేతువును ఊహించారు విశ్వనాథ. గోదావరిసాగరుని ఇల్లాలు కదా. శ్రీరాముడు సగరరాజుల వంశానికి చెందినవాడు. సాగరునికి వరునకు తోబుట్టువు వరస చెప్పుకోవడానికి వీలుంది. ఈ శ్రీరాముడు తనకు మఱిది అవుతాడు అనే విషయం ఎలాగో గోదావరికి తెలిసిపోయింది. అందువల్ల మఱదిని తనలోని పద్మాలనే కళ్ళతో చూచి – మెత్తని లజ్జ పెంపుతో చిన్న సిగ్గుతో మంచు అనే మేలి ముసుగు సవరించుకుందా అన్నట్లుగా ఉంది అన్నయ్యా అంటాడు లక్ష్మణుడు రామునితో హేతూత్ప్రేక్షను ప్రయోగించి.

ఇంతటి బంధుత్వం కూడా ఉంది కనుకనే గోదావరి సీతాపహరణ సమయంలో తానుకూడా గజగజలాడి పోయింది. జానకి గోదావరీ జలాలు పోసి ఎన్నో మొక్కలు ప్రియమార పెంచింది.ఆ మొక్కలకు కూడా తనను రావణుడు అపహ రించిన విషయం చెప్పుకుంటు సీత దీనంగా–

జనకజాస్యహస్తకృత నిత్య గోదావరీ జలపరిసేక సేచనా
పర్ధిత బాలతరుసంతానము అంటారు విశ్వనాథ.

సీతను రావణుడు ఆకాశమార్గాన ఎత్తుకొని పోతున్నాడు. క్రింద గోదావరీ నది అల్లకల్లోల హృదయంతో ప్రవహిస్తోంది. అదృశ్యం – ఒక గ్రద్ద తన పిల్లను ఆకాశమార్గాన తన్నుకుపోతూ ఉంటే నిస్సహాయురాలైన తల్లిపాము ఆ గ్రద్దను గుర్తుపెట్టుకుని తాను నేలమీద అదేమార్గంలో పరుగు పెడుతున్నట్లుందంటారు కవి. విషాద భీషణ మనోజ్ఞ దృశ్యమిది.

తన బిడ్డను దన్నుకొని పుంటపోవు గృధ్రమ్ము గుర్తుపెట్టుకుని
నేలమీద పరువెత్తు మహా భుజంగి పోలె గనిపించు గోదావరి
నదిరింగాంచె జానకి- జటా –106

ఈ ఉపమలో జానకికి గోదావరిలో బిడ్డకై అలమటించే మాతృదేవి కనబడింది.అందుకే ఆ మహానదీమ తల్లిని ఎంతో గౌరవంతో సంబోధిస్తూ సంభాషిస్తుంది సీత. ఛందస్సును ఔచితీవంతంగా కూర్చే విశ్వనాథ ఇక్కడ షట్పదులు వ్రాసారు. తుమ్మెదల ఝుంకారపురొదలో సీతమ్మ ఎదరొదను ఆవిష్కరించారు విశ్వనాథవారు.

షట్పదులు బిందు బిందృంతర సందీపిత
సుకృత సందోహదివుల పాపో సర్గల!
వందారు జనతాఘుబృంద నిక్రాంత
సన్నందోవజారాంబు గోదావరి!
బృందారకానేక సుందరీసీమంత
సిందూర రంజితాంభో వాహిని!
సుందరమతి రఘునందన భిక్షృభి
నందిత సముదితాంభఃప్లుతి!

ఇందవ నతులు భూనందనా
ప్రార్థనానందాగ తార్రాంబువీచీతట!

వచనము. తల్లీ మేమిద్దఱమును గలిసి నీయందు స్నానమాడ వత్తుమని రేపెదురు చూడకుము. ఆపుణ్యవేళ రాక్షసగ్రస్తమయినదమ్మా! సాగరరాజగామినీ! వృషోత్సర్జన వేళాకేత నీభూత స్తంభ ధ్వయంబువోలె రేపుప్రొద్దున నన్నదమ్ములు స్నానార్థమ్ము వత్తురు. గుర్తుపట్టలేవేమొ! అన్న కన్నులలో జలముండును. తమ్ముని కనులలో నగ్నియుండును. నా పోయినది దక్షిణదిశయని చెప్పు''మని కోరినది.

ఆమె ఆ ప్రార్థనను విన్న రావణుడు అయ్యో! ఈమె కనులకు గంతలయినకట్టితిని కానను అనుకొన్నాడట – ఈ రావణుడు విశ్వనాథ వారి రావణుడే.

రావణుని ఈ దుష్కార్యాన్ని ఖండించే జటాయువు ముందుగా సీతారాముల మహత్మ్యాన్ని వివరిస్తాడు. ఆ సందర్భంలో కల్పించుకుని – గోదావరీనది ప్రత్యేకించి సీతారాముల్ని ఏవిధంగా పూజించి గౌరవించేదో అద్భుతంగా వర్ణించారు.

మ. జలజాతేక్షణ గౌతమీ తటమునన్ స్నానార్థ మేతేరగా
వలయాకార ప్రదక్షిణంబుగ నదీ వార్వేణీ సౌదామనీ
కలిత స్తంభముగాఁగ లేచిమునుకల్ కల్పించి సూత్కాంభుజాం
జలియై కానుక లిచ్చి పోవు వినయస్నానాంబు మర్యాదయై
117 –జటాయువు

మెరుపు తీగవలె లేచి, కొత్త కలువల అంజలితో గౌతమీనది తనలో స్నానమాడవచ్చిన సీతారాములికి మర్యాద పూర్వకంగా కానుకలిచ్చేదట. సీతారాముల దర్శనానికి గోదావరి అలా పులకించేది.

గోదావరికి సీతారాములకు గల పవిత్ర బంధం అలాంటిది. అందుకే కాళిదాసు 'సీతానిమజ్జన పుణ్యోదకేషు' అంటాడు గోదావరి జలాలని. అంతేకాదు. పుష్పకాధిరూఢులై వస్తున్న సీతారాముల విమాన కాంచన కింకిణుల ధ్వనులు విని గోదావరి సారస పక్షులను వెంటతీసుకుని ఎదురుకోలు సన్నాహానికి వచ్చిందంటాడు, రఘువంశం పదమూడవ సర్గలో.

చంచద్విమానలంబిత
కాంచన కింకిణులు మ్రోయఁ గావిని, గోదా
ప్రాంచత్ సారసవకులే
తెంచు నెగసి యెదురుకోలిదే నీకిడునాన్. 13–33

రఘువంశము – గుఱ్ఱము వేంకటసుబ్రహ్మణ్య కవి అనువాదము.

సంస్కృత కవులే ఇంతగా సంభావిస్తే ఆంధ్రదేశీయులగు ఆంధ్రకవులకు గోదావరి యెడల స్వాభిమానము ఎంతటిదో చూడండి. తాను రచించిన 'భోజరాజీయము' అనే గ్రంథంలో అనంతామాత్యుడు ప్రసక్తి కల్పించుకుని–

క. ఈ గంతయు మునుపుట్టను
భగీరథి పిదపఁ బుట్టె ఫలమొసఁ గెడిచో
నీ గౌతమియె యెక్కుడు
భాగీరథి కంటె నంద్రు ప్రాజ్ఞులు పుత్రా!

అంటాడు. గోదావరికి వృద్ధ గంగ అని కూడా పేరు ఉంది.

ద్వ్యర్థి కావ్య కర్తయైన పింగళి సూరన రాఘవ పాండవీయంలో కూడా – గోదావరి ప్రసక్తిని పరువము మీర వర్ణించాడు. లక్ష్మణుడు కట్టిన పర్ణశాల పరీక్షిస్తూ అక్కడ కట్టిన ఒక అరుగును చూపించి – ఇది ఎందుకు అని సీత అడుగుతుంది రాముణ్ణి. రాముడు వెంటనే – ఎందుకేమిటి.

చ. ఇరువుర మీయరంగు పయి నింపుగ నొక్కట గూరుచుండి, సా
గరపతిఁ గాన బోవు కుతుకంబున నుచ్చి తరంగ హస్తముల్
వరుసగ గ్రాలు గౌతమిని నల్లన చూచుట కంచుదోచెడిన్.
రా.పా ఆ3.ప.66

పర్ణశాల అరుగులపై కూర్చొని సాగరగామినియైన గోదావరిని చూస్తూ పరవశించారు సీతారాములు. గోదావరి భాగ్యమే భాగ్యము.

గోదావరితో రామునికి గల సంబంధాన్ని కంచర్ల గోపన్న దాశరథీ శతకంలో పరవశించి గానం చేస్తాడు.

ఉ. శ్రీరమ సీత గాఁగ నిజసేవకబృందము వీరవైష్ణవా
చారజనంబుగాఁగ విరజానది గౌతమిగా వికుంఠము
న్నారయ భద్రశైలశిఖరాగ్రముగాగ వసించి చేతనో
ద్ధార కుడైన విష్ణుడవు దాశరథీ కరుణాపయోనిధీ!

విష్ణువు రామావతారంగా దిగివచ్చిన సందర్భంలో విరజా నది గోదావరి నదిగా అవతరించిందని – నారాయణునితో ఆ నదికి గల సాన్నిత్య ప్రావిత్యాన్ని సమర్థిస్తున్నాడు గోపన్న.

రామసంబంధాన్ని గోదావరీనదికి సారస్వతపట్టభద్రులు ఇంతటి మహనీయతని కూర్చారు. గోదావరి భాగ్యాన్ని ఒకటి రెండు పద్యాలలో చెప్తే తృప్తి కుదరని కవి గ్రామణి ప్రెగ్గడపల్లి పోతయ్య ప్రత్యేకించి గోదావరీ శతకాన్నే రచించి తరించాడు. ఉదాహరణకు ఒక పద్యం.

స్థిర పుణ్యోదయ మేదినీందు వదనా సీమంత వీథీలస
ద్ధుర ముక్తాఫల సూత్రమో! సురుచిర క్షోణీపురంధ్రీయశో
ధర ధమ్మిల్ల లతాంత మాలికయెయొ! భూత స్వీకుచశ్రీమనో
హర సంధ్యాన మోనాగ నీదగు ప్రవాహంబొప్పు గోదావరీ!

భూకాంతామణి తన శిరస్సున ధరించిన ముత్యాల పాపిట బొట్టులాగా, యశోధరయైన భూదేవి కొప్పులో పెట్టుకున్న పూల చెండులాగా, ఆమె పాలిండ్లపై కప్పుకున్న పైట చెరగులాగా గోదావరీ ప్రవాహం మనోహరంగా ఉందంటాడు శతకకర్త.

ఇదీ గోదావరి ప్రాశస్త్యం.
గోదావరీయం సరితాం వరిష్ఠా

ఈ గోదావరి నదులలో శ్రేష్ఠమైనదని వాల్మీకి మాట.

# వ్యాస భారతం - గోదావరి

ఆచార్య శలాక రఘునాథశర్మ

భారతదేశం పవిత్రతకు మూలాధారాలైన మహావిషయాలలో నదులకు ఒక ప్రత్యేకత ఉంది. నది చైతన్యానికి సంకేతం. అంతేకాదు అది దాహార్తులకు పరమరుచికరమైన ఆరోగ్యభాగ్య సంధాయకమైన నీటిని ప్రేమతో అందిస్తుంది. అన్నార్తులకు అన్నం ప్రసాదించటంలో కూడా దాని కదే సాటి. ప్రకృతిని పరవశింపజేయటంలో, గాలిలో శీతలత్వాన్ని సంధించటంలో, ఇంకా అనేక విధాలుగా నదులు మానవజాతికి దేవతామూర్తు లవుతున్నాయి. మరొక్క విషయం, భారతీయ ఋషులు నదులను, కొండలను, వృక్షాలను, పక్షులను చివరకు ఒక్కొక్క దశలో నీచంగా భావించే పశువులను కూడా దేవతా చైతన్య స్ఫూర్తితోనే సంభావించారు.

భారతధాత్రిలో నదులలో అగ్రస్థానం గంగది అనటంలో సందేహంలేదు. గౌతమి అనే మరొక పేరుతో అలరారే గోదావరీనది కూడా ఆ విషయంలో గణనీయమే. ఇతిహాసపురాణాలలో గౌతమిని కూడా మహర్షులు నిండు హృదయాలతో మన్నించారు. ఆ మన్ననలో ఆ నది విశిష్టతకే ప్రాధాన్యం కాని దురభిమానాలకు ఏమాత్రమూ తావు లేదు.

శ్రీవేదవ్యాసులు, ఒక్కమాటలో చెప్పాలంటే, సర్వజ్ఞులు. వారి అంతర్దృష్టికి అందని దేమీ లేదు. వారు అనేక సందర్భాలలో గోదావరిని గొప్పగా భావించి అభివర్ణించారు. కొన్ని మెతుకులను పట్టి చూపుతాను.

ముఖ్యంగా పాండవుల అరణ్యవాసవృత్తాంత కథన సందర్భం వారికి ప్రకృతి తేజస్సంపదను వర్ణించటంలో మంచి అవకాశం కల్పించింది. దానిని వారు ఎంతగానో సద్వినియోగం చేసుకున్నారు. మానవుల పుణ్యాలపంటను పండించారు.

వనపర్వంలో తీర్థయాత్రా పర్వం ఒకటి కొంచెం విస్తృతంగానే ఉంది. అందులో పులస్త్య మహర్షి భీష్మాచార్యులకు చెప్పిన తీర్థమహిమల విశేషాలు ఆయా తీర్థాలను మన కళ్ళముందు సాక్షాత్కరింపజేస్తాయి. ఆ పులస్త్యుడు భీష్మునితో-

**తతో గోదావరీం ప్రాప్య నిత్యం సిద్ధ నిషేవితామ్.**
**గవాం మేధ మవాప్నోతి వాసుకే ర్లోక ముత్తమమ్**

వన- 85- 33

అంటారు. గోదావరిని సర్వకాలసర్వావస్థలలో సిద్ధులు శ్రద్ధతో సేవిస్తూ ఉంటారట. దానిని సేవించిన నరుడు అనేక గోవుల పంచామృతాలను సేకరించుకొని చేసిన గొప్పయజ్ఞ ఫలితాలను పొందుతాడట. ఉత్తమమైన వాసుకిలోకాన్ని చేరుకుంటాడట. సిద్ధులు దేవయోనులలో ఒకజాతి వారు. అంటే మానవుల కంటె పై స్థాయి వారు. ఇంకా పై స్థాయికి పోగల శక్తి యుక్తులు కలవారు. అట్టివారు ఈ గోదావరిని నిత్యమూ నిష్ఠతో సేవిస్తున్నారంటే ఆ నదివిశిష్టతకు మరొక నిదర్శనం ఏం కావాలి? సిద్ధులు అనే పదానికి ఫలసిద్ధి పొందినవారు అనే అర్థాన్ని కూడా భావించవచ్చు. అప్పుడు తమ సాధనలకు ఫలం పొందినవారు కూడా మరేదో మహత్తర ఫలితాన్ని పొందటం కోసం గోదావరిని సేవిస్తారు అనే భావన కలుగుతుంది.

అఖండ గోదావరి సముద్రసంగమానికి ముందు ఏడుపాయలుగా చీలి ఎందరికో అన్నంపెట్టాలనే తపనను అభివ్యక్తం చేస్తున్నది. దానినే సప్తగోదావరం అనే పేరుతో మనం పిలుచుకుంటున్నాం. ఈ వ్యవహారం గడచిన ద్వాపరయుగంలో శ్రీవేదవ్యాసుల కాలానికే ఉన్నదనటాకి దాఖలా ఇదిగో చూడండి.

సప్తగోదావరే స్నాత్వా నియతో నియతాశనః.
మహత్పుణ్య మవాప్నోతి దేవలోకం చ గచ్ఛతి.

వన- 85- 44

ఒక పుణ్యనదిలో స్నానం చేయటానికి కూడా నరుడు ఎంతో పుణ్యం చేసి ఉండాలి. పుణ్యసంపాదనలో ప్రధాన విషయాలు ఆచారనిష్ఠ, ఆహారనిష్ఠ. అవి రెండూ చక్కగా అలవరచుకొని సప్తగోదావరంలో స్నానం చేసిన వ్యక్తి గొప్పపుణ్యం సంపాదించుకుంటాడు. తత్ఫలితంగా దేవలోకానికి చేరుకుంటాడు. దేవలోకమంటే సాధారణంగా జనాల హృదయాలలో మెదలే భోగభూమిగా సంభావింపరాదు. 'దేవ' శబ్దానికి శమదమాది ముముక్షు ధర్మాలు అర్థాలని శాంతి పర్వంలో వేదవ్యాసులు సూచించారు. కనుక దేవలోక మంటే మోక్షసాధన సస్యాన్ని పండించుకునే క్షేత్రంగా వ్యాఖ్యానించు కోవాలి.

అర్జునుడు వ్యాసోపదేశం మీద అస్త్ర సంపాదన కోసం తపస్సు చేయటానికి వెళ్లాడు. అతని విరహం అన్నదమ్ములకూ, అర్థాంగి ద్రౌపదికీ దుర్భరం అయింది. ఆవేదనకు ఉపశమనంగా పాండవులు తీర్థయాత్రలు చేయాలని నారదుని ప్రేరణతో నిర్ణయించుకున్నారు. కులపురోహితుడు ధౌమ్యుని దిశానిర్దేశం చేయవలసినదిగా ధర్మరాజు ప్రార్థించాడు. ఆ ధౌమ్యుని ఉపదేశంలో కూడా గోదావరీ నదీమతల్లి మనకు మహోన్నతంగా కనిపిస్తుంది.

దక్షిణస్యాం తు పుణ్యాని శృణు తీర్థాని భారత,
విస్తరేణ యథాబుద్ధి కీర్త్యమానాని తాని వై.
యస్యాం మాఖ్యాయతే పుణ్యా దిశి గోదావరీ నదీ.
బహ్వారామా బహుజలా తాపసాచరితా శివా.

వన - 66- 1,2

'నాయనా! ధర్మరాజా! భరత వంశమణిదీపమా! దక్షిణదిక్కులో ఉన్న పుణ్య తీర్థాలను బుద్ధికి అందినంత మేరకు తనివితీరా వర్ణిస్తాను విను'. అని ధౌమ్యుడు మొట్టమొదటగా గోదావరినే ఎన్నుకున్నాడు.

'ఆ దక్షిణ దిశలో గోదావరి పుణ్యనది. అక్కడ ఎన్నో ఆరామాలు (తోటలూ, దేవక్షేత్రాలూ ఉన్నాయి). ఆ నదిలో జలం పుష్కలంగా ఉంటుంది. అంతేకాదు. గొప్పగొప్ప తాపసులందరూ దానిని సేవించుకుంటూ ఉంటారు. అది సర్వ శుభాలకు నెలవైనది. మంగళస్వరూపిణి'.

ఈ మాటలలో ఎంత మహిమ ఉన్నదో మనం గమనించాలి. చెప్పే వ్యక్తి ఒక బ్రహ్మానుభూతిగల ఋషి. వినే వ్యక్తి అనుక్షణమూ హృదయకేదారంలో అనితర సాధారణమైన పుణ్యసస్యాలను పండించుకొనే తపన గల యుధిష్ఠిరుడు. విషయం గోదావరికి సంబంధించినది. 'పుణ్యా, శివా, బహ్వారామా, బహుజలా, తాపసాచరితా' అని అయిదు విశేషణాలతో ఒక్క చిన్న శ్లోకాన్ని నింపి వర్ణిస్తున్నాడు. ఇది ఎంత సుందరమైన కథనమో, పావన గౌతమి ఆయన హృదయసీమలో ఏ యెత్తులలో కదలాడుతున్నదో మనం గమనించాలి.

మరొక ఘట్టం - ధౌమ్యుని వలన పుణ్యతీర్థాలను గూర్చి ఆలకించిన ధర్మరాజు తమ్ములతో ధర్మ పత్నితో శక్తి కొలదిగా తీర్థాలను సేవించుకుంటున్నాడు. అందులో భాగంగా మన గోదావరిని కూడా మనసారా తనివితీరా ఆరాధించి సేవించాడు.

తత్రాపి చాప్లుత్య మహానుభావః
సంతర్పయామాస పితౄన్ సురాంశ్చ,
ద్విజాతి ముఖ్యేషు ధనం విసృజ్య
గోదావరీం సాగరగా మగచ్ఛత్

వన- 118- 3

ధర్మరాజు వరుసగా తీర్థాలు సేవిస్తూ 'ప్రశస్త' అనే నదిని దర్శించుకున్నాడు. (ప్రశస్త అనేది ఒక నది అని నీలకంఠులూ, మానియర్ విలియమ్స్ చెప్తున్నారు.) దానిలో నిండుగా మునకలాడి ధర్మరాజు పితృదేవతలకు, దేవతలకు తర్పణాలు చేసి పుణ్యపురుషులకు గొప్పగా దానాలు చేసి తరువాత సాగరానికి సంబరంతో సాగిపోతున్న గోదావరీ నదిని చేరుకున్నాడు. అక్కడ కూడా పైని చెప్పిన స్నానతర్పణాదులు భక్తి శ్రద్ధలతో నిర్వహించాడనేది ధ్వని రూపంలో మనకు తెలియవస్తుంది.

మార్కండేయ మహర్షి మాట వింటేనే మనస్సు పులకరించి పోతుంది. ఆయన సృష్టి అంతా ఏకార్ణవమయినప్పుడు దిక్కుతోచక తిరుగాడుతుండగా వట పత్రం మీద విలాసంగా కరారవిందంతో పదారవిందాన్ని పట్టుకొని ముఖారవిందంలో ముద్దుగా ఉంచుకొంటున్న బాలముకుందుడు కానవచ్చాడు. నాయనా! అలసిసొలసి ఉన్నావు. ఇదిగో ఇందులో విశ్రాంతి తీసుకో! అని మార్కండేయుని తన ముఖ కమలం నుండి కడుపులోనికి భద్రంగా పంపాడు. ఆ కడుపులో బ్రహ్మాండ భాండాలనన్నింటినీ దర్శించిన మహర్షి గోదావరీ వాహినిని కూడా పరికించాడట!

సింధుం చైవ విపాశాం చ నదీం గోదావరీ మపి,
వస్వోకసారం నళినీం నర్మదాం చైవ భారత

వన- 188-103

మార్కండేయుడు మన్వంతర జీవి. మాధవుడు కాలావధులు లేని నిత్యసత్య చిత్స్వరూపుడు. అతని కడుపులో ఆడుతూ పాడుతూ తిరుగుతున్న గోదావరమ్మ కూడా అంత ప్రాచీనతను సంతరించుకున్నదియే యనటం అతిశయోక్తి కాదు కదా!

శ్రీరామచంద్రుల వారు పదునాలుగేండ్లు అరణ్యవాసం చేసిన సందర్భంలో గోదావరితో గొప్ప అనుబంధాన్ని పెంచుకున్నారు. వాల్మీకులతో పాటు వ్యాసులవారు కూడా ఈ విషయాన్ని ప్రత్యేక భావనతో ప్రస్తావించారు.

సత్కృత్య శరభఙ్గం స దణ్డకారణ్య మాశ్రితః.
నదీం గోదావరీం రమ్యా మాశ్రిత్య న్యవసత్ తదా.

వన- 277-41

'శ్రీరామచంద్రుడు శరభంగ మహర్షిని సత్కరించి దండకారణ్యంలో ప్రవేశించి రమ్య అయిన గోదావరినదిని ఆశ్రయించి అందు నివాసం ఏర్పరచుకున్నాడు.'

అంటే సర్వలోకోత్తరమూర్తి అయిన శ్రీరామచంద్రునికి కూడా గోదావరి రమ్యయై కన్పట్టింది. కోరిక పడి అక్కడ పర్ణశాల కట్టించుకొని ఆయన జానకీ లక్ష్మణ సహితుడై కాపురం ఉన్నాడు. గోదావరి అంటే ఆయన గుండెలో ఎంత గౌరవం! ఎంత ప్రేమ!! ఎంత ఆరాధనాభావన!!!

ఈ విధంగా శ్రీ వేదవ్యాసులు తమ భారతంలో పవిత్ర గోదావరీనదిని పరిపరి విధాల స్మరించి కొనియాడారు. మానవజాతికి ఆ నదీమహనీయతను వర్ణించి చెప్పారు. ఇది దిఙ్మాత్ర దర్శనం.

పుష్కర సందర్భంలో ఈ ఋషి వాక్యాలను హృదయంలో పదిల పరచుకొని సేవించుకుంటే మరింతగా పుణ్యం పాకానికి వస్తుంది.

* * *

# ఆంధ్రమహాభారతంలో గోదావరి

–ముదివర్తి కొండమాచార్యులు

భారతావని ఎన్నో పవిత్ర నదీనదాలకు నిలయం. వాటిలో గంగ, యమున, సరస్వతి, నర్మద, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సింధు, ప్రణీత అనే పన్నెండు నదులూ పుష్కరప్రవేశం గల పుణ్యతీర్థాలని పెద్దలు పేర్కొన్నారు.

గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి,
నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్ సన్నిధిం కురు.

అని స్నానవిధిలో ప్రతిదినం మనం స్మరించే పావన నదీమ తల్లి గోదావరి.

గోదావరిని గంగ అనీ, దక్షిణగంగ అనీ, గౌతమి అనీ సప్తగోదావరియనీ వివిధ నామాలతో మన కవులు పిలిచారు. భారతీయ సంస్కృతి నిధానములైన శ్రీమద్రామాయణ మహాభారత భాగవతాలలో గౌతమీ ప్రశంస కానవస్తుంది. ఆంధ్ర భాషకు ఆదికవి అయిన నన్నయ మొదలు చిన్నయ వరకు ఆ మాటకొస్తే సినీ రచయిత ఆచార్య ఆత్రేయ వరకు గోదావరిని కొనియాడని తెలుగు కవి లేడనడం అతిశయోక్తి కాదు.

అర్జునుడు సమయోల్లంఘన ప్రాయశ్చిత్తార్థం ద్వాదశ మాసిక వ్రతదీక్ష వహించి అన్నగారి అనుజ్ఞ పొంది తీర్థ యాత్రలకు బయలుదేరుతాడు. ఆ యాత్రల్లో మొదట గంగానదిని ఆ పిదప దక్షిణ గంగగా ప్రసిద్ధి వహించిన గోదావరిని సేవించి అనేకాగ్రహారాలతో విలసిల్లుతూ విప్రోత్తము లాచరించే యజ్ఞాలవల్ల కలిగే పుణ్యసమృద్ధితో వెలుగొందే వేంగీదేశ వైభవాన్ని తిలకిస్తూ కావేరీ సాగరసంగమంలో ధరణీ దేవులకు దానాలిచ్చి ధన్యుడయ్యాడని నన్నయ భట్టారకుడు స్వస్థాన వేషభాషాభిమానంతో తాను రచించిన భారత ఆదిపర్వ అష్టమాశ్వాసంలో మూలంలో లేని వేంగీవిషయ విభవాన్ని కీర్తించాడు.

ఆ పద్య స్వరూప మిది.


సీ. దక్షిణ గంగనాఁ దద్దయు నొప్పిన
గోదావరియు జగదాదియైన
భీమేశ్వరంబును బెడగగు చున్న శ్రీ
పర్వతంబును జూచి యుర్విలోన
ననఘమై శిష్టాగ్రహార భూయిష్ఠమై
ధరణీసురోత్త మాధ్వర విధాన
పుణ్య సమృద్ధమై పొలుచు వేంగీదేశ
విభవంబుఁ జూచుచు విభుఁడు దక్షి

తే. ణాంబురాశి తీర్థంబున కరిగి దురిత
హారియైన కావేరీ మహాసముద్ర
సంగమంబున భూసురేశ్వరుల కభిమ
తార్థ దానంబుఁ జేసి కృతార్థుఁడగుచు.

ఆది. 8 ఆ 139

అవిరళ జపహోమ తత్పరుడైన వాగను శాసనుడు తాను నిత్యం మునిగే దక్షిణగంగ గోదావరినీ, తనకు ఆశ్రయ దాత అయిన రాజరాజ నరేంద్రుడు పరిపాలించే వేంగీదేశాన్ని వర్ణించకుండా ఎలా ఉండగలడు?

ధర్మజుడు ప్రతిస్మృతి అనే యోగవిద్యను అర్జునుడికి ఉపదేశించి తపోయోగబలంతో ఇంద్రుణ్ణీ, ఈశ్వరుణ్ణీ మెప్పించి పరమాస్త్ర లాభం పడసి రమ్మని చెప్పి పంపి, గాండీవి రాకను ప్రతీక్షిస్తూ కామ్యక వనంలో ఉండగా నారదమహర్షి వచ్చాడు. ఆయాతీర్థ మహిమలు తెలుపుమని ధర్మపుత్రుడు వేడుకొనగా



పులస్త్యమునీంద్రుడు భీష్మునికి చెప్పిన సకల తీర్థ మహిమలు నారదుడు వివరిస్తూ-

''పెన్నయును మహానది నాడిన మయూర హంస విమానగతు లగుదురు. గోదావరీ స్నానంబు చేసిన దశాశ్వమేధ ఫలంబు వడయుదురు. సప్తగోదావరీ తీర్థంబును నాడిన పుణ్యులు పుణ్యలోక ప్రాప్తు లగుదురు''.

అర 2ఆ 278

అని గోదావరీ స్నాన ఫల మెలాంటిదో చెపుతాడు. అంతటితో తీర్థ ప్రభావ ప్రసంగాన్ని విరమించక దేవర్షి నారదుడు--

క. ఇది సిక్కువ మని మనములఁ
బదిలంబుగ తీర్థ సేవ భక్తిఁ దలఁచినన్
విదితముగ దురితహరమగు
సదమల సుజ్ఞాను లగుట సత్యము ధరణిన్.

అర 2ఆ 284

చ. వ్రతములు లేనివారు నుపవాస పరాఙ్ముఖులైనవారు దు
ర్మతులు విహీన శౌచులు గ్రమంబున తీర్థము లాడనోప: రా
తతగుణశాలి నీ వఖిల ధర్మ విదుండవు గావునన్ శుభ
స్థితిఁజని తీర్థసేవనము సేయుము నీకు నభీష్ట సిద్ధిగన్.

అర 2ఆ 286

పులస్త్య వచనంతో భీష్ముడు ఎల్లతీర్థాలు సేవించి కృతార్థుడైనట్లు నీవు కూడా దేవలోకం నుంచి నీకడకు రానున్న రోమశ మహర్షి తోడ్పాటుతో తీర్థ సేవచేసి కృతకృత్యుడివి కమ్మని చెప్పి వెళతాడు. అంతలో రోమశమహర్షి వచ్చి అర్జునుడు ఇంద్రుని వద్ద క్షేమంగా ఉన్నాడనీ, శీఘ్రమే రాగలడనీ, దేవేంద్రుడు నీచేత తీర్థయాత్రలు చేయింపుమని నన్ను నియమించాడు అనీ చెపుతాడు. ధర్మజుడు రోమశమహర్షితో కలసి తీర్థయాత్రలు కావిస్తూ దక్షిణ దిశగా వెళ్ళి అక్కడ పరమ పవిత్రమైన గోదావరిని దర్శించాడని శబ్దశాసనుడు అరణ్యపర్వ తృతీయాశ్వాసంలో వాకొన్నాడు.

క. భూవినుతంబై త్రిభువన
పావనమై త్ర్యంబక ప్రభవమైన జలౌ
ఘావళి పవిత్రమగు గో
దావరి పుణ్యనదిఁ గనియెం దక్షిణగంగన్.

అర. 3ఆ 156

ఉత్తర గంగను భగీరథుడు ధరణికి తరలించుక వస్తే, దక్షిణగంగగా ప్రసిద్ధిగాంచిన గోదావరిని శివ జటాజూటం నుంచి నిర్గమింపజేశాడు గోహత్యాపాప పరిహారార్థం గౌతమ మహర్షి. పూతసలిల గోదావరి రాజమహేంద్ర పురి వద్ద తుల్య, ఆత్రేయ, భరద్వాజ, గౌతమి, వృద్ధ గౌతమి, కౌశికి, వసిష్ఠ అనే పేర్లతో ఏడు పాయలుగ చీలి తూర్పు సముద్రంలో అంతర్లీన మవుతుంది. అటువంటి పుణ్యనదిలో గోబ్రాహ్మణ దేవతాభక్తి పరుడైన ధర్మపుత్రుడు స్నానంచేసి దానములు సల్పి అక్కడ నుంచి కదలి ప్రభాసతీర్థంలో పన్నెండు రోజులు తపస్సు చేశాడని ఆంధ్ర కవిత్వ విశారదుడు నన్నయభట్టు గోదావరీ పుణ్య ప్రవంతిని స్మరించాడు.

శా. గోదేవ క్షితిదేవ భక్తిపరుఁడై గోదావరీ స్నాతుఁడై
గోదానంబులు హేమదానములు పెక్కుల్ రత్నదానంబులున్
భూదేవోత్తమ పూజసేయుచు జగత్పూజ్యుండు ధర్మాత్మజుం
డాదిత్యాభుఁ డనేక తీర్థ శతసేవాసక్త పుణ్యాత్ముఁడై.

అర. 3ఆ 157

ఈ విధంగా ప్రథమాంధ్ర మహాకవి తన భారత రచనలో గోదావరిని కీర్తించడం జరిగింది.

సంజయుడు భారత వర్షంలోని విశేషాలు ధృతరాష్ట్రుడికి చెప్పే సందర్భంలో నదుల ప్రస్తావన వస్తుంది.

గంగయు, తుంగభద్రయు, వేత్రవతియు, వేదవతియు,
కృష్ణవేణియు, పెన్నయు, యమునయు, తమసయు,
శరావతియు, కావేరియు, గోదావరియు..............
నను మహానదులు మఱియు ననేక సరిద్విశేషంబులునుం
గలిగి వీనివలన నానాముఖంబుల ధనధాన్యాది సంప
దాగమంబులు సొంపు మిగిలియుండు-

భీష్మ 1ఆ 38

అంటూ సంజయుడు చేసిన ఈ నదీ ప్రస్తావనలో తెలుగు దేశాన్ని ధనధాన్య సుసంపన్నం కావిస్తున్న తుంగభద్ర, కృష్ణవేణి, పెన్న, గోదావరులు చేరియుండటం గమనార్హం. మూల విధేయంగా అనువాదం సాగినప్పటికీ కవిబ్రహ్మ తిక్కన సోమయాజి ''శ్రీయును గౌరినాఁబరఁగు చెల్వకు'' అంటూ విరాట పర్వ రచనకు శ్రీకారం చుట్టినది. ఈ పినాకినీ తీరంలోనే గదా!

అట్లాగే ''శ్రీవాణీ గిరిజాశ్చిరాయ'' అనే మంగళ శ్లోకంతో నన్నయగారు ఆదిపర్వ రచన మారంభించింది ఈ గోదావరీ తటినీ తటంలోనే కదా!

రాఘవుండు చిత్రకూటంబు వాసి శరభంగు పాలికిం జని
యతనిచేత సత్కృతుండై దండకారణ్యంబు సొచ్చి
యందు గోదావరీ తీరంబున ననుజవధూ
సహితంబుగా కృతనివాసుండై యున్నంత.

అర. 6ఆ 312

అని ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱాప్రెగడ అరణ్యపర్వంలో రామాయణ కథా రచన సాగిస్తూ శ్రీరామచంద్రమూర్తికి గోదావరీ తీరవాసం కల్పించాడు.

వింటే భారతం వినాలి, తింటే గారెలే తినాలి అనే నానుడికి స్థిర ప్రతిష్ఠ కల్గించిన కవిత్రయం వారి ఆంధ్ర మహాభారతంలో గోదావరీ మహానది దృష్టి దర్పణం కావిస్తుంది.

★★★

# ప్రాచీన ఆంధ్ర సాహిత్యంలో గోదావరి

డా॥ కె. సర్వోత్తమరావు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహించే నదులలో గోదావరి పెద్దనది. అలాగే ప్రాచీనాంధ్ర సాహిత్యంలో కూడా గోదావరి ప్రస్తావన ఇతర నదులకంటె ఎక్కువ అనడంలో సందేహం లేదు. ఈ నదీ ప్రస్తావన ఆంధ్రసాహిత్యంలో నాలుగు రకాలుగా కనిపిస్తుంది. తెలుగు కవుల అవతారికా భాగాలలో 'గోదావరి' ప్రశంస, తెలుగు కవుల కావ్యాలలో కథాభాగంలో పౌరాణిక పురుషుల తీర్థయాత్రల వర్ణనలలో 'గోదావరి' ప్రశంస, ప్రత్యేకించి గోదావరి మహిమలను వర్ణించే కావ్యాలలో గోదావరి ప్రశంస. ఆయా కవుల వర్ణనాదులలో గోదావరి ప్రశంసలని వింగడించుకోవచ్చు. వీనిలో కొన్నిటిని విశదీకరించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం.

ప్రాచీన ఆంధ్రకవులలో ఆంధ్రాభిమానాన్ని స్పష్టంగా నిరూపించుకొన్న కవి శ్రీనాథుడు. అతడు కాశీ ఖండంలో వీరభద్రారెడ్డి శివపూజను వర్ణించాడు. వీరభద్రారెడ్డి గోదావరి పావనోదకాలతో శివునికి జలకమార్చేవాడట (1-48) అలాగే వేమారెడ్డి త్ర్యయంబకాచల కన్యకాంబు పూరమున అఘమర్షణ స్నానం ఆచరించేవాడట. పైగా గౌతమ కన్యాలహరీ విరహతాంట వాటోపుడయిన వేమారెడ్డి త్రైలోక్యవిజయ సౌధంలో నివసించేవాడట.

సాహితీ సమరాంగణ సార్వభౌముడయిన కృష్ణదేవరాయల దినచర్యను, విజయయాత్రలను అభివర్ణించే వచన కావ్యం రాయవాచకం. గంగా యమునా సరస్వతీ గోదావరి కావేరీ తీరాలలో అహోరాత్రాలు అన్నదానం చేసే అంశం ప్రస్తావితం. అలాగే ముకుంద గజపతి తన షోడశపాత్రులతో అనుదినం గోదావరిలో స్నానం చేసి జగన్నాయకులకు పూజానమస్కారాలు చేయడం వర్ణితం. కృష్ణరాయ విజయంలో కూడా గోదావరీ స్నానార్థం బరుదెంచు వారల ప్రసక్తి ఉంది.

హైందవులకు తీర్థయాత్రలు నచ్చిన అంశం. మత సమైక్యతకు, లౌకిక జీవనాసరళి అర్థం చేసుకోవడానికి, జ్ఞానాభివృద్ధికి తీర్థయాత్రలు దోహదం చేస్తాయి. ఈ దృష్టితో మహాకవులు తమ కావ్యాలలో ప్రముఖ పాత్రల తీర్థ యాత్రలను వర్ణించారు. నన్నయ్య ఆంధ్రమహాభారతంలో అర్జుడు చేసిన తీర్థయాత్ర క్రమంలో "దక్షిణ గంగ నా॰ దద్దయ నొప్పిన గోదావరిని" (ఆది పర్వం 8.139) చెప్పాడు. మూలంలోని అంశం ఇది. అలాగే పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో శ్రీశైల యాత్రికులు మార్గమధ్యంలో పుష్కర సమయంలోనూ, సూర్య గ్రహణాదుల కాలంలోనూ గోదావరీ తీరంలో బహుళం బుగా కూడా పరుస జనాన్ని (423.4) ప్రస్తావించాడు. ఎఱ్రన నృసింహపురాణంలో శాలవుని తీర్థ యాత్రాక్రమంలో గోదావరీ కృతావగాహుడయిన అంశాన్ని (1-11) వర్ణించాడు. శ్రీనాథుని కాశీఖండం, భీమఖండం లలో గోదావరి వర్ణన అతివేలం. వ్యాస అగస్త్యులు ఆకాశ గమనం చేసి గోదావరి మండలాన్ని దర్శించిన వైనం వర్ణించాడు. అగస్త్యుడు గోదావరిని, దండ కారణ్యాన్ని దర్శించడాన్ని ఉల్లేఖించాడు. మునులు భయభక్తులతో

> గోదావరి గోదావరి
> గోదావరి యంచు బల్కు గుణవంతులకున్
> గోదావరి తల్లీ సం
> పాదింతు గదమ్మ నీవు భవ్యశుభంబుల్
>
> భీమ. 4-169

ప్రార్థించడాన్ని తెలియజేశాడు. బమ్మెర పోతన భాగవతంలో బలరాముని తీర్థయాత్రను వర్ణిస్తూ, కొమరు మిగిలి సప్త గోదావరికి నేగి యందు తీర్థమాడి (దశమ - ఉత్తర 951) నట్లు వర్ణించాడు. గోదావరిని గంగానే భావించి అభ్రంకష శుభ్రసముత్తుంగ భంగయగు గంగకుంజని (1-13) అని కీర్తించాడు. కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశకలో 'గ్రహిలుడు' చేసిన తీర్థయాత్రలో 'గౌతమీ తీర కాననము ల్దాఉుచు నొక్కనాడు కడు పుణ్యంబైన కాళేశ్వరంబున కేతెంచి ముక్తీశ్వరుని కొలిచిన'ట్లు (8-176) చెప్పాడు. భైరవకవి శ్రీరంగ మహాత్మ్యంలో భరద్వాజుడు కంచి దర్శించె .... గోదావరి గాంచె॰ కృష్ణానది భుజియించె (4-749) అన్నాడు. వెలగపూడి కృష్ణయామాత్యుని భానుమద్విజయంలో భానుమంతుడు దర్శించిన తీర్థాలు క్షేత్రాలలో 'గోదావరి' ఉంది.

రామాయణం రచించిన కవులందరు కూడా 'గోదావరిని' స్మరించినవారే. వానరులు సీతాన్వేషణం చేసే వేళ గోదావరి ప్రాంతాన్ని చెప్పినవారే. భాస్కర రామాయణంలోని

> దండకారణ్యంబున కరిగి యచట గిరివన దుర్గంబుల
> గోదావరీ తీరంబుల సంధ్ర పుండ్ర కేరళ కురుదేశంబుల బరికించుచు
>
> కిష్కింధ - 556

అనే వాక్యం సాక్ష్యం. అలాగే మడికి సింగన శ్రీరామచంద్రుడు గోదావరిని దర్శించిన తీరును-

> కనిరా గౌతమ గంగ సన్ముఖ కురం గస్ బ్రస్ఫుటాంభోజ నీ,
> వని సంభూత పరాగపూరిత విభా స్వ త్త్రైకతోత్సంగ ధీ
> రనికుంజోదర సుప్రకేసరి కిశో రస్తోమ సంగన్ వన
> స్థానీయార్ఘ్య విధాన దర్భసుమనస్స త్సంగం బృథ్వీశ్వరు॰

-అని వర్ణించాడు 8-126

తెలుగు సాహిత్యంలో నదీకావ్యాలు, క్షేత్రమహాత్మ్య కావ్యాల సంఖ్య పెచ్చు. వాటిలో 'భీమఖండం' ఒకటి. దీనికి గోదావరి ఖండమని పేరు. శ్రీనాథమహాకవి గోదావరిని, గోదావరి ఉపనదుల్ని, సప్తగోదావరిని, భీమమండలాన్ని అభినివేశంతో వర్ణించాడు.

ఆంధ్ర భూ భువన మధ్యము పుండరీకంబు
సప్త గోదావర జలము తేనె 3-50
పృథివి యెల్లను రక్షించు పేరుబాలు
మమ్ము రక్షించు గోదావరమ్మ యెప్పుడు 4-166
అప్సరోనికర సంసేవితంబు సప్తగోదావరంబు 3-20
మణి కర్ణికాప్రవాహమునకు సప్త గోదావర జలము సాటి 4-40
సప్తర్షిగోదావరి కలిదోష పాషాణ కులిశధార 4-32
సప్తగోదావరి సలిల ప్రవాహంబు
సాక్షాత్కరించిన జహ్నుకన్య 3-31
గౌతమి గంగ యాలోల ఘనతరంగ 4-162

తెలుగు కావ్యాలలో ప్రాస్తావికంగా 'గోదావరి' ఎన్నో చోట్ల ప్రస్తావింపబడింది. తిక్కన భీష్మపర్వంలో (1-38)సంజయుడు ధృతరాష్ట్రునికి భూపరిమాణం విశదీకరిస్తూ నదుల పేర్లను చెప్పిన వాటిలో 'గోదావరి' ఉన్నది. మారన మార్కండేయ పురాణంలో

సురుచిరమగు సప్తానగో
త్తరమున విలసిల్లుచుండుఁ దద్దయుఁ గోదా
వరి తత్ప్రదేశమున మనో
హరము పవిత్రము మునీంద్ర యంచిత ఫలిత్రిన్ 4-179

అనే వర్ణన ఉంది. వచన కవులలో ఆద్యుడయిన కృష్ణమాచార్యులు **'గోదావరి యావల శ్వేతద్వీపమందు మా మేనమామ శ్రీరంగాచార్యులు కలరు'** అన్నాడు. కోనేరునాథ కవి బాల భాగవతంలో **కావేరి గోదావరి కృష్ణవేణీ తుంగభద్ర భీమరథియను తరంగిణులు సహ్యమహీధరంబున వెడలె** (2-91) అని ప్రవచించాడు. భద్రాచల రామదాసు 'విరజానదియే గౌతమి' అని శతకంలో చెప్పాడు.

అనంతామాత్యుని భోజరాజీయంలో గౌతమి లేదా గోదావరి నది ప్రసక్తి మూడు కథల్లోను కనిపిస్తుంది. సర్పటి అనే సిద్ధుడు కాంభోజ రాజయిన మహుని కుష్ఠురోగివి కమ్మని శపించాడు. అప్పుడారాజు గౌతమిలో మేనునువైతు అని భావించాడు. అప్పుడు గౌతమి ఒక మునికన్యగా సాక్షాత్కరించింది. దత్తాత్రేయుని ధ్యానించవలసిందిగా సలహా ఇచ్చింది. ఆ మంత్రాన్ని కూడా ఉపదేశించింది. గౌతమియందు దర్శన స్పర్శనాదుల వర్జింపవలయును (1-107) అని నచ్చచెప్పింది. ఈలాగే మరోకథలో అరుంధతి గౌతమీ నదికి ఆ వైపున ఉన్న అగస్త్యునికి భోజనం తీసుకొని వెళ్ళేది. ఒకరోజు వరద వచ్చింది. వసిష్ఠుని ఆజ్ఞప్రకారం అరుంధతి గౌతమినది చేరి దారి యివ్వవలసిందిగా కోరింది. గౌతమి ప్రసన్నురాలయింది. అలాగే మరలి వచ్చేవేళ గౌతమిని వేడుకొని ఆశ్రమం చేరుకొంటుంది.

బొడ్డుచెర్ల చిన తిమ్మయ్య కృతి 'ప్రసన్నరాఘవ నాట్య ప్రబంధం'. ఈ ప్రబంధంలో గంగా, యమున, సరయువు, గోదావరి, సముద్రుడు పాత్రలు. ఈనదుల సంభాషణలలో రామాయణం చెప్పడం ఈ కావ్యవైశిష్ట్యం. తెనాలి రామలింగకవి పాండురంగ మహాత్మ్యంలో కుమారస్వామి నోట విశేషణాలతో నదులను కీర్తిస్తూ **'ఉత్తుంగ భద్రరాణ రాజిల్లు గౌతమి యోజ'** 1-148 అని వర్ణించాడు.

కవులు వర్ణనాప్రియులు. గోదావరిని వర్ణించినా అందులో ప్రత్యేకత ఉంటుంది. రాయలు నదీతీరంలో దానం చేసేవాడు. ఆ దానాలు అనంతం. అనంతదానధారలతో కృష్ణ గోదావరులలోని జలం నిండుకొంది. ఆ లోపాన్ని రాయల గజసైన్యం పూరించిందట. ప్రెగ్గడకవి పొంతయ్య అనే కవి 'గోదావరీ' శతకాన్నే వ్రాసి తన భక్తి ప్రపత్తులను ప్రకటించాడు.

స్థిర పుణ్యోదయ మేదినిందు వదనా సీమంత వీథిలస
ద్ఘుసృణ ముక్తాఫల సూత్రమో, సురుచిర క్షోణీ పురంధ్రియంగో
ధరధమ్మిల్ల లతాంత మాలికయొ; భూ తన్వీ కుచశ్రీ మనో
హరసంఖ్యానమొ నాగ నిధను బ్రహ్మా హంబొప్పు గోదావరీ

గోపీనాథ వెంకటకవి తన రామాయణంలో యథావాల్మీకంగా

మునిపతి చెప్పినట్లు బహు పుష్పిత భూమిరుహప్రకాండయై
యనుపమ చక్రవాక బక హంస మరాళ విరాజమానయై
ప్రణుత నవాంబు సంభవ తరంగ కణద్రవ గంధ వాహయై
కననగుచున్న దల్లదివొ గౌతమి కంటివె యమ్మహానదిన్

-అని వర్ణించాడు.

శ్రీజనమంచి శేషాద్రి శర్మగారు శ్రీరామ వనవాస వర్ణనలో గోదావరిని విలక్షణంగా ప్రవేశ పెట్టారు. లక్ష్మణుడు ఒకపొదలో ఉన్న శూర్పణఖ కుమారుని ఖండించాడు. శూర్పణఖ కొడుకు దగ్గరికి వచ్చింది. ఉలుకూ పలుకూ లేదు. అప్పుడు ఆర్ద్రతతో **'గోదావరీ మహాప్రదినీ మీనంబులను వండి తెచ్చితి తనయవర్య'** అని అన్నది. ఇదొక నూతన కల్పన.

త్ర్యంబ కాచల శిఖాగ్రమునందు నుదయించి
పొదలి యార్యావర్తభూమి దటిసి
మలగి దండకావనీ మధ్యభాగమున నా
ప్రస్రవణాచల ప్రస్థ మొఱసి
పట్టిస శ్రీవీర భద్రేశు సేవించు
తీర సోమేశు మందిరము డాసి
యేచి యనంత భోగేశ్వర స్థానంబు

రుద్రపాదములపైఁ ద్రోవగాఁగ
గోటిపల్లీశు కోమ లాంఘ్రులకు మొక్కి
కుండలా ముఖ తీర్థంబు గుస్తరించి
భీమమండలి డాపల పెట్టు కొనుచు
గౌతమీగంగ లవణాబ్ధిఁ గౌగలించె.

★ ★ ★

# శ్రీ భీమేశ్వర పురాణము - గోదావరీ మాహాత్మ్యం

-పర్వతనేని సుబ్బారావు

శ్రీనాథ రచితమైన భీమేశ్వర పురాణం భీమమండలంలోని తీర్థక్షేత్ర మాహాత్మ్యాన్ని గురించి వివరించే మహాకావ్యం. శ్రీనాథుడు 'ప్రౌఢ నిర్భర వయః పరిపాకం'లో భీమేశ్వరంలోని భీమనాయకుడి మహిమను వర్ణించి చెప్పాడు. నన్నయ రాసిన ఆంధ్ర మహాభారతం మొదటి పురాణం కాగా శ్రీనాథుడు రాసిన భీమేశ్వర పురాణం రాజమహేంద్రవరంలో రెండో ఆంధ్ర పురాణ గ్రంథంగా ప్రసిద్ధి పొందింది.

నెయ్యికొని కొలుతు నన్నయ
భట్టోపాధ్యాయు సార్వభౌముని గవితా
పట్టాభిషిక్తు భారత
ఘట్టోల్లంఘనపటిష్ఠ గాథాసప్తతిఘున్ భీమే 1-8

అని అదికవి నన్నయ భట్టారకులను శ్రీనాథుడు 'భీమేశ్వర పురాణము'లో ప్రశంసించాడు. గోదావరీ నదీమ తల్లిని కీర్తించిన మొట్టమొదటి ఆంధ్రకవి మన ఆదికవి కావటం విశేషం.

దక్షిణగంగ నా దనరు [illegible]
గోదావరియు [illegible]
[illegible] శ్రీ
పర్వతంబును [illegible]
[illegible] గ్రామాధారణంబు లై
[illegible]
[illegible]
[illegible] దక్షి

వాంఛ రాశితీర్థంబున కరిగి [illegible]
హరియైన కావేరి మహానదుల్
సంగమంబున భీమేశ్వరుల కథను
తార్థదానంబు జేసి కృతార్థుఁ [illegible]

అని నన్నయ గోదావరిని దక్షిణగంగగా పేర్కొన్నారు. దీన్ని ఆధారంగా తీసుకొని శ్రీనాథ కవిసార్వభౌములు భీమేశ్వర పురాణంలో గోదావరిని బహుధా శ్లాఘించారు. గౌతమ మహర్షి త్ర్యంబకాచల శిఖాగ్రం నుంచి గోదావరీ నదిని కొవ్వూరు దాకా తీసుకురాగా సప్తర్షులు సప్తశాఖలుగా చేసి సముద్రంలో చేరేటట్లు చేశారు.

తుల్యాత్రేయా భరద్వాజ గౌతమీ వృద్ధ గౌతమా
కౌశికీ వసిష్ఠా సప్తశాఖా ప్రకీర్తితా

తుల్య, ఆత్రేయి, భరద్వాజ, గౌతమి, వృద్ధ గౌతమి కౌశికి, వసిష్ఠలు, గోదావరి సప్తశాఖలు. గౌతమీ వసిష్ఠలు గోదావరి ప్రధానశాఖలు కాగా గౌతమి నుండి 7 శాఖలు ఏర్పడ్డాయి.

1. **తుల్య** : ఈ శాఖ ధవళేశ్వరం వద్ద ప్రారంభమై వేమగిరి, కడియం, జేగురుపాడు, అనపర్తి, రామచంద్రపురం తాలూకాలోని అనేక గ్రామాలను కలుపుతూ కాకినాడ సమీపంలో ఉన్న చొల్లంగి దగ్గర సముద్రంలో కలుస్తుంది. చొల్లంగి దగ్గర తీర్థాధిదేవుడు సోమేశ్వరుడు.



సర్పవరం నుంచి బయల్దేరిన వేదవ్యాసులవారు తుల్యభాగాతీరంలో ఉన్న జ్యోతిర్లింగ స్వరూపులయిన వాతాపీశ్వరుణ్ణి, ఇల్వలేశ్వరుణ్ణి, సంగమేశ్వరుణ్ణి వీక్షించిన విషయం మన భీమేశ్వర పురాణంలో ఉంది.

[illegible]

వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు దారులు కొట్టి అధిక ధనాన్ని కూడకట్టుకొన్నారన్న సంగతిని తెలుసుకొన్న అగస్త్యులవారు వారిని ధనాన్ని అడగటానికి వెళ్లారు. వాతాపీల్వలులు అగస్త్యుణ్ణి చంపాలనే దుర్బుద్ధితో ఇల్వలుడు మేకగా మారిన వాతాపిని చంపి అగస్త్యుల వారికి ఆహారంగా వండిపెట్టి ఆ ఋషి భుజించిన తర్వాత 'వాతాపీ' అని పిలుస్తాడు. అప్పుడు అగస్త్యుడు పొట్టను నిమురుకొని 'వాతాపి జీర్ణం' అనగానే వాతాపి జీర్ణమైపోతాడు. అన్న చనిపోయిన దుఃఖంతో ఇల్వలుడు మరణిస్తాడు. అప్పుడు అగస్త్యులవారు వాతాపీల్వలేశ్వర లింగాలను ప్రతిష్ఠిస్తారు. ఈ కథను ఇక్కడ అనుసంధించుకోవాలి. తాపేశ్వరానికి వుండపేట ఏడిది గ్రామాలకు మధ్య ఉన్నవాడు సంగమేశ్వరుడు. ఈ దేవదేవుణ్ణే 'గౌతమ నదీవాః సంగమేశానుఁడు' అని కవిసార్వభౌముడు పేర్కొన్నాడు.

భీమేశ్వర లింగస్థాపనకై గౌతమి పాయను దక్షారామానికి సప్తర్షులు తీసుకువచ్చారు. ఈ నదీ తీరంలో రాక్షసులు తపస్సు చేయసాగారు. ఇక్కడే వారు సత్కర్మలను కూడా ఆచరించ సాగారు. వారి యజ్ఞయాగాది సాధనాలు ప్రవాహంలో పడి కొట్టుకుపోయాయి. సప్తర్షులు తీసుకువచ్చిన గౌతమిని అదృశ్య అవుతుందని శపించారు. సప్తర్షులు అదృశ్యనది అయిన రాక్షస నదిని శుష్కతోయగా శపించారు. తుల్యభాగుడు అనే రాక్షస ముని సప్తర్షులకు దానవులకు సప్తర్షులు తీసుకు వచ్చిన నదిని అంతర్వాహినిగా తీసుకుపోవటానికి, రాక్షస నదిని పర్వదినాలలో స్నాన దానాదికంచే పుణ్యఫలదాయినిగా ఉండేటట్లు చేయటానికి సంధి చేశాడు. అప్పటి నుండి రాక్షసనది తుల్యభాగగా వ్యవహరించబడింది.

**2. ఆత్రేయి :** గౌతమి శాఖకు ఇవతలి భాగంలో కపిలేశ్వర పురం దగ్గర కణ్వనదీశాఖ ప్రారంభమయి రామచంద్రపురం తాలూకాలోని అంగర, టేకి, పామర్రు మొదలయిన గ్రామాల మీదుగా ప్రవహించి దంగేరు దగ్గర మళ్లీ గౌతమీ శాఖలో కలుస్తుంది. ఈ సంగమ స్థలం నుండి మరోశాఖ ఆత్రేయి మొదలయి కాకినాడ దగ్గర ఉన్న కోలంక, దుగ్గుదుర్రు, కాజులూరు గ్రామాలను దాటి కోరంగి దగ్గర సముద్రంలో కలుస్తుంది. కోరంగి దగ్గర అధిదేవతగా కురంగేశ్వరుడున్నాడు.

**3. భరద్వాజి :** గౌతమీనదీ శాఖ అయిన భరద్వాజి కోటిపల్లి దగ్గర చీలి పదమ్మెళ్ల క్రింది భాగంలో ఇంజరం దగ్గర సముద్రంలో కలుస్తుంది. ఈ సంగమ స్థలాన్ని అంతర్భూత గౌతమి అని వ్యవహరిస్తారు. ఈ సంగమ స్థలంలో - 1. గౌతమీ, 2. భరద్వాజి, 3. రేవ, 4. ఇంద్ర, 5. అహల్య, అనే అయిదు తీర్థాలున్నాయని తెలియజేస్తున్నారు. ఈ సంగమ స్థలాన్ని సంవేద్య మంటారు.

**4. గౌతమి :** గౌతమీ సాగర సంగమ స్థలం గంగాతీరంలో ఉన్న కాశీక్షేత్రం కంటే విశిష్టస్థలంగా వెలుగొందుతున్నదని, మోక్షదాయకమని శ్రీనాథుడు మనోహరంగా వర్ణించాడు.

[illegible]

ఈ గౌతమీ సాగర సంగమం గంగా తీర్థస్థలమయిన కాశీ క్షేత్రం కంటె విశిష్టమయినదని శ్రీనాథుడు వివరించాడు.

[illegible]

కుంభ సంభవుడయిన అగస్త్యులవారు వ్యాసమహర్షికి పై విధంగా తెలిపి -

[illegible]

సప్తర్షినదీ ప్రవాహమహత్త్వాన్ని స్పష్టపరిచాడు.

**5. వృద్ధగౌతమి :** ముక్తేశ్వరం (ముక్తీశ్వరము) నుండి ప్రారంభమై కొత్తలంక, కుండలేశ్వరం మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తోంది. వృద్ధ గౌతమీశాఖ అమలాపురం తాలూకా మురుగు కాల్వరూపంలో దృశ్యాదృశ్యంగా నేటికీ కన్పిస్తుంది. బ్రహ్మేశ్వరుడు, వృద్ధేశ్వరుడు నదీ సాగర సంగమ స్థలంలో ఉన్నారు.

**6. కౌశికి :** కపిలేశ్వర పురానికి ఆవలి ఒడ్డు నుండి విడివడి అమలాపురం తాలూకాలోని అనేక గ్రామాలను పునీతం చేస్తూ

'బెండమూరులంక' దగ్గర సముద్రగామి అవుతోంది. ఈ సంగమస్థలంలో రామలింగేశ్వర స్వామి, లక్ష్మణేశ్వర స్వామి ఉన్నారు. ఈ కౌశికీనదీ ప్రారంభ ప్రాంతంలో అగస్త్య ప్రతిష్ఠితుడైన 'మందేశ్వరుడు' ఉన్నాడు.

7. వసిష్ఠ : కొవ్వూరుకు 4 మైళ్ల దూరంలో ఉన్న విఘ్నేశ్వరం గౌతమీ నదీ పశ్చిమ తీరం నుండి విడిపోయి నేరుగా 'అంతర్వేది' వద్ద సముద్రంలో కలుస్తుంది. అక్కడ నీలకంఠేశ్వరుడు క్షేత్రాధిదేవత. కాగా అంతర్వేది నరసింహస్వామి సుప్రసిద్ధ దేవాధిదేవుడు. అంతర్వేది తీర్థం ప్రసిద్ధం. చొల్లంగి దగ్గర, పుష్యబహుళ అమావాస్యనాడు తుల్యాసాగర సంగమంలో స్నానం చేసి గోదావరీ సప్తశాఖా సంగమాలలోను స్నానాదికం కావించిన త్రైర్థికులు మాఘశుద్ధ దశమినాటికి అంతర్వేది చేరి నృసింహస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించి తమ యాత్రను పరిసమాప్తి కావిస్తారు. హరిహరాద్వైతానికి సప్త గోదావరీ యాత్ర ఒక చక్కటి ఉదాహరణ.

ద్వాదశ తీర్థ మహాత్మ్యాన్ని అగస్త్యులవారు వ్యాసులవారికి ఈ క్రింది విధంగా వివరించారు.

ఇంద్రేశతీర్థంబు మున్ను సోమార్కతీర్థంబు
సిద్ధేశ్వరము సర్వసిద్ధికరము
యోగీశతీర్థంబు యోగలక్ష్మీదాయి
కాళేశ్వరము భక్తకల్పతరువు
శమనేశతీర్థంబు శాంతిదాంతిప్రదంబు
వీరభద్రేశంబు విశ్వహితము
బ్రహ్మేశతీర్థంబు బ్రహ్మర్షి సేవ్యము
ప్తైశ్వర్యదము కపాలేశ్వరంబు

కుక్కుటేశంబు కాశికి గొంత వెలితి
సోమనాథేశ్వరము ముక్తి సూచకంబు
శ్రీమహేశ్వర తీర్థంబు శివుని మెచ్చు
త్రిభువనాధ్యర్చితం బుమాతీర్థ మనఘ భీమే. 3-74

ఇంద్రేశ తీర్థం, సిద్ధేశ్వర తీర్థం, యోగేశతీర్థం, కాళేశ్వర తీర్థం, శమనేశ తీర్థం, వీరభద్రేశ్వర తీర్థం, బ్రహ్మేశ తీర్థం, కపాలేశ్వర తీర్థం, కుక్కుటేశ్వర తీర్థం, సోమనాథేశ్వర తీర్థం. శ్రీ మహేశ్వర తీర్థం, ఉమాతీర్థం అనేవి.

ద్వాదశక్షేత్రవికచపత్త్రములతోడి
దక్షవాటిక యనెడి కెందమ్మివిరికి
సప్తగోదావరాంబునిర్ఝరము తేనె
నడుమ రాయంచ శ్రీభీమనాయకుండు భీమే. 3-78

కల్ప తరువుల వంటి ద్వాదశ తీర్థాలు. ద్వాదశ క్షేత్రాలనే వికచదళాలతో దక్షవాటిక అనే పద్మానికి సప్తగోదావర నీరం తేనెగాను, భీమేశ్వరుడు ఆ పద్మ మధ్య ఉన్న రాజహంసగానూ భావిస్తారు.

సప్తర్షి గోదావరీనదీ సోపాన సరణి సమీపాన భవనాన్ని అన్నయామాత్యుడు కట్టించాడు.

రాజమహేంద్ర దుర్గమునఁ గావించె శ్రీ
వీరభద్రునకుఁ బ్రాకార రేఖ
నిలిపె మార్కండేయు నీలకంఠుని ప్రోల
రామేశుఁ దమతల్లినామకముగ
సంగమేశ్వర దివ్యశంభులింగమునకుఁ
గల్పించె గల్యాణ గర్భగృహము
దక్షవాటిక యందుఁ దరుణేందు మౌళికి
మొగలివాకిటి ధామమును రచించెఁ

బ్రాగ్విశావప్రగోపుర ప్రాంగణమున
సప్తమునిసింధు సోపానసరణికెలనఁ
దీర్ఘభవనంబు భీమయ దేవునగర
మంత్రి దేవయయన్న యామాత్యవరుఁడు భీమే. 1-75

పక్షులతో, వృక్షాలతో వెలుగొందే దక్ష వాటి సప్త గోదావర వర్ణన భీమేశ్వర పురాణంలో కన్నులకు కట్టినట్లుగా శ్రీనాథ కవిసార్వభౌముడు వర్ణించాడు.

వేదండవదన చండాదండ ముకుళిత
ప్రోజ్జృంభశ్శటాప్లుతసభంబు
దేవగంధర్వాప్సరో వధూటీస్తన
స్థాపక శ్రీగంధ ధవళితంబు
కనక సౌగంధిక గంధోత్తమాగంధ
సార నిష్యందపుష్పంధయంబు
చటులటిటి ఘటారుఘాటకోలాహల
హంససంస న్నినాదాలసంబు

భూరి తీరావని మునిభూత భూత
జాతి వకుళ వనీసమాచ్ఛాద్యమాన
బహుళసింధు ధునీ వనదకమరాళ
దక్షపురి యొప్పు సప్తగోదావరంబు భీమే. 1-106

పంటలు సమృద్ధంగా పండటానికి గోదావరీ జలాల ఆవశ్యకత అందరికీ అవగతమే. ఈ విషయం భీమేశ్వర పురాణంలో ప్రసక్తమయింది.

పృథుల వారి శీకర పటలపానదర వికటకరటిముఖవికలిత
వరాటకోశవ్యాకోచహాటకకుశేశయంబులగు సప్త గోదావర
సలిలంబులచేతను, గోమలకంజల్కాగ్రగ్ర సనజా గ్రచ్ఛక్రవాకచరణ
నఖశిఖర సముల్లిఖితకమలకు వలయకుముదషండంబులగు
తీర్థకుండంబులచేతను, గోదావరీ తుల్యాభాగా కౌంతేయీ కణ్వా
పగానదీ మాతృకాయమానంబై యిరుగారునుం బంటపాసంగు
పంట పలంతి కేదార క్షేత్రంబులచేతను, నఖండితాంభస్సమృద్ధి
విజృంభించి భీమే. 1-110

గోదావరీ మండలాన్ని గోదావరీనదీమ తల్లి సస్య సమృద్ధం చేస్తోంది.

ఈశ్వరుడు సప్తగోదావరంలో స్నానం చేసి, త్రిపుండ్రాన్ని ధరించి, పసిడి వెన్నుని వీక్షించి, ఆకాశాన్ని అంటుతున్న హర్మ్యాన్ని అధిరోహించి భీమేశ్వర స్వామిని కొలుస్తుంటాడని.

నేదిష్టమున సప్తగోదావరంబున
నఘమర్షణస్నాన మాచరించి

త్ర్యాయుషమంత్రాక్షరాభి మంత్రితమైన
విమలభూతి త్రిపుండ్రము ధరించి
మొగలివాకిలి దాటి దిగువశాక్కరరాజు
నగరిపై వెన్నుని ననువు. జూచి
మణిశిలాసోపానమధ్యమార్గంబుగా
నభ్రంకషంబైన హర్మ్య మెక్కి

సప్తపాతాళభువన విష్కంభములను
వెలచి వెడలిన జ్యోతి: ప్రదీప్తమూర్తి
శంభు భీమేశ్వరేశ్వరస్వామిఁ గొలుచు
పరమమాహేశ్వరున కేమి బ్రాఁతి ముక్తి    భీమే. 1-114

ఆనంద పరవశుడై కవిసార్వభౌముడు గౌతమీగంగను ప్రస్తుతించిన రీతి రమణీయం.

త్ర్యంబకాచల శిఖాగ్రంబునం దుదయించి
పాదలి యార్యావర్తభూమి దాటి
మలఁగి దండక వనీమధ్య భాగమున నా
ప్రస్రవణాచలప్రస్థ మొలసి
పట్టిసశ్రీ వీరభద్రేశు సేవించి
తిలసోమనాథు మందిరము దాటి
యంత యనంతభోగేశ్వర స్థానంబు
పుణ్యపాదములపైఁ ద్రోచ గాఁగఁ

గోటిపల్లిను కోమలాంఘ్రులకు ద్రొక్కి
కుండలాముఖతీర్థంబు గుస్తరించు
భీమమండలి డాయఁ బెట్టికొనుచు
గౌతమీగంగ లవణాబ్ధిఁ గాఁగిలించె    భీమే. 3-25

శారికలు, పుంస్కోకిలలు, కిశోర బంభరాలు, నెమళ్ళు తరు, గుల్మ, వల్లికాదులు గోదావరీ జలాలతోపరి వృద్ధమయిన విధానం హృదయ రంజకంగా భీమేశ్వర పురాణంలో వర్ణించబడింది.

పంచాక్షరీమంత్ర పారాయణంబులు
జపియించు శారికానమురయములు
నీలకంఠస్తోత్రకోలాహల ప్రౌఢిఁ
జూపు నున్మత్తపుంస్కోకిలములు
శతరుద్రి యశ్రుతిస్వాధ్యాయపారంబుఁ
బఠియించుఁ గిశోరబంభరములు
ప్రణవాక్షరాభ్యాస పరిపాటిఁ బాటించు
నానావిధంబుల నమిలిపిండు

సప్తగోదావరాంబు నిర్ఝర సహస్ర
సారణీసేక సాంతత్య సంప్రవృద్ధ
వివిధ తరుగుల్మవల్లికావేల్లమైన
తత్పురోద్యానవీధికాంతరమునందు    భీమే. 3-28

భీమేశ్వర మండల సీమ గోదావరీ జలాల ఎల్లలుగా విభజించబడింది.

జంభరిపుదిక్కునకు సీమ సలిలరాశి
పశ్చిమమునకు సీమ త్ర్యంబకతనూజ
ద్యుమ్న పతిదిక్కునకు సీమ తుల్యభాగ
దక్షిణమునకు వృద్ధగౌతమియె సీమ    భీమే. 3-33

విశ్వపతి భీమేశ్వరుడు సప్త గోదావరంలో స్నానం చేసి భోగమోక్షాలను భక్తులకు ప్రదానం చేస్తాడని శ్రీనాథుడు విశదీకరించాడు.

..... ...... ...... ....... .....
సప్తర్షు లరుదేర సప్త గోదావరం
బవగాహనముచేసి నట్టి ప్రొడ
.... ....... ...... ...... ...
విశ్వపతి భీమనాథేశ్వరేశ్వరుండు
కర్తయై యుండి భోగమోక్షముల నిచ్చు
.... ..... ...... ..... ....    భీమే. 3-36

దక్షాధ్వరానల త్రయతీర్థం, అఖిలేష్టసంసిద్ధి తీర్థం, సోమేశ్వర తీర్థం, హైమవత తీర్థం, సప్తగోదావరం అనేవి పంచ తీర్థాలు. పంచేంద్రియాల వల్ల కలిగిన పాపాలను పంచ జనుడు గోదావరీ పంచ తీర్థాలలో స్నానం చేయటం ద్వారా పోగొట్టు కోవటాన్ని శ్రీనాథుడు స్పష్టీకరించాడు.

దక్షాధ్వరానలత్రయతీర్థ మొక్కటి
యోగాగ్ని నెందేని నురిసె గౌరి
యఖిలేష్ట సంసిద్ధి యింద్రు రెండవతీర్థ
మెందేని సుమ గాంచె సిద్ధసిద్ధి
సోమేశ్వరం బింద్రు సారిది మూఁడవ తీర్థ
మెందేని సభుము లిత్తింకు లింకు
హైమవతం బందు రది నాలుగవతీర్థ
మెందేని హిమవంతుఁ దొందె వరము

సప్త గోదావరంబు పంచమము తీర్థ
మఖిలశుభములు నెందేని నావహిల్లుఁ
బంచతీర్థంబు లివి యాడి పంచజనుఁడు
పాయుఁ బంచేంద్రి యోద్భవపాతకంబు    భీమే. 3-66

గోదావరిలో పితృపిండదానాదికం చేస్తే అక్షయఫలం లభిస్తుందని సదాసేవనం కైలాసాన్ని కలిగిస్తుందని భీమేశ్వర పురాణం విశదపరుస్తోంది.

సప్తగోదావరం బనుసారతీర్థ
ముత్తమోత్తమ మందు మర్త్యుండు చేయు
శ్రాద్ధతిలతర్పణాదు లక్షయఫలంబు
తత్సదాసేవనము శివస్థానదంబు    భీమే. 3-153

సప్త గోదావరంలో చేసే శ్రాద్ధాదికర్మకాండవిధులు గయలో చేసే కర్మకాండ విధుల వలె ఫలప్రదాయు లవుతాయి.

..... ...... ...... ....... .....
శ్రాద్ధపిండ ప్రదానాది సకల విధులు
నందు ఫలియించు నగ్గయయందుఁ బోలె.    భీమే. 3-154

శ్రాద్ధ పిండప్రదానాది సకల విధులు పితృదేవతలకు తృప్తి కల్గిస్తుంది.

శ్రాద్ధపిండప్రదానాది సకల విధులు
నొక్క టొక్కటి కోటిగుణోదయమునఁ
దృప్తిఁ గల్పించు దివి పితృ దేవతలకు
ధరణి ధరరాజశంభు తీర్థంబునందు    భీమే. 3-167

సప్త గోదావరి నదికి భీమేశ్వర స్వామి శబ్ద భేదమే (మాటలలో తేడాయే) కాని అర్థభేదం లేదు (సప్త గోదావరం, భీమేశ్వరుడు అనేవి రెండు భిన్న శబ్దాలు ఇవి అభేదాలు సప్త గోదావరం భీమేశ్వర స్వామితో సమానం) అని నారద మహర్షి తెలిపాడు

సప్త గోదావరంలో స్నానం చేసి ఈ క్రింది రెండు శ్లోకాల్ని పఠిస్తే హర ప్రభావం వల్ల పాపాలు నశిస్తాయి

> సప్త గోదావరం తీర్థం సర్వతీర్థోత్తమోత్తమమ్
> అత్ర సన్నిహితో రుద్రో భీమనాథేశ్వరేశ్వర ।
> నమస్తే భీమనాథాయ సప్తగోదావరాత్మనే
> పాపేన్ధనాగ్నయే తుభ్యం నిమజ్జామి హర! [illegible]

(అన్ని తీర్థాలలోను, అత్యుత్తమయిన గోదావరిలో ఇక్కడ భీమేశ్వరుడయిన రుద్రుడు సన్నిహితుడై ఉన్నాడు సప్త గోదావరీ జలాత్ముడయిన భీమేశ్వరునికి నమస్కారం పాపం అనే కట్టెలకు అగ్నివయిన నీలో స్నానం చేస్తున్నాను )

సప్త గోదావరాన్ని తలిస్తేనే ధన్యమతులవుతారు

> సప్త గోదావరము భీమశంకరుని
> నాకులేశస్వయంభుఁ బినాకపాణి
> రుద్రపాదంబులను సమారాధభక్తి
> [illegible] రెవ్వారు వార పో ధన్యమతులు [illegible]

సత్యవతీ తనయుడయిన వ్యాసుల వారు దక్షవాటికలో అనుదినం 'తుల్య గోదావరీనదిఁ దోయనిధిని సప్త గోదావరంబున స్నానమాడి, యాచరించు శివార్చనంబు' (భీమే 3-189), అని విదితమవుతోంది

అగస్త్యులవారు వ్యాసమహర్షికి గోదావరి తీర్థ మహిమను విశదీకరించారు

> జహ్నుకన్యాతీరసన్నివేశమునకు
> దక్షిణాంభోరాశితటము సాటి
> కమనీయమణికర్ణికా ప్రవాహమునకు
> సప్తగోదావరజలము సాటి
> కటకరక్షకుడైన కాలభైరవునకుఁ
> బ్రకట పాతాళభైరవుఁడు సాటి
> విశ్వాధిపతియైన విశ్వనాయకునకు
> భీమనాథేశ్వరస్వామి సాటి

> మోక్షవిభవంబునకు సాటి మోక్ష లక్ష్మి
> భోగమహిమంబునకు సాటి భోగమహిమ
> వారణాసికి శ్రీదక్షవాటమునకుఁ
> దారతమ్యంబు చర్చింప ధర్మ మగునె! భీమే 4-40

సప్తగోదావరి మహిమను 'తరమె, వర్ణింప' అని శ్రీనాథుడు ప్రశంసించాడు. 'సప్తగోదావర సలిలధారాహేమ కలశ సమితితో బలారి (ఇంద్రుడు) జలకమార్చి (భీమే. 4-90) నట్లు భీమేశ్వర పురాణాన్నిబట్టి తెలుస్తోంది.

భీమేశ్వర లింగ స్థాపన చేయటానికి ఉత్తమ తీర్థవాహిని అవసరమని గ్రహించిన సప్తర్షులు గోదావరమ్మను దర్శించి తీసుకువచ్చారు

> [illegible]
> [illegible]
> [illegible]
> [illegible]
> [illegible]
> [illegible]
> దక్షవాటపురం [illegible]
> [illegible]
> [illegible]

గౌతమీ గంగను దర్శించిన సప్తర్షులు పరమానందంతో గోదావరిని చూచి ఈ విధంగా సంస్తుతించారు

> [illegible]
> [illegible]

> [illegible]
> [illegible]

(ఓ దేవి! శివుని జటాజూటంలో నివసించే గోదావరి! ఈశ్వర ప్రేయసి! లోక సంరక్షణార్థం పుట్టిన నీకు నమస్కారం భీమేశ్వర సన్నిధిలో ఒకే స్వరూపంతో ఇక్కడ ఎల్లప్పుడు దగ్గర ఉంటున్నావు గోదావరీ! నీకు నమస్కారం) సప్తర్షులకు స్తుతి పాత్ర అయిన గోదావరి మనందరికీ పూజనీయ కదా

> కంటిరే ఘోరపాతకౌఘము [illegible]
> గతిపొఁ [illegible] గంగ యిప్పుడు
> [illegible]
> [illegible] భీమే 4 165

> యక్షగంధర్వ సిద్ధవిద్యాధరోర
> గామర వ్రాతభరితాధ [illegible]
> పృథివి యెల్లను రక్షించు పేరఁటాలు
> మమ్ము రక్షించు గోదావరమ్మ యెపుడు భీమే 4-166

గోదావరి తప్పకుండా తమ్ము రక్షిస్తుందని విశ్వసించిన సప్తర్షులు

> గోదావరి! గోదావరి!
> గోదావరి! యంచుఁ బల్కుగుణవంతులకున్
> గోదావరి తల్లి! సం
> పాదింతుగదమ్మ నీవు, భవ్యశుభంబుల్ భీమే 4-169

అని ప్రార్థించారు

సప్తర్షులు ఆరాధించిన గోదావరీ నదీమ తల్లి మనందరికీ మాన్య, ఆరాధనీయ, ఆయురారోగ్యైశ్వర్య ప్రదాయిని

★ ★ ★

# తెలుగు జానపద సాహిత్యంలో - గోదావరి

డా॥ జి. ఎస్. మోహన్

తత్రైవ గంగా, యమునా చ వేణీ
గోదావరీ సింధు సరస్వతీ చ.
సర్వాణి తీర్థాని వసంతి తత్ర
యత్రాచ్యుతోదార కథాప్రసంగః

-భగవన్నామ తీర్థాల్లో గోదావరి ఒకటి. ఎక్కడ భగవాన్ అచ్యుతుడి హరికథలు చెప్పబడతాయో అలాంటి స్థలాల్లో గంగ, యమున, వేణీ, గోదావరి, సింధూ, సరస్వతి నదులలాంటివి పవిత్ర తీర్థాలవుతాయి.

'దక్షిణ గంగ నాఁ దద్దయు నొప్పిన గోదావరియు......' అని నన్నయ తన మహాభారతం (ఆది 8-139) లో గోదావరిని దక్షిణ గంగగా అభివర్ణించాడు.

'గోదావరి' - దీని అసలు పేరు 'గోదా' నది. ఆ నదికి ఉపనదిగా 'శబరి' అనేది కలవడం వల్ల 'గోదాశబరి' అయిందట. క్రమంగా అది 'శబరి'లోని 'శ' వర్ణాన్ని వదలిపెట్టి 'గోదాబరి' అయిందనీ, వ, బలకు ఉన్న అభేత్వం వల్ల 'గోదావరి'గా మారి 'గోదారి' అయిందని అంటారు.

'పోషయతీతి పుష్కరం' - మేషం ఇత్యాది పన్నెండు రాశుల్లో వరుసగా గురువు సంచరించే సమయమే నదులకు పుష్కర కాలం. ఈ సమయంలో ముక్కోటి దేవతలు ఆయా నదులకు సన్నిహితంగా ఉంటారట. అందుకనే పుష్కరస్నానం శ్రేష్ఠమైంది, అతి పవిత్రమైంది.

జానపదులకు పుష్కరాల సమయం వేడుక సమయం. ఎంతో సంబర పడిపోతుంటారు. గోదావరి పుష్కరాలకు వెళ్ళిన ఓ పడుచుపిల్ల ఒయ్యారంగా తనవింత అనుభవాలను ఇలా చెప్తోంది.

గోదావరి పుష్కరాల వింతలు
దొడ్డమ్మ గోదావరి పుష్కరాల వింతలు
గోదావరి పుష్కరాలు చూదామని పోతుంటే
కొత్త నీటి కుదుపులకు కోక చెంగు బురదలకు
కొప్పులోన కొత్త సవరం
కొట్టుకో పోయిందో లమ్మ

(గోదావరి సీమ జానపద కళలు, వేడుకలు, పుట-160)

అలాగే మరో వయ్యారి ఇలాంటి భావాన్నే ఈ క్రింది గేయంలో వ్యక్తం చేస్తోంది.

గోదావరి పుష్కరాల ఇంతలూ
కోటిలింగాల కాడ
కొడుకుని కోసం నేను
కోరి నేను తానం చేతంటే
కొప్పు నున్న కొత్త సవరం
కొట్టుకు పోయిన గంగమ్మా
గంగమ్మా పొంగి రాకమ్మా
నువు పొంగి పొరలి పడ్తేనే
ప్రజలు అడిలి పోతారు

శ్రామిక గేయాలు శ్రమను మరపింపజేస్తాయి. ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్నీ కల్గిస్తాయి. 'గోదావరీ తల్లీకి గొజ్జంగి పూదండ' అంటూ పడవలాగే వాళ్ళు ఆయాసం తెలీకుండా రాత్రనక, పగలనక పనిచేస్తూ పాడుకొంటారు.

'ఏరుదాటియ్యరా జాలరన్నా' అంటూ ఓ యువతి ఇలా దీనంగా ఓ జాలరన్నను ప్రాధేయపడుతోంది.

అన్నా ఓరన్నా - ఓ జాలరన్న
ఏరుదాటియ్యరా - జాలరన్న
పొంగి పొరలోత్తుంది - జాలరన్న
వరదా నీరోత్తోంది - జాలరన్న
ఒడ్డుకు సేర్చరా - జాలరన్న
ఏటవతల మాయిల్లు - జాలరన్న
ఎప్పుడెళ్లి సేరుతానా - జాలరన్న
చీకటి పడిపోతనాది - జాలరన్న
ఒంటరి ఆడకూతుర్ని - జాలరన్న
గోదారి గట్టునా - జాలరన్న
మా గుడిసెలున్నాయి - జాలరన్న
ఏరు పొంగిందంటేను - జాలరన్న
గంగ పాలైపోతాయి - జాలరన్న
కనికరించి యిడువురా - జాలరన్న
మళ్లీ వచ్చి మాటాడతా - జాలరన్న
మంచిగ్గ నిను చూసుకుంట - జాలరన్న
నను ఏరు దాటియ్యరా - జాలరన్న

శ్రామికులు చాపలల్లుకొనేటప్పుడు పాడే జానపద గేయంలో గోదావరి ప్రసక్తి వస్తుంది చూడండి.

గోదావరొడ్డునా కొయ్యతాడి చెట్టో
ఎక్కండీ కొయ్యతాడి - కొట్టండీ మోపులో
రింగో జాజా యశో గౌరో జాజా !
..........................................
.......................................... (త్రివేణి, పుట 21)

జానపద వీరగాథలలో అల్లూరి సీతారామరాజు కథ ప్రసిద్ధి చెందింది. ఇది తెలుగు సాహసిక వీరునికథ. ఆంగ్లేయుల పరిపాలనలో అట్టుడిగిపోయిన తెలుగుతల్లి తన సహజ వీర

మాతృత్వాన్ని కోల్పోవలేదనడానికి ఈ కథాగేయం సాక్ష్యం. వీర గుణోత్కర్ష ఈ కథాగేయంలో అడుగడుగునా కన్పిస్తుంది. గోదావరి తీర ప్రసక్తి ఇందులో కన్పిస్తుంది.

[illegible]
[illegible]
[illegible]
[illegible]

-ఇలా కథారంగస్థలాన్ని కళ్ళకు కట్టేలా వర్ణించే సమయంలో గోదావరి ప్రసక్తి కన్పిస్తుంది.

అలాగే ఈ కథాగేయంలోనే సీతారామరాజు అలౌకిక సౌందర్యాన్ని వర్ణించే సమయంలో కూడ గోదావరి ప్రసక్తి కన్పిస్తుంది.

[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]

ఇలా గోదావరికి సంబంధించిన గేయాలు అనేకం ఉన్నా, కథాగేయాలు, కథలు వ్రేళ్ళ మీద లెక్కించేవిగా ఉన్నాయి.

సామెతలు, జాతీయాల్లో గోదావరి ఎలా చో[illegible] చేసుకొందో చూద్దాం.

[illegible]
[illegible]
[illegible]

అన్న వేమన పద్యంలోని మూడోపాదం 'కుక్కతోకపట్[illegible] కొని గోదావరి ఈదినట్టు / దాటినట్టు' అని సామెత ముద్ర[illegible] వేసుకొంది. ఇలాగే మరికొన్ని సామెతలు

[illegible]
[illegible]
[illegible]
[illegible]

కొన్ని జాతీయాలు :

[illegible]
[illegible]
[illegible]
[illegible]

ఇలా ఈ జీవనది గోదావరి తన ఉనికిని తెలుగ[illegible] జానపద సాహిత్యంలో నిలుపుకొంటోంది. ఎన్ని తరాలు మా[illegible] నా, గోదావరి తరంగాలు జానపదుల హృదయాలను తాకుతు[illegible] నే ఉంటాయి, తన్మయత్వంలో ఓలలాడిస్తూనే ఉంటాయి.

***



# శాసనాలలో గోదావరి

-ఆచార్య ఎస్. ఎస్. రామచంద్ర మూర్తి,

దక్షిణ గంగగా, గౌతమీగంగగా ప్రసిద్ధిచెందిన గోదావరి మహారాష్ట్రలోని సహ్యాద్రి కనుమలలో నాసికాత్ర్యంబ కంలో ఉద వించి ఆంధ్రదేశంలో నిజామాబాద్, కరీంనగర్, ఆది లాబాద్, ఖమ్మం జిల్లాల ద్వారా ప్రవహించి అనేక ఉపనదులను తనలో కలుపుకొని రాజమహేంద్రవరం వద్ద ఏడు పాయలై బంగాళాఖాతంలో కలుస్తున్నది. ప్రాణహిత, వైన్ గంగ, ఇంద్రావతి,శబరి, మంజీరలు గోదావరిలో కలిసే ఉపన దులలో ముఖ్యమైనవి. మరొక ఉపనది కిన్నెరసాని కవి సామ్రా ట్ విశ్వనాథ సత్యనారాయణగారి 'కిన్నెరసాని పాటలు' గేయ కావ్యం ఉద్భవించటానికి మూలకారణమైనది. నన్నయ, పోతన, మడికి సింగన వంటి ఎందరో కవులు గోదావరిని ఎన్నో విధాలుగా వర్ణించినారు. ముఖ్యంగా శ్రీనాథ మహాకవి తన భీమేశ్వర పురాణంలో గోదావరి పోకడలను ఇలా వర్ణించినాడు-

సీ. త్ర్యంబకాచల శిఖాగ్రమునందు నుదయించి
పొదలి యార్యావర్త భూమిఁ దఱిసి
మలఁగి దండకవనీ మధ్యభాగమున నా
గ్రస్రవణాచల ప్రస్థ మొఱసి
పట్టిస శ్రీ వీరభద్రేశు సేవించి
తిలసోమనాథు మందిరము డాసి
యేచి యనంతభోగేశ్వర స్థానంబు
రుద్ర పాదములపైఁ ద్రోవగాఁగ

తే. కోటి పల్లీశు సోమలాంఘ్రులకు మ్రొక్కి
కుండలాముఖ క్షేత్రంబు గుస్తరించి
భీమమండలి డాపలఁ బెట్టుకొనుచు
గౌతమీ గంగ లవణాబ్ధిఁ గౌగిలించె.

ఆంధ్రదేశంలో గోదావరీ తీరంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు వెలసినాయి. ఆంధ్రదేశానికి త్రిలింగదేశమని ప్రసిద్ధి. కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానపండితుడు విద్యానాథ మహా కవి శ్రీశైల, ద్రాక్షారామ, కాళేశ్వరాల మధ్య భూమిని త్రిలింగ దేశంగా పేర్కొన్నాడు. వీనిలో కాళేశ్వర, ద్రాక్షారామాలు గోదా వరీ నదీ ప్రాంతాలు. గోదావరీ తీర పుణ్యక్షేత్రాలు. ప్రాచీన కాలం నుండి ఎంతో ప్రాచుర్యం పొందినట్లు శాసనాలు ధ్రువీక రిస్తున్నాయి. గోదావరీ పుష్కరాల సందర్భంగా శాసనాలలో గోదా వరి, తత్తీరప్రాంత పుణ్యక్షేత్రాల ప్రసక్తిని, గోదావరీ పుష్కరాల ను పేర్కొన్న సందర్భాలను సంగ్రహంగా పరిశీలించటమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

కరీంనగర్ జిల్లాలోని మంథెన గ్రామంలోని శాసనం, క్రీ.శ. 1199 నాటిది, కాకతీయ మహారాజు గణపతి దేవుని అను మతితో చెర్నూరి దేశపాలకుడు అల్లుంప్రోలరాజు మహారాజ పురోహితుడు, త్రిభువన విద్యా చక్రవర్తి బిరుదాంకితుడు అయి న మంచి భట్టోపాధ్యాయునికి గ్రామ, తటాక నిర్మాణానికి గాను, మకర సంక్రాంతి పుణ్యకాలాన, ప్రాణహిత గోదావరీ సంగమ స్థలంలో కొంత భూమిని దానం చేసినట్లు పేర్కొంటున్నది. ఈ దానభూమి సరిహద్దులలో గోదావరి ఒకటి. మంత్రకూటం (మంథెన)లో నృసింహాలయాన్ని నిర్మించినట్లుగా కూడా ఈ శాస నం తెలుపుతున్నది.

కాకతీయ గణపతిదేవ మహారాజు కాలం నాటిదే మరొక శాసనంలో గోదావరీ తీరస్థ కాళేశ్వర గ్రామంలోని కాళేశ్వరాలయ ప్రసక్తి ఉన్నది. ఈ శాసనం కాళేశ్వరం (కరీంనగర్ జిల్లా)లోని ముక్తేశ్వరాలయంలో ఉన్నది. ఆ గ్రామంలోనిదే క్రీ.శ. 1397 నాటి మరొక శాసనం విజయనగర మహారాజు హరిహరరాయల కుమారుడు దేవరాయలు దిగ్వి జయ మహోత్సవ సందర్భంగా గౌతమీ (గోదావరీ) తీరంలోని ముక్తేశ్వరస్వామి ఆలయంలో తులాపూరుషదానం చేసినట్లు తెలుపుతున్నది. (''కుర్వన్ దిగ్విజయోత్సవం హరిహర శ్రీదేవరాయో నృపః శ్రీ ముక్తేశ్వరధామ్ని ధన్యమహిమాదానం తులా పూరుషం''). తులాపూరుషం షోడశమహాదానాలలో ఒక టి. దాత తన బరువుతో సమానమైన బరువుగల బంగారాన్ని దానం చేయటమే తులాపూరుషదానం. చక్రవర్తులు, మహా రాజులు చేయదగిన దానం ఇది.

పవిత్ర గోదావరీ తీరంలోని పట్టిసం వీరభద్రేశ్వర స్వామి ప్రసక్తి కొన్ని శాసనాలలో ఉన్నది. క్రీ.శ. 1143 సం॥ నాటి ఒక శాసనం ''ఉత్తరాయణతిథౌ గోదావరీ సన్నిధౌ శ్రీమత్పట్టిసవాసినే... శ్రీ వీరభద్రేశ్వరాయ'' అని పేర్కొంటున్నది.

గోదావరీ తీరస్థ ప్రధాన పట్టణాలలో ఒకటైన రాజమహేంద్రవర ప్రసక్తి పెక్కు శాసనాలలో కనిపిస్తున్నది. ముగ్గుళ్ళ పోతమశెట్టి అనే వైశ్యుడు క్రీ.శ. 1334 లో రాజ మహేంద్రవరం కోటలో గోపీనాథస్వామి ఆలయంలో రామ లక్ష్మణులను ప్రతిష్ఠ చేసి నిత్యనైవేద్యానికి గాను పుట్టెడు పొలం దానం చేశాడు. క్రీ.శ. 1438లో శింగన అనే వ్యక్తి ''మృకండేశ్వర దేవరకు ముందటి భద్రమండపమును అందు సుత్తడ్లువున్ను కళ్యాణమండపమున్ను దేవరకు నానా భరణమున్ను తూర్పు వుండపానకు అరంగులోన్ను మధ్యాహ్నపు అవసరానకు'' రెండు పుట్ల పొలాన్ని, వాహనాలను సమకూర్చినాడు. ఈ దేవాలయం గోదావరీ తీరంలోనే ఉన్నది. క్రీ.శ. 1850 లో రాజా వేంకటరాయనింగారు గోదావరీ తీర పట్టణమైన రాజమహేంద్రంలోని ''శ్రీ వేణుగోపాలస్వామి

శ్రీ నృసింహస్వామి శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల ఆలయములు విమాన త్రయము ముఖమంటపం కళ్యాణమంటపం ప్రాకారం'' నిర్మింప చేసినారు.

ద్రాక్షారామం (తూర్పుగోదావరి జిల్లా) త్రిలింగక్షేత్రాలలో ఒకటి. శ్రీనాథ మహాకవి స్కాందపురాణంలోని గోదావరీ ఖండాం తర్గతమైన ద్రాక్షారామ భీమేశ్వర మాహాత్మ్యమును 'భీమేశ్వర పురాణం' అనే పేరుతో తెలిగించినాడు. మురారి అనర్ఘరాఘవంలో ''అద్రవిషయ లక్ష్మ్యా సప్త గోదావరీహారక లాపైక నాయకో భగవాన్ భీమేశ్వరః'' అని వర్ణించినాడు. గౌతమీ మాహాత్మ్యములోని సప్త సాగర మాహాత్మ్య కథనంలో-

> గౌతమ్యా స్సప్తధాప్రోక్తస్సంగమస్సరితాంపతౌ
> తుల్యాత్రేయః భరద్వాజీ గౌతమీ వృద్ధగౌతమీ
> కౌశికీ వసిష్ఠా చ సప్త భాగా ప్రకీర్తితాః

అని తుల్య, ఆత్రేయి, భరద్వాజ, గౌతమి, వృద్ధగౌతమి, కౌశికి, వసిష్ఠలు సప్తగోదావరులుగా పేర్కొనబడినాయి.

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో లభించిన పెక్కు శాసనాలలో సప్తగోదావరి ప్రసక్తి ఉన్నది. క్రీ.శ 12 వ శతాబ్దినాటి ఒక శాసనం సప్తగోదావరి సరిహద్దుగా ఉన్న రెండువేల పోకమాకులతోపును భీమేశ్వరస్వామికి దానమొనర్చినట్లు తెలుపుతున్నది. అదే శతాబ్దికి చెందిన మరొక శాసనం సప్త గోదావరి సంగమమున శ్రీహరిహరేశ్వరాలయం ఉన్నట్లు తెలుపుతున్నది. క్రీ.శ. 1274 నాటి ఒక శాసనం సప్తగోదావరీ తీరంలోని భీమేశ్వరాలయాన్ని పేర్కొంటున్నది. క్రీ.శ. 1112నాటి మరొక శాసనం సప్తగోదావరిని పశ్చిమ స్రోతగా వర్ణిస్తున్నది.

గోదావరీ పుష్కరాలకు సంబంధించినంతవరకు ద్రాక్షారామ శాసనాలలో రెండు అత్యంత ప్రధానమైనవి. వీనిలో మొదటి శాసనం క్రీ.శ. 1154 నాటిది. 'సింహ బృహస్పతి' సందర్భంగా ఒక బ్రాహ్మణునికి కొంత భూమిని దానమొసగి నట్లు తెలుపుతున్నది. రెండవది క్రీ.శ. 1250లో మహామండలేశ్వర కోన సత్యరాజాదిత్య చోడగంగరాజు 'సింహబృహస్పతి', విషువు సంక్రాంతి పుణ్యకాలాన శ్రీ భీమేశ్వర మహాదేవర పడమటి సత్రమునకు భూమిని దానమిచ్చినట్లు తెలుపుతున్నది. ఈ రెండు శాసనాలలోని ''సింహబృహస్పతి'' గోదావరీ పుష్కరాలను (సింహరాశిలో ఉన్నబృహస్పతి) సూచిస్తున్నది.

క్రీ.శ. 1428 లో అన్న మంత్రి ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని గోపుర మంటపమును నిర్మించినట్లు ఒక శాసనం తెలుపుతున్నది.

'.....శ్రీయన్న మంత్రీశ్వరః ద్రాక్షారామజ భీమలింగ పురతః శ్రీ సప్తగోదాతటే ప్రాచీ గోపురమండపం సమకరో ద్రమ్యం శిలా నిర్మితం ద్వాదశ సంఖ్యాస్తంభే సదా బహిర్ద్వార మండపే విహరన్ రక్షతు భీమేశాఖ్యం శ్రీ దేవ యు యన్న సచివమాకల్పం''

క్రీ.శ. 14 వ శతాబ్దినాటి తెలుగు పద్యశాసనంలో సప్త గోదావరాన్ని సప్త సముద్రాలతో పోలుస్తూ ద్రాక్షారామ భీమేశ్వరాలయమును ప్రకాశ భారతీ యోగి మనోహరంగా వర్ణించినాడు-

1 [illegible] భీమేశ్వరావా-
2 [illegible] శ్రీ [illegible]-
3 [illegible] గో[illegible] వలె-
4 [illegible]
5 [illegible]
6 [illegible]
7 [illegible]
8 [illegible]-
9 [illegible] పరివారదేవ-
10 తా [illegible] చతుర్దశ భు-
11 [illegible] వారికియులు।
12 [illegible] అటుల గాంగి
13 ద్రాక్షారామ [illegible]
14 [illegible] గడు-
15 [illegible] శిష్టగాపించి వా-
16 [illegible] శ్రీ [illegible]
17 [illegible] ప్రకాశ భారతీ యోగి
18 క[illegible] సిద్ధనాచార్య లిఖితం

గోదావరీ తటాన వేంచేసి ఉన్న భద్రాచల సీతారామ లక్ష్మణులు, 'గోదారి తల్లి' ఆంధ్రులకు విడదీయరాని బంధం. మహా యోగులనుండి పామర జనం వరకు, మహాకవుల నుండి జానపద గేయకర్తల వరకూ గోదావరి తల్లి. గోదావరీ పుష్కర పుణ్యకాలంలో ఆ తల్లి ఒడిలో ఓలలాడాలని ఆశించని ఆంధ్రులు ఉండరు.

* * *



# కంబరామాయణంలో గోదావరి

-డా॥ యస్. జయప్రకాష్

తమిళ సాహిత్యంలో నదీ నదాల ప్రశంస అతి ప్రాచీన కాలం నుండీ చోటు చేసుకొని ఉంది. కావేరి, గోదావరి, పాలారు, వైగై, తామ్రపర్ణి మొదలైన నదులను దైవంగా, తల్లిగా భావించి స్తుతి గీతాలను రచించిన కవులు తమిళసాహిత్యంలో ఎందరో కనిపిస్తారు. గోదావరి నదికి సంబంధించిన ప్రశంస తమిళ సాహిత్యంలో కంబరామాయణంలో కనిపిస్తుంది. ''కంబని ఇంటి కట్టు కంబము కూడా కవిత్వం చెబుతుంది'' (కంబర్ వీట్టు కట్టు త్తఱియుమ్ కవి పాడుమ్), అనీ ''కవిచక్రవర్తి'' అనీ తమిళ పండితులచే ప్రశంసింపబడిన కంబమహాకవి గోదావరి నదిని నిసర్గ రమణీయంగా వర్ణించాడు.

పితృ వాక్య పరిపాలకుడైన శ్రీరామచంద్రుడు భార్య అయిన సీతతో, సోదరుడైన లక్ష్మణునితో అరణ్యవాసం చేయవలసి వస్తుంది. అరణ్యంలో వాసయోగ్యంగా ఉన్న ఒక ప్రదేశాన్ని అన్వేషిస్తూ వాళ్లు గోదావరి తీరంలో ఉన్న పంచవటిని చేరుకున్నారు. కంబమహాకవి దర్శించిన గోదావరి ఎంత మనోహరంగా ఉందో చూడండి:

శ్రేష్ఠములైన వస్తువులను అందిస్తూ, పొలాలను సస్యశ్యామలం చేస్తూ, ముల్లై, కురింజి, మరుదం, నెయ్‌దల్, పాలై - ఈ విధంగా అయిదు విభాగాలను కలిగిన ఈ భూ భాగాన్నంతటికీ జలాలను సమృద్ధిగా అందిస్తూ, చల్లదనాన్ని కలిగిస్తూ, పండిత ప్రకాండులు ప్రశంసించే కవిత్వాన్ని పోలినదై, భూదేవికి ఆభరణమై నిండుగా ప్రవహిస్తున్న గోదావరి నదిని పరాక్రమ సంపన్నులైన శ్రీరామ లక్ష్మణులు, సీతాదేవి దర్శించారు.

తుమ్మెదలకు ఆవాసంగా ఉన్న తామర పుష్పాలు వదనంగా, సౌరభాలను వెదజల్లుతున్న కలువ పూలు నయనాలుగా గోదావరి నది విరాజిల్లుతూ ఉంది. అటువంటి ఆ గోదావరి స్రోతస్విని ఆ ముప్వురినీ తన కన్నులారా దర్శించి స్వచ్ఛమైన తన జలాలచే అందమైన పుష్పాలను వెదజల్లుతూ వాళ్ల పాదాలకు ప్రణమిల్లుతూ ఉన్నదో అన్నట్లు ఉన్నది.

రెండు తీరాలను ఒరుసుకొని నిండుగా ప్రవహిస్తున్న గోదావరి నదిలో వికసించిన కలువపూలు అంతటా వ్యాపించి ఉన్నాయి. నీటి తుంపరలు ఆ పూల మీదపడి బిందువులుగా స్రవిస్తున్నాయి. అవి చూడ్డానికి ఎలా ఉందంటే నిర్దోషులు, సత్యశీలురు అయిన రామలక్ష్మణులను పతివ్రతాలలామ అయిన సీతాదేవిని చూచి వాళ్ల మీదున్న ప్రగాఢాభిమానంతో గోదావరి నది నిట్టూర్పులు వదలుతూ అందమైన కన్నుల నుండి భాష్పధారలు స్రవిస్తుండగా దుఃఖిస్తున్నదో అన్నట్లు ఉన్నది.

ఆ గోదావరి తీరంలో చక్రవాక పక్షులు జంటలు జంటలుగా విహరిస్తున్నాయి. వాటిని దంపతులైన సీతారాములిరువురూ చూశారు. శ్రీ రామచంద్రుడు చక్రవాక పక్షులను పోలిన సీతాదేవి వక్షోజాలపై తన దృష్టిని ప్రసరింప జేయగా సీతాదేవి కూడ చక్రవాక పక్షులవలె గుండ్రనై ఉన్న శ్రీరాముని ఎగుభుజాలపై తన దృష్టిని ప్రసరింప జేసింది.

సీతాదేవి నడకల అందానికి తాము సాటిరాలేమని గోదావరి నదీతీరంలో విహరిస్తున్న హంసలు సిగ్గుపడి తలలు వాల్చి తొలగి పోతున్నాయి. ఆ దృశ్యాన్ని చూచిన శ్రీరాముడు సీతాదేవిని చూచి చిరునవ్వులు చిందించాడు. ఆ గోదావరి నదీ తీరంలోనే ఒక వైపుగా ఏనుగులు శ్రీరామచంద్రుని నడకల సోయగాన్ని చూచి సిగ్గుపడి వెనుదిరిగి పోతున్నాయి. ఆ దృశ్యాన్ని చూచిన సీతాదేవి శ్రీరాముని వైపు తన చిరునవ్వులను ప్రసరింప చేసింది.

పవిత్రమైన గోదావరి నదికి ఇరువైపులా పూల తీగలు విస్తరించి ఉన్నాయి. నదీజలాల పిల్లగాలులకు అవి అటు ఇటూ కదలాడుతున్నాయి. వాటిని చూచి శ్రీరామచంద్రుడు సీతాదేవి నడుముపై తన కడకంటి చూపులను ప్రసరింప జేశాడు. ఆ గోదావరి నదిలో వికసించిన కలువపూలు విస్తారంగా ఉన్నాయి. వాటిని చూచిన సీతాదేవి శ్రీరామచంద్రుని మేని కాంతులపై తన దృష్టిని ప్రసరింప జేసింది.

పవిత్రమైన ఆ గోదావరి స్రోతస్విని దైవాంశను కలిగినది. సదా చల్లదనాన్ని కలిగిస్తూ ఉంటుంది. గోదావరి నదీతీరంలో ఒక వృక్ష వాటికలో ఏకాంతంగా ఉన్న ఒక ప్రదేశంలో సోదరుడైన లక్ష్మణుడు కంటికీ, మనసుకూ ఆహ్లాదాన్ని కలిగించే ఒక అందమైన పర్ణశాలను నిర్మించాడు. దంపతులైన సీతారాములిరువురూ లక్ష్మణుడు సేవలందిస్తుండగా పవిత్రమైన గోదావరి నదీతీరంలోని ఆ పర్ణశాలను ఆవాసంగా చేసుకున్నారు.

ఈ విధంగా కంబమహాకవి గోదావరి నదిని సకల జనావళికి అభీష్ట ప్రదాయినిగా, దైవాంశను కలిగినదిగా, దివ్యదంపతులైన శ్రీ సీతారామ చంద్రులకు హృదయాహ్లాద కారిణిగా అభివర్ణించాడు.

* * *

# వెండితెర వెలుగుల్లో గోదావరి మిలమిలలు

పైడిపాల

రామాయణంలో సీతారామలక్ష్మణులు పర్ణశాల నిర్మించుకోడానికి అనువైన ప్రదేశంగా గోదావరీ తీరాన్ని అగస్త్యమహర్షి సూచించాడు. ఋషివంటి నన్నయ గోదావరీ తీరమైన రాజమహేంద్రిలోనే ఆంధ్ర మహాభారతానికి శ్రీకారం చుట్టాడు. శ్రీనాథుడు గోదావరీ ప్రాంతంలోని పుణ్యక్షేత్రం మీద ఒక ప్రబంధాన్ని రచించాడు. భావకవులు గోదావరిని పౌరుషానికీ, పావిత్ర్యానికీ నెలవుగా సంభావించారు.

''గోదావరీ పారనోదార వాపుర మఖిల భారతము మాదన్ననాడు.........'' అని కవిసామ్రాట్ విశ్వనాథ ఆంధ్ర పౌరుషాన్ని అభివర్ణిస్తే--

''ఉప్పొంగి పోయింది గోదావరీ - తాను

తెప్పున్న యెగిసింది గోదావరీ.......!'' అంటూ బాపిరాజు వరద గోదావరి పరవళ్లను చూసి పొంగిపోయాడు. అనంతరం గోదావరీ సౌందర్యానికి ముగ్ధులై ఆ అనుభూతులకు పద్యాలలోను, వచన కవితలలోను, పదాలు కట్టిన, కడుతున్న ఆధునిక కవులెందరో!

ఇందరి రసహృదయాలను దోచుకున్న గోదావరి అందాలకు చిత్ర పరిశ్రమ మాత్రం స్పందించకుండా వుంటుందా? ఎటొచ్చీ తెలుగు టాకీ ప్రారంభమైన ముప్పయ్యవ దశకం ప్రధానంగా నాటక పరివర్తనల యుగం కనుక, ఆ తర్వాత వచ్చిన నలభయ్యవ దశకంలో ఎక్కువగా సంస్కరణల మీద స్వాతంత్ర్యోద్యమం మీద పరిశ్రమ దృష్టి కేంద్రీకరించింది కనుక - ఆ ఇరవయ్యేళ్లు తెలుగు చలన చిత్ర పరిశ్రమ గోదావరి వైపు చూడలేదు. అయితే ఆ కాలంలో వచ్చిన ''లవకుశ'' లో గోదావరిని చిత్రీకరించారనీ, దానిలో పొరపాటువల్ల రైలుబ్రిడ్జి కూడా కనిపించిందనీ ఇంటూరి వెంకటేశ్వరరావు చెప్పారు.

తెలుగు సినిమా పాటల్లో మొదటి సారి గోదావరి ప్రసక్తి 'మరదలు పెళ్లి' (1952)చిత్రంలో--

'పిలిచె గోదారొడ్డు, నోరూరించె బందరులడ్డు' అనే శ్రీశ్రీ పాటలో కనిపిస్తోంది.

ఇలాంటివి ఆ తర్వాత 'చిరంజీవులు' చిత్రంలో--


నీ ఆశ అడియాస, నీ బ్రతుకు అమవాస.....
కన్నులలో గోదారి కాలువలే కట్టింది. -ఆరుద్ర

'పెద్దమనుషులు' చిత్రంలో--

కుక్కతోక పట్టి గోదావరీదితే
కోటిపల్లి కాడ తేలేనయా - కొసరాజు

మొదలైన పాటల్లో వచ్చినా, ఇవి కాకతాళీయాలు తప్ప గోదావరి ఔన్నత్యాన్ని వర్ణించడానికి ఉద్దేశించినవి కావు.

దేశభక్తి గీతాలలో నదుల ప్రాశస్త్యం ఒక భాగం కావడం - భావగీతాల నుంచి సినిమా పాటలకు కూడా ఒక ఒరవడిగా వచ్చింది. ఆ ధోరణి 'పల్లెటూరు' చిత్రంలో వాడుకొన్న వేములపల్లి శ్రీకృష్ణ రచన--



'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!......' లో

'కల్లోల గౌతమి, వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్ర తల్లి పొంగి పొరలిన చాలు.....!'

-అనే పంక్తులలో కనిపిస్తుంది.

కొసరాజు 'కన్యాదానం' (1954) చిత్రం కోసం రాసిన 'ఓరోరి తెలుగువాడ, ఒయ్యారి తెలుగువాడ.........!' నృత్యరూపకంలో--

తుంగభద్ర కృష్ణవేణి, పొంగు లెత్తు గోదావరి
ముంగిట్లో తిరుగుచుండె, బంగారం పండు చుండె...!

అనే పంక్తుల్లో నదులవల్ల తెలుగునేల ఎలా సస్యశ్యామలమైందీ చెప్పే ఘట్టంలో కూడా ఇలాంటి భావనే కనిపిస్తుంది.

'పెళ్లినాటి ప్రమాణాలు' చిత్రం కోసం పింగళి రచించిన--

శ్రీమంతురాలివై చెలువొందు మాతా
మమ్ము దీవించుమా మా ఆంధ్రమాతా
కృష్ణ గోదావరీ హంద్రి నాగావళి
తుంగభద్ర పెన్న నదుల పుణ్యమున......!

అనే పాట కూడా పై కోవకు చెందినదే!



ఈ బడికి చెందిన మరో ప్రసిద్ధ గీతం ఎన్నో సినిమా లలో వినియోగించుకొన్నా--

మా తెలుగు తల్లికి మల్లె పూదండ
మా కన్న తల్లికి మంగళారతులు
గల గలా గోదారి కదిలి పోతుంటేను
బిర బిరా కృష్ణమ్మ పరుగులిడు తుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి

**అనే** శంకరంబాడి సుందరాచారి తెలుగుతల్లిని **అభివర్ణిస్తూ అల్లిన మల్లెపూల మాల!**

ఈ సంప్రదాయానికి సంబంధించిన పాటల్లో **మకుటాయమానమైంది-- 'విచిత్ర కుటుంబం'** చిత్రం కోసం **డా॥ సి. నారాయణరెడ్డి ఆంధ్రప్రదేశ్** పురా వైభవాన్ని నదులు ప్రాతిపదికలుగా వర్ణిస్తూ రాసిన పాట. కథా నాయకుడు విదేశీ వనిత అయిన నాయికను తెలుగునాట జీవనదుల్లో జలకాలాడించే సందర్భాన్ని తీసుకొని కవి గోదావరి, కృష్ణ తుంగభద్రలను ఎన్నుకొని, మొదటి చరణం గోదావరిపై రాశారు-

**ఆదికవి నన్నయ్య అవతరించిన నేల**
**తెలుగు భారతి అందియలు పల్కె ఈ నేల**
**ఆంధ్ర సంస్కృతికి తీయని క్షీర ధారలై**
**జీవకళ లొలుకు గోదావరీ తరంగాల .**
**ఆడవే జలకమ్ము లాడవే.......**

అనే ఈ చరణంలో 'క్షీరధారలు' **అనే ప్రయోగం గురించి** కవే వివరణ ఇచ్చాడు. నీరం కంటె క్షీరం జీవవర్ధని గనుక తెలుగుభారతి శైశవ దశలో వున్నప్పుడు **పెలువడిన మహాభారతం** పాలు ఒంటబట్టి వర్ధిల్లిందని కవి అభిప్రాయం. ఇలాంటి పాటల్లో కొలత కుదరకపోతే తప్ప దక్షిణాది నదులలో సాధారణంగా గోదావరికే అగ్రతాంబూల మివ్వడం గమనార్హం.

గోదావరికి చెందిన మిగతా పాటల **పోయల్ని పరిశీలించే** ముందు - గోదావరీ సౌందర్యాన్ని సంపూర్ణంగా **ఆవిష్కరించిన** తొలిచిత్రం గురించి ప్రస్తావించాలి. అంతకు ముందు 'ఇలవేలుపు' మొదలైన చిత్రాలకోసం గోదావరీ తీరంలో అడపాతడపా ఔట్‌డోర్ షూటింగ్ జరిగినా, గోదావరీ నేపథ్యంలోని కథను ఎన్నుకొని మాటల్లో, పాటల్లో చిత్రీకరణలో గోదావరితో పూర్తిగా ముడిపడిన మొదటి చిత్రం 'మూగమనసులే!' ఈ చిత్రాన్ని తమిళంలో 'ప్రాప్తం' గాను, హిందీలో 'మిలన్' గానూ పునర్నిర్మించినపుడు కూడా గోదావరి మీదే చిత్రీకరణ జరిగింది. అయితే గోదావరి జిల్లావాడైన ఆదుర్తికి అది అచ్చిరాగా, మహానటి సావిత్రికి ఆ 'ప్రాప్తం' లేక ఆర్థికంగా ఘోరంగా దెబ్బతింది. అది వేరే సంగతి!

1963 లో కోటిపల్లి, నర్సాపురం రేవుల్లో 'మూగ మనసులు' షూటింగ్ జరిగినప్పుడు ఒకటే సందడి అభిమానులతో ఆ ప్రదేశాలు తిరునాళ్ల లయ్యాయి. ఆ ముచ్చట్లను ఇప్పటికీ కలబోసుకొనే వారెందరో! ఒక మాటలో చెపితే ఆ చిత్రం ఓ సంచలనం!

ఆ చిత్రంలోని--

గోదారి గట్టుంది గట్టుమీద చెట్టుంది
చెట్టు కొమ్మన పిట్టుంది పిట్టమనసులో ఏముంది!

అనే దాశరథి పాట నానని నోరు లేదు!

**అహ నీ ముక్కుమీద కోపం నీ ముహానికే అందం!**

* * *

**నా పాట నీ నోట పలకాల సిలకా !**

**అంటూ ఆత్రేయ** తన పాటల్లో గోదావరి పరవళ్లను **పాత్రలతో** ప్రత్యక్షంగా అన్వయించగా, తక్కిన పాటల్లో ఆ **పరిసరాలను** అత్యద్భుతంగా చిత్రీకరించారు.

**తల్లి గోదారికి ఎల్లువొస్తె అందం**
**ఎల్లువంటి బుల్లోడికి పిల్ల గౌరి బంధం**

* * *

**నా నీడ సూసి నువు కిలకిలా నవ్వాల**
**పరవళ్ల సురుగుల్ల గోదారి ఉరకాల**

వంటి పంక్తులలో అచ్చమైన వలపును గోదావరి పరవళ్లలో మనోహరంగా ప్రతిబింబింపజేయడం గమనిస్తాం! 'ఈనాటి ఈ బంధ మేనాటిదో' అని ఆత్రేయ అన్నట్టు -

'మూగమనసులు' పేరు చెపితే చాలు గోదారి గుర్తొస్తుంది. ఆ గోదారి పేరు చెప్పగానే గుర్తొచ్చే రమణీయ దృశ్య కావ్యం మూగమనసులే!

ఆ తర్వాత 'తల్లీ గోదావరి' పేరుతో ఒక చిత్రమే తీసినా అది అంతగా జనాదరణకు నోచుకోలేదు. 'మూగ మనసులు' కు నకలు అనదగ్గ 'జానకి రాముడు' కూడా గోదావరీ నేపథ్యంలో తీసిందే!

'మూగ మనసులు' తీసిన మరుసటి ఏడే నిర్మించిన 'అనుపమా' వారి 'ఉయ్యాల - జంపాల' చిత్రంలోని కొంత భాగం గోదావరి పరిసరాల్లో చిత్రీకరించిందే.

ముఖ్యంగా ఆ చిత్రం కోసం ఆరుద్ర రాసిన--

**కొండగాలి తిరిగింది, గుండె వూసులాడింది**
**గోదావరి వరదలాగా కోరిక చెలరేగింది**

-అనే పడవపాట విస్తృత ప్రచారాన్ని పొందింది.

గోదావరి ప్రాంతీయుడైన ఆదుర్తి గోదావరికి 'దారి' చూపించగా, ఆ తర్వాత పరిశ్రమకు చెందిన ఎందరో అభిరుచిగల దర్శకులు దానిని విజయానికి రహదారిని చేసుకొన్నారు. వారిలో బాపు, విశ్వనాథ్, రాఘవేంద్రరావు, క్రాంతికుమార్, జంధ్యాల, వంశీ పేర్కొనదగ్గవారు.

బాపు చిత్రాలలో 'సాక్షి' కథా స్థలం గోదావరి పాయలకూ కాలువలకూ మధ్య వున్న ఓ చిన్న లంక అయితే, 'అందాల రాముడు' వేదిక రాజమండ్రి నుండి భద్రాచలం వెళ్ళే లాంచియే! 'అదిగో భద్రాద్రి గౌతమి, ఇదిగో చూడండి!' అంటూ విభిన్నమైన పాత్రలతో, భద్రాచల యాత్ర నెపంతో గోదావరి పొడవునా వుండే రమణీయ ప్రకృతికి అద్దం పట్టిన అందమైన ప్రయోగం 'అందాల రాముడు!' ఇంకా 'బుద్ధిమంతుడు', 'ముత్యాల ముగ్గు', 'గోరంత దీపం', 'వంశవృక్షం' మొదలైన బాపు చిత్రాలు ధవళేశ్వరం, పులిదిండి రేవు -ఇత్యాది గోదావరీ పరిసర ప్రాంతాలలో రూపుదిద్దుకొన్నవే. 'ముత్యాలముగ్గు' లో 'ఇషాన్ ఆర్య' గోదావరి అందాలను వెండితెరపై అద్దిన తీరు ఓ కలంకారీ విద్య లాంటిది! ఆ చిత్రంలో శేషేంద్ర శర్మ ఉత్తర రామాయణాన్ని సోషలైజ్ చేస్తూ రాసిన--

**'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది....!'** లోని

**'కొమ్మల్లో పక్షుల్లారా, గగనంలో మబ్బుల్లారా**
**నది దోచుకుపోతున్న నావను ఆపండి!**
**రేవు బావురు మంటోందని చెప్పండి!'**

అనే పంక్తులు ఒక మహా కావ్యాన్ని స్ఫురింపజేస్తాయి. అలాగే--

**'ఏదో ఏదో అన్నది గూటి పడవలో చిన్నది.....!'** అనే ఆరుద్ర గీతం ఒక మాధుర్య ప్రవాహం లా సాగి పోతుంది.

'విశ్వనాథ్', 'జీవనజ్యోతి', 'సప్తపది', 'స్వాతి ముత్యం', 'ఆపద్బాంధవుడు', 'శంకరాభరణం', 'స్వాతికిరణం' మొదలైన చిత్రాలను గోదావరి ఒడిలోనే చిత్రీకరించారు. 'స్వాతి ముత్యం' లోని 'సువ్వి సువ్వి సువ్వాలమ్మ' అనే పాటలోని అడుగుల చిందులకు దోహదం చేసింది గోదావరీ సైకతమే! పోలవరం, పట్టిసీమ, పాపికొండలు మొదలైన అందమైన ప్రాంతాలు విశ్వనాథ్ చిత్రాల్లో కనువిందు చేస్తాయి.

'దేవత', 'త్రిశూలం', 'జానకి రాముడు', 'పెళ్లి సందడి' వంటి రాఘవేంద్రరావు చిత్రాల్లోని పాటలు గోదావరీ నేపథ్యంలోనే తెరకెక్కాయి.

'దేవత' చిత్రంలోని-- **'ఎల్లువొచ్చి గోదారమ్మ ఎల్లా కిల్లా పడుతూ వుంటే'** అనే వేటూరి పాట దొడ్డవరం రేవులో తీసిందే!

అభ్యుదయ చిత్రాల దర్శకుడైన క్రాంతికుమార్, హాస్య ప్రియుడైన జంధ్యాల కూడా గోదావరి ఆకర్షణ నుంచి తప్పించుకోలేక పోయారు. క్రాంతికుమార్ 'సీతారామయ్య గారి మనుమరాలు', 'స్రవంతి', 'గౌతమి' వంటి చిత్రాల కోసం - జంధ్యాల 'సీతా రామ కల్యాణం', 'మూడు ముళ్లు' వంటి చిత్రాల కోసం ఔట్‌డోర్ షూటింగ్‌కు గోదావరినే ఆశ్రయించారు.

ఆదుర్తిలాగే 'వంశీ' కూడా గోదావరి జిల్లా వాడు, ఆ పైన రచనాసక్తిగల భావుకుడు కావడం వల్ల తన మొదటి చిత్రం 'సితార' నుంచి ఇంతవరకు అవకాశం వస్తే చాలు... ఔట్‌డోర్ షూటింగ్ కోసం రాజమండ్రి, రాజోలు పరిసరాలనే ఎక్కువగా ఎంచుకొన్నాడు. దర్శకుని అభిరుచికి వేటూరి భావనాబలం తోడై వంశీ చిత్రాల్లోని పాటల్లో అద్భుతమైన భావచిత్రాల సృష్టి జరిగింది.

**వెన్నెల్లో గోదారి అందం**
**నది కన్నుల్లో కన్నీటి దీపం.** -సితార

**ఒయ్యారి గోదారమ్మా, ఒళ్లంతా**
**ఎందుకమ్మా కలవరం**
**కడలి ఒడిలో కలిసిపోతే కల వరం!.** -ప్రేమించు-పెళ్లాడు

-వంటి వెన్నెల తరంగాలను ఉదాహరణలుగ పేర్కొనవచ్చు.

గోదావరిమీద చిత్ర దీపాలను వెలిగించిన రచయిత లందరూ అంతకుముందే సాహిత్య రంగంలో లబ్ధ ప్రతిష్ఠులైన ఆత్రేయ, ఆరుద్ర, వేటూరి, సి. నారాయణ రెడ్డి వంటి వారే కావడం విశేషం.

ఆరుద్ర 'ఆంధ్రకేసరి' చిత్రం కోసం రచించిన--

**'వేదంలా ఘోషించే గోదావరి**
**అమరధామంలా భాసించే రాజమహేంద్రి!'**

అనే గీతం గోదావరి పావిత్ర్యాన్ని, రాజమండ్రి పూర్వ వైభవాన్ని, ఆంధ్ర మహా భారతావతరణాన్ని, వివరిస్తూ తెలుగువాడి గర్వాన్ని అతిశయింప జేస్తుంది.

**కొట్టు కొని పోయే కొన్ని కోటి లింగాలు**
**వీరేశ 'లింగ' మొకడు మిగిలెను చాలు.....**

అనే పంక్తుల్లోని శ్లేష వీరేశలింగం పంతులుగారి ఘనతకు నీరాజనం పడుతుంది, సహృదయులను పులకింపజేస్తుంది.

'వేటూరి' వివిధ సందర్భాలలో గోదావరిని 'పయ్యెద' గా 'పూలజడ' గా, 'పూదారి' గా వివిధ రూపాలలో మనోహరంగా చూపించారనడానికి.....

నా వాలుజడ కృష్ణవేణి
నా పూలజడ వెన్నెల గోదారి. —అమెరికా అల్లుడు

గోదారి నీ పయ్యెద
కృష్ణమ్మ నీ వాల్జెడ. —సరిగమలు

ఎడారిలో కోయిలా తెల్లారనీ రేయిలా
పూదారులన్నీ గోదారి కాగా -- పాడింది కన్నీటపాట.
—పంతులమ్మ

వంటి పంక్తులెన్నిటినో చెప్పుకోవచ్చు. వేటూరి జన్మస్థలం కృష్ణా అయినా, గోదావరి మీద మమకారంతో వైవిధ్య భరితంగానూ, సంఖ్యాపరంగానూ ఎక్కువ పాటలు రాసినందుకు ఆయన అభినందనీయులు.

గోదావరి పేరు చెప్పగానే పోలవరం, పాపికొండలు, పట్టిసీమ, కోనసీమ, కోటిలింగాలు..... మొదలైన ప్రదేశాలు స్ఫురిస్తాయి. వీటిని వివిధ చిత్రాలలో నయనపర్వంగా చిత్రీకరించడంతో పాటు కొన్నిటిని పాటలలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. అలా పాపికొండలను ఒరుసుకొని ప్రవహించే గోదావరి కేంద్రంగా అల్లిన గీతాలలో--

పాపికొండల కాడ పాలమబ్బుల కాడ
పట్టలేక దూకింది పడుచు జింక - దానికీ
పగ్గం వేసే మొనగాడే లేడింక.....! —అమ్మకోసం

అనే సి. నారయణరెడ్డి రచన ప్రణయ గీతం కాగా--

పాపి కొండల వెనుక
పాపంటి మనసున్న జాబిల్లి వున్నాడనీ
చల్లని కబురొచ్చెనే - నా
జంకంత విడిపోయెనే! —ఆడాళ్లూ మీకు జోహార్లు

అనే ఆత్రేయ రచన కథానాయకునిపై నాయికకు అపోహ తొలగిన సందర్భాన్ని వివరించే పాట!

గోదారి గోలనే వింటారు
గుండెలోపల యెవరు చూస్తారు

అనే పాటలోని పంక్తులు గోదావరి హృదయ శైతల్యాన్ని, అంతస్సౌందర్య తత్త్వాన్నీ ఆవిష్కరిస్తాయి.

గోదావరి ఓ జీవనది. ఆ నదితో అనుబంధమేర్పడిన వాళ్లెవరూ ఆ అనుభూతుల్ని మర్చిపోలేరు. చిత్ర పరిశ్రమ కూడ దీనికి మినహాయింపు కాదు. అందుకే ఈ శతాబ్దంలో కూడా గోదావరి మీద--

గోదావరి రేవులోన రాదారి నావలోన
నా మాటే చెప్పుకొంటూ వుంటారట.....! —రుక్మిణి

నిండు గోదారి కదా నా ప్రేమ —నీవు లేకనేను లేను
గోరువంక గోదారి వంక —కబడ్డీ కబడ్డీ

వంటి పాటలు వస్తూనే వున్నాయి. ఈ ప్రవాహం ఆగదు!

గోదావరీ తీరం ఓ వెన్నెల హారం. ఇక్కడి ప్రకృతి అందానికి ఆకృతి. ఈ సీమలో అడుగుపెట్టే మనుష్యులకు ప్రతిరంభాతరువు ఒక రంభా తరుణై స్వాగతం చెపుతుంది. ముచ్చట గొలిపే కొబ్బరి ముద్దు గుమ్మల బృందం పూర్ణ కుంభాలతో ఎదురొస్తుంది. పావన గౌతమీనది పాదాలకు నీళ్లిస్తుంది. కోనసీమ కోయిలలు ఆహ్వానం పలుకుతాయి. పండితరాయల వారసుల వేద పనసలు గోదావరీ శ్రుతితో శ్రావ్యంగా వినిపిస్తాయి. తేనే పనసలు, చక్కెర కేళీలు అమృతాన్ని తలపింపజేస్తాయి. పడవ సరంగుల పాటల జానపద జావళీల తీయదనాన్ని రుచి చూపిస్తాయి.

ఇంత హృద్యమైన గోదావరీ సీమ సోయగాలు చూస్తే ఎవరి కళ్లు మాత్రం చెదరవు? తెలుగుదనానికి బొమ్మకట్ట డానికి పూనుకొనే ఏ చిత్ర దర్శకులు గోదావరీ లావణ్యాన్ని స్పృశించరు? కాని ఎంతమంది కళా తపస్వుల కళ్ల కెమేరాలు బంధించినా - వెండి తెర పట్టని అందాలూ చందాలూ గోదావరి సొంతం!



# రామదాసు - అన్నమయ్య

—డా॥ జె. మునిరత్నం

నదులు నాగరికతకు పుట్టిళ్ళు. భక్తికి పట్టు కొమ్మలు. అందుకే భారతీయులు వాటికి మాతృత్వాన్ని ఆపాదించి మన్నిస్తారు. పూజ్యభావం ప్రదర్శించి పునీతులయ్యాం అనుకుంటారు. ఈ నదుల తీరాలలో ఎన్నో దివ్యక్షేత్రాలు వెలిశాయి. మానవులను దివ్యులుగా మార్చే మహత్తర కార్యానికి పూనుకున్నాయి.

అటువంటి పావన నదులలో పేర్కొదగ్గవి గోదావరి, సువర్ణముఖి. గోదావరి గౌతమ మహర్షి తపఃఫలంగా లోకోపకారార్థం ఆవిర్భవించింది. సువర్ణముఖి అగస్త్యమహర్షి తపః పర్యవసానంగా భక్త జనోపకారార్థం ప్రాదుర్భవించింది. ఈ రెండు నదుల తీరప్రదేశాల్లోనూ శైవక్షేత్రాలు, వైష్ణవ క్షేత్రాలు వెలసి భక్తివాహినికి పట్టుగొమ్మలయ్యాయి. గోదావరీ తీరంలో వెలసిన భద్రాచలం రామభద్రుని నివాసం. స్వర్ణముఖి తీరంలో వెలసిన వేంకటాచలం వేంకటేశ్వర నివాసం. భద్రాచల రాముడ్ని భక్తితో సేవించి గోపన్న రామదాసుగా చరితార్థుడయ్యాడు. అలాగే వేంకటాద్రి వేంకటేశ్వరుని వేనోళ్ళ కొనియాడిన అన్నమయ్య అన్నమాచార్యుడుగా అనుపమ విఖ్యాతి నార్జించాడు. ఈ ఇద్దరు వాగ్గేయకారులను గురించి తులనాత్మకంగా ఆలోచించడం ఆనందదాయకం. జాగ్రత్తగా పరిశీలిస్తే వీరిజీవిత విధానంలోనూ, ఆలోచనా విధానంలోనూ కొన్ని పోలికలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

రామదాసు, అన్నమయ్య ఇద్దరూ విష్ణుభక్తులే. వీరిద్దరూ కూడా ఋగ్వేదశాఖకు చెందిన బ్రాహ్మణులే. తండ్రి సుశిక్షణలో పెరిగిన రామదాసు తండ్రివల్ల రాముని గొప్పతనం విని ఉండవచ్చు. పైగా బాలరామాయణం చదివే అవకాశం బాల్యంలోనే అతనికి కలిగింది. రామాయణ పఠన ప్రభావం రామభక్తిగా అతని మనసంతా ఆక్రమించింది. అన్నమయ్య తండ్రి నారాయణసూరి శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుడు. అన్నమయ్య పుట్టక పూర్వమే అన్నమయ్య తల్లిదండ్రులిద్దరూ తిరుమలకు వెళ్ళి వేంకటేశ్వరుని సేవించారు. అతని అనుగ్రహం పొందారు. అన్నమయ్య తల్లి లక్కమాంబ అతని శైశవంలోనే వేంకటేశ్వరుని పేర జోలపాటలు పాడి వినిపించింది. ఈ అంశాలను బట్టి అన్నమయ్య కుటుంబంలో వేంకటేశ్వర భక్తి వెల్లి విరిసిందని చెప్పవచ్చు. ఈ విధంగా రామదాసుకు, అన్నమయ్యకు విష్ణుభక్తి ఏర్పడటానికి వారి కుటుంబ వాతావరణం దోహదం చేసింది.

కంచెర్ల గోపన్న రఘునాథ భట్టాచార్యుల వారి దగ్గర మంత్రోపదేశం, వైష్ణవదీక్ష పొందాడు. కబీరు దగ్గర రామ మంత్రోపదేశం పొందినట్టు కూడా ప్రతీతి. అన్నమయ్య ఘన విష్ణువు దగ్గర మంత్రోపదేశం, విష్ణుతత్వోపదేశం పొందాడు. ఆదివన్ శఠగోపయతి దగ్గర వైష్ణవాగమాలన్నీ అభ్యసించాడు. వీరిద్దరికీ గురువులిద్దరూ ఉండడం గమనార్హం.

రామదాసు కమలాంబను వివాహమాడి కమనీయ వైవాహిక జీవితం గడిపాడు. అలాగే అన్నమయ్య కూడా తిమ్మక్క, అక్కలమ్మలను పరిణయమాడి పరిమళ భరిత రసజీవితాన్ని గడిపాడు. వీరిద్దరూ గృహస్థులే. గార్హస్థ్య జీవితం భాగవత జీవితానికి ఏ మాత్రం అడ్డుకాబోదని చక్కగా నిరూపించిన వారే.

రామదాసు అన్నమయ్యల జీవితాల్లో కొన్ని మహిమలు వెల్లడికావడం గమనార్హం. రామదాసు గంజిగుంటలోపడి మరణించిన తన కుమారుడ్ని దైవప్రార్థనతో బ్రతికించుకున్నాడు. రామలక్ష్మణులు మారువేషంలో వచ్చి తానీషాకు డబ్బు చెల్లించి రామదాసుని విడిపించడం అతని భక్తి మహిమయే. సాళువ నరసింగరాయలు బంధించి నప్పుడు సంకెళ్ళు త్రెంచుకోవడం, విగ్రహాలు కనిపించక పోయినప్పుడు ''ఇందిరారమణు తెచ్చి ఇయ్యరో'' అని కీర్తన పాడి తెప్పించుకోవడం, భగవంతునికి నైవేద్యంగా సమర్పించే జీడిమామిడి పండ్లను తీపిమామిడి పండ్లుగా చేయడం, పేదబ్రాహ్మణునికి ధనం ఇప్పించడం వంటివి అన్నమయ్య ప్రదర్శించిన కొన్ని మహిమలు.

రామదాసు, అన్నమయ్య సంకీర్తనలతో బాటు శతకాలు కూడా రచించారు. రామదాసు ''దాశరథీ శతకం'' రచించాడు. అన్నమయ్య అలిమేలుమంగనుద్దేశించి 'వేంకటేశ్వర శతకం'' రచించాడు 'వేంకట శతకం'' వంటి ఇతర శతకాలను కూడా రచించినట్టు ప్రతీతి. అయితే ఇప్పుడు అవి అలభ్యం. ఇద్దరు వాగ్గేయకారులూ కీర్తనలు రచించి భగవత్ కీర్తిని గానం చేశారు. ఆర్తిని ఆవిష్కరించారు. భక్తిని ప్రదర్శించారు. నీతి వైరాగ్య ప్రబోధం చేశారు.

మనసును ఉద్బోధించడం తద్వారా లోకాన్ని ఉద్బోధించడం వాగ్గేయకారులకు పరిపాటి. రాముణ్ణి, రామమంత్రాన్ని మరువకూడదని, ఇతర మార్గాలకు వెళ్ళకూడదని రామదాసు తన మనసును కోరాడు. ఇదే ఆయన ప్రజలకు చేసిన విజ్ఞప్తి అనిపిస్తుంది.

''మానసమా! నీవు మరువకుమీ పెన్ని
ధానము రామమంత్రాను సంధానము

సారంపు గురుభక్తి మీరకుమీ సం
సార ఘోరాటవిలో దూరకుమీ దరి

జేరని కోర్కెల కోరకుమీ అయి
దారింటి వెనువెంట బారకుమీ భ్రష్ఠ

(రామ. సం.- 122)

అన్నమయ్యతన మనసును అనేక విధాలుగా ఉద్బోధించాడు. శరీర అల్పత్వాన్ని, అశాశ్వతత్వాన్ని ఆవిష్కరించాడు. భగవంతుని ఘనతను, అతడు ప్రాణుల పట్ల ప్రదర్శించే ఆత్మీయతను తెలియజేశాడు.

మాయఁ బొరలఁగ నేఁటికి మనసా ఇలకాలంబును
యేయెడ లక్ష్మీకాంతుఁ డితఁడె దలఁచవుగా ॥
మున్నె పుట్టిన కాయము మున్నె పడఁగేటి వింతే
మున్నుల మీఁదికిఁ బోవదుఁ మెరయుచు నెంతైనా
అన్నిట నీజీవునికిని అంతర్యామి దేవుఁడు
యెన్నఁడుఁ బాయని బంధువుఁ డితఁడె దలఁచవుగా ॥

(అ.సం. 3-404)

వాగ్గేయకారులు మనసునుద్దేశించి ప్రబోధించడమే కాక లోకులనుద్దేశించి కూడ నీతిని ప్రబోధించారు. రామదాసు తన కీర్తనలలో రామభక్తినే కాక నీతిని కూడా ఆవిష్కరించాడు. చేయవలసిన వాటిని సూచించాడు, చేయకూడని వాటిని నిరసించాడు.

రామరామ యని నోట రవ్వంత సేఁసైన
నీమము తప్పక మంచి నీతితో పల్కనివా
డున్మత్తుడు మూఢ చిత్తుడు
దేహమశాశ్వతమని తెలియక దుర్బుద్ధి చేత
సాహసమున సాధుజనుల సంకట బెట్టెడివాడు
పాతకి బ్రహ్మ ఘాత కి.....................
..............................................................

(రామ. సం.- 115)

అన్నమయ్య కీర్తనలలో నీతి ఉంది. లోకరీతి ఉంది. దైవాను భూతి ఉంది. ఏది దేనికొరకో విశదం చేసే అన్నమయ్యపాట అందరికీ గమనార్హమే.

తలఁచిన విన్నియు తనకొరకేఁ వెలఁ
దెలియుట దనలోఁ దెలియుట కొరకే
ఉదయిం చుంటుట భవ ముడుగుటకొరకే
చదువుట మేలు విచారించు కొరకే
బ్రదుకుట పురుషార్థ పరుఁడౌట కొరకే

(అ.సం-1-70)

ప్రపంచ వస్తువుల పట్ల వైముఖ్యాన్ని కలిగి వుండటమే వైరాగ్యము. వాగ్గేయకారులు వైరాగ్యాన్ని కూడా బోధించి ప్రజల ప్రవర్తనను పోగొట్టే ప్రయత్నం చేశారు. మోహాన్ని నిర్మూలించాలని, ఈషణత్రయాన్ని పోగొట్టుకోవాలని రామదాసు సూచించాడు. సతీసుత మమకారాలను తాను రోసినట్టు చెపుతూ తక్కినవాళ్ళను కూడ అలాగే చెయ్యమని పరోక్షంగా హితవు చెప్పాడు.

మోహపాశముల నెల్ల మొదటనే ద్రుంచి
ఈషణత్రయములెల్ల ఇలలోనే డించి సం
తోష సాగరంబునందే సంచరించుచును

(రామ. సం.-39)

సతి సుతులపై ప్రేమరోసితి సం
తతము మీపై భారము వేసితి

(రామ. సం.-123)

వైరాగ్యాన్ని గూర్చి అన్నమయ్య ఇలా అభిప్రాయపడ్డాడు. సిరులు, తరుణులు అశాశ్వతాలు. వీటివల్ల ప్రయోజనము లేదు. చదువు సంశయ రాహిత్యానికి బదులు సంశయోత్పాదనకే దోహదం చేస్తుంది. కాబట్టి వీటిపట్ల అనాసక్తుడై వేంకటేశ్వరుని ఆశ్రయిస్తే భవము గలుగని స్థితి సంభవిస్తుందంటాడు.

ఎండుఁ జూచిన దనకు నిన్నియును నిట్లనే
కందులేని సుఖము కలనైన లేదు
సిరులు గలిగిన ఫలము చింతఁ బొరలనే కాని
సొరిది సంతోష మించుకయ్యైన లేదు
తరుణిగల ఫలము వేదనలఁ బొరలుటె కాని
నెరసు లేని సుఖము నిమిషంబు లేదు

(అ.సం. 1-340)

రాజాశ్రయాన్ని వాగ్గేయకారులు నిరసించారు. తాము ఆరాధించే దేవతలే సర్వాధికులని సర్వదా ఆరాధనీయులని ప్రగాఢంగా విశ్వసించారు. రామదాసు, భద్రాద్రి రాముని తప్ప పరులను ఆశ్రయించడం భావ్యం కాదని భావించాడు.

అన్నవస్త్రము లిత్తుమనుచు దొర
లన్నారు మనిచెదమనుచు ఆయు
రన్నం ప్రయచ్ఛతి మనుచు నూర
కున్నాను నీవే మాకున్నావనుచు

(రామ. సం. - 31)

వేంకటేశ్వరుని తప్ప అల్పులైన ఇతరులను కొల్చి జీవించడం హేయమనే భావం అన్నమయ్య కీర్తనలో ధ్వనిస్తుంది.

బలిమి శ్రీ వేంకటపతిఁ గొలిచిన వారు
తెలియు కల్పులఁ గొల్చి తిరుగుటెట్లు

(అ.సం. 3-456)

తనను తాను వివర్శించుకొని తగినవిధంగా సంస్కరించుకోవడమే ఆత్మవిమర్శ. భక్తులలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వాగ్గేయకారులలోను చోటు చేసుకొంది. వారి రచనల్లో ప్రతిబింబించి పాఠకుల దృష్టిని ఆకర్షించింది. రామదాసు తన దుస్థితిని గుర్తించి దురసిల్లాడు. మనసు పరభామాయత్తం కావడం, మనుగడ కోసం అన్యులను ఆశ్రయించడం – అతనికెంతో బాధ కలిగించాయి. అతని బాధ కీర్తనలో ప్రతి ధ్వనించింది.

వదలక యౌవనమున పరభామల
వలల తగులనాయగా ఓ రామా!

ముదిమిని సంసారాంధ కూపములో జిక్కి
మునిగి తేలనాయెగా ఓ రామా!

తను వస్థిరంబని తారక నామము
తలపోయలేనైతిగా ఓరామా
దిన దినము పొట్టకొరకై దీనుల వేడివేడి
దీనత్వ మొందితిగా ఓ రామా!

అనుదినము గురు ఉపదేశ యోగము
అభ్యసించనైతిగా ఓరామా!
ఎనసి నిముషమైన మీ పాదముల పైని
మనసు నిల్పనైతిగా ఓ రామా!

(రామ. సం. 106)

అన్నమయ్య కూడా ఆత్మవిమర్శ చేసుకొన్నాడు. తన తప్పిదాన్ని గుర్తించాడు. తరుణం దాటి పోయింది కదాయని తప్పించాడు. ఆ తపనను ఆవిష్కరించే పదం యిదిగో మీ దృష్టి పథంలో

సంతలే చొచ్చితిగాని సరకు గాననైతి
యింతటి శ్రీవారి నీవే యిటు దయఁజూడవే॥

కాంత చనుగొండలు కడకు నెక్కితి గాని
యెంతైనా మోక్షపు మెట్లు యెక్కలేనైతి
అంతట జవ్వనమనే అడవి చొచ్చితిగాని
సంతత హరిభక్తనై సంజీవి గాననైతి॥

తెగి సంసార జలధి దిరుగులాడితి గాని
అగడై వైరాగ్య రత్నము దేనైతి
పొగరు జన్మాల రథఘాములు చొచ్చితిగాని
పగటుఁ గామాదుల పగ సాధించనైతి

తనువని యెడి కల్పతరువు యెక్కితిగాని
కొన విజ్ఞానఫలము గోయలేనైతి

(అ.సం. 2-27)

కాలం విలువ కట్టరానిది. గడచిన క్షణం తిరిగిరాదు కాబట్టి కాలం యొక్క అమూల్యతను గుర్తించి మహనీయులు మసలు కొన్నారు. ఇతరులు కూడ అలాగే మసలుకోవాలని ఆశించారు. రామదాసు తనకాలమంతా పాడై పోయినందుకు బాధ పడ్డాడు. బాల్య యౌవన వృద్ధాప్యాలు తనకు ఉపయోగపడలేదని తన నిస్సహాయతను స్వామికి నివేదించాడు.

.........................................
మొదట నెరుగని తనమున సగమాయువు
నిదురపాలై పోయెగా ఓ రామా!
పదపడి తక్కిన పదేండ్లు బాల్యత్వమునను
పోయెగా ఓ రామా!

వదలక యౌవనమున పరభామల
వలల తగుల నాయెగా ఓ రామా!

ముదిమిని సంసారాంధ కుపములో జిక్కి
మునిగి తేలనాయెగా ఓ రామా!
.........................................
ఎనసి నిముషమైన మీ పాదములపైని
మనసు నిల్పగనైతిగా ఓ రామా!

(రామ.సం.- 106)

అన్నమయ్య కూడ కాలం విలువ ముందే తెలుసుకోలేక పోయాడు. తెలుసుకొన్న తర్వాత "నాకెక్కడి జ్ఞానం? నాకెక్కడి తెలివి? కాలమంతా దైవాన్ని తెలుసుకోకనే గడచి పోయింది" అని వాపోయాడు.

ఏడ సుజ్ఞాన మేడ తెలివి నాకు
బూడిదలో హేమమైపోయఁ గాలము

భగవత్ భక్తులు భగవన్నామానికెంతో ప్రాధాన్యమిస్తారు. నామోచ్చారణ మాత్రం చేతనే నరకాదులు నశిస్తాయని సద్గతులు సంప్రాప్తిస్తాయని విశ్వాసం. వైష్ణవులు విష్ణు నామంతోబాటు విష్ణునామ మహిమను కూడా వేనోళ్ళ కొనియాడుతారు. వాగ్గేయకారుల రచనల్లో నామ విశిష్టతను కీర్తించే కీర్తనలనేకం కనిపిస్తాయి. రామదాసు రామనామ మహిమను కమ్మగా గానం చేశాడు. దాని రుచిని తలచి తలచి మురిసిపోయాడు.

ఓ రామ! నీనామ మేమి రుచిరా
శ్రీరామ! నీ నామ మేమి రుచిరా ॥

కరిరాజ ప్రహ్లాద ధరజ విభీషణుల
గాచిన నీ నామ మేమి రుచిరా ॥

కదళీ కర్జూరాది ఫలముల కధికమౌ
కమ్మని నీ నామ మేమి రుచిరా ॥

నవరసముల కన్న నవనీతముల కంటె
అధికమౌ నీనామ మేమి రుచిరా ॥

(రామ.సం. - 110)

అన్నమయ్య అనంత సేనుని నామం అనంత ఫలదమని అభిప్రాయపడ్డాడు. అన్యనామాలు అశక్తాలని వ్యక్తపరచాడు.

హరినామ మొకటనే అణగెఁ బాపములు
హోరసి యున్న నామము లూరకున్నవి
సిరులిచ్చెఁ గలవెల్లా శ్రీపతినామ మొకటే
పెరనామములెల్లా పెట్టెలలో నున్నవి ॥

గోవింద నామమొకటే కూడపోసెఁ బుణ్యములు
వేవేలు నామములకు వెలలున్నవా?
శ్రీ విష్ణునామ మొకటే చేతికిచ్చె వైకుంఠము
తావై యున్న నామములు తమకించీ నీదిక ॥

(అ.సం. 3-297)

భక్తజన సంస్మరణ భాగవత సంప్రదాయం. వాగ్గేయకారులు కూడా పూర్వ భక్తులను స్మరించారు. వారిలాగే తమను కూడా రక్షించుమని భగవంతునితో మొర పెట్టుకున్నారు. గజేంద్రుని, గజగమనను రక్షించిన రామభద్రుడు తనను కూడా రక్షించాలని రామదాసు విష్ణువును ఆర్తితో అర్థించాడు.

నీట చిక్కి కరి మాటికి వేసరి
నాటకధర ఈపాటలు బాపగ
మేటి మకరి తలమీటికాచుదయ
యేటికి నాపై నేటికి రాదో ॥

మున్ను సభను నాపన్నత వేడుచు
నిన్ను కృష్ణయని ఎన్నగ ద్రౌపది
కెన్నో వలువలిడి మన్నన బ్రోచిన
వెన్నుడ నామొర వింటివో లేదో॥

(రామ. సం. -60)

అన్నమయ్య పూర్వభక్తులనేకులను స్మరించాడు. వారిని స్వామి కరుణించిన వైనం గుర్తు చేశాడు.

కుమ్మర దాసుడైన కురువరతి నంబి
ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు
దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు ||

అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచిన వాడు
మచ్చిక దొలకగ తిరుమలనంబి తోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నిచ్చిన వాడు

కంచిలోన నుండగ తిరుకచ్చినంబి మీద కరు
ణించి తన యెద్దకు రప్పించిన వాడు....||

(అ.సం. 1-151)

భగవంతుడ్ని శరణు జొచ్చి భవవిముక్తులు కావడం భక్తులకు పరిపాటి. వాగ్గేయకారుల్లో ఈ శరణాగతి ఎక్కువగా కనిపిస్తుంది. రామదాసు రాముడ్ని శరణుజొచ్చాడు. పాల ముంచినా నీట ముంచినా నీపాల బడితినన్నాడు.

పాల ముంచినను నీట ముంచినను నీ
పాల బడితినిక జాలము సేయకు

వేంకటేశ్వరుని శరణువేడమని తనమనసును, జీవుని అన్నమయ్య ఉద్బోధించాడు. తద్వారా లోకుల్ని ఉద్బోధించాడు. తాను స్వయంగా వేంకటేశ్వరుని శరణుజొచ్చి కృతార్థుడయ్యాడు.

మాపులే మానవులు రేపులే పుట్టువులు
చావులాల మాని పట్టు శరణము మనసా! ||

(అ.సం. 2-157)

భగవంతుని కథలను, లీలలను, మహిమలను వినడం పట్ల ఆసక్తి ప్రదర్శించడమే శ్రవణ భక్తి. భక్తులు, వాగ్గేయకారులు దీనిని ఎంతగానో ఆదరించారు. శ్రవణ భక్తి ప్రయోజనాలను రామదాసు చెప్పాడు. తద్వారా భగవన్మహిమలను వినవలసిందిగా ప్రోత్సహించాడు.

కామితార్థము లిచ్చు నీ మహాత్త్వము విన్న

(రామ.సం. -62)

నీ మహాత్త్వమ్ము విన మనమందు ప్రేమ
వేమరున్ బుట్టు

(రామ.సం. -62)

ఎప్పుడూ విష్ణుకథలే వింటుండమని అన్నమయ్య తనవీనులను అర్థించాడు, విష్ణు కథను వినడం సౌభాగ్య సంధాయకమని విశ్వసించాడు.

వీనులాలా యేపొద్దు విష్ణు కథలే వినరో

(అ.సం. 10-14)

వినరో భాగ్యము విష్ణుకథ

(అ.సం. 9-66)

భగవత్ కీర్తిని గానం చేయడం కీర్తనా భక్తిగా పరిగణింపబడుతుంది. రామదాసు రాముని కీర్తిని పాడాడు. ఆర్తితో అతన్ని వేడుకున్నాడు. అందరినీ అలా చేయవలసిందిగా పరోక్షంగా సూచించాడు.

పాడుదును మిమ్ము కొనియాడుదును మోదమున
వేడుచున్నాను కాపాడు రామప్రభో! ||

శ్రీమన్ మహాగుణస్తోమాభి రామ
నామ కీర్తనది వర్ణింతు రామప్రభో! ||

(రామ. సం. -62)

రామదాసు రాముని కీర్తించగా అన్నమయ్య తత్ కీర్తనా విశిష్టతను ఆవిష్కరించాడు. అన్నిటికన్నా ఎక్కువ విష్ణువును కీర్తించడమేనని అభివ్యక్తం చేశాడు.

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం ||

సంతోష కరమైన సంకీర్తనం
సంతాప మణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతము దలచుడీ సంకీర్తనం ||

(అ.సం. 1-343)

నిరంతరమూ భగవంతుని మనసారా స్మరించడమే స్మరణ భక్తి. తదేకంగా దేవుని ఆకార చేష్టలను స్మరించడమే దీని లక్షణం. భక్తులైన వాగ్గేయకారులు పదేపదే భగవంతుని స్మరించారు. తాపత్రయాలను భరించారు. భవసాగరం తరించారు. రామదాసు స్మరణభక్తిని అవలంబించినట్టు స్వయంగా చెప్పుకొన్నాడు. దానిపట్ల తనకున్న ఆసక్తిని కూడా వెల్లడించాడు.

శ్రీరామ నామమే వేళ స్మరియింతు
స్వామి దయచేయుము సంపాదను రామప్రభో!
శ్రీరామ నీనామ చింతనామృత పాన
సారమే నాదు మదిగోరు రామప్రభో!

(రామ.సం. -62)

స్మరణభక్తి విశిష్టతను అన్నమయ్య అభివ్యక్తం చేశాడు. స్మరించి తరించవలసిందిగా జనులకు ప్రబోధించాడు.

కొంచెమును ఘనముగను గొననేల హరిదలచు
పంచమహాపాతకుడే బ్రాహ్మణోత్తముడు

(అ.సం 1-329)

దైవశిఖామణి తలచరో బుధులు

(అ.సం 10-216)

భగవంతుని పాదాలు సేవించి తరించడం పారంపర్యంగా వస్తున్న విధానం. ఈ విధానానికి వాగ్గేయకారులు మినహాయింపు కాదు. భగవంతునిపరిపరి విధాలుగా కొలిచారు. భగవంతుని పాదాలను సేవించి తరించవలసిందిగా తరుణోపాయం చూపించారు. భగవత్ పాదసేవ పాపహరమని రామదాసు భావన. అతడు తన సేవాసక్తిని కూడా వెల్లడి చేశాడు.

నీపాదసేవ జేసిన సజ్జనులకు ఏ
పాపము లంటవుగా రామ!

(రామ.సం. -61)

చేరి మీపాద పద్మారాధనము చేయఁ
కోరినానయ్య శ్రీరామచంద్ర ప్రభో!

(రామ.సం. -62)

అన్నమయ్య పాదసేవనా భక్తి విశిష్టతను తెలియజేయడమే గాక తన సేవానిరతిని కూడా వెల్లడించాడు.

హరిఁగొలిచిన వారి కమరు నన్ని సుఖాలు
గరిమతో వారలి భాగ్యమె భాగ్యము

(అ.సం. 3-119)

వారలఁ గొలువము నేమెఁగి నీ పాదాలే నమ్మి
నిరతిఁ గొలిచితిమి నీవే మమ్ముఁ గాతువు

(అ.సం. 3-128)

షోడశోప చారాలతో భగవంతుని పూజించడం భక్తకోటికి పరిపాటి. షోడశోపచార పూజావిధానాన్ని రామదాసు అన్నమయ్య ఆదరించారు. తమగేయాల్లో దానికి స్థానం కల్పించారు. షోడశోపచారాలతో రాముని అర్చించుమని రామదాసు తన మనసును ఉద్బోధించాడు. తద్వారా షోడశోపచార పూజా విధానాన్ని ఆదరించాడు.

సలలితముగ రఘువరునకు సింహా
సన మియ్యగ రావా మనసా!
సకల భవాభవ పరివేష్టి తు ద్వా
సము సేయంగ రావా మనసా!

..........................................

..........................................

(రామ. సం. -65)

అన్నమయ్య అర్చనా వైశిష్ట్యాన్ని అభివ్యక్తం చేశాడు. షోడశోపచార పూజావిధానాన్ని ఆదరించాడు. తాను కూడా స్వామికి షోడశోపచార పూజ సమర్పిస్తున్నట్టుగా వెలుగెత్తి చాటాడు.

పొందుగ నమ్మితు బూజింతు పూజలు
కిందట గొన కెక్కెడి నిచ్చెనలు

(అ.సం. 9-275)

షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి

(అ.సం. 6-135)

మునులు భగవంతునికి నమస్కరించడం చేతనే ఘనులయ్యారని రామదాసు భావించాడు. రామునికి నమస్కరించి తన వందనాభక్తిని ప్రదర్శించాడు. భగవంతునికి నమస్కరించవలసిందిగా భక్తులను పరోక్షంగా ప్రోత్సహించాడు.

వందనము చేసి మునులందరు ఘనులైరి
విందవైనట్టి గోవిందరామ ప్రభో!

(రామ.సం. -62)

వందనము రఘునాయకా! ఆనందము శ్రీరఘు నాయకా!

(రామ.సం. -67)

వేంకటేశ్వరునికి నమస్కరించడమే విధి అని, అది ఆనంద సంధాయకమని అన్నమయ్య భావించాడు.

ఏపున శ్రీ వేంకటేశుడే సర్వము
దాపై యితని వందనమే విధి

(అ.సం. 2-468)

నలుగడ దేహానందము బుధులకు
బలు నీపాద ప్రణామములు

(అ.సం. 2-369)

భగవంతుడ్ని యజమానిగా భావించి తామతని దాసులుగా భావించుకొని ఆరాధించడం భక్తులకు ఆనవాయితి. దీన్నే దాస్యభక్తి అని పెద్దలు వ్యవహరిస్తారు. రామదాసు, అన్నమయ్య కూడా దేవుని దాసులకు దాసులు కావడమే ధన్యజీవనమని తలపోశారు. రామదాసుగా ప్రసిద్ధి కెక్కిన గోపన్న ముమ్మాటికి తాను రామునికి దాసుడని తెలియజేశాడు. తద్వారా దాస్యభక్తిని ఆదరించాడు.

బాగుగ నన్నేలు భద్రాచలరామ
దాసుడ దాసుడ దాసుడ

(రామ.సం. -155)

అన్నమయ్య వేంకటేశ్వర దాసుల దాస్యాన్ని అభిలషించాడు. తద్వారా దాస్యభక్తికి పట్టం కట్టాడు. వేంకటేశ్వరుని దాసుల దాస్యాన్ని అన్నమయ్య కోరాడు. హరిదాసుల ఘనతను కొనియాడాడు.

కందువ శ్రీ వేంకటేశ! కడు నీ బంటు బంటుకు
సందడి బంట నవుటే చాలదా! నాకు

(అ.సం. 3-23)

బంతుల పాత్రా పాత్రము వెదకిన
అంతట హరిదాస్యమే పో ఘనము

(అ.సం. 9-245)

గోదావరీ తీరం రామభక్తిని పండిస్తే సువర్ణముఖీ తీరం వేంకటేశ్వర భక్తిని విరగ పండించింది. రామదాసు తెలంగాణాకు జ్ఞాన దీపమెత్తితే, అన్నమయ్య సుజ్ఞాన దీపమెత్తి రాయలసీమకంతా దాని కాంతిని పంచాడు. ఇద్దరు వాగ్గేయకారులూ రాజులవల్ల ఇబ్బందులు పడ్డారు. తమ భక్తిచేత భగవత్ కటాక్షంచేత వాటిని అధిగమించారు. తెలుగు జాతికేకాక మానవ జాతికంతటికీ భక్తిని పంచి భగవత్ జ్ఞానం పెంచారు. ఇద్దరూ తెలుగు తేజోలక్ష్మికి వెలుగు సమకూర్చారు. తెలుగు గుండెల్లో జ్యోతులై నాదరీతులై కలకాలం నిలిచి పోయారు.

ఘనుడు కంచెర్ల గోపన్న వినుతయశుడు
తాళ్ళపాకన్న మాఖ్యుడు ధన్యజీవి
ఈమహాత్ముల గన్నట్టి భూమితల్లి
ఎంత ధన్య చరితయొతానెంచి చూడ!

(స్వీయం)

★ ★ ★

# గోదావరి ప్రాంతపు కవులు

డా॥ గల్లా చలపతి

తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ప్రాంతం ఆంధ్రదేశంలో ఎంతో సుసంపన్నం. ఈ రెండు జిల్లాలను గోదావరి నది వేరు చేస్తున్నది. ఉభయ గోదావరి ప్రాంతాలు గోదావరి నది పరివాహక ప్రాంతాలు కావడం ఈ సుసంపన్నతకు కారణం. ప్రాచీన కాలం నుండి ఈ ప్రాంతంలో పాడిపంటలకు కొరత లేదు. ఆర్థిక సమస్యలు లేనపుడు ప్రజలు కళలను గురించి కవిత్వాన్ని గురించి ఆలోచిస్తారు. ఈ రెండు జిల్లాల ప్రజలలో ఎందరో సంపన్నులు కళలను కవిత్వాన్ని పోషించారు. చారిత్రకంగా పరిశీలిస్తే ఈ ప్రాంతం పెద్ద పెద్ద రాజవంశాల పాలనలో ఉండినట్లు తెలుస్తుంది. తూర్పు చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుని కాలం నుండి రాజమహేంద్రవరం (రాజమండ్రి) లలిత కళలకు ఆవాసమైంది. తెలుగులో తొలికావ్యరచన ఈనగరంలోనే ప్రారంభమైంది. ఆ తొలికావ్యం రెండున్నర పర్వాల ఆంధ్రమహాభారతం.

తెలుగు భారతావిర్భావ కాలం నుండి గోదావరి ప్రాంతంలో అనేకమంది కవులు వెలసి కావ్యాలు రచించారు. క్రీ.శ. 18వ శతాబ్దం నుండి కవుల సంఖ్య అధికంగా కనిపిస్తుంది. ఇతర వృత్తులలో ఉంటూ కవిత్వకళను ఆరాధించిన వారున్నారు. ఈ ప్రాంతపు కవులలో ఎక్కువమంది ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవాళ్లే. వైద్యులుగా, న్యాయవాదులుగా, ఇతర రకాల కళాకారులుగా ఉండిన వారెందరో కావ్యాలు రాశారు. అలాటివారందరూ ఈ వ్యాసంలో కనిపిస్తారు. నవలాకర్తలుగా, కథకులుగా, నాటకకర్తలుగా, కావ్యకర్తలుగా, వ్యాసకర్తలుగా, అనేక ఇతర ప్రక్రియలలో రచనలు చేసినవారుగా అనేకులు కనిపిస్తారు. అలాంటి వారు ఈ వ్యాసంలో కనిపించినా కవులుగా మాత్రమే వారిని గుర్తించడం జరిగింది. వారి కవితా గ్రంథాలే ఈ వ్యాసంలో చోటు చేసుకున్నాయి. ప్రాచీన కాలం నుండి సుమారు 1980 వరకు గోదావరి ప్రాంతంలో వెలసిన కవులీ వ్యాసంలో ప్రదర్శింపబడినారు.

స్థలాభావంవల్ల గోదావరి ప్రాంతం కవులందరిని ఈ చిన్న వ్యాసంలో ఇముడ్చడం కుదరలేదు. వీలు ఉన్నంతమేర మాత్రమే గోదావరి ప్రాంతకవులను ఇక్కడ పరిచయం చేయడం జరిగింది.

**అల్లమరాజ రామకృష్ణకవి:** క్రీ.శ. 18-19శతాబ్దాల నడిమిభాగం. పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లా. కవిజన మనోరంజనం, కవిచకోర చంద్రోదయం వంటి ఎనిమిది ప్రబంధాలు రచించాడు.

**అల్లమరాజు వేంకటకవి:** 19వ శతాబ్ద ఉత్తరార్థం. పిఠాపురం సంస్థానం. తూర్పు గోదావరి జిల్లా. కొన్ని కీర్తనలు, ఒకనీతి శతకం రచించాడు.

**అవసరాల పద్మరాజు:** 18శ. చివర 19శ. ప్రారంభం. పిఠాపురం సంస్థానం, సంస్థానాధిపతి రావు వేంకట నీలాద్రిరాయని మంత్రి. విద్వత్కవి. బాల భాగవత చంపువు ఇతని రచన.

**అనివిళ్ళ వేంకటశాస్త్రి :** 1750 ప్రాంతం. పశ్చిమ గోదావరి జిల్లా. కవి, పండితుడు, మహేశ్వర మహాకావ్యం, సతీ శతకం మొదలగునవి ఇతని రచనలు.

**ఈదుల పల్లి భవాని శంకర కవి:** 17వ శ. చివర – 18 శతాబ్దం ప్రారంభం. అమలాపురం ప్రాంతం. తూర్పు గోదావరి జిల్లా. శృంగార మంజరి, ధర్మఖండం ఇతని రచనలు.

**ఎఱ్ఱమిల్లి సూర్యప్రకాశ కవి:** 1810 ప్రాంతం. అమలాపురం తూర్పు గోదావరి జిల్లా. శతక కర్త. హనుమచ్ఛతకం ఇతని రచన.

**ఏనుగు లక్ష్మణకవి:** 1740-1800ప్రాంతం. పెద్దాపురం. తూర్పు గోదావరి జిల్లా. కూచిమంచి తిమ్మనకవికి సమకాలికుడు. రామేశ్వర మహాత్యం, రామవిలాసం. సంస్కృత సూర్య శతకం, కొన్ని దండకాలు, స్తుతులు ఇతని రచనలు. సుభాషిత రత్నావళి పేరు తెచ్చిన రచన.

**ఏనుగు లత్సకవి:** 17వ శతాబ్దం సోమేశ్వర గ్రామం. గోదావరి మండలం. పెద్దాపురం సంస్థానాధీశుల ఆశ్రితుడు. ఇతని కృతులన్ని లభించడం లేదు. తుల్యా మాహాత్మ్యం, భీమసేన విజయం లభిస్తున్నాయి.

**ఓగిరాల జగన్నాథకవి:** 19వ శతాబ్దం నీలపల్లి, గోదావరి మండలం. సుమనో మనోభిరంజనం అనే ప్రబంధం ఇతని రచన.

**ఓగిరాల రంగనాథ కవి:** 19 శతాబ్దం నీలపల్లి, గోదావరి మండలం. సమర్థుడైన విద్వత్కవి. అనేక ప్రబంధాలు రచిచాడు. కానీ అలభ్యం. జగన్నాథకవి ఇతని పినతండ్రి కుమారుడు.

**కూచిమంచి జగ్గకవి:** 1684-1757. కందరాడ గ్రామం. తూర్పు గోదావరి జిల్లా. కూచిమంచి తిమ్మకవికి కనిష్ఠ సోదరుడు. తిట్టుకవి. జానకీ పరిణయం, సుభద్రా పరిణయం, చంద్రరేఖా విలాసం మొదలగునవి ఇతని రచనలు.

**కూచిమంచి తిమ్మకవి**: 18వ శతాబ్దం పిఠాపురం సంస్థానం. తూర్పు గోదావరి జిల్లా. కవిసార్వభౌమ, అభినవ వాగనుశాసన బిరుదాంకితుడు. అనేక ప్రబంధాలే కాకుండా క్షేత్ర మహాత్మ్యం, శతక, దండక రచనలు కూడా చేశారు. రసిక జన మనోభిరామం ప్రసిద్ధ ప్రబంధం.

**కూచిమంచి వేంకటరాయుడు**: 19 శతాబ్దం పూర్వార్థం. పిఠాపురానికి దగ్గర వున్న రావువారి చంద్రమపాలెం, తూర్పు గోదావరి జిల్లా లక్షణ చక్రవర్తి అనే బిరుదువుంది. సుకవి మనోరంజనం ఇతని ప్రబంధం.

**కొడిచెర్ల శ్రీనివాసకవి**: 17వ శతాబ్దం రాజమహేంద్రవరం. శేషధర్మ రత్నాకరం ఇతని రచన. కవిత్వం ప్రౌఢం, రసవంతం.

**కొత్తలంక మృత్యుంజయకవి**: 1800ప్రాంతం. కొమరిగిరి గ్రామం. గోదావరి మండలం. బృహన్నారదీయం, ధరాత్మజా పరిణయం, నిరోష్ఠ్య నలచరిత్ర ఇతని రచనలు.

**చెళ్ళపిళ్ల నరసకవి**: 1795-1840. కడియం, తూర్పు గోదావరి జిల్లా. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రికి పినముత్తాత. యామినీ పూర్ణ తిలకావిలాస ప్రబంధం. ఏకాంతసేవాకలాపం లభిస్తున్న రచనలు. అహల్యా సంక్రందన విలాసం అలభ్యం.

**జగన్నాథ పండితరాయలు**: 1590-1665. ముంగండ అగ్రహారం. తూర్పు గోదావరి జిల్లా. 'పండితరాజు' అన్నది బిరుదు. నానాశాస్త్ర పారంగతుడని, అష్టభాషా కవిత్వక్షముడని ప్రఖ్యాతి. అనేక రచనలున్నాయి. అన్నీ సంస్కృతంలోనే. రసగంగాధరం ప్రసిద్ధ అలంకార శాస్త్రం.

**తామరపల్లి తిమ్మయ్య**: 1575 ప్రాంతం. గోదావరి మం. హరివంశంలోని ఆశ్చర్య పర్వం ఇతని రచన.

**దామరాజు లక్ష్మీనారాయణ**: 19వ శతాబ్దం ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా. బృందావన విహారం ఇతని రచన.

**దిట్టకవి వేంకటామాత్యుడు**: 1610-1680దాక్షారామం. తూర్పు గోదావరి జిల్లా. సంస్కృతాంధ్రంలో అనేక గ్రంథాలు రచించినట్లు తెలుస్తున్నా ఏవీ లభించలేదు.

**నడిమింటి సర్వ మంగళేశ్వర శాస్త్రి**: 1759-1836. గన్నవరం గ్రా. తూర్పు గోదావరి. అభినవ కాళిదాసు బిరుదు. సునిత సన్నుతీరు, విభక్తి విలాసం, సర్వమంగళీయం, వేదసారం, లౌకిక దృష్టాంతరమంజరి, భగవద్గీత భాష్యం; జగన్నాథ అష్టకం - మొదలగునవి ఇతని రచనలు.

**నింబార్కుడు**: 13 వ శతాబ్దం గోదావరి మం. ప్రసిద్ధ వేదాంత దర్శన కర్త. వేదాంత పారిజాత సౌరభం, మాధ్వముఖ మర్దనం, దశశ్లోకీ, శ్రీ కృష్ణస్థవరాజం ఇతని రచనలు.

**నిట్టల ప్రకాశదాసు**: 19వ శతాబ్దం గోదావరి మం. భద్రాది రామ భక్తుడు. తత్త్వ, శృంగార బోధకాలైన కీర్తనలెన్నో రచించాడు.

**నూతనకవి సూరన్న**: 1410-1480. గోదావరి మం. ధనాభిరామం ఇతని రచన. నూతన కవి ఇతని బిరుదు కావచ్చు.

**పట్టమట్ట సరస్వతీ సోమయాజి**: 17 వ శతాబ్దం ఉత్తరార్థం. దాక్షారామం ప్రాంతం. తూర్పు గోదావరి. పోతనామాత్యుని మనుమడట. పృథుచరిత్ర ఇతని రచన.

**పిండిప్రోలు లక్ష్మణ కవి**: 19వ శతాబ్దం రామచంద్రపురం ప్రాంతం. తూర్పు గోదావరి. తిట్టు కవిత్వంలో దిట్ట. రావణదమ్మీయం అనే ద్వ్యర్థికావ్యం ఇతని రచన.

**భాస్కరాచార్యులు**: 1500-1700 నడుమ. పెనుగొండ. తూర్పు గోదావరి.వైశ్యపురాణం. ఇతని రచన.

**మల్లికార్జున పండితుడు**: 12వశ. దక్షారామం. తూర్పు గోదావరి. మల్లికార్జున పండితారాధ్యుడు అని కూడా అంటారు. సంస్కృతంలో తెలుగులో అనేక శైవమత ప్రతిపాదిత రచనలు చేశాడు.

**మిక్కిలి మల్లికార్జున కవి**: 1805-1875. పెద్దాడ-తూర్పు గోదావరి. నాచికేతు చరిత్ర, నిర్వచన విక్రమార్కర చరిత్ర, రామచంద్ర చరిత్ర, భేతాళ పంచ వింశతి, భగవద్గీత, రాఘవ శతకం - ఇతని రచనలు.

**ములపాక బుచ్చన్న శాస్త్రి**: 18వ శతాబ్దం గుండ్లూరు. కోనసీమ. తూర్పు గోదావరి. అష్టభాషా కవిత్వ కోవిదుడు. అనేక ప్రబంధాలు రచించాడట. కాని అలభ్యం. సి.పి. బ్రౌన్ పోషణలో రచించిన వసుచరిత్ర వ్యాఖ్య లభ్యం.

**యథావాక్కుల అన్నమయ్య**: 1280-1340. పట్టిస గ్రామం. తూర్పు గోదావరి. ప్రసిద్ధ శతక కర్త. సర్వేశ్వర శతకం, లీలానంద సర్వేశ్వర శతకం ఇతని రచనలు.

**రేకపల్లి సోమనాథకవి**: 1720-1790. గోదావరి మండలంలోని తాళ్ళపూడి. తర్క, వ్యాకరణాది శాస్త్రాలలో దిట్ట. రుక్మవతీ పరిణయం ఇతని కావ్యం.

**వంకాయల పాటి వేంకటకవి**: 1800 ప్రాంతం. గోదావరి మండలంలోని కొలంక. మదన గోపాల శతకం ఇతని రచన.

**శ్రీనారాయణ తీర్థులు**: 1700 ప్రాంతం. కోనసీమలోని కూచిమంచి అగ్రహారం. తూర్పు గోదావరి జయదేవ కవి అపరావతారంగా పేరు పొందాడు. శ్రీ కృష్ణలీలా తరంగిణి, హరిభక్తసుధార్ణవమ్. ఇతని సంస్కృత రచనలు. తెలుగులో పారిజాతాపహరణం రచించాడు.

**చిర్రావూరి కామేశ్వరరావు**: 19 శతాబ్దం ఉత్తరార్థం. రాజమండ్రి. సంఘసంస్మరణ లక్ష్యంగా పద్య కథలు, గేయాలు, నవలలు, నాటకాలు రచించారు. ఏకాంతప్రేమ అనే పద్య కథ ప్రసిద్ధి చెందినది.

**జనమంచి కామేశ్వరరావు**: 1911జననం. రాజమండ్రి. గేయకవి. విస్తృత హృది, ఆకొండ-అనేవి ఇతని గేయాలు. కథలు కూడా రాశారు.

**సత్యవోలు కామేశ్వరరావు**: 1864. జననం. ఉప్పాడ కొత్తపల్లి. తూర్పు గోదావరి. శ్రుతి కంఠోపాఖ్యానం ఇతని పద్య రచన. సంస్కృత కావ్యాలను తెలుగులోకి అనువాదం చేశారు.

**నిశ్శంకుల కృష్ణమూర్తి**: 20వ శతాబ్దం పూర్వార్థం. మురుమళ్ళ పోరవరం. తూర్పు గోదావరి. దేవీ భాగవత నవమస్కందం వీరి అనువాద రచన.

**పొన్నాడ కృష్ణమూర్తి**: 19వ శతాబ్దం ఉత్తరార్ధం. రాజవోలు. తూర్పు గోదావరి. భక్తి, వేదాంత విషయాలను ప్రచారం చేసే ఉద్దేశ్యంతో రచనలు చేసిన కవి. సంస్కృత ఆధ్యాత్మ గ్రంథాలను అనువదించారు. ఆత్మబోధం, గోపకుమార శతకం, పద్య రచనలు.

**మొక్కపాటి కృష్ణమూర్తి**: 25-2-1912 జననం. వసంతవాడ (ఏలూరు సమీపం) పశ్చిమ గోదావరి. కవి, చిత్రకారుడు. కథలు, గేయాలు, వ్యాసాలు రాశారు. విరహి, భగీరథి స్మృతి, పద్య రచనలు.

**నాళం కృష్ణారావు**: 1811-1961. మండపేట. తూర్పు గోదావరి. మధురకవి అనేది బిరుదు. అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. గోరుముద్దలు, విరిదండ, వెన్న బుడగలు, తేనె చినుకులు, దీపావళి, వెన్నెల వెలుగులు-మొదలగునవి పద్యరచనలు.

**కాకరపర్తి కృష్ణశాస్త్రి**: 1905 జననం. లక్ష్మీ నరసాపురం పశ్చిమ గోదావరి. కవికంఠీరవ, కవి మూర్ధన్య, ప్రౌఢకవి చంద్ర బిరుదాంకితులు. బహుగ్రంథకర్త. ఆయుర్వేదంలో నిష్ణాతులు. కంచడెక్క. చంద్రహాస విలాసం, పద్య రచనలు. సంస్కృతంలో కూడా గ్రంథాలు రచించారు.

**దేవులపల్లి కృష్ణశాస్త్రి**: 1897-1980. పిఠాపురం. తూర్పు గోదావరి. భావకవిత్వంలో అందెవేసిన చేయి. పద్మభూషణం, కళాప్రపూర్ణ బిరుదాంకితులు. అనేక ఖండ కావ్యాలు, గేయనాటికలు, సినిమాపాటలు రచించారు.

**ముతుకుమల్లి కృష్ణశాస్త్రి**: 19వ శతాబ్దం ఉత్తరార్ధం. పోలవరం సంస్థానం. పశ్చిమ గోదావరి. వీరభద్ర శతకం ఇతని రచన.

**దూపాటి కొండమాచార్యులు**: 20వ శతాబ్దం పూర్వార్ధం. పేరాల, పశ్చిమ గోదావరి. శాల్మలీ, కాలవాహిని మణిమాల, పద్యరచనలు. సంస్కృతంలో కూడా రచనలు చేశారు.

**తటవర్తి కొండయ్య కవి**: 19వ శతాబ్దం ఉత్తరార్ధం. తణుకు. పశ్చిమ గోదావరి. రామశతకం, మల్లేశ్వర శతకం ఇతని రచనలు.

**మోగంటి కొండల రామదాసు**: 19వ శతాబ్దం ఉత్తరార్ధం. యర్నగూడెం. కొవ్వూరు తాలూక, పశ్చిమ గోదావరి. శతక కర్త. కృష్ణశతకం రచించారు.

**చదలవాడ కోటి నరసింహం**: 1907 జననం. ఏలూరు. పశ్చిమ గోదావరి. శాస్త్ర విషయాలలోను, గణితంలోను, పరిశ్రమ చేసిన కవి. తిరుమలేశ శతకం, శేషాద్రి వేంకటేశ శతకం ఇతని రచనలు.

**జయంతి గంగన్న**: 20వశ. పూర్వార్ధం. రాజమండ్రి. నవ్యకవిత్వ ధోరణులతో రచనలు చేసిన కవి. కంఠమాల ఇతని కవితాఖండికల సంపుటి.

**గంగాధర కవి**: 19వ శతాబ్దం ఉత్తరార్ధం. పిఠాపురం. తూర్పు గోదావరి. పండితకవి. కీరవాణి శతకం, శ్రీరమణీ మనోహర శతకం, చెన్న మల్లేశ్వర శతకం ఇతని రచనలు.

**నేదునూరి గంగాధరం**: 1904-1970. కొంతమూరు (రాజమండ్రి దగ్గర) కవికోకిల, జానపద వాఙ్మయోద్ధారకుల బిరు దాంకితులు. అనేక జానపద గేయాలు రచించారు.

**చర్ల గణపతి శాస్త్రి**: 1909 జననం. కాకరపర్రు. తణుకు తాలుక. పశ్చిమ గోదావరి. బహుశాస్త్రవేత్త, విద్వత్కవి. హిందీ, బెంగాలీ, ఆంగ్ల భాషలు నేర్చినవారు. వీరి రచనలన్నీ ధర్మోపదేశ ప్రధానాలు. రఘువంశలహరి, మొయిలు రాయబారం, గణపతి రామాయణ సుధ, కావ్య మంజరి, సరల సంగ్రహగీత, దమ్మపదం, పద్య రచనలు.

**పిలకా గణపతి శాస్త్రి**: 1911-1983. రాజమండ్రి. ఇంగ్లీషు, హిందీ, ఫ్రెంచి, సంస్కృతభాషలు నేర్చినవారు. విద్వత్కవి. విభ్రాంతామరుకము. రత్నోపహారము. ఇతని పద్య కృతులు, ఎన్నో నవలలు, ఏకాంకికలు రచించారు.

**కనకదండి గోపాలకృష్ణశాస్త్రి**: 19వ శతాబ్దం ఉత్తరార్ధం. ఏనుగుల మహల్. కొత్తపేట తాలూక, తూర్పు గోదావరి. నవరత్నమాలికా స్తోత్రం, చిత్రకవిత్వం ఇతని రచనలు.

**ఆత్మకూరి గోవిందాచార్యులు**: 1901 జననం. ఏలూరు. పశ్చిమ గోదావరి. గోవిందరామాయణం పాహిమాం శతకం, ఇతని పద్య రచనలు. బహుగ్రంథకర్త.

**కర్రా చంద్రశేఖర శాస్త్రి**: 1912 జననం రాయవరం. తూర్పు గోదావరి ఉభయభాషా ప్రవీణులు. బాదరాయణం వీరి పద్య కృతి.

**వాద్రేవు చలమయ్య**: 1900 జననం. పిఠాపురం. తూర్పు గోదావరి. ఎక్కువగా ఖండకావ్యాలు రాశారు. సంస్కృతి, తేనె వెల్లువలు, భావవీచికలు - ఇతని ఖండకావ్యాలు.

**చాట్రాతి చిన వేంకటప్పయ్య**: 20వ శతాబ్దం పూర్వార్ధం. ఏలూరు పశ్చిమ గోదావరి. కాల్పనిక ఉద్యమ ప్రభావంతో రచనలు చేసిన కవి. కృషీవల విలాసం ఇతని పద్య రచన.

**నందివాడ జగన్నాథకవి**: 1878 జననం ఏలూరు. తూర్పు గోదావరి. యక్షగాన, హరికథా ప్రక్రియలలో కృషిచేసిన విద్వత్కవి. భైష్మీకీపరిణయం, కృష్ణరాయబారం, ఇతని పద్య రచనలు. అనేక యక్షగానాలు, శతకాలు రచించారు.

**మంగు జగన్నాథరావు పంతులు**: 19వ శతాబ్దం ఉత్తరార్థం. ఆకివీడు. పశ్చిమ గోదావరి. యక్షగానకర్త. సత్యభామా విలాసమనే పారిజాతాపహరణం. ఇతని రచనలు.

**అనిపెద్ది జగన్నాథ శాస్త్రి**: 1910 జననం కొవ్వూరు. పశ్చిమ గోదావరి. పండిత కవి. శ్రీమదాంధ్ర కార్తీక మాహాత్మ్యం ఇతని పద్య రచన.

**శిష్టు జగన్నాథ శాస్త్రి**: 19వశ. ఉత్తరార్థం. రాజమండ్రి. ఇంగ్లీషు సాహిత్య ప్రభావంతో తెలుగులో రచనలు చేసిన కవి. చిల్లా బంది అను భ్రాతృ సౌహృదం, లింగ ప్రకాశిక, కాళికావిలాసం ఇతని రచనలు.

**నిడమర్తి జలదుర్గాప్రసాదరాయుడు**: 1862–1947. కొమ్మర. భీమవరం తాలూక, పశ్చిమ గోదావరి. చంపురామాయణం. మేఘసందేశ కావ్యం. ఇతని పద్యరచనలు.

**సామవేదం జానకిరామశర్మ**: 1909 జననం వసంతవాడ (ఏలూరు దగ్గర) పశ్చిమ గోదావరి. 11వ ఏట నుండి కవిత్వం చెప్పారు. కర్ణభారం, మృత్యుంజయ శతకం, అశ్రుగీతి, బుద్ధ జననం, రామకథామృతం – మొదలగునవి వీరి రచనలు.

**ఏనుగు తమ్మిరాజు**: 1897 జననం తాపేశ్వరం. తూర్పు గోదావరి. సంప్రదాయ రీతిలో రచనలు చేసిన కవి. వీరివి ఎక్కువగా పద్య రచనలు. మిత్రస్మృతి, శ్రీ బుచ్చిరాజీయం, శ్రీ కృష్ణచాతుర్యం, ముని ప్రభావం, శ్రీమాహాత్మ్య శతకం, కుమార శతకం, శ్రీమత్‌అన్నవర వీరవేంకట సత్యనారాయణ శతకం – మొదలగునవి వీరి రచనలు.

**వడ్డి తాతయ్య**: 1908–1936 వనపురం. యర్నగూడెం తాలూక, గో.మం. ఆశుకవి. ప్రధానంగా యక్షగాన నాటక కర్త. లవకుమార శతకం, కోనాల వేణుగోపాల శతకం, కోనాల సోమలింగేశ శతకం – ఇతని రచనలు. అనేక యక్షగానాలు రచించారు.

**చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి**: 1870–1950 యానాం. తిరుపతి వేంకటకవులలో ఒకరు. దివాకర్ల తిరుపతి శాస్త్రిగారితో కలసి అనేక అవధానాలు చేశారు.

**జూలూరి తులశమ్మ**: 19వ శతాబ్దం ఉత్తరార్థం. పిఠాపురం. తూర్పు గోదావరి. భాగవత కృష్ణుడు, ఋతుచక్రవర్ణనలు, ఋతుమాల ఈమె రచనలు.

**చింతా దీక్షితులు**: 1891–1960. దంగేరు. రామచంద్రపురం తాలూక, తూర్పు గోదావరి. భావకవి. కథా సాహిత్యంలో బాలసాహిత్యంలో ఉత్తమ స్థానం ఆక్రమించిన రచయిత లక్కపిడతలు, చంద్రార్పణం – ఇతని గేయ రచనలు.

**ముడుంబ దొడ్డయాచార్యులు**: 1865 జననం తాళ్ళరేవు. తూర్పు గోదావరి. పద్యగర్భిత ముకుంద శతకం ఇతని రచన.

**భళ్ళమూడి నరసింహమూర్తి**: 19వ శతాబ్దం ఉత్తరార్థం. పెద్దాపురం. తూర్పు గోదావరి. బాల్యం నుండి కవిత్వం చెప్పారు. ఉత్తర మేఘం, భానుస్తవం, భాస్కర శతకం, సమీర సందేశం – మొదలగునవి ఇతని రచనలు.

**కాకాని నరసింహారావు**: 1903 జననం గుడివాడ. పశ్చిమ గోదావరి. అభ్యుదయ భావాలు గల కవి. శ్రీహరి శతకం, బాల ప్రబోధం, శ్రీభక్త సంరక్షికా శతకం, కవితోన్మాదం, సతీ స్మృతి – మొదలగునవి ఇతని రచనలు.

**పుల్లేవు నాగభూషణం**: 1894 జననం ఏలూరు. పశ్చిమ గోదావరి. అలంకారశాస్త్ర సంబందమైన రచనలు, పురాణేతివృత్తాలతో కూడిన రచనలు ఎక్కువగా చేశారు. హరికథలు కూడా రాశారు. సీతాకళ్యాణం, మార్కండేయ చరిత్ర, విప్రనారాయణ చరిత్ర, శ్రీనివాస కళ్యాణం ఇతని హరికథలు. దాసపోషక శతకం కూడా రచించారు.

**కాళ్ళకూరి నారాయణరావు**: 1871–1927. కాకినాడ. తూర్పు గోదావరి. నాటకం ప్రహసనం, కవిత్వం, వివర్శ ప్రక్రియలను చేపట్టి అనేక గ్రంథాలను రాశారు. సంఘసంస్కరణాభిలాషి. వరవిక్రయం, మధుసేవ నాటకాలలో రచించిన పద్యాలు ఇతనిని గొప్పకవిగా నిరూపిస్తాయి.

**ద్వివేది నారాయణ శాస్త్రి**: 1888 జననం వింజరం. తూర్పు గోదావరి. సామవేదంలోను ఉభయ భాషాసాహిత్యాలలోను విశేషకృషి చేశారు. అనేక సంస్కృత నాటకాలను అనువదించారు. రుక్మిణీ కళ్యాణం ఇతని అచ్చ తెలుగు పద్యకృతి.

**బొమ్మకంటి నృసింహ శాస్త్రులు**: 1856–1934 ర్యాలి. తూర్పు గోదావరి. వ్యాకరణ, తర్క, వేదాంత, మీమాంస శాస్త్రాలలో నిష్ణాతులు. సంస్కృతంలో కూడా కావ్యాలు రచించారు. కల్పవల్లిక, తారావళి, తిలకసహస్రం, మొ.. ఇతని రచనలు.

**వోలేటి పార్వతీశం**: 1882–1955 కొమరగిరి. పిఠాపురం తాలూక, తూర్పు గోదావరి. కవికులాలంకార, కవిరాజహంస బిరుదాంకితులు. అనేక నాటకాలు రచించారు. జలజ మాలిక ఇతని పద్య రచన.

**జటావల్లభుల పురుషోత్తం**: 1906–1973 కొవ్వూరు. తూర్పు గోదావరి ఆర్షవిద్యాభూషణ, ధర్మస్థాపక, ఉపన్యాసకేసరి బిరుదాంకితులు. పండితకవి. ప్రాచీన హైందవ సంస్కృతీ వైశిష్ట్యాన్ని నిరూపించే రచనలు చేశారు. సంస్కృతంలో చిత్రశతకాన్ని రచించారు.

**మంగిపూడి పురుషోత్తమ శర్మ**: 1893-1946 పిప్పర. పశ్చిమ గోదావరి. జాతీయోద్యమ యోధుడుగా, కవిగా పేరు పొందిన దేశభక్తుడు. స్వేచ్ఛాగానం, గోదావరి - ఇతని పద్య కృతులు.

**బెండా పెంటయ్య**: 19వ శతాబ్దం ఉత్తరార్ధం. రాయవరం. తూర్పు గోదావరి. ఉర్దూభాష పరిచయమున్న కవి. రాజమండ్రి తాలుకా పోలీసు స్టేషన్లో రైటర్‌గా పనిచేస్తూ రచనావ్యాసంగం కొనసాగించారు. ఆత్మసంబుద్ధిగా 108 పద్యాలతో పెంట శతకం రచించారు.

**చావలి బంగారమ్మ**: 1897 జననం మోడే కుర్రు. తూర్పు గోదావరి. భావకవిత్వరీతులను అనుసరించిన కవయిత్రి. ఆకొండ, కప్పతల్లి పెండ్లి, తమస్సు, కార్తీక పూర్ణిమ, కాంచన విపంచి - మొదలగునవి ఈమె గేయ సంపుటాలు.

**పిన్నమరాజు బలరామ కవి**: 19వ శతాబ్దం ఉత్తరార్ధం అలమురు పశ్చిమ గోదావరి. భక్తి వైరాగ్య బోధకాలైన శతకాలు రచించాడు. ఆపన్నివారణ కృష్ణశతకం, శ్రీమత్ అంతర్వేది లక్ష్మీనృసింహశతకం, కేశవ శతకం, వేంకటశైలపతి శతకం, కాంతాశతకం ఈయన రచించిన శతకాలు. పద్యకృతులు కూడా రచించాడు.

**అడివి బాపిరాజు**: 1895-1952 భీమవరం. పశ్చిమ గోదావరి. కవిత్వంలో చిత్రలేఖనం, చిత్రలేఖనంలో కవిత్వం కూర్చిన దిట్ట. ప్రసిద్ధ నవలా కారులు, విమర్శకులు, కథారచయిత. వసుధైక కుటుంబ నిర్మాణం లక్ష్యంగా కలం పట్టిన భావుకులు. మంచికవి. శశికళ, గంగిరెద్దు, వరదగోదావరి, గోధూళి - మొదలగు గేయ సంపుటాలు. కళా ప్రపూర్ణ బిరుదాకితులు.

**బొడ్డు బాపిరాజు**: 1912జననం ఏలూరు, పశ్చిమ గోదావరి. 10 సంవత్సరముల వయసులోనే కలం పట్టిన ప్రతిభా మూర్తి, భావకవి, అనేక ఖండకావ్యాలు, గేయకావ్యాలు రచించారు. కాత్యాయని, బిపంచి, కాకవిలాసం, దీవెన - మొదలైనవి ఇతని ఖండ కావ్యాలు. భక్తలోల శతకం కూడా రచించారు.

**దేవరకొండ బాలగంగాధర తిలక్**: 1922-1966 తణుకు, పశ్చిమ గోదావరి. కవి, కథకుడు. భావకవితాయుగానికి చివరి గొప్ప ప్రతినిధులు. అమృతం కురిసిన రాత్రి ప్రసిద్ధ కవితాసంపుటి. కఠోపనిషత్, వసుధైక గీతం, శిఖరారోహణ, మాగ్దకార్టా - మొదలైన ఇతర రచనలు. ఎన్నో కథలు, నాటకాలు రచించారు.

**శొంఠి భద్రాద్రి రామశాస్త్రి**: 1856-1915. కొమరగిరి, పిటాపురం దగ్గర. తూర్పు గోదావరి. అలంకార, వ్యాకరణ శాస్త్రాలలో పండితులు, విద్వత్కవి. శివరామ శతకం, కాళిందీ పరిణయం, శంతనోపాఖ్యానం - మొదలగునవి పద్య కృతులు.

**మంత్రిప్రెగడ భుజంగరావు**: 1876-1941 ఏలూరు. పశ్చిమ గోదావరి. రాజకవిగా, కవి పోషకులుగా, శతాధిక గ్రంథకర్తగా ప్రసిద్ధులు. కావ్యాలు, నాటకాలు, ప్రహసనాలు, కథలు, నవలలు, శతకాలు, ప్రబంధాలు, చాటువులు, అవధానాలు, ఆశుకవిత్వం మొదలగునవి వివిధ సాహిత్య శాఖలలో పరిశ్రమ చేసి అనేక రచనలు చేశారు.

**గరికపాటి మల్లావధాని**: 1899 జననం కొవ్వూరు, పశ్చిమ గోదావరి. కవిశేఖర బిరుదాంకితులు, జాతీయోద్యమ ప్రభావంతో రచనలు చేసిన పండిత కవి. భారతాంబికా శతకం, జాతీయ గీతాలు, బాలగీతాంజలి, శ్రీ బాలమ్మ మొదలగునవి ఇతని రచనలు.

**బుద్ధవరపు మహాదేవుడు**: 1889-1968 పలివెల, తూర్పు గోదావరి. కవితా విశారద బిరుదాంకితులు. ఉభయ భాషలలోను, తర్క, వ్యాకరణాది శాస్త్రాలలో నిష్ణాతులు. శ్రీమదాంధ్ర మాఘము, సూతసంహిత, చంపూరామాయణం, కువలయానందం, ఖండ కావ్య సంపుటి - మొదలగునవి ఇతని రచనలు.

**వేదుల మీనాక్షి దేవి**: 1917 జననం. రాజమండ్రి. సంప్రదాయ రీతిని అనుసరించిన కవయిత్రి. రాస క్రీడాష్టకం, సత్యాధరం, సోదరి హితోపదేశం - మొదలగునవి ఈమె ఖండకావ్యాలు.

**చిల్లరిగె యోగానంద కవి**: 1880-1957 సీనలి, పశ్చిమ గోదావరి. అష్టావధాని, ఆశుకవితా ప్రవీణులు. నూతన పోతన బిరుదాంకితులు. బాలశతకం, బాలనీతి త్రిపద శతకం, శుభోదినీ శతకం రచించారు. వాల్మీకి రామాయణాన్ని యోగానంద రామాయణంగా అనువదించి ముద్రించారు.

**అల్లంరాజు రంగశాయి కవి**: 1861-1936. చేబ్రోలు, పిఠాపురం దగ్గర. తూర్పు గోదావరి. శతావధానాలు, అష్టావధానాలు చేసిన పండితకవి. చిత్ర కవితలో, సమస్యా పూరణంలో నేర్పరి. శ్రీమదాంధ్ర చంపూ భారతం, సర్వేశ్వర శతకం, కుక్కుట లింగ శతకం, రఘురామ శతకం, రామాయణ చంపువు, పరాత్మ శతకం, గోవింద శతకం - మొదలగునవి ఇతని రచనలు.

**బాలాంత్రపు రజనీకాంత రావు**: 1920 జననం. నిడదవోలు, పశ్చిమ గోదావరి. భావకవిత్వానికి పరిమితమై రచనలు చేసిన కవి గాయకుడు, సంగీత దర్శకుడు. వేంకటపార్వతీశ కవులలో ఒకడైన వేంకటరావుగారి రెండవ కుమారుడు. నాటకాలు, గేయాలు, పాటలు, ప్రబోధ గీతాలు రాశారు. గేయనాటికలు రచించారు. కడలి నుండి కొండదాక, మూలస్థంబాలు వీరి గేయ నాటికలు. అనేక బహుమతులు పొందారు.

**క్రొవ్విడి రామకవి**: 1868 జననం, భీమవరం తాలుకా, పశ్చిమ గోదావరి. ఆశుకవి. పద్యకావ్యాలే గాక, నాటకాలు,

యక్షగానాలు, ప్రహసనాలు రచించారు. దురోదరో పాఖ్యానము ఇతని పద్యకావ్యం.

**నండూరు రామకృష్ణమాచార్య:** 1921 జననం, అగ్రహార గోపవరం, పశ్చిమ గోదావరి. కవి, విమర్శకుడు స్వర్ణమేఖల, తారాతోరణం, ఖండకావ్యాలు. అమరజీవులు-పద్య కావ్యం. చారిత్రక నాటకాలు కూడా రచించారు.

**వేదుల రామకృష్ణ శాస్త్రి:** 1889 - 1918 కాకరపర్తి, తణుకు తాలుకా, పశ్చిమ గోదావరి. విద్వత్కవి. 11వ ఏటనే కవిత్వం చెప్పడం ప్రారంభించి పుంభావ సరస్వతిగా ప్రసిద్ధి కెక్కారు. వేంకటరామకృష్ణ కవుల జంటలో రెండవ వారు.

**ఆకొండి రామమూర్తి శాస్త్రి:** 1875–1963. కేశనకుర్రు, కాకినాడ తాలుకా తూర్పు గోదావరి. విద్వత్కవి. ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు. దేవీభాగవత నవమస్కంధాన్ని తెనిగించారు.

**జయంతి రామయ్య పంతులు:** 1860 - 1941. ముక్తేశ్వరం, అమలాపురం తాలుకా. తూర్పు గోదావరి. కళాప్రపూర్ణ బిరుదాంకితులు. బాలరామాయణం, ముక్తేశ్వర శతకం, అమరుకం పద్య రచనలు. ప్రసిద్ధ శాసన పరిశోధకులు. నిఘంటు నిర్మాతలు, తాళపత్ర గంథ పరిష్కృతులు. ఉత్తర రామచరిత్ర, చంపూరామాయణం, అమరుకం, ఆంధ్రకరణలు.

**పెండ్యాల రామశాస్త్రి:** 19వ శతాబ్దం ఉత్తరార్థం. అంబిక పల్లి అగ్రహారం, రామచంద్రపురం తాలుకా, తూర్పు గోదావరి. భక్తిని, నీతిని బోధించే రచనలు చేశారు. వాటిలో వేంద్రలేటు గోపాలశతకం ప్రధానమైనది.

**భువనగిరి లక్ష్మీకాంతమ్మ:** 1890 జననం. రాజమండ్రి. భక్తి, అద్వైత మతాల ప్రధానంగా రచనలు చేసిన కవయిత్రి. భీష్మస్తవరాజం, భారత కృష్ణ శతకం, జగద్గీతా మహాత్మ్యం, వన్యవృత్తి మొదలగునవి ఈమె రచనలు.

**పులుగుర్తి లక్ష్మీనరసమాంబ:** 1878 జననం. కాకినాడ, తూర్పు గోదావరి. హింది, బెంగాలీ భాషలలో పాండిత్యం ఉన్న రచయిత్రి. పద్యం, కథ, నవల, ద్విపద మొదలగునవి ప్రక్రియలలో అనువాదాలు కూడా చేశారు. ఎన్నో నీతి పదాలు రచించారు.

**ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ:** 1904 జననం. ముత్యాలపల్లె, పశ్చిమ గోదావరి. సాహిత్య రంగంలోనే గాక, సాంఘిక, రాజకీయ రంగాలలో కూడా చురుకుగా పాల్గొన్న మహిళ. జ్ఞాన నేత్రం, నైవేద్యం, రమణ గీత, ఆరాధన, ఆంధ్రస్త్రీలు మొదలగునవి ఈమె రచనలు.

**కొత్తపల్లి లచ్చయ్య:** 1863–1898 చందుర్తి గ్రామం, పిఠాపురం దగ్గర. తూర్పు గోదావరి. అకుకవనంలోను, సమస్యా పూరణంలోను ప్రావీణ్యాన్ని ప్రదర్శించిన ప్రౌఢకవి. దాశరథి విలాసం, చెల్లయ్యమ్మరావు శతకం, సూర్య శతకం ఇతని రచనలు.

**కల్లూరి విశాలాక్షి:** 1901 జననం. రాజమండ్రి కల్లూరి సుబ్బారాయుడి సతీమణి. ఎలాంటి విషయాన్నైనా సుబోధకంగా, సరళంగా చెప్పగల కవయిత్రి. దమయంతీ చరిత్ర, భారత కథామృతం, చంద్రమతీ చరిత్ర, రామ శతకం, స్వరాజ్యలక్ష్మి పరిణయం - మొదలగునవి ఈమె రచనలు.

**మల్లవరపు విశ్వేశ్వరరావు:** 1906–1986 ఉండి. పశ్చిమ గోదావరి కాల్పనికోద్యమ ప్రభావంతో రచనలు చేసిన వ్యక్తి. ఇంగ్లీషు, బెంగాలీ భాషలలో మంచి ప్రవేశం ఉంది. ప్రకృతిని ప్రణయాన్ని వస్తువుగా రచించి 50 పైగా కవితలు రాశారు. మధుకీల, కికిడీ, ఉగాదులు - ఉత్సవాలు ఈయన కవితాఖండికలు. కథలు కూడా రాశారు.

**వింజమూరి వీరరాఘవాచార్య:** 1885–1920. దొంతవరం అగ్రహారం, తణుకు తాలుకా. పశ్చిమ గోదావరి. నూజివీడు సంస్థానంలో విద్వాంసులు. చాలా మంచి కవి. పండితులకు విద్యాగురువులు. సంస్కృతంలో చాలా గ్రంథాలు రాశారు.

**నడకుదుటి వీరరాజు:** 1871–1937 శాహపురం. కాకినాడ తాలుకా. తూర్పు గోదావరి. చిన్నతనంలోనే కవిత్వం చెప్పారు. అవధానాలు చేసి పేరు పొందారు. విమర్శకాదర్శ బిరుదాంకితులు. విభ్రమ తరంగిణి, జానకీ పరిణయం, సకలజన మనోభిరంజనం, లక్ష్మీనారాయణ విలాసం - మొదలగునవి వీరి రచనలు.

**కందుకూరు వీరేశలింగం పంతులు:** 1848–1919. సాహిత్యాన్ని సంఘసంస్కరణ సాధనంగా గ్రహించిన నవయుగ వైతాళికుడు. తెలుగులోని అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశాడు. సంస్కృతాంధ్రాలలో విద్వత్కవి, మహాపండితుడు.

**శెట్టిపల్లి వేంకటరత్నం చౌదరి:** కొవ్వలి. ఏలూరు తాలుకా. పశ్చిమ గోదావరి. సామ్యవాద భావాలతో ప్రబోధాత్మకంగా గీతాలు రాసిన తొలితరం కవి. జ్యోతిర్మయి ఇతని ఖండకావ్యం.

**జనమంచి వెంకటరామయ్య:** 1872–1933. రాజమండ్రి. పండిత కవి. అమృత కలశి, నాదారితోడు, నవకుసుమాంజలి, మేఘదూత, సుప్రభాతం మొదలగునవి వీరి రచనలు.

**తురగా వెంకటరామయ్య:** 1893 జననం అమలాపురం. తూర్పు గోదావరి. భావకవి. భావగేయు, కవి చక్రవర్తిగా పేరు పొందారు. కోకిల కళ్యాణం, జన్మభూమి, విస్మృతగానం వీరిఖండ కావ్య సంపుటాలు.

**ముళ్లపూడి వెంకయ్య:** 19వ శతాబ్దం. ఉత్తరార్థం. కాకినాడ. తూర్పు గోదావరి. కాశీమాహాత్మ్యం, విఘ్నేశ్వర చరిత్ర, చంద్రహాస చరిత్ర, ప్రహ్లాద చరిత్ర మొదలగునవి వీరి రచనలు.

**చెలికాని వేంకటరాయులు:** 19వ శతాబ్దం ఉత్తరార్థం. చంద్రమపాలెం. తూర్పు గోదావరి. రామరాజీయం అనే పద్య కావ్యం ఇతని రచన.

**మంగు వేంకట లక్ష్మీనరసింహారావు:** 1855 జననం పాలమూరు. పశ్చిమ గోదావరి. కావ్యకర్త, శతక కర్త. శ్యమంతకోపాఖ్యానం, శ్రీ కృష్ణభక్త సంవాదం, కేశవ శతకం, సూర్య శతకం - ఇతని రచనలు.

**కిళాంబి వేంకట వరదాచార్యులు:** 19వ శతాబ్దం. ఉత్తరార్థం. పెంటపాడు అగ్రహారం, పశ్చిమ గోదావరి. శతకాలు, నాటకాలు రాసినకవి. దశావతారస్తోత్రం, ముకుంద శతకం, రుక్మాంగద నాటక ప్రబంధం, శ్రీమత్ అంతర్వేది లక్ష్మీ నృసింహశతకం - మొదలగునవి వీరి రచనలు.

**మంగిపూడి వేంకటశర్మ:** 1882-1951. రాజమండ్రి. తెలుగులో ఖండకావ్య రచన ప్రారంభించిన తొలి తరం కవి. జాతీయోద్యమ కవితకు మార్గదర్శి. వివిధ ప్రక్రియలలో రచనలు చేశాడు.

**చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి:** 1870-1950. కడియం గ్రామము తూర్పు గోదావరి. తిరుపతి వేంకటకవులలో ఒకరు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ప్రథమాంధ్ర ఆస్థానకవి. ఆరోగ్య కామేశ్వరీ శతకం, కామేశ్వరీ శతకం, వీరి రచనలు. గొప్ప అవధాన సరస్వతి.

**రావూరు వేంకట సుబ్బమ్మ:** 1896-1966. రాజమండ్రి. పద్య రచనలో సిద్ధహస్తురాలు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి మేనకోడలు. కర్పూర మంజరి, హర్షచరిత్ర, మృచ్ఛకటికం, ఉదారపాండవం - ఈమె రచనలు.

**కేసిరాజు వేంకట సుబ్బారాయకవి:** 1858-1899. మలకపల్లి. తూర్పు గోదావరి. ఆశు కవి. యక్షగాన నాటకాలు ఎక్కువగా రాశారు. చోరచరిత్రం, వేంకటరమణ శతకం, భద్రాద్రి రామాయణం - మొదలగునవి వీరి రచనలు.

**కొమరవోలు వేంకట సుబ్బారావు:** 20వ శతాబ్దం. పూర్వార్థం. కాకినాడ. కాల్పనిక ఉద్యమ ప్రభావంగల పండితకవి. లతాప్రేత సల్లాపములు అనేది ఖండ కావ్యము. కవి హృది, జీవన్మృత ఘోష - అనేవి గేయాలు.

**ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రి:** 1860-1916. ఖండవల్లి. పశ్చిమ గోదావరి. ఉభయ భాషాప్రవీణులు. చాలామంది కవిపండితులకు విద్యాగురువు. సంస్కృతం నుండి అనేక రచనలను తెనిగించారు. సూర్యశతకం, భామినీ విలాసం, శుద్ధాంధ్ర ఋతుసంహారం, గంగాలహరిస్తోత్రం. శ్రీ మహాభారత నవనీతం, కృష్ణాపుష్కర మాహాత్మ్యం మొదలగునవి వీరి రచనలు.

**కస్తూరి శివశంకర కవి:** 1875 జననం విశ్వేశ్వరాయ పురం. రాజోలు. తాలుకా. తూర్పు గోదావరి. విద్వత్కవి. సంగీత, వైద్యశాస్త్రాలలో ప్రవీణులు. శంకరరామాయణం, శివానందలహరి, ద్వాదశమంజరి, నృసింహస్తోత్రం, సముద్ర అష్టకం, ఉపమాన శంకర శతకం - మొదలగునవి వీరి రచనలు.

**బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు:** 1916 జననం. ద్వారకా తిరుమల. పశ్చిమ గోదావరి. బహుభాషావేత్త, విత్వత్కవి, మంచి అనువాదకులు. ఆరు ద్రావిడ ప్రబంధాలకు పద్యానువాదం చేశారు. పాశురాలను సీస పద్యాలుగా అనువదించారు. దివాళీ, ఓవరి - వీరి ఖండ కావ్య సంపుటాలు.

**శ్రీరమణ కవి:** 20వ శతాబ్దం. పూర్వార్థం. రాజమండ్రి. సమకాలిక కవుల మెప్పుపొందిన సహజకవి. పత్నీ స్మృతి - పుష్కర కృతి, నీతిబోధిని, రామశతకం, భీష్మైకాదశి మహాత్మ్యం - మొదలగునవి వీరి రచనలు.

**మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి:** 1920జననం. వల్లిపాలెం. కాకినాడ తాలుకా. తూర్పు గోదావరి. తెలుగుదేశ చరిత్రకు కావ్యత్వం సిద్ధింపజేసిన మహాకవి. ఆంధ్ర కల్హణ బిరుదాంకితులు. వీరి ఆంధ్ర పురాణం మహాకావ్యం. ఇతర రచనలు అనేకం. చైత్ర రథం. కేళాకుళి ఖండకావ్యాలు.

**శిష్టు సర్వశాస్త్రి:** 1830-1880. కాకినాడ. ఉభయ భాషలలో కవి, పండితుడు, అవధాని. లలితాశతకం, అమరుకం, జ్ఞాన ప్రసూనాంబికా శతకం - మొదలగునవి వీరి రచనలు.

**బొమ్మకంటి వేంకట సింగరాచార్యులు:** 1916-1978. ద్వారకా తిరుమల. పశ్చిమ గోదావరి. కవి, పత్రికా రచయిత అనువాదకుడు. గీతాంజలి. అన్యాపదేశం, గోపీ హృదయం మొదలగునవి వీరి రచనలు.

**జనమంచి సీతారామస్వామి:** 20వ శతాబ్దం. పూర్వార్థం. పిఠాపురం. తూర్పు గోదావరి కవి పండితులు. కళత్ర వియోగ విషాదకావ్యం, రామశతకం, వీరి రచనలు.

**మధిర సుబ్బన్న దీక్షితులు:** 1868-1928. తాళ్లపూడి. తూర్పు గోదావరి కాశీమజిలీ కథల ప్రచురణతో పేరు పొందిన కవి. విద్యార్థి దశ నుంచి కవిత్వం చెప్పారు. అవధాని. తెనాలి రామలింగ విజయం, గౌతమీ పుష్కర మాహాత్మ్యం. సప్తసాగర సంగమ మాహాత్మ్యం - వీరి పద్య రచనలు. వచన రచనలు ఎన్నో ఉన్నాయి.

**వడ్డాది సుబ్బారాయుడు:** 1854-1938. పాశర్లపూడి. నగరం తా.. తూర్పు గోదావరి. మంచికవి, అనువాదకులు. పదునాల్గవ సంవత్సరంలోనే భజగోవింద శ్లోకాలను తెనిగించారు. అనేక సంస్కృత నాటకాలను తెనిగించారు. రాజమండ్రి

కవిత్రయంలో ఒకరు. సతీస్మృతి, సుతస్మృతి, ఆంధ్ర సూర్య శతకం, ఆర్త రక్షామణి శతకం. వీరి రచనలలో కొన్ని.


**కృత్తివెంటి సుబ్బారావు :** 1907 జననం. శ్రీరామపురం. భీమవరం తాలుకా. పశ్చిమ గోదావరి. కవిరాజ, కవిచంద్ర బిరుదాంకితులు. శతావధాని నాటకం, శతకం, ఖండకావ్యం అధిక్షేపకావ్యం – మొదలగునవి. అన్ని ప్రక్రియలను చేపట్టిన కవి. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని పద్యాలు, కీర్తనలు రాసి, జాతీయ కవిగా గుర్తింపు పొందారు.

**అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి :** 1831-1892 చేబ్రోలు. తూర్పు గోదావరి. శతావధాని ఆశు, చిత్ర, ప్రబంధాది కావ్యాల రచనలలో పేరు పొందారు. భద్రా పరిణయం, పాపయ్య మంత్రి శతకం, చాటుధారా చమత్కార సారం, ఆత్మ ప్రబోధం, సింహాద్రి రామాధిప శతకం, మొదలగునవి వీరి రచనలు.

**కామవరపు సూర్యనారాయణకవి :** 1906 జననం. ఆలమూరు. తూర్పు గోదావరి. భక్తకవి శ్రీ దండక రామాయణం, దశావతార దండకం, వాసవీకన్యకా పరమేశ్వర శతకం, శ్రీ గోదావరి దండకం మొ.. పాతికకు పైగా దండకాలు రచించారు.

**ఆవంత్స సోమసుందర్ :** 1924 జననం. పిఠాపురం. తూర్పు గోదావరి. భావకవిత్వానికి సన్నిహితంగా ఉండి, అభ్యుదయ భావాలను విరివిగా ప్రచారం చేసిన కవి. అనేక కవితా ఖండికలు, విమర్శా గ్రంథాలు రచించారు. వజ్రాయుధం, మండే – మనిషి, అనల కిరీటం, కాహళి, గోదావరి జల ప్రళయం, రక్తాక్షి, అంగారతల్పం, వెన్నెలలో కోనసీమ మొదలగునవి వీరి రచనలు.

* * *



# పుష్కర పుష్పము

ముదివర్తి కొండమాచార్యులు

ఆంధ్రభూమండలీ వికచారవింద
మధురమకరందసామమ్ము మంజులమ్ము
సప్తగోదావరీస్వాదు సలిలపూర
మఖిల హృత్తాపసంతతి నణఁచుఁగాక!

రమ్యమగు వేంగి దేశపురాజధాని
రాణ్మహేంద్రపురంబు పురాతనాంధ్ర
సంస్కృతికి నాలవాలమే జలధిపత్ని
తటమునం దొప్పు నట్టి గౌతమి భజింతు.

ప్రాక్చళుక్య భూపాలుర ప్రాభవంబు
రెడ్డిమూర్ధాభిషిక్తుల దొడ్డతనము
కలితసంతోషచిత్తవై కాంచి మించు
తల్లి! గోదావరీ! నీకు దండమమ్మ!

ఊర్జితంబగుభక్తి సోమోపరాగ
పుణ్యకాలాన నీలోన మునిఁగి రామ
దర్శనప్రాప్తి పోతన తా రచించె
భాగవతపారిజాతమ్ము భాగవతము.

గౌతమానీత దక్షిణగంగ నిన్నుఁ
బేర్కొనినఁ జాలు, నీలోనఁ బ్రీతి తాన
మాడినం జాలు నమ్మ! దశాశ్వమేధ
ఫల మొదవునంచు ప్రాజ్ఞులు పలుకుచుంద్రు.

నీదుతీరంబు పొడవున నెలవుకొన్న
గుడులు గోపురములు కనుఁగొనఁగఁజాల
వానిఁ జుట్టినమేలు నీలోన మునుఁగు
నాకు దయసేయు మహిమమ్ము నీకుఁ గలదు.

అమ్మ! నీవల్ల సమకూడె నాంధ్రజగతి
కన్న పూర్ణాసమాఖ్య; బ్రహ్మగిరినుండి
కడలిదనుక నీ వడుగుల నిడెడుచోట్లు
విపుల ధనధాన్య లక్ష్మికి విడిదిపట్లు.

నీ దరి వసించు పుణ్యము
నా దరి లేకున్న క్షణము నా నాలుకతో
గోదావరి! గోదావరి!
గోదావరి! యని వచించి కొందు శుభమ్ముల్.

* * *

# ఉభయ గోదావరి జిల్లాల్లో పరిమళించిన కర్ణాటక సంగీతం

కె. శేషులత

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులలో ఎక్కువ మంది పుణ్యగోదావరీ తీర వాసులే కావటం గమనించదగిన విషయం.

తమిళనాడులో కావేరి నదినీళ్ళు తాగిన వారికి సంగీతం తప్పకుండా వస్తుందనే నమ్మకం ఎలా ఉన్నదో, ఆంధ్రలో కూడా గోదావరి నీళ్ళు తాగినవారు అటు వేదంలోనో, ఇటు సంగీతంలోనో నిష్ణాతులవుతారని ప్రతీతి – అది నిజం కూడా.

### ప్రసిద్ధ విద్వాంసులు - వారిసేవ - గాత్రం

డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ

చాలా అద్భుతమైన ప్రతిభతో, ఒక ప్రత్యేకమైన బాణీని ఏర్పరచుకుని, పండిత పామరులందరినీ మెప్పించుతూ ఆంధ్రుల ఖ్యాతిని ప్రపంచమంతా చాటి చెప్పిన ఈ బహుముఖ ప్రజ్ఞా శీలి స్వగ్రామం అంతర్వేది పాలెం.

వీరి పాటవిని కర్ణాటక సంగీతాభిమానులైన వాళ్లెందరో ఉన్నారు. గాత్రమే కాక, వయొలిన్, వయోలా, మృదంగం మొదలైన అనేక వాయిద్యాలలో కూడా నిష్ణాతులైన వీరికి దేశ విదేశాలలో అత్యున్నతమైన గౌరవాలెన్నో జరిగాయి. అంతేగాక బాలమురళీకృష్ణ గారు వాగ్గేయకారుడు కూడా. వర్ణాలు, కృతులు, కీర్తనలు, తిల్లానాలు మొదలైన సంగీత రచనలెన్నో రచించటమే కాక, ఎంతో క్లిష్టమైన 72 మేళకర్త రాగాలలో 72 కృతులను అతి పిన్న వయసులోనే రచించి, పుస్తక రూపంలో ముద్రించిన ఘనత ఆయనదే. వీరు పాడినన్ని కచేరీలు, రికార్డులు, కాసెట్లు, సి.డి.లు మరెవరూ పాడలేదంటే అతిశయోక్తి కాదు. అంతేకాక ఇటీవల కాలంలో మ్యూజిక్ థేరపీకి సంబంధించిన ప్రయోగాలు చేపట్టి, త్వరలో ఎన్నో క్రొత్త విషయాలను ప్రపంచానికి చాటబోతున్న సంగీత వైజ్ఞానికుడు ఈయన. వీరు రాగాంగరవళి, సూర్యకాంతి మొదలైన సంగీత రచనలు చేశారు.

డాక్టర్ శ్రీపాద పినాకపాణి

వీరి బాల్యమంతా రాజమండ్రిలో గడిచింది. వృత్తిరీత్యా డాక్టర్ అయిన పాణిగారు సంగీతంలో విశేష కృషి చేసి "పాణి బాణీ" అని ప్రత్యేకంగా తయారు చేసుకుని, ముఖ్యంగా నలుగురు శిష్యులను మహా సంగీత విద్వాంసులుగా తయారు చేసి, సంగీత ప్రపంచానికి అందచేసిన మహాను భావుడు. వారు వరుసగా వోలేటి వెంకటేశ్వర్లు, నేదునూరి కృష్ణమూర్తి, నూకల చిన్న సత్యనారాయణ, శ్రీరంగం గోపాలరత్నంగార్లు. వీరిలో మొదటి ముగ్గురూ కూడా గోదావరి జిల్లాలవారే కావటం విశేషం. పాణిగారు అపారమైన శ్రమకోర్చి "సంగీత సౌరభం" (తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రచురించారు) అనే గ్రంథాన్ని 4 భాగాలుగా తయారు చేశారు. వీటిలో వర్ణాలు మొదలుకొని అనేక సంగీత రచనలను పొందుపరచారు. అలాగే "మనోధర్మ సంగీతం, పల్లవిగాన సుధ" అనే మరో రెండు గ్రంథాలను తెలుగు, తమిళ, ఇంగ్లీషు భాషలలో ముద్రించారు. ఈ పుస్తకములన్నీ కూడా సంగీత విద్యార్థులకే కాక, అధ్యాపకులకు, విద్వాంసులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నవి. అంతేకాక వీరు కొంతమంది పి.హెచ్.డి (సంగీతంలో) విద్యార్థులకు గైడ్‌గా కూడా ఉన్నారు. వృత్తిరీత్యా డాక్టరై యుండి, సంగీతంలో ఇన్నిరకాలుగా విశేష సేవ చేసిన ఘనత వీరొక్కరిదే.

వోలేటి వెంకటేశ్వర్లు

వీరు కాకినాడకి చెందినవారు. అద్భుతమైన బాణీతో, అపారమైన స్వరజ్ఞానంతో అటు కర్ణాటక, ఇటు హిందూస్తానీ సంగీత పద్ధతులు రెండింటినీ అలవోకగా పాడి మెప్పించిన ధీశాలి. ఆకాశవాణి విజయవాడలో మ్యూజిక్ ప్రొడ్యూసర్‌గా ఉండి, అనేక "భక్తిరంజని" కార్యక్రమముల ద్వారా ఎన్నో కృతులను రేడియోలో నేర్పారు. చాలా దూరాన ఉన్నవారు కూడా ఈ కార్యక్రమం ద్వారా ఎంతో లబ్ధి పొందారు. వీరు కొంతమంది శిష్యులను తయారు చేశారు. వారిలో ప్రముఖులు శ్రీమల్లాది సూరిబాబుగారు. వీరు కూడా ఏలూరు వాస్తవ్యులే. శ్రీ వోలేటి వారికి ఎన్నో గౌరవ పురస్కారాలు జరిగాయి. కర్ణాటక సంగీతాన్ని కర్ణాటక పద్ధతిలోనూ, హిందుస్తానీ సంగీతాన్ని హిందూస్తానీ పద్ధతిలోనూ పాడే ఏకైక మహావిద్వాంసుడు వీరే.

నేదునూరి కృష్ణమూర్తి

వీరిది పిఠాపురం. గొప్ప బాణీతో, అపారమైన జ్ఞానంతో, అందంగా పాడుతూ, దేశ విదేశాలలో ఘనమైన కీర్తిని సాధించిన వీరు "నేదునూరి" పేరుతో ప్రసిద్ధులు. మద్రాసు మ్యూజిక్ అకాడమీ ఫెస్టివల్‌లో వరుసగా 50 సం॥లు పాడిన ఏకైక ఆంధ్రులు వీరే. ప్రభుత్వ సంగీత కళాశాలలో పలుచోట్ల ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైరైన వీరికి అనేక మంది శిష్యులు ఉన్నారు. ప్రస్తుతం మంచి పేరు ప్రఖ్యాతులతో అనేక కచేరీలు చేస్తూ విజయభేరి మోగిస్తున్న "మల్లాది బ్రదర్స్" వీరి శిష్యులే. ఈ బ్రదర్స్ కూడా ఏలూరు వారే. కొంత కాలం పాటు నేదునూరి గారు తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టులో ఉండి, కొన్ని అన్నమాచార్య కీర్తనలను స్వరపరచి స్వామికి అష్టోత్తర శతమాలికగా సమర్పించుకున్నారు. వాటిని పుస్తక రూపంలో నోటేషన్‌తో సహా, తిరుమల తిరుపతి దేవస్థానమువారు ముద్రించారు.

డాక్టర్ నూకల చిన్న సత్యనారాయణ

వీరి స్వగ్రామం ఆదుర్రు. ప్రభుత్వ సంగీత కళాశాలలో అనేక చోట్ల ప్రిన్సిపాల్‌గా పనిచేసారు. దేశవిదేశాలలో ఎన్నో కచేరీలు చేశారు. ఎంతోమంది శిష్యులను తయారు చేశారు, నేటికీ చేస్తున్నారు. బాగా కచేరీలు చేయగలగటం, బాగా టీచ్ చేయటం - ఈ రెండు లక్షణాలూ ఒకే వ్యక్తిలో సాధారణంగా ఉండవు. కానీ నూకలవారు ఈ రెంటినీ స్వంతం చేసుకున్న ఏకైక వ్యక్తి. వీరు గాత్రంలోనే కాక, వయొలిన్ వాద్యంలో కూడా నిపుణులు. ద్వారం వెంకట స్వామినాయుడు గారి శిష్యులు. వారికి ఎన్నో కచేరీలలో సహకార వాద్యాన్ని అందించారు. వీరు స్వయంగా కొన్ని కృతులు, తిల్లానాలు కూడా రచించారు. వీరు లక్ష్యలక్షణాలు రెంటిలోనూ దిట్ట - అనేక పుస్తకాలు రచించారు. వాటిలో కొన్ని- సంగీత సుధ (తెలుగు, ఆంగ్లభాషలలో), మోనోగ్రాఫ్ ఆన్ పంచరత్న క్రుతీస్ (తెలుగు, ఆంగ్లభాషలలో) సంగీత శాస్త్ర సుధార్ణవం, దీక్షితర్ నవావర్ణ, నవగ్రహకృతులు; రాగలక్షణ సంగ్రహం, త్యాగరాజ సారస్వత సర్వస్వం. ఇంతేకాక వీరు టీచింగ్ క్యాసెట్సు కొన్నింటిని తయారుచేశారు. ఇలా చేయటం వీటితోనే ఆరంభమైనది.

ఎమ్.ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ

సంగీత పరంగా అపరిమితమైన శక్తిగల్గిన విద్వాంసులు వీరు. ఎస్వీ మ్యూజిక్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఎన్నో గౌరవ పురస్కారాలు వీరికి జరిగాయి. కేంద్ర సంగీత నాటక ఎకాడమీ అవార్డు కూడా పొందారు. అనేక మంది శిష్యులను తయారు చేశారు. వివిధ కళాశాలలో పనిచేశారు. అనేకమంది శిష్యులను తయారు చేశారు.

ఈమని శంకరశాస్త్రి

ప్రసిద్ధ వీణ విద్వాంసులు. వీరి స్వగ్రామం ద్రాక్షారామం. తండ్రిగారు ఈమని అచ్యుతరామశాస్త్రిగారి నుండి వీరి కబ్బిన వీణా వాయిద్యంలో వీరు తన కంటూ ఒక ప్రత్యేకమైన బాణీ ఏర్పరచుకుని ఎంతోమంది శిష్యులను కూడా తయారు చేశారు. వీరి శిష్యులలో ప్రముఖులు చిట్టిబాబు, వి. సరస్వతి, కల్యాణీ లక్ష్మీనారాయణ, పాలగుమ్మి విశ్వనాథం. ఈమని వారు ఆకాశవాణి ఢిల్లీలో ఛీఫ్ ప్రొడ్యూసర్ ఆఫ్ మ్యూజిక్ అనే అత్యున్నత పదవిలో ఉండేవారు. వాద్య బృందంకి జాతీయ స్థాయిలో వీరే డైరక్టర్, ప్రొడ్యూసర్, కండక్టర్ కూడా. ఎన్నో ''మాస్టర్ పీసెస్'' చేసిన ఘనులు ఈమనివారు. వీరు అనేక రికార్డులు ఇచ్చారు. ఆంధ్రుల ఖ్యాతిని దేశ విదేశాలలో చాటి వచ్చిన గొప్ప విద్వాసులు.

డాక్టర్ చిట్టిబాబు

వీరిది పిఠాపురం. ఈమనివారి శిష్యులు, గొప్ప విద్వాంసులు. ఎంతో సంప్రదాయ సిద్ధంగా మాత్రమే ఉండే వీణా వాద్యంలో, కొంత పాశ్చాత్య శైలి కలిపి పండిత పామరులందరినీ రంజింపచేసిన ఘనులు వీరు. ఎన్నో రికార్డులు ఇచ్చారు. ఎంతో మంది శిష్యులను తయారు చేశారు. దేశ విదేశాలలో ఎన్నో కచేరీలు చేశారు. కేంద్ర సంగీత నాటక ఎకాడెమీ అవార్డు పొందారు.

గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్

ఈయన 1948వ సం॥లో రాజమండ్రిలో జన్మించారు అన్నమాచార్య సంకీర్తనలు హృద్యంగా గానంచేయడంలోనూ; స్వరపరచడంలోనూ ప్రఖ్యాతి పొందారు. అనేక సంగీత కచేరీలు చేసిన వీరు వాగ్గేయకారులుగా గుర్తింపు పొందారు. 'శ్రీ ఆంజనేయ కృతి మణిమాల' - స్వీయ కృతుల సంపుటే కాక అనేక వినాయక కృతులు, నవగ్రహకృతులు, వర్ణాలు, తిల్లానాలు వేరసి 300కీర్తనలు రచించారు. అన్నమాచార్య అనేక సంకీర్తలు గానం చేయడంలోనూ, వివిధ ఆడియో క్లాసెట్‌లలో వాటిని పొందుపరచడంలోనూ రిడార్డు నెలకొల్పారు. వీరే స్వయంగా సంగీతం సమకూర్చిన అన్నమయ్య అనేక పాటలు స్వరసహితంగా తెలుగు, తమిళ లిపిలలో చాలా పుస్తకాలు అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా ప్రచురించారు.

మేడూరి నరసింహారావు

దొమ్మేరు వారు. వీరిది స్వతంత్రమైన పద్ధతిలో, సంప్రదాయ బద్ధమైనశైలి. వీరు మంచి విద్వాంసులేకాక మంచి గురువు కూడా. వీరు తమ సంతానానికి సంగీతవిద్య బాగా నేర్పారు. వీరందరూ రేడియోలో గ్రేడెడ్ ఆర్టిస్టులు తర్వాతి తరంవారు కూడా సంగీతం నేర్చుకుంటున్నారు. వారిలో లలితా కృష్ణవీణ, గోటు విద్వాంసురాలు.

పాలగుమ్మి విశ్వనాథం

ఆకాశవాణి స్టాఫ్ ఆర్టిస్టుగా పనిచేసి రిటైర్ అయినారు. లలిత సంగీతంలో విశేషమైన కృషిచేసి, లలిత సంగీతాభివృద్ధికి చాలా దోహదం చేశారు. వీరికి ఎన్నో పురస్కారాలు జరిగాయి. స్వయంగా మంచి కవి, గాయకులు కూడా. వీరికి అనేక మంది శిష్యులు ఉన్నారు. పాలగుమ్మిగారు ప్రస్తుతం తెలుగు విశ్వవిద్యాలయంలో లలిత సంగీతం బోధిస్తున్నారు.

**మాండలిన్:** యు. శ్రీనివాస్

పాలకొల్లువారు. మాండలిన్ వాద్యంలో అతిపిన్న వయసులోనే అత్యున్నతమైన ప్రతిభ చూపిన బాలమేధావి ఇతను. ఇతని గురించి ''సంగీత కళానిధి డాక్టర్ శ్రీపాద పినాక పాణిగారి'' మాటలలో చెప్పాలంటే - చి॥ శ్రీనివాస్ సాధారణ వ్యక్తికాడు, కర్ణాటక సంగీత సాంప్రదాయము, కల్పనా సామర్థ్యము, ఈస్థటిక్ బ్యూటీ బాగా తెలిసినవాడు, ఆంధ్రుల ఖ్యాతిని ఖండ ఖండాంతరాలలోనూ వ్యాపింపచేస్తున్న మహా విద్వాంసుడు. శ్రీ రుద్రరాజు సుబ్బరాజు వీరి గురువు.

**వేణువు:** మండా బలరామశర్మ

వీరి స్వస్థలం ముంగండ. ప్రసిద్ధ వేణువు విద్వాంసులైన వీరు ఆకాశవాణి స్టాఫ్ ఆర్టిస్టుగా పనిచేశారు. అనేక కచేరీలు

చేశారు. మంచి పేరు ప్రఖ్యాతలున్న విద్వాంసులు. వీరు ప్రత్యేకంగా ఒక మ్యూజిక్ స్కూలు నిర్వహించారు. అనేక మంది శిష్యులను తయారు చేశారు. వీరి కుమారుడు మండా అనంతకృష్ణ మంచి ప్రతిభకలవాడు.

**నాదస్వరం:** దోమాడ చిట్టిబ్బాయి

చంద్రంబాలెం (పిఠాపురం దగ్గర) వారు. నాదస్వర విద్వాంసులైన వీరి పేరు వినని వారుండరు. ఆంధ్రుల ఖ్యాతిని నాదస్వరంలో జాతీయ స్థాయికి తీసికెళ్ళిన ఘనుడు. ఆకాశవాణిలో ఆర్టిస్టు.

గాడవిల్లి పైడిస్వామి

వీరు కూడా మహా విద్వాంసులు. రాజమండ్రికి చెందిన వారు. ఎంతోమంది శిష్యులను తయారు చేసి తర్వాతి తరాలవారికి మంచి విద్వాంసులను అందచేసిన మహానాయుడు. వీరి శిష్యులలో ప్రముఖులు ఎం.ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ, ఎ.పి. కోమల, ఎస్. జానకి మొదలైనవారు.

బాలాంత్రపు రజనీ కాంతరావు

నిడదవోలులో జననం. సంగీత సాహిత్యాలు రెండింటిలోనూ దిట్ట. ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. అనేక అవార్డులు పొందారు. అనేక సంగీత రూపకములు, లలిత గీతాలు, యక్షగానా లెన్నింటినో రచించి, ఆధునిక యక్షగాన ప్రగతికి మార్గ దర్శకులైనారు. వీరి రచనలలో ''ఆంధ్రవాగ్గేయకార చరిత్రము'' ఎంతో ముఖ్యమైనది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకే కాక రీసెర్చి చేసుకునే వారికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉన్నదీ గ్రంథము.

**వయోలిన్:** అన్నవరపు రామస్వామి

సోమవరప్పాడు వీరి స్వగ్రామం. వీరు ఆంధ్రకు చెందిన ప్రముఖ వయోలిన్ విద్వాంసులేకాక, ఎంతో మంది శిష్యులను గాత్రంలో, వయోలిన్, వీణలలో తయారు చేసిన, చేస్తున్న ఉత్తమ గురువుకూడా. మహానుభావులైన శ్రీ పారుపల్లి రామ కృష్ణయ్య పంతులుగారి శిష్యులు వీరు. ప్రముఖ సంగీత విద్వాంసులైన శ్రీ బాలమురళీకృష్ణ, శ్రీ ఓలేటి, శ్రీ నేదునూరి, శ్రీ నూకల గార్లకే కాక అనేక మంది ప్రముఖ తమిళ, కన్నడ, మళయాళ విద్వాంసులకు కూడా వాద్యసహకారం చేశారు. వీరు స్వయంగా కొన్ని కృతులు వ్రాశారు. ఆకాశవాణి విజయవాడలో స్టాఫ్ ఆర్టిస్టుగా పనిచేసి రిటైరయ్యారు. వీరికి చాల మంది శిష్యులున్నారు. అన్నవరపువారు ప్రతి ఏటావారి గురువు సంస్మరణార్థం ఉత్సవములు నిర్వహిస్తున్నారు. వీరి ప్రథమ గురువు శ్రీ మాగంటి జగన్నాథ చౌదరి గారు. వీరు సోమవరప్పాడుకు చెందిన మంచి వయోలిన్ విద్వాంసులు. వీరి సోదరులు అన్నవరపు గోపాలంగారు ప్రఖ్యాత ఘటం విద్వాంసులు.

ఆకెళ్ళ మల్లికార్జున శర్మ

వీరు ముమ్మిడివరం వారు. మంచి వయోలిన్ విద్వాంసులేకాక గాత్రంలో కూడా నిష్ణాతులు. లయలో కూడా దిట్ట, లక్ష్య లక్షణాలు రెంటియందూ మంచి జ్ఞానం ఉన్నవారు. మనో ధర్మసంగీతానికి సంబంధించి 36 రాగాలను, స్వరకల్పనలను ''సంగీత స్వరరాగ సుధ'' అను పేరు పుస్తకముగా మాత్రమే కాక, స్వయంగా పాడి అనేక క్యాసెట్లుగా విడుదల చేశారు. సంగీత విద్యార్థులకు, అధ్యాపకులకు కూడా ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉన్నవి. అంతేకాక ఆకెళ్ళవారు తాళప్రస్తార రత్నాకరం, ఇండియన్ జీనియస్ ఇన్ తాళ ప్రస్తార, తాళప్రస్తార ఆఫ్ విశ్శంక సారంగదేవాస్, సంగీత రత్నాకర విత్ ఎ క్రిటికల్ ఇన్‌టర్ ప్రిటేషన్. సిస్టమటైజేషన్ ఆఫ్ తాళప్రస్తార ఇన్‌దేశి తాళాన్ – మొదలైన పుస్తకములు వ్రాశారు.

మరి కొందరు ప్రముఖులు

పేరి శ్రీరామ్మూర్తి, సుబ్బారావు – కాకినాడ, కోటపల్లి సూర్యప్రకాశరావు – రాజమండ్రి, కొక్కొండ సుబ్రహ్మణ్య శర్మ – అంగర, పుల్లెల పేరి సోమయాజులు – ఇందుపల్లి, కంభంపాటి లక్ష్మీ నారాయణ శాస్త్రి – కాకినాడ, అల్లంరాజు సోమేశ్వరరావు – కాకినాడ, బొగ్గవరపు గోపాల రత్నం – పెద్దాపురం, శిష్టు సర్వశాస్త్రి, శిష్టుబ్రహ్మయ్య శాస్త్రి – ముక్తేశ్వరం, మహేంద్రవాడ కామేశ్వర రావు, బాపన్న శాస్త్రి గార్లు కాకినాడకి చెందినవారు. వీరు మంచి సంగీత విద్వాంసులే కాక సంగీత వ్యాప్తికి కూడా విశేషంగా కృషి చేసినవారు. కొమాండూరి కృష్ణ మాచార్యులు – రేలంగి, తిరుపతి నన్నయసూరి మొదలైన వారు. చదలవాడ కుమారస్వామి – నిడదవోలు, వీరు మంచి వయోలినిస్టు, మృదంగిస్టు కూడా. అద్భుతమైన ప్రతిభ వీరిది. ప్రక్కవాయిద్యం అంటే ఇలా ఉండాలని తర్వాత తరంవారికి మార్గం చూపిన మార్గదర్శి వీరు.

**మృదంగం:** కోలంక వెంకట్రాజు

ఏలేశ్వరంలో జన్మించారు వీరు. ఈయన తండ్రి పెద్దరామస్వామి. పినతండ్రి చిన్నరామస్వామి, తాతగారు వెంకయ్య కూడా మృదంగ విద్వాంసులే అవటంతో, వీరికి వారసత్వంగా మృదంగ విద్య పట్టుబడింది. వీరి గురువులు మద్దెల పంతులు, కాకినాడలోని ప్రసిద్ధ మృదంగ విద్వాంసులు మురమళ్ళ గోపాలస్వామి. ద్వారం వెంకటస్వామి నాయుడు గారు కూడా వీరికి గురుతుల్యులే. రక్తి, వాదామృత సుఖము, శ్రోతలకు అందజేసే మార్దంగికులని వేంకట్రాజుగారికి మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. లెక్కకు మిక్కిలిగా శిష్యులను కూడా ఆంధ్రదేశానికి అందించిన ఘనత ఆయనదే. మనదేశంలో అనేక చోట్ల ఆంధ్ర, దక్షిణాది గాయక విద్యన్మణులెందరికో మృదంగ సహకారము అందించి, ప్రసిద్ధ సంగీత సభలలో బిరుదులు, సన్మానాలనందుకుని తృప్తిగా మృదంగ కళాసేవ చేసుకున్న ధన్యజీవి కోలంకవారు. అంతేకాక వీరు చిత్రకళలోనూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాలు

చెక్కటంలోనూ కూడా నిష్ణాతులు. వీరు చెక్కిన శ్రీ త్యాగరాజస్వామి విగ్రహం, హైదరాబాదులో త్యాగరాజు గాన సభయందు ప్రతిష్ఠించబడి ఉన్నది.

డాక్టర్ యల్లా వేంకటేశ్వర రావు

పాలకోడేరు వారు. ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు యల్లా సోమన్న గారి పుత్రరత్నం వీరు. సోమన్న గారు అనేక మంది శిష్యులను తయారు చేశారు. ''మృదంగ రత్న'' బిరుదాంకితులైన వీరు ఆంధ్రదేశానికి అందించిన అణి ముత్యం, యల్లా వేంకటేశ్వర రావు గారు. అద్భుతమైన ప్రతిభతో, అసమానమైన పాండిత్యంతో, మంచి ఈస్థటిక్ సెన్సుతో, ''పక్కవాయిద్యమంటే ఇలా ఉండాలి'' అనిపించే టట్టు వాయించటం యల్లావారికే స్వంతం. అంతేకాక మృదంగ వాద్యం కేవలం పక్క వాయిద్యమే కాదు, సోలోగా కూడా వాయించచ్చు అని నిరూపిస్తూ, యల్లావారు అనేక వైవిధ్యమైన కార్యక్రమాలెన్నో తయారు చేశారు. అద్భుతంగా తంబూర శృతి చేయగల్గిన వీరు చుట్టూ మృదంగాలు పెట్టుకొని, వాటిపై కృతులెన్నో వాయించటం ఎంతోమందికి తెలుసు. ఆకాశవాణిలో స్టాఫ్ ఆర్టిస్టుగా పనిచేసి, తెలుగు విశ్వవిద్యాలయంలోని లలిత కళాపీఠానికి డీన్‌గా పనిచేశారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలోని సంగీత శాఖకు హెడ్‌గా ఉండి ఎం.ఎ. మృదంగ విద్యార్థులకు విద్య నేర్పుతున్నారు. వీరు కొంత మంది రీసెర్చిస్కాలర్స్‌కు గైడ్‌గా కూడా ఉన్నారు.

ఎందరో విద్వాంసులు సంగీతసేవ చేసినవారు ఉన్నారు. చదలవాడ కృష్ణమూర్తి, కమలాకర రావు, యోగీష్ - రాజమండ్రి, కోలంక లచ్చారావు, కోలంక మల్లేశ్వర రావు, ధర్మాల రామ్మూర్తి, ధర్మాల వేంకటేశ్వర రావు - పలివెల, ముళ్ళపూడి లక్ష్మణరావు, ముళ్ళపూడి, శ్రీ రామ్మూర్తి - పెద్దాపురం, నందివాడ సుబ్బారావు (మోర్సింగ్) - కాకినాడ, నందివాడ మల్లికార్జున రావు - కాకినాడ, జ్ఞానానందం, పుల్లేటికుర్రు రామారావు, పుల్లేటి కుర్రి రమణ మూర్తి - పేరూరు, కోటిపల్లి చైతన్య రమేష్ - రాజమండ్రి, కె. కృష్ణ ప్రకాష్, తిరుపతి రామానుజ సూరి, జంధ్యాల జనారన శాస్త్రి ఉన్నారు.

ఇంకా గాత్రంలో శ్రీ తాడిగడవ శేషయ్యగారు పశ్చిమ గోదావరి. వీరు మంచి పండితులు. శ్రీ మంగళంపల్లి పట్టాభిరామయ్య గారు, వీరి కుమారుడే మన బాలమురళీ కృష్ణగారు. వీరు గాత్రం, వయోలిన్‌లలో నిష్ణాతులు. అనేక మంది శిష్యులను తయారు చేసినవారు.

తమరాడ సంగమేశ్వర శాస్త్రిగారు మహాగొప్ప వైణిక విద్వాంసులు. వీరు వయోలిన్ కూడా గాత్ర ధర్మంగా వాయించ గలిగే వారనీ, వీణ, వయోలిన్ ఏది వాయించినా ఎంతో రంజకంగా, అద్భుతంగా ఉండేదనీ పెద్దలు చెప్తారు. వీరు పిఠాపురం రాజస్థానంలో వీణ విద్వాంసులుగా ఉండేవారు. వెంకటస్వామి నాయుడు గారికి గురుతుల్యులు.

వీరికి ముందు తరాలవారిలో కూడా సంగీత సేవ చేసిన వారున్నారు. వారు---

ఉపద్రుష్ట నృసింహశాస్త్రి - వీరు ''విద్యా విశ్వప్రకాశిని'' అనే పుస్తకం వ్రాశారు. పారంపూడి చలమయ్యశాస్త్రి. ''అభినవ గాన మంజూష'' స్వీయరచనలలో (55 కీర్తనలు) నొటేషన్‌తో ముద్రించారు. కొచ్చెర్ల కోట రామరాజు గారు - తాటిపాక. వీరు కూడా ''శ్రీరామ కీర్తన కర్ణామృతం'' అను పేర స్వీయ రచనలతో పుస్తకం ముద్రించారు. వీరు సంగీత ఉత్సవాలు నిర్వహించేవారు. భోజనం పెట్టి 200 మంది శిష్యులను తయారు చేశారు. వీరు కుడిచేత్తో వయోలిన్ వాయించే వారు.

కొంపెల్ల నర్సయ్యగారు ఎంతోమంది శిష్యులను తయారు చేశారు. వీరి మనవడు గొత్తి నరసింహమూర్తి (ఓకల్, వీణ) ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆకెళ్ళ అశ్వత్థ నారాయణమూర్తి, రుద్రరాజు సుబ్బారాజు, మంచె రాజు సత్యనారాయణ మూర్తి, పిడపర్తి వెంకటనారాయణ, మర్ల సూర్యనారాయణ మూర్తి, మద్దూరి బుచ్చనశాస్త్రి, పాలెపు వెంకట రత్నం (గాన కళలో చాలా వ్యాసాలు వ్రాశారు) ఎన్.సి. రంగమన్నారమ్మగారు, ఇయ్యుణ్ణి అప్పలాచార్యులు (వీణ, నిలబెట్టి వాయిచేవారు), శిష్టు కృష్ణ మూర్తి శాస్త్రి, శిష్టు ప్రభాకర కృష్ణమూర్తి శాస్త్రి, గౌరీపతి శాస్త్రి గారు తదితరులు ఉన్నారు. వీరిలో శిష్టు కృష్ణమూర్తి శాస్త్రిగారి సంతానమే తర్వాతి వారందరూ. శాస్త్రిగారు అనేక మంది విద్వాంసులను ముక్తేశ్వరానికి పిలిపించి తమ ఇంట్లో నెలల తరబడి వారిని అతిథులుగా ఉంచి, కచేరీలు నిర్వహిస్తూ, వారినుంచి అనేక సంగీత రచనలను నేరుస్తూ, తాము వారికి నేర్పుతూ ఉండేవారు. గురుకుల పద్ధతిలో అనేక మంది శిష్యులను తయారు చేశారు. మైసూరు వి.ఎస్. లక్ష్మణరావు గారు ప్రముఖ విద్వాంసులు.

మునుగంటి వెంకట్రావు పంతులు

అపారమైన కల్పనా సామర్థ్యం, స్వరజ్ఞానము వీరిసొత్తు. వీరి శిష్యులే ప్రముఖ విద్వాంసులు వోలేటి వేంకటేశ్వర్లుగారు. వీరి సంతతి వారందరూ కాకినాడలో నేటికీ సంగీత సేవ చేస్తున్నారు. పంతులుగారికి ''గాయక సామ్రాట్'' అనే బిరుదును ''గాయక సార్వభౌమ'' పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారు ఇచ్చారు.

డొక్కా శ్రీరామ్మూర్తి

వీరు కోనసీమకి చెందిన వారు. వీరు అణ్ణామలై సంగీత కళాశాలలో ''సంగీత భూషణం'' పట్టభద్రుడైన మొట్టమొదటి ఆంధ్రుడు. గౌరవప్రదమైన తంజావూరు బాణీలో అనేక మంది వాగ్గేయకారులు వివిధ రచనలు వందల కొద్దీ నేర్చిన గాయక మణి, వీరు కొన్ని స్వరజతులను, తానవర్ణములను, కృతులను రచించిన ప్రతిభాశాలి. అంతేకాక, ''శాస్త్రీయ సంగీత,

సర్వస్వము'' అను పేరుతో శ్రీ రామ్మూర్తిగారు ముద్రించిన గ్రంథములో 72 మేళకర్తలలో వీరు రచించిన కృతులు ఉన్నాయి.

వీరేకాక ఇంకెందరో విద్వాంసులు ఉన్నారు. వీర భీమేశ్వరరావు మంచి వయోలినిస్టు, ఎంతోమంది శిష్యులను తయారు చేశారు. కొంపెల్ల సూర్యనారాయణ, తిరుపతి పొన్నారావు, చదలవాడ సత్యనారాయణ, కుసుమకుమారి, శ్రీమతి చల్లపల్లి సీతాదేవి, శ్రీ ఎస్.కె. తిరుమలాచార్యులు, శ్రీ ఎస్.కె. వెంకటాచార్యులు, శృంగారం శేషాచార్యులు, కంభం మెట్టు వెంకట సుబ్బారావు, కె.వి. రాఘవాచార్యులు, సి.కె. సరోజాదేవి, అవ్వున వంచి బలరామశర్మ, చల్లా సీతారామయ్య, ఎస్. ఉమాదేవి, కె. కృష్ణ కుమారి, దుడ్డు సీతారామ శాస్త్రి, దుడ్డు సీతారామయ్య, మునుగంటి పానకాల రావు, ఇనుమర్తి సత్యనారాయణ (వీరు గానకళకి చాలా వ్యాసాలు వ్రాసిన వారు), మరువాడ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

మల్లాది శ్రీ రామ్మూర్తి గారు గాత్రం పాడేవారు, హరికథకులు కూడా. వీరి కుమారులు మల్లాది సూరిబాబు, నారాయణ శర్మ మరియు మనవలు మల్లాది బ్రదర్సుగా పేరొందారు.

కాకినాడ కృష్ణయ్యర్‌గారు కాకినాడకి ఉద్యోగ రీత్యా వచ్చి అనేక మంది శిష్యులను తయారు చేశారు. ప్రస్తుత తరంలో అకొండి శ్రీనివాస రాజారావు, డి. శ్రీనివాసు, డి.ఎస్.ఆర్. మూర్తి, సాయిరాం వరుసగా గాత్రం, వీణ, మృదంగాలలో రాణి స్తున్నారు.

నాళం వనజ గుప్త, చిత్రపు సత్యాదేవి, తిరుపతి రామానుజసూరి, అడ్డాల లలితాదేవి, పెద్దాడ సూర్యకుమారి, జి.వి. రామ కుమారి గారు. కూడా చెప్పుకోదగ్గ విద్వాంసులు.

**ఉభయ గోదావరి జిల్లాల్లోని సంగీత సభలు-వారిసేవ**

ముందుగా కాకినాడ గురించి చెప్పుకోవాలి. ఇతర ప్రదేశాలలోనూ లేనన్ని సభలు సంగీత సేవ, కాకినాడలోనే జరుగుతొందంటే అతిశయోక్తి కాదు.

**శ్రీరామ సమాజం:** 109 సంవత్సరముల నుండి ఉన్నది. సంగీత విద్యాలయం నెలకొల్పి, ఉచితంగా విద్య నేర్పుతున్నారు. ప్రతి సంవత్సరమూ గణపతి ఉత్సవం నిర్వహిస్తారు. ఉ సభను స్థాపించినవారు మునుగంటి శ్రీరాములు గారు. వీరు స్వయంగా సంగీత విద్వాంసులు. వీరి భార్య సుభద్రమ్మ గారు శ్రీరామ సమాజానికి మంచి భవనం కట్టించి స్కూలుకు 5 ఎకరాల స్థలం వ్రాశారు.

మునుగంటి శ్రీ రామ్మూర్తి

ఆంధ్రప్రదేశ్‌లోని ఏకైక సంగీత పత్రికయిన ''గానకళ''కు ఎడిటర్. శ్రీ రాములు గారి పుత్రుడు వెంకట్రావు పంతులు గారి తనయుడీయన. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంగీత సభల సమాఖ్యను నెలకొల్పిన వారు. అంతేకాక సంగీత విద్వత్సభ, త్యాగరాజ సేవా సమితులను కూడా నెలకొల్పిన వారు వీరే.

**సరస్వతీ గాన సభ:** 100 సంవత్సరముల నుండి ఉన్నది. ఈ సభ మద్రాసు మ్యూజిక్ అకాడమీ కంటే 30సం॥లు ముందే ఏర్పడింది. దీని భవనం సూర్య కళామందిరం. రవీంద్ర భారతి కంటే ముందే నిర్మించబడింది. కొమ్మిరెడ్డి సూర్యనారాయణ మూర్తి, కె.వి. కృష్ణారావు ఈ సభ స్థాపకులు. సూర్య కళామందిరంలోనే చాలా వరకు అన్నీ సంగీత కార్యక్రమాలు జరుగుతూంటాయి. దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు.

**సంగీత విద్వత్సభ:** పేరి సుబ్బారావు గారు, రామ్మూర్తి గారు స్థాపకులు. 56సం॥లు నిండాయి. వీరు సంక్రాంతి గాన సభలు నిర్వహిస్తారు. ఈ సంగీత విద్వత్సభ వారు రోజూ 2 కార్యక్రమాలు నిర్వహిస్తూ, మొదటిది పైకి వస్తూన్న జూనియర్ ఆర్టిస్టుల కోసం, రెండవది సీనియర్ విద్వాంసుల కోసం కేటాయింటారు. ఈ పద్ధతి మొట్టమొదటగా ప్రవేశ పెట్టిన వారు వీరే. ఇప్పుడు ఇదే పద్ధతి చాలా మంది అనుసరిస్తున్నారు. అంతే కాక వీరు ఈ ఉత్సవాలలో భాగంగా రాష్ట్రస్థాయి సంగీత పోటీలు, క్విజ్ ఏర్పాటు చేయటమే కాక లెక్చర్ డెమాన్‌స్ట్రేషన్సు కూడా నిర్వహిస్తున్నారు.

**సత్కళావాహిని:** 30 సంవత్సరముల నుండి ఉన్నది. భక్తిరంజని పద్ధతిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థకి స్వంత భవనం ఉన్నది. బృందగానానికే ప్రాధాన్యత.

**సంగీత స్రవంతి:** 20 సంవత్సరములపై నుండి ఉన్నది. ఇది కేవలం స్త్రీలతోనే నిర్వహించబడు తున్నది. నెలవారీ కచేరీలు నిర్వహిస్తున్నారు.

**త్యాగరాజ సేవాసమితి:** ప్రతి నెల ఒకరింట్లో సంగీత విద్వాంసులందరూ చేరి పాడతారు. ఇందువలన కర్ణాటక సంగీతం గురించి తెలియని వారికి కూడా బాగా తెలిసే అవకాశం ఉంది.

**శ్రీ త్యాగరాజ నారాయణ దాససేవాసమితి - రాజమండ్రి**

బుగ్గాపాపయ్య శాస్త్రిగారు 50 సంవత్సరల క్రితం స్థాపించారు. గోదావరి ఒడ్డున త్యాగరాజస్వామి ఆలయం కట్టించారు. ప్రతి సంవత్సరమూ త్యాగరాజు ఉత్సవాలు నిర్వహిస్తారు.

**రామ భక్త సభ - రాజమండ్రి:** 30 సంవత్సరముల నుండి ఉన్నది. ప్రతి శ్రీరామ నవమికి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**భారతీ గానసభ - అమలాపురం:** 30 సంవత్సరముల నుండి ఉన్నది. సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### తూర్పు గోదావరి జిల్లాలో త్యాగరాజ ఉత్సవాలు జరిపె ప్రాంతాలు

రాజమండ్రి, రామచంద్రాపురం, కాకినాడ, అనపర్తి, ముంగండ, మలికిపురం, అమలాపురం మొదలగునవి.

### పశ్చిమ గోదావరి జిల్లాలో ఉత్సవాలు జరిపే ప్రాంతాలు

**భీమవరం** : 30 సంవత్సరములపై నుండి ''త్యాగరాజ భక్త సభను'' నిర్వహిస్తూన్నారు. త్యాగరాజ స్వామికి గుడి కట్టారు.

**పాలకొల్లు** : కొన్ని దశాబ్దాలుగా ''శ్రీ త్యాగరాజ గానసభ'' లో కార్యక్రమాలు చేస్తున్నారు.

**తాడేపల్లి గూడెం** : కొన్ని దశాబ్దాలుగా ఉత్సవాలు చేస్తున్నారు.

**సరిపెల్ల** : త్యాగరాజస్వామి ఆలయం కట్టించారు, ఉత్సవాలు చేస్తున్నారు.

ఇంకా పెనుగొండ, బోడుపాడు, కొవ్వూరు, ఏలూరు, నర్సాపురం మొదలైన ప్రాంతాల్లో ప్రతి సంవత్సరమూ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

### ఉభయ గోదావరి జిల్లాల్లో వాగ్గేయ కారులుగా పేరొందినవారు

గోదావరి తీరంలోని భద్రాచలంలో పరమ భక్తాగ్రేసరుడైన ప్రసిద్ధ వాగ్గేయకారుడు భద్రాచల రామదాసు.

తుమరాడ సంగమేశ్వర శాస్త్రి ఓగిరాల వీర రాఘవశర్మ
కొచ్చెర్ల కోట రామరాజు
మహేంద్రవాడ బాపన్న శాస్త్రి
మునుగంటి వెంకట్రావు పంతులు
పారుపూడి చలమయ్య శాస్త్రి

ఈ వ్యాస రచనకు నాకు సహాయపడిన మహానుభావులందరికీ నా కృతజ్ఞతాభివందనములు. వారు వరుసగా 'నా సంగీత యాత్ర' పుస్తకం రూపంలో నాకు సహాయం చేసిన డాక్టర్ శ్రీపాద పినాకపాణి గారు, శ్రీ నేదునూరి కృష్ణమూర్తిగారు, శ్రీ నూకల చిన్న సత్యనారాయణగారు, శ్రీ ఆకెళ్ళ మల్లికార్జునశర్మగారు, శ్రీ ఎం.ఎస్.ఎన్. శర్మగారు, శ్రీ మునుగంటి శ్రీరామ్మూర్తిగారు, శ్రీ అన్నవరపు రామస్వామి గారు, శ్రీ దుడ్డు సీతారామయ్యగారు, శ్రీ మల్లాది సూరిబాబు గారు, శ్రీ విష్ణు ప్రభాకరకృష్ణమూర్తి శాస్త్రి గారు.

సాధ్యమైనన్ని వివరాలు సేకరించి ఈ వ్యాసంలో పొందుపరచాను. ఎవరిపేరైనా వ్రాయలేకపోయి ఉంటే క్షంతవ్యురాలను.

* * *


# సర్వస్వం

సన్నిధానం నరసింహశర్మ

ఒక బుడుంగు సద్దు కలుగు టొకటి తప్ప
తప్పక మునుగుదుమది యదార్థమట్టి
మునుక వెనుక లభించెడి మోక్షమునకు
మునుగు టొకమారు గౌతమిన్ పొంగునెడద.

అచల రామావతార నిత్యాభిషేక
సిద్ధ సుపవిత్రజలము వీక్షించ ఫలము
నిత్యమత్స్యావతారపునీత దీని
విశ్వరూపమ్ము సృష్టిన నశ్వరమ్ము.

మండుటెండ నంబరము మనకు గోచ
రించనట్టి తారకల స్ఫురించు సూర్య
గణ మహాదర్శనోత్సవ కల్పనమున
పరమహా దృష్టి నిచ్చెడు పరమచరిత.



శబరి యెంగిలి శ్రీరామచంద్ర జిహ్వ
జేర్చ మొగమోటమిన్ పాదసేవ జేయు
పరమ సంస్కార భాగ్య సంపన్న నదిని
స్నాన పాన సత్కృతుల సంస్కార మబ్బు.

భుక్తమిది నాకు నాలోని రక్తమిదియె
పానమిది నాకు మాటాడ బ్రాణమిదియె
ఊరి సిరి నాకు నాలోని ఊపిరిదియె
నాకు సర్వస్వదాన మీ నదియె చేయు.

(సౌజన్యం: సమాచారం 40 వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక)

# రాజమహేంద్రవరం - రాజవంశాలు

ఆచార్య తేళ్ల సత్యవతి

గోదావరి నదికి ఉత్తరపు ఒడ్డున, తూర్పు సముద్రానికి దాదాపు నలభై కిలోమీటర్ల దూరంలో తీర్థయాత్రాస్థలంగాను, పుణ్యక్షేత్రంగాను ప్రసిద్ధి చెందిన పట్టణం రాజమహేంద్రవరం. నదియొక్క వరదలకు అనేకసార్లు ఈ పట్టణం నష్టపోవడం వలన, ఈ పట్టణానికి సంబంధించిన నాణాలు కానీ శాసనాలు కానీ దొరకకపోవడంవలన, పురాతత్త్వ శాస్త్రజ్ఞుల అన్వేషణలు పెద్దగా జరగకపోవడంవలన క్రీ.పూ. 10వ శతాబ్దికి పూర్వపు చరిత్ర లభించలేదు.

### తూర్పుచాళుక్యులు

తూర్పుచాళుక్యులలో మొదటి అమ్మరాజుకు, రెండవ అమ్మరాజుకు 'రాజమహేంద్ర' అనే బిరుదులున్నాయి. ఈ ఇద్దరిలో ఒక అమ్మరాజుకాలంలో ఈ పట్టణం నిర్మింపబడి వారి బిరుదనామంతో ప్రసిద్ధి చెంది ఉండవచ్చుని చరిత్రకారుల అభిప్రాయం. రాజరాజ నరేంద్రునికి కూడ ఈ బిరుదు ఉన్నప్పటికీ అమ్మరాజ విష్ణువర్ధనుని కాలంలోనే (క్రీ.శ. 919-934)నిర్మించబడి ఉంటుందని పలువురు నిర్ధారించారు. పురావస్తుశాఖ వారి తవ్వకాలలోను నిర్మాణ ప్రక్రియలో భాగంగా తవ్వకాలలో దొరికిన వస్తువుల ఆధారంగా తూర్పు చాళుక్య యుగానికి పూర్వమే ఈ నగరం ఉన్నదని చెప్పవచ్చు.

రాజరాజ నరేంద్రుడు క్రీ.శ. 1022లో పట్టాభిషిక్తుడయ్యాక రాజరాజు కోరికపై నన్నయ వ్యాసమహాభారతాన్ని ఆంధ్రీకరించడానికి పూనుకోవడం విశేషం. నన్నయ్య భారతంలోని రాజమహేంద్రపుర వర్ణన వలన చాళుక్యుల కాలంలో రాజమహేంద్రవరం రాజధానిగా ఉన్నట్లు తెలుస్తుంది. రాజరాజ నరేంద్రుడు 41సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. నన్నయ రాజరాజును 'రాజమహేంద్ర కవీంద్ర సమాజ సురక్షజ' అని సంబోధించాడు. చాళుక్యులు తెలుగు భాషను ఆదరించారు. ఆంధ్రులు, ఆంధ్రదేశం, ఆంధ్ర దేశాధీశ్వరులు అనే భావాలు ఏర్పరచారు

రాజరాజ నరేంద్రుని తరువాత రాజు కావలసిన అతని కుమారుడు రాజేంద్రుడు మాతామహరాజ్యమైన చోళరాజ్యంలో ఉన్నందువల్ల రాజరాజు సవతి సోదరుడైన విజయాదిత్యుడు సింహాసనాన్నాక్రమించుకొని తన కుమారుడైన శక్తివర్మను సింహాసనాధిష్టుని చేశాడు. శక్తివర్మ క్రీ.శ. 1062 నుండి 1072 వరకు పది సంవత్సరాలు పరిపాలించాడు. చోళరాజ్యంలో రాజేంద్రుడు సింహాసనాధిష్టుడై చోళ-చాళుక్య రాజ్యాలను కలిపి 'కుళోత్తుంగచోళ' బిరుదుతో పరిపాలించాడు. వేంగి సింహాసనాన్ని పినతండ్రియైన విజయాదిత్యునికి సమర్పించి నప్పటికీ తన సలహాలను పాటించనందువల్ల అతనిపై యుద్ధాన్ని ప్రకటించి వేంగిని తిరిగి తన స్వాధీనంలోనికి తెచ్చుకొన్నాడు. కానీ రాజేంద్రుడు వెనుదిరగగానే విజయాదిత్యుడు మళ్లీ వేంగిని ఆక్రమించి స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నాడు. రాజేంద్రుడు ఇతనిని వేంగిపాలకునిగా గుర్తించాడు విజయాదిత్యుడు ప్రజలకు సుస్థిర పాలనను అందించలేక పోయాడు. క్రీ.శ. 1075లో అతని మరణంతో తూర్పు చాళుక్య వంశం అంతరించిపోయినా కుళోత్తుంగ చోళుడిగా ప్రసిద్ధి చెందిన రాజేంద్రుడు, అతని వారసులు రాజమహేంద్ర వరాన్ని దాదాపు రెండు శతాబ్దాలు పరిపాలించారు. కుళోత్తుంగుని కుమారుడు రెండవ రాజరాజు వేంగీ రాజ ప్రతినిధిగా ఉండి అనేక యుద్ధాలలో విజయం సాధించాడు.

### కాకతీయులు

కాకతీయ సామ్రాజ్యంలో రాజమహేంద్రవరం ఒక భాగం. ఈపట్టణం అంతగా ప్రాముఖ్యం వహించకపోయినా, ఇందులూరి అన్నయ ఆధీనంలో ఉండి అతని మరదియైన పర్వతమల్లు పాలనలో ఒక దుర్గంగా ఉంది. క్రీ.శ. 1323లో మహమ్మద్ బిన్ తుగ్లక్ ఓరుగల్లును జయించి 'రాజమహేంద్రపురం' స్వాధీనం చేసుకొన్నాడు. ఈ దుర్గానికి హుమాయూన్ గుజ్జాల్‌ను గవర్నరుగా నియమించాడు. ఇలా రాజమహేంద్రపురం కాకతీయుల పాలననుండి మహమ్మదీయుల పాలనలోకి వచ్చింది.

### రెడ్డిరాజులు

మహమ్మదీయుల పాలననుండి స్వాతంత్ర్యాన్ని సంపాదించు కోవడానికి ప్రోలయ, కాపయనాయకత్వంలో ఉద్యమించారు. కాపయ ఓరుగల్లును వశపరచుకున్న సమయంలో ప్రోలయ వేమారెడ్డి, రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు. రెడ్డి రాజులకు రాజమహేంద్రవరం కొంతకాలం ఉపరాజధానిగాను, కాటయవేమారెడ్డి, అల్లాడ రెడ్డి మొదలైన వారికి ముఖ్యనగరంగాను భాసించింది. శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో రాజమహేంద్రవరాన్ని వర్ణించాడు. అనపోతారెడ్డి కాలంలో (క్రీ.శ. 1353-64) నెల్లూరు ప్రాంతంనుండి దొడ్డారెడ్డి, కాటయవేమారెడ్డి మొదలైన కొన్ని కుటుంబాలు రాజమహేంద్రవర ప్రాంతాలకు వచ్చాయి. అనపోతారెడ్డి తమ్ముడైన అనవేమారెడ్డి గోదావరికి ఉత్తరాన ఉన్న కోన దేశాన్ని జయించి తరువాత రాజమహేంద్రపురకోటను స్వాధీనం చేసుకొన్నాడు.

అనవేమారెడ్డి తరువాత అనపోతారెడ్డి కుమారుడైన కుమారగిరి రెడ్డి 1386-1402 వరకు పరిపాలించాడు. ఇతని బావమరిది, సర్వసైన్యాధిపతి అయిన కాటయ వేమారెడ్డి కప్పంచెల్లించని రెడ్డి సామంతమాండలికుల పై ధ్వజమెత్తడానికి

రాజమహేంద్రపురం రాడు. కాటయ ముని అసాధారణ ప్రతిభను గుర్తించిన విజయనగర పాలకులు హరిహర రాయులు కాటయవేమునికి తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. గోదావరి నుండి సింహాచలం వరకు ఉన్న తూర్పు దేశాన్నంతటిని 'రాజమహేంద్ర రాజ్యము' అనే పేరుతో రాజ్యంగా ఏర్పాటు చేసి తన కుమారుడైన అనపోతారెడ్డిని దానికి అధిపతిగా చేశాడు కుమారగిరి రెడ్డి. కానీ అనపోతారెడ్డి అకాల మరణం చెందడంవల్ల రాజమహేంద్రవర రాజ్యాన్ని తనకు అండగా నిలిచినవాడు, తన బావ అయిన కాటయవేమునికి ఇచ్చాడు. ఇది కొంతమంది పెద్ద రెడ్డిదొరలకు ఇష్టంలేదు. కొండవీటి రెడ్డిరాజ్య పతనానికి ఇది ఆరంభం. పెదకోమటి వేమారెడ్డిని ప్రభువుగా అంగీకరించలేక రాజమహేంద్రవరాన్ని స్వతంత్రంగా పరిపాలించాడు. రాజమహేంద్రవర రాజ్యంకోసం కాటయవేమారెడ్డితో అనేకసార్లు యుద్ధానికి తలపడ్డాడు పెదకోమటి వేమారెడ్డి. కాటయవేమారెడ్డి రాజమహేంద్రవర రెడ్డి రాజ్యాన్ని (1395-1414)19 సంవత్సరాలు పరిపాలించి కటకం వరకు వ్యాపింపజేశాడు. చివరకు పెదకోమటి వేమునితో చేసిన యుద్ధంలో మరణించాడు. ఇతని కుమార్తె అనితల్లి.

కాటయ వేముని పది సంవత్సరాల కుమారుడు కుమార గిరిరెడ్డిని సింహాసనం మీద కూర్చోబెట్టి అల్లాడరెడ్డి రాజ్యపాలన చేశాడు. కుమారగిరి రెడ్డి చనిపోయాక రాజమండ్రిని పెదకోమటి వేమారెడ్డి ఆక్రమించగా అతనిని ఓడించి రాజమహేంద్రవరం నుండి తరిమివేశాడు అల్లాడరెడ్డి. రాజమండ్రి పై దండెత్తిన కళింగ, విజయనగర రాజులతో మైత్రిచేసుకున్నాడు. అల్లాడరెడ్డి మరణించాక అనితల్లి భర్త వీరభద్రారెడ్డి రాజ్యానికి రావలసి ఉండగా అల్లాడరెడ్డి సోదరుని కుమారులు రాజ్యాన్ని ఆక్రమించారు. అల్లాడరెడ్డి కుమారులైన వేమారెడ్డి, వీరభద్రారెడ్డి వారినుండి రాజమహేంద్రవర రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని వీరభద్రారెడ్డి సింహాసనాన్నలంకరించాడు. వేమారెడ్డి ప్రధానిగా రాజవ్యవహారాలు చూశాడు. పెదకోమటి వేమారెడ్డి మరణానంతరం శ్రీనాథకవిసార్వభౌముడు వీరభద్రారెడ్డి ఆస్థానంలో చేరాడు.

విజయనగరాధీశుడైన రెండవ దేవరాయలు రాజమహేంద్ర వరాన్ని జయించడంతో రెడ్డిరాజ్యం క్రమంగా అంతరించిపోయి విజయనగరాజుల స్వాధీనంలోని వచ్చింది.

### గజపతులు

కటకం రాజైన కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవర రెడ్డిరాజులపై దాడిచేసినా, రెడ్డిరాజులకు విజయనగర రాజుల అండ ఉన్నందున విఫలుడయ్యాడు. రెండవ దేవరాయలు మరణించాక విజయనగరం అండ పోయినందువల్ల కపిలేశ్వరుని సైన్యాలు రాజమహేంద్రవరం ఆక్రమించాయి. కపిలేశ్వరుని తమ్ముని కుమారుడు రఘుదేవ కుమారుడు రాజమహేంద్రవరానికి పాలకునిగా నియమింపబడ్డాడు. కపిలేశ్వరుని తరువాత బహమనీ సుల్తానుల వశమైన రాజమహేంద్రవరం కొంతకాలం తరువాత 1485 నాటికి పురుషోత్తమ గజపతి వశమయింది.

శ్రీ కృష్ణదేవరాయలు 1512లో పూర్వదిగ్విజయ యాత్ర ప్రారంభించి ఉదయగిరి, కొండపల్లి దుర్గాలను స్వాధీనం చేసుకొని తెలంగాణ నుండి వేంగిలోకి ప్రవేశించి రాజమహేంద్రవరం స్వాధీనం చేసుకొన్నాడు. ప్రతాపరుద్ర గజపతి శ్రీకృష్ణదేవరాయలతో చేసుకున్న సంధిననుసరించి కృష్ణానదికి ఉత్తరాన తాను జయించిన దుర్గాలన్నింటిని తిరిగి గజపతుల స్వాధీనం చేశాడు కృష్ణదేవరాయలు. దీనితో రాజమహేంద్రవరం మరలా గజపతుల వశమయింది. గజపతుల కాలంలో రాజమహేంద్రవరం 21 స్థలాలకు కేంద్రమై ఒక దండపాటగా పేర్కొనబడింది. దండపాట అంటే ఒక పరిపాలనా విభాగం. ఇది రాష్ట్రం లేక సీమలాంటిది.

### గోల్కొండ కుతుబ్‌షాహీలు

కుతుబ్‌షాహి వంశస్థాపకుడైన కులీ కుతుబ్‌షా గజపతులపై దాడి చేసి రాజమహేంద్రవరం స్వాధీన పరచుకున్నాడు. కొంతకాలం ఈ ప్రాంతం మీద పట్టు కోల్పోయినా, మల్కిభరాముడుగా ప్రసిద్ధి చెందిన ఇబ్రహీం కులీ కుతుబ్‌షా రాజమహేంద్రిని మళ్లీ జయించాడు. ఇతని తరువాత వచ్చిన తిరుగుబాట్లను మహమ్మద్ కుతుబ్‌షా అణచి వేశాడు. గోల్కొండ సుల్తానుల కాలంలో రాజమహేంద్రవరం ఎక్కువగా మహమ్మదీయుల పాలనలోనే ఉంది. వీరి కాలంలో రాజమండ్రి సర్కారుకు కేంద్రనగరం. ఔరంగజేబు గోల్కొండను స్వాధీనపరచుకోవడంతో గోల్కొండ రాజ్యం అంతరించి మొగలాయి సామ్రాజ్యంలో కలిసిపోయింది.

నిజామ్ ఉల్‌ముల్క్ మరణించాక వారసత్వ యుద్ధాలు బయలుదేరాయి. 1753 లో నిజామ్ ఉత్తర సర్కారులను ఫ్రెంచివారికి ఇచ్చాడు. ఆంగ్లేయులు ఫ్రెంచివారిని 1758 లో రాజమండ్రి సమీపంలోని కొండూరువద్ద ఓడించారు. సలబత్ జంగ్ ఆంగ్లేయులతో సంధిచేసుకొని ఉత్తర సర్కారులను ఆంగ్లేయులకు అప్పగించాడు. ఇందులో రాజమండ్రి కూడా ఉంది. నిజాం బ్రిటీషువారికి ఎదురు తిరిగి తరువాత రాజీ చేసుకొని ఉత్తర సర్కారులను కంపెనీవారికి ఏడాదికి 15 లక్షల రూపాయలకు కౌలుకు ఇచ్చాడు. ఈ ఒప్పందానికి రాజమండ్రి కూడలి అయింది. కంపెనీ పాలనకు వ్యతిరేకంగా రాజమండ్రి సర్కారులోని కొందరు జమీందార్లు తిరుగుబాటు చేశారు. 19వ శతాబ్ది మొదటి భాగంలో రాజమండ్రి కేంద్రస్థానంగా గోదావరి జిల్లా ఏర్పడింది.

ఈ విధంగా వేంగి చాళుక్యుల కాలంలో రాజధాని గాను, కాకతీయుల కాలంలో దుర్గంగాను, రెడ్డిరాజుల కాలంలో కొంతకాలం ఉపరాజధానిగాను కొంతకాలం ముఖ్య నగరంగాను, గజపతులకాలంలో దండపాటగాను, బహమనీ సుల్తానుల కాలంలో సర్‌లష్కర్‌గాను (సైన్యాధిపతి ఆధీనంలో ఉండే కేంద్రనగరం), కుతుబ్‌షాహీల కాలంలో సర్కారు కేంద్రంగాను రాజమహేంద్రవరం రాణించింది.

# ఉభయగోదావరి జిల్లాలలోని వన్య సంపద

– పమ్మి సత్యనారాయణ శాస్త్రి
–డా॥ నైనాల వేణుగోపాల్

అడవులలో పెరిగే వృక్షాలు, గుల్మాలు, లతలు, క్షుపాలు మొదలగు వృక్షజాలంతో పాటు, వాటితో నివసించే జంతువులు, కీటకాలు; పర్వతాలు, గుట్టలు, రాళ్ల రప్పలు, ఖనిజాలు; ఆటవికులు, వారి జీవన విధానము; నదులు, సెలయేళ్లు, సరస్సులు వాగులు అన్నీ వన్యసంపదలే!

అమంత్రమక్షరం నాస్తి, నాస్తి మూలమనౌషధం,
అయోగ్యః పురుషో నాస్తి, యోజకస్తత్ర దుర్లభః.


అనే ఆర్యోక్తి ననుసరించి అడవుల్లో ఉండే ప్రతిఅణువు అపురూప సంపదే! వాటిని గుర్తించి, వాటి వివరాలు, ప్రత్యేకతలు, జనసామాన్యంతో పాటు, విద్యార్థులకు, పరిశోధకులకు తెలియజెప్పిన మహామహులైన యోజకులను నిత్యం స్మరించుకొనవలసి ఉంది. వారు లేనిదే ఈనాడు మనకీ శాస్త్రజ్ఞానం ఉండేది కాదు. ఈ జ్ఞానాన్ని ప్రాయికంగా ప్రయోగాత్మకంగా నిరూపించి, పోషించి మనకందించినవారు ఆటవికులూ, గిరిజనులు. కనుక ప్రస్తుత వ్యాసంలో వృక్ష సంపద, గిరిజనవైద్య సంపదల గురించి కొన్ని విషయాలు క్లుప్తంగా ఇవ్వబడుతున్నాయి.

## సర్వేక్షణ

ఓషధీర్నామరూపాభ్యాం జానతే హ్యజపా వనే,
అవిపాశ్చైవ గోపాలశ్చ యే చాన్యే వనవాసినః.

అతిపూరాతనమైన ఆయుర్వేద సంహితాకారుడు చరకమహర్షి మాట ఇది. పశువులనూ, మేకలనూ మేపేవారు ఎక్కువగా అడవులలో సంచరిస్తూంటారు కనుక ఓషధుల నామరూపాలు వారి వద్ద నుండి తెలుసుకోవాలని ఆనాడే చెప్పారు. ఆనాటికే కాదు, ఈ నాటికీ సత్యమే! ఆధునిక వైజ్ఞానికులు, పరిశోధకులు, వీరి సహాయంతోనే సర్వేక్షణచేసి వేలాది మొక్కలను గుర్తించి వాటిని వర్గీకరించి, 'అంతర్జాతీయంగా గుర్తించడానికి లాటిన్ పేర్లు పెట్టినా, ఇప్పటికీ గుర్తించని మొక్కలనేకం ఉన్నాయని వృక్షశాస్త్ర పరిశోధకుల మాట. ప్రభుత్వము, పరిశోధనా సంస్థలూ, సేవాసంస్థలు సంయుక్తంగా నడుంకట్టి పని చేయవలసి ఉంది. గుర్తించిన మొక్కల జాబితాను ప్రస్తుతించడం అటుంచి వనసంపదను కాపాడే గిరిజనుల జీవన విధానాలను, మొక్కలను సంరక్షించే అపురూప సంస్కృతి గురించి తెలుసుకొని, నిలుపుకోవడం అత్యంతావశ్యకం. వారు వారి వృత్తులనుండి వదలిపోకుండా, వనసంపదను కాపాడుతూ, వారి శ్రమకు తగిన ఫలితం కలిగేటట్లు చేయడంలో మరింత కృషి అవసరం ఉంది.

అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న వృక్షసంపదను ప్రప్రథమంగా 1915 లో గాంబెల్ బృందం వర్గీకరించి ఫ్లోరాసు తయారుచేసి ప్రకటించారు. తదాది బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో, ఆంధ్రదేశంలోని కొన్ని అడవులలో సర్వే (పైమాసీ) రాజు (1964-68), రోళ్లశేషగిరిరావు (1957-64, 1982-84), సెబాస్టియన్ బృందం (1960), ధాత్రి (1964), జి.వి. సుబ్బారావు బృందం (1960-77), వెంకటేశ్వర్లు బృందం (1972), ఎస్.కే. వాగ్ (1960), టి. పుల్లయ్య బృందం (1990 ప్రాంతాలలో) అనే శాస్త్రజ్ఞులు చేసి మనకందించారు. కేవలం ఉభయగోదావరి జిల్లాల వన్యసంపద గురించి వ్రాసి ప్రకటించిన వారి వివరాలు లభించలేదు. వన్య సంపద కూలంకషంగా



శోధింపబడలేదనేది సత్యం. కాని కాకినాడలోని పిఠాపురం రాజా కళాశాల వృక్షశాస్త్రాచార్యులు టి.యు. చాకో గారు తూర్పు గోదావరి జిల్లాలోని ఔషధపు మొక్కలపై ఒక చిన్న గ్రంథాన్ని వ్రాయగా కాకినాడలోని - ది ఈస్ట్ గోదావరి హార్టీ కల్చరల్ సొసైటీవారు 1938లో ప్రచురించారు. ఆ పుస్తకపు ముందుమాటలో చాకోగారు - ప్రతి ఒక్క మొక్క యొక్క భౌగోళిక విస్తరణ, ఔషధపు విలువలు, ఆయుర్వేద శాస్త్రంలో చెప్పబడినవీ, ఔషధాలుగా వాడుకలో నున్న మొక్కల వివరాలు వ్రాయవలసి ఉన్నదనీ ఉటంకించారు.


### ఉభయగోదావరి జిల్లాలలో ఔషధపు మొక్కల సర్వేక్షణ

భారత ప్రభుత్వపు సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చి ఇన్ ఆయుర్వేద అండ్ సిద్ధ సంస్థ, వారి విజయవాడ ప్రాంతీయ పరిశోధనా సంస్థ ద్వారా ప్రముఖ వృక్షశాస్త్రజ్ఞులైన డా॥ కొప్పుల హేమాద్రి గారితో ఆంధ్రప్రదేశ్‌లోని రమారమి అన్ని అడవులను సర్వేక్షణ చేయించి ఆయా వివరాలను ప్రకటించారు. అందులోని భాగంగా ఉభయగోదావరి జిల్లాలలోని ఔషధపు మొక్కల వివరాలను 1980-81సం॥లలో సేకరించగా 1989లో ప్రకటించింది. వీరందరికీ ఆంధ్రులు ఋణపడి ఉండాలి. చాకో గారు ఆశించిన అంశాలలో ఒక భాగం పూర్తయింది.

పశ్చిమ గోదావరి జిల్లాలో పోలవరం, కొండ్రుకోట, చీదురు, కొరుటూరు, సిరివాక, రావిగూడెం, పాపికొండలు, చింతలపల్లి, వుర్రింక పులిరాముడి గూడెం, కన్నాపురం, జంగారెడ్డిగూడెం ప్రాంతాలలోనూ; తూర్పుగోదావరి జిల్లాలో కోరింగ, రామన్నపాలెం, కడియం, కత్తిపూడి, తోటపల్లి, శరభవరం, సూదికొండ, గోకవరం, రంపచోడవరం, దేవరపల్లి, మారేడుమిల్లి, వాలమూరు, కుట్రవాడ, సత్యవాడ, దేవీపట్నం, కొండమోదలు, తాడేపల్లి, యేలేశ్వరం, అడ్డతీగల ప్రాంతాలు వీరు సర్వేక్షణ చేశారు. దీనితో పాటు గిరిజనుల వైద్య చిట్కాలను కొన్ని సేకరించారు. ఇటువంటి అపురూపమైన సర్వేక్షణ ఇంతకు ముందుగాని, ఆ తర్వాతగాని జరిగినట్లుగా దాఖలాలు లేవు.

### జీవన వైవిధ్యము (బయోడైవర్శిటీ)

తూర్పుకనుమలు ఒరిస్సా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కొద్దిగా కర్ణాటక రాష్ట్రాలలో విస్తరించి ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాలలో సుమారు 16 మండలాలలోనున్న అడవులకు జీవవైవిధ్యపరంగా ప్రత్యేకతఉంది. పశ్చిమ గోదావరిలో జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, పోలవరం మండలాలు, తూర్పుగోదావరి జిల్లాలో దేవీపట్నం, రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, వై.రామవరం, రజవొమ్మంగి, ఏలేశ్వరం, శంఖవరం, కోటనందూరు, ప్రత్తిపాడు మండలాల్లో చాలా ఎక్కువ జాతులు, ప్రజాతుల వృక్షసంపద కలిగి ఉండడం వీటి ప్రత్యేకత. అందువల్లనే స్వతంత్ర సమర యోధుడు అల్లూరి సీతారామరాజు అక్కడే నివాసమేర్పరచు



కొన్నాడు. బ్రిటిషువారి సేనలకు కూడా దొరకకుండా ఉండగలగడమే అవి దట్టమైన కీకారణ్యాలని నిరూపిస్తుంది. ఈ వనసంపదను బ్రిటిషువారి దోపిడినుండి కాపాడి గిరిజనులకు అండగా నిలిచాడు. ఇక్కడి గిరిజనులు సీతారామరాజుకు అండగా నిలిచి స్వాతంత్రసమరంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. మారేడు మిల్లి వంటి ప్రాంతాలు ఓషధుల నిధి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మారేడు మిల్లిలో 250 హెక్టార్ల అటవీప్రాంతాన్ని మెడిసినల్ ప్లాంట్స్ కన్సర్వేషన్ ఏరియాగా ఏర్పాటు చేసి సంరక్షించడం ముదావహం. గిరిజన కో-ఆపరేటివ్ కార్పోరేషన్‌వారు అటవీ సంపదను మార్కెట్ చేస్తూ గిరిజనులకు అండగా ఉన్నారు.

### వాణిజ్య పంటలు

గోదావరినది కొరుటూరు - కొండమోదలు ప్రాంతాలలో పాపికొండలను చీల్చుకుంటూ ప్రవహించి గోదావరి జిల్లాలకు సహజమైన సరిహద్దుగా ఏర్పడింది. ఉపనదులుగా చీలి ఆ మధ్య ప్రాంతాన్నంతా బంగారం పండించే సారవంతమైన బంకమట్టి, ఎర్ర, నల్లరేగడి; బురదనేలల వంటి సారవంతమైన భూములతో పాటు, ఆకురాల్చే మొక్కలు, నీటి మొక్కలు మహావృక్షాలు మొదలగు వానిని ప్రసాదించి సస్యశ్యామలం చేసింది. ఈ అడవుల్లో ప్రజల అవసరాలను తీర్చే వెదురు ఇరుగుడు చేవ (జిట్రేగి) మొదలగు కలప జాతులు విరివిగా లభిస్తాయి. విదేశాలలో మంచి గిరాకీ ఉన్న కొవెల జిగురు (గమ్ కరయా) న్నిచ్చే ప్రత్యేక వృక్షాలిక్కడున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుండి విదేశాలకు ఎగుమతయ్యే మొత్తంలో 50 శాతం ఇక్కడనుండే సేకరించబడుతుంది. మనరాష్ట్రంలో పెరగవనుకునే మిరియపు తీగెలు కూడా మారేడుమిల్లి ప్రాంతాలలో పెంచుతున్నారు. దీనిని పెద్ద పంటగా ప్రోత్సహించవలసి ఉంది. ఔషధాలలో ఉపయోగపడే నల్లజీడి, విషముష్టి, ఇండుప గింజలు, సుగంధిపాల, పిప్పలీమూలం, ఎర్రచిత్రమూలం, సరస్వతి, మద్ది, తానికాయ, కరక్కాయ,

ఉసిరికాయం, నేలవేము, కొడిశ, ఈశ్వరి, కీటవారి (గాడిదగడప), తేనె మొదలగునవెన్నో గిరిజనులు సేకరించి అమ్ముతారు. ఈటీవలి కాలంలో అల్లం, పసుపు, కంద వంటివి వాణిజ్య పంటలైనాయి. వర్జీనియా పొగాకుకు ఉభయ గోదావరి జిల్లాలకు పెట్టింది పేరు. అందువలననే జాతీయ పొగాకు పరిశోధనా సంస్థ రాజమండ్రిలో స్థాపించబడింది.

### గుర్తింపుకురాని మూలికాసంపద

ఇక ఎక్కువ మొత్తంలో నున్న కొన్ని మూలికలకు మార్కెట్ ఉండి కూడా సేకరించక ఏటా అనేక కోట్లరూపాయల ఆదాయం పోతోంది. జ్యోతిష్మతి (తీగపల్లేరు), అరెపూవు, నేపాళం, రేల, వృద్ధదారు (కొకిత), దూలగొండి విత్తులు, తానికాయలు, నేలతాటిగడ్డలు, పెద్దములక, మంగకాయలు, నేలవేము, పిల్లీతీగెలు, నేరేడు గింజలు, అడ్డసరపాకు, తిప్పతీగె, నేల ఉసిరికల సేకరణ, అమ్మకం, సరైన పద్ధతులలో జరిగితే వైద్యరంగానికి, గిరిజనులకు, ప్రభుత్వానికి చాలా మేలు కలుగుతుంది. ఈ దిశలో గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ చేస్తున్న కృషి ఇనుమడింప జేయవలసి ఉంది.

### గిరిజన వైద్యం

గిరిజనులు రోగాల బారి పడకుండా వారే చికిత్స చేసుకుంటారు. పశువులకు, పక్షులకు కూడా వైద్యం చేస్తారు. వైద్యం చేసేవారిని వెజ్జోడు, వెజ్జు, విజ్జురాలు గౌరవలి అని పిలుస్తారు. మారేడు మిల్లికి చెందిన పల్లాల ఆదిరెడ్డి అనువంశికంగా వైద్యం చేస్తూంటాడు. విశాఖ పట్నానికి చెందిన ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ త్రూ ఎన్విరాన్‌మెంటల్ ఎవేకెనింగ్ అనే సంస్థ శ్రీ ఆదిరెడ్డి చిట్కాలను కొన్నిటిని గ్రంథస్తంచేసి చిన్న పుస్తకంగా ప్రకటించడం అభినందనీయం.

ఈ అడవులలో లభించే జిరుముడి అనబడే మొక్కతో విచిత్రమైన పనులు చేస్తారీ గిరిజనులు! జిరుముడిని చాలా పేర్లతో పిలుస్తారు. అవి జినుగుడు, జిరుగుడి, గిరిగిడి, గిరిగోడి, కన్నెమిసర, కోస, పస్క, కిరిసినకాయ మొదలైనవి. దీనిని లాటిన్‌లో కేసియారియా ఎలిప్టికా అని గుర్తించారు. దీనిలో మరో ప్రజాతి ఉంది. దానిపేరు కేసియారియా గ్రావియోలెన్సిస్. జిరుముడి పచ్చికాయలను దంచిన ముద్దను చిన్న చిన్న వాగుల్లో కలుపుతారు. కలిపిన కొద్ది సేపటికి చేపలన్నీ పైకి తేలతాయి. వానిని సులభంగా పట్టుకుంటారు. ఈ కాయలు పండిన తర్వాత జాజికాయ లోపల జాపత్రి వంటి ఎర్రటి పొర ఉంటుంది. దానిలో తెల్లని గింజలు ఉంటాయి. పండిన కాయలలోని ఈ గింజలను తినడానికి పక్షులొస్తుంటాయి. గిరిజనులు జెముడు వంటి మొక్కల నుండి పాలు తీసి బాగా గిలక్కొట్టి చిక్కగా జిగురులా చేసి ఈ జిరిముడి చెట్లకు అంటిస్తారు. వచ్చిన పక్షులు ఈ జిగురు మీద వ్రాలితే జిగురు వల్ల మరల లేచి ఎగరలేవు. అట్లాగే కొట్టుకుంటుంటాయి. అప్పుడు వాటిని పట్టుకుని ఆహారంగా ఉపయోగించుకుంటారు. ఈ గింజలనుండి నూనె తీసి వంటనూనెగా వాడుకుంటారు. గింజలపై గల ఎర్రటి పొర వలన నూనె ఎర్రగా ఉంటుంది. ఈ మొక్కలో గల వివిధ గుణాలపై పరిశోధన జరుగవలసి ఉంది. అటువంటిదే మరో ఆశ్చర్యకరమైన చిట్కా. కుమ్మెరి తీగె అనే మూలిక, వయస్సు బట్టి విచిత్రమైన పలురంగుల వేళ్ళు కలిగి ఉంటుంది. గిరిజనులు వేళ్లను త్రవ్వి తెల్లటి వేళ్లను శ్వేత ప్రదరానికీ, ఎర్రటి వేళ్లను రక్తప్రదరానికీ ఔషధంగా వాడుతారు.

కసివిందవేరు, పసుపుకొమ్ము 5 - 5 గ్రాములు కలిపి దంచి రోజుకొక్కసారి, మూడు రోజులు మ్రింగి శ్వేతప్రదర బాధనుండి విముక్తి పొందుతారు. ఇట్లా ఎన్నెన్నో!!!

* * *



# చైతన్యగోదావరి - కందుకూరి

డా॥ మన్నవ భాస్కర నాయుడు

ఇది నవసహస్రాబ్దిలో జరుపుకొంటున్న తొలిగోదావరి పుష్కరోత్సవాలు! ఇవి నవయుగవైతాళికుడు శ్రీకందుకూరి వీరేశలింగంగారికి గౌరవ నీరాజనాలు!!

*గత సహస్రాబ్దం చివరి దశలో......*
*ఇప్పటికి సుమారు ఒకటిన్నర శతాబ్దానికి పూర్వం.....*

జంబు ద్వీపంలోని భరతవర్షం, అందలి ఆంధ్రభూమి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, అస్వతంత్రమైన అంధకారంలో దోబూచులాడుకుంటున్నాయి. ఆంగ్లపాలనవల్ల కలిగిన పారతంత్ర్య తిమిరాలు, భావస్వాతంత్ర్యంలేని మూఢవిశ్వాసాల గాఢాంధకారాలు మన జాతి చుట్టూ చీకటి ప్రాకారాలు నిర్మించాయి. కన్నుకానని కటిక చీకట్లను చీల్చుకొంటూ తూరుపు కొండమీద ఉదయించే వేకువ వెలుగు వాకలాగా...... పావనగోదావరీ తీరంలో, సుప్రసిద్ధ రాజమహేంద్రవర నగరంలో ఆవిర్భవించిందొక వీర విప్లవ విస్ఫులింగం! ఆ విస్ఫులింగమే వీరేశలింగం!

*ఆయన ఇంటిపేరు కందుకూరి!*
*ఆయన తెలుగుగుండెలపై తొలకరి!*
*ఆయన వెలుగు కెరటాల చైతన్య గోదావరి!*
*ఆయన మేలుకొలుపుల మేలుమలుపుల రహదారి!*

ఆనాడు క్రీ.శ. 11 శ.లో ఆంధ్రకవిత్వానికి ఆదికవిగా నన్నయభట్టుకు ఊపిరిపోసింది గౌతమీగంగ!

ఈనాడు..... క్రీ.శ. 19శ.లో ఆధునికాంధ్ర సాహిత్యానికి ఆదికవిగా కందుకూరికి ఊపిరులూదింది గోదావరీగంగ! ఆనాడు పవిత్రగోదావరీతీర పులినతలాలలో తెలుగు కవితా కుమారి గొంతువిప్పింది. ఈనాడు అదే పావన గోదావరీ తీరసైకత స్థలాలలో తెలుగు సరస్వతి సంకెళ్లను ఛేదించుకొని సంస్కరణ పథంలో గర్జించింది. ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఇద్దరు యుగకర్తలకు పురుడుబోసిన గౌతమీమాత నిత్యచైతన్య సీమంతిని! శ్రీ కందుకూరి వీరేశలింగంగారు 16-4-1848తేదీన రాజమహేంద్రవరంలో జన్మించారు. రాజమహేంద్రి నుండి చెన్నపట్టణం వరకు సాగిన ఆయన సంస్కరణ సాహిత్య యాత్ర యావదాంధ్రదేశానికి ప్రగతిమార్గం చూపింది. 1919 సం॥లో మరణించేవరకు కందుకూరి కలం, గళం మానవ సమాజహితం కోసమే. ముఖ్యంగా మహిళా సంక్షేమంకోసమే అనర్గళమై పురోగమించాయి! ఆనాటి ఆంధ్రదేశంలో...... ముక్కుపచ్చలారని ముద్దుబాలికలను ముసలివాళ్లకు భార్యలు చేయటం, సతీసహగమనాలకో, బలవన్ వితంతు దుర్దశలకో గురిచేయటం, చదువుకునే అవకాశాలు కలిగించకపోవటం ..... వంటి వికృతాచారాలతో స్త్రీలు ఆహుతి అవుతున్నారు.



**రామానంద చటర్జి ప్రతిష్ఠ చేసినది 1933**

**Born 16-4-1848**

**Died 27-5-1919**

A Sincere Thiest

A Great Philanthropist

A Veteran Social Reformar

A Renowned Telugu Poet and Scholar

**కవివరుడు, శతాధిక గ్రంథకర్త**

(రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండువద్ద చౌరాస్తావద్ద విరేశలింగం పంతులు గారి పూర్ణప్రమాణ విగ్రహం 1933 సం॥లో స్థాపింపబడినది. దాని క్రింద ఆంగ్లంలో మరియు తెలుగులో వ్రాయబడిన శాసనం.)

రుద్రమ్మలు, మాంచాలలు, ఝాన్సీలక్ష్మమ్మలు జన్మించిన భారతదేశంలో స్త్రీలకు ఇటువంటి దురవస్థలు ప్రాప్తించటం చిత్రమే!

పారిశ్రామిక విప్లవం, పాశ్చాత్యవిజ్ఞాన పరిచయం, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం పురులు విప్పిన దశలో కూడా .... ఆంధ్రదేశంలో కందుకూరి గోదావరి ఒడ్డున జన్మించే వరకు స్త్రీలను గురించి ఆలోచించినవాళ్లు లేరు.

తల్లి అయినా, చెల్లి అయినా, ఇల్లాలు అయినా స్త్రీ పురుషుని అధీనంలో ఉండవలసిన వస్తువుగా భావించారు. స్త్రీ వంట ఇంటికి, పడకటింటికి మాత్రమే పనికి వచ్చే యంత్రంగా మార్చివేశారు.

అటువంటి ...... గాఢ మూఢ విశ్వాసాల అంధకార కల్లోలిత సముద్రంలో నుంచి ఉద్ధరించి స్త్రీలకు ఒకవెలుగుదారి చూపిన కందుకూరికి జన్మనిచ్చిన పావన గోదావరి తీరభూమి ధన్యమైపోయింది! దానితో కలిసి ఆంధ్రదేశం యావత్తూ ధన్యమైపోంది.

'తెలుగుదేశంలో వీరేశలింగం అనే మహాపురుషుడు ఉద్భవించి, చీకటింట్లో కిటికీలు తెరచి, సూర్యుడి వెలుగును, చంద్రుని వెన్నెలను ప్రసరింపజేసి, దుమ్ముదులిపి, బూజు తుడిచి, మనుష్యుల్లో మంచి కొంచెం పెంచి, మానవత్వాన్ని నిలిపేదాకా..... మహిళల స్థితిగతులు దుస్సహంగా ఉండేవి! ఆయన తెచ్చిన సంఘసంస్కరణ సూర్యుని వెలుగు. ఆయన ఇచ్చిన సాహిత్యం చంద్రుని వెన్నెల. ప్రత్యేకంగా స్త్రీల అభ్యుదయం కోసమే ఆయన ఎన్నో యుద్ధాలు చేశారు.' - అని అక్కిరాజు ఉమాకాంతంగారు కందుకూరిని ప్రస్తుతించారు. ఈ వాక్యాలు కేవలం స్తవాలు కావు ... వాస్తవాలు!

వీరేశలింగం గారికి బాల్యంలోనే తిరుగుబాటు తత్వం అబ్బింది. అవినీతిని, అక్రమాన్ని, అలసత్వాన్ని అంగీకరించే వారుకారు. నీతికోసం, న్యాయంకోసం, తాను నమ్మిన మంచికోసం తన మేస్టర్లను కూడా వ్యతిరేకించటానికి వెనుకాడే వాడుకాడు. అర్థం పర్థంలేని మూఢనమ్మకాలను కూడా వ్యతిరేకించేవారు. బడిపంతులుగా మొదటిసారి ఉద్యోగంలో చేరటానికి అందరిలాగా మంచి దినం, మంచిలగ్నం చూడలేదు. పెద్దలను కాదని, కావాలని అమావాస్యనాడు కందుకూరి తొలి ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు. పున్నమి చంద్రునిలా జాతికి చల్లని వెలుగు అందిచాడు. అదీ ఈ గోదావరీ లహరి విశిష్టత!

ఈ గోదావరీ తరంగం చిన్నతనంలోనే అంతరంగంలో కవిత్వానికి చోటు కల్పించారు. ధారా శుద్ధి, వేగం కలిగిన గంగా తరంగంలో కవిగా తురంగలించారు. సంప్రదాయ కవితా ప్రౌఢత్వంలో తన పటిమ ఏపాటిదో పండితలోకానికి చాటి చెప్పాలనుకున్నారు. మార్కండేయ శతకం, గోపాల శతకం వంటివి చాలా పసివయస్సులోనే రచించారు. 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము' రచించారు. చిత్రకవిత్వం రచించగలనని తొలిదశలోనే నిరూపించారు. సంస్కృతంనుంచి కాళిదాస నాటకాలను అనువదించారు. 'రత్నావళీ' 'ప్రబోధచంద్రోదయం' నాటకాలను అనువదించారు. స్వతంత్ర నాటకాలు అనేకం రచించారు. భారతకథకు సంబంధించి తెలుగు తొలినాటకం రచించిన కీర్తి వీరేశలింగంగారిదే! 'దక్షిణగోగ్రహణము' అనే నాటకాన్ని ఆయన 1885లోనే రచించారు. 'సత్యహరిశ్చంద్ర' 'తిర్యగ్విద్వన్మహాసభ' 'మహారణ్య పురాధిపత్యము' 'ప్రహ్లాద నాటకము' వంటి నాటకాలు రచించారు.

షేక్స్పియర్ వంటి ప్రసిద్ధ ఆంగ్లకవుల నాటకాలను కూడా కొన్నింటిని కందుకూరి ఆంధ్రీకరించారు. మరికొందరి ఆంగ్లేయ రచనలను కూడా ఈయన నాటకాలుగా రచించారు. షేక్స్పియర్ 'మర్చంట్ ఆఫ్ వెనీస్' నాటకాన్ని 'వెనీసు వర్తక చరిత్రము'గా, షెరిడిన్ రచించిన 'ది రైవల్స్'ను 'కల్యాణ కల్పవల్లి' అనీ, 'డ్యూయనా'ను 'రాగమంజరి' అనే నాటకాలుగా మలిచారు.

పంచతంత్రంలోని 'సంధి', 'విగ్రహము' అనే వచన రచనలు చేసి 'గద్యతిక్కన' అనిపించుకున్నారు. తెలుగులో 'స్వీయరచన'కు, 'కవులచరిత్ర'కు శ్రీకారం చుట్టిన యుగకర్త కందుకూరి.

పాతికేళ్ల ప్రాయానికే కందుకూరి రచనావిధానంలో మార్పురావలసిన ఆవశ్యకత గుర్తించారు. సాహిత్యం స్వోత్కర్ష కోసమో, పాండిత్యప్రదర్శన కోసమో కాదనీ....... సాహిత్యం సమాజ సంస్కరణకోసం సాధనమనీ గ్రహించారు. 'సరస్వతీ నారద సంవాదం' ద్వారా కందుకూరి తన పరిణతిని, పరిణామనీతిని వెల్లడించారు.

'సరస్వతీ నారద సంవాదం' అనే పద్యకావ్యంలో.....

తెలియదు సుమ్మిప్పుడు నా
పలుకుల యర్థంబునాకె భావములేమిన్
వెలసొమ్ములు గాకివి సం
కెలలయి కడునాదుమేనికిన్ వెత నించున్.... అనీ...

దయమాలి తుదముట్ట తలకట్లు నిగిడించి
ధీరుడై నన్ను బాధించునొకడు,
పాదంబులోపల పాదంబులిమిడించి
వీరుడై నన్ను నొప్పించునొకడు,
ప్రాసంబుపై పెక్కు ప్రాసంబులడరించి
పోటుబంటయి నన్ను పొడుచునొకడు,
బెండుపల్కులు గూర్చి నిండైన నగలంచు-
దిట్టయై చెవులు వేధించునొకడు.

ఖడ్గ చక్రాది రూపముల్ గానిపించి
వర్ణముల్ మార్చి నను చిక్కు పరచునొకడు,

కుమతులొడలెల్ల విరిచి ప్రాణములు తీయు
ఒడలి పసలేక శుష్కించియున్నదాన.......' అనీ


సరస్వతీదేవి వేదనను తన మాటలలో వెల్లడించారు. అన్నిరకాల చిత్రకవితారీతులు అర్థరహితాలనీ, అవి సాహిత్యానికి శోభనివ్వవనీ, పైపెచ్చు క్షోభ కలిగిస్తాయనీ కందుకూరి చాలా స్పష్టంగా తన అభిప్రాయాలు ఇందులో చాటి చెప్పారు. తన జీవితాన్ని, సాహిత్య జీవితాన్ని సమాజసేవకే..... ముఖ్యంగా స్త్రీజనోద్ధారణకే అంకితం చేశారు.

సుమారు 125 సం॥ క్రితమే కందుకూరి వీరేశలింగం విప్లవ విస్ఫులింగమై ఆంధ్రమహిళ సర్వతోముఖాభివృద్ధి కోసం చేసిన సామాజిక సాహిత్యపోరాటం..... కురుక్షేత్ర సంగ్రామం కంటె తక్కువది కాదు. ఆనాటి దేశభక్తులు ఆంగ్ల పాలకులతో వారి భయంకర మారణాయుధాలతో చేసిన స్వాతంత్ర్య పోరాటం కంటె చిన్నదికాదు.

యుగయుగాలుగా, తరతరాలుగా జాతి నరనరాలలో స్థిరపడిపోయిన మూఢ విశ్వాసాలతో, వాటికి పట్టుగొమ్మలైన సంప్రదాయ ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో కందుకూరి సల్పిన భావయుద్ధం, చైతన్యసమరం రాజీలేనివి! చాలా ప్రమాద భరితమైనది. తెలుగునేలపై వేళ్లూని బలంగా ఎదిగి ఉన్న కులబలంతో ధనబలంతో మందబలంతో మందుబుద్ధుల బలంతో మతబలంతో అంధవిశ్వాసబలంతో కందుకూరి పోరాడవలసివచ్చింది. పోరాటంలో ముందుకు దూసుకొని వెళ్లాడేగాని మడమ తిప్పలేదు.

ఆనాడు ఆయన సంస్కరణ కోసం ఎదురుచూస్తూ పరమ వికృతంకల క్రూరంగా సాక్షాత్కరించిన సామాజిక దురాచారాలు....... స్త్రీ బాల్య వివాహాలు.

వారికి అకాలంగా అవాంఛనీయంగా ప్రాప్తించిన బాల వైధవ్యాలు, వారిపై సాగుతున్న హింసారాక్షస దురాచారాలు.... స్త్రీలు ఇన్ని వేదనలకు బలియై పోతూ ఉండటానికి కారణం వారిలోని అవిద్య అని ఆయన గ్రహించారు. పురుష దురహంకారంపై ఆగ్రహించారు. చదువులేక పోవటం వల్ల స్త్రీలు లోకజ్ఞానహీనలవుతున్నారు. కుటుంబాలను కాదు.... తమ బ్రతుకులనే చక్కదిద్దుకొనలేని అబలలవుతున్నారు. కాబట్టి ... 'స్త్రీ విద్యావతి కావాలి' అని కందుకూరి నిర్ణయించుకున్నారు. తన నిర్ణయాన్ని ఆచరణలోనికి తేవటానికై పూనుకున్నారు.



విద్యలేని మనిషి వింతపశువు అని అంగీకరించిన సమాజం....... తనలో సగభాగమైన మహిళను విద్యకు దూరం చేయటం వింతకాదా! అంటే సమాజ శరీరంలో సగభాగం ఇంకా మృగంగానే పశువుగానే మిగిలి ఉందని ఆయన ఆకళించుకున్నారు. ఆయనలోని సంస్కార సాహస చేతనత్వం మేలుకొన్నది. తెలుగునేలపై తొలివైతాళికుడుగా మేలు కొలుపుల మేలుమలుపులు చూపి జాతిని నడిపించటానికై నడుముబిగించారు. సంస్కర్తగా కందుకూరి పరిష్కరించ దలచిన సమస్యలివి.

స్త్రీ విద్యను ప్రారంభించి ప్రోత్సహించటం

స్త్రీ బాల్య వివాహాలు నిరోధించటం

బాలవితంతువులకు పునర్వివాహాలు జరిపించటం


పై ఆశయాలతో కందుకూరి కేవలం ప్రవక్తగా ఆగిపోదలచలేదు. ఆచరణశీలి యై సంస్కర్తగా మధ్యందిన మార్తాండునిలా ఉజ్వలించారు!.... తన గళాని, కలాన్ని, కాలాన్ని సర్వస్వమూ మహిళా జనశ్రేయంకోసం వినియోగించారు.

వీరేశలింగంగారు వీరులేకాదు కార్యశూరులు! 1874 సం॥ స్త్రీల ప్రయోజనాలకోసం రచనలు వ్యాప్తిలోనికి తేవడానికి 'వివేకవర్ధని' పత్రిక స్థాపించారు. అంతేకాదు, ఆంధ్రదేశంలో తొలి బాలికాపాఠశాలను కందుకూరివారే రాజమండ్రి సమీపంలో ధవళేశ్వరంలో నెలకొల్పారు. ఆవిధంగా స్త్రీ విద్యకు అంకురార్పణ చేసిన దార్శనికుడాయన.

1883 సం॥లో 'సతీహితబోధిని'. అనే పత్రికకూడా ప్రారంభించారు. 'హాస్యసంజీవని' అనే పత్రికకూడా నడిపారు. అనేక ఆవాంతరాలను అధిగమించి, వీరేశలింగంగారు 1881 సం॥ మొదటి వితంతు వివాహం జరిపించి, స్త్రీల జీవితంలో వికాసయుగానికి బాటవేశారు. ఆంధ్రుల సామాజిక చరిత్రలో కొత్తపుటను ఆవిష్కరించారు. రాజారామమోహనరాయ్, ఈశ్వర చంద్రవిద్యాసాగర్ వంటి ఉత్తరాది సంస్కర్తల ప్రభావంతో కందుకూరి ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజం స్థాపించారు. అనంతరకాలంలో రఘుపతి వేంకటరత్నంవంటి మహామహులు బ్రహ్మసమాజ విధానాలను ఆంధ్రదేశంలో ప్రాచుర్యం చేశారు.

కందుకూరి మహిళాభ్యుదయం కోసం బహుముఖమైన కృషిచేశారు. పునర్వివాహాలకు అవకాశాలు కలిసిరాని వితంతువుల సంక్షేమం కోసం 'వితంతు శరణాలయం' స్థాపించారు. స్త్రీల అభ్యున్నతికోసం కృషి చేయటానికి పురుషులను కూడా సమాయత్తం చేయవలసిన అవసరాన్ని కందుకూరి గుర్తించారు. ఆధునిక అభ్యుదయభావాలు కలిగిన యువకులు, పెద్దలు సమావేశమై, భవిష్యత్ కార్యక్రమాలపట్ల అవగాహన పెంచుకోవటానికి, తరచు కలిసికొంటూ ఉండటానికి అనువుగా 'హితకారిణీ సమాజాన్ని', 1890సం॥ పురమందిరాన్ని, 1897లో ప్రార్థన సమాజ మందిరాన్ని రాజమండ్రిలో నిర్మించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకై ఆయన చాలవరకు తన ఆస్తిపాస్తులనే ఖర్చుచేశారు. తాను రచించిన పుస్తకాలవల్ల లభించిన సొమ్మునంతా వీరేశలింగంగారు తమ సంస్కరణ కార్యక్రమాలకే వెచ్చించేవారు.

కందుకూరి రచించిన రాజశేఖర చరిత్ర, సత్యవతీ చరిత్రము, సత్యరాజాపూర్వదేశయాత్రలు వంటి నవలలు ఆనాడు అమిత ప్రచారం పొందాయి. పత్రికలద్వారా, నవలల



ద్వారా మాత్రమే తన కార్యక్రమాలు ప్రాచుర్యంలోకిరావని, తన ఉద్దేశాలు, అభ్యుదయభావాలు, స్త్రీ జనోద్ధరణ సమాజం బాధ్యత అనే విషయాలు ప్రజాబాహుళ్యంలో బాగా ప్రాచుర్యం చెందాలంటే నాటకాలు మంచి సాధనాలని ఆయన గుర్తించారు. ఆనాడు ఆంధ్రదేశంలో ధార్వాడ నాటక సమాజం అనేక ప్రాంతాలలో విజయవంతంగా నాటక ప్రదర్శనలు ఇస్తూ ఉంది.

ఆ ప్రేరణతో కందుకూరి వీరేశలింగంగారు అనేక నాటకాలు, ప్రహసనాలు రచించి ప్రదర్శింపజేశారు. వీరి తొలినాటకం - 'బ్రాహ్మవివాహము', దాని తర్వాత, 'వ్యవహార ధర్మబోధిని' - దీనిని వ్యవహారభాషలో రచించారు. ఈ ప్రహసనానికి విశేష ప్రాచుర్యం లభించింది. 'ప్లీడరు నాటకం' అని దీనికి పేరువచ్చింది. ఆయన కదిలించిన కలం ఆగకుండా-.

అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం, విచిత్ర వివాహ ప్రహసనం, మహాబధిర ప్రహసనం, పునర్మరణ ప్రహసనం, బలత్కారగాన వినోదప్రహసనం, కలహప్రియాప్రహసనం, మహామహోపాధ్యాయ ప్రహసనం, యోగనిద్రా ప్రహసనం, మహావంచక ప్రహసనం, అసహాయశూర ప్రహసనం ..... వంటి రచనలు ఆంగ్లభాషలోని వివిధ రచనల ప్రేరణతో రచించి ప్రచురించారు. ప్రదర్శింపజేశారు. ఇవిగాక వీరు పదహారు నాటకాలు రచించారు. నాటకాలయినా, ప్రహసనాలయినా, వచన ప్రబంధాలయినా, నవలలయినా, పత్రికలయినా .... వీరేశలింగంగారికి స్త్రీల శ్రేయస్సుకోసం సమాజాన్ని సంస్కరించే సాధనాలుగానే ఉపకరించాయి. వీటిని ఆయనా అలాగే వినియోగించుకున్నారు.

చంద్రమతీ చరిత్ర, సత్యవతీచరిత్ర, సత్యరాజాపూర్వదేశ యాత్రలు, సత్యసంజీవని, నీతికథామంజరి, దేహారోగ్య ధర్మబోధిని, పత్నీహితసూచని, సత్యాద్రౌపదీ సంవాదం, మాతృపూజ, పితృపూజ...వంటి రచనలన్నీ మహిళల కవసరమైన అంశములను ప్రబోధిస్తున్నాయి.

ఇంత సామాజిక సేవా కార్యక్రమభారంమోస్తూ, కందుకూరి తెలుగులో అన్ని సాహిత్యప్రక్రియలను ప్రారంభించి, వాటికి సాహిత్య గౌరవం కలిగించారు. కందుకూరి వీరేశలింగంగారు రాజమహేంద్రవరానికీ, గోదావరీ తీరానికి, మహిళాలోకానికే పరిమితమైనవారుకారు. వారి ప్రయత్న ప్రయోగ ఫలితాలు యావదాంధ్రజాతికి ఉపకరించాయి.

అందుకే కందుకూరిని - 'దేవత' అని కట్టమంచి రామలింగారెడ్డి, 'నూత్న మహాంధ్రయుగప్రవక్త' అని యస్.టి. జ్ఞానానందకవి, 'విప్లవ మూరుత్వమ్ము' అని పోచిరాజు శేషగిరిరావు, 'తెలుగుజాతికే జ్యోతిర్లింగం వీరేశలింగం' అనీ 'తెలుగుజాతికి జాతిపిత' అని బోయి భీమన్న, 'నాటికన్న ఈనాడే కందుకూరి కావాలి' అని దాశరథి కందుకూరిని ప్రస్తుతించారు. కందుకూరి సంస్కరణశీలి! సాహిత్యశూలి! కందుకూరి ఆనాడు నిర్మించిన సంస్కరణలదారి నేటి నారీలోక పురోగమనానికి రహదారి!

* * *

# కాటన్ మ్యూజియం

-దినవహి బాపిరాజు

**జోతలందుకోరా సర్ ఆర్థర్ కాటన్ దొరా**
**తరతరాలకూ అన్నమొసగిన దాతవునీవురా**
**నీవులేక ఈ అన్నపూర్ణ ఒక నిండుసున్న కదరా**
**ఆర్థర్ ఎవరని అడిగితే చేతిలోని అన్నంముద్దని చూపిస్తా**
**ఆర్ఘ్యమిచ్చువేళ అమరులతో సరిపోలుస్తా.**

........ అన్నారు ఈ ప్రాంతానికి చెందిన యువ సాహితీ వేత్త శ్రీ యర్రాప్రగడ రామకృష్ణ.

ఇది అక్షర సత్యం అంతగా ఈ ప్రాంత ప్రజలు కాటన్ దొరకు ఋణపడి ఉన్నారు.

సర్ ఆర్థర్ థామస్ కాటన్ సామాన్యుడికి కాటన్ దొర. పుట్టింది ఆంగ్లనేలపైన అయినా... తెలుగు గడ్డపై విపరీతమైన మమకారంతో ఈ నేలని సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు. ఎన్నో లక్షల ఎకరాలకు సాగునీరందించిన జలదాత. ఆంధ్రని అన్నపూర్ణ చేసిన మహానుభావుడు.

ఉభయగోదావరి జిల్లాలు ఇంత సస్యశ్యామలంగా ఉన్నాయంటే అది కాటన్ పెట్టిన భిక్షే.

అటువంటి కాటన్ పేరిట ఏర్పాటుచేసినదే సర్ ఆర్థర్ కాటన్ మ్యూజియం. ఇది రాజమండ్రికి ఏడు కిలోమీటర్ల దూరంలోని ధవళేశ్వరంలో ఇరిగేషన్ డిపార్టుమెంటు ప్రధాన కార్యాలయానికి ఎదురుగుండా, గోదావరి బ్యారేజి కుడి అప్రోచ్ రోడ్‌కి అనుకొని ఉన్న పురాతన, సుందరమైన కట్టడంలో ఏర్పాటు చేశారు. 1989లో ఏర్పాటుచేసిన ఈ మ్యూజియాన్ని ఈ ప్రాంత ప్రజలకు అన్నంపెట్టిన గ్రేట్ ఇంజనీర్ (సర్ ఆర్థర్ కాటన్) జ్ఞాపకార్థం ఏర్పటు చెయ్యడమన్నది ముదావహం.

1852లో ఎత్తైన గోదావరి ఆనకట్ట నిర్మాణానికి ఉపయోగించిన యంత్రాలు, ఆనకట్ట నమూన, డెల్టాసిస్టమ్ ఏవిధంగా ఉంది, డెల్టాలు ఉన్న కాలువలు, గోదావరి సముద్రంలో కలిసే తీరు-వంటి నమూనా చిత్రాలను ఈ మ్యూజియంలో పదిలపరిచారు. అలాగే ఆనకట్టని నిర్మించడం వల్ల గోదావరి డెల్టా ప్రాంతం ఏ విధంగా సస్యశ్యామలమైందో వివరించే చిత్రపటాలను కూడా ఏర్పాటు చేశారు. కొంత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురియైనా ఇంజనీరింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని చాటిచెప్పే అద్భుతమైన మ్యూజియంగా దీనిని చెప్పుకోవచ్చు. ఎక్కువ మంది సందర్శకులను ఆకట్టుకోలేకపోయినా శ్రమపడి వచ్చినవారికి కాటన్ ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానం, అప్పుడు వినియోగించిన పరికరాలు వంటి వాటిని చూపించి ఆనందం కలుగజేస్తుంది. వారికి కాటన్ మీద మరింత గౌరవాన్ని పెంచుతుంది. ఈ మ్యూజియంలో దర్శించదగిన వాటిలో ముఖ్యమైనవి కొన్ని ఇవి-

**కాటన్ విగ్రహాలు**: గుర్రంమీద కూర్చున్న కాటన్ నిలువెత్తు విగ్రహం బరాజ్ అప్రోచ్ రోడ్డు ప్రారంభంలో అందరికీ



శుభాకాంక్షలు చెబుతున్నట్లుగా ఉంటుంది. మ్యూజియం గార్డెన్‌లో ఏర్పాటుచేసిన మరో 'బస్ట్' సైజ్ విగ్రహం పర్యాటకులకు స్వాగతం చెపుతున్నట్టుగా ఉంటుంది.


**డెల్టా మోడల్**: మొత్తం గోదావరి డెల్టా స్వరూపాన్ని సమగ్రంగా చూపెట్టే నమూనా ఇది. దీనిలో గోదావరి డెల్టాలోని డ్రైనులు, కాలువలు, రోడ్లు, గోదావరి రెండుగా విడిపోయి వశిష్ట-గౌతమిగా సముద్రంలో కలవడందాకా ఇందులో చూడవచ్చు.


**ఆనకట్ట బరాజ్**: బరాజ్ కట్టడానికి ముందు ఆనకట్ట, వివిధ దశలలో బరాజ్ నిర్మాణం వంటి వాటిని లామినేటెడ్ ఫోటోల ద్వారా ప్రదర్శనకు ఉంచారు. అలాగే ఆనకట్ట నిర్మాణానికి ముందు తరువాతి పరిస్థితులని ఊహిస్తూ చిత్రీకరించిన చిత్రపటాలను కూడా ఇక్కడ చూడవచ్చు.

అలాగే కాలువల ప్రవాహాన్ని నియంత్రించే లాక్స్, గేట్‌ని, ఒక లాంచి, లిఫ్ట్ షిట్టర్స్ వంటి వాటితోపాటు కృష్ణా నదిపై విజయవాడ దగ్గర నిర్మించిన ప్రకాశం బ్యారేజ్ నమూన కూడా ఇక్కడ పొందుపరచడంతో ఇవన్నీ సందర్శకులను ఆకర్షిస్తాయి.

అలాగే ఆనకట్ట నిర్మాణం పనిలో పాలుపంచుకున్న సుప్రసిద్ధ ఇంజనీర్లయిన కేప్టన్ ఓర్. కేప్టన్ హాగీ, రావు బహద్దూర్








వానం వీరన్న వంటి వారి చిత్రపటాలను కూడా సర్ ఆర్థర్ కాటన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ ఆలీ నవాజంగ్, ఎస్ వి రామమూర్తి, ఎన్ జి కె మూర్తి వంటి వారితో కలిపి ఒకేసారి ఇక్కడ సందర్శించవచ్చు

అంతే కాకుండా కొత్త ఆధునిక బరాజ్ నిర్మాణం కాకముందు సుమారు 130 సంవత్సరాల క్రితం ఆనకట్ట ఉన్నప్పుడు నీటిని నియంత్రించటానికి ఉపయోగించిన 'షట్టర్ లిఫ్టింగ్ మెకానిజం' సందర్శకులను అబ్బురపరుస్తుంది

అలాగే ఆనకట్ట నిర్మించేటప్పుడు ఉపయోగించిన ఇటుకలు ఇతర పరికరాలను కూడా ఇక్కడ పదిల పరిచారు ఆనకట్ట నిర్మాణానికి అప్పట్లో ఉపయోగించిన పురాతన యంత్రాలయిన కంప్రెసర్, డ్రిల్లింగ్ మిషన్, రివిట్ పంపింగ్ మిషన్, ఇనుమును కాల్చుకొని అవసరమైన పవర్ ఉత్పత్తి చేసే యంత్రం వంటి వాటిని ఇక్కడ చూసినప్పుడు అప్పటి వారు పడిన శ్రమ గుర్తుకు వస్తుంది

ఇలా ఒక పురాతన ఇంజనీరింగ్ మ్యూజియంగా చెప్పుకోదగిన సర్ ఆర్థర్ కాటన్ మ్యూజియం సందర్శనానంతరం ఆ తరం ఇంజనీర్ల మీద జాతికి వారు చేసిన మహోపకారాల పట్ల వారిమీద మరింత కృతజ్ఞతాభావం పెరుగుతుంది చేతులెత్తి మరోసారి మ్రొక్కాలనిపిస్తుంది

★★★



# గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం

సన్నిధానం నరసింహశర్మ

ప్రజలకు ఎన్నో ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది ఆంధ్రదేశంలోని గ్రంథాలయోద్యమం బహుళార్థ సాధకమైన గ్రంథాలయోద్యమ రంగస్థలం కృష్ణాతీరంలో ఏర్పడడానికి ముందే రాష్ట్రంలో కొన్ని గ్రంథాలయాలు నిలద్రొక్కుకుని వికసించాయి గోదావరీ తీరంలో ఆవిధంగా ఏర్పడిన గ్రంథాలయాలలో గోదావరి పేరుతో అంటే 'గౌతమి'పేరుతో ప్రశస్తిగాంచిన గ్రంథాలయం శ్రీ గౌతమీ గ్రంథాలయం 1852లో కాటన్ తెలివి చలువ వలన గోదావరిపై ఆనకట్ట పూర్తి అయింది ఆనకట్ట-సమగ్రస్వరూపాన్ని సంతరించుకోవడానికి ముందే అంటే 1839లోనే రాజమహేంద్రిలో జేమ్సు థామస్‌గారి పఠనమందిరం - ఆంధ్రదేశంలో ప్రజల తొలిపొత్తపుగుడిగా ప్రసిద్ధ పరిశోధకులు బంగోరె తెలియజెప్పారు

ఆ తొలి పొత్తపుగుడి వికసించిన కాలానికి సుమారు అర్థశతాబ్దం తరువాత రాజమహేంద్రవరంలో 1898లో వీరేశలింగం శిష్యుడు మధురకవి నాళం కృష్ణరావుగారిచే స్థాపింపబడిన వీరేశలింగం గ్రంథాలయం నేటి సజీవ బృహత్ 'గౌతమీ' గ్రంథాలయానికి నాశికాత్ర్యంబకం వంటిది మొట్టమొదట వీరేశలింగం గ్రంథాలయం రాజమండ్రిలో నాళంవారి సత్రంలో తక్కువ పుస్తకాలతో ఏర్పాటు చేయబడింది తరువాత వీరేశలింగం పురమందిరంలో కొన్నాళ్ళు, ప్రస్తుతం రాజమండ్రిలోని రాజవీధిలో శాంతినివాస్ హోటల్ ఎదురుగాగల కాకివారి మేడలోకి ఆవాసం ఏర్పాటు చేసుకుంది 1914లో వీరేశలింగం గ్రంథాలయం పేరు 'సర్వజన గ్రంథాలయంగా మార్చబడింది

కథాకమామీషు ఇలా ఉండగా - రాజమహేంద్రిలోనే 1911లో అద్దంకి సత్యనారాయణశర్మ గారనే గ్రంథాలయాభిమాని దొరతనం వారి బోధనాభ్యసన కళాశాలకు సమీపంలోగల తన ఇంటిలో శ్రీ వాణీవిలాస పుస్తకభాండాగారం స్థాపించారు తరువాత ఆ గ్రంథాలయం భక్తచింతామణి శతకకర్త వడ్డాది సుబ్బారాయడుగారి పేర వసు రాయ గ్రంథాలయంగా ప్రసిద్ధి చెందింది

దగ్గరి దగ్గరిలో రెండు పెద్ద గ్రంథాలయాలు (1) సర్వజన గ్రంథాలయం (2) వసురాయగ్రంథాలయాలు కవి పండిత వదాన్య సహితమైన పాలకవర్గాలచే వేరు వేరుగా నడపబడినాయి

**ఈ రెండు గ్రంథాలయాలను కలిపితే మరింత పెద్ద** గ్రంథాలయం ఏర్పడుతుందనే ద్విపక్ష సదాశయ సత్ఫలంగా శ్రీ గౌతమీ గ్రంథాలయంగా ఏర్పడి 1920లో రిజిస్టరైంది

రాజమహేంద్రవరం వద్ద గౌతమీ నది విశాల రూపంతో సౌందర్య భరితంగా ఉండి ఆహ్లాదాన్ని ఇస్తూనే వుంది

చిన్నా పెద్దా గ్రంథాలయాల ఉపనదులను తనలో విలీనం చేసుకున్న విజ్ఞానస్రవంతి గౌతమీ గ్రంథాలయం వేల గ్రంథాలను సంతరించుకొని నాటినుండి ఈనాటివరకూ విజ్ఞానాన్ని అందిస్తూనే వుంది

రాజమహేంద్రవరంలో రాష్ట్రప్రఖ్యాతిచెందిన కవులూ సాహితీ వేత్తలు, పండిత ప్రకాండులూ వుండేవారు వారందరి చరిత్రలు, వారందరి గ్రంథాలూ గౌతమిలో అంతరంగ జ్ఞాన తరంగాలయ్యాయి

వీరేశలింగం, కొక్కొండ, వావిలాల వాసుదేవశాస్త్రి, చిలకమర్తి, వెన్నేటి సత్యనారాయణ, కంచుమర్తి సీతారామచంద్రరావు, రాళ్ళబండి సుబ్బారావు, నేదునూరి గంగాధరం

ఇలా ఇలా ఎన్నో నామవాచకాలు చదువవలసి వస్తుంది, కృతజ్ఞతలతో గౌతమి శతాబ్ధాధిక చరిత్ర పుటలను తిరగవేస్తే ఇన్నీస్‌పేటలోని గ్రంథాలయం, రాజరాజనరేంద్రుని కోట స్థలంలో లక్ష్మీవారపుపేటలోకి వచ్చింది వితరణశీలి కంచుమర్తి సీతారామచంద్రరావు జమిందారు భూరి విరాళం ఇచ్చారు



గోదావరి గట్టున నెలకొన్న మాతా శారదాదేవి

నాళం కృష్ణారావు వంటివారూ విరాళాలు ఇచ్చారు 3,100 చదరపు గజాల స్వంతస్థలంలో స్వంతభవనములో శ్రీ గౌతమీ గ్రంథాలయం వేలగ్రంథాలతో దంగేటి నారాయణస్వామి, తెన్నేటి రామశంకరం, మహీధర జగన్మోహనరావు వంటి ఎందరో సేవావినీతుల శ్రమఫలంగా రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ప్రసిద్ధిపొందింది ఇప్పటికీ Europa year Book లో ప్రతీ సంవత్సరం దీని చరిత్రాదులు నమోదు అవుతూనే వుంటాయి కంచుమర్తి సీతారామచంద్రరావుగారు గౌతమికి భవన ప్రదాతగానే కాక, వారి అమ్మాయి స్మరణగా 'బాబాయమ్మ మెమోరియలు హాలు' అని ఒక ప్రత్యేక సభా భవనాన్నికట్టి స్త్రీలకు, సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలకూ 'గౌతమ'ని కేంద్రంగా చేశారు గౌతమిలోని బాబాయమ్మహాలు ఒక చరిత్రాత్మకమైన హాలు ఆ హాలులో రాయప్రోలు, కృష్ణశాస్త్రి, చెళ్ళపిళ్ళ, శ్రీపాద, విక్రమదేవవర్మ, గిడుగు రామమూర్తి, జాషువా, విశ్వనాధ- ఇలా ఇలా ఎందరెందరో తమ అమూల్య ఉపన్యాస వాణీ విలాసాన్ని వెలయింపజేశారు శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, గండపెండేర మహోత్సవం, కొన్ని గ్రంథాలయోద్యమసభలూ ఎన్నో అక్కడ జరిగాయి ప్రస్తుతం ఈ హాల్లో దిగువ భాగంలో పత్రికా పఠనమందిరం వుంది పైభాగంలో సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలు జరుగుతున్నాయి

18-2-1979 వరకు గౌతమి గ్రంథాలయం ప్రయివేటు గ్రంథాలయంగా విలసిల్లింది స్వర్ణఘట్టాలూ వున్నాయి ఆర్థిక దుస్థితులు వచ్చినప్పుడు విచార ఘట్టాలూ వున్నాయి చరిత్రగలిగి, ఎన్నో ప్రాచీనమైన అరుదైన గ్రంథాలు గలిగిన 'గౌతమి'ని ప్రజలు పోతుల వీరభద్రరావు, శ్రీ బి పి శాస్త్రి, శ్రీ యాదగిరి శ్రీరామనరసింహారావు, వరదాబ్రహ్మానందం ప్రభృతుల ఆధ్వర్యాన రెండున్నర సంవత్సరాలు ప్రభుత్వ స్వీకరణ ఉద్యమాన్ని నిర్వహించారు

ఫలితంగా 19-2-1979వ తేదీన శ్రీ గౌతమి గ్రంథాలయం రాష్ట్రప్రభుత్వ విద్యాశాఖ క్రిందగల పౌరగ్రంథాలయశాఖలో శ్రీ గౌతమి ప్రాంతీయ గ్రంథాలయంగా మారింది ప్రణాళికా ప్రణాళికేతర నిధులతో, ఎం పి , ఎమ్మెల్యే నిధులతో భవనాది సౌకర్యాలతో గ్రంథాలయశాస్త్రం చదివిన అధికారుల పాలనలో నూతనత్వం పుంజుకుని ప్రాచీన ఆధునిక గ్రంథాలతో ఆబాలగోపాలానికి, విద్యార్థిజనానికీ ప్రయోజనదాయకంగా విస్తృత కార్యకలాపాలతో, వివిధ సేవలతో ప్రాంతీయ గ్రంథాలయాల్లో తలమానికంగా వెలుగులు విరజిమ్ముతోంది


**అపురూప గ్రంథాలకు ఆలవాలం గౌతమి**

చరిత్ర గొప్పదనం మాత్రమే కాదు, చరిత్రాత్మక గ్రంథాలకు పెన్నిధి గౌతమి ప్రాచీన గ్రంథాలకు నిలయం వేటపాలెంలోని సారస్వతనికేతనం, రాజమండ్రిలోని 'గౌతమి' ఈ రెండు గ్రంథాలయాలు పరిశోధకులకు కేంద్రాలు సారస్వతనికేతనం కంటె ప్రాచీన గ్రంథాలు, పాతపత్రికలు ఎక్కువ గౌతమిలో ఉన్నాయి

నేమాని వేంకటనరసింహశాస్త్రి గారనే మహానుభావుడు ఋగ్వేదాన్ని 'శ్రీమదాంధ్రీకృత పద్య ఋగ్వేదం'గా సరళ సుబోధక భాషలో తెనిగించారు దానివ్రాతప్రతులు 'గౌతమి'లో దశాబ్దాలుగా రక్షింపబడుతూ రాగా 1970 దశకంలో గ్రంథాలయ పాలకవర్గం చొరవతో అంతకుముందు మహీధర, జగన్మోహనరావు, తెన్నేటి విశ్వనాథం వంటి వారి కృషి ఫలంగా తిరుమల తిరుపతి దేవస్థానంవారు సంపుటాలుగా అద్భుతంగా ప్రచురించి ఎనలేని సేవచేశారు 'గౌతమి'లో 70,000 పై చిలుకు మొత్తం గ్రంథాలున్నాయి

మెకంజీవ్రాత ప్రతుల సంపుటాలు మూడు స్థానిక చరిత్ర విశేష ఆకరాలుగా ఉన్నాయి శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి గారి వ్రాత ప్రతులు (ముద్రితాలకు పూర్వరూపాలు) కొన్ని గౌతమిలో నున్నాయి ఆరు తామ్రశాసనాలు ఉన్నాయి

'వంశవృక్ష ప్రదర్శిని' అనే ఒక పెద్ద వ్రాతప్రతి గుంటుబోయిన సన్యాసిరావు రచన అచ్చు కావలసినది ఉన్నది 'గౌతమి'లో 420 తాళపత్ర గ్రంథాలున్నాయి ఇందులో భారతభాగవత రామాయణాదులు, కర్మకాండ సంబంధ గ్రంథాలు, కొన్ని వైద్యసంబంధ గ్రంథాలూ ఉన్నాయి కబీరు అభంగాలు వ్రాతప్రతులు 'మైధిలి' భాషలో ఉన్నాయి తెలుగు విశ్వ విద్యాలయ సహకారంతో తాళపత్ర గ్రంథాలకు లిఖితమైన వివరణాత్మక పట్టికలున్నాయి ముఖ్యప్రాచీన గ్రంథాలకు, పత్రికలకు కొంత మట్టుకు మైక్రోఫిల్మ్ తీయించబడింది



వివేకవర్ధని, పురుషార్ధ ప్రదాయిని, అముద్రిత గ్రంథ చింతామణి, చింతామణి జనానా, తెలుగు జనానా, మానవసేవ, మనోరమ, సమదర్శిని వంటి అమూల్యమైన అరుదైన చరిత్రకాల నాళికల నదగి పాతపత్రికల సంపుటాలు, సంచికలు గౌతమి సరస్వతికి అలంకారాలుగా ఉన్నాయి. 19వ శతాబ్ద చివరి ప్రాంతంలోను, 20వ దశబ్ద ప్రథమభాగంలోనూ అచ్చుయి వచ్చిన గ్రంథాలు గౌతమి నిక్షిప్త నిధులు. కంప్యూటర్ సౌకర్యాలు కలిగించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. **అరడజను కొరతలుండవచ్చు, ఆరు డజన్ల మేలిములున్నాయి. గౌతమిలో, పాత పుస్తకాలంటే పడి చచ్చేవాడికి ఎన్నో పెన్నిధులున్నాయని శ్రీ బంగోరె అభిప్రాయపడ్డారు.**

1922లో కాశీనాథుని నాగేశ్వరరావుగారు ఈ గ్రంథాలయాన్ని సందర్శించి 'పరిశోధకులు తరచుగా చెన్నపురి వెడలు నవసరమును తీర్చుటకు రాజమహేంద్రవరమునందలి శ్రీ గౌతమి గ్రంథాలయమునకు ఆంధ్రదేశమునకు కేంద్ర గ్రంథాలయముగ చేయవలయును'ని ఆశించారు. **తెలుగున సరియగు పరిశోధకుడు కావలెనన్నచో, కవి కావలెనన్నచో గౌతమీ సారమును త్రాగవలెను గౌతమీ గ్రంథాలయములోని గ్రంథములను చదువవలెను అని కట్టమంచివారి అభిప్రాయం.** సమగ్రాభివృద్ధికై ఈ గ్రంథాలయమును కేంద్ర ప్రభుత్వమువారు జాతీయగ్రంథాలయము చేయవలెనని కొందరు అభిప్రాయపడుచున్నారు.

భవనాది సౌకర్యాలు

ప్రభుత్వం వారు శ్రీ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయానికి తగు భవన సౌకర్యాలు కల్పించేందుకుగాను మూడు అంతస్తుల సర్వవిధ సౌకర్యాలు ఆధునికమైన హంగులతో ఉండే విధంగా భవనం ప్లాను ఎప్రూవ్ చేశారు. స్థానిక పార్లమెంటు సభ్యుల, శాసనసభ్యుల నియోజకవర్గ నిధులనుండి మంజూర్ల కారణంగా నేల అంతస్తులో 1/4వ భాగం, దానిపై భాగం మాత్రం నిర్మాణమయ్యాయి. ప్రస్తుతం గ్రంథాలయానికి నేల అంతస్తులో దక్షిణ ఉత్తర భాగ భవన విభాగాలు నిర్మాణమ వలసి వున్నాయి. ఇందుకుగాను స్థానిక ఎం.పి. ఎమ్మెల్యేల నిధులు; కేంద్ర ప్రభుత్వంవారి నిధులు మంజూరులు ప్రకటితమై వున్నాయి.

భవనాది సౌకర్యాలు సత్వరం ఏర్పడితేనే గౌతమి గ్రంథ రక్షణకు మూలాధారం.

గ్రంథాలయం స్థలంలో ప్రస్తుత భవనాల వెనుక ఒక ఏస్‌బెస్టాస్ షెడ్డు వుంది. అందులో రాజా రామమోహనరాయలు ఫౌండేషను సహకారంతో పిల్లల పుస్తకాలూ అవీ కొనబడి పిల్లల గ్రంథాలయం ప్రారంభింపబడింది. తగిన ప్రత్యేక భవన నిర్మాణం అవసరంకాగా, శ్రీ గౌతమి ప్రాంతీయ గ్రంథాలయంలో పరిశోధనలు సాగించిన పరిశోధకులు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సి. నారాయణరెడ్డి గారు ఇందుకై రాజ్యసభ సభ్యులుగా తమ నిధులనుండి అయిదు లక్షల రూపాయలు మంజూరు ప్రకటించడం గౌతమి అభిమానులకు ఆనందదాయకమైంది. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ తగు విధంగా ఈ గ్రంథాలయాన్ని అభివృద్ధి పరుస్తోంది.

తెలుగువారి పెన్నిధిగా గౌతమిని మరింతగా భావించి భవనాది సౌకర్యాలు సత్వరం ఏర్పడేలా చూసుకోవడం చాల అవసరం. రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలనుండి ఎప్పుడైనా విదేశాలనుండి సైతం పరిశోధకులు వచ్చే ఈ గ్రంథాలయానికి పనివేళల పెంపు, తగు సిబ్బంది పెంపు అవసరం. గ్రంథ నిధులెన్నో వున్న ఈ 'గౌతమి'కి ధననిధులు తగినన్ని వచ్చి జాతి సరస్వతీ రక్షణకు మరిన్ని వెసులు బాటలు వస్తాయని ఆశిద్దాం.

పుష్కరాలలో గౌతమిలో మునుకలు వేయడం ఎంతో పవిత్రమైన సంగతి, పాప ప్రక్షాళనకు అవసరం.

గౌతమి పుష్కరాలలోను, ఎల్లప్పుడు గౌతమి జ్ఞాన స్రవంతిలో మునకలు వేయడం అజ్ఞాన క్షాళనకూ జ్ఞానార్జనకూ ఎంతో ముఖ్యం.

సిరు లెల్ల క్షరము లక్షరమైన సిరిజూపు
ఆప్తో పదేష్ట గ్రంథాలయమ్ము.

(కల్లూరి వేంకట సుబ్రహ్మణ్యదీక్షితులు)



# పుష్కర జ్ఞాపకాలు

**–డా॥ కొరాడ రామకృష్ణ**

మనదేశంలో ప్రవహిస్తున్న నదులని, ఉపనదులని కేవలం జలకేంద్రాల్లాగ తమ జీవనానికి ఉపయోగించే జలాశయాల్లా కాకుండా పవిత్రమైన భావనతో ఆరాధించటం తరతరాలుగా అలవరచుకున్నాం. ఆ నదీమతల్లులని ఎంతో గౌరవంగా మన తల్లులతో సమానంగా పూజించు కున్నాం. కారణం తాగటానికే కాకుండా పాడిపంటల అభివృద్ధికి తోడ్పడుతూ తల్లిలా ఆదరిస్తాయి. అందుకే మహానదుల సంస్మరణ కూడా పుణ్యాన్ని ఇస్తుందనే భావన భారతీయులలో బలపడింది. పాపహారులు, పుణ్యకారులూ అయిన నదులలో దేవతలు ఉంటారనే భావన ఉంది. పుష్కరకాలంలో సకలదేవతలు, పుష్కర నదులు చేరి ఉంటారని పురాణాలు పేర్కొంటున్నాయి. బృహస్పతి ఒక్కొక్కరాశిలో ప్రవేశించే టప్పుడు ఆ రాశికి సంబంధించిన నదికి పుష్కరం వస్తుంది. పుష్కర సమయంలో బృహస్పతితోపాటు, పుష్కరరాజు ఆ యా నదీజలాల్లో ప్రవేశిస్తాడని పురాణగాథ. అందుకే పుష్కర స్నానానికి అంత ప్రాధాన్యం, అంత పవిత్రత. గురుడు సింహరాశిలో ప్రవేశించినపుడు వచ్చే పుష్కరం గోదావరీ పుష్కరం. గోదావరినది ప్రస్తావన మన సాహిత్యంలో చోటు చేసుకొన్నా పుష్కరం, పుష్కరాల గురించిన సాహిత్యం స్వల్పమే అని చెప్పవచ్చు.

గోదావరి పుష్కరం గురించిన ప్రస్తావన ద్రాక్షారామ శాసనాల్లో కనిపిస్తుంది. క్రీ.శ. 1154సం కి చెందిన ఒక శాసనం సింహరాశిలో బృహస్పతి ప్రవేశాన్ని గురించి చెబుతూ పుష్కర సమయ దానాలలో మిక్కిలి శ్రేష్ఠమైనటువంటి భూదానాన్ని గురించి దాఖలా చేసింది. క్రీ.శ. 1250 సంవత్సరంలో సింహ బృహస్పతి అనేది కర్కాటక సంక్రాంతి విషువత్ సంక్రాంతి (జూలై 22) నాడు వచ్చినట్లు శాసనంలో దాఖలా ఉంది.

19వ శతాబ్దంలో జరిగిన పుష్కరాల గురించి చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు తమ స్వీయచరిత్రలో వెల్లడించారు. తారణ సంవత్సరంలో 1884 జరిగిన పుష్కరం గురించి ప్రస్తావిస్తూ ఇలా వ్రాసారు. ''ఉత్కల దేశమునుండియూ, నిజాము రాజ్యము నుండియు, దక్కిన యాంధ్ర మండలముల నుండియు, వేనవేలు యాత్రికులు వచ్చిరి. నేను పుష్కరము జూచుట కదే ప్రారంభము అప్పటికి నాకు పదునేడు సంవత్సరముల వయస్సు. అంగీరస సంవత్సరములో (1872)నొక పుష్కరము జరిగినది గాని నే నప్పుడు చిన్నవాడ నగుటచే, నాకా గొడవ దెలియదు. మా తండ్రి మొదలగు పెద్దలు, చేరువనున్న నరసాపురము వెళ్లి, గోదావరిస్నానము చేసిరని మాత్రము తరువాత వింటిని''.

దుర్ముఖి 1884 సంవత్సరంలో జరిగిన పుష్కరాలకు జరిగిన ఏర్పాట్ల గురించి ఆయన చెపుతూ ''యాత్రికుల కొరకు దొరతనమువారు, కోటిలింగాలవద్ద తాటియాకుల పందిళ్లు, పాకలు వేయించి, వసతు లేర్పరచిరి ధర్మవర సంస్థానపు ప్రొప్రయిటరులు, మిక్కిలి యుదారశీలురు నయిన శ్రీ కంచుమర్తి సీతారామచంద్రరావు జమీందారుగారు యాత్రికుల సౌకర్యము నిమిత్తము, నూతినీళ్ళు కుళాయి గొట్టములద్వారా తెప్పించు నేర్పాటు చేసిరి. పుష్కర నగరములో మంచిబాటలు వేయించుటలో వారు దొరతనము వారికి మిక్కిలి తోడ్పడిరి. ఆ పుష్కరములో వారు మిక్కిలి శ్రమపడిరనుట యతిశయోక్తి కాదు. ఇంతియేకాదు. జనోపయోగమైన ప్రతికార్యమునందును శ్రీరామచంద్రరావు గారు మేను దాచుకొనక, బహుశ్రమపడి పనిచేసి, రాజ మహేంద్ర వరమునకు మంచి యశస్సు సంపాదించెడివారు.... ఆ పుష్కరమునకు గూడా నానా దేశముల నుండి యాత్రికులు వచ్చిరి. ఆ కాలమున రాజమహేంద్రవరములో ''ఎల్ఫిన్‌స్టన్'' దొరగారు సబ్ కలెక్టరుగ నుండిరి. ఈయన తక్కిన ఉద్యోగస్థుల వంటివారుకారు. మానవ సేవాపరాయణులు, పరోపకార తత్పరులు. ఈయన గోదావరి రేవులలో జనులు పడిపోకుండా, కఱ్ఱదూలములతో మెట్లు కట్టించి, జారిపడకుండ రేవులలో దూలములు పాతించి, బహుసౌకర్యములు గావించిరి. పుష్కరములలో విషూచి జాడ్యములు కూడా బయలుదేరెను. ఈ దొరగారు పాయిఖాన దొడ్లకు స్వయముగ పోయి, పరిశుభ్రము చేయించి, విషూచి జాడ్య పీడితులకు మందు లిప్పించి, యెన్ని విధములచేతనో ప్రజలకృతజ్ఞతకు పాత్రులైరి.''

ఆ తరువాత 1908లో కీలకనామ సంవత్సరం గోదావరి పుష్కరాల గురించి ''నానా దేశముల నుండి యాత్రికులు వచ్చిరి. గవర్నమెంటువారు వచ్చిన ప్రజల సౌకర్యార్థము కోటిలింగాలవద్ద పాకలు వేయించిరి. శ్రీ కంచుమర్తి రామచంద్రరావుగారును, మునిసిపలు సంఘాధ్యక్షుడైన గంటి వెంకటరామయ్య గారును ప్రజలకై పాటుపడిరి.....''

20వ శతాబ్దానికివస్తే, ఇక్కడ మనకు రాజమండ్రిలోని వృద్ధులు, జగమెరిగినవారు, తమ తమ క్షేత్రాలలో పేరు ప్రఖ్యాతులు గడించిన కొందరిని దర్శించటం జరిగింది.

రాజమండ్రి పురవాసులు అయిన ఐదుగురు పెద్దల నుండి పుష్కర స్మృతులను సేకరించటం జరిగింది. వారు వెలిబుచ్చిన విషయాలను సంగ్రహంగా ఇక్కడ తెలుపుతున్నాను.



కుటుంబంతో తులసి గంగాధర రామారావు

శ్రీ తులసి గంగాధర రామారావు గారు 77 ఏండ్లు వయస్సున్న రాజమండ్రి వాస్తవ్యులు. స్వాతంత్ర్య సమర యోధులు. రాజమండ్రితోను, ఊరిప్రజలతోను ఎక్కువ అనుబంధం పెంచుకొన్న వ్యక్తి. తాను 1932 సంవత్సరంలో జరిగిన గోదావరి పుష్కరాల నుంచి ఇప్పటికి ఆరు పుష్కరాలు చూశాను అంటూ స్వాతంత్ర్యానికి ముందు జరిగిన పుష్కరాలకీ ఆ పై జరిగిన వాటికి చాలా తేడా ఉందనీ, ప్రతిసంవత్సరం ప్రభుత్వ పాత్ర పెరుగుతున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన పుష్కరాలలో ప్రభుత్వపాత్ర తక్కువేనని అన్నారు. 1932 సంవత్సరంనాటికి ఊరు కూడా చిన్నది, గోదావరి స్టేషను నుండి ఇప్పుడున్న నాగదేవ్ సినిమాహాలు వరకు ఇళ్లు లేవు; చెట్లమయంగా ఉండేది. 1920 సంవత్సరంలో వచ్చిన పుష్కరాలకి కలరా వ్యాధిసోకిందని మా పెద్దలు చెప్పేవారు అందుకే నేమో జనం కూడా ఆ పుష్కరాలకి ఎక్కువగా రాలేదు. వచ్చే యాత్రికులకోసం పాకలు వేశారు. అక్కడ జనం ఉండేవారు. సత్రాలలో మకాం చేసేవారు. రాజమండ్రిలోని స్థానికులు పుష్కర సమయాన బంధువులు ఇళ్లకు వస్తారని ముందుగానే అటుకులు, అవకాయ పచ్చళ్లు సిద్ధం చేసుకుని ఉంచుకునేవారని తెలిపారు. ఆ సంవత్సరం నీళ్లకోసం పైపులను అమర్చినట్లు తెలిపారు. ఆ సంవత్సరమే ఎలక్ట్రిసిటి వచ్చిందనీ, వచ్చిన యాత్రికులకు వాక్సినేషను ఇచ్చే ఏర్పాటు చేశారు అని వారు తెలిపారు.

ఇక 1944 సంవత్సరం యుద్ధం జరిగిన సమయం కాబట్టి జనం పుష్కరాలకి తక్కువగానే వచ్చారు. రాత్రిళ్లు బ్లాక్ అవుట్ అయ్యేది. 1932 సంవత్సరం పుష్కరాలనుంచి హోటళ్లు ఉండేవి, సత్రాలూ ఉండేవి. ఆ కాలంలో హోటళ్లలో పనిచేసే పనివాళ్లకి జీతాలు చాలా తక్కువగా ఉండేవి. ఆ సంవత్సరం అంటే 1944 సంవత్సరంలో రాజమండ్రి హోటల్ వర్కర్ల యూనియన్ పెట్టి వాళ్ల జీతాలు రెట్టింపు చేయించుకున్నారు

1956 సంవత్సరం పుష్కరాలకి జనం బాగానే వచ్చారు స్వాతంత్ర్యానంతరం జరిగిన మొదటి పుష్కరం అది హోటళ్లు బాగా పెరిగాయి ఆ సంవత్సరం పుష్కరంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు, జన సౌకర్యార్థం గ్యాసు లైట్లను ఏర్పాటు చేశారు వ్యాపారం ఆ సంవత్సరం బాగా పెరిగింది ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండేది పుష్కరాలకు వచ్చే యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా బిచ్చగాళ్లను ఊరికి దూరంగా ఉంచి, దొంగలను ముందుగా అరెస్టు చేయడం జరిగింది అని తెలిపారు. 1968లో జరిగిన పుష్కరాలకు జనంబాగానే వచ్చారు ప్రభుత్వ పాత్ర పెరిగింది. గతంలో పుష్కరాలకు స్వామీజీలు, పీఠాధిపతులు వచ్చేవారు. వారు ఇచ్చే సందేశాత్మక వాణిని వినడం జరిగేది.

1980 సంవత్సరంలో జరిగిన పుష్కరాల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానాల పాత్ర ప్రారంభమయింది. అప్పటి ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి పూజ్యులు అర్క సోమయాజులుగారు వచ్చారు. ఆయన మంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. టి.వి. క్లోజ్డ సర్క్యూట్‌లో పుష్కర ఏర్పాట్లను ప్రదర్శించారు. ఒకసారి గోదావరి పరీవాహక ప్రాంతాల్లో మునిసిపల్ ఎలక్షను పుష్కరాల సందర్భంగా వాయిదా వేయడం జరిగిందని తెలిపారు.

1992 సంవత్సరంలో జరిగిన పుష్కరాలకు తి.తి దేవస్థానం ప్రముఖపాత్ర వహించింది. ఆ సంవత్సర పుష్కరాలలో చాల స్వచ్ఛంద సంస్థలుకూడా పాలుపంచుకున్నాయి. వాటి పాలు ఎక్కువవడంతో హోటళ్ల పరిశ్రమ పెద్దగా ఎదగలేదనిపిస్తోంది. గడచిన పుష్కరాలలో వచ్చే ప్రముఖులతో బాటు రాజకీయనాయకులు, వారితోవచ్చే వి.ఐ.పి.లు, పోలీసుల వలన ప్రజలు నదీతీరాన నిలుచుని ఉండడానికి వీలు లేకుండా ఉండేది. అందునా బిచ్చగాళ్ల వలన యాత్రికులకు అసౌకర్యం ఎక్కువైంది. అని అంటూ వారు పుష్కర జ్ఞాపకాలను వెల్లడించారు.

శ్రీబాదం రంగనాయకులు గారు 78ఏండ్ల వయస్సున్న రాజమండ్రి నివాసి. వీరు పుట్టింది, పెరిగిందీ ఇక్కడే. తాము 5 పుష్కరాలు చూసినట్లు తెలిపారు కలప వ్యాపారి దగ్గర పనిచేసేవారు. గుండూవారి వీధిలో నివాస ముంటున్నారు స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన పుష్కరాలకు స్వాతంత్ర్యానంతర పుష్కరాలకీ ప్రజల మనస్తత్వాలలో చాలా తేడాలు ఉన్నాయి అంటూ పూర్వం మనుష్యులు నిస్వార్థంగా పుష్కరాలకి వచ్చిన బంధువులను ఆదరించడం, వారికి కావలసిన సదుపాయాలు చేయడం జరిగేది కాని రానురాను అది తగ్గుతోందని ఆప్యాయత, అనురాగాలు తగ్గుతున్నాయని ఆవేదన చెందారు స్వాతంత్ర్యానికి పూర్వం పుష్కరాలకు ఇంత జనం వచ్చేవారు కారని తెలిపారు చుక్క పార్క్ (గోకవరం బస్‌స్టాండు)లో ఎగ్జిబిషన్ జరిగేదని తెలిపారు 1944 సంవత్సరం యుద్ధకాలంలో జనాలు భయపడి రాజమండ్రి నుండి



బాదం రంగనాయకులు

దూరప్రాంతాలకు వెళ్లినవారు చాలామంది ఉన్నట్లు తెలిపారు. తన చిన్నప్పుడు బిచ్చగాళ్లు కనిపించేవారు కారని ఈ మధ్య జరిగిన పుష్కరాలలోనే ఎక్కువగా కనిపిస్తున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన పుష్కరాల గురించి తెలుపుతూ కోయవాళ్లు కూడా రావుగిరి ప్రాంతాలకు, కూనవరం దగ్గర ఊర్లనుంచి భద్రాచలానికి వచ్చేవారు. పుష్కరంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఉండేది. భద్రాచలం పేపరుమిల్లువారు వివిధరకాల పేపర్లను, వాటిని తయారుచేసే విధానంకూడా ప్రదర్శించే వారు.

గడచిన పుష్కరాలకు గోదావరి రైల్వేస్టేషనును అభివృద్ధి చేసారు. అంటూ పుష్కర జనాలకు చేసిన సదుపాయాలను వివరించారు.

శ్రీ తెలిచర్ల రాధాకృష్ణమూర్తి, 82 ఏండ్ల వయస్సున్న ఈయన్ని రాజమండ్రిలో తెలియనివారు ఉండరు. ఆరు



తెలిచర్ల రాధాకృష్ణమూర్తి

పుష్కరాలను చూసినవ్యక్తి. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన పుష్కరాలగురించి తెలుపుతూ ఆ నాళలో బ్రిటిషు ప్రభుత పాత్ర పరిమితమైనదని పుష్కర నిమిత్తమై ఆ రోజులలో ఎటువంటి పన్నులు విధించలేదని తెలిపారు. తనకు బాగా చిన్నతనంలో అంటే 1932 సంవత్సరంలో జరిగిన గోదావరి పుష్కరాల సమయంలో కలరావ్యాధి వ్యాపించిన కారణంగా గోదావరిలో స్నానాలు చేయనివ్వలేదు. చాటుగా రెండెడ్ల బండ్ల మీదవచ్చి బండ్లని ఖాళీప్రదేశాల్లో నిలుపుకొని మూలప్రాంతాలకువెళ్లి ఎవ్వరికీ తెలియకుండా స్నానం చేసి వెళ్ళిపోయేవారు. ఆ రోజులలో గోదావరి మైన్ రోడ్డువరకు వచ్చేది.

నాటి సత్రాలగురించి చెప్తూ, పండిత వంశంలో జన్మించిన కంభం నరసింహారావు పంతులు గారు సిరస్తదార్‌గా పని చేసేవారు. ఆయన కంభం వారిసత్రం, చెరువు కట్టించారని తెలిపారు. గోదావరి ఆనకట్ట గురించి అనేక విషయాలు తెలిపారు. ధవళేశ్వరం నూతన బ్యారేజి ఓపెనింగ్‌కు దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ వచ్చారు అంటూ ఆమెతో సన్నిహితంగా ఉండే అవకాశం లభించిందంటూ నాటి విషయాలను నెమరువేసుకున్నారు. గోదావరి పాతబ్రిడ్జికి కొత్తబ్రిడ్జికి మధ్య చిత్రాంగి గెస్ట్‌హౌస్ ఉంది. అక్కడే సర్ ఆర్థర్ కాటన్ కూతురుని ఖననం చేసారని తెలిపారు. కూతురిపైనా, తాను కట్టించిన ధవళేశ్వరం బ్యారేజిపైన అంత మమకారం ఉండేదని చెప్పుకొచ్చారు. కాటన్ దొరగారు ఆనకట్ట కట్టినపుడు తమ ప్రపితామహులు ఆయనకు సలహాలిచ్చేవారని నెమరు వేసుకున్నారు.

శ్రీ జనమంచి కామేశ్వరరావుగారు 92 ఏండ్ల వయో వృద్ధులు. ఈయన రాజమండ్రిలోనే తన కూతురుతోబాటు కాలం వెళ్లబుచ్చుతున్న వారు. లేవలేని పరిస్థితులలో ఉన్నా ఆరోగ్యం బాగులేకున్నా తనచిన్నతనంలో జరిగిన పుష్కరాలు వాటి పరిస్థితులను జ్ఞాపకానికి తెచ్చుకొని తాను ఏడు పుష్కరాలను చూసినట్లు అనేక విషయాలు చెప్పారు. 12 ఏండ్ల కొకమారు వచ్చే పుష్కరాలకు బంధువులు కలిసేవారు. కుర్రకారు మహదానందంగా తెగ తిరిగే వాళ్లు, బోలెడంత సంబరంగా ఉండేది. కుర్రకారుతో కలసి గోమాత పై పాటలు రాసాం. అది భారతి మాస పత్రికలో కూడా ముద్రితమైందని చెపుతూ ఎంతో ఆనందంగా పుష్కరాలలో గడిపిన రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు.

చిన్నతనంలో ఒక పుష్కరానికి ప్రజలలో కలరా వ్యాపించింది. ఆ సంవత్సర పుష్కరాలకు ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకుంది. లేకపోతే చాలా మంది ప్రజలు కష్టపడేవారు. ఆ సంవత్సరం ఎక్కువ మంది గోదావరి స్నానానికి రాలేదు.

పుష్కరాలకు వచ్చే జనంకోసం కోటి లింగాల దగ్గర పాకలు వేసేవారు. వచ్చిన యాత్రికులకు సూదులు వేసే వారు. వచ్చిన జనసందోహం కోసం ''మోడి'' కట్టేవారు (దొమ్మరాట

ఆడేవారు), నాటకాలు వేసేవారు అంటూ నాటి పుష్కరాల గురించి గుర్తున్న విషయాలను ముచ్చటించారు.



జనమంచి కామేశ్వరావు - కూతురు జాహ్నవి


ఆయన కూతురు శ్రీమతి జాహ్నవిగారు కూడా 1944లో జరిగిన గోదావరి పుష్కరాల నుంచి తనకు తెలుసునని, తన తండ్రితో కలసి మరికొన్ని విషయాలను తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వచ్చిన పుష్కరాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆ నాళ్లలో ఆడవాళ్లు ఎక్కువగా వచ్చేవారంటూ తెలిపారు. దూరపు బంధువులు కూడా ఇంటికి వచ్చేవారు. వచ్చిన యాత్రికులను ఊరిలోనివారే ఆదరించేవారు. బంధువులు లేనివారు సత్రాలలో ఉండేవారు. ప్రభుత్వ సహకారం ఈ నాటితో పోలిస్తే చాలా తక్కువే అని చెప్పాలి అంటూ ఆనాడు జరిగిన నాటకాలు, తోలుబొమ్మలాటల గురించి ఎన్నో సంగతులు చెప్పారు. పుష్కరాలకు దక్షిణ, ఉత్తర భారతంలో ప్రజలమధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశాల గురించి తెలిపారు.

శ్రీ భమిడిపాటి సూర్యనారాయణ మూర్తిగారు రాజమండ్రిలోనే దానవాయిపేటలో నివాసము ఉంటున్నారు. ఉద్యోగరీత్యా మూడు పుష్కరాలలో పనిచేసిన ఈయన అనేక విషయాలను వెల్లడించారు. ఇన్‌ఫర్‌మేషన్ డిపార్టుమెంటులో అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసిన భమిడిపాటివారు గోదావరి పుష్కరాలలో పనిచేసి రాజమండ్రి ప్రజలతో సన్నిహిత సంబంధాలను కల్గిన వ్యక్తి. పుష్కరాలలో అనేక కమిటీలలో పనిచేసిన అనుభవం ఉంది. కుంభమేళాకు వెళ్ళివచ్చిన ఆఫీసర్ల సరసన పనిచేసిన అనుభవ శాలి. లోగడ తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన డా॥పి. కృష్ణయ్యగారు, ఐ.ఎ.ఎస్. గత గోదావరి పుష్కరాలకు స్పెషల్ ఆఫీసరుగా పనిచేశారని వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించడం ద్వారా ఆయన ప్రజలకు చేరువయ్యారని తెలుపుతూ ఆయన హయాంలో పనిచేయడం సంతృప్తికరంగా ఉందనీ చెప్పారు. ప్రజలకు దగ్గరగా పని చేయడంవలన వారు పడుతున్న ఇక్కట్ల గురించి తెలుపుతూ వాటిని అధిగమించడం ఎలాగో చెప్పారు.

పుణ్య దావర పవిత్రస్నానాలు సుకొస భక్తులు అక్కడికి వస్తారు. అలా వస్తూఉంటే అధికారులు ఎక్కువ మంది గుమిగూడు తారేమోనని యాంత్రిక తొందరలో త్వరత్వరగా పంపించి వేయడం జరుగుతోంది. అటువంటప్పుడు యాంత్రికమైన తొందర సెంటిమెంటును దెబ్బతీస్తోంది. ఈ విషయంలో యాత్రికులకు అసౌకర్యాన్ని కలిగించడం కొంత లోపమే. ఇది గమనించి అధికారులు రాబోయే పుష్కరాలకైనా ఈ విషయాన్ని ఆలోచిస్తారని అనుకొంటూ ఉన్నాను అని అన్నారు. పుష్కర సమయంలో వరదలు వస్తాయి. ఈ కంగారులో యాత్రికులు స్నానం చేయడమే లేదు. స్నానం చేయకుండానే వెళ్లిపోవడం ఇష్టంలేని యాత్రికులు స్నానఘట్టాలు లేనిచోట్ల (అభద్రత ఉన్నచోట) స్నానం చేసేస్తున్నారు. ఇది గమనించి వారికి ఏమైనా సహాయం చేయాలని భావించారు.

ఇక పారిశుద్ధ్యానికి వస్తే ప్రభుత్వపరంగానే కాకుండా సమాజ పరంగా, రాజమండ్రి ప్రజలలో పరిశుభ్రతాప్రజ్ఞ తీసుకు రావాలని తెలిపారు. స్థానిక విద్యార్థులు, స్త్రీ సంఘాల ద్వారా పరిశుభ్రతాప్రజ్ఞ తీసుకురావచ్చని తెలిపారు. గుళ్లదగ్గరకాని రోడ్లులలోగాని పరిశుభ్రత పాటించాలి. స్థానిక ప్రజలు ఈ సమస్యల గురించి బాగా చెప్పగలరు. ఇందులకై స్థానికంగా ప్రజలకు వివరాలు అందజేయాల్సిన ఆవశ్యకతను తెలిపారు. పూజా ద్రవ్యాలు అన్నీ ఒక్క చోట దొరికే ఏర్పాటు చేయాలి. వివిధ ధార్మిక కార్యక్రమాల మధ్య సమన్వయసాధన చేయాలి. స్థానిక కళాకారులకు అవకాశము ఇవ్వాలి.

ప్రాచీన సంప్రదాయాల్ని, సనాతన ధర్మాల్ని ప్రచారం చేయడానికి తగినవేదికగా పుష్కరాలను ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ఇందులకు తిరుమల తిరుపతి దేవస్థానాల కృషిని మెచ్చుకుంటూ ఒక్క రాజమండ్రిలో ఆనం కళాకేంద్రానికే పరిమితం కాకుండా, అంతర్వేది, పట్టిసీమ మొదలైన ప్రాంతాలలోనూ, రాజమండ్రిలో వివిధ క్యాంపుల వద్దకూడా దేవస్థానాల ధార్మిక కార్యక్రమాలు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వెలిబుచ్చారు. ఆనం కళాకేంద్రం మంచి అనువైన స్థలం. సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరుని గోదావరి తటానికి తీసుకువచ్చి గుడిని కట్టడం, ప్రసాదాలు, దేవస్థాన ప్రచురణల విక్రయకేంద్రాలు, ఎగ్జిబిషను ఏర్పాట్లు చక్కగా ఉన్నాయి. ఈసారి ఇంకా ఎక్కువగా దేవస్థాన ప్రచురణలు వస్తాయని ఊహి స్తున్నాం. మొత్తానికి పుష్కరాలలో తిరుమల తిరుపతి దేవస్థానాల పాత్రను కొనియాడారు.



భమిడిపాటి సూర్యనారాయణమూర్తి

***

# గత పుష్కరాలలో తి.తి.దే. ధార్మిక సేవ

డా॥ రావుల సూర్యనారాయణ మూర్తి


చాలా గొప్ప అనుభూతి అది మాటల్లో చెప్పలేనిది 1979, 1991 రెండు పుష్కరాలకూ తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ప్రత్యేక అధికారిగా వ్యవహరించడమన్నది శ్రీ వేంకటేశ్వరుడు నాకు ఇచ్చిన వరంలాంటిది అప్పటి అనుభవాలు తలచుకుంటే ఇప్పటికీ వళ్ళు పులకరిస్తుంది నూతనోత్తేజం వస్తుంది చేస్తే అటువంటి కార్యక్రమాలు చెయ్యాలనిపిస్తుంది

1979 పుష్కరాలప్పుడు రాజమండ్రిలో టి.టి.డి తరపున ఏదో ఒక కార్యక్రమం చెయ్యమని అప్పటి ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి నుండి మౌఖికమైన సూచనలు వచ్చాయి దీనిని దృష్టిలో పెట్టుకుని అప్పటి టి.టి.డి. ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ ప్రణాళికారచనకు ఉపక్రమించారు. పుష్కరాలలో టి.టి.డి. భాగస్వామ్యమవ్వడమన్నది అదే ప్రథమం. కాబట్టి కొంచెం కొత్తదనంగానే ఏదైనా చేద్దామన్నది పి.వి ఆర్.కె. గారి ఆలోచన. ఆయన మంచి విజన్ ఉన్న వ్యక్తి. ప్రగతిశీలి, ప్రతిభాశాలి అంతకుమించి డైనమిక్ మ్యాన్, దాంతో ఏదో ఒకటి ప్రత్యేకంగా చెయ్యాలనుకున్నాం దఫదఫాల సమావేశాల తరువాత మా ప్రణాళికకు ఒక సమగ్రరూపం ఇచ్చారు ప్రసాద్‌గారు. వాటిని అమలుచేసే బాధ్యత నాకు అప్పగించి నన్ను పుష్కరాలకు టి.టి.డి. సమన్వయకర్తగా వెళ్ళమన్నారు.

మూడు ప్రత్యేకతలతో పుష్కరాలలో యాత్రికులకు, భక్తులకు భక్తితత్వాన్ని అందించడానికి టి.టి.డి. శ్రీకారం చుట్టింది. అందులో మొదటిది స్వామి. రెండవది ధార్మిక కార్యక్రమాలు, మూడవది ఆధ్యాత్మిక గ్రంథాల పంపిణీ. ఈ మూడింటినీ దృష్టిలో పెట్టుకుని పూర్తి ప్రణాళిక సిద్ధం చేసుకుని మంచి టీంతో రాజమండ్రి వచ్చాం. మొత్తం అన్ని విభాగాలని సమన్వయపరచే బాధ్యత నాది.

సుబ్రహ్మణ్య మైదానంలో శ్రీ వేంకటేశ్వరునిని ప్రతిష్ఠించాం. దానికోసం అక్కడ నుండే అర్చకులని, సిబ్బందినీ కూడా తీసుకువచ్చాం. సుబ్రహ్మణ్య మైదానం అంతా పెండాల్స్ నిర్మించి ధార్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. అర్ధరాత్రి వరకూ హరికథలు, పురాణకార్యక్రమాలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు వంటివి ఎన్నో ఏర్పాటుచేసాం. వాటికి వచ్చిన స్పందన అంతా ఇంతా కాదు.

ఇక మూడవది ముఖ్యమైనది ఆధ్యాత్మిక గ్రంథాల పంపిణీ. ధార్మిక సాహిత్యానికి ప్రజాదరణ లేదనే అభిప్రాయం అప్పట్లో కొన్ని వర్గాల వారిలో ఉండేది. అయితే, ఆ అభిప్రాయం సరైనది కాదని గోదావరి పుష్కరాలు నిరూపించాయి.



ధార్మిక సాహిత్యాన్ని ప్రచురించి నామమాత్రపు ధరకు అందించాలన్నది అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారి ఆలోచన దాని బాధ్యత టి.టి డి కి అప్పగించారు పుష్కరాలలో మేము అందుకు సన్నద్ధమయ్యాం అయితే, ఎన్ని పుస్తకాలు ప్రచురించాలన్నది పెద్ద ప్రశ్న అప్పటికి సమాజంలో ఉన్న పత్రికలు, సాహిత్యాన్ని దృష్టిలో పెట్టుకుని వీటికి పెద్దగా ఆదరణ లభించదేమోనని ఒక్కొక్కటి రెండు, మూడు వేలు వేద్దామని చాలామంది సూచించారు. అయితే పి.వి.ఆర్ కె. ప్రసాద్ మాత్రం పదేసివేలు వేద్దామన్నారు. అన్ని అమ్ముడుపోవేమో అన్నారు. మరేం ఫరవాలేదు మనకు సొంత ప్రెస్ ఉంది సిబ్బంది ఉన్నారు. పేపర్ ఖరీదే కదా పోయేది. ఆ మాత్రం నష్టం భరించవచ్చులే అని తెగించి ఆయన ఒక్కొక్కటి పదేసివేలు అచ్చేయించారు. అన్నీ లారీలకు ఎక్కించి పుష్కరాలకు తీసుకువచ్చాం. ఒక్కొక్క పుస్తకం ధరని నామమాత్రంగా 20 నుండి 50 పైసలుగా నిర్ణయించి సుబ్రహ్మణ్య మైదానంలోనే గ్రంధ విక్రయశాలని ప్రారంభించి అమ్మకాలకు శ్రీకారం



చుట్టాం. ఆశ్చర్యం. జనం ప్రభంజనంలా వచ్చి పుస్తకాలు కొనుక్కుని వెళ్ళడం మొదలుపెట్టారు. అప్పుడే కళాకేంద్రం ప్రారంభించడానికి వచ్చిన చెన్నారెడ్డిగారు టి.టి.డి. ఏర్పాట్లని పరిశీలిస్తూ పుస్తకాల షాపు దగ్గరకు వచ్చి అక్కడ ఉన్న జనాన్ని వాళ్ళు కట్టలు కట్టలుగా పుస్తకాలు పట్టుకు వెళ్ళడాన్ని చూసి చాలా ఆనందించారు. మమ్మల్ని అభినందించారు. **తెచ్చిన స్టాకు మొత్తం మొదటి మూడు నాలుగు రోజుల్లోనే అయిపోయింది. వెంటనే ఆ విషయాన్ని మేము పి.వి.ఆర్.కె. గారికి తెలియ జెయ్యడం ఆయన మళ్ళీ ఇంకా ఎక్కువ పుస్తకాలు రాత్రి పగలు ప్రింట్ చేయించి వెంటనే పంపించడం చకచకా జరిగిపోయాయి. పుష్కరాల 12 రోజులూ ఆ పుస్తకాలను విక్రయిస్తూనే ఉన్నాం.**

అదిగో ఆ స్ఫూర్తితోనే టి.టి.డి. ఆధ్యాత్మిక గ్రంధాలని అచ్చువెయ్యడమన్నది ఉద్యమస్థాయిలో ప్రారంభించి నిరాటంకంగా కొనసాగిస్తున్నది. ఆ తరువాత వివిధ స్థాయిల్లో, పలు ప్రమాణాలతో అత్యుత్తమ స్థాయి గ్రంధాల ప్రచురణ, పలు గ్రంధాలకు ఆర్థికసాయం అందించడమన్నది టి.టి.డి. స్వీకరించింది. ఏదేమైనా దానికి స్ఫూర్తి గోదావరి పుష్కరాలేనన్నది చెప్పక తప్పదు.

మొదటిసారి పుష్కరాలలో పాల్గొనడం వల్ల వచ్చిన ఉత్సాహం, ప్రజలలో వచ్చిన గుర్తింపుతో రెండవసారి 1991లో మళ్ళీ పుష్కరాలలో రెట్టించిన ఉత్సాహంతో భక్తులకు ధార్మిక సేవలందించడానికి టి.టి.డి. ముందుకు వచ్చింది. మున్సిపల్ ఆఫీసులో జిల్లాస్థాయిలో జరిగిన పుష్కర ఏర్పాట్ల విస్తృతస్థాయి సమావేశానికి నేను టి.టి.డి. తరపున పాల్గొన్నాను. అప్పుడు జిల్లా కలెక్టర్‌గా రణదీప్ సూడాన్, జాయింట్ కలెక్టర్‌గా శ్రీ ఉమామహేశ్వరరావు, పుష్కరాల ప్రత్యేక అధికారిగా శ్రీ కృష్ణయ్య ఉన్నారు. శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి రెవిన్యూ ముఖ్యకార్యదర్శి. వీరందరితో మున్సిపల్ ఆఫీసులో సమావేశం. సుబ్రహ్మణ్య మైదానాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సమాచార ప్రచారశాఖకు స్టాల్స్ పెట్టుకోవడానికి కేటాయించేసారు. మాకు వేరేస్థలం ఇవ్వడానికి సిద్ధపడ్డారు. నేను గట్టిగా వాదించాను. అందరికీ అందుబాటులో ఉండేస్థలం మాకు ఇవ్వాలి కానీ ఎక్కడో ఇస్తే కుదరదని నిర్మొహమాటంగా చెప్పేసాను. పుష్కరాలన్నవి భక్తులకు చెందినవి. పవిత్ర గోదావరిలో స్నానంచేసి, దైవదర్శనం చేసుకుని కొంచెం సేపు ఆధ్యాత్మికంగా కాలక్షేపం చేద్దామనుకుంటారు. కాబట్టి సుబ్రహ్మణ్య మైదానంలో మేము ఏర్పాటుచేసే పెండాల్స్ వారు ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నట్టు ఉంటుంది – దైవదర్శనం చేసుకున్నట్టూ ఉంటుది – కొంతసేపు సేదతీరినట్టు ఉంటుంది. కాబట్టి అందరికీ అందుబాటైన స్థలం కావాలని బాగా గట్టిగానే వాదించాను. టి.టి.డి.ని తక్కువ అంచనా వెయ్యొద్దన్నాను కూడా కోపంతో. ఎలాగైతేనేం సుబ్రహ్మణ్య మైదానాన్ని సాధించాం. మొత్తం యంత్రాంగమంతా. తిరుమల తిరుపతి నుండి కదలి వచ్చింది. అప్పుడు శ్రీ ఎం.వి.ఎస్. ప్రసాద్ గారు టి.టి.డి. ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ జిల్లా యంత్రాంగం పట్ల ఆయన అప్పట్లో ఒకటి రెండుసార్లు కోపం కూడా తెచ్చుకున్నారు. మాకు సౌకర్యాలు వగైరా సమంగా సమకూర్చలేదని, ఒక దశలో తిరిగి వెళ్ళి పోదామన్నారు కూడా ఏది ఏమైతేనేం మళ్ళీ గత పుష్కరాల లాగే అన్నీ ఏర్పాటుచేసాం. తిరుమలే కదలి వచ్చిందా అన్నంత గొప్పగా చేసాం. పుష్కరాలకు వచ్చిన ప్రతి భక్తుడు టి.టి.డి. దేవాలయాన్ని దర్శించకుండా వేళ్ళేవారు కాదు సాధారణ భక్తులేంటి, గవర్నర్ కృష్ణకాంత్ లాంటి వి వి ఐ.పి.లు కూడా వచ్చి చూసి వేళ్ళేవారు. మేము కూడా వారికి అచ్చు తిరుమలలోలాగే పూర్ణకుంభ స్వాగతం, ప్రసాదవితరణ చేసి స్వామివారి శేషవస్త్రాన్ని ఇచ్చేవాళ్ళం. దాంతో వారి ఆనందానికి హద్దులు ఉండేవి కాదు. చాలాసేపు ఆ పవిత్రమైన ప్రదేశంలోనే ఉండేవారు. స్వామివారి లడ్డూలని కూడా ఇక్కడ విక్రయించాం. ఈసారి పుష్కరాలలో టి.టి.డి. తన ప్రత్యేకతను నిలుపుకొంది. దేవస్థానానికి గొప్ప పేరు ప్రతిష్ఠలు వచ్చాయి.

రెండు పుష్కరాలకూ టి.టి.డి. ఇంజనీరింగ్ సిబ్బంది చేసిన కృషి అద్భుతం. అప్పటి టి.టి.డి. ఇంజనీర్ శ్రీ బెల్లం వెంకటప్పయ్య నేతృత్వంలో సిబ్బంది తిరుమలనే ఇక్కడ పునఃప్రతిష్ఠించారు. అలాగే, అర్చకులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన వారూ ఒక్కరేమిటి అందరూ మంచి భక్తితత్వంతో పుష్కరాలలో పాలు పంచుకున్నారు. భక్తులు, పుష్కర యాత్రికులలో ఆధ్యాత్మికతత్వం పెంపొందించడంలో టి.టి.డి. ఇలా తన ప్రత్యేకతను నిలుపుకొంది.

పుష్కరాలకు ఎన్ని మౌలిక ఏర్పాట్లు చేసినా వచ్చే యాత్రికులు, భక్తులు ఆధ్యాత్మిక చింతనలోనే కాలం గడిపే వాతావరణాన్ని కలుగచెయ్యడమన్నది అధికారుల కనీస కర్తవ్యం. వచ్చిన భక్తులు కొంచెంసేపు ఆధ్యాత్మికంగా గడపాలన్నా, దైవదర్శనం చేసుకోవాలన్నా, ధార్మిక కార్యక్రమాలలో పాల్గొనాలన్నా వారికి కావలసిన ఏర్పాట్లు అధికారులు చెయ్యాలి. దానికోసం టి.టి.డి.తో పాటుగా రాష్ట్రంలో పేరెన్నిక గన్న దేవస్థానాలతో సంప్రదించి వారు కూడా పుష్కరాల్లా పాల్గొనేలా చేసి, టి.టి.డి. మాదిరి వారు కూడా ఆధ్యాత్మిక సేవ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ప్రయత్నిస్తే బాగుంటుందన్నది నా అభిప్రాయం.

'సమాచారం' సౌజన్యంతో



# పరమార్ధవాణి

శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి

మానవ జీవన కాలాన్ని అమూల్యంగానూ క్షణికం గానూ కూడ భావించి ఉత్తమోత్తమ కార్యాలలో లగ్నం చెయ్యాలి క్షణ కాలాన్ని కూడ వ్యర్థం చేయరాదు

ఏ కారణం చేతనైనా ఏ క్షణమైనా భగవచ్చింతన రహితంగా గడచిపోతే పుత్రశోకం కన్న మిన్నగా పశ్చాత్తాపం చెందాలి తద్వారా భవిష్యత్తులో అట్టి పొరబాటు జరుగ రాదు

మాట్లాడేటప్పుడు సత్యంగా, ప్రియంగా, మితంగా, హితంగా, శాస్త్రానుకూలంగా బాషించాలి

పరున్న వేళలో సయితం భగవంతుని నామ, రూప, స్మరణ విశేషంగా చెయ్యాలి దానివల్ల శయన సమయం వ్యర్థం కాదు శయన సమయాన్ని సాధనగా చేయడం కోసం సాంసారిక సంకల్ప ప్రవాహాన్ని విస్మరించి భగవన్నామ, రూప, గుణ, ప్రభావ చరిత్రలను చింతిస్తూనే నిదురించాలి

తనపై పరమాత్మకు గల అహైతుక దయ, కృప, ప్రేమలను పదే పదే స్మరించుకుంటూ సర్వ సమయాల లోనూ ప్రసన్నంగా వుండాలి

ఏకాంత వేళల్లో మనసా పరమాత్మను వినా అన్య చింతన చేయకు వ్యర్థ చింతనలవల్ల హాని తప్ప లబించే దేమీ వుండదు

భగవంతుని మించిన హితైషి మనకు వేరే ఎవరూ లేరు కావున స్వాధీనంలో వున్న సర్వస్వాన్నే కాదు, బలిచక్రవర్తివలె నిన్ను నువ్వు కూడ భగవంతునికి అర్పణ చేసుకోవాలి

భగవన్నామ రూపాలను స్మరిస్తూనే సామాజిక, వ్యావహారిక, అర్థికాది కార్యాలను న్యాయపూర్ణంగా నిస్స్వార్థ భావంతో చెయ్యాలి కారణ మేమంటే మన ప్రయత్నా లన్నీ నిస్స్వార్థ భావంతో పరహితార్థంగా చెయ్యడంలోనే మనకు శుభాలు చేకూరుతాయి

ఏకాంతంలో ఇద్దరు భాషిస్తూవుండగా వారి సమ్మతి లేకుండ వారి సమీపానికి వెళ్ళరాదు

కర్తవ్య కార్యనిర్వహణ కాకపోయినా తన ద్వారా దుష్కర్మ ఏది జరిగినా – భవిష్యత్తులో అలా జరుగకుండ వుండేటట్లు పశ్చాత్తాపం చెందాలి

ధనప్రాప్తి స్వాధీన విషయం కాకపోయినా మానవ శరీర నిర్వహణార్థం కర్తవ్య బుద్ధ్యా న్యాయ యుక్తంగా అవశ్యం పరిశ్రమించవలసినదే

ఉత్తమ కార్యాన్ని శీఘ్రాతి శీఘ్రంగా చెయ్యాలి కారణం? ఈ శరీరం క్షణ భంగురమైనది

సత్యానికి మించిన తపస్సు లేదు

అసత్యాన్నుండి బయటపడాలంటే వాగ్దానాలు – అంటే భవిష్యత్ సంబంధితమైన నిశ్చిత వచనాలు పలుకరాదు

దైవభక్తి, ధర్మాలను ఎన్నడూ విడచిపెట్టరాదు ఆ కార్యంలో ప్రాణాలు పోయినా లెక్క చేయరాదు

పరులను పీడించటం కన్నా పాపం లేదు పరులకు సుఖాన్ని కలిగించడం కన్నా మిన్న అయిన పుణ్యం లేదు కనుక సర్వదా పరులకు హితాన్ని కలిగించడం కోసమే ప్రయత్నించాలి

★★★

# శ్రీరామ గౌతమి

బేతవోలు రామబ్రహ్మం

శరదిందుద్యుతి వెండివీణవయి నిశ్శబ్దాటవీపంక్తి గిం
గిరులెత్తన్ స్వరరాగమాధురులు పొంగుల్వార ప్రస్తారవై
ఖరి నిక్ష్వాకులనాటి పాటకు సమగ్రశ్రీ వెలార్పన్నిరం
తరమున్ సాగెడు నీదు సాధనకు భద్రమ్మౌత గోదావరీ!

అమ్మా! వీడొక ఛాందసుండు వినుమా! ఐక్ష్వాకుడై వచ్చిదై
వమ్మర్ఘ్యమ్ముల నిచ్చుచో నతని దీవ్యద్దివ్యపాదాబ్జయు
గ్మమ్ముల్ సోకి వియద్ధునీ గరిమ సంపాదించుకొన్నావు-నీ
యంబుల్ నెత్తిని జిల్కరించుకొననిమ్మా! తల్లి! గోదావరీ!

సికతాద్వీపమునందు రాఘవుడు లక్ష్మీజానిగా జానకీ
సుకుమారాంకమృదూపధానుడయి మెచ్చుల్ జూప-రంగత్తరం
గక నిష్ఠ్యూత శశిప్రభమ్ము భవదాకారమ్ము-సౌమిత్రి యూ
హకు జన్మాంతర సౌహృదమ్ము లెవియే నందించునో గౌతమీ!

తీరిన రేయి – నీ యిసుక తిన్నెలపై నడయాట బూని జా
గారము సేయుచున్ జిరుతగవ్వలు రువ్వుచు నూర్మిలాస్యశృం
గారము జూచుచున్ జటుకునన్ శిలయైన సుమిత్ర బిడ్డ గం
భీరత జూచి నీ పడిన వేదన మాటలటమ్మ! గౌతమీ!

'పదునాల్గేడు లరణ్యవాసమునకున్ పాథేయ మోనాథ! యి
య్యది గైకొ' మ్మని యూర్మిళామహిళ గాఢాలింనమ్మిచ్చి నె
మ్మది హత్తించిన పుల్కరింతలను రోమంథించు లక్ష్మన్న క
న్నుదలన్ రాలిన బాష్పబిందువులు నిన్ను న్మార్చెనే! గౌతమీ!

లలితస్నేహమరంద తుందిలములై లావణ్య దివ్యాపగా
జలజాతమ్ములునైన చూపుగములన్ సంధ్యాముహూర్తాన మై
థిలి గైసేసెను నిన్ను పంచవటికాతీరాన నిత్యమ్ము-ని
య్యిల గంగమ్మకు లేదు తుంగమకు లే దాభాగ్యమీ గౌతమీ!

యతివేషంబు ధరించి రావణుడు యూపాకార వధ్యోపల
ప్రతిగా వచ్చిన దుర్ముహూర్తమున దుర్వారాత్మ వ్యాఘ్రీన దు
ర్గతికిం గుందికు సిల్కి నేటికిని దుఃఖక్షుబ్ధ సర్వాంగసం
హతి గంపింతువు తల్లి! నాటి దడ మాయన్లేదె! గోదావరీ!

తనసంకల్పము తీరి రాఘవు డయోధ్యాపట్టణం బేగు వే
ళను- కిష్కింధను నిల్పి పుష్పకము గోలాంగూల కాంతాజనం
బును నెక్కించిన సీత – నీ యెడ నదేమోకాని యా రీతి మ
న్నన గావింప, దనూహ్య మీ చెలిమి విన్నాణంబు గోదావరీ!

'అదిగో గౌతమి చూడవే' యనుచు మర్యాద మహామూర్తి స
మ్మద సంరంభత తట్టి పల్కునెడ- సమ్యగ్భాషణ స్పర్శనా
భ్యుదయం బెన్నటి కెన్నడే కలిగె నోహో! యంచు వైదేహి నె
మ్మది హర్షించెనొ! నించెనో నిను ప్రశంసావృష్టులన్ గౌతమీ!

తన వ్యక్తిత్వము మాతృదేవతకు సత్కారార్హతం గూర్ప స
ద్గుణసంపన్నత యార్ష పద్ధతికి నిగ్గుల్దీర్ప వర్తించు త
మ్ముని నిర్బంధము తొందరించినది సుమ్మో తల్లి! కాకున్న మ
న్నన సేయన్ భరతగ్రజుండిట విమానంబాపడే! గౌతమీ!



గోదావరిమాత చిత్రం పి శ్రీనివాస్



# గోదావరి మాత

ఆచార్య ఎం కులశేఖరరావు

గోముఖమ్ము నందు గోత్రాన జనియించి
పారి పారి మనకు చేరవచ్చె
గోదశబరి గూడి గోదావరీమాత
తెలుగుదేశ మందు వెలుగు నించె

రామ పాద సాగ రానను నిలుచుండె
కాకతీయ భూమి కనకమాయె
ముద్దు ముచ్చటైన ముత్యాల రాశులు
కూర్చగలరు నెవరు గోద తప్ప!

రామభద్ర విభుడు రాజిల్లుచుండంగ
పాదస్పర్శచేసి పారుచుండు
ఇంతకన్న నీకు ఇంకేమి వలయును?
గోద సరిత, నీవు గొప్ప కాదె?

సాని కిన్నెరమ్మ సరసమౌ సఖి నీకు
అడుగు అడుగు వేసి ఆటలాడు
విశ్వనాధకవియె విశ్వవిఖ్యాతిని
కలుగ జేసె మీకు ఘనచరిత్ర!

వెండి పట్టమట్లు వెలుగుచు నుండును
ధవళ ఈశమమందు నవ నవమ్ము
అనకట్టకాదు, అందాల నగయేను
చెప్పలేని సొగసు గొప్ప నొప్పు

గంగతీరమందు సంగమించెను నాదు
గొప్ప నాగరకము మెప్పుపొంది
గంగవోలె నిచట గౌతమి కూడను
సర్వ విద్య నిలయ ద్వారమయ్యె

రాజమంౘ్రిలోన రారాజునేకాదు
రాజకవులు కూడ రాజ్యమేల

స్వచ్ఛమగుచు మెరిసె సంగీత సాహిత్య
రీతులన్ని జ్వలన జ్యోతి వోలె

కావ్య గాన సభలు కనకాభిషేకాలు
నిత్య వైభవాలు నిరత సుఖము
రాజమండ్రి యనగ రమణగా విరిసెను
గోదతటము నందు వేదమట్లు

వేదసామ్యమైన వినుతమ్ము భారత
రచన యిచట సాగె లక్షణముగ
నన్న పార్యవిభుడు నారాయణాఖ్యుడు
జ్ఞాన ఖేలనమ్ము, మాన్య వరులు

సిరుల చిందుచుండు శ్రీనాధ కవిరాజు
కావ్య హేలకాసె నవ్యరీతి
జ్ఞాన దేవి తాను నాట్యాలు చేయగా
వెల్లి విరిసె కవిత వింత శోభ

ధర్మపురములోని ధరణి దేవతలైన
వేములాడలోని వేదవిదులు
రాజమండ్రిలోని రక్షణ కవులేమి
గోదమాత వలన గొప్పలైరి

'కందుకూరి' యిచట గర్జించి దూకెను
కవిత చేతబట్టి కాళివోలె
అతడు లేకపోతె, అబల లిప్పుడు
అందలాలనెక్కి అలరగలరె?

పదియు మీద రెండు వత్సరాల్ గడువగా
పుష్కరాలు వచ్చు పొంగి పొంగి
ఆంధ్రదేశమంత అమృతమ్ము కురిపించు
పరమ పావనమ్ము భవ్య చరిత

# జీవనసిరి - గోదావరి

డా॥ కలువకుంట రామమూర్తి

భూమాత గుండెలో కారుణ్యమే ఉబికి – త్ర్యంబకంబున కనులరెప్పలే విచ్చావు
గౌతమాశ్రమమున ఋషికన్యవై నీవు– జన్మించి జలధారలుగ సాగివచ్చావు
పైరుపచ్చల కాళ్ళు పట్టుకుని తల్లిలా– కడుపునిండుగ పాలు పట్టించుతున్నావు.

ఆకాశ లోకాలఅమరధామమునుండి – భువికవతరించిన కామధేనువు నీవు
మంజీర, మానేరు, శబరి, ప్రవరాదిగా – నీ సప్త ఉపనదుల పాదుగులన్నీ పిదికి
ఆ– ఏడు పాయలతో ఆరు కాలము మాకు – ముక్కారు పంటలను భిక్ష పెడుతున్నావు
నీ నీటి చెలమలే మాకున్న కలుములు – నిను చూచి కరువులే పరుగులే తీస్తాయి.

నీ–కొలని మబ్బుల చీర, పొద్దుపొడుపూబొట్టు – నీ, సన్న జాజులశ్వాస, మట్టిగాజుల మోత
ఒళ్లంత కళ్లతో మెరిసి చూచే తల్లి – నీ దారిలోనె మా బ్రతుకుదారుందమ్మా
వేద ఘోషలునీకు సైదోడు పాటలు – ఉపనిషత్తులు నీకు సిగపూల గుత్తులు
నీ– జలబిందువుల అందెలన్ని ఘల్లనగానే – మా తీరభూములు పులకించి పూస్తాయి.

పడవలన్నీ అవుదూడలై తిరిగేటి – నీటి తోటగ నీవు భాసిల్లుతుంటావు
నీ ఒంటిగాలి మాకెంత ఆశ్వాసనో! – నీ కంటి చూపు మా కెంత సంరక్షణో!
మా– పడవలను మోసినా, కడవలను నింపినా-భావ, జల కాలుష్య కిమ్మీరులైనాము
మా– తప్పులకు శతకోటి దండాలు పెడతాము– మా, ఊళ్లు దండలు కట్టివేసుకోకమ్మా.

నదిలేని ఊరికి నెమ్మదేదమ్మా! తల్లి లేనింటిలో ప్రేమేది తల్లీ!
క్రూరులో, చోరులో కానీక మమ్ములను – కలిమి బలిమీ నిచ్చి కాపాడుతున్నావు.
రాసులే నీలోని మీన, మిథునాలుగా – ఎన్నెన్ని యుగములుగ కదలిపోతున్నావో
ఎన్నెన్ని అపజయాలెన్ని విజయాలో! ఎన్నెన్ని జ్ఞాపకాలమ్మ నీ అలలలో!

జగన్నాథరాయడీ మునిఖండ వాసిగా – భరత ఖండమునందు ఖ్యాతిగన్నాడు
నీవాంధ్ర భృత్యులకు ఆరాధనీయవై – పాపికొండలలోన పరవళ్లు త్రొక్కావు
దినేంద్ర చంద్రులు నీలో సంధ్యావార్చెదరేమో – ఆ, కిరణాలె మాలోన కవనాలు రేపాయి
నీ సోదరే కృష్ణ, సాహిత్య పరితృష్ణ – విజయపురి కాపురికి అర్ఘ్యపాద్యభినిష్ణ.

రామగిరి భీమపురి పంచవటితో పాటు – భద్రగిరి, అంతర్వేది, ముక్తేశ్వరము
నీ తీర ప్రాకార గుడి గోపురాలకు – ప్రాభాత సమయాభిషేకాలు చేస్తావు
కల్హణుని కాశ్మీర రాజతరంగిణీ – పోతన్న శ్రీనాథ కంబకావ్యాలేలి
మా గుండెలను విజయ దుందుభులుగా మలచి – స్తుతి పాత్రమైనీవు చరితార్థవైనావు.

★ ★ ★

# ధార్మిక కేంద్రాలుగా ఆలయాలు

—ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద

**ధర్మ ఏవ హతో హంతి ధర్మోరక్షతి రక్షితః,**
**తస్మాత్ ధర్మో నహంతవ్యో మనోధర్మో హతోఽ వధీత్.**

(మనుస్మృతి - 15)

ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనల్ని రక్షిస్తుంది. నశింపచేస్తే మనల్ని సర్వనాశనం చేస్తుంది. అంచేత ధర్మాన్ని మనం చేజేతులా చంపరాదు. కొడికట్టిన ధర్మజ్యోతిని మనం వెలిగింపచేయాలే తప్ప దాన్ని ఆర్పివేయడానికి ప్రయత్నించరాదు - అని పై శ్లోకానికి అర్థం.

ఈనాడు ఆలయాల్ని చూస్తుంటే పై శ్లోకం మాటి మాటికి గుర్తుకు వస్తుంది. ఆలయం ధర్మకేంద్రం. ధర్మాన్ని గురించిన అధ్యయనం (అధీతి), జ్ఞానం (బోధ), ఆచరణ, ప్రచారాలు నాలుగూ ఆలయ ప్రాంగణంలోనే జరిగాయి. ఒకో ధర్మసంస్థ (మఠం/ ఆశ్రమం) ఆధ్వర్యంలో ఆలయాలు నిర్వహింపబడటంలోని రహస్యం ఇదే. ఆ ధర్మం గురించిన విద్యను నేర్పారు. అందుకే 'ఘటికలు' (ప్రాచీన విద్యాలయాలకు పేరు) ఆలయాల్లోనే ఏర్పడ్డాయి. జీయ్యర్/జియ్యంగార్/స్వామిజీ ఒకరు ఆ ధర్మాన్ని ఆచరణలో పెట్టించేవారు, బోధించేవారు. అందుకే సంప్రదాయ కళలైన పురాణప్రవచనం, భజనలు, సత్సంగాలు, హరికథలు, నృత్య సంగీత నాటకాదులు అన్నీ ఆలయ ప్రాంగణాల్లో ప్రాణం పోసుకొన్నాయి. అన్నదానం, వస్త్రదానం, వివాహాది శుభకార్యాలు, (శుభా శుభ కర్మలన్నింటికీ) ఆలయం కేంద్రమయింది. అందుకే దేవాదాయం, ధర్మాదాయం రెండూ ఆలయంలో ఒక వ్యవస్థను పొందాయి. ఆలయం సర్వజనుల సహకార జీవనానికి, అభ్యుదయానికి, సంక్షేమానికి పట్టుగొమ్మ అయింది. ఆలయ నిర్వహణ చేసే పాలకులకు ధర్మకర్తలనిపేరు ఏర్పడటంలో ఇంత రహస్యమూ దాగి వుంది.

మామూలుగా చేసే ప్రతిపనీ 'ధర్మం'కాదు. అది భగవంతుని ప్రీతి సంపాదించేది అయితేనే ధర్మం అవుతుంది. ఎందుకంటే భగవంతుడు ధర్మరక్షకుడు. విష్ణుసహస్రనామంలో వ్యాసమహర్షి ఈ విషయాన్ని వివరించారు.

**సర్వాగమానా మాచారః ప్రథమం పరికల్పితః,**
**ఆచార ప్రభవో ధర్మః ధర్మస్యప్రభు రచ్యుతః.**


(ఆగమాలు అన్నీ ఆచారాన్ని బోధిస్తాయి. ఆచారం నుండి ధర్మం పుడుతుంది. ఆ ధర్మానికి ప్రభువు - నియామకుడు - సంరక్షకుడు -శ్రీమన్నారాయణుడు)

ఆ అచ్యుతుడు స్వయంగా 'భగవద్గీత'లో ఇలా అన్నాడు-

**యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత,**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.**

-ధర్మానికి ఎప్పుడు అపచారం జరుగుతుందో అప్పుడు అధర్మాన్ని శిక్షించి ధర్మాన్ని పైకి లేవనెత్తడానికి నేను స్వయంగా అవతరిస్తాను.

భగవంతుడు అనేక అవతారాలు దాల్చి ఈ పనిచేస్తూ వస్తున్నాడు. కలియుగంలో మనిషి చాలా స్వల్పమైన ధృతి స్మృ



పాలంగి - రామలింగేశ్వరాలయం

టి కర్మ జ్ఞానాలు కల్గినవాడు. ఇది కాలధర్మం. కనుక భగవానుడు అర్చారూపంలో (విగ్రహరూపంలో) పూజలందుకొంటూ అవ్యక్తంగానే తన ప్రభావాన్ని చూపుతూ ప్రకాశిస్తున్నాడు. శ్రీనివాసుడు ఆనందనిలయ విమానంలో (గర్భగుడిలో) అవతరించి కలియుగాది నుండి ఈనాటివరకు ఆస్తికత్వ భావనను ప్రతిష్ఠాత్మకంగా నిలుపుతున్నాడు. ఆ భావనకు కార్యరూపమే ధర్మకార్యనిర్వహణ.

ఇక్కడ ధర్మకార్యం ఎలా ఉంటుందో చూద్దాము. సాధారణంగా మనిషి తనకున్నది ఇతరులకు ఇవ్వడానికి ఇష్టపడడు. దీన్నే 'లోభ' గుణమంటాము. కాని ఆలయంలోకి వెళ్ళగానే భగవంతుడికి కానుక ఇవ్వాలని అనిపిస్తుంది. ఇవ్వవలసిన పనిలేదు. కాని ఇవ్వాలన్న భావన భగవంతుడి ఋణాన్ని మనిషికి గుర్తు చేస్తున్నది. అందుకే హుండీలో అన్ని లక్షల రూపాయల్ని భక్తులు సమర్పిస్తున్నారు.

ఎవరో ఒక ధనవంతుడు/ధనవంతురాలు ఉన్నారు. ఒకదశలో ఈ సంపాదన 'నాది' కాదన్న భావన కల్గిన తరువాతనే ఆలయం పేరిట కోట్లకొలది ఆస్తుల్ని వ్రాసి హుండీలో 'వీలునామా'లు, 'దాన శాసనాలు' - రచించి సమర్పిస్తున్నారు. అలా ఏర్పడ్డవే ఆలయాల్లో 'సిరి సంపదలు' - ఇవి మామూలు ధనరాశులుకావు. మాన్యం భూములు. మాన్యం కానుకలు. 'మాన్యం' - అనగా భగవంతుడికి- 'దత్తం' అని అర్థం. అది భగవంతుడిది అనగా ఏ వ్యక్తిదీ కాదు. ఆ భగవంతుడు ధర్మస్వరూపుడు కాబట్టి ధర్మానికి చెందిందని అర్థం.

అందుకే 'ఆలయం' సమాజానికి అంకితమైంది. ఒక కులంవారో ప్రాంతంవారో బాగుపడటానికి ఏర్పడింది కాదు ఆలయం. అందుకే ఆలయపూజను 'పరార్థపూజ' అంటారు. అంటే 'స్వార్థ పూజ' కాదని అర్థం. అందుకే ఇంటిలో మనంచేసే పూజా పునస్కారాలలో 'మమ' (నా) అనే సంకల్పం ఉండగా ఆలయపూజలో సకలదేశమూ - మానవాళి - ఉన్నాయి.

సకాలంలో వర్షాలు పడాలి. పంటలు పండాలి. దుర్భిక్షం రారాదు. అన్ని జాతులు తమ తమ వృత్తులవల్ల వచ్చే ఆదాయంలో రోగాలు ఉపద్రవాలు లేకుండా క్షేమంగా ఉండాలి. మనుషుల నడుమ సహకారం వుండాలి. ఈ దృష్టితో 'ఆలయం'లోని పూజావిధానం ఏర్పడింది. ఆలయంలో 18 వర్ణాల వారూ తమ తమ పనులు చేసుకోవడానికి అవకాశం వుంది. అందరూ ఆలయంలోని నైవేద్యాన్ని తినడానికి అవకాశం కల్గింది. 'దేవుడి కల్యాణానికి అందరూ పెద్దలే' - అంటే అందరూ బాధ్యత వహించాలని అర్థం. ఇలా ఆలయం అందరి 'సొత్తు' అయింది.

కాలం మారింది. ఆలయంలో 'ధర్మం' ప్రతిష్ఠ పొందాలన్న దృష్టి చాలాచోట్ల సన్నగిల్లింది. ఆచార వ్యవహారాలు సన్నగిల్లాయి. ఆలయయాత్ర విహారయాత్రగా మారిపోతున్న ఒక కొత్త వ్యవస్థ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి



కోటిపల్లి – దేవాలయం

దేవస్థానాలవారు 'ధర్మప్రచార పరిషత్తు'ను ఏర్పాటు చేయడం ఆలయ నిధులనుండి కొంత భాగాన్ని వైదిక, పురాణ, సంప్రదాయ కళలు, శాస్త్రాలు - వీటి పరిచయానికి ప్రచారానికి వినియోగించడం నిజంగా అభినందనీయమైన విషయం.

తి.తి.దేవస్థానాలవారు తమ ఆలయాల ఉత్సవాల్లోనే కాకుండా ఇతర ఆలయాలలో ప్రత్యేక సందర్భాల్లోనూ, నదుల పుష్కరాలలోనూ, కుంభమేళాలలోనూ, ఆలయ ప్రతిష్ఠాదులలోను - దేశ విదేశాలలో ధర్మప్రచారంచేస్తూ ఉండటం గమనిస్తే శ్రీనివాస స్వామివారు తమ ఉనికిని ప్రపంచంలో చాటిచెప్పి దానిద్వారా 'ధర్మ' స్వరూపాన్ని అందరికీ గుర్తింపచేయడానికే అని స్పష్టంగా తెలుస్తుంది.

అంచేత ఆలయాలు ధార్మిక కేంద్రాలుగా వృద్ధి పొందాలి. అర్చకులు, పురోహితులు, పురాణపండితులు, హరికథకులు - వేదపండితులు - వీరందరూ ధర్మప్రచారకులు కావాలి. గుడిలో పూజ - తీర్థ ప్రసాద వినియోగమే కాకుండా ధార్మిక బోధ జరగాలి. జ్ఞాన ప్రసాదం నిజమైన ప్రసాదం. అది వైరాగ్య బోధ కల్గిస్తుంది. అదే ఆలయ సందర్శనకు పరమార్థం.

* * *



సామర్లకోట – కుమారారామం

# నాసి! త్ర్యంబకం

బి.ఎన్. శ్రీనివాసన్

గోదావరినది పశ్చిమకాశిగా పేరొందిన నాసిక్ దగ్గర ఉన్న త్ర్యంబకేశ్వరంలో పుట్టి అంతర్వేది దగ్గర సముద్రంలో కలుస్తుంది. అది శివస్థానమైతే అంతంలో విష్ణుస్థానం. మధ్యలో వేయిమైళ్ళ జనస్థానం. కవి కులగురువు కాళిదాసు హిమాలయ పర్వతాన్ని 'పృథివ్యా ఇవ మానదండం' అని చెప్పినట్టు గోదావరినది తూర్పు పశ్చిమ సముద్రాల నడుమ మానదండమని మనం చెప్పుకోవచ్చును.

**త్ర్యంబకం భారతదేశంలోని పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటి త్ర్యంబకేశ్వరుని నిలయం. గోదావరిలాంటి నదిగాని, త్ర్యంబకం లాంటి క్షేత్రం గాని, త్ర్యంబకం నెలకొన్న బ్రహ్మగిరి లాంటి పర్వతంగాని పృథ్విపైన వెదకినా కనబడదని పెద్దలంటారు.**

నాసిక్ పట్టణం గోదావరినదికి ఇరువైపులా అభివృద్ధి చెందింది. ఉత్తరాన పలు మైళ్ళ దూరంలో త్ర్యంబకం ఉన్నది. ఇక్కడ గౌతముడి కారణంగా గోదావరినది కనిపించింది. గౌతముడు ఏదో ఒక కారణంతో గోవు మృతికి కారణమయ్యాడు. ఆ పాపాన్ని పోగొట్టుకోవడానికి గంగను వదలమని శివుని అర్థించాడు. శివుడు తన జటాజూటంలోని గంగను వదిలిపెట్టాడు. త్ర్యంబకంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల పేరిట మూడు లింగాలు ఉన్నాయి. శివలింగం శిరోభాగాన రెండు రంధ్రాలలోనుంచి సర్వదా గంగ వస్తుందని అంటారు. ఆ నీరు తరువాత గంగాద్వారం, వరాహతీర్థం, రామలక్ష్మణ తీర్థాలలో కనబడినప్పటికీ మాయమౌతుండడంతో గౌతముడు దర్భతో గంగామార్గాన్ని సుగమం చేశాడు అప్పుడు కుశావర్తం అనే తీర్థం ఏర్పడిది అక్కడి నుండి అంతర్వేది వరకు ఉరకలు వేస్తు దారిపొడుగునా పంటలను పెంచుతూ, అన్నపూర్ణగా గోదావరి నామధేయంతో ప్రవహిస్తోంది. గౌతముడు ఒక మహత్కార్యానికి సాధకుడుగా నిలిచాడు. అందువల్ల గోదావరిని గౌతమి అన్నారు. గోవుకు దానం చేసిన (ముక్తిని ప్రసాదించిన) వారి కాబట్టి గోదావరి ఐనది.

కుశావర్తానికి నాలుగు వైపులా మెట్లను పొందుపరచి, మంటపాలను నిర్మించారు. ఇది మొఘలుల కాలం తరువాత అంటే పీష్వాలకాలంలో అని చెప్పాలి. కుశావర్తానికి నాలుగు దిక్కులలో నాలుగు మందిరాలు ఏర్పడినవి. మొదటిది కేదారేశ్వరుడు తరువాత సాక్షివినాయకుడు, కుశేశ్వరస్వామి, గోదావరి మాత ఆలయాలు వెలిసినాయి. కుశావర్త తీర్థంలో కాలాన్ని అధిగమించి వచ్చిన అశ్వత్థ వృక్షమున్నది. మూడు వైపులా కొత్తగా భగవంతుడి దశావతార మూర్తులు ముప్పైమూడు మూర్తులు వెలిశాయి.

త్ర్యంబకేశ్వరుని విశాలమైన (260' x 220') అధునిక ఆలయాన్ని 1785 సంవత్సరంలో నిర్మించారు. కొత్త నంది విగ్రహం కొత్త శిల్పవైవిధ్యంతో చూడముచ్చటగా ఉంది. ఇరువైపుల దీపాలతో పెద్ద మహద్వారం, ఆలయం వెలుపల మండపం, పెద్ద నంది విగ్రహం ఉన్నవి. లోపల ముఖ మండపంలో పాలరాతి చిన్న నంది విగ్రహాన్ని చుట్టి అనేక ఇతర గుడులను చూడవచ్చును. తరువాత అంతరాళంతో కూడిన గర్భగుడి ఉంది. గర్భగుడిపైన కలశంతో కూడిన ముచ్చటైన విమానం ఉన్నది. గర్భగుడి మధ్యలో త్ర్యంబక లింగం పాపహారిగా క్షణముక్తిదాయిగా శాశ్వతశాంతిదాతగా ఉన్నది. పేష్వాలకాలంలో డిల్లీ నుంచి తెచ్చిన బంగారంతో తయారుచేసిన పంచముఖ కవచము, నవరత్న కిరీటంతో అలంకరింపబడుతాడు త్ర్యంబకేశ్వరుడు. సాధారణ రోజులలో ఒక ముఖ కవచంతో అలంకరణ జరుగుతుంది

గౌతముడు తపస్సు చేసిన గౌతమ గూహ ఇక్కడుంది. బిల్వతీర్థం, గౌతమతీర్థం, ఇంద్రతీర్థం అహల్యాతీర్థం మున్నగు తీర్థములున్నాయి.

దండకారణ్యంలోకి వచ్చిన శ్రీరాముడు సీతాలక్ష్మణులతో నాసిక్ ప్రాంతంలో నివసించాడని మనవారి నమ్మకం. నాసిక్ ప్రాంతాన్ని కృతయుగంలో పద్మనగరమని, త్రేతాయుగంలో త్రికంటకమని, ద్వాపర యుగంలో జనస్థానమని, కలియుగంలో నాసిక్ అని పిలవడమైనది. హ్యూవాన్‌సాంగ్ ఇక్కడికి వచ్చి ఇక్కడి స్థూపాల గురించి వివరాలను తన పుస్తకంలో పొందుపరిచాడు. దగ్గరలోనే సీతాగుహ ఉన్నది ఇక్కడ రెండు భాగాలు ఒక దానిలో రామలక్ష్మణ సీతా మూర్తులు ఉన్నాయి. ఇక్కడి నారు శంకర దేవాలయం ప్రసిద్ధమైనది. ఈ గుడి గంటను పోర్చుగల్ దేశం నుండి చేయించి తెప్పించారని అంటారు. 18వ శతాబ్దంలో నిర్మాణమయిన రామమందిరం మరొక పెద్ద ఆలయం. నారాయణ, భద్రకాళి ఆలయాలు కూడా ఇక్కడ ఉన్నాయి.

మొత్తం మీద చెప్పాలంటే నాసిక్ ఒక ఆలయ సముదాయ క్షేత్రం. ఇక్కడ గోదావరి త్ర్యంబకంలో పుట్టి తూర్పున ఉన్న బంగాళాఖాతం వైపు పయనించి అంతర్వేదిలో తన జీవన మోక్షాన్ని పొందుతుంది.

# గోదావరి తీరపు పుణ్యక్షేత్రాలు ఉత్తర తెలంగాణ

– శలపాక సత్యనారాయణమూర్తి

భారతదేశంలో, ప్రత్యేకంగా, హిందూ జీవన విధానంలో నదులకొక ప్రముఖ స్థానం ఉంది. పూజకు కూర్చున్న ప్రతిహిందువు తన కలశంలోకి గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి నదీ జలాల్ని ఆహ్వానిస్తాడు. భరతఖండంలో హిందువులు ఏ ప్రాంతం వారైనా, ఏభాష మాట్లాడినా, ఏరాజ్యానికి చెందినవారైనా, ఈ దేశంలో ప్రవహించే నదులు, కొలువున్న దేవతలు తమ అందరికి చెందినవనే భావన తరతరాలుగా దృఢంగా పాతుకుపోయింది. ఆ భావనే అనేక ప్రభుత్వాల ఆధీనంలోను, అనేక రాచరికాలపాలనలోనూ ఉన్న ప్రాంతాలు కలసి ఒక స్వాతంత్ర్య ప్రజాస్వామిక భారతదేశంగా ఏర్పడటానికి సాయపడింది.

జానపదాలు నదీ తీరాల్లో పుట్టాయి. నదుల లోయల్లో మానవ సంస్కృతి వికసించింది. నదులమ్మట దివ్యక్షేత్రాలు అభివృద్ధి చెందాయి. నదుల సంగమాల్లో సత్రాలు జరిగాయి. అక్కడ పర్వాల్లో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పండితులు, కవులు, తమ పాండిత్యాన్ని, కవిత్వాన్ని పరస్పరం వినిపించుకొని, వాటి విస్తృత ప్రచారానికి అవకాశం కల్పించారు. నదులనుంచి నదులకు భావాలు విస్తరించి భరతఖండానికి ఒక సంస్కృతినిచ్చాయి. అందుకనే నదులు దేవతలయ్యాయి.

వాయవ్యదిశలో పడమటి కనుమల్లో పుట్టే నదులు దక్కను పీఠభూమిని తడుపుతూ ఆగ్నేయ దిశలో తూర్పు కనుమలు దాటి సముద్రంలో కలుస్తాయి. ఆ విధంగా ప్రవహించే నదుల్లో కృష్ణా, గోదావరి ప్రధానమైనవి. ఆంధ్రదేశ చరిత్ర, తెలుగువారి సిరులు ఆ నదులతో ముడిపడి ఉన్నాయి. ఆంధ్ర శాతవాహనులు ఆ నదుల వెంబడే ఈ ప్రాంతంలోకి అడుగుపెట్టి, ఒక మహాసామ్రాజ్యాన్ని స్థాపించారు. గోదావరి, ప్రాణహిత ల సంగమస్థానంలో ఉన్న కాళేశ్వరం, కృష్ణానదీ తీరంలో శ్రీశైలం, తూర్పు సముద్రతీరానికి అనతి దూరంలో ఉన్న ద్రాక్షారామం మూడు సరిహద్దులై కృష్ణా – గోదావరీ పరివాహక ప్రాంతానికి త్రిలింగదేశమనే పేరిచ్చాయి. ఆ నదుల జలాలు తెలుగు సంస్కృతిని పెంచి పోషించాయి.

గోదావరి ప్రమాణంలో చాలా పెద్ద నది. హిందువులు గంగానది తరువాత గోదావరిని అతి పవిత్రమైన నదిగా భావిస్తారు. **మహారాష్ట్రలో ముంబాయికి 110కి.మీ ఈశాన్యంగా నాసిక్‌కి 16 కి.మీ. దూరంలో త్ర్యంబకం వద్ద జన్మించిన గోదావరి 1500కి.మీ. పైగా మహారాష్ట్రలోను, ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రవహించి ఆగ్నేయంగా రాజమండ్రి దాటి పాయలై, బంగాళాఖాతంలో సముద్రాన్ని కలుస్తుంది. ఈ నది 3,12,812 చ.కి.మీ. పర్యంతం ఉన్న పరివాహక ప్రాంతం నుంచి నీటిని** స్వీకరిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి 760 కి.మీ. ప్రవహిస్తుంది.

గోదావరి ఉత్తర భారతదేశాన్ని, దక్షిణ భారతదేశాన్ని కలిపేనది. సంస్కృత గాంభీర్యాన్ని, ద్రావిడ మార్దవానికి జోడించినది. సీతారాములు గడిపిన తీయని రోజులకు సాక్ష్యమీ నది. ఈ నది పుణ్యదాయినే కాదు, భుక్తి దాయిని. ఆంధ్రదేశంలో ఈ నది క్రింద 10లక్షల ఎకరాల సారవంతమైన ఆయకట్టు భూమి ఉంది. ఈ నదీ ప్రాంతంలో 17,500చ.కి.మీ. బొగ్గగనులున్నాయి. ఈ నది సముద్రాన్ని కలసిన భూతలంలో చమురు, వాయు, ఇంధన నిక్షేపాలున్నాయి. ఈ నది సర్వ సంపత్ప్రదాయిని.

ఆదిలాబాద్ జిల్లాలో బాసర వద్ద, గోదావరి ఆంధ్ర ప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల గుండా ప్రవహించి, ఈ నది సముద్రాన్ని చేరుతుంది.

ఉత్తర తెలంగాణా గోదావరి తీరంలో బాసర, నల్గొండ, వేంపల్లి, తిమ్మాపూర్, కోటిలింగాల, జనగామ్, సుండెల్ల, కాశిపూర, మంథని, కాళేశ్వరాలలో పురాతన దేవాలయాలు ఉన్నాయి. కొన్ని శిథిలమయిపోయాయి. వీటిలో ప్రసిద్ధి పొందిన క్షేత్రాలు బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం.

### బాసర జ్ఞాన సరస్వతి

బాసర ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్‌కు 70 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడకు హైదరాబాద్ నుంచి బస్సు సౌకర్యం ఉంది. గోదావరి కొండలమధ్య ప్రవహిస్తూ, బాసర వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి, జ్ఞాన సరస్వతిని సేవించుకొని ముందుకు సాగుతుంది.

వ్యాసమహర్షి ఈ ప్రదేశంలో నివసించాడని, వ్యాసపురి బాసర అయిందని, ఒక కథ. రోజూ గోదావరిలో స్నానం చేసి వ్యాసమహర్షి మూడు గుప్పిళ్ళ ఇసుక మూడుచోట్ల



బాసర ఆలయం - వెనుక టి.టి.డి. నిర్మిస్తున్న నూతన గదుల చిత్రం



లక్ష్మీసహిత బాసర సరస్వతి

పోసేవాడట. మూడు ఇసుక పోగులు సరస్వతి, లక్ష్మీ, కాళీ రూపాలు పొందాయట. ఏదిఏమైనా కన్నడ భారతం వ్రాసిన పంప, తెలుగు భారతం వ్రాసిన నన్నయ, వ్యాసుడు ప్రతిష్ఠించిన జ్ఞానసరస్వతిని తాకిన గోదావరి జలాలు త్రాగే భారతం రచన చేశారు.



బాసర - మక్కాజీ పటేల్ విగ్రహం

బాసరలో సరస్వతి ఆలయం ఆరవశతాబ్దంలో రాష్ట్రకూటరాజులు నిర్మించారని చరిత్రకారుల అభిప్రాయం. తరువాత క్రీ.శ. 11-18 శతాబ్దాల మధ్యకాలంలో ఈ ఆలయం ముస్లిము సర్దారుల విధ్వంసానికి గురి అయింది. వారు లక్ష్మీ విగ్రహాన్ని ఖండించారు. అన్నపూర్ణ విగ్రహాన్ని భగ్నం చేశారు. పద్దెనిమిదవ శతాబ్దంలో మక్కాజీ పటేలు అనే మహనీయుడి దీక్షవల్ల ఇక్కడ ఆలయ పునర్నిర్మాణం జరిగింది. జగద్గురు శృంగేరి శంకరాచార్య శ్రీ విద్యారణ్య భారతి స్వామి వారు ఇక్కడ సరస్వతి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. ప్రాకారం వెలుపల చిన్న ఆలయంలో కాళికా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. లక్ష్మీవిగ్రహం పూజకు యోగ్యంగా లేకపోవటంవల్ల నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించమని ఆదేశించారు. సరస్వతి విగ్రహానికి ముందర కొంచెము ఎడంగా తరువాత లక్ష్మీ విగ్రహాన్ని అర్చకులు ప్రతిష్ఠించారు. ఇక్కడ ఆలయ ద్వారం వద్ద చేతులు జోడించుకు నిలచిన మక్కాజీ పటేలు మూర్తి కనిపిస్తుంది.

సరస్వతి ఆలయానికి ఉత్తరాన గుట్టమీద నాథసాంప్రదాయానికి చెందిన నరహరి మాలుకా సమాధి ఉంది. ఆయన వ్రాసిన 'నవనాథ భక్తిసార్' అనే మరాఠీ గ్రంథం నాథ సాంప్రదాయంలో ప్రసిద్ధి చెందిన గ్రంథం.

బాసర గ్రామానికి కొద్దిదూరంలో రైల్వేస్టేషన్‌దారిలో 'వేద శిల' అని ఒక రాయి ఉంది. దీనిని దేనితోనైనా కొడితే నాలుగు వైపులా నాలుగుధ్వనులు వస్తాయి. ఇంకా ఇక్కడ గణేశ మందిరం. ఏకవీర మందిరం, పాతాళేశ్వర మందిరం, ఆంజనేయ మందిరం ఉన్నాయి. సరస్వతి ఆలయానికి తూర్పున ప్రాకారం లోపల ఔదంబర వృక్షం, దత్తపాదుకలు ఉన్నాయి.

సరస్వతి మందిరం కేంద్రంగా ఉన్న ఇంద్రేశ్వరం, సూర్యేశ్వరం, వాల్మీకేశ్వరం, నారాయణేశ్వరం, గణేశ్వరం, కుమారేశ్వరం, పాపనాశేశ్వరం, వ్యాసేశ్వరం ఆలయాలతో ఈ ప్రదేశం ఒక క్షేత్రమైంది. ఈ దేవాలయానికి తూర్పున పాపహరిణి అనే ఒక సరోవరం ఉంది. దీనికి ఎనిమిదివైపుల ఎనిమిది తీర్థాలుండటం వల్ల దీన్ని అష్ట తీర్థ సరోవరమని కూడా అంటారు. ఈ తీర్థాలు ఇంద్రతీర్థం, సూర్యతీర్థం, వ్యాసతీర్థం, వాల్మీకితీర్థం, విష్ణుతీర్థం, గణేశతీర్థం, పుత్రతీర్థం, శివతీర్థం. సరోవరం మధ్య సరస్వతీ తీర్థమంటారు.

బాసర క్షేత్రంలో వ్యాసపూర్ణిమ, దసరానవరాత్రులు, వసంతపంచమి, మహాశివరాత్రి ఘనంగా జరుపుతారు.

**ధర్మపురి యోగనరసింహస్వామి**

ధర్మపురి జగిత్యాలకు 27 కి.మీ దూరంలో, గోదావరి తీరంలో ఉంది. గోదావరి ఇక్కడ ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు సరిహద్దు ఏర్పరుస్తూ ఉత్తరాన్నుండి దక్షిణానికి ప్రవహిస్తుంది. ధర్మపురి కరీంనగర్ జిల్లాలో గోదావరి పడమటి ఒడ్డున ఉంది. ఇక్కడకు బస్సు సౌకర్యం ఉంది.

ధర్మపురి ఆంధ్రప్రదేశ్‌లో అతిపురాతనమైన గ్రామం. దీన్ని రెండవ అరికేసరి క్రీ.శ. 10వ శతాబ్దంలో కన్నడకవి పంపకు అగ్రహారంగా ఇచ్చాడు. పంపని తమ్ముడు కుర్క్యాల శాసనంలో ధర్మపురిని గురించి చెబుతాడు.

**బరెదుదె తాంబ్రశాసన మదేయమే ధర్మవురం నెగళ్తవె**
**త్తరిగన కొట్టుదే నెగళ్ల పంపన పెత్తుదె పేళమెన్ను నీ**
**మ్మరుళె పల ర్మెయుం పలబరం బెసగొళ్ళదె పోగి నోడుసు**
**న్దర వృషభా చలోన్నత శిలాతలదోళ్ బరె దక్కరంగళం.**

(వ్రాయించినది తామ్రశాసనమా? ధర్మపురం దానమైనదా? ప్రసిద్ధుడైన ఆదికేసరి ఇచ్చినదా? ప్రసిద్ధుడైన పంపడు తీసుకొన్నవాడా? అని పలురీతుల పలువురను ప్రశ్నించనేల? వృషభాచలోన్నత శిలాతలములో వ్రాసిన అక్షరాలను పోయి చూడు. అయితే ఈ ధర్మపురి ఉనికిని తెలుసుకోవటానికి వృషభాద్రిని కనుక్కోవాలి. ఇది ప్రశ్నగానే మిగిలింది.) ధర్మపురి క్షేత్రమహాత్మ్యము అనే తాళపత్ర గ్రంథంలో, ఈ క్షేత్రమహిమ తెలిపే 3500 శ్లోకాలున్నాయి. ఇక్కడ రామలింగేశ్వరస్వామి ఆలయంముందు క్రీ శ. 1246 నాటి కాకతీయ గణపతి దేవుని శాసనం ఉంది. ఈ గ్రామం వేదాధ్యయనానికి, వేదపండితులకు శతాబ్దాలుగా పేరు పొందింది. గోదావరిని ఇక్కడ దక్షిణగంగ అంటారు. గోదావరి తీరంలో శ్రాద్ధకర్మలు చేస్తారు.

ధర్మపురిలో ప్రధానమైన దేవాలయం యోగనరసింహస్వామి ఆలయం. ఆంధ్రదేశంలో శివాలయాల లాగే అనేక నరసింహస్వామి ఆలయాలు ఉన్నాయి. శివుడిలాగే నరసింహస్వామి ఆంధ్రుల ఆరాధ్యదైవం ఆంధ్రప్రదేశ్ లో గోదావరి, ధర్మపురి యోగ నరసింప స్వామిని దర్శించుకొని, అంతర్వేది నరసింహస్వామి సమక్షంలో సముద్రంలో కలుస్తుంది నరసింహస్వామిని యోగులు ముక్తికై అరాధిస్తారు. ఏకాంతాన్ని కోరే యోగులు నరసింహస్వామిని కొండల్లోను, కోనల్లోను, అడవుల్లోనూ ప్రష్ఠించి ధ్యానించారు.

ధర్మపురి ప్రధాన ఆలయంలో, నరసింహస్వామి పద్మాసనంలో కూర్చొని చేతులు మోకాళ్ళపై ఉంచి న యోగ ముద్రలో ఉంటాడు. ఉగ్రరూపం వదలి సౌమ్యంగా కనిపిస్తాడు ఈ ఆలయద్వారం వద్ద యముని విగ్రహం ఉంది. ఇంకా ఆలయ లోపలిద్వారం వద్ద బలరామ, మురళీకృష్ణుల విగ్రహాలు, ఆరడుగుల చతుర్ముఖ బ్రహ్మ విగ్రహం ఉన్నాయి.

ఇక్కడ నరసింహస్వామి గోదావరి నది ఆగమనానికి పూర్వం నుంచీ ఉన్నాడంటారు. గోదావరి నదిలో వశిష్టకుండమని, బ్రహ్మకుండమని, సత్యవతీ కుండమని అనేక ప్రదేశాలు చూపిస్తారు. ప్రధాన ఆలయానికి చుట్టుపట్ల ఎనిమిది హనుమంతుడి విగ్రహాలున్నాయి. దక్షిణాభిముఖ ఆంజనేయస్వామివారి గుడి ఉంది. యోగనరసింహస్వామి ఆలయానికి దగ్గర ఉన్న రామలింగేశ్వరస్వామివారి ఆలయం ఈ క్షేత్రానికి హరిహరక్షేత్రమనే పేరిచ్చింది. ఇక్కడ శ్రీరాముడు లింగప్రతిష్ఠ చేశాడంటారు. ఇది పురాతన దేవాలయం.

ఈ ఊరికి 20 మైళ్ళ దూరంలో ఉన్న గుహలో, ఒక బ్రాహ్మణునికి నరసింహస్వామి విగ్రహం దొరికిందట. అతడు దానిని ప్రతిష్ఠించాడు. దానిని నూతన నరసింహస్వామి ఆలయమంటారు. విశేషమే మిటంటే పాతనరసింహస్వామికీ, కొత్త నరసింహస్వామికీ పార్శ్వంలో లక్ష్మీవిగ్రహాలు ఉన్నాయి. అంటే ఇక్కడ యోగ, ఉగ్ర నరసింహస్వాములిద్దరూ లక్ష్మీ సహితులు.

ఇక్కడ నూతనంగా వెలసిన వేంకటేశ్వరస్వామి గుడికి ఎదురుగా మరొక మహద్వార గోపురం ఉంది.

గౌతమేశ్వరస్వామి ఆలయం ఇక్కడ ఇంకొక ప్రధానమైన గుడి. గోదావరిని తీసుకొని వస్తున్న గౌతముడు ఈ ఆలయంలో లింగాన్ని ప్రతిష్ఠించాడని చెపుతారు.




ధర్మపురి - లక్ష్మీనరసింహస్వామి

ధర్మపురిలో దత్తాత్రేయుని ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, రామాలయం కూడా ఉన్నాయి.

నరసింహస్వామి కళ్యాణం ఫాల్గుణ మాసంలో జరుపుతారు.

ధర్మపురిలో వేదపారశాల, సంస్కృత కళాశాల ఉన్నాయి. అనేక శతాబ్దాలుగా ఈ చిన్న మారుమూల గ్రామం వేద సంస్కృతిని సంరక్షించింది.

(ధర్మపురిలో శేషప్పకవి-శేషాచల దాసు అనే పేరు కూడా ఉంది- మూడు శతకాలను రచించాడు. నరసింహుని గుణగానం చేసే ఛందోబద్ధమైన తెలుగు రచనలు ఇవి - భక్తి తత్త్వంతో జీవుని దైన్యతను స్పష్టంగా అభివ్యక్తీకరించి హృదయానికి దగ్గర అయ్యే శతకాలు 1. శ్రీ నరహరి శతకం 96 సీస పద్యాలు. మకుటం - 'చక్రధర - ధర్మపురి ధామ ॥



ధర్మపురి - ఆలయప్పుకరిణి

సార్వభౌమ నరహరి భక్త జనకల్ప నాగ తల్ప'

2 శ్రీ నృకేసరి శతకం- 118ఉత్పలచంపకములతో ఉన్న పద్యమాల

3 శ్రీ నరసింహ శతకం ఇది శేషప్ప కవి శతకంగా ప్రసిద్ధమైనది తెలుగు శతక సాహిత్యంలో పేరెన్ని గన్నది 'భూషణ వికాస ధర్మపురి నివాస దుష్ట సంహార నరసింహ దురిత దూర' అనే మకుటంగల 116సీసములు )

**మంథని గౌతమేశ్వరస్వామి**

మంధని కరింనగర్ జిల్లాలో గోదావరి తీరాన ఉంది ఇది హైదరాబాదుకు 226 కి మీ దూరంలో ఉంది బస్సుసౌకర్యం ఉంది పురాణాల్లో మంధనిని మంత్ర కూటమన్నారు గోదావరి నదిని తెచ్చిన గౌతమముని ఇక్కడే తపస్సు చేశాడంటారు

మంధనికి ఉత్తరాన గోదావరి, దక్షిణాన బొక్కలవాగు, తూర్పున అడవి, పడమట రావిచెరువు ఉన్నాయి ఇక్కడ కాక తీయుల నాటివి, అంతకంటే పురాతనమైన దేవాలయాలు ఉన్నాయి చరిత్రకారులు రాజేంద్ర చోళుడి (క్రీ శ 1012-1044) కాలం నుంచీ మంధనికి చరిత్ర ఉందంటారు ఆదిశంకరులీ ప్రదేశాన్ని దర్శించారని కొందరి అభిప్రాయం దక్షిణ భారతంలో మంత్రకూటం చిరకాలంగా శివాలయాలకు, వేదా ధ్యయననానికి ప్రసిద్ధిచెందింది

త్రిభువన మల్లుడి సామంతుడు గుండరాజు ఈ ప్రాంతాన్ని క్రీ శ 12వ శతాబ్దంలో పాలించేవాడు కాకతీయ రెండవ ప్రోలరాజు (క్రీ శ 1110-1158) అతన్ని ఓడించి అవ మానించాడట పదహారవ శతాబ్దంలో కాశె సర్వప్ప వ్రాసిన సిద్ధేశ్వర చరిత్ర, కిందరపురరాజు సోమదేవుని పశువులు మంత్రకూటం నుంచి భద్రాచలందాకా మేసేవని చెపుతుంది రాణీ రుద్రమ్మ (క్రీ శ 1262-1296) మంత్రకూటం దగ్గర గోదావరిదాటి సోమదేవుని సేనలను తరిమి ఓడించిందంటారు.

మంథనిలో తమ్మిచెరువు వద్ద దొరికిన క్రీ శ 1199నాటి ఒక శాసనంలో బ్రాహ్మణులకు ఇచ్చిన ఇళ్ళస్థలాల గురించి, గోపీజన వల్లభునికిచ్చిన తోట గురించి ఉంది కాకతీయ ప్రతాపరుద్రుని గురువు మల్లికార్జున సూరి ర్థయాత్రలు సి నప్పుడు, ఆయన భార్య గయలో వ్రాయించిన ఒక శాసనంలో గోపీజనవల్లభాయ నమః అని ఉందని పురాతత్వ శాస్త్రవేత్త డి సి సర్కార్ తెలిపారు

కాకతీయ గణపతిదేవుని సోదరి కుందమాంబిక గణపతిదేవుని గురువు విశ్వేశ్వర శివుడు గూడ మంధనిలో ఆలయాలు నిర్మించారు కాకతీయ రుద్రదేవుడి మంత్రి గంగాధరుడు ఇక్కడ త్రినేత్రుడికి గుడి కట్టించాడని క్రీ శ 1171 నాగనూరు శాసనం చెపుతుంది

మంధని పరిసర ప్రాంతాల్లో పూజకు నోచుకోని శివలింగాలు, హనుమంతుని విగ్రహాలు అనేకం కనిపిస్తాయి సమీపంలో గోదావరి మధ్య కోటిలింగాల దిబ్బమీద 22 శివ లింగాలతో కూర్చిన శివలింగం, 22 నందులతో కూర్చిన నంది విగ్రహం ఉన్నాయి మంధనిలో రావి చెరువు గట్టున లక్ష్మీనా రాయణుడి గుడి, శీలేశ్వరుడి గుడి, సిద్ధేశ్వరుడి గుడి, మహా లక్ష్మి గుడి, హనుమంతుడి గుడి, పోచమ్మ గుడి ఉన్నాయి తమ్మి చెరువుకట్ట దగ్గర ఓంకారేశ్వరుడి గుడి, హనుమంతుడి గుడి, దత్తాత్రాయుడి గుడి, విఘ్నేశ్వరుడి గుడి ఉన్నాయి

గోదావరి గట్టున గౌతమేశ్వర ఆలయం ఇక్కడ ప్రధాన దేవాలయం ఇది కాకతీయుల కాలంలో నిర్మించిన మందిరం ఇంకా గోదావరి ఒడ్డున సరస్వతి మందిరం, రామాలయం ఉన్నాయి


మంధనిది అనేక శతాబ్దాల చరిత్ర గోదావరిని తెచ్చిన గౌతముని ఆశ్రమస్థానమిది కాకతీయుల శిల్పనైపుణ్యాన్ని తెలిపే అనేక కట్టడాలు, కళా ఖండాలు ఇక్కడ కనిపిస్తాయి గౌతముని స్మరించటానికీ, తమ చరిత్ర సంస్కృతీ తెలుసుకో వటానికి, ప్రతీ తెలుగువాడూ దర్శించవలసిన క్షేత్రం మంధని

**కాళేశ్వర, ముకేశ్వరులు**

కాళేశ్వరం, కరీంనగర్ జిల్లాలో మంధనికి 65 కి మీ దూరంలో ఉంది ఇక్కడకు కరీంనగర్ 130 కి మీ కరీంనగర్ నుంచి కాళేశ్వరానికి బస్సులు మంధని మీదుగా పోతాయి

త్రిలింగదేశాన్ని నిర్దేశించిన మూడు లింగాల్లో కాళేశ్వర మొకటి. కాళేశ్వరం వద్ద మూడు రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలు కలుస్తాయి ఇది గోదావరి, ప్రాణహిత నదుల సంగమప్రదేశం

కాళేశ్వరంలో, గోదావరి తీరంలో, రెండవ ప్రోలరాజు (క్రీ శ. 1110-1158) గురువు, శివాగమపండితుడు రామేశ్వర దీక్షితుడు నివసించాడంటారు. కాళేశ్వరంలో ఆలయం అతని కాలంలో నిర్మించారని ఒక అభిప్రాయం ఉంది. రుద్రదేవుడి మంత్రి, పల్నినాటి ముఖ్యపట్టణం నాగనూరు శాసకుడు



కాళేశ్వర ముక్తేశ్వర లింగములు

గంగాధరుడు కాళేశ్వరంలో ఆలయం నిర్మించాడని క్రీ శ 1171 నాటి శాసనం తెలుపుతోంది


హనుమకొండలో దొరికిన ఇంకొక శాసనంలో గంగాధరుడు గోదావరి, ప్రాణహితల సంగమప్రదేశంలో మురారి, శంకరుల మూర్తులను ప్రతిష్ఠించాడని ఉంది గణపతి దేవుడి గురువు విశ్వేశ్వర శివుడిక్కడ గోళకీమఠం నిర్మించాడట గణపతిదేవుని సోదరి కుందమాంబిక, ఇక్కడ అర్ధనారీశ్వర మందిరం కట్టిందని క్రీ శ 1219 నాటి శాసనం తెలుపుతోంది ఇక్కడ విజయనగర 2వ హరిహరరాయలు కుమారుడు తులాపురుషదానం చేశాడని క్రీ శ 1397 నాటి శాసనం తెలుపుతోంది అంత చరిత్రగల కాళేశ్వరంలో చాలా ఆలయాలు ఢిల్లీ సుల్తానుల దండయాత్రలలో శిథిలమయ్యాయి

ప్రస్తుతం కాళేశ్వరంలో ఉన్న ఆలయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరిగి నిర్మించిన ఆలయం పురాతన ఆలయంలో ఉన్నఅన్నపూర్ణ విగ్రహం, చతుర్ముఖ లింగం, సరస్వతి విగ్రహం, మత్స్యావతార శిల్పం విడిగా ఉన్నాయి ఇక్కడ ధ్యాన ముద్రలో ఉన్న జైన విగ్రహం గూడా ఉంది

కాళేశ్వరాలయంలో కాళేశ్వర, ముక్తేశ్వరలింగాలు, రెండూ ఒకే పానవట్టం మీదుంటాయి. ఇందులో ఒక లింగం పైన రెండు రంధ్రాలు ఉన్నాయని అవి ఎప్పుడూ నిండవని అంటారు వాటిలో పోసిన నీరు, పాలు గోదావరిలో కలుస్తాయని అంటారు

అడవుల మధ్యనున్న కాళేశ్వరం నేడు ఎక్కువగా యాత్రికుల్ని ఆకర్షించటంలేదు దీని ప్రాముఖ్యాన్ని వివరించవలసిన బాధ్యత తెలుగువారందరిది

ఉత్తర తెలంగాణా గోదావరి తీరంలో వెలికిరాని స్థూపాలు, కట్టడాలు, ఆలయాలు, జైనమందిరాలు ఎన్నో ఉన్నాయి ఈ భూమిలో దాగియున్న చరిత్రకు గోదావరి సాక్షి చరిత్ర చదవాలంటే సంస్కృతి పట్ల అభిమానం కావాలి




కాళేశ్వరం - కాళేశ్వరాలయం

# భద్రాచలం

-డా॥ జి.ఎస్. మోహన్

రాజమండ్రి నుండి గోదావరి మీదుగా 160 కి.మీ. దూరంలో ఖమ్మం జిల్లాలో భద్రాచల క్షేత్రం ఉంది. హైదరాబాదుకు 320 కి.మీ. వరంగల్లుకు 235 కి.మీ. కొత్తగూడెంకు 44 కి.మీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రం ఇక్కడి గోదావరి గట్టుమీద భద్రగిరి కొండమీద ఉంది. ఇక్కడి రాములవారి ఆలయం ప్రసిద్ధ దక్షిణ భారత పుణ్యక్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. శ్రీరాములవారి విగ్రహం సనాతనమైందనీ, ఈ దైవప్రతిమ స్వయంభువు అనీ ప్రజల విశ్వాసం.

భద్రగిరి లేదా భద్రాచలం అన్నపేరు ఎందుకు వచ్చిందో చూద్దాం. సీతమ్మ తల్లిని రావణుడు అపహరించుకు పోయిన సమయంలో శ్రీరామచంద్రుడు భద్రాచలంలోనే ఉన్నాడు. భద్రుడనే ఋషి తపస్సుకు మెచ్చి శ్రీరాముడే స్వయంగా అతనికి దర్శనం, మోక్షం ఇచ్చాడనీ, భద్రుడు తపస్సు చేసిన కొండ కావడంవల్ల అది భద్రగిరి లేదా భద్రాచలం అయిందనీ అంటారు.



గోదావరీ నదీ తీరంలో కుడివైపున్న గుట్టమీద 40 మెట్ల ఎత్తులో శ్రీరాములవారి ఆలయం నిర్మించబడింది. ఎత్తైన గోపురం ఆలయానికి నిండుదనాన్నిస్తుంది. ఇక్కడి గోదావరి తూర్పుగా ప్రవహిస్తూ ఈ క్షేత్రానికి ప్రదక్షిణం చేస్తున్నట్లుంటుంది. పోకాల దమ్మక్క అనే వనితకు శ్రీరామచంద్రుడు కలలో కన్పించి భద్రగిరిమీద సీతారామ లక్ష్మణుల విగ్రహాలు ఉన్నాయని చెప్పాడట. ఆమె వెళ్ళి చూస్తే విగ్రహాలు కన్పించడం, వాటికి ఆమె ఒక చిన్న మండపం కట్టించడం వెంటవెంటనే జరిగిపోయాయి. అలా ఆ మండపం ప్రస్తుతం ఉన్న దేవాలయానికి మూలమని అంటారు.

దేవాలయం ప్రధానప్రవేశ ద్వారంమీద ఉన్నతమైన గోపురం ఉంది. ఈ ద్వారం లోపలి ప్రాకారానికి దారి తీస్తుంది. గర్భగృహంలోని విగ్రహాలు 3 అడుగుల ఎత్తుంటాయి. రాములవారు పద్మాసన భంగిమలో ఉండి చతుర్భుజాలను కలిగి ఉన్నాడు. ముందరి రెండు చేతుల్లో విల్లంమ్ములూ, వెనుక రెండు చేతుల్లో శంఖచక్రాలను కలిగి ఉన్నాడు. సాధారణంగా శ్రీరాములవారి విగ్రహం త్రిభంగ లేదా సమభంగ భంగిమలో ఉంటుంది. శ్రీరామచంద్రుడికి ఎడమప్రక్కన సీతమ్మ తొడమీద కూర్చొని వుంది. అమ్మవారికి ఎడమ ప్రక్కగా లక్ష్మణస్వామి ఉన్నాడు.

గర్భగృహం మీదున్న విమానం గ్రానైటు శిలతో తయారు చేయబడింది. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే గర్భాలయ విమాన శిఖరం 30 టన్నుల బరువు కలిగిన ఒకేఒక గ్రానైటు శిలతో చేయబడి ఉండటం. గోదావరిలో రామదాసు తెచ్చిన 'సుదర్శన చక్రం' ఈ శిఖరాన్ని అలంకరించిందని అంటారు. విష్ణు, గరుడ, సింహ, సోమ, స్కంధ, దక్షిణామూర్తుల సుందర శిలా రూపాలతో విమానం బాహ్యముఖం కూడుకొని ఉంది. ముఖమంటప ప్రవేశద్వారానికి ఇరువైపుల జయ విజయులనే ద్వారపాలకులు అశ్వారూఢులై ఉన్నారు. ఇక్కడి కల్యాణ మంటపం ఉత్తమ కళాఖండానికి చెందింది. ఆలయం వెనుక భద్రుని కోవెల ఉంది. భక్తులు రామకోటి వ్రాసి తెచ్చే కాగితాలను గ్రహించే గది ఒకటి వుంది.

17వ శతాబ్దంలో రామదాసు అనే ప్రతినామం ఉన్న కంచర్ల గోపన్న ఈ ఆలయ పునరుద్ధరణ కోసం ఆరులక్షల రూపాయలు ఖర్చుపెట్టాడు. రామదాసు అక్కన్న సోదరి తనయుడు. అక్కన్న ఖుతుబ్‌షాహి రాజులలో చివరివాడైన అబ్దుల్ హస్సన్ తానీషా (1654-1687)కు ప్రధానమంత్రిగా ఉండేవాడు. ఈ ప్రాంతం ఈయన ఆధీనంలో ఉండేది; గోల్కొండ ముఖ్యపట్టణంగా ఉండేది. గోపన్న తహసీల్దారుగా నియమింపబడ్డాడు. ఆలయ పునరుద్ధరణ కోసం ఖర్చుచేసిన డబ్బు రెవిన్యూద్వారా సేకరించబడినట్టిది. ఆ డబ్బును ప్రభుత్వ ఖజానాలో జమకట్టడానికి బదులు గోపన్న దాన్ని వినియోగించి నిర్బంధించబడ్డాడు. (గోల్కొండ కోటలో ఇప్పటికీ గోపన్న బందిఖానాను చూడొచ్చు). ఈ పరిస్థితిలో శ్రీరామచంద్రుడే తానీషాకు కలలో కన్పించి గోపన్న డబ్బు కట్టినట్టుగా 'రామమాడ' లేదా 'రామటెంకి' అనే బంగారునాణేల రూపంలో రసీదును చూపించాడట. ఉదయమే రాజు స్వయంగా గోపన్న బందిఖానాకు వచ్చి ఆయనను విడిపించారట. ఈ అదు తానికి

ఆశ్చర్యపడ్డ సుల్తాను గోపన్నకు లెక్కలేనన్ని బహుమతులనిచ్చి సత్కరించి, మళ్ళీ తహసీల్దారుగా నియమించాడట. అంతేకాక ప్రతి సంవత్సరం ఆలయ నిర్వహణకు నిధులను సమ కూర్చేవాడట. ఇది నిజాం ప్రభుత్వ హాయంలో కూడా కొనసాగింది. రాముడి మీదున్న భక్తే గోపన్నను రామదాసుగా మార్చింది. శ్రీరాముడిని స్తుతిస్తూ రామదాసు కొన్ని వందల పాటలను కట్టాడు. అందులో ముఖ్యంగా ''దాశరథీ శతకం'' పేర్కొనదగింది.


రామదాసు సీతారామ చంద్రులకు కానుకగా ఇచ్చిన కలికితురాయి, పచ్చల పతకం, చింతాకు పతకం, రత్నా భరణాలు నేటికీ ఆలయంలో భద్రపరుచబడి ఉన్నాయి. రామదాసు జన్మస్థలమని చెప్పబడే నేలకొండపల్లె ఖమ్మం జిల్లాలోనే ఉంది. రామదాసు కాలంలోనే ముస్లిం భక్తుడైన కబీరుదాసు శ్రీరాములవారి దర్శనం చేసుకొన్నాడు. రామదాసు కబీరు ఉపదేశాన్ని పొందాడట.

భద్రాచలానికి 35 కి.మీ. దూరంలో ఉన్న వెంకటాపురం రోడ్డుమీదున్న పర్ణశాలలోనే శ్రీరామచంద్రుడు సీతావియోగం పొందాడట. సీత తన చీరలను ఆరబెట్టుకొన్న ప్రదేశం పసుపు, కుంకుమ రంగుల్లో ఉన్న బండలు ఉన్నాయి. నాటి సీతా రామచంద్రుల పర్ణశాల నేడు చిన్న ఆలయంగా రూపొందింది. ఇక్కడే వెనుక భాగంలో శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇక్కడికి 6 కి.మీ. దూరంలో ఉన్న ఉష్ణగుండం నుంచి సీతమ్మవారి స్నానానికి లక్ష్మణస్వామి వేడినీళ్ళు తెచ్చేవాడట. యాత్రికులు ఈ రెండు ప్రదేశాలను దర్శించాల్సి ఉంటుంది.

పర్ణశాలకు వెళ్ళే దార్లోనే 3 కి.మీ. దూరంలో 'మోతిగడ్డ' ఉంది. ఇక్కడ వీరభద్రస్వామి ఆలయం ఉంది. శివరాత్రికి ఇక్కడ ఉత్సవం జరుగుతుంది.

భద్రాచలంలోనే మరికొన్ని దేవాలయాలు ఉన్నాయి. అవి గోదావరి సమీపంలో చిన్న గుట్ట మీదున్న నరసింహ స్వామి ఆలయం, యోగానంద నరసింహస్వామి ఆలయం, భద్రాచల పట్టణ మధ్య భాగంలో ఉన్న గోవిందరాజులు స్వామి ఆలయం, మరొక గుట్టమీదున్న రంగనాయకులు స్వామి ఆలయం, పేర్కొనదగ్గవి. రంగనాయకులు స్వామి ఆలయ సమీపంలో నిర్మించబడ్డ రామదాసు ధ్యానమందిరం, రామాలయానికి ఎదురుగా ఉన్న శివాలయం, రంగ నాయకులు గుట్టమీదున్న ఈశ్వరమ్మ మందిరం, హరనాథ దేవాలయం చూడదగ్గవి.

భద్రాచల క్షేత్రంలో చైత్రమాసంలో శ్రీరామనవమి ఉత్సవాలు మహా వైభవంగా జరుగుతాయి. లోకకల్యాణార్థమై చైత్రశుద్ధ నవమినాడు శ్రీరామచంద్రమూర్తి అవతరించాడు. సీతారాముల వివాహాన్ని ప్రతి ఏటా ఇక్కడ జరిపిస్తారు. రామదాసు చేయించిన మాంగల్యంతోనే సీతమ్మ వారికి మాంగల్యధారణ జరిపించడం ఒక విశేషం. తానీషా నెలకొల్పిన సంప్రదాయాన్ని తు.చ. తప్పకుండా మన రాష్ట్రప్రభుత్వం



ముఖ్యమంత్రి ద్వారా స్వయంగా అందింపబడే మేలైన ముత్యాల తోనే సీతమ్మ పెళ్ళి తలంబ్రాల ఉత్సవం జరిపిస్తుంది. ఈ ఉత్సవాన్ని ఆలిండియా రేడియో, టి.వి.లలో చేస్తారు. కల్యాణోత్సవం కోసమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 4 లక్షల వ్యయంతో కల్యాణ మంటపం నిర్మించింది. ఈ కల్యాణోత్సవాన్ని తిలకించడానికి దాదాపు 3 లక్షల మంది ప్రజలు గుమిగూడుతారు. రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 500 ప్రత్యేక బస్సులు నడుపబడుతాయి.

పది రోజుల పాటు జరిగే ''వైకుంఠ ఏకాదశి''కి కొన్ని వేలమంది భక్తులు మహా విష్ణువు దశావతారాలను కళ్ళారా చూడడానికి వైకుంఠ ఏకాదశికి ముందు జరిగే తెప్పోత్సవాన్ని తిలకించడానికి, వైకుంఠ ఏకాదశినాటి వైకుంఠ దర్శనం చేసుకోవడానికి ఇక్కడికి వచ్చి పునీతులవుతారు. ఇక్కడ పాంచరాత్రాగమాన్ని బట్టి ఆరాధనలు జరుగుతాయి.

ఇక్కడ ప్రవహించే గోదావరి మాత నయనానందకరంగా, కన్నులపండువగా ఉంటుంది. భారతదేశంలో అనేకానేకంగా శ్రీరాములవారి ఆలయాలు ఉన్నా భద్రాచలంలోని ఈ ఆలయం ఒక ప్రత్యేకతను సంతరించుకొంది. ఆలయంలోని శ్రీ సీతారామ లక్ష్మణులమూర్తులు సుందర శిల్ప కళావిన్నాణానికి నిదర్శనం. భద్రాచలంలో దేవస్థానంవారి ధర్మశాలలు, కాటేజీలు, తిరుమల తిరుపతి దేవస్థానంవారి సత్రం ఉన్నాయి. తి.తి.దే. సత్రంలోని తి.తి.దే.వారి సమాచార కేంద్రం, శ్రీరాములవారి ఆలయంలోని దేవస్థానంవారి సమాచార కేంద్రం యాత్రికులకు సమాచార కేంద్రాలుగా ఉన్నాయి. వసతికి ముందుగా గదులు రిజర్వు చేసుకోవాలనుకునే వారు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం, భద్రాచలం వారి పేరు మీద మనియార్డర్ పంపించాలి.

చరితం రఘునాథస్య, శతకోటి ప్రవిస్తరమ్
ఏకైకమక్షరమ్‌పోక్తం, మహాపాతక నాశనమ్.

# రాజమండ్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

-యాతగిరి శ్రీరామ నరసింహారావు


రాజమహేంద్రిలో అత్యంత ప్రాచీనమైన దేవాలయం శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి దేవాలయం. ఇది గోదావరి తీరంలోని కంభంవారి సత్రం సమీపంలో వుంది. చిన్నగుడి. ఇది 11వ శతాబ్దికి చెందిన చాళుక్యుల నాటిదని, ఇసుకరాతితో నిర్మితమైనదని చరిత్రకారులు శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు, శ్రీమల్లంపల్లి సోమశేఖర శర్మ, శ్రీమారేమండ రామారావు, శ్రీరాళ్ళబండి సుబ్బారావు చెప్పారు. ఒకప్పుడు యీ దేవాలయం కోట ప్రాంతంలో (గోదావరి రైల్వేస్టేషను) ఉండేది. గర్భగుడి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి విగ్రహం, శ్రీ గణపతి విగ్రహం మాత్రం లభించాయి. రెడ్డిరాజుల కాలంలో 'తల్లవరము' అను గ్రామాన్ని ఈ దేవాలయానికి దానం చేసినట్లు శాసనమున్నట్లు చరిత్ర చెబుతోంది ఐతే ఆ శిలా లేదా తామ్రశాసనం మనకు లభించుట లేదు ఇదే వేదాద్రి నరసింహస్వామి ఆలయమని భావరాజు వారు ఆంధ్రా హిస్టారికల్ రిసెర్చి ఇన్స్టిట్యూట్ వారి పత్రికలో పేర్కొన్నారు.



1788లో ప్రస్తుతమున్న స్థలానికి యీ ఆలయం తీసుకుని రాబడింది. నాకు పైన 5వతరం వారైన యాతగిరి పూర్ణసోమయాజులు గారికి వచ్చిన కల నాధారంగా కోట ప్రాంతానికి కొంతమందిని వెంటబెట్టుకొని వెళ్ళి, శిథిలము అయిన ఆ దేవాలయమునకున్న రాళ్ళను నెంబర్లు వేయించి, విగ్రహాలతో సహ ప్రస్తుతమున్న స్థలానికి ఎటువంటి ఖర్చు లేకుండా తీసుకుని వచ్చారు. నాటి నుండి యాతగిరి వంశస్థులే యీ దేవాలయానికి వంశపారపర్య ధర్మకర్త, అర్చకులుగా వున్నారు. వైశాఖ శుద్ధ చతుర్దశినాడు నృసింహజయంతినాడు విశేషపూజలు, రాత్రి కల్యాణ మహోత్సవం జరుగుతున్నది.

రాజమహేంద్రిలో ప్రసిద్ధమైన దేవాలయాలు ఒకప్పుడు ప్రస్తుతమున్న స్థలాల్లో లేవు కాని విగ్రహాలు, శివలింగాలు పురాతనమైనవే - మార్కండేయేశ్వర స్వామివారి దేవాలయం ఒకప్పుడు సమీపంలోని చందాసత్రం వీధిలో ప్రస్తుతం మశీదున్న స్థలంలో వుండేది. అక్కడి నుండి శివలింగాన్ని తీసుకునివచ్చి ప్రస్తుతమున్న స్థలంలో దేవాలయాన్ని నిర్మించి, ఆ శివలింగాన్ని పునః ప్రతిష్టింపజేశారు. అలాగే క్షేత్ర పాలకుడు శ్రీ వేణుగోపాలస్వామివారి దేవాలయం మెయిన్ రోడ్డులోని పెద్ద మశీదు స్థలంలో వుండేది. 1323లో అక్కడ మశీదు ఏర్పడింది. ఆ విగ్రహం ప్రస్తుతమున్న స్థలంలోని అర్చకులు తీసుకుని వచ్చారు. కనుక దేవాలయం విగ్రహం కూడా పురాతనమైనదే. శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి దేవాలయం ప్రైవేట్ సంస్థ యాతగిరి వంశస్థులే ధూప, దీపనైవేద్యాలను, కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.

మధ్వమతానికి చెందిన శ్రీ ఉత్తరాదిమఠం యిక్కడే వుంది. విష్ణునామములలో 'ఉత్తర' అనేది ఒక నామం. ఆ పేరుతోనే ఈ మఠం ఏర్పడింది. పీఠాధిపతులు రెండు మూడు సంవత్సరాలకోసారి విజయం చేస్తొంటారు. ఇక్కడ రెండు మూల బృందావనాలున్నాయి, మధ్వమతానికి చెందిన రెండు మూల బృందావనాలు ఆంధ్రప్రదేశ్‌లో మరెక్కడా లేవు. కర్నాటక, మహారాష్ట్రల నుండి కూడా మధ్వమతస్థులు వస్తూంటారు.



జీవితంలో మధ్వుడు ఒకసారైనా యీ స్థలానికి రావడమన్నది ఒక ఆచారంగా వుంది

1703 లో శ్రీ శ్రీ సత్యాధీశ స్వాములవారి బృందావనం ఏర్పడింది ప్రతీ సంవత్సరము ఆషాఢ బహుళ అమావాస్యనాడు ఆరాధనోత్సవం జరుగుతుంది గోదావరి పుష్కరాల ప్రారంభం జూలై 30 , 29 న స్వాములవారి ఆరాధన ఈ సంవత్సరము త్రిశతి ఉత్సవాలు జరగాలి. జూలై 28న పర్వారాధన 29న ఆరాధన, 30న ఉత్తరారాధన జరుగుతాయి ఈ స్వాములవారి పూర్వాశ్రమ స్థానం చిత్తూరు జిల్లా బోయపల్లె, దీనినే యరంపల్లె అంటారు. చిత్తూరు - కడప బస్ రూటులో వుంది. వీరి పూర్వాశ్రమంలో మేనల్లుడు యాతగిరి వేంకటాచార్యులు వారిది కర్ణాటకలోని వాడి సమీపంలోని యాదగిరి. ఆ ఊళ్ళో కొండ మీద శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయమున్నది యాతగిరి వారి ఇలవేల్పు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి. స్వాముల వారు వారి పూర్వాశ్రమంలోని మేనల్లుడు వేంకటాచార్యులు 1703 లో కాలినడకన కాశీయాత్ర ముగించుకుని, తిరుగు ప్రయాణంలో పెద్దాపురం రాగా, తన అవసానదశ వచ్చిందని, మరణానంతరం గోదావరి తీరమైన రాజమహేంద్రికి తీసుకు పోయి అక్కడే బృందావనం చేయమని అర్పించుకోమని ఆ స్వాములవారు వేంకటాచార్యులకు అజ్ఞ నివ్వగా, పల్లకిలో ఆ భౌతిక కాయాన్ని రాజమహేంద్రికి తీసుకుని వచ్చి, ప్రస్తుతం దావరి రం ని వాటర్ వర్క్స్ ఎదురుగానున్న విజయ నగరం మహారాజుగారి స్థలంలో (ప్రస్తుతం రామకృష్ణ సేవా సమితి) నిల్పి, కంబం వారి సత్రం సమీపంలోని ప్రస్తుత మఠం స్థలాన్ని 4 వరహాలకు (16 రూపాయలట) కొని అక్కడ బృందావనం చేసి నిత్యం పూజలు చేశారు ఇది అనువంశికంగా జరుగుతోంది నాది ఏడో తరం దీనికి సంబంధించిన శిలా శాసనం మఠంలో కలదు

మరొక మూల బృందావనం శ్రీ శ్రీ సత్యజ్ఞాన తీర్థుల వారిది 1912లో వారిక్కడ సిద్ధిపొందారు వారి ఆరాధనలు మాఘమాసంలో జరుగుతాయి హాస్పేటకు సమీపంలోని కిహ్నాళ్ వారి స్వస్థలం పూర్వాశ్రమంలోని వారి వంశీకులు ఆరాధనలకు వస్తూంటారు

ఈ ఉత్తరాది మఠంలోనూ, అనుకుని వున్న కంభంవారి సత్రంలోను దశాబ్దానికోపర్యాయం అఖిల భారత ద్వైత సిద్ధాంత మహాసభలు, అప్పుడప్పుడు క్రింది స్థాయిలో సభలు జరుగుతుంటాయి వివాహాలు, ఉపనయనాలు, వ్రతాలు, హోమాలు, భజనలు, పురాణ కాలక్షేపాలు జరుగు తూంటాయి సంధ్యావందనం, దేవతార్చనాదులపై యువకులకు శిక్షణ యివ్వబడుతున్నది

ఉత్తరాది మఠంగా, నరసింహస్వామి గుడిగా ప్రసిద్ధి చెందిన యీ ఆధ్యాత్మిక కేంద్రానికి యాతగిరివారి వంశస్థులే వంశపారపర్య ధర్మకర్త అర్చకులుగా ఉన్నారు నేను ఉత్తరాది మఠాధికారిగా వున్నాను



# రాజమహేంద్రవరం పరిసర ఆలయాలు

డా॥ అల్లాడ సంధ్య

రాజమండ్రి తూర్పుగోదావరి జిల్లాలో ముఖ్యనగరం రాజమహేంద్రవరమని కూడా పేరు చరిత్ర సృష్టించిన, నడిపించిన, నడిపిస్తూ ఉన్న ఊరు గోదావరినది అన్ని పెద్దనదులలాగ పలు ఉపనదులతో కలసి పుష్టిని పొందుతుంది సామాన్యంగా ఉపనదులను గుర్తించటం కష్టం అయితే అసంఖ్యాకమైన ఇతర పేరులేని పాయలు కూడా గోదావరిలో కలుస్తుంది రాజమండ్రి తీరాన్నీ గోదావరి చేరకముందే ఉపనదులన్నీ గోదావరిని కలుస్తాయి రాజమండ్రిలోని ధవళగిరి (ధవళేశ్వరం) దగ్గర గోదావరి ఏడు పాయలుగా విడిపోతుందని అంటారు విడిపోయి సముద్రంలో కలుస్తుంది అంటే రాజమండ్రి గట్టున గోదావరి సంపూర్ణంగా అఖండంగా వుంటుందని చెప్పేందుకు ఆస్కారముంది. సర్వదిక్కులనుంచి వచ్చిన సమగ్రజలం రాజమండ్రి ఒడ్డున ప్రవహించి ముందుకు పోవలసిందే అలాంటప్పుడు ఇక్కడి నీళ్ల నిలువ, నదివైశాల్యం ఎక్కువనే చెప్పాలి -దానికి తోడు తరతరాల సాంఘిక రాజకీయ జీవన స్రవంతి, దానితో రాజ్యాలు వికసించి, నశించి నగరాలు కొత్త శోభను సంతరించుకొని దినదినాభివృద్ధి చెందాయి ఇక్కడి ధర్మాలు, ధర్మాలను అంటి పెట్టుకొని ఆలయాలు అంతస్సత్త్వంలో ప్రధానమైతేను బహిరావరణంలో కొత్త కొత్త రంగులు మారుతూ నిత్య నూతనంగా కనబడటం సాధారణము అటువంటప్పుడు మొత్తం రాజమండ్రి ప్రాచీనతమ వైభవాన్ని దర్శించడానికి మనకు చేయూత నిచ్చేవి అక్కడి ఆలయాలు మాత్రమే అని చెప్పాలి. ఆ దిశలో కొన్ని ఆలయాల పరిచయం ఇక్కడ ఇస్తున్నాం

## మార్కండేయ క్షేత్రం


గోదావరి గట్టున రాజమండ్రిలో శ్రీమార్కండేయేశ్వర స్వామి దేవాలయం ఉంది. ఈ క్షేత్రానికి పు రాణ చరిత్ర వుంది



మృకండుముని సంతానం కోసం గౌతమీ తీరంలో పరమేశ్వరుని ఆరాధించాడు. శివుని వరం వల్ల పుత్రుడు పుట్టాడు.



మార్కండేయుడికి యుక్త వయస్సు రాగానే మృత్యువు సంభవిస్తుందని చెప్పిన ఆకాశవాణి మాటలకు చింతించి తన ఆయుర్దాయం కోసం గౌతమీ తీర్థంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి ఉమామహేశ్వరులను ఆరాధించాడు



ఈశ్వర వరానుసారం అకాశవాణి మాటల ప్రకారం ప్రాణహరణకు యముడు వచ్చాడు. మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకుంటాడు. యముడు తన పాశాన్ని మార్కండేయుడి కంఠానికి తగిలించాడు. ఈశ్వరుడు ప్రత్యక్షమై తన శూలంతో యమధర్మరాజును కొట్టాడు. 'ఈ తీర్థంలో మునిగి నన్ను దర్శించినవారు, పాపాల నుండి విముక్తులై పునర్జన్మ రహితులౌతా'రని శివుడు మార్కండేయుడికి వరమిచ్చాడు. ఈ వరం వలన గౌతమీ తీరంలో స్నాన, జపదానాదులను చేసుకొనేవారు ఎక్కువయ్యారు.

భీమేశ్వర పురాణంలో-

కమలాచలాగ్ర మార్కండేయ శివ శిర
శ్శశిచంద్రికాధౌత సౌధ వీధి (భీ.పు. 1-43)

అని ప్రస్తావింపబడి వుంది.

కాశీఖండంలో - 'ఉండునేవట మార్కండేయ మునినాథ సజ్జలింగమనంగ శాసనుండు' అని ఈ మార్కండేయ దేవాలయ ప్రస్తావన ఉంది.


గోదావరి గట్టుపైన తిరుమల తిరుపతి దేవస్థానంవారు నిర్మించిన శ్రీ వేంకటేశ్వర పద్మావతి స్నాన ఘట్టానికి ఎదురుగా ఈ ఆలయం ఉన్నది. ఈ ఆలయానికి వెళ్ళాలంటే రోడ్డునుంచి లోపలి మెట్లు దిగి క్రిందికి దిగి వెళ్ళాలి. దిగినవెంటనే కుడివైపుకు మార్కండేయేశ్వరస్వామి దర్శనం చేసుకొన వచ్చును. ప్రక్కనే అమ్మవారిని కూడా దర్శించుకోవచ్చును. ఇక్కడ పలు దేవతల చిన్న చిన్న గుళ్ళు ఉన్నాయి. వేంకటేశ్వరస్వామి కూడా ప్రతిష్ఠింపబడి ఉన్నాడు. ఆలయంలో నల్లరాతి బసవన్న స్థిరమూర్తిగా ఉంటే లోహపు బసవన్న నిలిచి స్వామివారికి వాహనమైయ్యేందుకు సదా సిద్ధమనే భావాలు వెలిబుచ్చుతూ ఉండడం చూడవచ్చును. ఈ ఆలయంలో ఇంకో ప్రత్యేకత ఏమిటంటే గుడి మహద్వారం ప్రక్కనే అయ్యప్పస్వామి ఆలయాన్ని గూడ చూడవచ్చును.

చరిత్రలో చూస్తే కాటయ వేముని భార్య మల్లాంబిక మార్కండేయస్వామి కోసం కేసవరం గ్రామాన్ని సమర్పించింది. అతని తల్లి దేవాలయాన్ని పునర్నిర్మాణం గావించింది. ఆ ఆలయం నాశనం అయిపోగా కోటగుమ్మం దగ్గర మరల నిర్మించారు. అదికూడా కాలగర్భంలో కలసిపోయింది.

గుండు రాజనే ధనికుడు మార్కండేయేశ్వరుణ్ణి పార్వతీదేవిని పునఃప్రతిష్ఠించాడు. ఆ దేవాలయము కూడా శిథిలమైంది. 1949 ప్రాంతంలో రాజమహేంద్ర పురజనులు ఈ ఆలయాన్ని పునః ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి శ్రీ స్వామివారి కళ్యాణోత్సవం, రథోత్సవం, వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలు, అఖండ దీపారాధన. అయ్యప్పస్వామి వారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాయి.

**కోటిలింగాల**

గోదావరి వద్ద మార్కండేయ క్షేత్రం ప్రక్కన బ్రహ్మ యాగశాలను నిర్మించెను. యాగాన్ని నిర్వహించి



కోటిలింగాలను ప్రాణ ప్రతిష్ఠచేశాడు. కొంతకాలానికి కోటిలింగాల్లో ఒకటి తక్కువ కాగా మహర్షులు ఒక లింగాన్ని ప్రతిష్ఠించారు. ఆ లింగమే కోటిలింగేశ్వరుడు. ఇతడు శతకోటి ఫలాలను ప్రసాదించేవాడు, కాబట్టి దీనికి కోటిలింగ క్షేత్రమని పేరు వచ్చింది. ఇక్కడ కావించే స్నానజప ధ్యానాదులు అమోఘ ఫలప్రదాలు.

ఈ క్షేత్రానికి సంబంధించి మరో కథనం - త్రిపురాసురుడనే రాక్షసుణ్ణి, అతని అనుచరులు కోటిమందిని ఈశ్వరుడు, కుమారస్వామి కలిసి వధించిన తర్వాత బ్రహ్మవారిని కోటిలింగాలుగా మార్చి వేశారని ఇక్కడి ప్రజలు నమ్ముతారు. కోటిలింగాల స్వామిని పూజిస్తే ఒక కోటి శివలింగాలను పూజించిన ఫలితం వస్తుందని ప్రసిద్ధి. బ్రహ్మ విష్ణువు కలిసి నర్మదానది నుంచి బాణ లింగాన్ని తెచ్చారని, దానిని ప్రతిష్ఠించి కోటిలింగాలను చేసి యీ లింగానికి శ్రీ కోటిలింగేశ్వర స్వామి అని పేరు కూడా పెట్టారని చెబుతుంటారు. ఇక్కడ స్వామి రాతి శివలింగం రూపంలో పూజింపబడుతున్నాడు. నది నీరు లేనప్పుడు యీ కోటిలింగాలు కన్పిస్తాయని అంటారు. మహాశివరాత్రికి ఉత్సవం జరుగుతుంది.



### వేణుగోపాలస్వామి దేవాలయం

రాజమండ్రిలో గోదావరి తీరాన్ని ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయానికి అతి దగ్గరలో కంబంవారి సత్రము ఉంది. దాని ప్రక్కన వేణుగోపాలస్వామి దేవాలయం, నరసింహస్వామివారి ఆలయాలు ఉన్నాయి. రాజమహేంద్ర వరం క్షేత్ర పాలకుడు శ్రీ వేణుగోపాల స్వామి.

కృష్ణద్వైపాయనుడు పుట్టిన తక్షణమే తండ్రివద్ద అన్ని విద్యలు నేర్చుకొని వేదాసక్తుడై తండ్రికి దూరంగా వెళ్ళినప్పుడు పరాశరుడు పుత్రవిరహం వలన వైరాగ్యంలో పడ్డాడు. గోదావరి తీరాన తపస్సుకు దిగిన పరాశరునికి స్వామి గోపాలుడై కనబడి కొంచం ఊరట కలిగించాడు. పరాశరుడు ఆయనను ఇక్కడే ఉండమని కోరాడు. గోపాలుడు తన వేణువుతో గోవర్ధనంతో పాటు ఇక్కడే నిలిచాడు. పరాశరుడే కాకుండా వ్యాసుడు, వ్యాసపుత్ర శుకుడు, నారద సనకాదులు స్వామినిఆరాధించి తరించారు

చరిత్ర పుటలలో వేణుగోపాలస్వామి ఆలయం నాలుగైదుచోట్ల నాలుగైదు కాలాలలో కనబడుతుంది. ఒకే విగ్రహం స్థానాంతరం చెందుతూ ఆయా కాలాలలోని సామాజిక స్థితిగతులను తెలుపుతుందని చెప్పవచ్చును. మొట్టమొదట క్రీ.శ. 1390 సం॥లో వేణుగోపాలునకు అనవరత పురాన్ని కాటయవేమారెడ్డి సమర్పించాడు. ఈ ఆలయం ఆచూకీ లేకుండా పోయింది. ఆపై గోదావరి గట్టుపై వెంకటరాయనిం గారు కొత్తగా ఆలయ నిర్మాణాన్ని గావించి స్వామివారిని ప్రతిష్ఠించాడు.

ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ దశమినాడు కళ్యాణోత్సవం జరుగుతుంది. ఏకాదశినాడు రథోత్సవం. భీష్మేకాదశి మొదలు పూర్ణిమదాక సాగర సంగమ స్నానం (చక్రస్నానం) చేస్తారు. ఇక్కడి స్నాన జప దానాదులు సకల ఫలాలు కలిగిస్తాయి. రెడ్డిరాజుల కాలంలో ఆలయం పునర్నిర్మింప బడింది.

### లక్ష్మీజనార్ధనస్వామి - ధవళేశ్వరం

పంచగిరి దుర్గమని పేరుపొందిన రాజమహేంద్రవరంలో **ధవళగిరి ఒకటి. ఈ ధవళగిరే ధవళేశ్వరం. అఖండంగా వచ్చిన గోదావరి ఇక్కడ కశ్యప, అత్రి, గౌతమీ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ట అని ఏడు పాయలౌతుంది. సోమకాసురుడనే రాక్షసుణ్ణి వధించి మహావిష్ణువు తిరిగి తెచ్చిన నాలుగు వేదాలకు** జనార్ధనుడు ప్రతిరూపం. ఈ **ధవళగిరి మీదనే మహావిష్ణువు** కోసం బ్రహ్మ తపస్సు చేశాడు.

జనార్ధన స్వామి ఆలయాన్ని నారదుడు నిర్మించాడని అంటారు. గర్భగుడిలో జనార్ధన స్వామితో శ్రీదేవి, భూదేవి ఇరువైపుల ఉన్నారు. ఈ ధవళగిరికి ప్రక్కన ఒక గుహఉంది. **అందులో నారదుడు కొంతకాలం తపస్సు చేశాడనీ, అందువల్ల దానికి నారదగుహ అని పేరు వచ్చిందని అంటారు. ఇక్కడ చేసిన ధర్మకార్యాలకు ఇతోధికఫలం లభిస్తుందని నమ్మకం. ఆలయం** కొండపైన ఉన్నది. ఆలయానికి సుమారు 200మెట్లెక్కి వెళ్ళాలి. ఇక్కడ ఆలయ ప్రదక్షణమేకాక గిరిప్రదక్షణ కూడా చేస్తారు.



ఈ స్వామివారికి భీష్మ ఏకాదశికి కల్యాణ రథోత్సవాలు మహావైభవంగా జరుగుతాయి. ఇక్కడ శివుడి గుడి కూడా ఉన్నది. విభీషణునికై వెదకుతూ వచ్చిన శ్రీరామచంద్రుడు గౌతమీ స్నానం చేసి ఈశ్వరలింగాన్ని ప్రతిష్ఠించడం వలన రామలింగేశ్వరాలయం అయిందని అంటారు.


ఈ రెండు గుడులను ఒకవైపుకు వదలి కాటన్ దొరగారు బ్యారేజిని మరొక వైపుకు నిర్మించదలచినప్పుడు అది సఫలమైందని, ఆ మొదలు రెండు ఆలయాల మధ్య శివకేశవులను విడదీస్తూ బ్యారేజి నిర్మించే ప్రయత్నం విఫలమైందని చెబుతారు.


### అగస్త్యేశ్వరస్వా[illegible]

ఈ శివలింగాన్ని అగస్త్య మహర్షి పూజించడం వల్ల దీనిని శ్రీ అగస్త్యేశ్వరస్వామి అంటారు. సహజంగా ఏర్పడిన శివలింగాల్లో ఇది పెద్దది. దీనిని త్రేతాయుగంలో కూడా పూజించారు. అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన శ్రీ బాలా త్రిపురసుందరి దక్షిణాభి ముఖంగా ఉండడం ఒక ప్రత్యేకత.

### పట్టిసం - పట్టిసాచలక్షేత్రం

పట్టిసాద్రి సమంక్షేత్రం నాస్తి బ్రహ్మాండగోళకే
వీరభద్ర సమోదేవో న భూతో న భవిష్యతి





రాజమహేంద్రవరం దగ్గర పవిత్ర గోదావరీ నదీ మధ్యంలో దేవకూటాద్రి మీద వున్న ఈ పట్టసాచల క్షేత్రానికి పట్టసీమ, పట్టసాద్రి, పట్టసాచలం అనేవి నామాంతరాలు.


ఈ క్షేత్రం మనదేశంలోని పంచమహా శివక్షేత్రాలలో ఒకటి అని అంటారు. తక్కినవి కాశి, కేదారం, శ్రీకాళహస్తి, శ్రీశైలం అనేవి. పట్టసాచలంలో శివుడు మహాలింగాకారంలో సపరివారంగా భద్రకాళితో వేంచేసి యున్నాడు. ఇక్కడే శ్రీ - భూ - నీలా సమేతుడై మహావిష్ణువు భావనారాయణస్వామి అనే పేరుతో క్షేత్ర పాలకుడుగా వెలసి వున్నాడు. హరిహరులిద్దరు వెలసిన క్షేత్రం కనుక ప్రసిద్ధ క్షేత్రంగా ప్రఖ్యాతి చెందినది. ఈ క్షేత్రానికి వీరక్షేత్రం అని కూడా అంటారు.

మహాశివరాత్రినాడు యాత్రికులు దర్శించి తరిస్తారు. ఆనాడు వీరేశ్వరునికి అభిషేకార్చనలు జరుగుతాయి. కార్తిక మాసంలో ఉత్సవాలు జరుగుతాయి.

> శ్రీశైలం కాశికేదారం కాళహస్తిం చ పట్టసం
> పంచక్షేత్ర పరేన్నిత్యం మహాపాతక నాశనం.

గోదావరి నీళ్లతో నిండి ఉంటే ద్వీపం అయిన పట్టిసానికి వెళ్ళడం కష్టం. ప్రవాహం వచ్చి పాతవూరు పాడైపోగా కొత్తపట్టిసీమ ఒకటి తయారైంది. దూరం నుంచి ఆలయాన్ని చూపెట్టే విధంగా నదీ తీరాన ఎత్తైన ఆంజనేయస్వామి నిలిచి యున్నాడు. నావలో గోదావరిని దాటి లోపలకు వెళ్ళి ద్వీపంలో దిగి కొంత దూరం నడచి మెట్లు ఎక్కి శిఖరాగ్ర భాగాన్ని చేరుకోవాలి. జానపద నమ్మకాలు ఎక్కువైన ఈ స్థలానికి చాలమంది దూరప్రాంతాల నుంచి వస్తూంటారు. సుభాను సంవత్సర పుష్కరాలకై కొత్తముస్తాబుతో శోభిల్లుతుంది.

### కోటిపల్లి - సోమేశ్వరస్వామి ఆలయం



రామచంద్రాపురం తాలూకా కోటిపల్లిలో ఈ ఆలయం వుంది. కోటిపల్లి అంటే పురాణాల్లో కోట్ల ఫలి అని వుంది. కోటి పల్లినే కోటితీర్థం అనేవారు. ఇక్కడ శివుడు సోమేశ్వరస్వామి పేరుతో పూజింపబడుతున్నాడు. దేవి శ్రీ రాజేశ్వరి అమ్మవారు.

గోదావరినది తీరంలోనే వున్న క్షేత్రమిది. ఈ క్షేత్రంలో చేసే ఒక మంచి పనికి కోటి పుణ్యకార్యాలు చేసిన ఫలితం వస్తుందట. ఈ కోటిఫలి క్రమేణా కోటిపల్లిగా మారిందని అంటారు. యీ స్థలాన్ని గురించి బ్రహ్మపురాణంలో ప్రస్తావన వుంది. బృహస్పతి శిష్యుడు చంద్రుడు అతని ఆత్మలింగంతో దీనిని ప్రతిష్ఠించాడు. గురుపత్నితో కూడిన చంద్రుడు పాప పరిహారార్థం ప్రతిష్ఠ చేసినది. అదే సోమేశ్వరాలయమని ప్రతీతి. అలాగే అహల్యను మోసగించిన ఇంద్రుడు కట్టిన ఆలయం కోటీశ్వరాలయమని మరో అభిప్రాయం.

ఇక్కడ శివరాత్రికి (మాఘ బహుళ అమావాస్య) గొప్ప ఉత్సవం జరుగుతుంది. ఆరోజున సాలగ్రామాలు దానం చేస్తే భక్తులు ముక్తి పొందుతారని విశ్వాసం. ఈ ఆలయంలో నంది చాలా ఆకర్షణీయముగా ఉంటుంది. పుష్కర సమయమున ఇక్కడ గోదావరీ సముద్ర సంగమ స్నానం సర్వపాపహరము యాత్రికులు దర్శించాల్సిన పుణ్యక్షేత్రంమిది.

### మందపల్లి - మందేశ్వరుడు

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట తాలుకాలో ర్యాలీ క్షేత్రానికి అతి సమీపంలో మందపల్లి గ్రామం వుంది. అమలాపురానికి ఆరు కిలోమీటర్ల దూరంలో వుంది. రావుల పాలెంకు అతి సమీపంలో ఉన్నది. మందపల్లిలో శనిచే ప్రతిష్ఠింపబడిన ఈశ్వరుడు ఉన్నాడు. సామాన్యంగా శివాలయంలో శివుడు జలాభిషేకంతో తృప్తి చెందితే ఇక్కడి శంకరుడు శనికి ప్రియమైన తైలాభిషేకాన్ని అపేక్షిస్తాడు. తైలాభిషేకాన్ని జరిపిన భక్తులకు తాము చేస్తున్నది శివార్చనే కాక శని ఆరాధన కూడా అవుతుందనే నమ్మకం. శని అగస్త్యునికి శిష్యుడు. దధీచి మహర్షిని అసురులు హింసించినప్పుడు అగస్త్యమహర్షి సలహామేరకు జనులు అసురులచే సంభవించిన కష్టాలను శనికి చెప్పుకున్నారు. శని వారి కోరికపై అసురులతో పోరాడి వారి బాధనుంచి విముక్తులను చేశాడు. అంతే కాకుండా తాను పోరాడిన స్థలంలో ఈశ్వరుణ్ణి స్థాపించి అతని పూజచేసిన వారికి శని బాధలు ఉండవని హితవు చెప్పాడు. అందువలన ఇక్కడ మందేశ్వరుడు భక్తులకోసం వెలిశాడని అంటారు.

### ముక్తేశ్వరం - క్షణ ముక్తేశ్వరుడు

> ముక్తేశ్వరం తతస్తీర్థం శ్రుణుష్వ సుసమాహితః
> యస్మిన్ తీర్థే సదాముక్తం క్షణాద్యాంతి శివాజ్ఞయా.



శ్రీరామ ప్రార్థన మేరకు శివుడు ఇక్కడి జ్యోతిర్లింగములో లీనమయ్యాడు. ఇక్కడే ఒక శాపగ్రస్త శ్రమణికి క్షణంలో ముక్తి కలిగినది. ఆ కారణాన ఇతడు క్షణముక్తేశ్వరుడుగా ప్రసిద్ధి చెందాడు.



స్వామిని దర్శిస్తే చాలు! ఆ క్షణమే ముక్తి కరతలామలక మౌతుంది అంటారు. స్వామి ఎదురు సన్నిధిలో నిలబడిన క్షణం ఇతరత్ర కష్టసుఖముల, భవబంధనముల ఈతి బాధలు పోయి మనసు కుదుటపడుతుంది. అదే మోక్షము అనే పరమార్థాన్ని చెప్పేందుకు చేసిన ప్రయత్నమే క్షణ ముక్తేశ్వరం అనే పేరులోని సారం. ఇక్కడి శివలింగం ప్రత్యేక వర్చస్సు కలది. ఈ సన్నిధిలో నిలిచిన భక్తుడు పారవశ్యంతోనే ధన్యుడవుతాడు. ఇది అమలాపురానికి 12 కి.మి. దూరంలో ఉన్నది. ఈ క్షేత్రమున కేశవస్వామి క్షేత్రపాలకుడు. విజయదశమి, కార్తిక మాసము, ధనుర్మాసములలో ముఖ్య ఉత్సవములు జరుగుతాయి మహాశివరాత్రికి కల్యాణము జరుగుతుంది.

**అంతర్వేది - లక్ష్మీనరసింహస్వామి**

ప్రసిద్ధి చెందిన అంతర్వేది క్షేత్రం అతిప్రాచీనమైన నరసింహక్షేత్రాలలో ఒకటి. ఇది గోదావరి జిల్లా వశిష్ట గోదావరి తీరంలో వుంది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి హిరణ్యకశిపుని చంపి అంతర్వేదిలో పడవేయడం వల్ల ఇది 'అంతర్వేది' అయిందట. ఇక్కడ గోదావరి సముద్రంలో లీనమైతుంది.

ఈ స్వామి స్వయంభువు. ఆలయం నల్లరాతితో నిర్మింపబడింది. ఈ క్షేత్రంలో దక్షిణావృత శంఖం ఉండడాన్ని విశేషంగా పరిగణిస్తారు.

ఇక్కడ కృతయుగంలో బ్రహ్మ వంద సంవత్సరాలు యాగం చేసి యజ్ఞశాలలో అంతర్వేదికా స్థలంలో నీలకంఠేశ్వరుని ప్రతిష్ఠించి క్షేత్రపాలకుడిగా చేశాడట. అనంతరం వశిష్ఠమహర్షి గోదావరి నుండి వశిష్ఠపాయను తెచ్చాడని అంటారు. వశిష్ఠుడు శ్రీ లక్ష్మీనరసింహవిగ్రహాన్ని కొంత దూరంలో ఆంజనేయస్వామి విగ్రహం స్థాపించెను.

ఆలయ గర్భగృహంలో స్వామివారి విగ్రహం పశ్చిమాభిముఖంగా వుంది. ఈ స్వామి నవ నరసింహులలో ఒకరనే అభిప్రాయం వుంది. ఆలయంలో చీకటి వున్నా సూర్యాస్తమయ కిరణాలు స్వామి విగ్రహ వక్షః స్థలంలో ప్రసరిస్తాయట. స్వామి చుట్టూ రాజలక్ష్మి తాయారు, వేంకటేశ్వరస్వామి శ్రీ భూదేవి తాయార్లు, సంతానగోపాలస్వామి కేశవస్వామి మొదలైన సన్నిధి దేవతలున్నారు. శ్రీరాముడు రావణ సంహారానంతరము ఈ స్థలమునకు వచ్చి శివపూజ చేసెను. మాఘ శుద్ధ దశమికి లక్ష్మీ నరసింహకల్యాణము నృసింహజయంతి వైకుంఠ ఏకాదశికి ముఖ్య ఉత్సవములు ఉత్సవ సమయములలో వచ్చు యాత్రికులకు ఉచిత భోజన సౌకర్యం కలదు.



ఇవి మాత్రమేకాక రాజమండ్రిలో ఇంకా అనేక దేవాలయా లున్నాయి. గోదావరి గట్టుమీద లక్ష్మీగణపతి మందిరము, శ్రీ సీతారామ భక్తాంజనేయ స్వామివారి ఆలయము, రావిచెట్టు కింద కనకదుర్గ మందిరము వున్నాయి. సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయము, గురు రాఘవేంద్ర స్వామి ఆలయము ఉన్నాయి. సంజీవ ఆంజనేయస్వామి ఆలయము ప్రాచీనమైంది. ఇక్కడ నిత్యం పూజలు, అభిషేకాలు, హనుమద్ వ్రతానికి ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. రాజమహేంద్రవరంలోని కోటిలింగాల పేటలో శ్రీరామ మందిరం రాజేశ్వరి దేవాలయం ఉన్నాయి. ఇంకా రాజమహేంద్రవరంలో కనక దుర్గాదేవి ఆలయం, కాశీవిశ్వనాథ ఆలయం, ఉమారామలింగ చౌడేశ్వరి ఆలయం, విఘ్నేశ్వర మందిరాలు, రామ మందిరాలు గోదావరి గట్టువద్ద గిరిజాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయం, బాలసుందరి విశ్వేశ్వరాలయం, పాత శ్యామలాంబ గుడి, బసవలింగేశ్వర ఆలయం తదితరాలు కలవు. ★★★

# పలివెల - కొప్పు లింగస్వామి

డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

తే. కౌశికీ తీర పల్వల గ్రామమందు.
గలశభూ ప్రతిష్ఠితము లింగంబు గలదు:
తనరు నది యగస్త్యే శాభిధానమునను:
గొప్పులింగంబటంచును నొప్పు నదియు.

క. అన నే నామెకు నిట్లం
టిని 'దల్లీ! లింగమునకు నెత్తిని గొప్పా!
వినఁ జిత్రమైన యక్కథ
విన వలతు' ననంగ నామె వివరించె నిటుల్.

చ. పురహర భక్తపుంగవుఁ డు భూసురుఁ డొండు
తదాలయమ్ము పూ
జరి: యతఁ డెంత భక్తిపరుఁ డంతటి రక్తిపరుండు
నౌను: ద
త్పరస సభక్తికాగ్రణి విశన్ సరసుండుఁ బవల్ శివాంఘ్రి తో
యరుహయుగార్చనా నిరతుఁ డౌఁ బురివారల
కన్నుగప్పచున్.

సీ. పవలు కామ విరోధి పాదమ్ముల కెఱఁ గు,
రేయి రోవెలఁ దికిఁ బ్రీతి నొఱగు:
శివు నాలయమ్మును దివమున వలగొను,
రోయాలి కొంపకు రేయి తిరుగు.:
బూల నర్పించును భుజగ హారునిఁ బవల్,
వెలయాలి జడరేయి విరులు దుఱుము,
క్షీరాభిషిక్తుని శివు నహమ్మునఁ జేయు,
విత్తాభిషిక్త రే వేశ్యఁ జేయు.

తే. బ్రాహ్మణుం డిట్లు నిచ్చ దివానిశమ్ముఁ
బూజరితనమ్ము జారత పొందుపడఁ గ
భక్తి రక్తులు మెఱయు జీవనము సలుపు
శంకర తదహితోభయ సమ్మతముగ.

శా. ఆ పూజారి నిరంతరమ్ము నిశి వేశ్యావాటికం జేరి తా
నైపుణ్యంబున వింట గ్రుచ్చిన ప్రసూనశ్రేణి మాలాళి మున్
రూపాజీవ కచంబులం దుఱిమి శర్వుం గూర్చు వర్యాతనే
యాపై భక్తులకుం బ్రసాదములుగా నర్పించు నవ్వానినే.

ఉ. ఆ పురమేలు నప్తి యొుదయం దొకఁ కట్టడి జేసి నిత్యమున్
పోవునన్ సదాశివుని శ్రీపదపద్మములన్ నివేదితంబై
పరిపూతమైన సు మనో ంచితమాలను దెచ్చి యిచ్చి తా
క్షే పుపుదండ వేళకకు విచ్చెఁ బ్రసాదముఁ బాయుఁ దొక్కెడన్.

తే. అధిపుఁ డద్దానిఁ గన్నుల కద్దికొనుడు
మచ్చ కతనను జంద్రబింబంబు నట్లు
కేశ కలుషిత మనియును. గేశ మద్ది
యువతిదని లెస్స యూహించి యుదరి పలికె.

ఉ. 'లింగముపైనిఁ గేశములు లేవు గదా! మఱి నీదు నెత్తిపై
నిం గనరా దొకండు నెఱి నేనియు. నింక శిరోజమెల్లు వ
చ్చెం గదియింపు మోయి: యిది స్త్రీ కబరీ ధృతముక్త
మాల వో
లెం గనుపట్టు. నక్కుసుమలిట్కుచ యెవ్వతె? చెప్పు సత్యమున్.

ఉ. నావిని బ్రాహ్మణుండు నరనాధున కిట్లను: నో మహాప్రభూ!
ఈ విధి నింద సేయందగునే? శివపాదసమర్చకున్ ననునో
గావుఁడు: స్త్రీ ది కాదు: మన గ్రామమునందలి శంభులింగం
దే విలసిల్లు గొప్పాకండు: దేవరయాన కనుంగొనంగనౌ.

క. మాలను నైవేద్యం బిడి
యా లింగమునుండి తీయునప్పుడు దానిం
గీలుకొని కొప్పు నెత్తి రాఁ
బోలును నరపాల! యిద్ధి పొచ్చెం బగునే?'.

చ. అన విని యబ్బురంపడుచు నా నృపుఁ డిట్లను
"గని విని యె ఫ్లెఱుంగ: మహాకంధరు లింగమునందు.
గొప్పాకో!
విను మిది దబ్బతైనఁ బదవీచ్యుతుఁ జేయుటె కాదు: శిక్షితున్
బొనరుతు మోయి: వచ్చెదము ప్రొద్దున మేము స్వయమ్ముఁ
జూడఁ గన్.

తే. అనుచుఁ బతి గర్భగుడి తల్పులను గవాట
బద్ధముగఁ జేయ భటులను బనిచె: వారు
తలుపులు బిగించి బీగముద్రలను వైచి
తాలపుంజేతి నొసఁ గిరి ధరణిపునకు.

క. మనికికిఁ జని పూజరి నె
మ్మనమ్ము దుఃఖాంబునిధి నిమగ్నముగా రే
కునుకకయు తెప్ప వ్రేయక
తను గట్టెక్కింప వేఁ డెఁ దరుణేందుధన్.

చ. సురదను జిర్ని పూజితుఁ డు సోమకళా లలితావతం
సుఁ డున్
పర మహామోహగుంఫిత తుల ప్రకారుండును
నిర్గుణుండు నై



పరఁగెడు నీశ్వరుం గుఱిచి ప్రౌఢ రసాన్విత రమ్య వృత్త భా
సురముగ నాలయార్చకుఁడు స్తోత్రముఁ జేసెను భక్తిమై
నిటుల్.

తే. 'భవుఁడు శర్వుఁడు రుద్రుఁడు పశుపతియును
శ్రీ మహాదేవుఁడుగ్రుఁడు భీముఁ డీశుఁ
డనెడి భవదీయమైన నామాష్టకమున
శ్రుతులు వేర్వేఱ చరియించు శితిగళుండ!
అట్టి ప్రియమగు నీధామ మంజలింతు.

మ. భువనోత్పాదనమందు నో భవ! రజో భూయిష్ఠతం జెంది, త
ద్భువనత్రాణనమందు నో మృడుఁడ! పెంపుం గాంచి
సత్త్వంబునన్,
భువనోద్వాసనమందు నో హర! తమో మూర్తిం
బ్రవర్తించి, యో
శివ! తేజః పదమందు నిస్త్రిగుణతన్ జెల్వొందు నీకున్ నతుల్.

శా. నేదిష్ఠుండు దవిష్ఠుఁడై పరఁగు తండ్రీ! నీకు
మన్త్రాంజలుల్:
క్షోదిష్ఠుండు మహిష్ఠుఁడై చెలఁగు నో శూలీ! నమస్కారముల్,
శ్రీదేవా! ప్రణతుల్ యవిష్ఠుఁడవు వర్షిష్ఠుండ వౌ నీకు; స,
ర్వాధిష్ఠాతవు సర్వరూపుఁడవు నో త్ర్యక్షా! ననుంగావవే!'.

మ. అని ప్రార్థించి యతండు వేగుటను గాల్యంబుల్ దగం
దీర్చి శం
భున కర్ఘ్యాదిక మిచ్చి యింట,గుడిలో మూలన్ శివుం
గొల్చుచుం
డెను; భూపాలుఁడు నంత వచ్చితలుపుల్ దీయింప లాలాటికా
క్షుని లింగోపరి నద్భుతావహముగాఁ గొప్పొండు
గానం బడెన్.

చ. ధరణి పవర్యుఁ డెంతయు విశాకుపడెన్; నితరాం కృతజ్ఞతా
భర వినతోత్తమాంగుడును భక్తి రసాంజలి బద్ధహస్త పం
కరుహుఁడు బ్రాహ్మణుండు తటకాపడెఁ; జాపలు
చేష్టలుడ్గి ని
వ్వెఱపడి: రా నృపాలకుఁడు విప్రు ముదంపడి మెచ్చె హెచ్చుగన్;
జరగిన యెల్లవృత్తము నిశన్ విని వేశ్యయు సంబరం పడెన్.

ప్రఖ్యాత విద్వాంస కవి డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయ రావు గారు పుష్కరాల సందర్భంగా విడుదలకై రాసి సిద్ధంచేసిన గోదావరి తీరస్థ దేవతా కథలను వివరించే కావ్యంలో పలివెల కొప్పులింగేశ్వరునికి సంబంధించిన వృత్తాంతాన్ని ఆయన అనుమతితో ఇక్కడ పొందుపరచడమైనది.

* * *




# పంచ కేశవాలయాలు

బి. కమలాదేవి

గోదావరి తీరం పవిత్ర ఆలయాలకు నిలయం. ఇక్కడ వెలసిన ధర్మాలు అనేకం. బౌద్ధం, జైన, శైవ పంథముల వలనే వైష్ణవ పంథానికీ ఈ చల్లని తల్లి కొంగులో స్థలం దొరికింది. పలువుర్ల పలుయుద్ధాల పరిణామంగా ఒక్కొక్క సాంస్కృతిక జీవనశైలి అంతరించగా మళ్ళీ మళ్ళీ మొలకెత్తి ముందుకు వచ్చిన సనాతన ధర్మ సంకేతాలైన, కేతనాలైన గుడి గోపురాలు కాలగతిలో సాంద్రతలో పెరిగినట్లు కనబడుతున్నవి. ఈ చోట హరహర్మ్యాల సంఖ్యకు సరిదీటుగా హరి మందిరాలు ఎక్కువైన వైనాన్ని చూడవచ్చును. పంచారామాలలాగే పంచ కేశవాలయాలూ ఈ పరివాహక ప్రాంతంలో ప్రసిద్ధి పొందాయి. వీనికి తోడుగానే అతి దగ్గరలో శివాలయాలు వెలసి భక్తుల భాగవత ప్రీతిని గంటాఘోషం చేస్తున్నాయనడంలో అతిశయం లేదు. 1. తణుకు, 2. మండపాక, 3. కొరాలపర్రు, 4. ర్యాలి, 5. వాకతిప్పలలోని ఆలయాలు పంచకేశవాలయాలుగా ప్రసిద్ధి పొందాయి.

### తణుకు

ఇక్కడ గోదావరి పాయ 'గోస్తనీ' నదిగా పిలువబడుతూంది. ఈ గోస్తనీ నదీ సమీపాన ఆదికవి 'నన్నయ భట్టు' యజ్ఞము చేసిన ప్రదేశానికి సమీపంగా ఉన్న శ్రీ భూనీళాసమేత కేశవస్వామి ఆలయం ఈ పంచ కేశవాలయాలలో ఒకటి. మాధవ సేవా నిరతుడు నారద మహర్షి తన ఉపాసనా మూర్తిగా ప్రతిష్ఠించి ఆరాధించినట్లు స్థలపురాణం. దేవాలయం సుమారు ఆరువందల సంవత్సరముల పూర్వపుదని ఈ దేవాలయ చరిత్ర చెబుతోంది. ఎత్తైన ప్రాకారంతో తణుకుకు ప్రధాన రహదారిలో వెలసిన ఈ దేవాలయం భక్తులకు నయనానందకరం. ఈ ఆలయంలో కళ్యాణం జరుపుకోవడం భోగభాగ్య ఫలప్రదమని పరిసరవాసుల నమ్మకం. ఈ పరిసర గ్రామ వాసులే కాక సుదూర గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు కూడా ఇక్కడ కళ్యాణాలు జరుపుకుంటారు. భీష్మ ఏకాదశికి వైభవంగా కల్యాణ మహోత్సవం జరుగుతుంది. పెద్దెత్తున తీర్థం జరుగుతుంది. పశ్చిమగోదావరి జిల్లా నూజివీడు జమిందారుల ఏలుబడిలో ఉండటంవల్ల ఈ దేవాలయా లభివృద్ధికి నిత్యనైవేద్యాదులకు వారు మడిమాన్యాలు ఏర్పాటు చేసారు.




పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు అత్యంత సుసంపన్నమైన పట్టణం. పురాతన చరిత్రగలదీ కూడా. ఒకప్పుడిది తారకాసురుడున్న పట్టణం. తారాకాసురుడు ఆరాధించిన 'కుపర్దీశ్వరాలయము' ఇక్కడ ప్రాచీన దేవాలయం.

ఇప్పటి తణుకు పాత ఊరులో వున్న కొలనులో స్నానం చేసి కపర్దీశ్వరునికి రోజుకు బండెడు అన్నాన్ని నైవేద్యంగా పెట్టి ఆ అన్నంతో కూడా ఒక మనిషిని తారకాసురుడు భుజించేవాడు. ఆ ప్రాంతంలో వుండే ప్రజలు ఈ రాక్షసుని బాధలను భరించలేక కొంత దూరంలో తపస్సు చేసుకుంటున్న సిద్ధులకు విన్నవించుకున్నారు. ఈ సిద్ధులు ప్రతిష్ఠించిన సిద్ధేశ్వరాలయము తణుకు పట్టణానికి ఉత్తరాన ఉన్నది. ప్రజల గోడును విన్న సిద్ధులు శివుని ప్రార్థించారు. రాక్షసుని సంహరించమని వేడుకున్నారు. శివుడు ఆ కార్యానికి తన కుమారుడైన కుమారస్వామిని పంపించాడు. కుమార స్వామికి సహాయంగా దేవతలు తరలివచ్చారు. దేవతలకు రాక్షసులకు మధ్య ప్రస్తుతం కొమ్మాయి చెరువు సమీపంలో యుద్ధం జరిగింది అంటారు. ఆ ప్రాంతాన్ని ఇప్పటికి దేవదానవ ప్రాంతంగా వ్యవహరిస్తూ వుంటారు. ఇదే పేరు రెవెన్యూ అడంగళ్ళలలో సహితం నమోదయింది. కుమార స్వామి విడిది చేసిన ప్రాంతాన్ని కుమారవరంగా పిలిచేవారు. అదే నేడు 'కొమరవరం' గా పిలవబడుతోంది. కుమార స్వామికి సహాయంగా వచ్చిన దేవతలు విడిది చేసిన ప్రాంతం వేల్పు (దేవత) ల ఊరు 'వేల్పూరు' గా మారినది. ఇంద్రుడు విడిది చేసిన ప్రాంతం (ఇంద్రపురం) కాలక్రమేన ఇల్లింద్రపర్రుగా రూపాంతరం చెందింది. రాత్రి సమయాలలో రాక్షసుల బలం అధికంగా ఉంటుంది. కనుక యుద్ధం జరిగినంత కాలం దేవతలకు వీరభద్రుడు రాత్రులు కాపలా కాసేవాడు. ఆ ప్రాంతమే 'కావలి (కాపలా) పురంగా' వీరభద్రుడు విడిదిచేసిన ప్రాంతం 'వీర భద్రపురం'గా పిలుస్తారు. తారకాసుర సంహారం జరిగిన తరువాత విజయోత్సవ వేడుకలు చేసుకున్నట్లుగా చెబుతారు. ఈ గ్రామాల పేర్లన్నీ ఇప్పటికీ వాడుకలో వున్నాయి.

### మండపాక

తణుకు పట్టణానికి 3 కి.మీ. దూరంలో మండపాక గ్రామం వుంది. మాండవ్య మహర్షి ఈ కేశవుని ఆరాధించి ఈ





ప్రాంతాన తపస్సు చేసుకొంటూ ఉండడంవల్ల ఈ గ్రామానికి మండపాక అనే పేరు వచ్చిందని చెబుతారు ఇక్కడ సువిశాలమైన ఆలయ ప్రాంగణంలో నారదమహర్షిచే ప్రతిష్ఠింపబడిన కేశవస్వామి గంభీరంగా దయను వర్షించే చూపులతో శ్రీ భూదేవులతో దర్శన మిస్తాడు స్వామిని సేవించి సంకల్పించిన ఏ పని అయినా జయప్రదమవు తుందని ఇక్కడి వారి నమ్మకం పై దేవాలయానికి నూజివీడు జమిందారు తగిన భూ వసతులు కల్పించి జీర్ణ దేవాలయోద్ధరణ చేశారు తిరిగి నేటికి సమర్థవంతులైన వారి అజమాయిషీలో దేవాలయాల వైభవాన్ని సంతరించు కొంటూంది

గుడి పునర్నిర్మాణంలో ఆలయ మహద్వార గోపురంలో దశావతారాల బొమ్మలను అమర్చి ఉండటం ఇక్కడి విశేషం ర్యాలి లాగానే ఇక్కడి కేశవుడు కూడ వెనుకవైపున జగన్మోహినీ అవతారమని చెబుతారు

అత్యంత ప్రాచీనమైన ఈ దేవాలయాన్ని శతాబ్దాలకు పూర్వం నూజివీడు జమిందారులు పునర్నిర్మించి ఆలయానికి మడిమాన్యాలు కూడా ఏర్పాటు చేశారు అర్థించి వచ్చిన భక్తుల కొంగు బంగారమనీ కోర్కెలు తీర్చే కల్పవృక్షమనీ ఇక్కడి భక్తుల విశ్వాసం ఫాల్గుణశుద్ధ ఏకాదశి స్వామికి అత్యంత వైభవంగా కల్యాణం జరుగుతుంధి

## కొరాలపర్రు

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలో వెలసిన కొరాలపర్రు కేశవుడు చాలా ప్రసిద్ధుడు పంచ కేశవులలో ఒకడు ఈ దేవాలయ చరిత్ర ఆసక్తికరంగా ఉంటుంది నారద మహర్షి ప్రతిష్ఠించిన కేశవమూర్తి కాలక్రమాన మరుగున పడిపోయింది వశిష్ఠ నదీతీరంలో సంచరిస్తున్న పరాశర మహర్షికి ఈ కేశవమూర్తి దొరికింది దానిని తెచ్చి ప్రతిష్ఠ చేశాడు ఆ ప్రాంతానికి కేశవపురి అని పేరొచ్చింది స్వామి సేవ నిమిత్తం తన శిష్యులను కొందరిని అక్కడ ఉంచి తపస్సుకు వెళ్లిపోయాడు మహర్షి చాలా కాలం అలా జరిగింది కాలక్రమాన వరదలు ఆ ప్రాంతాన్నంత ముంచెత్తడంతో ఆ ఆలయమూ కొట్టుకు పోయింది ఆ ప్రాంతమంతా అడవిలా తయారైంది ఇప్పటికి 250 సంవత్సరముల క్రితం వంగపురి సీతారామాచార్యులువారు పాలకొల్లు ప్రాంతానికి తహసిల్దారుగా వచ్చారు వీరి ధర్మపత్ని లక్ష్మీనర్సమ్మగారు, కేశవభక్తురాలు ఒకనాడు కేశవుడు ఆమెకి కలలో కనబడి సమీపారణ్యంలో ఒకచోట భూమిలో తన విగ్రహం వున్నదనీ, వెదకి తీసి ప్రతిష్ఠించ వలసినదనీ ఆనతిచ్చాడు భర్తతో ఈ విషయం చెప్పగా ముందర త్రోసిపుచ్చినా చివరకు ఆ అరణ్య ప్రాంతంలో కొందరి చేత తవ్వించాడు కాని విగ్రహం దొరకలేదు అంతా వట్టి భ్రమేనని ఆ ప్రయత్నం మానేశారు కాని అదే కల ఆమెకు పదే పదే రావడంతో (పైగా మరింత లోతుగా త్రవ్వించమని స్వామి ఆదేశించడంతో) ఆమె మాట కాదనలేక మళ్లీ ప్రయత్నించారు ఈసారి మరింత లోతుగా త్రవ్వించగానే విగ్రహం దొరికింది తహసిల్దారుగారు దేవాలయం కట్టించి విగ్రహ ప్రతిష్ఠ చేయించారు నిత్య పూజలకై లక్ష్మీ నరసమ్మగారు తనకున్న ఆస్తి, బంగారం స్వామికి కైంకర్యం చేసింది అప్పటి నుండీ ఆ కేశవాలయం భక్తులకు నేత్రోత్సవంగా ధూప దీప నైవేద్యాలతో, ఉత్సవ దీప్తులతో భాసిల్లుతూంది కేశవభక్తులైన ఆచార్యులవారి కుమారుల్లో ఒకరు 70 ఎకరాల ఆస్తిని స్వామి పేర సమర్పించారు

అడవిగా వున్న ఆ ప్రాంతం కేశవదేవుని ఆలయ నిర్మాణం కాగానే క్రమంగా ఊరయింది గొడ్డళ్లతో నరికి బాగు చేయగా ఏర్పడ్డ పురం కనుక – కురారపర్రుగా ఆ గ్రామానికి పేరొచ్చిందని చెబుతారు క్రమేణా కొరాలపర్రు అనడం వాడుకైంది (కురారం అంటే గొడ్డలి)

నాలాయిర ప్రబంధ దివ్య క్షేత్రాలతో పోల్చదగిన క్షేత్రాలలో ఇది ఒకటి ఇటువంటివే మరికొన్ని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని ఎంబెరుమాన్ దేవాలయం, ద్వారకా తిరుమలలోని వేంకటేశ్వర దేవాలయాలు ప్రతీరోజూ నాలాయిర ప్రబంధ పఠనంతో వైష్ణవ సాంప్రదాయ బద్ధంగా జరిగే ఉత్సవాలతో, వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం జరిగే ఉత్సవాలతో అలరారే కొరాలపర్రు కేశవస్వామి పంచకేశవులలో ఒకడు ముక్కోటికి స్వామి తిరుమంజనోత్సవం వైభవంగా

జరుగుతుంది. తిరుమంజన సమయాన స్వామి నిజరూప దర్శనం ఉంటుంది. మేషమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలు చాలా ప్రసిద్ధి. ఆరుద్ర నక్షత్రానికి ఉడయవర్ల తిరు నక్షత్రోత్సవాలు కూడా వైష్ణవ సాంప్రదాయబద్ధంగా జరుగుతాయి.

ఇక్కడ ఆలయం నాలుగువైపుల ఎనిమిది చిన్న చిన్న గుడులు ఉన్నాయి. ప్రదక్షణాపథంగా ఉండే ఈ గుళ్ళలో సీతారాములు, లక్ష్మీనరసింహుడు, లక్ష్మీనారాయణుడు, శెల్వపిళ్ళై (రామానుజులు అర్చించిన మేల్‌కోట్టైస్వామి) వరదరాజస్వామి (కంచి), వేంకటేశ్వర (తిరుపతి) రంగనాయక (శ్రీరంగం) వేణుగోపాల స్వామి విగ్రహాలు ఉన్నాయి

ఆలయం గర్భగుడి వెలుపల ఎడమవైపుకు పన్నిద్దరాళ్వారుల సన్నిధి ఉంటే కుడివైపుకు మణవాళమ ముని ఉన్నారు.

ఇక్కడి గర్భగుడిలో స్పష్టంగా విద్యుత్ కాంతిలో కనిపించే రెండు చేతుల కేశవుడు దర్శనమిస్తాడు. కుడిచేయి అభయహస్తంతోనూ, ఎడమచేయి గదాధారియై ఉన్నాడు.

శ్రీ భూదేవులు విగ్రహం ప్రక్కనే ఉండగా తొరంగంలో తుంబుర, నారదులు ఉన్నారు గర్భగుడికి ఎడమవైపు యతిరాజవల్లి సన్నిధి ఉండగా, కుడివైపున గోదాదేవి సన్నిధి ఉంది. ప్రక్కనే గోదాగ్రజ అని పిలువబడ్డ భాష్యకారుల సన్నిధి ఉన్నది. నాలుగు వైపుల నాలుగు ద్వారాలు ఉండే ఈ ఆలయానికి దక్షిణంలో మహద్వారగోపురం ఉంది. దాని వెలుపల ఆంజనేయస్వామి సన్నిధి ఉన్నది.

ఇంత బ్రహ్మాండమైన ఆలయాన్ని రెండవ శ్రీరంగంగా పిలుస్తారు. పెనుగొండ నుంచి 5 కి.మీ. ఆటోలోనే వెళ్ళాలి బస్సు సౌకర్యం లేదు.

### ర్యాలి

తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం జంక్షన్‌కి 6 కిలోమీటర్ల దూరంలో వశిష్ఠ గౌతమీ పాయలమధ్య గోదావరీ తీరంలో వున్న మరో కేశవ స్వామి ఆలయం పురాణ ప్రసిద్ధమైనది. పురాతనమైన ఈ దేవాలయ స్థల పురాణం కూడా ఆసక్తికరంగా వుంటుంది. వ్యాసమహర్షి, శుకమహర్షి కూడా కొంత కాలం మిక్కడ వుండి ఈ దేవుణ్ణి సేవించినట్లు చెబుతారు. ఈ దేవాలయాలు 11 వ శతాబ్దానికి చెందిన చోళవంశీయులచే నిర్మించబడినట్లు తెలుస్తోంది.


క్షీరసాగర మథనంతో సంపాదించిన అమృతాన్ని దేవాసురులకు పంచుతానంటూ మోహినీ అవతారంతో వచ్చి అందరినీ సమ్మోహింపజేసి అమృతాన్ని మాయగా దేవతలకు పంచిపెట్టి అదే రూపంతో రథంమీద వెళ్తున్న కేశవుని చూచి మోహించి వెంటబడ్డాడు ఈశ్వరుడు! సరిగ్గా ఈ ప్రదేశానికి చేరుకోగానే రథంయొక్క ఇరుసుకున్న సీల రాలి పడి పోయింది. వెనుకకు తిరిగిచూసిన మోహినికి శివుడు కనబడ్డాడు. విషయం అర్థమై నవ్వుకుంటూ తన కేశవ రూపాన్ని ప్రకటించాడు విష్ణువు సిగ్గుపడ్డాడు శివుడు. రథం శీల రాలిపడిపోయిన ప్రదేశం రాలి గా పిలువ బడుతూంది ఆనాటి నుండి జగన్మోహిని కేశవస్వామిగా అక్కడే ఆరాధింపబడుతూ వెలశాడు స్వామి. కంఠం క్రింద సహజమైన రేఖలు, సొగసైన చేతివేళ్ళూ, నిగనిగ లాడే గోళ్ళూ, జందెము, కుచ్చెళ్లు పోసికట్టిన పంచెకట్టూ, చూసి తరించవలసినదే ఆ దైవ శిల్పం. ఇదే మూర్తి వెనుక భాగాన తీర్చిముడిచినట్టు జుట్టుముడి, మధ్యలో జడ బిళ్ల, కుచ్చెళ్లు పోసికట్టినట్లు చీరె కుచ్చెళ్లూ పద్మినీ జాతి స్త్రీకి సహజమైన ఎడమ తొడపై పుట్టుమచ్చ! ఆ మోహినీ రూప వైభవం అద్భుతం. చేతికి భుజకీర్తులూ, కంకణాలు, వాటి నగిషీ పనితనం ఎంత అద్భుతమంటే సన్నని వెంట్రుక దూరే సందులు కూడా చూడవచ్చు. కేశవమూర్తి పాదాల చెంత ఎప్పుడూ నీరు (విష్ణుపాదోద్భవగంగ) ఊరుతూ వుంటుంది శ్రీ భూదేవేరులతో,



వింజామరలు వీచు యక్ష గంధర్వ కన్యలతో తుంబురు నారదాదుల శిల్పాలు సుందరతను వర్ణించలేం! చూసి తీరవలసిందే!

ఈ దేవాలయానికి ఎదురుగా ఈశ్వరుని దేవాలయం ఉంది. విష్ణువృక్షం - శివదృష్టి కూడదని అంటూ ఉంటారు పెద్దలు. కాని ఈ గ్రామంలో విష్ణాలయం తూర్పు ముఖం గానూ, శివాలయం (ఉమాకమండలేశ్వరాలయం) పడమర ముఖంగాను ఉండటం విశేషం! ఇటువంటి స్థలం ఇదొక్కటే అంటారు. ఇక్కడి దేవాలయంలోని నంది రూపం ఎదుటి దేవాలయంలోనకి కనబడటం కూడా మరో అసాధారణ విషయం. శంకరుని పశ్చిమ ముఖం నుండి వెలువడే తేజాన్ని తేలికగా కేశవుడు భరించి గ్రామ ప్రజలకు అపకారం జరక్కుండా చూస్తాడని ఇక్కడి ప్రజల విశ్వాసం.

మోహినిపై ఈశ్వరుని మోహం కారణంగా శివకేశవులకు అయ్యప్ప ఉద్భవించినట్లు పురాణ కథ. ఈ అయ్యప్ప కేరళలో శబరిమలపై వెలయగా అర్చకులు ఈ గోదావరీ తీరవాసులే కావడం విశేషం. అయ్యప్ప దేవాలయంలో అర్చకులు ఇక్కడి నుండే వెళ్ళి అయ్యప్ప గుడిలో అర్చకత్వం చేపట్టినట్లు చరిత్ర చెప్పే సత్యం.



ఇక ఇక్కడి వశిష్ట నదిలో బ్రహ్మకుండం ఉంది. బ్రహ్మ ఇక్కడ తపస్సు చేస్తూ ఉమతో కూడిన శంకరుని తన కమండంలో ప్రతిష్ఠించాడు. అందుకే ఇక్కడున్నది ఉమా కమండ లేశ్వరాలయం. దేవాలయంలో శివుడు రుద్రాక్షవలె గరుకుగా ఉంటాడు. ఆలయంలో సోమసూత్రం లేదు. ఈ గ్రామంలో చతుర్భుజుడైన వేణుగోపాలస్వామి ఆలయం భక్తుల హృదయాలను దోచుకుంటుంది. ఈ గ్రామం రావులపాలెం జంక్షన్ నుండి 6 కి.మీ. దూరంలో వుంది. బస్సు సౌకర్యం వుంది. ఆటోల్లో కూడా వెళ్లవచ్చు. దేవాలయానికి దగ్గరలో వున్న సత్రము భక్తుల ఆకలి తీర్చి సేద తీరుస్తుంది.

## వాకతిప్ప

వాకతిప్ప రామచంద్రాపురం, రావులపాలెం మధ్యలో గ్రామంతర ప్రదేశంలో ఉన్నా క్షేత్రం. ఇక్కడ కేశవుడు, జనార్ధనుడు విశాలమైన ప్రాంగణంలో వెంకటేశ్వరస్వామి ఆలయంతో ఉన్న దేవాలయ ద్వయం ఇది. ఇక్కడి రామచంద్రాపురం నుండి ఒకే ఒక బస్సు ఉన్నది. పసలపాడులో దిగి లోపలికి 18 కి.మీ. దూరంలో ఉన్న వాకతిప్ప గ్రామానికి ప్రయివేటు వాహనంలో కూడా వెళ్ళవచ్చును. ఇక్కడి ఆలయ విమాన శిఖరాలను 1963 సంవత్సరంలో మహాసంప్రోక్షణ చేయడం జరిగింది. చుట్టూ గోదావరీ, వరిపొలాలు, కొబ్బరి చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన ప్రకృతిమాత ఒడిలో కోనసీమ కన్నులపండువుగా పర్యాటకులను సేద తీర్చే ప్రదేశం. ప్రకృతికి పరవసించిన పరమేశ్వరుడు ఇక్కడ నారదునిచే ప్రతిష్ఠింపబడి కేశవస్వామిగా దేవేరులతో కలసి పూజ లందుకుంటున్నాడు.

## ఇతర ఆలయాలు

ఇవే కాకుండ మరి కొన్ని కేశవాలయాలని ఈ చుట్టుప్రక్కల చూడవచ్చును. వాటిలో దువ్వ గ్రామంలోని కేశవుడు చాలా ప్రసిద్ధుడు. ఒకప్పుడు దుర్వాసమునీంద్రుడున్న పురమే దువ్వ ఈ గ్రామం తణుకు పట్టణానికి 6 కి.మీ. ల దూరంలో వుంది. ఇక్కడ దుర్వాసమునీంద్రునిచే ప్రతిష్ఠింపబడిన కేశవస్వామి ఆలయం వుంది. రుక్మిణీ సత్యభామలతో వెలసిన ఈ ఆలయం క్రీ.శ. 1330 ప్రాంతంలో నిర్మించబడినట్లు తెలుస్తోంది. స్వామి స్వయంభువు. ఫాల్గుణశుద్ధనవమి నుండి పూర్ణిమవరకు కన్నుల పండువుగా ఉత్సవాలు జరుగుతాయి. ఈ ప్రాంగణంలోనే చేత పిల్లనగ్రోవితో, కర్ణకుండలాలతో, కాళ్లకు గజ్జలు, తులసిమాలతో చూడచక్కని వేణుగోపాల స్వామి (రుక్మిణీ సత్యభామలతో) పూజలందుకుంటున్నాడు. వేణుగోపాలస్వామి ఆలయంలో కుడివైపున గుడిలో సీతారాములు ఉన్నారు. మూల విగ్రహాలతో లక్ష్మణుడు లేదు. ఉత్సవ విగ్రహాలలో ఉన్నాడు.


ఇక్కడికి దగ్గరలోనే నాగేశ్వరస్వామి లింగరూపంలో పూజలందు కుంటున్నాడు. పక్కనే అమ్మవారు చిన్న బాలిక లాగా చేత తామరమొగ్గతో వుంటుంది. స్వామి కల్యాణం మాఘ నవమి నుండి వారం రోజులపాటు జరుగుతుంది.

## పాలంగి

త్రేతాయుగంలో శ్రీరాములవారు పట్టాభిషేకానంతరం సతీసమేతంగా యాత్రలు చేస్తూ ఈ ప్రాంతానికి వేంచేసి నారు. గోస్తనీనదికి (అంతర్వాహిని) దక్షిణదిశగా ఒక కిలోమీటరు దూరంలో ఉన్న తటాకంలో సీతమ్మ ఇసుకతో లింగాన్ని చేయగా ఆ లింగాన్ని రామచంద్రుడు ప్రతిష్ఠించాడని చెబుతారు. పశ్చిమాభిముఖంగా వుండి, ఉత్తరాన గోస్తనీ (అంతర్వాహిని) నది ప్రవహిస్తుంది. తూర్పు దక్షిణ దిశల రామఘట్ట తటాకముంది. ఎదురుగా స్మశాన వాటిక వుండటంవలన ఈ క్షేత్ర దర్శనం కాశీలో విశ్వేశ్వర దర్శనపుణ్యాన్ని కలుగ జేస్తుందని అంటారు. బాలా త్రిపురసుందరీ దేవితో కూడిన రామలింగేశ్వరుడు మహిమాన్వితుడని పేరు.

పశ్చిమాభిముఖం లింగం, నదీచోత్తర వాహినీ,
యత్ర కాశీ సమతుల్యం, తత్ర ముక్తిర్నసంశయః.

ఈ దేవాలయ నిర్వహణకు నూజివీడు జమిందారు కీ.శే. వెంకట్రామయ్య అప్పారావు బహద్దూర్‌వారు దాదాపు 35 ఎకరాల భూమి దానం చేశారు. పరంపరగా అర్చకత్వం చేసిన దేవాలయ పూజారి పరమపదించిన తరువాత, హైదరాబాదులో ఉన్నతోద్యగంలో వున్న వారి కుమారునికి పదే పదే రామ లింగేశ్వరుడు కలలో కనబడటం, తాను అర్చకత్వం చేస్తూన్నట్లు కల రావడంతో, చేస్తూన్న ఉద్యోగం వదలి పాలంగి చేరి అర్చకత్వం నిర్వహిస్తూండటం, ఆలయాన్ని అభివృద్ధి పరచడంలో పాలుపంచుకోవడం ఈ రామలింగేశ్వరుని మహిమకు నిదర్శనం. ఇక్కడ లింగం నీటిలో మునిగే



వుంటుంది. దేవాలయ గర్భగుడిలో సదా నీరు మునిగి వుండేలా చూడటం పూజారి విధి. అలా కాకుంటే గ్రామం దగ్ధమైపోతుందని ఇక్కడి వారి నమ్మకం. శివరాత్రికి ఇక్కడ బాలాత్రిపుర సుందరీ రామలింగేశ్వరులకు వైభవంగా కల్యాణోత్సవం జరుగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలతో 5 రోజులపాటు గొప్ప తీర్థం జరుగుతుంది.

## మాచవరం

కౌశికీ నది తీరాన వెలసిన రాజేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి చెందినది. పురాతనమైనది. నెల రోజులపాటు ఇక్కడ శివారాధన చేస్తే కోరినవన్ని సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

తాటకివధ వల్ల వచ్చిన స్త్రీ హత్యాపాతకాన్ని పోగొట్టుకోవడానికి రామచంద్రుడు శివ లింగ ప్రతిష్ఠ జరిపించాడని చెబుతారు ఒకప్పుడిక్కడ దుర్గాదేవి ఆలయం వుండేదట అంబ ఉన్న ఊరు కనుక అంబాజీపేట అని పిలువబడుతోంది కాలక్రమాన ఆలయం నదీ గర్భంలో కలసిపోయింది విగ్రహం రాజేశ్వరాలయంలో ప్రతిష్ఠింపబడింది 'మా' అంటే అమ్మ - అమ్మ ఉన్న ఊరు - ''మాచవరం'' విగ్రహాన్ని మాత్రం రాజరాజేశ్వరిస్వామి దేవాలయంలో ప్రతిష్ఠించారట ఇక్కడి శివలింగం జ్యోతిర్లింగాల లాగా తెల్లగా వుంటుంది ఈ ఆలయం రుద్ర భూమిలోనే వుండటం ఒక విశేషం

## పలివెల

తూర్పు గోదావరి జిల్లా కౌశకీనదీ తీరాన వెలసిన ''పడవల'' పురమే ఈనాటి ''పలివెల'' గ్రామం ఇక్కడి ఆలయంలో శ్రీ కొప్పు అగస్తీశ్వరాలయము అగస్త్య మహామునిచే ప్రతిష్ఠింపబడిన ఈశ్వరుడు ఇక్కడి దేవుడు దక్షిణాదికి వచ్చి గోదావరీ తీరంలో తపస్సు చేసుకుంటున్న అగస్త్యునికి హిమవత్పర్వతం మీద జరిగే శివ పార్వతుల కళ్యాణం గురించి తెలిసి, చూడాలని కుతూహలపడ్డాడు కాని వింధ్య దాటివచ్చేటప్పుడు పర్వతాన్ని తాను తిరిగి వచ్చేవరకు వంగి వుండమని ఆనతిచ్చాడు కదా! ఇపుడు వింధ్యను దాటి వెళ్లటం జరిగితే తిరిగి పర్వతం అంతులేకుండా పెరిగిపోవటం తథ్యం! ఈ మాటే దేవతల చేత పంపబడిన విశ్వకర్మ వచ్చి సవినయంగా మనవిచేసి స్వామి కళ్యాణ విశేషాలు కూడా వినిపించాడు లోకహితకాంక్షి అయిన మహర్షి తన ప్రయాణమైతే విరమించుకున్నాడు కాని, కళ్యాణ మూర్తి అయిన సాంబశివుని పసుపుబట్టలతో చూడాలని కోరుకున్నాడు దయామయుడైన శంకరుడు అంబాసహితుడై దర్శనమివ్వగా వారిద్దరిని ఏకపీఠంపై ప్రతిష్ఠించాడట ఈ అగస్తీశ్వరాలయమే ఉత్తరోత్తర శ్రీకొప్పు లింగేశ్వరాలయ మైనది ఆ పైన మిది!

అనంతర కాలంలో ఆ దేవాలయ పూజారి పరమ భక్తుడే కాని, వేశ్యాలోలుడు పూజారిని గురించి మహారాజుకు ఫిర్యాదులు అందసాగాయి ఒకనాడు రాజుగారు పలివెల వచ్చి, దైవ దర్శనానికి విచ్చేశారు మహారాజు రాక కనిపెట్టి, అడ్డ దోవను దేవాలయానికి వచ్చి చేరాడు పూజారి. దైవ దర్శనానికి మహారాజు విచ్చేస్తాడని గుర్తించి, తాను వేశ్య కొప్పులో వుంచిన దైవ నిర్మాల్యమైన పూలదండను తనతో కూడా తీసుకొని వచ్చాడు ఇంతలో వచ్చిన మహారాజును ఆలయ మర్యాదలతో ఆహ్వానించి పూలదండను (దైవ నిర్మాల్యాన్ని) సమర్పించాడు ఆ దండలో ఒక పొడవాటి వెంట్రుక కనబడింది మహారాజుకి ఇదేమిటని నిలదీశాడు రాజు శివునికి జటా జూటం ఉంటుంది కదా అందులోని వెంట్రుకై వుంటుం దంటూ నిబ్బరంగా జవాబిచ్చాడు పూజారి అయితే చూస్తాను అంటూ లోనికి రాబోయిన మహారాజును వారించి ''ఈనాటికి నైవేద్యం అయిపోయింది. కనుక రేపు ఉదయాన్నే చూపిస్తాను'' అన్నాడు పూజారి అన్నాడే కాని తనకు శిరచ్ఛేదం తప్పదని నిశ్చయానికి వచ్చి చివరిసారిగా పరమాత్మ సన్నిధి ప్రార్థించాడు ఆర్తి ''స్వామీ నీ భక్తుడను నా మాట మన్నించు జటాజూటంతో సాక్షాత్కరించు'' అంటూ వేడు కున్నాడు ఉదయం మహారాజు జటాజూటధారియైన ఈశ్వరుని చూశాడు! అనుమానం తీరక ఒక జటను పెరికించి చూస్తే కొసల రక్తం కనబడింది కూడా! అప్పటి నుండి ఆ జటా జూటధారియైన ఈశ్వరుని గ్రామస్తులు అచ్చ తెలుగులో ''కొప్పు లింగేశ్వరుడు'' అంటూ పిలుచుకుంటున్నారు ఆ స్వామి భక్తులను ఆ రూపుతోనే వారి మనోరథాలనీడేర్చి ఉమా కొప్పులింగేశ్వరుడుగా అనుగ్రహిస్తూ పూజలందు కుంటున్నాడు

## పెనుగొండ

ప్రఖ్యాతమైన వాసవీ కన్యకాపరమేశ్వరికి నిలయం ఆకర్షనమైన అమ్మవారిని నగరేశ్వరస్వామి వారితో చూడవచ్చును ఇక్కడ ఇంకొక వైపు మహిషాసురమర్దిని విగ్రహం ఉన్నది విశాలమైన ప్రాంగణంలో 102స్తంభాలున్నాయి వీటిపైన 102 వంది నూతనదంపతుల పేర్ల చెక్కబడిన వైనాన్ని చూడవచ్చును పేర్లను చెక్కిన శిల్పాచారి భీమవరం పిల్లేడ రామాంజనేయులుగారు నందికంబం పక్కన నాగవిగ్రహ ప్రతిష్ఠాపన 1973 సంవత్సరంలో జరిగింది లోపల ప్రదక్షిణాపథంలో గణపతి ఆలయం, నవగ్రహ మండపం కాలభైరవి ఆలయం ఉన్నాయి ఇక్కడనే ముఖ్య ఆలయం కుడివైపున వేంకటేశ్వర ఆలయం, ధ్వజస్తంభం గరుడులతో 1970 సంవత్సరంలో నిర్మింపబడింది రెండు బసవన్నలను శతకంబ మండపంలో నగరేశ్వరస్వామి ఎదురుగా చూడ వచ్చును

ఈ ఆలయం ప్రక్కనే అష్టలక్ష్మీ ఆలయం కూడ చూడవచ్చును ఈ ఆలయం శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయరస్వామి నేతృత్వంలో నిర్మింపబడింది ఈ ఆలయాలు పెనుగొండ బస్‌స్టాండు సమీపాన చూడవచ్చును



# పంచారామములు

డా॥ కె రాధారమణ

ఆరామము అనే పదానికి విశ్రాంతి, విశ్రాంతి స్థలము, ఉద్యానవనము అనే అర్థాలున్నాయి బౌద్ధ భిక్షవులు ఉండే స్థలం, విశ్రాంతి స్థలం - అనే అర్థంలో సంఘారామము, బౌద్ధారామము అని చెప్పటం కూడా కలదు ఆంధ్రదేశంలో పంచారామములు అనే క్షేత్రాలు ఉన్నాయి వీనిలో నాలుగు గోదావరీ పరీవాహక ప్రాంతంలో ఉంటే మరొకటి కృష్ణానదీ తీరంలో ఉంది ఈ ఐదు క్షేత్రాలు ప్రసిద్ధ శివ క్షేత్రాలై ఉన్నవి ఈ ఐదు క్షేత్రాల్లో ఉండే శివస్వరూపం (లింగాకారం) మరియు ఆలయానికి సంబంధించి వాస్తు ఒకదానికి ఒకటి దగ్గరి పోలికలతో ఉన్నాయి

ఈ ఐదు ప్రసిద్ధ శివ క్షేత్రాలు ఏమిటంటే

1 అమరారామము (అమరావతి, గుంటూరు జిల్లా)- అమరేశ్వరుడు
2 భీమారామము (సోమారామం) - గుణపూడి భీమవరం (పశ్చిమ గోదావరి జిల్లా) - సోమేశ్వరుడు
3 క్షీరారామం (పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా)- రామలింగేశ్వరుడు
4 దక్షారామము (ద్రాక్షారామము, తూర్పు గోదావరి జిల్లా)-భీమేశ్వరుడు
5 కుమారారామము (సామర్లకోట, తూర్పు గోదావరి జిల్లా) భీమేశ్వరుడు


ఈ ఐదు క్షేత్రాలు కలసి ఉమ్మడిగా ఉండటానికి ఒక పురాణ కథను ఆధారంగా చెబుతారు

ప్రాచీనకాలంలో తారకాసురుడు విజృంభించి దేవతలకు కష్టాలు కలిగించాడు వానిపైకి యుద్ధానికి పోవటానికి దేవతల సేనానిగా కుమారస్వామి నిలిచాడు ఆ రాక్షసుడి గొంతులో ఉన్న అమృతలింగాన్ని ఛిద్రం చేస్తే ఆయనను గెలవవచ్చునని ఈశ్వరుడు చెప్పిన తర్వాత దేవసేనాధిపతి కుమారస్వామి ఆ అమృత లింగాన్ని పగులగొట్టి తారకాసుర సంహారాన్ని సాగించాడు పగిలిన లింగం ఐదు ముక్కలై ఐదుచోట్ల పడి పెరగనారంభించింది వానిని ప్రతిష్ఠించినచో పెరుగుదల ఆగుతుంది - అని శివుడే చెప్పాడు కాబట్టి దేవతలు, మునులు అంతా లింగ ప్రతిష్ఠాపనలో ఉద్యుక్తులైనారు సప్తర్షులు ఒక శుభముహూర్తాన్ని నిర్ణయించి ద్రాక్షారామంలోని భీమేశ్వరుణ్ణి ప్రతిష్ఠాపన చేయబోయారు సకాలంలో సప్తర్షులు ద్రాక్షారామం చేరకపోవడంవల్ల శివుడు స్వయంగా ప్రతిష్ఠ అయినాడు అమరావతిలో పడ్డ శివలింగ భాగాన్ని ఇంద్రుడు ప్రతిష్ఠింప చేశాడు అందువల్ల అది అమరారామం అయింది గుణపూడిలోని లింగభాగాన్ని చంద్రుడు ప్రతిష్ఠింప చేశాడు కనుక అది సోమారామం అయింది పాలకొల్లులోని లింగాన్ని శ్రీరాముడు ప్రతిష్ఠ చేయడంవల్ల క్షీరారామం అయింది ఉపమన్యువు అనే బాలకుని ప్రార్థనచే స్వామి పుష్కరిణిలో పాలు వెల్లువ అయినది కాబట్టి ఇది పాలకొల్లు అని ప్రసిద్ధి పొందింది ఉపమన్యుపురం అని కూడా దీనికి పేరు ఇక్కడి స్వామి క్షీరారామ లింగేశ్వరుడు సామర్లకోటలో కుమారస్వామి ప్రతిష్ఠ చేసినాడు కాబట్టి అది కుమారారామం అయింది

ఈ ఐదు క్షేత్రాల్లోనూ హరిపూజ కూడా జరుగుతుంది, ప్రసిద్ధంగానూ ఉన్నాయి ఛిద్రమైన శకలాలలో పెద్ద శకలం పడి ఉన్న అమరావతిలోని అమరేశ్వరస్వామి 15అడుగుల కంటే ఎత్తుగా ఉన్నాడు అతి చిన్న శకలం అయిన క్షీరారామంలోని స్వామి రెండు మూడు అడుగుల మధ్యన ఉన్నాడు మిగిలిన మూడు పై రెండింటికి మధ్యగల ఎత్తుగలవి వీటి వైశిష్ట్యాన్ని ఒక్కొక్కటే గమనించాలి కవి సార్వభౌమ శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలోని ఈ ఐదు ఆరామములను గురించి వివరంగా చెప్పాడు స్కాంద పురాణంలోని గోదావరి ఖండంలో కూడా వీటి గురించి వివరాలున్నాయి ఈ ఆలయాలు వెయ్యేండ్లకు మించిన ఇతిహాసాన్ని తమలో శాసన రూపంగా గుర్తింపబడి ఉన్నాయి ఆలయాల, దేవాదాయశాఖ, ప్రాచ్య శాఖ పరిపత్రాలు ఆలయాల గురించి తగినంత వివరాలను ఇస్తాయి

**అమరావతి**

గుంటూరు జిల్లాలోని ఐతిహాసికస్థలం ఇక్కడ కృష్ణానది ఉత్తర దక్షిణంగా ప్రవహిస్తుంది పూర్వంలోని బంగాళాఖాతం చేరే కృష్ణానదికి ఇక్కడ ఒక మలుపు నది దక్షిణానికి అమరావతి ఉన్నది వెనుకే ధాన్యకటకము అనే ప్రఖ్యాతమైన ఊరు కాలక్రమంలో ధరణికోట అయినది ఊరు పెద్దది, పూర్వభాగంలో కాలానంతరం అమరులు వచ్చి ఇక్కడ నివాసం ఏర్పరచుకున్నారు కాబట్టి, మరియు అమరలోకపతి ఇంద్రుడు శివలింగ ప్రతిష్ఠ చేసినందువల్ల ఇది అమరావతి అని పేరు పొందింది ఇతిహాసంలో అమరావతి పేరు పెద్దది ఇక్కడ ఉన్న బౌద్ధ స్థూపము గుర్తులను మద్రాసు కలకత్తా మ్యూజియం లలో చూడవచ్చును ఇక్కడే ఉన్న మ్యూజియంలో కూడా మిగిలిన కొద్దిపాటి అవశేషాలను చూడవచ్చును బౌద్ధధర్మ చరిత్రలోని ఒక ముఖ్య ఘట్టాన్ని అమరావతి చిత్రిస్తుంది ఆపైన శివక్షేత్రంగా ప్రసిద్ధిచెంది నిత్యపూజ గైకొనే అమరేశ్వరస్వామి ఇక్కడ ఉన్నాడు గుడి దివ్యంగా, భవ్యంగా ఉన్నది



నాలుగు దిక్కులలో ఒకే ఎత్తుగల నాలుగు ద్వార గోపురాలు ఉండే ఆలయం దూరం నుంచే భక్తులను పిలుస్తుంది. పూర్వంలోని స్నానఘట్టాల సోపానాలను ఎక్కి ఆలయ ప్రవేశం చేస్తే లోపల మూడు ప్రాకారాల గుడి, ప్రాకారాంతరంలో పలు చిన్న చిన్న గుళ్ళు, పలు దేవతా మూర్తులు, ముఖ్యాలయము ముందు నందీశ్వరుడున్నాడు నందీశ్వరునికి ముందు మహా మంటపం, తర్వాత ముఖ మంటపం, ముఖమంటపంలోని ఒక వైపుకు ఒక చిన్న ఆలయంలో అంబికామూర్తి ఉంది. పేరు 'బాలా చాముండికాంబా దేవి'. గర్భగుడి ఒక అంతరాళం తర్వాత ఆరంభమౌతుంది. ఎత్తైన గర్భాలయం. ఇక్కడ తెలతెల్లని 15 అడుగులకు ఎత్తైన మూడు అడుగుల గాత్రమైన అమరేశ్వరస్వామి కొలువై ఉండాడు. ఈ శివలింగానికి అభిషేకం చేసేందుకు గర్భాలయం గోడలకు చేరి ఉన్నట్టు నిర్మాణమైన ఎత్తైన అట్టానికి సోపాన పంక్తులను ఎక్కి చేరవలయును

ఈ ఆలయాన్ని క్రీ శ 9వ శతాబ్దిలో పూర్వచాళుక్యుల భీమదేవుడు నిర్మించినట్టు చెప్పబడింది అక్కడి నుంచి వచ్చిన రాజులలో పెక్కుమంది అమరేశ్వరస్వామి కైంకర్యంలో శ్రమపడ్డట్టు, దానాలు ఇచ్చినట్లు శాసనాలు ఉన్నాయి. విజయనగర రాజు కృష్ణదేవరాయలు ఇక్కడ ఒక మంటపం కట్టించాడని ఋజువు లున్నాయి ఒక శాసనాన్ని ఉటంకించడంతో ఈ గుడియొక్క ఐతిహాసిక ముఖాన్ని గమనించినట్లౌతుంది క్రీ శ 1626లో పెద్దప్పంగారును ఆయన ధర్మపత్ని కొండాయమ్మ వెంకాయమ్మగారు వేయించిన శాసనం ఇది

శ్రీ శుభమస్తు హంద్రికె పెద్దప్పంగారి శాసనమ్

''స్వస్తిశ్రీ శ్రీ మద్దరి గురుభక్తి పరాయణ ఏకవాక్య ప్రతిష్ఠాపనాచార్య అసవరతే భూసుర ఆశీర్వాద సంపన్న చతుర్వేద పారాయణ శ్రీ అమరేశ్వర వరప్రసాద భారద్వాజగోత్ర పవిత్ర కోనయగర్భ పరిపూర్ణ నరగమాంబ ప్రియకోమారులైన హంద్రికె వంశోద్ధారకుడైన పెద్దప్పంగారున్ను వీరి దేవులవారు గౌరీవర ప్రసాదులగు కొండాయమ్మ వెంకాయమ్మ వీరు జూచ్చూరు నుంచి వచ్చి శాశ్వితంబగునని ఈశ్వరాజ్ఞచే శాలివాహన శక వర్షంబులు 1548 అగు నేటి అక్షయ సంవత్సర శ్రావణ బహుళ దశమి, ఆదివారం నాడు ధరణికోట అమరేశ్వర లింగమును మూడో ప్రతిష్ఠ చేసేను ఇంద్రుడు ధాన్యవాటిక నమృతేషు ప్రతిష్ఠమోనర్చె పంట రెడ్డీంద్రుడు అన్న వేము ధరణీశ్వరు చేసే పునః ప్రతిష్ఠ ఆ చంద్రదినేంద్ర తారకము శాశ్వత మవునని ఈశ్వరాజ్ఞచే హంద్రికె పెద్ద మంత్రి సుగుణాంబుధి నిల్పెను సుప్రతిష్ఠయును'' (ఇది క్రీ శ 1626 వ సం॥ము మాట)

18వ శతాబ్దంలో (1796) అమరావతికి వచ్చి వెలసిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు ఈ క్షేత్ర పునరుద్ధరణకు కారణమయ్యేను ఆలయ జీర్ణోద్ధరణ చేయడమేగాక నిత్య పూజాదులకు ఏర్పాటుచేసి పురోహితుల అశన, వసతులకు తగు మాన్యాలను ఇచ్చి ఆలయంలో ఉత్సవ ఊరేగింపులు నడుచునట్లు వారే పెద్దగానిల్చి పర్యవేక్షించారు. తమ తండ్రిపేరున జగ్గయపేటను, తల్లిపేరున అచ్చంపేటను, తన పేరున రాజంపేటను నిర్మించిన మహాదాన చక్రవర్తి ఈయన. ఈయన కాలంలో అమరేశ్వరస్వామి వైభవం మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లింది

అస్తిశ్రీ ధాన్య కటకం పురం సురపురాద్వరం
యత్రా మరేశ్వర శ్శంభు అమరేశ్వర పూజితం
అస్తి తత్ర స్థిరైశ్వర్యం రాజ్ఞాం అబ్జాంపతాం కులం
అమరేశ్వర దేవేన రక్షితం రక్షకం నృణాం

(శాసన పద్యం)

అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు నుంచి 20 మైళ్ళ దూరంలో ఉంది సత్తెనపల్లి తాలూకాకు చెందింది

**కుమారారామం**

రాజమహేంద్రవరానికి 50 మైళ్ళ దూరంలో ఉత్తరానికి సామర్లకోట రైల్వేజంక్షన్ ఉంది ఇక్కడ నుంచి దక్షిణానికి ఒకటిన్నర మైళ్ళ దూరంలో కుమారారామం ఉంది ఇది ప్రాచీన

గ్రామం. చాళుక్యవంశం రెండై ఒకటి పూర్వంలో నిలబడి వెంగీ చాళుక్యులు అని గుర్తింపబడి సామ్రాజ్యాన్ని కళింగదేశం వరకు విస్తరించినపుడు మొదట్లో పిఠాపురాన్ని, తర్వాత వేంగీ




మండలాన్ని, తర్వాత రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసికొని ఏలినారు. ఈ కాలంలో పలు గుడి గోపురాల నిర్మాణానికి కారణమైనారు. వారిలోని చాళుక్య ఒకటవ భీముడు (క్రీ.శ.892 నుంచి 922 వరకు) సామర్లకోటలోని కుమారారామం భీమేశ్వర ఆలయాన్ని 9వ శతాబ్దం చివర్లో నిర్మించాడని పిఠాపురంలోని ఒక శాసనం తెలుపుతుంది.

కుమారస్వామి తారకాసురునిపైన జరిగిన యుద్ధానికి సేనాధిపతి అయి యుద్ధం చేసినపుడు, ఎంత చేసినా తారకాసుర వధ సంభవించకపోయినపుడు శివుడు చెప్పినట్టు తారకాసురుని కంఠంలోని శివలింగాన్ని పగులగొట్టినపుడు తారకుని వధ సంభవించినా, ఈ ఛిద్రమైన లింగ భాగాలు వేరు వేరు చోట్ల పడి పెరగనారంభించాయి. అప్పుడు కుమారస్వామి తానే ముందుకు వచ్చి ఒక ఛిద్రభాగాన్ని సామర్లకోటలో స్థాపించాడు. ఇదే సోమారామం.

అమరావతి అమరేశ్వరస్వామి గర్భగుడి లోపల ఎత్తు ఎక్కువ. అయితే ఇక్కడి ఆలయమే రెండంతస్తులలో నిర్మితమై ఎత్తైన శివలింగానికి చోటు చేసి ఇస్తుంది. ఆలయము 120 అడుగులకు పైగా చౌక ప్రాకారంలో కూడినది. రెండు అంతస్తులు కలది. దీనికి కలుసుకున్నట్లు లోపల గోడలకు కంబాలతో అనుకొన్న చుట్టు మంటపాలున్నాయి. నాలుగు వైపుల నాలుగు ద్వారాలు, లోపల రెండవ ప్రాకారం రెండు అంతస్తులు అయినది. దాని లోపల ముఖ్య ఆలయం ఉన్నది. ఈ ముఖ్యాలయం కూడా రెండు అంతస్తులు గలదే. స్వామిని చూడడానికి పూర్వభాగంలోనే సూర్యద్వారంలో మెట్లెక్కి పై అంతస్తులో దర్శనం చేసుకోవాలి. ప్రదక్షిణా మార్గంలో అలాగే ముందుకు నడిచి నాలుగు ద్వారాలలోనూ, నాలుగు దిక్కుల నుంచి స్వామిని చూసి కుడివైపుకు ఉన్న చంద్రద్వారంలో నుంచి క్రిందికి దిగాలి. ఇక్కడ అమ్మవారిపేరు బాలాత్రిపుర సుందరి. సర్వాలంకార భూషితురాలై వాత్సల్యమూర్తిగా కనబడుతుంది అమ్మ.

ఇక్కడ శివుని ఎదురుగా ఉన్న బసవన్న ఉల్లే ఖనీయుడు, దర్శనీయుడు అగును. నూరు స్తంభాల మంటపం సర్వాంగ సుందరంగా ఉంటుంది. ఒక్కొక్క స్తంభంలోని వేరు వేరు చిత్రాలు కనులకు కట్టినట్లు కనబడతాయి. ఇక్కడ పశ్చిమ గోడలో ఉండే గణపతికి 'వజ్ర గణపతి' అనిపేరు. ఇతడి నాభిలో వజ్రపురాయి ప్రతిష్ఠ అయినదట. వీరభద్రుడు, కుమారస్వామి విగ్రహాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. సరస్వతీ విగ్రహమైతే నిలిచి చూడాలి. పలుస్తంభాలపైన, పలుకాలాల పలువురు చేసిన దానాలకు నిదర్శనాలు ఉన్నాయి. 15వ శతాబ్దంలో కొండవీటి రాజు కాటయవేమారెడ్డి ప్రతిష్ఠించిన మహిషాసురమర్దిని విగ్రహాన్ని ఈ మధ్యనే జరిగిన త్రవ్వకాలలో బయటకి తీయటం జరిగింది. ఇది ఒక అపూర్వమైన శిలాకావ్యం.

ఆలయం ముఖద్వారం ఉత్తరానికి ఉన్నా కూడా గుడి పూర్వభిముఖమైనది. పూర్వంలో మొదట ఆలయ పుష్కరిణి, భీమగుండం ఉంది. ఇక్కడ శాసనాలు చాలా భాగం 15వ శతాబ్దానికి చెందినవి. దాదాపు ముప్పైకి పైగా ఉన్నాయి. పశ్చిమ దిగ్భాగంలోని కప్ప కంభంపై శాసనం గమనార్హమైనది. ''శ్రీ అవిఘ్నమస్తు, శుభమస్తు, ప్లవంగనామ సంవత్సర కార్తీక బహుళ చతుర్థి, అనాటి రాత్రి చాళుక్య భీమేశ్వరుని నంది స్తంభం మీద నందికేశ్వర పదార్థం ఉన్నదని దొంగలు పడదోశినారు. శిథిలమైపోయింది. శ్రీమత్ కుమారారామ భీమేశ్వరుని నంది స్తంభం మీది వృషభం శిథిలం అయి ఉండగాను పునః నూతన వృషభం చేయించిన శుభముహూర్తం, చేయించిన దినం సౌమ్యనామ సంవత్సర ఆశ్వీజ బహుళ ఏకాదశి ఉదయమయిన 10 ఘడియల వేళను, వృశ్చిక లగ్నమందు వృషభం ప్రతిష్ఠ అయ్యెను. శ్రీదేశం శెట్టి పృథ్వీజెట్టి సాంప్రదాయము, కామిశెట్టి పాతమ్మకు పౌప్రుడు నారశింహుడు. ఇతనికి అనుకూలవతి భార్యలక్ష్మి రాజమహేంద్ర దరిని కోటి లింగాల వద్ద నుంచి శిల తెప్పించి నంది ప్రతిష్ఠ అయిన పర్యంతము ఫలహారం చేస్తున్న భీమేశ్వరుని అర్పితం ఆయెను కోసూరి పసాయప్రాలు''.



ఇంకొక శాసనం ఇక్కడ ప్రతిష్ఠాపితం అయిన గౌరీపరమేశ్వరిని గురించి చెబుతుంది. "శ్రీ శకవర్షంబులు 1348 అగు నేటి పరాభవ సం॥ మాఘ బహుళ ఏకాదశీ నాడు కొమారారామ భీమేశ్వర దేవర నగరిలోపలను మూల స్థానమునందు మంత్రి ప్రెగ్గడ సూరనంగారు ఆచంద్రార్కం అగునట్లుగాను ఉత్తమ నీల శిలను గౌరీ పరమేశ్వరిం జేయించి ప్రతిష్ఠ చేసెను" ఇదే శాసనాన్ని సంస్కృతంలో వసంత తిలక వృత్తంలో రెండు పద్యాలుగా వ్రాసి తెలుగు లిపిలో వ్రాయడమైనది.

నాగాబ్ధిరామ శశి సంగణితే శకాబ్దే
శ్రీమత్పరాభవ సమోదిత మాఘకృష్ణే
ఏకాదశీ గురు దినాన్విత మీన లగ్నే
చాలుక్య భీమ వర భీమ మహేశ్వరాగ్రే
భక్త్యా కరోదతుల నీల శిలా విశేషా
విద్యోతమాన గిరిజా ప్రతిమా ప్రతిష్ఠామ్
నిత్యం వివేక నిధి రక్షయః పుణ్యసిద్ధ్యైః
మంత్రీశ సూర్య విభురాయః జనాభి వంద్యః.

ఆ రోజు గురువారం అనునది, ఆ లగ్నము మీనలగ్న మనునది మంత్రి సూరన జనతాభివంద్యుడు అనేవి సంస్కృతంలో అధికోక్తులు.

ఇకొక శాసనం కంబ శాసనం. ఆరు ముఖాల కంబంలో ఉండే శాసనం. చాలా ముఖ్యమని చెప్పవచ్చు. ఇది ఇలా సాగుతుంది.

శుభమస్తు....
శ్రీమాన్ శ్రీ పులికంటి గోత్ర తిలకః పాలూరి వంశోద్భవః
పుత్రో వీరమనాయకస్య సుజనః పోతాంబికా గర్భజా
స్కందారామ చళుక్య భీమ నగరీ భీమేశ్వర ప్రీతయే
దద్యతాం ఎలుదుర్తి నామక నదీమ్ రమ్యాం యఃప్రభుః
ఏలానద్యా సముద్ధృత్య యలతుర్తి నదీం వరాం,
రోనాడ ప్రాంతరానీతం గురుగుడ్డ సమన్వితాం
కుమారరామ నాథాయః భీమేశాయః జగద్గురోః
ఆ చంద్రార్కం యథా భూత్వా తథైవార్పితవాన్ ప్రభుః.


మొదటి నాలుగు పంక్తులు శార్దూలవిక్రీడితమైతే కడపటి నాలుగు పంక్తులు రెండు శ్లోకాలు. ఇక్కడ ఈ సంస్కృత పద్యానికి తెలుగు గద్యంలో అనువాదాన్ని కూడా ఇవ్వడం జరిగింది. దాని తాత్పర్యం ఇలా ఉంది.

పాలూరి వీరమనాయకుని కుమారుడైన యలమ నాయకుడు ఏలానదికి ఎలతుర్తి కాలువను త్రవ్వించి రోనాడు ఎల్లలకు నీరు ఎత్తైన గుట్టను తిరిగి వచ్చేటట్టు చేసి భీమేశ్వర దేవరకు ఆనంద సంవత్సరంలోని పుష్యమాసం శుద్ధ ఏకాదశినాడు సోమవారం ఉత్తరాయణ మకరసంక్రాంతి దినమందు కుమారరాయ భీమేశ్వర దేవాలయంలో కైంకర్యంగా సమర్పించెను. సంస్కృతంలో లేని వర్షంపేరు ఉండగా దానికి తోడు శాసనాన్ని అతిక్రమించే వాళ్ళు అరవై వేల ఏండ్ల రౌరవ నరకం పాలగుదురు అనే శాపనార్థం ఉంది. నందా దీపానికి ఏర్పాటు చేసి పశువులను, గ్రామాలను దానంగా ఇచ్చిన శాసనాలు ఇక్కడ ఉన్నాయి. క్రోధినామ సంవత్సరం శాలివాహన శక 1145(క్రీ.శ. 1223)లో దేవయ్యుని కొడుకు దాల సింగనుడు కల్యాణ చంద్రశేఖర మూర్తిని చేసి సమర్పించెను. దాదాపు 6 5 శాసనాలు ఇక్కడ ఉన్నాయి.

### క్షీరారామం

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుంచి 5 మైళ్ళ దూరంలో పాలకొల్లు అనే ప్రాచీన గ్రామం ఉంది. దుగ్ధవన పురం పాలకోట, ఉపమన్యుపురం, పాలకొల్లు అని వేరే వేరే కాలంలో గుర్తింపబడ్డ స్థలం ఇది. నగర మధ్య భాగంలో గగన.గాములను చెయ్యెత్తి పిలచేటటువంటి అతి ఎత్తైన గోపురం ఇక్కడ ఉంది. ఇక్కడ శివలింగాన్ని స్వయంగా శ్రీరాముడు ప్రతిష్ఠించాడని స్థల పురాణం చెబుతుంది. రావణుని వధతో శ్రీరామునికి శివభక్తుడి బ్రహ్మహత్యా దోషం తగిలింది. చింతలో నడిచిన రామచంద్రునికి దండకారణ్యంలో అగస్త్యమహర్షులు కనబడి తీర్థయాత్ర గైకొని శివలింగ ప్రతిష్ఠాపన చేస్తే దోషం దూరం అవుతుందని సలహా ఇచ్చాడు. అలాగే అయింది. రాముడు ప్రతిష్ఠించినది కాబట్టి రామేశ్వరమై, ఉపమన్యు ప్రార్థనతో పుష్కరిణిలో పాలు పొంగి అభిషేకానికి అయి వచ్చిన కారణంగా క్షీరారామ లింగేశ్వరమైనది.





నగరం మధ్యలో ఆలయ మహద్వారం పూర్వదిశలో ఉన్నది మహద్వారం ఎత్తుగా ఉండి దానిపైన తొమ్మిది అంతస్తుల ఎత్తైన మహద్వార గోపురం ఉన్నది 73 కంబాలతో కూడిన లోపల ఆలయాన్ని చాళుక్య భీముడు తన పరిపాలనా సంవత్సరమైన క్రీ శ 892 నుంచి 922 నడుమ నిర్మించి ఉండాలి గర్భగుడి మధ్యలో పంచారామాలలో చిన్నదైన దాదాపు ఒకటిన్నర నుంచి రెండు అడుగుల ఎత్తు ఉండేటటు వంటి పాలరాతి శివలింగవుంది ఆలయంలోని మహామంటపం లోపల చిన్న గుళ్ళు ఉన్నాయి వినాయకుడు, కుమారస్వామి, గోకర్ణేశ్వరుడు మొదలైన ఇరవైకి మించిన దేవతలు ఇక్కడ ఉన్నారు జనార్ధనస్వామి విగ్రహం కలిగి ఉన్నది శివుడికి ఎదురుగా ముఖ మంటపంలో నందీశ్వరుని విగ్రహం ఉంది ముఖమండపానికి గర్భగుడికి నడుమ స్వామి శయన గృహం ఉంది ఇక్కడ కంబాలలోని చెక్కడాలు ఆకర్షణీయమైనవి

క్షీరారామంలో 40కి మించిన శాసనాలున్నాయి అన్నీ క్రీ శ 1000కి ఇవతలివి 10వ శతమానంలో వేలుపతి దేవయ్య కవి ఆలయంలోని బయటి ప్రాకారాన్ని నిర్మించాడని చెప్పబడింది క్రీ శ 918లో చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించాడనే మాట వుంది రామ లింగేశ్వర ఆలయంలోని పగిలిన పాత నంది కంభంలోని చెరిగి పోయిన తెలుగు శాసనంలో భీమవల్లభుని పేరు ఉంది ఆయనను నృపతి అని పిలవడం కనబడుతుంది క్రీ శ 1415 అల్లాడి రెడ్డి భూపాలుడు ఈ ఆలయంలో కీర్తికళశమైన ద్వారగోపురాన్ని నిర్మించాడు క్రీ శ 1221 ఉత్తరాయన సంక్రాంతినాడు రాజు తనయుడు పితురుల పుణ్యానికై మడసుపల్లి గ్రామాన్ని దానం చేస్తూ పాలేశ్వర దేవుని ముందు నందాదీపాన్ని పెట్టడానికై 50 అవులను దానం చేశాడనేది ఆలయ ముఖ మంటపం స్తంభంలో చెప్పబడింది

ముఖమంటపంలోని వేరొక కంబంలో ఉండే తెలుగు శాసనంలో చెప్పినట్టు 'సర్వలోకాశ్రయ విష్ణువర్ధన బిరుదాంకిత శ్రీ శంకర హరిదండ మహారాజులు ఏలుతూ ఉండగా శాలివాహన శక 1518 దుర్ముఖి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నాడు (1597, ఫిబ్రవరి 19, శనివారం) శ్రీ శాత్తాద బేహార మహాపాత్రుడు ముఖమంటపాన్ని నిర్మించెను క్రి శ 1198లో కోనగణపతి మహాదేవ మహారాయుడు పూర్వంలోని మహద్వారంలో కంచుద్వారాన్ని, మండపాన్ని నిర్మించాడని చెప్పబడింది క్రీ శ 1157లో వెలనాటి చోళుని పత్ని గుండాంబిక అఖండ దీపదానం చేసింది 1773లో ఆలయ మహాప్రాకారం లోపల లక్ష్మీ నారాయణస్వామి గుడి నిర్మితం అయింది 1777లో వినాయకుడి గుడిలో కల్యాణ మంటపం నిర్మితం అయినది '

మరొక శాసనంలో శాలివాహన శకం 1562లోని విక్రమ సంవత్సరం మార్గశిర శుద్ధ ఏకాదశిలో క్షీరారామం గుడిలో చిన్న గుడి కట్టించి కాకుపాటి శెట్టి కృష్ణమగారు తమ తండ్రి భీమి శెట్టి, తల్లి మల్లమ్మ గార్ల ధర్మానికి హనుమంత రాయుణ్ణి ప్రతిష్ఠాపన చేసి ధూపదీప నైవేద్యానికి ఏర్పాటు చేశారు

**సోమారామం**

సోమారామం అనేది గుణపూడి భీమవరంలోని ఒక భాగం ఎత్తైన మహద్వార గోపురం మధ్యన విస్తారంగా ఉండే ఆలయం రెండు అంతస్తులలో పెరిగింది ''గౌతమీ తీరంబున దక్షిణ కూలంబున గుణపూడి అను గ్రామంబున సోముని చేతం ప్రతిష్ఠింబగుటచేసి సోమ లింగమున ప్రఖ్యాతంబై సోమా రామంబును'' అని కవి శ్రీనాధుడు తన భీమేశ్వర పురాణంలో





చెబుతాడు  పెరుగుతూ ఉన్న వింధ్య పర్వతం, ఆ పెరుగుదలను నిలుపుటకై దేవతల ప్రార్థన మేరకు దక్షిణానికి వచ్చిన అగస్త్యమహర్షి – సోమునిచే ప్రతిష్ఠాపితమైన సోమేశ్వర లింగాన్ని పూజించి తృప్తి చెందెనని చెబుతారు



చంద్రునిచే స్థాపితమైన సోమలింగం చంద్రుని వృద్ధిక్షయములను అనుసరించి నడిచేటట్టు కానవచ్చును  అంటే పాలరాతి వర్ణంలో ఉన్న శివలింగము పూర్ణిమ నుండి అమావాస్యకు వచ్చే 15 రోజులలో గోధుమరంగు పొందును  మరియు పూర్ణిమ పుకు తిరిగి 15 దినాలు నడిచి తెలుపురంగు దాల్చును, అని ప్రఖ్యాతి  పంచారామములలో ఒక ముఖ్యలక్షణం ఎమిటంటే ఐదు ఆలయాల శివలింగములు శ్వేత వర్ణం కలవి  ఇక్కడ మాత్రమే వన్నె తిరిగేదానికి అవకాశం ఉంది  సుమారు మూడు అడుగుల శివలింగం గర్భగుడిలో పశ్చిమాభిముఖంగా పూజను స్వీకరిస్తుంది  మహద్వార గోపురమే పశ్చిమాభిముఖంగా ఉంది  శివలింగానికి కుడిపైపుకు సమకోణంలో ఉన్న ఇంకొక గర్భగుడిలో పార్వతీదేవి ఉంటే, శివలింగం పై అంతస్తులో అన్నపూర్ణాదేవి ప్రతిష్ఠాపితమై ఉన్నది  అన్నపూర్ణకు ఎదురుగా ఒక అంతరాళం, తర్వాత మహామంటపం  క్రింద అంతస్తులో కూడా ఇదే విన్యాసం ఉంది  పశ్చిమ భాగంలో లోపలకు వచ్చిన భక్తులు ఉత్తర భాగంలో బయటకు వచ్చి ప్రదక్షిణా పథంలో చుట్టి ముఖ్యాలయం కుడివైపుకు వస్తే క్షేత్రపాలకుడైన జనార్ధనస్వామి ఆలయాన్ని చూడవచ్చును  ఇక్కడ శ్రీ భూదేవి సమేతంగా జనార్ధనస్వామి శంఖచక్ర గదా పద్మములతో శోభిస్తున్నాడు

ఇక్కడనే ఆంజనేయస్వామికి ప్రత్యేకమైన చిన్న గుడి ఉంది  నవగ్రహములు, కుమారస్వామి కూడా ఇక్కడున్నారు  ఆలయం బయట పూర్వానికి చంద్ర పుష్కరిణి ఉంది  దీన్ని సోమగుండం అని పిలుస్తారు  ఆలయంలో పలుచోట్ల గోడలలో, కంబాలలో శాసనాలు చెక్కి ఉండడాన్ని గమనించవచ్చు  ఇక్కడ ఒక గమనించ దగ్గ విషయమేమంటే ఇక్కడి గోడలు పదేపదే జీర్ణోద్ధరణమై ఆలయ శాసనాలు చెరిగి ఉండుట, లేక మాయమై పోవుట  ఇక్కడ మంటపంలోని ఒక శాసనంలో క్రీ శ 1434లో దేవయుని కొడుకు సింగయ్యుడు గుణిపూడి భీమవరం సోమేశ్వర స్వామికి పలురీతులు దానాలు సమర్పించినట్లు చెప్పబడింది


## ద్రాక్షారామం

ద్రాక్షారామం పంచారామాలలో ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రం  ఇతిహాస దృష్టితోనే కాక పురాణ దృష్టితోను అత్యంత గణనీయమైన క్షేత్రమే  దక్షుడు యజ్ఞం చేసిన కారణంగా 'దక్షారామము' అనేపేరు కాలక్రమంలో ద్రాక్షారామం అయి ఉండవచ్చును  కారణం గోదావరీ నదీ జలాలలో పెరిగే తమలపాకుల తీగలవలె పందిరికి అల్లుకొని పెరిగే ద్రాక్షతోటలు ఒక కాలంలో సమృద్ధిగా ఉండవచ్చునని అనిపిస్తుంది  శాసనాలలో మాత్రం ఈ ఒక్క క్షేత్రాన్ని ప్రాచీన కాలంలో 'డాకరేమి' అని, 'పెదడాకరేమి' అనే పేర్లతో పిలుస్తూ ఉన్నారు- అనునది ఈ ఆలయంలోనే దొరికే శాసనాలను బట్టి తెలుస్తుంది

తారక వధానంతరం ఆయన గొంతులో ఉన్న అమృత లింగం ఐదు భాగాలుగా ఐదుచోట్ల పడింది  ఆ శకలాలు



విపరీతంగా పెరి టట్టు కాక, పెద్దవై పోకుండా ఉండేందుకు వాటి ని ప్రతిష్ఠ చేయాలనే ఒక సాధారణ సూత్రంతో ద్రాక్షారామంలో శివలింగ ప్రతిష్ఠాపనకు సప్తర్షులు ముహూర్త శుద్ధిని నిర్ణయించారు. ఆ సమయంలో శివుని మూర్ధాభిషేకానికి దేవగంగ ఉంటే బాగుంటుందని తలచిన సప్తర్షులు గోదావరిని వెంటపెట్టుకొని అమరాధిపతి ఇంద్రునితో ద్రాక్షారామం వైపు నడిచినారు. ఋషుల వెంట వచ్చిన గోదావరి నది దారిలో ఉన్న రాక్షస మునుల ఆశ్రమాలను నేల కరిపించినది. వాళ్ళకు కోపం వచ్చి గోదావరి చలనాన్ని ఆపివేశారు. గోదావరికి దారి వదిలేదే సబబు అయినదని సప్తర్షులు అసుర మునులతో వాదానికి దిగారు. సమయము ఆసన్నమైనది. ముహూర్తం మీరిపోకూడదని శివుడు తనే స్వయం ప్రతిష్ఠితుడు అయినాడు. అసురులకు నచ్చచెప్పి గోదావరిని వెంటపెట్టుకుని మళ్ళీ ముందుకు వచ్చిన సప్తర్షులకు ఈ సంగతి తెలిసి దుఃఖమాయెనం. సూర్యుడు దిగివచ్చి 'అయ్యా! మీరు చెప్పిన ముహూర్తానికే శివుడు ప్రతిష్ఠితుడైనాడు. నేను పూజ సల్పాను. హరి, బ్రహ్మలు పూజలో కలిసివచ్చారు. తమరు కూడా పూజలు చేసుకోవచ్చును. తమరు ఆలస్యం చేయక పూజ చేయడం సబబు' అని చెప్పగా సప్తర్షులు కోపాన్ని విడనాడి పూజచేశారు. తమవెంట తెచ్చిన గోదావరిని స్వామిఆలయ పూర్వంలో పుష్కరిణిలో నిలిపారు. గోదావరి నది ఏడుపాయలై, వానిలో ఐదు గుప్తగాములై గౌతమి మరియు వశిష్ట పాయలు మాత్రమే సామాన్యంగా కనపడేవి అయితే ఇక్కడ ద్రాక్షా రామంలోని స్వామి పుష్కరిణిలో సప్తధారలు సుప్తంగా చేరి పూర్ణగోదావరి అయి ఉందని ఐతిహ్యం. అందువల్లనే దీన్ని సప్తగుండం అంటారు. పూర్ణ గోదావరి అంటారు.



ద్రాక్షారామం ఆలయం నాలుగు వైపుల ఉండే పెద్ద మహాద్వార గోపురాలు ఇక్కడ ఆకర్షణీయమైనవి. సామర్లకోట మాదిరిగానే ఇక్కడ కూడా పూర్వద్వారం వెలుపలకు పుష్కరిణి ఉంది. దక్షిణ దిక్కునుంచి ఆలయప్రవేశం అయినా కూడా రెండవ ప్రాకారంలోపల ఉండే ముఖ్యాలయానికి పూర్వం నుంచే పోవాలి. ఇక్కడ కూడా ఆలయానికి ఎడమవైపున ఉన్న మూలలో సోపాన పంక్తులను ఎక్కి పై అంతస్తులోకి పోయి స్వామిని దర్శించాలి. 15 అడగులకు మిక్కిలియై మూడు అడుగుల మందం (గాత్రంలో) తెల తెల్లని అమృతశిల భీమేశ్వర స్వామిని చూస్తూ నిలవాలి అనిపిస్తుంది. చుట్టు ప్రదక్షిణా పథంలో నాలుగు ద్వారాలలో స్వామి దర్శనం సాధ్యం అవుతుంది. ప్రదక్షిణా పథం ఉత్తరానికి ఒకవైపు పార్వతీదేవి విగ్రహం ఉంది. అమ్మవారి పేరు మాణిక్యాంబ. కొంచెం దూరంలో ఇక్కడనే దక్షపుత్రి సతీదేవి విగ్రహం కూడా ఉంది. అయితే కల్యాణోత్సవం మాత్రం మాణిక్యాంబా భీమేశ్వరులకే. ఇక్కడ మాణిక్యాంబ శక్తిపీఠాలలో ఒకటని పేరెన్నికయిన మూర్తి. స్వామిని ఆరాధించి ప్రదక్షిణా పథంలో ముందుకు వచ్చి ముఖమంటపానికి చేరితే అక్కడ ఒక కంబంపైన వ్యాస భగవానులను గుర్తించి నమస్కారం చేసేది కద్దు. వారణాసిలో ఒకనాడు కుపిత శివుడు వ్యాసులకు గ్రామ త్యాగం చేయమనెను. మధ్యప్రవేశించిన అన్నపూర్ణ వ్యాసులపైన కోపాన్ని విడనాడమని శివుణ్ణి అర్థించింది. లోపాముద్ర సహితుడైన అగస్త్యుడు వ్యాసులవారికి ద్రాక్షిరామ మహిమను చెప్పాడు. అందువలన వ్యాసులవారు ఇక్కడ వచ్చి నిలిచాడు.

ఈ గుడిలో ఒక వైశిష్ట్యాన్ని గుర్తించాలి. సామర్లకోటలో ఉండేటట్లుగానే ఆలయ ఆవరణలో ప్రధాన ఆలయంలాగే

ఉండెటటువంటి ఒక చిరు ఆలయం ఉంది ప్రాయశః ఆలయ నిర్మాణానికి ముందు 'మాదిరి' గుడిని ఇలా నిర్మించుకొని ఉండాలి ఈ ఆలయం కూడా అదేకాలానికి అంటే చాళుక్య భీముడి కాలానికి- 10వ శతమానానికి చెందినది

ద్రాక్షారామంలో ఇతర ఆరామాలకంటే ఎక్కువ శాసనాలున్నాయి 400పై పెచ్చు తెలుగు, సంస్కృత భాషలు ప్రధానమైనా కూడా కన్నడ శాసనములు, రెండు గ్రంధ లిపిలోని శాసనాలు కూడా ఉన్నాయి ఇక్కడ శాసనాలలో కాల సూచకాలు అనేక విధములైనవి శాలివాహన శకము, చాళుక్య విక్రమ శకము, విజయిశకము (క్రీ శ 1060). ఈ శాసనాలు అన్నీ యధావత్తుగా ఉన్నవని గాని అన్నీ ఒక క్రమాన్ని అనుసరించిందినని కాని లేదు అనేకసార్లు జీర్ణోద్ధారమైన ఈ దేవాలయంలో ఒక క్రొత్త విన్యాసము లాగా లోపలి ఆలయం బయట గోడపైన సాలు శాసనాలను పునః ప్రతిష్ఠించిన దానిని చూడవచ్చును ఈ నిర్మాణానికి ఏ ఒక్క ఆధార సూత్రము లేదు శాసనాల శిలల సైజు మాత్రమే ఆధారమని చెప్పవచ్చునం కంబాలపైన ఉండే శాసనాలు పెక్కు పగిలి ఉన్నా కూడా ఇక్కడ జీర్ణమైన అక్షరాలు ఎక్కువ సౌత్ ఇండియన్ ఇన్స్క్రిప్షన్ నాలుగవ సంపుటంలో ఈ అన్నీ శాసనాలను చూడవచ్చును ఈ లేఖనంలో ఉటంకించిన శాసనాలు అక్కడినుంచే తీసు కొనబడినవి



ఒక శాసనం ప్రకారం శకవర్ష 990లో (క్రీ శ 1068) శ్రీ విష్ణు వర్ధన మహారాజులవారి ప్రవర్ధమాన విజయ సంవత్సరం 8లో 11వ నాడు విశాఖపట్టణం కమ్మకోటి మెడియసెట్టి కొడుకు పాపయ తులామాసం కృష్ణ త్రయోదశినాడు శ్రీ భీమేశ్వర దేవులవారికి ఒక అఖండ దీపాన్ని వెలిగించుటకై లోహపు దీపాన్ని ఏబది (50) ఆవులను దానం చేశాడు ఇంకొక శాసనం చెప్పేటట్లు శకవర్ష 1003లో (క్రీ శ 1081) శ్రీ చాళుక్య విక్రమశక 5లో శ్రీ యమేశ్వర మహాదేవుల వారికి ఉత్తరాయన సంక్రాంతి నిమిత్తంగాను దేవాంశు వామయుడి కొడుకు భీమేశ్వర దేవర పడిహారి రుద్రయ అనువారు ఆచంద్రార్కం దీపం వెలిగేందుకు ఏర్పాటు చేశాడు ఒక శాసన పద్యం హృద్యంగా ఉంది ఇక్కడి భాష తెలుగు విషయం ఆలయం జీర్ణోద్ధారణ దాని నడక ఇట్లా సాగుతుంది

''అమరాద్రి భీమేశ్వరా వాసం అబ్ధి సప్తకము శ్రీ సప్త గోదావరంబు (ఆలయ పుష్కరిణి), వలయాచల లేంద్రంబు వజ్రపు రాకోట (రాజకోట-వెలుపల ఆవరణ గోడ) కుల పర్వతంబులు పురంబులు, తిరుచుట్టుమాలియరవందజాండంబు, అమర్త్యలోకంబు నాట్యమంటపము, పరివార దేవతాభవనంబులు ఈ చతుర్దశ భవనంబులు, దారకములు కనకకంబ తతులు, గాంగ ద్రాక్షారామ మన్నవోంతు వేమనానుజుండు కడు నపూర్వ సృష్టి గావించి వాసనకెక్కె శ్రీవేమ సితయశుండు'' ఇది ప్రకాశ భారతి యోగి రచించిన కావ్యం పెద్దనాచార్య లిఖితం

ఈ శాసన కాలం శకవర్ష 1303, (క్రీ శ 1381) వైశాఖ శుద్ధ దశమి గురవారమందు దీపావళి, నాట్య, కల్యాణ, హోమ, శనివార, గయార్కమంటపాల, తిరుచుట్టు ప్రదక్షిణాపథం, దివ్యలింగాల గుడుల, వజ్రపు రాజకోట, గోపురాల, పాతాళ గేహల, సోపానములు, బండారములు, వివిధ ధాన్యాగారాలు, వంటశాలలు, ద్వారకవాటాలు మొదలైన అన్నింటినీ దిశలు పొగడ జీర్ణోద్ధారణ చేసినవాడు అనవేముడు

ఇక్కడ ఇంకొక వైశిష్ట్యాన్ని చెప్పాలి అదేమిటంటే ఆలయం వెలుపల ఉండే అన్నదాన సత్రం ద్రాక్షారామాన్ని సందర్శించే యాత్రికులకు భోజన సౌకర్యాన్ని ఉచితంగా ఏర్పాటు చేసే ఈ అన్న సత్రానికి 300సంవత్సరాలు నిరంతరంగా నడచివస్తూ యాత్రికుల అవసరాలను పూరిస్తూ ఉండే ఈ సత్రం వాళ్ళ పరిపాలన ప్రయత్నము స్తుత్యము, శ్లాఘ్యము

ఇప్పుడు పంచారామాలు ప్రసిద్ధమైన యాత్రా స్థలములై శివభక్తులను స్వాగతించే కర్షణ కేంద్రములైనట్లే విష్ణుస్థానాన్ని కూడా పొంది పొగడ్తలకు గురైనాయి అన్నీ చూచిన తర్వాత అనిపించేదేమిటంటే పంచారామములు ఒకప్పుడు ఆలయము వెలుపలి ఆవరణంలో వైశాల్యముగా నున్న ఉద్యాన వనాలను పొంది పెరిగి ఉండాలి సామర్లకోటలో ప్రాచ్య ఇలాఖావాళ్ళు తోటపనులను ఇప్పుడూ నడిపిస్తున్నారు ద్రాక్షారామంలోను కూడా పెద్ద ఉద్యానవన నిర్మాణానికి అవకాశంగా నీళ్ళ కొళాయిలు కూడా ఉన్నాయి క్షీరారామం మాత్రమే ఊరు మధ్యలో ఉండి ఇక్కట్లుకు గురైనది గుణపూడిలోని క్రొత్త క్రొత్త నిర్మాణంతో నేలను నునుపు చేసినారు అమరావతిలో నదీ తీరంలోని పులినరాశి ఆలయ ప్రాకారంలో చేరి రాళ్ళ పాన్పులకు అవకాశమైనది కొంచెం పరిశ్రమతో అన్ని చోట్లా పచ్చదనాన్ని తీసుకురావడానికి సాధ్యముంది పచ్చదనం ఎక్కువైతే పంచారామములు సార్థక నామధేయములై ఇతోధికంగా యాత్రికులను ఆకర్షిస్తాయి, అని చెప్పడంలో అతిశయోక్తి లేదు



# తిరుమల తిరుపతి దేవస్థాన ఆలయాలు


డా॥ కోరాడ రామకృష్ణ

గోదావరి పుష్కరాల సమయంలో తరలివచ్చే అశేషజనాన్ని అనుగ్రహించేటట్లు, భక్తుల దగ్గరకి భగవంతుడు వచ్చినట్లు తిరుమల ఆలయాన్ని నది ఒడ్డుకు తీసుకురావడం ఒక ఎత్తు. వేంకటేశ్వర సాహిత్యాన్ని పుష్కర జనులకు అందజేయడం ఇంకొక ఎత్తు. గోదావరి పుష్కర విశేష సంచికలో గోదావరి నది మలుపులను పరిచయం చేసినట్లే మచ్చుకు వెంకటేశ్వర సామ్రాజ్యాన్ని కూడ పరిచయం చేస్తున్నాం. సకల భువన భాండములు వెంకటేశ్వర సామ్రాజ్యమే అయితేను ఇక్కడ పరిమిత అర్థపరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన వ్యవస్థలో ఉన్న ఆలయాలను పరిచయాన్ని మాత్రం స్థాలీపులాకంగా ఇవ్వడం జరిగింది.

దేవాలయాలు మానవజాతి నాగరికతకు సంస్కృతికి చిహ్నాలు. కొండకోనల్లోను నిర్మలమైన నదీతటాలలోను వెలసిన గుళ్ళు మన మానసిక ఔన్నత్యాన్ని గుర్తుచేస్తాయి. మానవజాతి అభ్యున్నతికి దేవాలయాలు నిరంతరకృషిని సాగిస్తున్నాయి. విద్యలు, కళలు భగవంతుని ఆలయాలలో జీవం పోసుకున్నాయి. సంప్రదాయ విజ్ఞానానికి పట్టుగొమ్మలైన మన హిందూ దేవాలయాలు జాతి చైతన్యానికి జీవం పోశాయి. భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన దేవాలయాలలో తిరుమల ఒకటి.

**తిరుమల శ్రీ వేంకటేశ్వరుని ఆలయం**

ఈ తిరుమల దేవాలయ వైభవానికి ఒక గొప్పచరిత్ర ఉంది. ఎందరో మహాభక్తులు, కవులు, పండితులు, గాయకులు, కళాకోవిదులు తిరుమలలో జీవితం గడిపారు. తమ సారస్వత జీవితాలను ఆ స్వామికి అంకితం చేసారు. ఈ గుడిలో వేదాలు వినిపించారు; పాశురాలను పారాయణ చేశారు. గ్రంథాలను రచించారు. కీర్తనలను గానం చేశారు. నర్తకులు తిరుమల ఆలయ సన్నిధానంలో నృత్యమాడారు. రామానుజులవారు తిరుమల నంబి వద్ద రామాయణ రహస్యాలను తెలుసుకొన్నది ఈ ఆలయ పరిధిలోనే. తాళ్ళపాక కవులు మూడున్నాలుగు తరాలు సంకీర్తన యజ్ఞాన్ని నిర్వహించింది ఈ స్వామి సన్నిధినే. ఆళ్వార్లు, శ్రీపాదరాయలు, వ్యాసరాయలు, పురందరదాసు, కనకదాసు, విజయదాసు, త్యాగరాజు, దీక్షితులు మొదలైన భక్త గాయకులు ఈ స్వామి




సన్నిధిలో కీర్తించిన వారె. రాజాధిరాజులు ఈ స్వామికి ఎనలేని కానుకలు సమర్పించి కొలిచిన వారే.

భౌగోళికంగా తిరుమల ఆలయం 13°- 14° ఉత్తర అక్షాంశ రేఖల మధ్య 7°- 9° తూర్పు రేఖాంశము పైన సముద్ర మట్టానికి 3426 అడుగుల ఎత్తులో వ్యాపించిన తూర్పు కనుమలలో శేషగిరి మీద ఉంది చుట్టలు చుట్టుకొని పడుకొని ఉన్న సర్పాకార పర్వత పంక్తుల భాగంలో శ్రీశైల మల్లికార్జున దేవాలయం, శరీర భాగంపై అహోబల నరసింహస్వామి దేవాలయం, ఆయన పడగల మీద తిరుమల వేంకటేశ్వర దేవాలయం ఉన్నట్లు గోచరిస్తుంది శ్రీనివాసుని ఆలయం రెండెకరాల వైశాల్యంలో నిర్మింపబడివుంది

శ్రీమన్నారాయణుడు వేంకటాద్రికి చేరే ఇతివృత్తం వరాహ, భవిష్యోత్తరాదులైన పన్నెండు పురాణాలలో వివరించబడింది భృగుమహర్షి విష్ణువక్షాన్ని తన్నిన సంఘటనతో కలత చెందిన మహాలక్ష్మి వైకుంఠాన్ని వదలింది లక్ష్మీ విరహితుడైన హరి వేంకటాచలానికి వచ్చాడు అప్పట్లో వరాహస్వామికి చెందిన పర్వతారణ్య ప్రదేశంలో ఉండి పద్మావతిని వివాహమాడి తొండమానుడు నిర్మించి ఇచ్చిన ఆనంద నిలయంలో శ్రీనివాసుడు వెలిశాడు

ఇక్కడ ఆళ్వారుల పాశురాలలో కొనియాడబడిన వేంకటేశ్వరునికి అప్పట్లో ఆలయం ఉన్నట్లు తెలియకపోయినా తరువాతి ఆళ్వారుల కాలంలో దూరానికి కనిపించే కొండలరాయడు మండపంలో ఉన్నట్లు తెలుస్తోంది. క్రమేణ మండపం చుట్టూ గోడలు లేచి గుడి ఏర్పడింది. ఇక్కడి మొదటి ఉల్లేఖనం కాడవన్ పెరిందేవి అనబడే సామవై రాణిది. 10వ శతాబ్ద ఆరంభకాలంలోనే ఇక్కడ పురట్టాశి తిరునాళ్ (బ్రహ్మోత్సవం) కు ఏర్పాటు చేసింది. తిరుమల గురించి సమాచారం క్రీ.శ. ఆరంభం నాటి 'శిలప్పాధికారం'లోనే ఉంది తరువాతి కాలంలో పల్లవ, చోళ, పాండ్య, వైదంబ, యాదవరాయరుల భక్తిప్రపత్తులచే పెరిగిన ఆలయ సంపద, కీర్తి రామానుజులవారి కైంకర్యంతో పూజా క్రమశిక్షణతో ఇతోధికంగా పెరిగింది. దానికితోడు విజయనగర రాజులందరకు (మొదటి వంశం తరువాతి రాజులు) వెంకటేశ్వరుడే ఇలవేల్పు అవడంచేత తమలో స్పర్ధించుకొని వెంకటేశ్వరునికి సేవ చేస్తున్నారు అనేటట్లు ఇబ్బడిముబ్బడిగా కైంకర్యాలు చేశారు. అందువల్ల ఆలయ వైభవం పెరిగింది. చంద్రగిరి విజయనగరానికి ముఖ్య ఉపరాజధాని నగరంగా వెలయడం కూడా తిరుమల ఆలయాభివృద్ధికి సులభమైంది. తిరుమలలో నైవేద్యం గంట చప్పుడు ఘంటామండపం ద్వారా చంద్రగిరి చేరిన తరువాతనే కోటలోనివారు భోజనం చేస్తారు అనేమాట కూడా ఉంది. ఇటువంటి సేవాతత్పరతతో ఉన్న రాజుల, ప్రాపకంలో ఆలయం ఆస్తిపాస్తులు, ఉత్సవాలు, పండుగ పబ్బాలు ఆలయ మాన్యాలు పెరిగి మాగాణుల లెక్క అదుపు తప్పేంత పెరిగింది. విజయనగర పతనం తరువాత ఆంగ్లేయుల





పరిపాలనలో స్థిరత్వం ఏర్పడేవరకు ఉన్న మధ్యకాలంలో తిరుమల ఆలయం కూడా కొంత అవ్యవస్థకు గురి అయినా దేవస్థాన ఆదాయం భక్తుల ఆగమనం తగ్గలేదు. భక్తుల ప్రయోజనాన్ని కాపాడేటటువంటి క్రియలతోనే తమ ప్రయోజనాలకు అనుకూలత లభిస్తుందని తెలుసుకున్న కర్నాటిక నవాబులు, మద్రాసు ఆంగ్లేయులు విధర్మీయులైనప్పటికి ఆలయాన్ని కాపాడటానికి తోడ్పడ్డారు ఆలయ సంప్రదాయాలను గౌరవించడమే తమకు ఆర్థికంగా లాభసాటి అని తెలుసుకున్నవారైనారు. అందువలన రాబడికి ఎటువంటి లోటు రానివిధంగా పరిపాలనను అభివృద్ధిపథంలో సాగించారు. ఈస్టు ఇండియా కంపెనీ వారి ఈ హిందూ దేవాలయ పరిరక్షణ పలుమారులు విమర్శలకు గురికావడంలో కంపెనీవారు తమ అధికారాన్ని స్థానీయులకు వదలివేసే ప్రయత్నంలో ఆ కాలానికి ఉత్తమం అని తోచిన మహంతులకు అధికారాన్ని ఇచ్చివేశారు. మహంతు విచారణకర్తగా దాదాపు వంద ఏండ్ల పరిపాలన సాగింది. పెద్దగా అవకతవకలు లేకపోయినా చిన్నచిన్న తకరారులు పెద్దవై కోర్టు దావాలు అధికమై ఒక విచారణకర్త బలి అయిన తరువాత అలస్యం చేస్తే చేయి జారిపోతుందనే ఉద్దేశంతో దేశపరిపాలనా వ్యవస్థను తన చేతిలోనికి తీసుకున్నటువంటి బ్రిటీషువారు స్థానిక కమిషనర్‌ను పరిపాలనాధికారిగాను ఆయనకు సహాయానికి ఒక రైతువారి సమితిని, మరో ధార్మిక సలహా సమితిని చట్టబద్ధంగా దేవస్థాన



చట్టాన్ని ఏర్పరిచారు ఇది 1933లో వచ్చిన తి తి దేవస్థాన చట్టం, స్వాతంత్ర్యానంతరం ఈ చట్టాన్ని కొంచెం సవరించి 1951 తిరుమల తిరుపతి దేవస్థానాల చట్టాన్ని అమలు పరచటం జరిగింది తరువాత కొత్తగా దేవస్థాన పరిపాలనా చట్టాన్ని తెచ్చి ఒక ఐ ఎ ఎస్ అధికారిని కార్యనిర్వహణాధికారి, అయనకు పరిపాలనలో తోడ్పడేందుకు ఒక ధర్మకర్తల మండలిని చట్టరీత్యా ఏర్పరచి ఇవ్వటం జరిగింది

తిరుమలకు రావాలంటే తిరుపతికి దేశంలో నలుమూలల నుండి రైలు, రోడ్డు మార్గాలు ఉన్నాయి తిరుపతి నుంచి తిరుమల కొండ 14 కి మీ దూరంలో ఉంది ఎక్కడానికి ఒక రోడ్డు మార్గం, దిగడానికి మరొక రోడ్డు మార్గం ఉంది ప్రతి ఐదు నిమిషాలకి బస్సు సౌకర్యం ఉంది తిరుపతి నుంచి పలు ప్రాంతాలకు బస్సు సౌకర్యం ఉంది ఇదికాక తిరుమలకు చంద్రగిరివైపు నుంచి, తిరుపతి నుంచి నడిచివెళ్లేవారికి మెట్లదారులు ఉన్నాయి తిరుపతి నుంచి కొండ దిగువభాగమైన అలిపిరికి చేరి అక్కడనుంచి మెట్లదారిలో ఎక్కేవారి సంఖ్య అధికం చంద్రగిరి మెట్లదారి అంటే (శ్రీనివాస మంగాపురంలోని శ్రీవారిమెట్టు) కొంచెం దూరమైన మెట్లు ఎక్కడం సులభం దారిపొడవునా నీడ, నీళ్ళు దొరికే మార్గం అలిపిరి మార్గమే అలిపిరి నుండి మెట్లు ఎక్కే మార్గం పాదాల మండపంతో ప్రారంభమౌతుంది తరువాత సాళువ నరసింహుడు కట్టించిన గోపురం చూస్తూ మరొక గోపురాన్ని చూస్తూ ముందుకు వెళ్తారు ఈ రెండవ గోపురం, ఆపై కనిపించే అగ్రగోపురం, పాదాల మండపం కూడా మట్లకువీర అనంతరాయడు 17వ శతాబ్దంలో కట్టించాడు అగ్ర గోపురాన్ని 20 శతాబ్దంలో నామాలు శంఖ, చక్రాలు విద్యుద్దీపాలతో అలంకరించారు ఈ కాలిబాటలో ఆంజనేయస్వామి ఆలయం, విశ్రాంతి గృహాలు, నరసింహుని ఆలయం కనబడతాయి ఆ తరువాత కొంతదూరంలో శ్రీవభాష్యకారులను చూడవచ్చును మోకాలి మెట్టును ఎక్కి తిరుమలను చేరుకోవచ్చును గీతోపదేశం పార్క్ భక్తులకు స్వాగతం పలుకుతుంది వసతి





గృహాలను కేటాయించే రిసెప్షన్ ఆఫీసును తరువాత చూడవచ్చును.

స్వామివారి ఆలయం పుష్కరిణికి దక్షిణాన పల్లపుప్రదేశంలో నెలకొని ఉన్నది. ఆలయ దర్శనానికి సుదర్శనం టోకెన్ కట్టించుకొని మొదటి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా వెళ్ళే అవకాశం ఉంది. సుదర్శనం టోకెన్‌లేనివారు రెండవ క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయాన్ని ప్రవేశించి స్వామివారిని దర్శించుకోవచ్చును. ఆలయం లోపల పడికావలి గోపురం అనబడే మహాద్వారం దాటితే ప్రతిమామండపం చేరవచ్చును. ఇక్కడ శ్రీకృష్ణదేవరాయలు ఆయన ఇద్దరు భార్యలు తిరుమలదేవి, చిన్నాదేవి విగ్రహాలు; అచ్యుత దేవరాయలు, ఆయన భార్య వరదాజి అమ్మ; వెంకటిగ అనబడే తిరుమల రాయల విగ్రహాలను చూడవచ్చును. శ్రీరంగంలోని ఉత్సవ విగ్రహాలను మల్లికాఫర్ దాడి నుంచి కాపాడడానికై తెచ్చి ఉంచిన రంగనాయక మండపం ఉంది. దాని ప్రక్కనే పశ్చిమానికి సాళువ నరసింహుడు నిర్మించిన అన్నా ఊంజల్ మండపం (హంస తూలికాతల్పం ఊయల) కనబడుతుంది. దీన్ని ఆవరించిన పెద్దమండపం తిరుమల రాయ మండపం. ఇక్కడ ఆర్కాటు నవాబుల కాలంలో దేవస్థాన పరిరక్షణకు పాటుపడిన రాజా తోడర్‌మల్ అనబడు లాలా ఖేల్‌రామ్ (నవాబు మంత్రి) అతని తల్లి మాతా మోహనదేవి, భార్య పితాబీబిల విగ్రహాలను చూడవచ్చును. ఇక్కడికి మొదటి ప్రాకారం చివరికి వచ్చినట్లు అయింది. ఇక్కడ ఆలయాన్ని చుట్టివచ్చే సంపంగి ప్రదక్షిణం ఉన్నది. ఇక్కడ స్వామివారి కల్యాణ మండపం దక్షిణానికి ఉంటే ఉత్తర ప్రదక్షిణాపథంలో లడ్డూలు చేసే వంటశాల ఉంది. మధ్యలో తూర్పుకు ధ్వజస్తంభ మండపం, బలిపీఠం ఉంది. కుడివైపున అద్దాల మహల్ ఉన్నది. ఇక్కడ స్వామివారి డోలోత్సవం జరుగుతుంది. ధ్వజస్తంభ మండపం ముందుకు వస్తే వెండివాకిలి. వెండివాకిలి నుండి లోపలికి వస్తే ఎడమవైపు వరదరాజస్వామి గుడి ఉన్నది. దాన్ని దాటుకుంటూ ముందుకు వస్తే ముఖ్య ఆలయ ప్రవేశం. మొదట ఉన్నది తిరుమామణి మండపం, ఇది గోడల్లేని మండపం. స్వామివైపుకు చూస్తు గరుడాళ్వారు నమస్కార భంగిమలో ఉంటాడు. స్వామి నైవేద్యాన్ని చాటిచెప్పే రెండు పెద్ద గంటలు ఉన్నాయి. ఉత్తరంలో స్వామివారి హుండి అమర్చబడి ఉంది. స్వామివారిని దర్శించుకొని ఆలయ ప్రదక్షిణం చేసి హుండికి ఉత్తర దిక్కులో నుంచి వెళ్ళాల్సి ఉంటుంది. స్వామివారిని దర్శించాలంటే బంగారు వాకిలిని దాటి రామర్ మేడ, స్నపన మండపం, ఇంకా ముందుకు చూపును పోనిచ్చి కులశేఖరపడి, గర్భగుడిలోని స్వామిని చూడవచ్చు. దర్శనానంతరం బయటకు వస్తే దక్షిణ మూలలో స్వామివారి వంటగది, వకుళమాలిక విగ్రహం ఉన్నవి. ఆపై కల్యాణ మండపం (ఒకప్పుడు కల్యాణం జరిగేది.) ఇప్పుడు చిల్లర పరకామణి జరుగుతోంది. దానికి లంబకోణంలో అంటే గుడి పశ్చిమభాగాన మండపాలలో హుండీ ఆదాయాన్ని లెక్కించే పరకామణి (పరక్ అంటే వేర్పాటుచేసి లెక్కకట్టడం) జరుగుతుంది. ప్రదక్షిణాపథంలో ఉత్తర దిక్కులో ముందుకు వస్తే మండపాల మెట్లు ఎక్కి విమాన వెంకటేశ్వరుని దర్శించవచ్చు. ఇంకా ముందుకు వస్తే స్వామిసేవలో తరించి





32 వేల సంకీర్తనలను రాసిన అన్నమాచార్య సంకీర్తనల రాగిరేకులను భద్రపరచిన 'తాళ్లపాకవారి అరను' తాకవచ్చును. పక్కనే రామానుజులవారి గుడి ఉన్నది. చిన్మయముద్రతో ఉన్న రామానుజస్వామిని దర్శించవచ్చు. ఎదురుగా అంతరాళంతో కూడిన మండపంలో యోగనరసింహస్వామిని దర్శించవచ్చును.

ఇక్కడినుండి స్వామివారి ప్రసాదాలను స్వీకరించి బయటకు రావడమే. స్వామి పుష్కరిణి, దాని వెనుక భాగంలో అంటే పశ్చిమాన వరాహస్వామి గుడి ఉంది. వరాహస్వామి శ్రీనివాసునికి ఇక్కడ ఆశ్రయమిచ్చిన దేవత. అందువల్ల ప్రథమ పూజ, ప్రథమ దర్శనం ఈ దేవునిదే కావాలి అనేది సంప్రదాయం. గుడికి వెనుక శ్రీ వేంకటేశ్వర మ్యూజియం ఉంది.

ఆలయంలో రోజుకొక ఉత్సవం. సామాన్యంగా 16నుండి 18 గంటలు సర్వదర్శనానికే కేటాయింపు. ఒకటి, రెండు గంటలు తప్ప ఆలయం ఎల్లప్పుడూ తెరిచే ఉంటుంది. సుప్రభాత సేవ మొదలు ఏకాంతసేవ వరకు 11రకాల దైనందిన ఆర్జిత సేవలు జరుగుతాయి. సంవత్సరంలో రథసప్తమి నుంచి వైకుంఠ ఏకాదశి వరకు విశిష్టమైన వార్షికోత్సవాలు జరుగుతాయి. బ్రహ్మోత్సవం ఈ ఉత్సవాలలో తలమానికం.


ఇక్కడ అన్నీ ఉచితమే. తిరుపతి బస్‌స్టాండు నుంచి కొండకి నడిచివెళ్లే మెట్లదారి అంటే అలిపిరి వరకు బస్సు ఉచితం. అలిపిరిలో యాత్రికుల వస్తువులను కొండకు చేర్చటం ఉచితం. కొండపై డార్మిటరీ హాలు మరియు ఉచిత గదులలో వసతి ఉచితం. ఇక్కడ స్నానం, శౌచగృహం, తలనీలాల సమర్పణ, వస్తువులను భద్రపరచుటకు లాకర్లు ఉచితం. తలనీలాల సమర్పణ అనంతరం స్నానం ఉచితం. అన్నిటికంటే స్వామిదర్శనంతో పాటు ప్రసాదం ఉచితం. తరువాత భోజనం చీటితో భోజనం ఉచితం. కొంచెం ఓపిక ఉండి అన్నింటిని పొందాల్సినది మాత్రమే తరువాయి.

**తిరుచానూరు - పద్మావతి అమ్మవారి ఆలయం**

శ్రీ వేంకటేశ్వరుని పట్టపురాణి పద్మావతీదేవి. తిరుపతి రైల్వేస్టేషనుకుగాని బస్‌స్టేషనుకుగాని 5 కిలోమీటర్ల దూరంలో తిరుచానూరు (అలమేలు మంగాపురం) క్షేత్రంలో శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయం ఉంది. వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే యాత్రికులందరూ అమ్మవారిని దర్శించి వెళ్ళడం సంప్రదాయం. తిరుపతి నుంచి బస్సులు ప్రతి పదిహేను నిమిషాలకు ఉన్నాయి.

తిరుశుకనూరు అని పిలువబడే తిరుచానూరులో అలమేల్మంగ నెలకొని ఉన్నది. భృగుమహర్షి సంఘటనతో వైకుంఠాన్ని వదలిన పద్మావతి వెనుకనే శ్రీనివాసుడు వేంకటాచలానికి వచ్చాడు. ఇక్కడి పద్మసరోవరంలో పద్మావతిగా అలమేల్మంగమ్మగా ఉద్భవించిందని ఐతిహ్యం. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం లాగానే మహాద్వార గోపురం ఎదురుగా ఉండేది కృష్ణస్వామివారి ఆలయం. పద్మావతి అమ్మవారు కుడివైపున వేంచేసి యున్నారు. పద్మావతి అమ్మవారి ఆలయం ఎదురుగా ధ్వజస్థంభం, బలిపీఠం ఉన్నాయి. కృష్ణస్వామివారి ఆలయం పక్కన దక్షిణంలో సుందర రాజస్వామి ఆలయం ఉన్నది.

క్రీ.శ. ఆరంభంలో కొండకు వెళ్ళేవారికి ఈ గ్రామం ఒక పాదస్థావరంగా ఉండేది. కొండకు వెళ్ళి శ్రీనివాసుని సేవించుకు రావడం కష్టమనీ, భక్తుల అవసరాలకు కొండపైన స్వామివారికి కైంకర్యాదులు జరిపేందుకు ఇక్కడ అంటే తిరుచానూరులో శ్రీనివాసుని ప్రతిరూప విగ్రహంతో ఒక తిరువిళన్ కోయిల్ ఉండేదని శాసనాలు తెలిపినప్పటికీ వాటి ఆచూకీపై ఎక్కువ



సంశోధన జరుగవలసి ఉన్నది. వైష్ణవ ధర్మాచరణకు ఒక తిరువమంత్రశాలై కూడా ఉండేదని తెలుస్తోంది. కాని తొండమనాడు చోళుల అధీనానికి వచ్చిన తరువాత ఇక్కడ వైష్ణవప్రాబల్యం తగ్గుతూ వచ్చింది. తిరువిళన్ కోయిల్, తిరుమంత్రశాలైల కార్యవ్యాప్తి కొండకే తరలించబడి ఇక్కడ ఉన్న వైష్ణవప్రాబల్యం మరుగునపడింది. తరువాత యాదవ రాయరుల కాలంలోనూ, విజయనగరరాజుల కాలంలోను వైష్ణవం ప్రోదిచేంది, వికసించిన కాలంలో ఇక్కడ వరదరాజస్వామి ఆలయం వెలసిందని తిరుచానూరు ఆలయంలోని వంటశాలలోని శాసనాలు చెబుతాయి. వైష్ణవ అభిమానం పెరిగి 17వ శతాబ్ద నాటికి పద్మావతీ అమ్మవారి ఆలయ నిర్మాణం జరిగిందని చెప్పవచ్చును. లభ్యమైన వాటిలో 10 శాసనాలు కృష్ణస్వామివారికి సంబంధించి ఉన్నాయి. వాటిలో మొదటిది క్రీ.శ. 1221 నాటిది. గర్భగుడిముందు ఒక బయలు వుండపమున్నది. గర్భగుడిలో కృష్ణస్వామి పద్మాసనంలో కూర్చొని ఉంటాడు. ఈ విగ్రహానికి లంబకోణంలో బలరామ విగ్రహమున్నది. ఇక్కడ కాళీయమర్దన కృష్ణుడు, లక్ష్మీనరసింహ విగ్రహాలున్నాయి. కృష్ణస్వామి గుడి ప్రక్కన దక్షిణంలో సుందరరాజస్వామి గుడి ఉంది.

భక్తులను మాతృవాత్సల్యంతో చూసే అమ్మవారి విగ్రహం చూడముచ్చటగా ఉంటుంది. ఆలయంలో బ్రహ్మోత్సవం, కల్యాణోత్సవం, వసంతోత్సవం, మహావైభవంగా జరుగుతాయి. తిరుచానూరు పంచమి అనేది వార్షిక బ్రహ్మోత్సవం కడపటి రోజు ఉత్సవం. చక్రస్నానంనాడు కొండలో శ్రీనివాసుని ఆలయ సన్నిధి నుండి పద్మావతి అమ్మవారికి హరిద్ర కుంకుమ సుగంధ సౌభాగ్య ద్రవ్యాలు, పట్టు వస్త్రాలు ఏనుగుపై ఊరేగింపుతో వస్తాయి. చక్రస్నానంనాడు పద్మసరోవరం భక్తులతో నిండిపోతుంది.

తిరుపతి వెంకన్న దర్శనానికి వచ్చేవారు అమ్మవారి దర్శనం అయితేనే యాత్ర పూర్తి అవుతుందని భావించడం పరంపరాగత ఆచారం అయింది.

**తిరుపతి - గోవిందరాజస్వామి ఆలయం**

తిరుపతి రైల్వేస్టేషను నుండి వందడుగుల దూరంలో కనిపించే ఎత్తైన గోపురంతో దర్శనమిచ్చే ఆలయం గోవిందరాజస్వామి ఆలయం. ఇది నగరకేంద్రంగా ఉంది. ఒకప్పుడు తిరుపతికి గోవిందరాజ పట్టణమనే పేరు ప్రాచుర్యంలో ఉండేది. రామానుజాచార్యులు ఇక్కడ గోవిందరాజస్వామిని ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ తిరు వీధులను ఏర్పరచి రూపుదిద్దిన చిన్నగ్రామం, కాలక్రమేణ పెరుగుతూ ఇతర అనేక ఆలయాలను తనలో చేర్చుకొని, విస్తరించి శ్రీనివాసపురం, గంగుంద్రమండపం, అచ్యుత రాయపురం అనే భాగాలను చేర్చుకొని రఘునాథ ఆలయం, కపిలేశ్వర ఆలయం, నరసింహస్వామి ఆలయం, మున్నగు ఆలయాలతో పెరిగి కొత్తపేర్లను సంపాదించుకొని తిరుమలకు పాదభూమిగా రూపుదిద్దుకొంది. ఈ ఆలయంలో అనేక శాసనాలు ఉన్నా ఏ శాసనమూ ఆలయ నిర్మాణ కాలాన్నిగాని, నిర్మాతను గురించి గాని చెప్పదు. ఈ ఆలయంలో లభ్యమైన శాసనాలలో ప్రాచీనమైనది 1224 సం॥ కాలం నాటిది. అది వీరనరసింహదేవరాయల కాలం నాటిది. ఈ శాసనం ఆలయ జీర్ణోద్ధరణకు సంబంధించినది. ఈ కాలంలోనే తిరుమల ఆలయం కూడా జీర్ణోద్ధరణ గావింప బడింది. అందువలన ఇక్కడి ఆలయం దానికి ముందే జీర్ణమయ్యేంత ప్రాచీనమై ఉండాలి.

గురుపరంపరా కథనాలు గోవిందరాజస్వామి ఆలయం క్రీ.శ. 1130 ప్రాంతంలో నిర్మించబడిందని తెలుపుతున్నాయి. ఈ కాలం చోళుల ప్రాబల్యానికి చెందింది. గోవిందరాజస్వామి ఆలయ ముఖమండపం, వెలుపల ఉండే స్తంభాలు, పైకప్పు నిర్మాణం చోళుల కాలాన్ని నిర్దేశిస్తుంది. అయితే ఇక్కడ ఒక వైశిష్ట్యం ఉంది. ఈ ఆలయంలో ఉన్న మూడు ద్వారగోపురాలు వేర్వేరు కాలాలలో నిర్మితమైనా దానికి ఎదురుగా ఉండేది పార్థసారథి ఆలయం. ద్వారగోపురానికి గర్భగుడికి మధ్య



ఉండాల్సిన ధ్వజస్థంభం, బలిపీఠం పార్థసారథి ఆలయానికి ఎడమవైపున ఉన్న గోవిందరాజస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్నది. అంటే పార్థసారథి ఆలయానికి ఎదురుగా ధ్వజస్థంభం, బలిపీఠం లేదన్నమాట.

ఆలయం మొదటి మహాద్వారగోపురం 15వ శతాబ్దంలో మట్లకుమార అనంతరాయలు నిర్మించాడు. ఇక్కడ ఆయన తల్లితండ్రులు, కుటుంబ సభ్యుల శిల్పాలు ఈ గోపురంలో చూడవచ్చును. ఇక్కడి నుంచి లోపలికి వస్తే రెండవ గోపురానికి దీనికి మధ్య ఒక ఊంజల్ మండపం (ఇక్కడ గరుడ మండపం ఉన్నది). దాని పక్కన ఎడమవైపున పెద్ద మండపం లక్ష్మీదేవి మండపం అనిపిలువబడే విజయనగర కాలంనాటి నిర్మాణం రెండు ఎత్తులలో నిర్మింపబడింది. రెండవ గోపురానికి కుడివైపున ముగ్గురు ఆళ్వారుల గుడి ఉన్నది. రెండవ గోపురం 15వ శతాబ్దకాలం నాటిది. అచటి నుండి లోపలకువస్తే కుడివైపున రెండు అంతస్థుల మండపం ఉన్నది. ఇక్కడ గోపురం గోడకు అమర్చబడిన చక్రత్తాళ్వార్ గుడి ఉంది. ఎడమవైపునకు మొదట్లో కుమదవల్లి తాయారు (లక్ష్మీదేవి) ఉన్న శాలనాంచియార్ గుడి విశాలంగా చూడముచ్చటగా ఉంది. దాని పక్కన వాహన మండపం, దాని పక్కన ముగ్గురు ఆళ్వారులగుడి, దానికి పక్కన రామానుజుల సన్నిధి ఉంది. తరువాత ఆలయ మొదటిప్రాకారం బయటకు చేరి ఉన్న తిరుమలనంబి ఆలయం చూడవచ్చును. ఇవన్నీ ఎడమవైపునకు ఉన్న ఆలయాలైతే కుడివైపు కొన్ని మండపాలు, ఆలయాలు ఉన్నాయి. మూడవ ద్వారగోపురం నుంచి లోపలకువస్తే లోపలి ప్రాకారం వస్తుంది. ఇక్కడ ముఖ్యాలయ సముదాయంలో ఉత్తరాన గోవిందరాజస్వామి, మధ్యలో పార్థసారథి ఆలయం, దక్షణాన కొంచం ముందుకు గోదాదేవి ఆలయం ఉన్నాయి. బయట దేవాలయ దక్షిణ దిక్కున వంటశాల, ఆళ్వారుల గుడులు ఉన్నాయి. ఆపై అతి సుందరమైన కల్యాణ మండపం చూడవచ్చును. కల్యాణ మండపంలో వేంకటేశ్వరస్వామి చిన్నగుడి ఉన్నది. పశ్చిమానికి కొత్తగా నిర్మించిన ముకురమండపం (అద్దాల మండపం), ఉత్తరాన మండపాలను గదులుగా చేసుకున్నవి కనబడుతాయి.

మూడవ ద్వార గోపురంలోనుంచి లోపలికి వచ్చిన తరువాత కుడివైపున మొదట కనిపించేది గోవిందరాజస్వామి ఆలయం. మూడు ఆలయాలకు సమానమైన ఎత్తులో ముందరి వరండా ఉంటుంది. తరువాత కొంచెం ఎత్తైన స్థాయిలో గోవిందరాజస్వామి ఆలయం, బహిర్మండపం, ఉన్నది. లోపలికి వస్తే ఒక ముఖమండపం, అంతర్‌ప్రదక్షిణాపథం, తరువాత ఒక అంతరాళం లేదా ఒకసుఖనాసి. తరువాత గర్భగుడి. గర్భగుడిలో శయన భంగిమలో ఉన్న గోవిందరాజస్వామి. ఈ విగ్రహం సుధావిగ్రహమని కూడా అంటారు. గోవిందరాజస్వామి కులోత్తుంగ చోళుని కాలంలో చిదంబరం నుంచి తీసుకువచ్చి కొత్తూరు (నేటి కపిలతీర్థం దగ్గర ఖాదీకాలనీ ప్రాంతం)లో ఉంచబడింది. అది తెలుసుకున్న భగవద్ రామానుజులు దాన్ని తీసుకువచ్చి ఇక్కడ పార్థసారథి ఆలయం పక్కన ప్రతిష్ఠించారని ఐతిహ్యం. ఇక్కడ స్వామి నాభిలోనున్న కమలంలో బ్రహ్మ, పాదసేవ చేసుకుంటూ శ్రీదేవి భూదేవులను, మధుకైటభులను చూడవచ్చును. మహంతుల కాలంలో గోవిందరాజస్వామి గర్భగుడిని జాడీబంధనం చేసి జీర్ణోద్ధరణ కావింపబడింది.

పార్థసారథి ఆలయానికి ఎడమవైపున అంటే దేవాలయానికి దక్షిణానికి కొంచం ముందుగా ఆండాళ్ గుడి ఉన్నది. ఇవతల కుడి, ఎడమ వైపుల రెండు ఊంజల్ మండపాలు ఉన్నాయి. గుడికి ఎదురుగా ఆలయ పుష్కరిణి ఉంది. ఇక్కడ తెప్పోత్సవం వార్షికోత్సవంగా అతివైభవంగా జరుగుతుంది. బ్రహ్మోత్సవం తిరుమలకు దీటుగా జరుగుతుంది. జ్యేష్ఠ మాసంలో జ్యేష్ఠాభిషేకం ఆకర్షణీయంగా జరుగుతుంది.

కపిలేశ్వరస్వామి ఆలయం

తిరుపతిలో ఉండే ఆలయాల్లో కపిలతీర్థం ఒక ప్రముఖమైన దేవాలయం అనడంకంటే ఆలయ సముదాయం అనడం సబబు. ఇది తిరుమల కొండను ఆనుకొని కొండలో జలపాతాన్ని ఏర్పరచుకొని పుష్కరిణి ఆలయాలతో కూడిన ఒక పవిత్రక్షేత్రం. ఇది అర్థగుహాంతర దేవాలయం అని చెప్పవచ్చు. గోవిందరాజస్వామి ఆలయం, వైష్ణవ ఆలయ సముదాయమైతే కపిలతీర్థం శైవ, వైష్ణవ విగ్రహాలు ఒకే చోట వెలసిన హరిహరాభేదంలేని భాగవత క్షేత్రం.



తిరుమల కొండకు నడిచి ఎక్కేమార్గం స్పష్టమైన రూపురేఖలు దిద్దుకోని కాలంలో, గోవిందరాజస్వామి పట్టణం అనబడే తిరుపతి చరిత్రలో ఏర్పడకపూర్వం తిరుమలకు వెళ్లడానికి యాత్రికులు తిరుశుకనూరు (తిరుచానూరు) యాత్రాప్రథమస్థావరంగా చేసుకొనేవారు. అక్కడినుండి కొత్తూరుమీదుగా (నేటి ఖాదీకాలనీ ప్రాంతం) కపిలతీర్థం దోవన తిరుమల కొండకు కొండదారిన నడచి వెళ్లేవారు.

కపిలమహర్షి ఈశ్వరుని పూజించి సారంగ మార్గాన కొండకు నడిచివెళ్లి తిరుమలలో శ్రీనివాసుని సేవించి, ప్రతిదినం తిరిగివచ్చేవాడు. కపిలమహర్షి పూజించిన ఇక్కడి ఈశ్వరుని కపిలేశ్వరుడని అనటం జరిగిందని ఐతిహ్యం.

ఇక్కడ జలపాతం చూడముచ్చటైనది. ఇది ప్రాచీన కాలంలో నిత్య జలపాతమై ఉండి చిన్నకోనేరును సృష్టించి పరివాహ ప్రాంతానికి వ్యవసాయానికి అనుకూలమై ఉండేది. అందువల్ల కోనేరు సమీపాన, కొండరాయిన ఆనుకొని ఉన్న శివలింగానికి అర్ధమండపం లాంటి గుహఏర్పడి ఉండే అవకాశం ఉంది. ఆ గుహచుట్టూ గోడలు కట్టి 11వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాధారం తెలుపుతోంది.

గర్భగుడిలో కపిలేశ్వరస్వామి ఒక్కరే ఉండగా పక్కన పూజాసామగ్రి పెట్టుకోవడానికి సరిపడే చిన్నగది, మరి కామాక్షి అమ్మవారికి అంతే పెద్దదైన మరొక గది, ఈ మూడుగదులను కలిపి ఒక అంతర్ ప్రదక్షిణమండపం ఉన్నది. ఇవతల ఒక అంతరాళం వంటి మండపం, దానికి ముందు ఒక ముఖ మండపం. ఇక్కడే నందీశ్వరుడు ఉన్నాడు. ఇక్కడనే గోడలో సెవ్వుసాని ఇచ్చిన గణపతి మూర్తిని ప్రతిష్ఠించడం జరిగింది. ముఖమండపానికి దక్షిణం నుంచి ప్రవేశం. దీనికి దక్షిణంలో పెద్దహాలు వంటి వరండా ఇవన్నీ పుష్కరిణికి తూర్పు దిగ్భాగంలోని సంధ్యావందన మండపంపైన ఉన్నాయి. ఇది ఆలయం ముందు భాగం. గర్భగుడి ప్రదక్షిణ మండపపథాన్ని ఆనుకొని ఒక ప్రతిమా గృహం ఉన్నది. ఇక్కడ దక్షిణామూర్తి, కుమారస్వామి, శైవనాయన్మారులు, సూర్యుడు, ఆలింగన చంద్రశేఖరమూర్తి, ఆలయ ఉత్సవమూర్తులు, కాశీవిశ్వేశ్వర, రామేశ్వర లింగాలు మొదలైనవి ఇక్కడ చూడవచ్చు. ఇక్కడ స్వామివారి వాహనాలు ఉన్నాయి. ఈ ప్రతి మా మండపం విజయనగర కాలంలో నిర్మితమైంది. ఈ మండపం నుంచి బయటకువస్తే వంటశాలతో బాటు మరికొన్ని చిన్న గదులను చూడవచ్చు. అక్కడి నుండి బయటి వరండాకు చేరతాం పుష్కరిణి పశ్చిమాన సంధ్యావందన మండపాలపైన ఒక చిన్న గుహలో లక్ష్మీనరసింహస్వామివారి విగ్రహమున్నది. దాని ప్రక్కన ఎడవు వైపున లక్ష్మీనారాయణస్వామి ఆలయం ఉంది. కపిలతీర్థానికి ప్రవేశించినపుడు కుడివైపున ఉత్తరాభిముఖంగా ఉండే ఆలయంలో వేణుగోపాలస్వామి కొలువై ఉన్నాడు. ఈ ఆలయ సముదాయం కొండను కొంత మార్పు చేసి కట్టిన ఆలయమైతే దానికి వెలుపల నిర్మించినది నమ్మాళ్వారు ఆలయం, పూజలేని గుడి ఇది.

చారిత్రక దృక్కోణంతో చూసినట్లయితే ఈ ఆలయంలో దొరకిన మొదటిశాసనం చోళుల కాలానికి చెందింది. ఇక్కడి ఆలయం లోపలిభాగం అంటే గర్భగృహ, అంతరాళం ప్రాచీనచోళుల కాలానికి చెందినవిగా తెలుస్తోంది. రాజేంద్రచోళుని అధికారి అయిన కొత్తూరు పాలకుడు మునయదరాయన్ గుడిని కటించాడు. తరువాతి కాలంలో విజయనగరరాజు అచ్యుతరాయలు క్రీ.శ. 1531లో కోనేరుకు మెట్లు కట్టించి నాలుగు దిక్కులా నాలుగు చక్రాంకిత శిలలను పాతించాడు. అందువల్ల ఇది చక్రతీర్థం అయింది. చుట్టూ సంధ్యావందన మండపాలను కూడా కట్టించాడు. నమ్మాళ్వార్‌కు జరిగే అధ్యయనోత్సవంలో జరిగే శాత్తుమొరకు క్రీ.శ. 1544లో తాళ్లపాక అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడు ఒక శాశ్వత దానాన్ని చేశాడు. పిడుగుపడి దెబ్బతిన్న కపిలేశ్వరస్వామి ఆలయవంటింటిని క్రీ.శ. 1563లో రాచవీట్టు నాయకుడు జీర్ణోద్ధరణ గావించాడు. అప్పుడే సెవ్వుసాని గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. మహంతు ధర్మదాసు క్రీ.శ. 1865లో పుష్కరిణి మెట్లను, మండపాలను పునః సమీకరించాడు. వీటికి తోడు ప్రహ్లాద లక్ష్మీనృసింహస్వామికి సంధ్యావందన మండపం నుంచి మెట్లదోవ ఏర్పరిచాడు. తరువాత మహంతుల పరిపాలన నుంచి తిరుపతి తిరుమల దేవస్థాన పరిపాలనలోకి వచ్చిన తరువాత 20వ శతాబ్దం చివర్లో కపిలేశ్వరస్వామివారికి బ్రహ్మోత్సవాలు కూడా ఆరంభమై ప్రతి సంవత్సరం వైభవోపేతంగా జరుగుతున్నాయి.

### కోదండరామస్వామి ఆలయం

తిరుపతి ఊరి మధ్యలో, కోదండరామస్వామి ఆలయం ఉన్నది. రైల్వేస్టేషను నుంచి కాని బస్టాండు నుంచి కాని కొండకు వేళ్ళే నడకదారిలో ఈ ఆలయం ఉన్నది. ఈ ఆలయం చాలా ప్రాచీనమైనది. జనమేజయుడు రామవిగ్రహం ప్రతిష్ఠించాడని చెబుతారు. రావణవధానంతరం అయోధ్యకు తిరిగి వెళ్తూ రాముడు ఇక్కడ కొంతసేపు విశ్రాతి తీసుకున్నాడని అంటారు. అయోధ్య రామానుజయ్యంగార్ అను ఆయన గుడి ప్రాకారాన్ని, ద్వారగోపురాన్ని విజయనగర కాలంలో నిర్మించాడని తెలుస్తోంది. క్రీ.శ. 1817-1818 సం॥లో గర్భగుడిపై



విమానప్రాకారం నిర్మింపబడింది. ఇక్కడ రామచంద్రకుంట అనే స్వామిపుష్కరిణి ఉంది. ఆలయంలో హనుమంతుడు లేడు. ఆలయం వెలుపల ఆంజనేయాలయం విడిగానే కట్టబడింది. విశాలమైన ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం, బలిపీఠం ఉన్నాయి. విశాలమైన ముఖమండపం, అంతర్ ప్రదక్షిణాపథం ఉండే అంతరాళం, ఎత్తైన అరుగుపై గర్భగుడి, మధ్యలో సుకనాసి. గర్భగుడిలో రాముడు కోదండ రాముడై నిలిచాడు. పక్కనే సీతాదేవి, లక్ష్మణ విగ్రహాలు ఉన్నాయి. గర్భగుడికి బయట విష్వక్సేన, ఆంజనేయ, నమ్మాళ్వార్, భాష్యకారులు ఉన్నారు. మహంతు ధర్మదాసు కాలంలో గర్భగృహాన్ని జటాబంధనంచేసి మూడు విగ్రహాలను పునః ప్రతిష్ఠించాడు. ధ్వజస్తంభానికి బంగారు పూతపూసిన రేకులను కప్పటం జరిగింది. శ్రీరామ, సీతాదేవి, లక్ష్మణ విగ్రహాలకు వెండికిరీటాలు శ్రీరాముడికి వెండి బాణాన్ని తయారు చేయించటం జరిగింది. మహంతు భగవాన్‌దాస్ కాలంలో కోదండరాముడి ఉత్సవమూర్తికి బంగారు పూత పూయించి ముఖ తోరణం తయారు చేయించారు కొన్ని ఆభరణాలు కూడా తయారు చేయించారు. మహంతు ప్రయాగదాసులవారి కాలంలో ఉత్సవ విగ్రహమునకు బంగారు హస్తపాదాలను మరియు బంగారు కోదండం తయారు చేయించటం జరిగింది. ప్రదక్షిణా పథం నుంచి మహాద్వార గోపురం వరకు నేలను చదునుచేసి రాళ్ళను పరిపించాడు.

ఇక్కడ బ్రహ్మోత్సవం, రామనవమి ఉత్సవాలు మహావైభవంగా జరుగుతాయి. 20వ శతాబ్దము చివరిలో సీతారామ కల్యాణాన్ని, పట్టాభిషేకాన్ని వార్షికంగా జరిగేటట్టు ఏర్పాటు కావించారు. బ్రహ్మోత్సవం, రథోత్సవం నాడు ఈ ఆలయం దగ్గర పెద్ద పండుగ జరుగుతుంది.

**శ్రీనివాసమంగాపురం - కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం**

తిరుపతికి పశ్చిమదిక్కుగా తిరుపతి – పీలేరు రోడ్డులో 12 కిలోమీటర్ల దూరంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయం ఉన్నది. తిరుపతి నుంచి బస్సు సౌకర్యం ఉంది.

ఆకాశరాజు నారాయణవనాన్ని పాలించే పాలకుడు. అతని కుమార్తె పద్మావతిని శ్రీనివాసుడు వివాహమాడాడు. దంపతులు వెంకటాచలానికి వెళ్తూ దారిలో ఉన్న అగస్త్య ఆశ్రమాన్ని దర్శించారు. లోపాముద్ర, అగస్త్యులవారు నూతన దంపతులైన పద్మావతీ శ్రీనివాసులను ఆశీర్వదించారు. పసుపు బట్టలతో కొండను ఎక్కరాదని ఆదేశించారు. ముని దంపతుల ఆదేశాన్ని శిరసావహించి కొండ దిగువనే కల్యాణీ నదీతీరంలో ఆరుమాసాలు కాపురం ఉండి ఆ తరువాత తిరుమల చేరుకొన్నారు. కాబట్టి కల్యాణీ నదీతీరంలో శ్రీనివాసుడు కాపురమున్న చోట ఆలయం నిర్మించారని పురాణ ఐతిహ్యం.

ఈ ఆలయం తూర్పుముఖంతో నిర్మింపబడింది. ఆలయం చుట్టూ ప్రహరి ఉంది. ప్రవేశ ప్రదేశంలో ఐదు అంతస్థుల రాజగోపురం ఉంది. ఆలయంలో గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, మహామండపాలు ఉన్నాయి. గర్భాలయం ముందర రెండు భాగాలుగా ఉన్న అంతరాళం ఉంది. ఒక భాగంలో విష్వక్సేన, మరోభాగంలో శ్రీరామానుజ విగ్రహాలు ఉన్నాయి. ఆలయానికి ముందు పెద్ద మండపం ఉంది. మండప స్తంభాలు విజయనగర వాస్తుశైలిలో ఉన్నాయి. ఆలయ ప్రవేశద్వారం కుడివైపున అన్నమయ్య శిల్పం ఉంది. ఈ ఆలయంతో తాళ్లపాక వారికి చాలా అనుబంధం ఉంది.

కాలి నడకన తిరుమలకు వెళ్లడానికి ఈ ఆలయ సమీపంలోనే మెట్లదారి ఉంది. అతిప్రాచీనమైన ఈ మార్గం చంద్రగిరి దిశ నుండి వచ్చే యాత్రికులకు, కర్నాటక ప్రాంతీయులకు ఉపయోగపడేది. తిరుమల యాత్ర చేసే యాత్రికులు శ్రీనివాసమంగాపురంలో గల కల్యాణ వేంకటేశ్వరుని దర్శించుకొని శ్రీవారిమెట్టు ద్వారా తిరుమల చేరుకుంటారు. 15వ శతాబ్దంలో అలిపిరి నుంచి మరో సోపానమార్గం ప్రాచుర్యం వహించడంతో ఈ దారి గుండా వెళ్లే యాత్రికులు తక్కువయ్యారు. బహుశః శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టు ద్వారా వెళ్ళే దారి దట్టమైన అడవితో నిండి ఉండడం వలన భక్తులు అలిపిరి నుండి వెళ్లే సోపానమార్గాన్ని ఎంచుకొని ఉండవచ్చు ఈ మార్గం చంద్రగిరిని పాలించిన రాజులు ఎక్కువగా ఉపయోగించారు.

చారిత్రక దృక్కోణంతో చూసినట్లయితే ఈ ఆలయంలో రెండు శాసనాలు లభ్యమైనాయి. ఈ ఆలయం ఎప్పుడు ఎవరెవరి కాలంలో నిర్మితమైందనే విషయాలు తెలియరాకున్నా లభ్యమైన ఒక శాసనం ఆధారంగా ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన విషయం తెలుస్తోంది. ఈ ఆలయం శిథిలం అయిపోగా తాళ్లపాక అన్నమాచార్యుని మనుమడు చినతిరుమలయ్య క్రీ.శ. 1540లో జీర్ణోద్ధరణ గావించినట్లు తెలుస్తోంది. చినతిరుమలయ్య ఈ ఆలయంలో వెంకటేశ్వరుని, అమ్మవారిని, అనంత, గరుడ, విష్వక్సేనాది పరివార దేవతలను రామానుజాచార్యులను, ఆళ్వారులతోబాటు తన తాతగారైన అన్నమయ్య విగ్రహాలను ప్రతిష్ఠించాడని తెలుస్తోంది. ఆనాళ్లలో ఆ ప్రాంతాన్ని అలమేలుమంగాపురమని పిలిచేవారని తెలుస్తోంది. ఇక రెండవ శాసనం ద్వారా తాళ్లపాక వారికి సర్వమాన్యంగా ఉన్న ఈ మంగాపురం గ్రామ ఆదాయంతో ఆళ్వారుల, ఆచార్యుల, నక్షత్రోత్సవాలలో ప్రత్యేక ఉత్సవాలను ఏర్పరచాడు. ఆచంద్రార్కంగా సాగాలని భావించి ఈ ఉత్సవ కైంకర్యాలు ఏర్పాటు గావించాడు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు మహావైభవంగా జరుగుతాయి. 1956 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థాన పరిధిలోకి ఈ ఆలయం వచ్చింది. అప్పటి నుండి శ్రీనివాసుని సాక్షాత్కారవైభవం వార్షికోత్సవంగా జరుగుతోంది.


**నారాయణవనం- శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం**

తిరుపతికి 30 కి.మీ. దూరంలో పద్మావతీ సమేతంగా వేంకటేశ్వరస్వామి వెలసిన పవిత్రపుణ్యక్షేత్రం. నారాయణ వనంగా పురాణప్రసిద్ధి పొందింది. నారాయణవన క్షేత్ర ప్రాభవప్రాశస్త్యాల గురించి వరాహపురాణాంతర్గత వెంకటాచల మాహాత్మ్యంలో వివరించబడింది.

ఆకాశరాజు నారాయణవనానికి రాజు. అతనికి సంతానం లేదు. సంతానాపేక్షతో ఆకాశరాజు యజ్ఞక్షేత్రాన్ని దున్నేటప్పుడు భూమిలో దొరికిన పద్మావతిని పెంచి పెద్దచేసి తిరుమల వాసుడైన వేంకటేశ్వరునకు ఇచ్చి వివాహం చేశారు. పద్మావతి దేవి పుట్టినిల్లైన నారాయణవనంలో నారాయణుడికి చెందిన జలంలో క్షీరసాగరంలో (వనంలో) జనించిన ఆమె లక్ష్మీదేవి. పద్మావతి శ్రీనివాసులకు పెండ్లి అయిన తరువాత ఆ దంపతలను ఇక్కడే కొంతకాలం ఉండమనీ ఆ తరువాత కొండ ఎక్కమని పెద్దలు చెప్పడం వలన మామగారి ఇంట్లోనే స్వామి కొలువుతీరాడు. ఆ ప్రాంతంలోనే ఆలయం కట్టించారని చెబుతారు. ఇక్కడి ఆలయం చిన్నదైనా సర్వాంగసుందరమైంది. విష్వక్సేనుడు, రామానుజులు, ఆళ్వారులతో పరివేష్టితమైన శ్రీ కల్యాణ వేంకటేశ్వర ఆలయం ఇది. ఈ ఊర్లో అవనాక్షమ్మవారి ఆలయం, అగస్త్యేశ్వర ఆలయాలు దగ్గర్లోనే ఉన్నాయి.

**అప్పలాయిగుంట-శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయం**

తిరుపతి నుంచి పుత్తూరు మార్గంలో 15 కి.మీ. దూరంలో అప్పలాయగుంట గ్రామంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. తిరుచానూరు నుంచి కార్వేటినగరం వెళ్ళే మార్గంలో కూడా దీన్ని చేరుకోవచ్చు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయ చరిత్ర ప్రాచీనమైనదే. అయితేను అప్పలాయగుంట అనే చెరువుగట్టున ఉన్నందున వాసికెక్కింది. అప్పలాయగుంట క్రమశిక్షణకు మారుపేరు. అప్పులు పెట్టకుండా వాయిదాలు వేయకుండా కూలిపని వారలకు ఏ రోజుకారోజు కూలి ఇచ్చి చెరువు కట్టించినందువలన ఆ చెరువుకు, చెరువు పక్కనున్న స్వామికి, ఆ ప్రాంతానికి ఈ పేరు వచ్చిందని చెబుతారు. ఇక్కడ చిన్న దేవాలయంలో వాస్తు వైవిధ్యంలేని సాధారణ గోడల నడుమ గోదాదేవి సహాపద్మావతీ శ్రీనివాసులు ఉన్నారు. విశాలమైన ఆవరణలోని ఆంజనేయ స్వామిని చూడవచ్చును. రోగహరుడు, చెడుగాలి నివారకుడని ఈ ప్రాంతంలో రెండవ ఘటికాచల ఆంజనేయుడిగా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. కార్వేటినగర ప్రభువులు దీని ఆలనపాలన చూసినట్లు చెప్పబడుతోంది. ప్రతియేటా బ్రహ్మోత్సవాలు మహా వైభవంగా జరుగుతాయి.



**కార్వేటినగరం - శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం**

పుత్తూరు – చిత్తూరు మార్గంలో కార్వేటినగరం ఉంది. తిరుపతి, పుత్తూరు, చిత్తూరుల నుంచి బస్సు సౌకర్యం ఉంది. కార్వేటినగరం చరిత్ర ప్రసిద్ధికెక్కినది. ఇక్కడ రుక్మిణీ సత్యభామా సమేతుడైన వేణుగోపాలుడు తెలుగు సాహిత్యంలో గొప్పస్థానాన్ని పొందియున్నాడు. దీనికి కారణం సారంగపాణి. సారంగపాణి పదాలకు నాయకుడు ఈ వేణుగోపాలుడే. ఇక్కడి ఆలయం చిన్నదయినా బహు సుందరమైంది. అచటి తెప్ప కోనేరు సుప్రసిద్ధమైంది. నిర్మాణం ఐదువందల ఏండ్లకు పైబడినదే అయినా ఒక్క మెట్టురాయి అయినా చెక్కు చెరలేదు. కోనేరు పెద్దదే అయినా మెట్ల చౌకట్టు సూక్ష్మంగాను, ఖచ్చితంగాను ఉండడం చూడవచ్చును. ఈ కోనేరులో వేణుగోపాలస్వామి సారంగపాణిపదాల పాటల సంగీతానికి తెప్పలో తేలియాడుతూ ఉంటే చూడముచ్చటగా ఉంటుంది.

గోదాదేవి, ఆళ్వారులు, రామానుజాచార్యులు, ఈ ఆవరణలోనే ఉన్నారు. ముఖమండపం, నవరంగం, అంతరాళం చూపరులను ఆకట్టుకుంటుంది.

**నగరి - కాశీవిశ్వేశ్వరాలయం (బుగ్గ అగ్రహారం)**


నగరి సమీపంలో 5 కి.మీ. దూరంలో కాశీ విశ్వేశ్వ రాలయం ఉన్నది. గౌతమమహర్షి ప్రార్థన మేరకు ఈశ్వరుడు కాశి నుంచి దక్షిణానికి దిగివచ్చి ఇక్కడ నెలకొన్నాడు. కాబట్టి కాశీవిశ్వేశ్వరుడని పిలుస్తారు. కుశస్థలి ఒడ్డున బుగ్గ అగ్రహారంలో అన్నపూర్ణాదేవి కూడా ఉన్నది.

బుగ్గ అనేది నీటి చెలమకు సంబంధించినది, కాబట్టి కుశస్థలి నది ఒడ్డున పూర్వకాలంలో నీటి బుగ్గ ఉండి ఉండవచ్చుననే అభిప్రాయానికి దోహదపడుతోంది. ఈ ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

**నగరి - శ్రీ కరియ మాణిక్యస్వామి ఆలయం**

నగరిలోనే కుశస్థలి ఒడ్డున వెలసిన స్వామి కరియ మాణిక్యస్వామి. హరి మాణిక్యస్వామి రూపంలో ఉన్నాడు. ఆయన నల్లనివాడు. కరి అంటే నలుపు. కనుక కరియ మాణిక్యస్వామిగా అన్వర్థమైంది. శ్రీదేవి భూదేవి సహితంగా ఉన్నాడు. ఈ స్వామికి రథసప్తమినాడు ఉత్సవం మహావైభవంగా జరుగుతుంది. ప్రతి శుక్రవారం అభిషేకం జరుగుతుంది.

తిరుపతి నుంచి 65 కి.మీ. దూరంలో నగరిలో ఉన్నది. తిరుపతి నుంచి బస్సు సౌకర్యం ఉంది.



### తాళ్ళపాక - శ్రీ చెన్నకేశవాలయం

కడప జిల్లా రాజంపేట తాలూకాలో తాళ్ళపాక గ్రామం ఇది సుప్రసిద్ధ సంకీర్తనాచార్యుడు, తొలితెలుగు వాగ్గేయ కారుడు అయిన అన్నమయ్య జన్మస్థలం ఈ గ్రామ నామమే అన్నమయ్య గృహనామమై పేరుకు ముందు చేరింది అందుకే ఆయన తాళ్ళపాక అన్నమయ్య అయ్యాడు అక్కడ చిన్న చెన్నకేశవస్వామి గుడి ఉన్నది

భక్తుడు రాకముందే భగవంతుడు అక్కడికి విచ్చేశాడు అయనే చెన్నకేశవస్వామి ఈ వేలుపు గొప్ప మహిమోపేతుడని ప్రతీతి ఈ స్వామిని ఆశ్రయించుకొని దేవతలు, మునులు తేజరిల్లినట్లు ఐతిహ్యం నవనాధులు కూడా ఈ క్షేత్రంలో పలు సిద్ధులను పొందినట్లు ఆధారం ఉంది ఈ స్వామి గుడి ఒకప్పుడు మహిమోపేతంగా ప్రకాశించినప్పటికి ఇప్పుడది చిన్న ఆలయంగా ప్రసిద్ధికి దూరంగా ఉంది ఈ ఆలయాన్ని ఎప్పుడు ఎవరు నిర్మించారని తెలుసుకొనేందుకు కూడా ఆధారాలు వృగ్యం కాని చెన్నకేశవస్వామి గుడిని జనమేజయుడు ప్రతిష్ఠించాడని అక్కడి ప్రజల విశ్వాసం తిరుమల తిరుపతి దేవస్థానమువారి పరిపాలన పరిధిలోకి వచ్చిన తరువాత ఈ ఆలయం కొత్త శోభ నింపుకున్నది ఇక్కడ ఉత్సవాది నిత్య నైమిత్తిక కార్యక్రమములు మహావైభవంగా సాగుతున్నాయి ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు మహా వైభవంగా జరుగుతాయి

### వాయల్పాడు - శ్రీ పట్టాభిరామాలయం

తిరుపతికి పశ్చిమంగా సుమారు 100 కి మీ దూరాన మదనపల్లికి సమీపాన వాయల్పాడు గ్రామంలో పట్టాభి రామాలయం ఉంది ఇక్కడ ఏకశిలపైన ప్రతాప రామచంద్ర దేవుడు సీతాలక్ష్మణ సమేతంగా ఉన్నాడు ఇక్కడి వైశిష్ట్యం ఏమిటంటే మూలగర్భగుడిలో మూల విగ్రహంతో పాటు ఆంజనేయులు లేడు దాని వెనుక ప్రదక్షిణాపథంలో ఉన్నది జాంబవంత ప్రతిష్ఠ అని చెప్పబడే ఈ హనుమంతుడు సీతారామలక్ష్మణులతోబాటు లేనిదానికి కారణం ఈ విధంగా చెబుతారు రామచంద్రునికి హనుమంతుడు పరిచయానికి ముందు పరిస్థితిని ఇది చెబుతుందని స్థలపురాణ కథనం తిరుమల నుంచే నేరుగా వాయల్పాడుకు బస్సులు ఉన్నాయి ప్రతియేటా రామనవమి ఉత్సవాలు, సీతారామ కల్యాణం రమనీయంగా జరుగుతాయి

### నాగులాపురం - శ్రీ వేదనారాయణస్వామి ఆలయం

తిరుపతికి ఆగ్నేయంగా సుమారు 65 కి మీ దూరంలో నగరికి సమీపాన నాగులాపుర పట్టణంలో వేదనారాయణస్వామి ఆలయం ఉంది తిరుపతి నుంచి బస్సుసౌకర్యం ఉంది విజయనగర సామ్రాట్టు అయిన కృష్ణదేవరాయల తల్లిపేరు నాగులాంబ పూర్వదిగ్విజయ యాత్రచేసి తిరిగి వచ్చేటప్పుడు ఆయన ఇక్కడ ఉన్నాడు ఆలయం శిథిలావస్థలో ఉంది సోమకాసురుడు వేదాలను అపహరించినపుడు హరి మత్స్యావతారియై సముద్రంలో దిగబడి వేదాలను పైకి తెచ్చిన మత్స్యావతారికి ఇల్లు అయిన గుడి ఇది ఇక్కడ హరి తన బొడ్డు పైభాగంలో నాలుగు చేతులు కలవాడై క్రిందిభాగంలో మృత్స్యరూపియై ఉన్నాడు శ్రీ భూదేవులు పక్కనే ఉన్నారు ఇటువంటి అపురూపమైన ఆలయాన్ని చూసి ముగ్ధుడైన సామ్రాట్టు కృష్ణదేవరాయలు ఈ ఆలయ జీర్ణోద్ధరణ గావించాడు నిత్యపూజా నైవేద్యాలకు ఏర్పాటుచేసి అర్చకులకు, సేవకులకు అగ్రహారం నిర్మాణంచేసి మొత్తం ఊరికి తనతల్లి పేరుపెట్టాడు అప్పటినుంచి ఇది నాగులాపుర మైంది నాలుగువైపులా గోపురాలతో కూడిన ఆలయంలోకి స్వామి పశ్చిమాభిముఖంగా నిలిస్తే, అస్తమించే సూర్యుడు మార్చినెలలో ప్రతి సంవత్సరం మూడు రోజులపాటు ఆలయ గోపురాలు ముఖమండపం, నవరంగం, అంతరాళం శుకనాసి దాటి స్వామి పాదలపైన నాభిపైన, కిరీటంపైన పడడం వలన దాన్ని సూర్యుడు చేసే పూజ అంటారు ఈ మూడు రోజులు స్వామికి సాయంకాలంలో తెప్పోత్సవం జరుగుతుంది ప్రతియేట బ్రహ్మోత్సవం మహావైభవంగా జరుగుతుంది

ఈ ఆలయంలో మరో వైశిష్ట్యం ఒకటుంది ఇక్కడ ఉండే దుర్గ, గణేశానిల ద్వారపాలక విగ్రహాలు గర్భగుడిలోని కుడ్యాలలో ఉన్న దక్షిణామూర్తి విగ్రహాలు నల్లరాతి శిల్పాలు ఆకర్షణీయంగా ఉన్నాయి

* * *



## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# శ్రీ వేంకటేశ్వర వారసత్వ సంస్కృతీ పరిరక్షణ నిధి

## 'దేవాలయం దేవుని ప్రతిరూపం'

భారతీయ సనాతన ధర్మానికి, సంస్కృతికి దేవాలయాలు ప్రతిరూపాలు శిల్పం, చిత్రలేఖనం, సంగీతం, సాహిత్యం, నాట్యం వంటి శాస్త్ర కళాసమ్మిళితమైన దేవాలయాలను సర్వజన సంక్షేమం కోసం, లోక కళ్యాణార్థం నిర్మించారు

ఆలయ వాస్తు ప్రకారం శాస్త్రీయంగా నిర్మించబడిన ఆలయాలలో విగ్రహమూర్తిని ప్రతిష్ఠించిన మహనీయుల తపశ్శక్తి చేత జరుపబడుచున్న పూజా విశేషాదుల చేత శిల్ప ఆగమ లక్షణ సమన్వితమైన విగ్రహసౌందర్యంవల్ల భగవంతుడు ఆ ఆలయంలోని బింబాన్ని ఆవహించి భక్తుల కోరికలు తీరుస్తూ ఉంటాడని శాస్త్ర ప్రవచనం

వైదిక సంస్కృతీ పరిరక్షణ కేంద్రాలయిన ఆలయాలను కాలాంతరంలో రక్షించుకోవడం, ఆలయంలోని శిథిలమైన ఏ భాగాన్నయినా జీర్ణోద్ధరణ చేసుకోవడం లేదా పునర్నిర్మించుకోవడం ప్రతి భారతీయుని విధి, ధర్మం కూడా

శిఖరం లేదా ప్రాకారం, బలిపీఠం, ధ్వజస్తంభం చివరకు మూల విగ్రహమూర్తి కూడా కావచ్చు ఇలా శిథిలమై, కలావిహీనమైన ఆలయాల వలన ఆ గ్రామానికేకాక దేశానికి కూడా అతివృష్టి, అనావృష్టి రోగభయాదుల వంటి ఉపద్రవాలు కలుగుతాయని పెద్దలమాట

పలువురు ఆచార్యులు, సక్రమమైన నిర్వహణ వ్యవస్థ లేకుండా నూతన ఆలయాలను నిర్మించడం మంచిది కాదని, ఎప్పుడో, ఏనాడో మహనీయుల చేత ప్రతిష్ఠించబడిన ఆలయాలను పరిరక్షించి, నిర్వహించడం లోకకళ్యాణ కారకమని సందేశమిస్తున్నారు వైదిక ధర్మాన్ని, సంస్కృతిని ప్రతిబింబింపజేసే ప్రాచీన ఆలయాల వంటి కట్టడాలు కావచ్చు పురావస్తు ప్రదేశాలు కావచ్చు వాటిని పరిరక్షించడం, పునర్నిర్మించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం ఏ ఒక్కరి వలన సాధ్యం కాదు అందువలన ఈ బృహత్ లక్ష్యాలతో తిరుమల తిరుపతి దేవస్థానములు 'శ్రీ వేంకటేశ్వర వారసత్వ సంస్కృతీ పరిరక్షణ నిధి'ని ఏర్పాటు చేసింది

'కర్తా కారయితా చైవ ప్రేరకశ్చానుమోదక' అన్నట్లుగా ఈ కార్యాన్ని నిర్వహించేవారికి, నిర్వహింపజేసేవారికి, ప్రోత్సహించేవారికి, ఆమోదించి ఆనందించేవారికి ఇలా నలుగురికి ఈ కార్యంవలన వచ్చే ఫలితం లభిస్తుందని అర్థం

తిరుమల, తిరుపతి దేవస్థానములు ఏర్పాటు చేసిన 'శ్రీ వేంకటేశ్వర వారసత్వ సంస్కృతీ పరిరక్షణ నిధి'కి విరివిగా విరాళాలివ్వండి, ఇప్పించండి ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు కండి ఊరూరా, వాడవాడలా శిథిలాలయాలు పునర్నవీకృతం కావాలి అంతటా ఆధ్యాత్మిక దివ్య చైతన్యం వెల్లివిరియాలి తద్వారా జగత్కల్యాణం సిద్ధించాలి


**ఈ నిధికి దాతలు ఎంత మొత్తాన్నయినా విరాళంగా ఇవ్వవచ్చును. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 (జి) ప్రకారం పన్ను మినహాయింపు ఉంటుంది. దాతలు ఎంతమొత్తానైనా విరాళంగా ఇవ్వవచ్చును.**

### దాతలకు సౌకర్యాలు

**ఈ ట్రస్టుకు 5 లక్షలు లేదా అంతకన్నా ఎక్కువ విరాళంగా ఇచ్చిన దాతలకు ఈ క్రింది సౌకర్యాలు లభిస్తాయి సం॥లో 3 రోజులు దాత, అతని కుటుంబ సభ్యులకు (5 గురికి మించకుండా) వైకుంఠం క్యూలైను ద్వారా వి.ఐ.పి. దర్శనం మొదటి సారి దర్శనానికి వచ్చినపుడు శ్రీవారి, శ్రీ పద్మావతి అమ్మవారి బంగారు పూత పూసిన వెండి డాలరు బహూకరణ, సంవత్సరానికి ఒకసారి దాతకు ఉత్తరీయం బహూకరణ 3 రోజులపాటు తిరుమలలో ఉచిత వసతి లేదా వి.ఐ.పి. అతిథి గృహాల్లో చెల్లింపుతో వసతి ఈ సౌకర్యాలు దాతకు జీవిత పర్యంతం ఫర్ములు, కంపెనీలు, ఇద్దరు దాతలు అయితే 20 సంవత్సరాలు వుంటాయి.**

---

**మీ విరాళాలను ఏ జాతీయ బ్యాంకు మందైనా 'కార్యనిర్వహణాధికారి' తిరుమల తిరుపతి దేవస్థానములు, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507, వారికి డ్రాఫ్టు ద్వారా పంపాలి. దాతలు తమ విరాళాలను తిరుమలలోని ఏ జాతీయ బ్యాంకులోనైనా జమ చేయవచ్చును.**



PRINTED AT T.T.D. PRESS, TIRUPATI. Ph : 2232[illegible]0